# కథా కౌముది

## 2016 - Part 1



శ్రీ

కౌముది

మీ ముంగిళ్ళలో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 170

కౌముది మాసపత్రికలో

2016 జనవరి నుంచి జూన్ 2016


వరకూ

వచ్చిన కథలు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. .అచ్చినానమ్మా | రజని సుబ్రహ్మణ్యం | 5 |
| 2. ఓ పువ్వుకథ | యమున చింతపల్లి | 10 |
| 3. (అ)సహనం | శారద శివపరపు | 15 |
| 4. ప్రేమకు వయసుందా!? | బోడపాటి రమేష్ | 19 |
| 5. మనసుకు మరో రూపం | డేగల అనితాసూరి | 22 |
| 6. పెద్దమనుషులూ - పూర్వీకులూ | మూలా రవికుమార్ (జాస్తి వంశీకృష్ణ) | 27 |
| 7. రెండు నాన్నలు | జి.ఎస్.లక్ష్మి | 34 |
| 8. రామకృష్ణ husband Of వైదేహి | నాగేశ్వరరావు | 38 |
| 9. పెంపకం | జి. శ్రీనివాస్ | 48 |
| 10. ఓ క్షణం | నిశీధి | 52 |
| 11.'అం...బా' | సి.హెచ్.సీత | 55 |
| 12. గోడలు | గంటి భానుమతి | 68 |
| 13. కుడిఎడమైతే | శ్రీ నిధి మెల్లాల | 72 |
| 14. ఏడుపు మంచిదే | మెరిమి దినేష్ | 77 |
| 15. మల్లిగాని కుక్క | మన్నె ఏలియా | 80 |
| 16. ఒక మార్దవ మధ్యాహ్నం | వి-రాగి | 87 |
| 17. మట్టి పరిమళం | అత్తలూరి విజయలక్ష్మి | 91 |
| 18. అప్పివ్వనివాడు మిత్రుడు | డా. జల్లా నాగరాజు | 100 |
| 19. డబ్బు పవరాఫ్ డబ్బు | జీడిగుంట నరసింహమూర్తి | 105 |
| 20. సోక్రటీస్ | ఎలక్ట్రాన్ | 108 |
| 21. అవసరం | ఉరిమళ్ళ సునంద | 113 |
| 22. మాకివీడు అత్తయ్య | రాజ్యలక్ష్మి | 118 |
| 23. నిశ్శబ్దనీరవం | కె.అంజన | 127 |

| | | |
|---|---|---|
| 24. మనిషి - దేవుడు | డొక్కా ఫణి | 133 |
| 25. హంసగీతికలు | నిర్మలాదిత్య(భాస్కర్ పులికల్) | 137 |
| 26. పుత్తడివెలుగులు | కోసూరి ఉమాభారతి | 143 |
| 27. సెకండ్‌ఛాన్స్ | కొమరిగిరి అనంత ప్రమిలారాణి | 151 |
| 28. యాదృచ్ఛికం | డా.శ్రద్ధా కొమండూరి | 155 |
| 29. తానొకటి తలిస్తే | శ్రీదేవి జోస్యుల | 166 |
| 30. సాయి లీలలు | డా.మృదులాంజలి | 172 |
| 31. విమానం | పి.వి.శేషారత్నం | 179 |
| 32. కుచు క్రిస్సు | పేరి సర్వేశ్వర శాస్త్రి | 187 |
| 33. తొక్క | డెన్నిస్ రాజా కరణం | 190 |
| 34. వీలునామా | వేదాంతం శ్రీపతిశర్మ | 196 |



# అచ్చి నానమ్మా!

రజని సుబ్రహ్మణ్యం

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

**నా జన్మభూమి,** నా జాతి నిండు గౌరవం నిలుపుతున్నానో లేదోగానీ నా తల్లి భూమిభారతిని చూడ్డానికి మాత్రం అప్పుడప్పుడూ ఇండియా వస్తూంటాను. నేను ఎక్కువగా అమెరికాలో పెద్దబ్బాయి దగ్గర ఉంటాను. పెద్దబ్బాయ్ శశాంక్ శాండియాగోలో క్వాల్‌కామ్‌లో పనిచేస్తున్నాడు. అన్నీ అమరిన జీవితం. చిన్నవాడు శిరీష్ హైదరాబాదులో నారాయణగూడాలో చక్కటి పొదరిల్లులాంటి చిన్న ఇల్లు కట్టుకుని ఉంటున్నాడు. మంచి పేరున్న ఆర్టిస్టు. చదివిన చదువు, ఉద్యోగం వదనుకుని చిత్రకారుడిగా బొమ్మలు గీసుకుంటూ ఆనందంగా గడుపుతున్నాడు. భార్య సహకారం కూడా ఉంది.

నేను, మావారు ఎక్కువగా శాండియాగోలోనే ఉంటాం. బహుశా నేనూ సుఖాలకు అలవాటు పడిపోయానేమో? ఈయన కంప్యూటర్‌తోనే జీవిస్తారు కాబట్టి అక్కడైనా ఇక్కడైనా ఒకటే. నాకే మనసు ఆగక ఇండియా వస్తూంటాను.

శిరీష్ బాంబే తన చిత్రాల ప్రదర్శనకు వెళ్ళాడు. కాబట్టి నాలుగురోజులు వాసవదత్తతో గడుపుదామని బయలుదేరాను. ఈసారి ఇండియా వచ్చినప్పుడు బెంగుళూరు తప్పక వెళ్ళాలని అనుకునే వచ్చాను. వెళ్తున్నాను కూడా. వాసవదత్త బెంగుళూరులోనే ఉంటుంది మరి. నా చిన్ననాటి స్నేహితురాలు.

బ్రిడ్జ్ ఎక్కి దిగాలనే ఆదుర్దాతో కాచిగూడా స్టేషన్‌కి ముందే వచ్చాను. ఇంకా రైలు రాలేదు. కూలీ సామాను ప్లాట్‌ఫామ్ మీద పెట్టి మళ్ళీ వస్తానని చెప్పి ఇంకెవరి సామానో తలమీద పెట్టుకుని బయటకు వెళ్ళాడు. కష్టజీవులు.

ఏదో ఆలోచనలో పడిపోయాను. ట్రైన్ వచ్చింది. ఆలోచనలు చెదిరిపోయాయి. కూలీకోసం అటూ ఇటూ చూసాను. ఎక్కడా కనపడడే? బండి బయలుదేరటానికి సిద్ధంగా ఉంది.

"రాడేంటి వీడు ఇంకా.."

"అచ్చి నాన్నమ్మా" అంటూ రొప్పుకుంటూ, రోజుకుంటూ వస్తున్నాడు. మొహంలో మంచితనం, ఎక్కించాలన్న ఆరాటం. ఈ బడుగు, బీద జీవితాల్లో కూడా ఒక క్రమశిక్షణ.

"వచ్చావు కానీ, రైలు కదిలేట్లు ఉంది. లోపల సామాను సర్దిపెట్టు" లోపల పెట్టాక ఇంకో ఇరవై ఎక్కువే ఇచ్చాను.

"దండం అమ్మా! బాంచను కాల్మొక్తా" అనలేదు. ఏ విప్లవవాదో శంఖం పూరించేవాడు.

రైలు ప్రయాణాలంటే నాకెంతో ఇష్టం. స్థిమితంగా సీటులో కూర్చుని బయటకు చూసాను. సందడే సందడి. ఈ జనాన్ని, సందడిని మిస్ అయ్యే మనవాళ్ళు మొహాలు వేలాడేసుకుని తిరుగుతూంటారు అమెరికాలో.

జనం అంటే హైదరాబాదులో జనవరిలో జరిగే ఎగ్జిబిషన్ గుర్తువచ్చింది. కాశ్మీర్ సిల్క్‌స్టాల్స్ దగ్గర ఒక ఏడెనిమిది ఏళ్ళ అబ్బాయిలు మల్లెమాలలు ఒక తెరలా పట్టుకుని నిలుచున్నాడు. ఎంత ముద్దుగా ఉన్నాడో. ఎవరినీ కొనమని కూడా అడగటంలేదు. నేను వెళ్ళి కొంటూంటే అదే దర్పం. అదే డిగ్నిటీ. డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటే ఇదేనేమో పేరు అడిగితే "అన్వర్" అన్నాడు.

"నై పడ్‌రే" అడిగాను. చదువుతున్నానన్నాడు. ఫాదర్ దగ్గర్లోనే నిలుచున్నట్లుగా చెప్పాడు ముక్తసరిగా. ఇంతలో అక్కకూతురు లత కూడా వచ్చి "పసివాడు" అంటూ పదిమాలలు కొంది. ఆ పాలబుగ్గలు, పసితనం, గాంభీర్యం ఎప్పుడూ గుర్తు ఉంటాయి.

ఈ రైలు ప్రయాణాల్లో మన ఆలోచనలేకాక ప్రక్కవాళ్ళ పరిచయాలు కూడా విశాలత్వాన్ని ఇస్తాయి. వాసవదత్తా, నేను ఇలాంటి ప్రయాణాలు ఎన్నో చేసాం. తను నాకు చిన్నప్పటి నుంచి స్నేహితురాలు. నేను బెంగుళూరు వస్తున్నానని చెప్పాను. నాకోసం ఎదురు చూస్తూ ఉండివుంటుంది.

కంపార్ట్‌మెంట్ అంతా టోర్నమెంట్‌కి వెళ్తున్న పిల్లలు, ఒక కోచ్‌తో నిండిపోయింది. పిల్లలతో కాసేపు మాట్లాడాను. "ఆంటీ, ఆంటీ" అంటూ ఎంతో ఉత్సాహంగా కబుర్లు చెప్పారు. వసంతంలో ఉన్నారు వాళ్ళు. అంతా కోలాహలం.

ట్రైన్ వేగం అందుకుంది.

తెచ్చుకున్న పులిహోర, పెరుగన్నం, ఆంధ్రమాత ఆవకాయ బయటకు తీసాను. పిల్లలందరికి కూడా పాంట్రీ కార్ నుంచి డిన్నర్ పాకెట్స్ వచ్చాయి. అందరం సరదాగా మాట్లాడుకుంటూ, భోజనం పంచుకుంటూ, తింటూ డిన్నర్ ముగించాం. గుడ్ నైట్‌లు చెప్పుకుని నిద్రకి ఉపక్రమించాము.

తెలతెలవారుతూండగా కంటోన్‌మెంట్ స్టేషన్ వచ్చింది. పిల్లల బై, బైల మధ్య టాటా చెప్తూ దిగిపోయాను. వాసవదత్త ఉండే ఇందిరానగర్ అక్కడికి దగ్గర. ఆటోలో మంచులో నిద్రలేస్తున్న బెంగుళూరుని చూస్తూ కూర్చున్నాను. "స్వల్ప ఎడ్జస్ట్ మాడుకొళం" అనేది బెంగుళూరు ప్రశాంతతకు మూలం. అది ఒక్క బెంగుళూరుకే వర్తిస్తుంది.

చూస్తూ ఉండగానే ఇందిరానగర్ 11th మెయిన్ వచ్చేసింది. దిగి, ఆటోకి పే చేసి, లిఫ్ట్‌లో బేగ్ పెట్టుకుని మూడో అంతస్తుకి వెళ్ళాను. బెల్ కొడితే గాయత్రి మంత్రం శ్రావ్యంగా వినిపించసాగింది. వాసవదత్త వచ్చి తలుపు తీసింది. సంభ్రమంగా "రా, రా నీహారికా" అంటూ లోపలికి తీసుకెళ్ళింది. ముచ్చటగా ఉంది ఇల్లు.

సోఫాలో కూర్చుని కబుర్లు మొదలు పెట్టాం. నల్ల జాకెట్టు, తెల్లచీరలో యోగినిలా ఉంది. కాలేజ్ డేస్‌లో ఎలా ఉండేది!! స్వప్న వాసవదత్తలా ఉండేది. చైతన్య స్రవంతిలా ఉండేది. కాశ్మీర్ సిల్క్స్ తప్ప కట్టేదికాదు.

"మీ వారు పోయాక మరీ సింపుల్‌గా మారిపోయావు వాసవీ"

"రావుగారు పోయాక ఆ ఆసక్తే పోయింది. ఈ వయసులో జీవితం సింప్లిఫై చేసుకోవాలి నీహారికా!" అంది.

మరణం ఎంత కఠినం!

"బాపుబొమ్మ" అనేవాడు మా అనీష్ అన్నయ్య తనని. బొమ్మా అనే పిలిచేవాడు. డాక్టరు, రచయిత. ఎంతమంది అభిమానులు అన్నయ్యకి. కళ్ళు చెమరుస్తున్నాయి.

"అన్నయ్య గుర్తువస్తున్నాడా?" అంది వాసవదత్త.

"తనని రక్షించలేకపోయాం వాసవీ"

"బాధతో జీవించటం నేర్చుకోవాలి నీహా! రావుగారు కూడా అల్జీమైర్స్ వల్ల ఈలోకంలో ఉండేవారు కాదు. కానీ ఎవరు వచ్చినా, పేరు గుర్తు లేకపోయినా ఎంతోబాగా పలకరించేవారు. మెదడు తనని తాను మోసం చేసుకుంటుంది. కనీసం అనీష్ అన్నయ్య హార్ట్ ఎటాక్‌తో పోయాడు. ఈ బాధలు లేవు" అంది నిట్టూర్చి.

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసిన మతిమంతుడుకి మతి పోవడం ఏమిటి.?

"అన్నయ్యలాంటి వాళ్ళకి కావాల్సింది బ్రతకటంకాదు, జీవించటం. పద ఫ్రెష్ అయి కాఫీ తాగుదువుగానీ" అంటూ వంటగదిలోకి దారితీసింది. చిన్న వంటింట్లో చిన్న టేబుల్. కుక్కర్ నుంచి తీసి రవ్వ ఇడ్లీలు పెట్టి, కాఫీ కలిపి ఇచ్చింది.

"స్నానం చెయ్యి. ఈరోజు ప్రోగ్రామ్ ఏమిటి? కమర్షియల్ స్ట్రీట్ వెళ్దామా?" అంది.

"షాపింగ్ తరువాతగానీ, మల్లేశ్వరంలో కాడు మల్లేశ్వర గుడి ఉంది కదా! భక్తి అనికాదుగానీ దానికి చాలా చరిత్ర ఉంది. చూడాలని ఉంది" అన్నాను.

"నిజమే 1997లో ఏదో త్రవ్వుతూ ఉంటే ఆ గుడి, కొలను బయటపడ్డాయి. ఎక్కడైనా శివుడి ముందు ఉంటుంది. నంది నోట్లోనుంచి చెత్తా చెదారం బయటకు తీయగానే నీటిధార బయటకు వచ్చింది. ఆ నీటి ధార సన్నగా శివుడికి అభిషేకం చేస్తూ ఉంటుంది. కొలనుకి, ఆ నీటిధారకి కనెక్షన్ అన్నమాట. ఆనాటి ఇంజనీరింగ్ స్కిల్స్ అద్భుతం" అంటూ వివరించింది.

స్నానం చేసి, తయారై మల్లేశ్వరం వెళ్ళివచ్చాం. ఎంతో చరిత్రను దాచుకున్న ఆగుడిని, శివుడిని, శివుడికి నిత్యాభిషేకం చేస్తున్న నందిని చూస్తుంటే ఎంతో థ్రిల్లింగ్‌గా అనిపించింది.

"వంటచేస్తాను. నువ్వు కాసేపు పడుకో" అంటూ బెడ్ రూములోకి తీసుకెళ్ళింది.

సింపుల్‌గా సింగిల్ బెడ్, ప్రక్కనే పెద్ద కిటికీ, ఇంకోవైపు పెద్ద టేబుల్. టేబుల్ మీద అంతా పుస్తకాలు, కాగితాలు, పెన్స్ పరుచుకుని ఉన్నాయి. సాహిత్య సభలా ఉందిగానీ, ఆడదాని గదిలా లేదు.

"వాసవదత్తా, ఈ రూమ్ చూస్తుంటే రస్కిన్‌బాండ్ ఇల్లు గుర్తువస్తోంది. ఆయన గది ఇలాగే పెద్ద కిటికీతో, పెద్ద టేబుల్‌తో, పుస్తకాలతో నిండిపోయి ఉంది మనం ముస్సోరిలో ఆయనని కలిసినపుడు ఆ విషయాలు అలా గుర్తువుండి పోయాయి. "

"కరెక్ట్. అంతా ఆయన ఇన్స్పిరేషన్. ఒంటరిగా రాసుకుంటూ ఎంత ఆనందంగా ఉన్నారు.! దత్త కుటుంబం ఉందనుకో. ప్రతివారం ఆయన వెళ్ళే కేంబ్రిడ్జ్ స్టోర్స్‌కి మనం వెళ్ళాంగా. గుర్తుందా?"

"ఆయన ఆటోగ్రాఫ్‌తో ఉన్న 'ది రూమ్ ఆన్ ది రూఫ్' కూడా ఇంకా నా దగ్గర ఉంది" అన్నా.

"కొంచెంసేపు పడుకో" అంటూ వంట చేయటానికి వెళ్ళింది. నేనూ కాసేపు కళ్ళుమూసుకున్నాను.

వంట, భోజనం అయ్యాక మళ్ళీ ఆ రూములో చేరాం.

"ఎట్లా ఉన్నావు వాసవీ? ఎట్లా ఇలా ఒంటరిగా గడుపుతున్నావు?" అడిగాను.

"జనారణ్యంలో ఒంటరితనం ఏమిటి? రావుగారు పోయాక క్రిందంతా అద్దెకిచ్చి పైన ఈ రెండుగదులు కట్టించుకున్నాను. "

"ఇల్లు బాగుంది కానీ ఇంకా ఇంకా నిర్లిప్తంగా తయారవుతున్నావు. ఉస్మానియాలో ఉన్నప్పుడు ఎట్లా ఉండేదానివి? పాటలు పాడేదానివి. నాటకాలు వేసేదానివి. నువ్వు పాడిన "స్వైరణని వన్నారు నన్ను శ్యామసుందరా" పాట నాకు ఇంకా గుర్తువుంది. ఏ సంఘటన చూసినా కథలా చెప్పేదానివి. రచయిత్రివి అవుతావనుకున్నాం. ఏదీకాలేదు" అన్నా ఆవేదనగా.

"నాకేం తక్కువ?"

"ఏం ఎక్కువ అని"

"ఏమిటి తెగ పొగిడేస్తున్నావు?"

"ఎందుకు ఏమీ సాధించకుండా మిగిలిపోయావు? చెప్పు వాసవీ. పెళ్ళప్పుడు కూడా మంచి సంబంధాలు వద్దని వెళ్ళి పెద్ద సంసారంలో పడ్డావు."

"అది శరత్‌బాబు నవలలు చదివిన ప్రభావం వల్ల. అత్తగారు, ఆడబిడ్డలు, బావగార్లు, మరుదులు అరచేతుల్లో పెట్టుకుని చూసుకుంటారనుకున్నాను. అంతా ప్రేమమయంగా ఉంటుందనుకున్నాను. ఆ రోజుల్లో ఎంత అమాయకంగా ఆలోచించేవాళ్ళం నీహారికా"

"వాళ్ళ బాధ్యతలన్నీ తలమీద వేసుకుని చేస్తూనే వచ్చావు. పైగా నువ్వు అంటే వాళ్ళకి హేళన కూడా."

"రావుగారి మంచితనంలో సేద తీరాను నీహా!" అంది తృప్తిగా.

నన్ను చూసి నవ్వింది. చంద్ర జ్యోత్స్న కురిసింది.

"సాయంత్రం ఎం.జి.రోడ్ వెళ్ళివద్దాం పద. ఇందిరానగర్‌లో మెట్రో ట్రైన్ ఎక్కితే నాలుగు నిమిషాల్లో అక్కడ ఉంటాం. నీకూ మెట్రో రెయిడ్ చేయించినట్టువుంటుంది" అంది.

సాయంత్రం మెట్రో ఎక్కితే సరిగ్గా ఎం.జిరోడ్ మధ్య ఉన్న స్టేషన్‌తో ఆగింది. ఎదురుగానే గంగారామ్స్ ఉంది. గంగారామ్స్‌లో దొరకని పుస్తకం ఉండదు. పుస్తకాలు అన్నీ చూస్తూ అక్కడ గంటపైనే గడిపి చాలా ఇంగ్లీషు పుస్తకాలు కొనుక్కుని బయటకు వచ్చాం. అందులో లవ్ ఎమాంగ్ ది బుక్ షెల్వ్స్ ఒకటి.

ఇంకో ఇష్టం అయిన స్థలం కాఫీ బోర్డ్ వారి కాఫీహౌస్. చిన్న పిల్లల్లా ప్రవర్తిస్తున్నాం. కాఫీ హౌస్‌లో వెజిటిబుల్ కట్లెట్ తిని, కాఫీ త్రాగాం. మళ్ళీ దోసె తినిపించాలనిపించి పేపర్ దోసె కూడా తిన్నాం. మళ్ళీ కాఫీ త్రాగాం. మనసులు ఎగిరెగిరి త్రుళ్ళి త్రుళ్ళి పడుతున్నాయి.

మళ్ళీ మెట్రో ఎక్కి ఇందిరా నగర్‌లో దిగి ఇంటికి నడుచుకుంటూ వచ్చేసాం.

"పెరుగన్నం తింటావా?" అంది.

"అమ్మో!" అన్నా.

ఇద్దరం కామెడి నైట్స్ విత్ కపిల్ చూసి, సరదాగా, నవ్వుకుంటూ బెడ్ రూములోకి వెళ్ళాం.

టైమ్ చూస్తే 11.45. చిన్నప్పటి స్నేహితుల చెలిమికి చెలియలి కట్టలేదు.

"నేనేమీ సాధించలేదంటావు ఏమిటి? ముగ్గురు పిల్లలం మంచి వాళ్ళుగా, ఉత్తమ హీరోలుగా, విద్యావంతులుగా తీర్చిదిద్దాను. అది నాకెంతో ఆనందంగా ఉంటుంది నీహా!" అంది.

తన మొహం చుట్టూ ఒక వెలుగు.

"మనం అనుకునే వాళ్ళం కదా పదిమంది మంచివాళ్ళ వల్లే ఈ ప్రపంచం నడుస్తూ ఉందని. అందరూ మంచి వాళ్ళూ అయితే ఈ ప్రపంచం స్వర్గమే అవుతుంది. నేను గుడ్ హ్యూమన్ బీయింగ్‌గా బ్రతకాలనుకున్నాను. ఆల్సో బ్రతికాను. అది నా గెలుపు. ఇంకా మనకి పది, ఇరవై ఏళ్ళ సమయం ఉంది. కావాల్సినవి కావాల్సినంతగా చేసుకోవచ్చు. రేపో ఎల్లుండో చనిపోతానని తెలిసికూడా ఈరోజు ఇంగ్లీషు స్పెల్లింగ్స్ నేర్చుకున్న వనిత నాకు తెలుసు" అంది.

"సరే! ఇకనైనా వ్రాయటం మొదలుపెట్టు" అన్నాను.

"నీకో తమాషా చెప్పనా! నేను పుట్టింది పదకొండో తారీఖున. నేను ఉండేది 11th మెయిన్‌లో. వివేకానందుడు చికాగోలో సిస్టర్స్ అండ్ బ్రదర్స్ అంటూ ఉపన్యసించింది కూడా సెప్టెంబరు 11thనే. ట్విన్ టవర్స్ పడిపోయింది కూడా సెప్టెంబర్ 11thనే" అంది నవ్వుతూ.

"మంచి రీసెర్చ్. 11th మెయిన్‌లో ఉండే జయావెంక్రటామన్ ఎక్కడుందీ?" అని అడిగాను.

"వెంక్రటామన్, జయ ఇంత పెద్ద వయసులో విడిపోయారుకదా!" అన్నా మళ్ళీ.

"విడిపోక ఏం చేస్తారు? ప్రతిదానికి ఆంక్షలే. ఆఖరికి టి.వి ప్రోగ్రామ్ చూడటం మీదకూడా ఆయనది పెత్తనం" అంది.

"పిల్లలు అమెరికా వెళ్ళిపోయి తల్లితండ్రులు వొంటరిగా 24 గంటలు ఎదురుబొదురుగా కూర్చోటంతో ఈ ఇగో ప్రాబ్లమ్స్ ఎక్కువ అవుతాయనుకుంటాను. ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఆర్తడాక్స్ తమిళబ్రాహ్మణులు ఇట్లా ఈ వయసులో విడిపోవటం ఆశ్చర్యంగా ఉంది." అన్న సాలోచనగా.

"ఈ మధ్య బెంగుళూరు వచ్చింది. తను ఇప్పుడు ఇక్కడ ఉండటంలేదు. కోయం బత్తూరులో సీనియర్ సిటిజన్ కాంపెక్స్‌లో ఒక కాటేజ్ కొనుక్కుని ఉంటోంది. అలజడులు ఏమీలేకుండా ప్రశాంతంగా కనిపించింది. తనకోసం 11thమెయిన్‌లో ఉండేవాళ్ళం అందరం కలిసాం." అంది.

"ఎట్లా ఉందట కోయింబత్తూరులో? ఏమైనా రాస్తోందా? మునుపు తెగ ఆర్టికల్స్ రాసేది కదా"

"చాలా హాయిగా ఉందట. పడక కుర్చీలో కూర్చుని కాఫీ త్రాగుతూ, ప్రకృతి చూస్తూ గడపటం బాగుందట. ఏమీ రాయడం లేదు. ఖాళీగా ఉండటం, నథింగ్‌నెస్ అద్భుతంగా ఉందట. నిజంగా మొహం కూడా కళకళలాడిపోతోంది"

మళ్ళీ ఆలోచిస్తూ "ఏమిటో ఈ జీవనయానం నీహారికా! మన ప్రయాణం అయిపోతోంది. ఎక్కడకి వెళ్తాం తరువాత అని నీ ఉద్దేశం?" అంది కుతూహలంగా.

"ఏ తత్త్వవేత్త చెప్పగలిగాడు?" అన్నాను.

నిజంగా తరిచి తరచి ఎన్నెన్ని ప్రశ్నలు వేసుకున్నా, ఆలోచించినా జవాబు దొరకదు.

కిటికీ నించి చేతిక అందేటట్లున్న మేఘాలని చూస్తూ కూర్చున్నాను. నామీద ప్రశ్న సంధించి హాయిగా నిద్రపోయింది వాసవదత్త.

మళ్ళీ ఆలోచనలు నిత్యమైన సత్యం మనకెప్పుడూ గోచరించదు. ఎన్నెన్ని తరాలు వస్తున్నాయి, వెళ్తున్నాయి. భూగర్భం నుంచి ఎన్నెన్ని నాగరకతలు బయట పడుతున్నాయి మంచివాళ్ళు మార్గదర్శకంగా ఎంతవరకు వస్తారు?

ఒక్క ప్రళయంతో ప్రపంచం అంతా మట్టితో కప్పడిపోతుంది.

వాసవదత్త వైపు చూసాను. బాపూ బొమ్మ శిథిల శిల్పం అయింది మొన్న మొన్నటి వరకు డిజైన్ చీరలు తప్ప కట్టి ఎరగదు. ఇప్పుడు తెల్ల చీరలో శాంతికపోతంలా ఉంది. చెక్కిళ్ళకు పూలపుప్పొడి అద్దినట్లు శిరీష పుష్పంలా ఉండే వాసవదత్త ఏది?

తల విదిలించాను. ఒక మేధావి అన్నట్లు సొసైటీ ఎటర్న్‌తో, మనిషి ఇమోర్టల్ అనుకుని జీవించాలి. సంఘం శాశ్వతం. మనిషికి మరణం లేదు అన్న భ్రమలో ఉండాలి. అది భ్రమే అయినా నిజం అనుకోవాలి.

రేపు వాసవదత్త, నేను బేలూరు, శ్రావణ బెళగోళ వెళ్దామనుకున్నాం. అక్కడ అతి ఇంట్రికేట్‌గా, సూక్ష్మంగా చెక్కిన విషకన్యని చూడాలనుకుంటూ నిద్రకి ఉపక్రమించాను.

మరొక శుభోదయం

# ఓ పువ్వు కథ యమున చింతపల్లి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

అందమైన తోటలో ఉషోదయ వేళ మెల్లమెల్లగా విచ్చుకుంటున్న తన రేకుల మధ్యనుండి మొట్ట మొదటి సారిగా క్రొత్త ప్రపంచాన్ని చూసేందుకు ప్రయత్నిస్తోంది ఓ తెల్ల గులాబీ పువ్వు, ఒక్కసారిగా రేకులను తెరవలేక పోతోంది. ఇన్నాళ్ళు ముడుచుకొని ఉన్న తన జీవితంలోకి వెలుగు రేఖలు చొచ్చుకు వస్తున్నాయి......

యేవో సువాసనలు గాలిలో తేలివస్తున్నాయి. అవును గాలే. తనని సున్నితంగా సృజించి వెళ్ళే గాలే మోసుకు వస్తోంది.

మెత్తని స్పర్శతో తనని తాకుతూ తూగుతున్న మరో పువ్వు 'రేపు అందమైన ఈ ప్రపంచాన్ని పూర్తిగా చూడబోతున్నావు' అని చెప్పింది. తనకి పట్టలేని ఆనందం....అణు అణువున ఉత్సాహం.....

అది చూసి ప్రక్కన ఉన్న ముద్దబంతి "ఓ యబ్బో బ్రతికే మూన్నాళ్ళకి యెంత ఆత్రుతో" అనిపక్కున నవ్వింది. ఆ నవ్వు ఎందుకో తనకి అర్థం కాలేదు......

కొంత సమయం గడిచిపోయింది....తన రేకులు ఇంకాస్త విచ్చుకున్నాయి. కాని రేకులలో చొచ్చుకుని వచ్చే వెలుగు తగ్గిపోయింది. చీకటి పడుతోంది. 'కాలం చెల్లి' గరుడవర్ధనాలు రాలి పోతున్నాయి..... విరజాజులు, సన్నజాజులు కళ్ళు విప్పుతున్నాయి. పువ్వు ఇప్పుడు సరిగా చూడ లేకపోతోంది.....

' వెలుగు శాశ్వతం కాదా| వెలుగు వెనుక చీకటి ఉంటుందా?' తనలో ఏవో సందేహాలు....

రాత్రి విచ్చిన చీకటి వాడి రాలిపోయింది. అంతా వెలుగు. పూర్తిగా విచ్చుకున్న ఆ పువ్వు రేకులులాగా తెల్లని వెలుగు.

తన చుట్టూ పరచి ఉన్న అందమైన ప్రపంచాన్ని రేకులు విప్పార్చి చూస్తోంది పువ్వు.

ప్రక్కన ఉన్న లిల్లీ మాట కలుపుతూ "నువ్వు చాల అందంగా ఉన్నావు" అంది.

ఏదో తెలియని భావం తనకి గిలిగింతలు పెట్టింది. తను ఇప్పుడే పుట్టింది .తనకి అన్నీ అర్థమయ్యీ అవ్వనట్లు ఉన్నాయి.

తన ప్రతి అణువున నులివెచ్చని ప్రవాహం..... ఎవరో ఒకామె తల్లి మొక్కలో నీరు పోస్తోంది. దానినేతల్లి మొక్క నులి వెచ్చగా తనకు అందిస్తోంది. ఆమె తనను ముట్టుకుంది. ముట్టుకున్నట్లు కనపడుతోంది. కాని ముట్టుకున్నట్లు అనిపించటంలేదు.

" ఆమే మనని పెంచేది. మన యజమానురాలు" అంది లిల్లీ.

"మనని పెంచేది మన తల్లి మొక్క కదా" అంది పువ్వు.

"ఆ అమ్మని పెంచేది ఆమే. ఆమె అలా సుతిమెత్తగానే మనని సాకుతుంది " అంది లిల్లీ తెల్లగా నవ్వుతూ.

ఆమె తనని ఒక్కసారి మురిపెంగా చూసి వెళ్లి పోయింది... ఆమెని ఎప్పుడో చూసింది పువ్వు. అవును. గుర్తుకొచ్చింది. నిన్న సాయంసంధ్యవేళ ఆమె తన దగ్గరకు వచ్చింది. ప్రతి మొక్కను శ్రద్ధగా చూస్తోంది. తన అరవిచ్చిన రేకులనుండి ఆమెను చూసింది. అంతలో అక్కడకు ఇంకొకామె వచ్చింది.

"చూశారా పిన్నిగారు..! ఈ మొగ్గ సగం విచ్చి ఎంతముద్దుగా ఉందో. రేపు పూర్తిగా విచ్చుకుంటుంది. అప్పుడు చూడాలి దాని అందం" అంది ఆమె పువ్వును సుతి మెత్తగా వేలితో ముట్టుకుని చూపిస్తూ.

"మొక్కలు పెంచే వాళ్ళను చాలామందిని చూశాను కాని ఇంత అపురూపంగ పెంచేవాళ్ళను నేనెక్కడ చూడలేదు. ఏమిటో నీకు ఈ పిచ్చి" అందావిడ.

" మీ కొకటి చెప్పనా!? అన్నిటి కన్నా జాగ్రత్తగా పెంచాల్సినవి మొక్కలే. ఈ ప్రపంచంలో, ఏ జీవి అయినా కష్టం వస్తోంది అంటే తనని తాను రక్షించుకోవటానికో లేక పారిపోవటానికో ప్రయత్నిస్తుంది. ప్రమాదం ముంచుకొస్తున్నా కదలలేక నిస్సహాయంగా ఉండిపోయేవి వృక్షజాతి ఒక్కటే. మనం పోసే కాసిని నీరుకోసం ఆకులు చాచి ఎదురు చూస్తుంటాయి. అందుకే మనం ప్రేమించలేకపోతే వాటిని పెంచకూడదు" అన్నది ఆమె తనని సున్నితంగా తడుతూ.

ఆవిడ అదొకరకంగా నవ్వుతూ వెళ్లి పోయింది.

ఆమె మాటలు వింటుంటే.....ఆలాంటి ఆమె స్పర్శ సోకుతుంటే తనకు కూడా ఏదో చెప్పాలనిపించింది.కాని విచ్చీ విచ్చని గొంతుతో ఎలా చెప్పాలో తెలియలేదు.

"పోవే గడ్డి పువ్వా |నువ్వు దేనికి పనికి రావు. ఏదో గాలికి పుట్టిన నిన్ను జాలిగల యజమానురాలు సాకుతోంది. నేనైతే పీకి పారేద్దును" అన్న గొంతుకు పువ్వు ఉలిక్కిపడి గతం నుండి బయటకు వచ్చింది. తన మీద వాలిన గడ్డి పువ్వుని ఆవలికి నెడుతూ దాష్టీకం చూపుతోంది ముద్దబంతి. అదేమీ పట్టనట్లు ముడుచుకోని అందంతో తలూపింది గడ్డిపువ్వు.

అంతలోనే తన వేపు వొంగుతూ "మన యజమానురాలు మనని చాల శ్రద్ధగా పెంచుతుంది. రోజూ ప్రతి మొక్కని , పువ్వుని ముట్టుకొని పలకరిస్తుంది , ముద్దు చేస్తుంది" అంది ముద్దబంతి.

యజమానురాలి మీద పువ్వుకు ఎంతో ప్రేమగా అనిపించింది.

చుట్టూ ఉన్న ప్రపంచాన్నిచూస్తూ......ఆమె ప్రేమ గురించి ఆలోచిస్తూ, కాలం ఎలా జరిగి పోయిందో తెలియలేదు తనకి.

చిరు చీకట్లు అలుముకొంటున్నాయి. వెన్నెల తెర పరుచుకుంటోంది. మల్లె, జాజి.... రేకులు విప్పుతున్నాయి. ముద్దబంతి మౌనం దాల్చింది.

ప్రొద్దున్నుండి ఆమె కనపడ లేదు. పువ్వుకు ఏదో దిగులు..... సాయంత్రం అవుతోంది. ఆమె వచ్చింది. అన్ని మొక్కలకు నీరు పెట్టింది. ఎండి పోయి, రాలక మొక్కకు భారంగా ఉన్న ఆకులను మెల్లగా తొలగిస్తోంది. అంతలో ఒక పిల్లవాడు వచ్చాడు.

"ఆంటీ, ఈ లెసన్ కి అర్థం చెప్పవా?" అని అడిగాడు.

"కూర్చుని పైకి చదువు. పని చేసుకుంటూ చెపుతాను" అంది .

"మొక్కలకు ప్రాణముందని 'జగదీశ్ చంద్ర బోసు' అనే ఆయన ఎన్నో ప్రయోగాలు చేసి కనిపెట్టాడు....... ఈ మధ్యే ఆస్ట్రేలియా దేశం లో 'మొక్కలు మాట్లాడగలవని' రీసెర్చ్ ల ద్వారా నిరూపించారు" అని ఆ పిల్లవాడు చదువుతున్నాడు.



కౌముది

"మనకు ప్రాణముందని కనిపెట్టట మేమిటీ?ఎన్నో జీవుల్లాగానే పుడుతున్నాము,పెరుగుతున్నాము......చచ్చి పోతున్నాము. ప్రతి జీవికి ఏదో ఒక భాష ఉన్నట్లే మనకీ ఉన్నది....మనకేనా లేదా పుట్టి, పెరిగి , మరణించే ఇతర జీవుల మీద కూడా ఇలాంటి ప్రయోగాలు చేశారా?" చిరాగ్గా నసిగింది రావి చెట్టుతో పెనవేసుకుని పెరిగిన వేప చెట్టు.

ఇంతలో ఆ పిల్లవాడు గబుక్కున, చెయ్యి ఊరుకోనివాడిలా ఒక మందారాన్ని కోసి, రేకులు తుంచి పడేస్తున్నాడు ఆటకాయి తనంగా. మందారం బాధ భరించలేక కెవ్వున కేక పెట్టింది. ఆ మందారం పెట్టిన కేకకు నా మనసు కలుక్కుమంది . ఆమెకు కూడా వినపడిందేమో తలెత్తి చూసి ఉలిక్కిపడింది.

"అయ్యో! ఏంటీ నువ్వు చేస్తున్నపని? అలా తుంపి పడేస్తున్నావు?" అంది కంగారుగా. వాడు తలవంచుకొన్నాడు.

"వాటికి కూడా నొప్పి ఉంటుంది. నిన్ను గిచ్చితే బాధ పడతావు కదా! అవి కూడా అంతే" అని చెప్పింది బాధ నిండిన గొంతుతో.

ఆమె ఆ ప్రేమకి పువ్వుకు ఎంతో సంతోషం కలిగింది. ఈ లోపు ఒకాయన అక్కడకు వచ్చారు.

"ఏమిటోయ్? మొక్కల గురించి, పూల గురించి అతని తల తినేస్తున్నావా?" అన్నారు నవ్వుతూ.

అదే అదనుగా ఆ పిల్లవాడు " మళ్ళీ వస్తాను " అని పారి పోయాడు.

"పిల్లలకు కూడా జాలి,దయ నేర్పద్దా!? చిన్నప్పుడు మా బామ్మ చెప్పేది 'పువ్వులను కోసినా, యెంత సుకుమారంగా కొయ్యాలంటే మనం కోసినట్లు వాటికి తెలియకూడదు' అని. జంధ్యాల పాపయ్యశాస్త్రి గారి 'పుష్పవిలాపం' చదివితే పువ్వులను కొయ్యాలన్నా, సూదులతో గ్రుచ్చి మాల కట్టాలన్నా మనసొప్పుతుందా? పూల మీద కరుణ, ప్రేమ కలుగకుండా ఉంటుందా? 'ఓ పువ్వు ,తాను చనిపోయే లోపు అమరవీరుల సమాధి మీదకు చేరడమే తనకు అత్యంత ఇష్టమని భావించినదని' అన్న కవి హృదయం పరిశీలిస్తే 'పూలకు కూడా ఆకాంక్ష, ఆశలు ఉంటాయని' అనిపించదూ?" అంది ఆమె కాస్త బాధగా.

"వాటి సంగతి ప్రక్కన పెట్టు . నీకు ఈ మధ్య ఆరోగ్యం బాగుండటం లేదు. డాక్టర్ పూర్తిగా విశ్రాంతి తీసుకోమని చెప్పాడు కూడా. ఎందుకు ఈ పనులన్నీ చేస్తున్నావు?" అన్నాడాయన దిగులుగా.

"ఏం ఫరవాలేదు. మనకి ఇష్టమైన పనులు చేయటం కష్టమనిపించదు. సరేకాని, ఈ మొక్కలు చూడండి. మనం పోసే చారెడు నీళ్ళు త్రాగి అవి యెంత ప్రతిఫలాన్ని ఇస్తున్నాయో. ఆ గుణంలో మనం సగం నేర్చుకున్నాచాలు. జీవితం ధన్యం కదా!" అంది అపురూపంగా పువ్వులను తాకుతూ.

"ఈ మొక్కలకి , పువ్వులకు మాట్లాడటం వస్తే 'నిన్ను ప్రేమిస్తున్నాము' అని చెప్పేవేమో" అన్నాడు ఆయన ఆమె భుజం మీద ఆప్యాయంగా చెయ్యివేసి

"అయ్యో మాట్లాడటం రాదనుకుంటున్నారా? నాకు మాట్లాడటం వచ్చు" గట్టిగా అరిచి చెప్పింది పువ్వు.

"పాపం వాటికి నోళ్ళా? 'ప్రేమకు గుర్తుగా ఇచ్చినా, అంతిమ యాత్రలో శయ్యపై పేర్చినా ఒకే భావాన్ని ప్రకటించే వేదాంతులు ఈ పువ్వులు' " అని అంటూ లోపలికి నడిచింది ఆమె.

“"మొక్కల సేవ సరే! చదువుకోసం అమెరికా వెళ్ళిన మన కూతురు ఏడాది తరువాత వస్తోంది. ఆమెకి కావాల్సిన ఏర్పాట్ల గురించి ఆలోచించు" అంటూ ఆయన కూడా తన అరుపు పట్టించుకోకుండా ఆమె వెనకే నడుచుకుంటూ వెళ్లి పోయాడు.

తనకు ఏమి చెయ్యాలో అర్థం కాలేదు.

అది గమనించిన రావి చెట్టు."మనం చెప్పేది మన జాతికే అర్ధమవుతుంది. ఆ మనుష్య జాతికి అర్ధం కాదు" అంది

"నిజంగానా?" అడిగింది పువ్వు. తనకు ప్రశ్నలు వేయటం వచ్చింది.

" అవును నిజమే. ఒకప్పుడు మనుష్య జాతి, పక్షి జాతి, వృక్ష జాతి......ఇలా రరకాల జాతులవారు అందరూ కలిసి మెలిసి, సంబంధ బాంధవ్యాలు కలిగి ,ఒకరి కష్ట సుఖాలను ఒకరం పంచుకుంటూ జీవించే వారట. అప్పుడు ఒకరి భాష ఒకరికి అర్ధమయ్యేదిట".

"నీకివన్నీ ఎలా తెలుసు?"

"ఎన్నో ఏళ్ళగా పాతుకు పోయిన వృక్షాన్ని. అనేక విషయాలు మన పూర్వీకుల నుండి తర తరాలకు అందచేయపడుతూ నాకు తెలిసింది.అలా జీవించటం నేను పుట్టిన సమయానికే లేదు. అప్పటికే అలా జీవించటం నశించిపోయి కొన్ని ఏళ్ళు అయ్యిందిట......ఇప్పటికీ ఒకరి భాష ఒకరికి అర్ధం కాక పోయినా.... అర్ధం చేసుకోక పోయినా.......... ఒకరి మీద ఒకరం ఆధారపడి, ఒకే ప్రపంచంలో సహ జీవనం సాగిస్తున్నాము. అన్ని జాతులకన్నా ఉత్తమమైన జాతి మానవ జాతియట. అన్ని జాతుల మధ్య సంబంధ భాందవ్యాలను నిలపగల సామర్ధ్యం మానవ జాతికి ఉన్నదట....అలాంటి మానవ జాతికి స్వార్ధం, అవినీతి ......అన్నీ ఎక్కువయ్యి మానవత్వంనసిస్తూ ఉండటం తో వారికి బంధాలను నిలుపోగల శక్తి నశించిందిట. ఇతర జాతుల భాషలను అర్ధం చేసుకునే సామర్ధ్యము పోయిందట.......ఇప్పటికీ మన పుట్టుక స్వప్రయోజనం కోసం కాక పరులకు ఉపయోగపడటానికి మాత్రమే అవ్వటం వలన మనకి 'పుట్టుకతోనే' అందరి భాషలను, భావాలను అర్ధం చేసుకునే శక్తి కలుగుతుంది" అని ముగించింది ఆ వృక్ష రాజం.

వాళ్ళు తన మాటలు ఎందుకు వినలేక పోయారో అర్ధమయ్యింది. కాని ఆమె ఏదో పువ్వులగురించి మాట్లాడింది. తనకు కొంత అర్ధం కాలేదు. ముఖ్యంగా 'పువ్వులు చనిపోవటం' గురించి.....

ఏదో ఒక ప్రత్యేక నిశ్శబ్దంగా అనిపించింది. ఏమిటో తెలియలేదు. తను ఆలోచించింది. అర్ధమయ్యింది. ముద్దబంతి మౌనంగా ఉంది. గోముగా ముద్దబంతి మీదకి వంగింది.

"చనిపోవడమంటే? " అడిగింది పువ్వు.

ముద్దబంతి ఒక్క నిమిషం మౌనంగా వుంది."ప్రొద్దున నీ ప్రక్కన కొమ్మకు ఉన్న పువ్వు ఏమయ్యింది?" ప్రశ్నించింది ముద్దబంతి జవాబుగా.

"రాలిపోయింది".

"చనిపోవటమంటే రాలిపోవటమే. ఆ లోపు మనమేమవుతామో మనకు తెలీదు ".

"ఏమవుతాము?తల్లి మొక్కని అతుక్కుని ఉంటాము".

" కొన్ని పువ్వులు తల్లి మొక్క లోనే రాలి పోతాయి సహజ సిద్ధంగా. కొన్ని కోయబడి మన సృష్టి కర్త అయిన దేముడి పటాలకు అలంకరింపబడతాయట.....కొన్ని ఆడవారు సిగలో పెట్టుకుంటారుట.మరి కొన్నిటిని అమరవీరులు అంటే 'దేశాన్ని శత్రురాజులనుండి రక్షించటం కోసం ప్రాణాలు త్యాగం చేసినవారు' వారికి నిర్మించిన సమాధులపైన చల్లి 'శ్రద్ధాంజలి' ఘటిస్తారుట" అని చెప్పి ఒక్క నిమిషం ఆగి

"మా బోటివి సూదులతో గ్రుచ్చిగుమ్మాలకు వేళ్ళాడ తీయబడతాయట" అంది ముద్దబంతి ఏదో బాధగా .

"అమ్మో! సూదులు గ్రుచ్చు తారా మనకు!? నిజంగానా?" అన్నది పువ్వు కంగారుగా.

"ఇవన్నీ రావి చెట్టు చెప్పినవే" అని ముద్దబంతి మరల మౌనముద్ర దాల్చింది.తను కూడా ఆలోచనలో పడింది.

★★★★

తెల్లవారింది. రాత్రినుండి పువ్వుకు ఒకటే ఆలోచన. "రాలిపోయేలోపు తను ఎక్కడకి చేరుతుంది? భగవానుని పాదాలు చేరతానా....అమరవీరుల సమాధి చేరతానా లేక ఏ కార్యము చేయక రాలితల్లి పాదాలపైపడిపోతానా?తన రేకులలో తగ్గిన నిగారింపు, సన్నగిల్లిన శక్తి చెపుతోంది తను రాలిపోయే కాలం దగ్గర పడిందని. ఆ లోపు తను యేమవుతుందో...." ఒక విచిత్ర ఆందోళన.

అలా ఆలోచనలలో సాయంత్రం అయినది గమనించనేలేదు. యజమానురాలు వచ్చింది. ఆకాశంలో ఎగిరిపోతున్న పక్షుల కేసి చూస్తోంది. తరువాత పూల కేసి దీక్షగా చూసింది. ఆమె వడిలిపోయినట్లుంది. ఎండకు తను కూడా నిన్నఅలాగే అయిపోయింది. ఈమె వచ్చి నీరుపోస్తే, తన తల్లి అందించిన ఆ నీటిని ఆవురావురమని తాగి తేరుకుంది. పాపం ఈమెకు కూడా నీరు కావాలా? తను ఇయ్యగలిగితే. కాని తను'కదిలివెళ్ళలేని చలనం'.....నిస్సహాయురాలు.

ఆమె కుర్చీలో నుండి లేచి ప్రతి మొక్కను ముట్టుకోనారంభించింది. తనని కూడా ముట్టుకొంది. అది తన తల్లి మొక్క స్పర్శలాగానే ఉంది. 'అలాగే ఉండిపోతే బాగుండును' అనిపించింది. కాని ఆమె కదలిపోయింది.....

అలసిన సూర్యుడు నిదురించాడు.......

నిండు పౌర్ణమి. వెన్నెలరేడు 'చంద్రుడు' ఆకాశాన్ని ఆక్రమించాడు. చంద్రునుకి తన కన్నా ఎక్కువ రేకులున్నాయి. వెన్నెల రేకులు. తన రేకులు రెక్కలుగా మారి తమ మీద వాలే సీతాకోక చిలుకలలాగ యెగిరి చంద్రుని దగ్గరకు వెళ్ళగలిగితే!? ఏవేవో వింతవింత ఆలోచనలు..... మరల ప్రొద్దున తన ఆలోచన గుర్తుకొచ్చింది. తను చనిపోయేలోపు ఎక్కడకు చేరుకుంటుంది? అసలు ఎక్కడికన్నా చేరుకుంటుందా లేక ఇక్కడే రాలిపోతుందా....తనకు ఆట్టే సమయంలేదు..........

తెల్లవారింది. సూర్యుని పలకరింపులు అయ్యాయి. తనలోని శక్తి ఇంకా సన్నగిల్లింది. కాని తన ఆలోచన, మనసులోని ఆందోళన సన్నగిల్లలేదు. తన ఆలోచనలో తనుండగానే ఆమె వచ్చింది. అన్ని మొక్కలలో, చెట్లల్లో నీళ్ళు పోసింది. పెనవేసుకుని ఉన్న రావి,వేప చెట్టు చుట్టూతా తిరిగి ప్రదక్షణాలు చేసింది. చివరగా తులసి మొక్క ముందు ముగ్గులు వేసి,దీపం వెలిగించింది. నీళ్ళు పోసి, ప్రదక్షిణం చేసి నమస్కారం చేసింది. ప్రతి మొక్కని, పువ్వుని అపురూపంగ తాకుతూ ఆ తెల్ల గులాబీ దగ్గరకు వచ్చింది. ఒక్క క్షణం ఆ పువ్వు వంక ఏదోగా చూసింది.......

తన మనసులోని ఆందోళన ఆమెకు చెప్పుకోవాలనిపిస్తోంది పువ్వుకు. 'ఆమె స్పర్శ , చూపుల నుండి కురుస్తున్న ప్రేమ వలన' తన మనసులోని ఆందోళన ఆమెకి అర్ధమవుతోందేమో అని ఆ పువ్వుకు ఏదో ఆశ. 'మమ్మల్ని ప్రేమించే ఆమెకి కూడా తన భాష అర్ధమవ్వక పోతే ఎలా? 'పురుగు పట్టి నశించిన మొక్క వలన పువ్వులు కూడా నశించునట్లు, స్వార్ధం పెరిగి మానవత్వం నశించిన ఈ సమాజం వలన ఈమెకు కూడా తన భాషను అర్ధం చేసుకునే సామర్ధ్యం నశించినదా?'.....పువ్వు కి అనుమానాలు.

అంతలో ఆమె ఆ పువ్వును ఎంతో అపురూపంగా తన చేతుల్లోకి చేర్చుకొంది. ఎలా చేరిందో తెలీదు. ఇంకా తన తల్లి చెట్టు మీద ఉన్నట్లే ఉంది. మెల్లగా ఇంటి లోపలికి తీసుకు వెడుతోంది. బహుశా దేముని మందిరంలోకా!? ఆ చేతులు మెత్తగా పువ్వు రేకులు లాగ ఉన్నాయి. తొలి సూర్య కిరణాలలాగ నులివెచ్చగా ఉన్నాయి....

'ఇదేమిటీ, ఆమె చేతులలో నీటి బిందువులు. 'తనను కోసినందుకు కన్నీరు రాల్చిందా'? అయ్యో,అదేమిటి అలా క్రుంగి పోతోంది..... మెల్లగా ఒరిగి పోతోంది........ ఎన్నో వర్ణాలు , ఎన్నెన్నో అందాలు ఉన్నా రాలిపోయే పువ్వుల లాగానే మనుషులు కూడా రాలిపోక తప్పదా?' పువ్వు లో ఆందోళన.

ఆమె పువ్వును మటుకు వదలలేదు. దోసిలిలో భద్రంగా పట్టుకుంది. ఆమె నేల కొరిగింది. దోసిలిలోని పువ్వుని ఎద మీదకు చేర్చుకొంది.

ఆమె గుండెల మీద ఒదిగిపోయింది పువ్వు తన 'ప్రేమకు' గుర్తుగా.

# (అ)సహనం శారద శివపురపు

ఎప్పట్నుంచో మా ఇంట్లో ఒక పెద్ద చెక్క పార్టిషన్ పనికిరాకుండా అడ్డంగా ఉండేది. కానీ అదెంతో మంచి చెక్కతో చేసినది. దాన్ని పారెయ్యాలంటే మనసొప్పక, దాంతో ఒక స్టడీ టేబుల్ చేయిద్దామనుకుని ఎవరైనా కార్పెంటర్ దొరుకుతాడేమోనని చూస్తున్నాం. తన పక్కింట్లో ఒక కార్పెంటర్ పని చేస్తున్నాడని అతనికి చెప్పి పంపించాడు మావారి ఫ్రెండ్ ఒకరు. ఆ మర్నాడు ఒకతను తలుపు కొట్టాడు. తలుపు తెరవగానే నాక్కనిపించిన రూపం ఇది. పీలగా కొంచం పొట్టిగా, నలుపు కాకపోయినా ఎండకి కమిలినట్టున్న మొహం,ఆ మొహం నిండా రాతి శిల్పం మీద బొడిపల్లా గట్టిపడిపోయి, ఎన్నాళ్ళుగానో షేపూ సైజూ మారలేదోమోనన్నట్టున్న మొటిమలు. ఇక ఆ చిన్న చిన్న కళ్ళు కొంచెం ముందుకొచ్చిన నుదుటికింద గుబురుగా ఉన్న కనుబొమలకింద చూసినప్పుడు కొండల మధ్య వేలాడే చెట్ల గుబురుల కింద పారే సన్నని ఏటి పాయల్లా ఉన్నాయి. నాల్గడుగుల దూరంలో నిలబడ్డ అతని వంటి నుంచి ఒక వింత వాసన వస్తోంది. అది ఘాటైన చెమట, చిత్రిక పట్టేటప్పుడు వచ్చే చెక్కపొట్టు వాసన కలిసి వస్తున్న వాసన. వెంటనే నాకు వెలిగింది, ఇతను కార్పెంటర్ అయ్యుంటాడని. మావారిని పిలిచాను. అతని పేరు అతీక్ అట. నాకెందుకో అతని అవతారం చూస్తే అతనేం పని చేస్తాడో ఏమో అనిపించింది. అదే మావారితో కూడా అంటే మనకి చెయ్యాల్సింది చిన్న పనే కదా దానికి పెద్ద ఎక్స్పర్ట్ అవసరం లేదులే అని అతను చెయ్యాల్సిన పని చెప్పారు. పాపం అతను అడిగిన లేబర్ చార్జీలు కూడా ఎక్కువేం కాదు.

అతను చేసే చోట పని ముగించుకుని నాల్గైదు రోజుల్లో మా ఇంట్లో పని మొదలు పెట్టాడు. ఒక్కడే వచ్చాడు, ఒక చిన్న టూల్ బాక్స్ పట్టుకుని. ఆ టూల్ బాక్సోల్ చాలా సింపుల్ పనిముట్లు ఉన్నాయి. నాకు మళ్ళీ అనుమానం వచ్చింది ఈసారి అతన్నే అడిగాను ఈ

పనిముట్లతో నువ్వేం పని చేస్తావు అని. దానికతను " మీ ఇంట్లో పని చాలా చిన్నదమ్మా,నేను పెద్ద పెద్ద పనులు కూడా ఈ పనిముట్లతోనే చేస్తాను" అన్నాడు చక్కటి తెలుగులో తన పనిముట్లను అబ్బురంగా చూసుకుంటూ. చెప్పొద్దూ నాకైతే నవ్వొచ్చింది. మరుసటిరోజు అతీక్ ఒక ఆల్బం తీస్కొచ్చి చూడమన్నాడు. నేను కొంచం అసహనంగానే తీస్కున్నాను గానీ చూస్తే ఫొటోలన్నీ తను చేసిన పెద్ద పెద్ద షో కేసులూ, అల్మైరాల ముందు ఆ ఇళ్ళ ఓనర్స్తోబాటు దిగినవి. నాకు నమ్మడానికి కొంచం కష్టమే అనిపించినా అది నిజం. అతను చేసిన వర్క్ చాలా బాగుంది, అలాగే ఆ ఓనర్స్ మొహాల్లో సంతృప్తి, సంతోషం చెప్పక చెప్తున్నాయి. అతను నిజంగా పనిమంతుడే.

పొద్దున్నే నేను కిచెన్లో బిజీగా ఉన్నపుడు వచ్చేవాడు, మా పెరట్లో మామిడి చెట్లకింద నీడలో చల్లగా పనిచేసుకోవడం, మా ఆయన పొద్దున్నే టీ కప్పుతో అతనితోపాటు అతనేంచేస్తున్నాడో గమనిస్తూ, మార్పులూ చేర్పులూ ఆలోచిస్తూఅతనితో చర్చిస్తూంటే , ఆఫీస్ కెళ్ళేలోపల మాఇద్దరికీ కూడా మంచి టైంపాస్ అయిపొయ్యేది. ఈమధ్యలో, ఏ మోరీ బ్లాక్ అయిందన్నా, ఏ లైట్ మార్చాలన్నా దేనికైనా పరిగెత్తుకొచ్చేసేవాడు. రోజూ సాయంత్రం ఇద్దరం ఆఫీస్ నుంచి రాగానే చేసిన పని చూపెట్టి కాసేపు కబుర్లు చెప్పి వెళ్ళేవాడు. అతను టేపుతో కొలిచే పద్ధతి చూస్తే ఇతనేం చేస్తున్నాడు అనిపించేది కానీ, ఎప్పుడూ ఏదీ లెక్క తప్పలేదు, అన్నీ పెర్ఫెక్టుగా ఎడ్జస్ట్ అయ్యేవి. చివరికి అతీక్ ఒక టేబుల్ చేసాక మిగిలిన చెక్కతో ఇంకో టేబుల్ కూడా చేసాడు ఇస్త్రీ చేస్కోవడానికి బాగుంటుందంటూ. చక్కటి డెకోలాం ఫినిష్, సొరుగులతో, పోలిషింగ్ తో టేబుల్స్ ఎంత ముద్దుగా తయారయ్యాయంటే అవి పాత పార్టీషన్ తో చేసినవంటే ఎవరూ నమ్మరు. రెండు చేసినా ఎక్స్ట్రా డబ్బు మేమిచ్చాం తప్ప తను అడగలేదు.

టేబుల్స్ చెయ్యడం పూర్తయ్యేసరికి మా ఆయనకి ఇంకో పని చేయించుకోవాలనిపించింది. హాల్లో అలమార బోసిగా ఉంది తలుపులు లేక బొమ్మలన్నీ దుమ్ముట్టిపోతున్నాయి అని. అంతే అతీక్ ఒక డిజైన్ తో రెడీ అయిపోయాడు. కొన్ని మార్పులు చేర్పుల తరవాత ఆ పని మొదలయింది. ఇలా ఒక పని పూర్తి చేసే లోపల ఇంకో పని సిద్ధంగా అలోచించి పెట్టుకునేవారు మా ఆయన. అతీక్ కి కూడా ఇది బాగానే ఉండేది పని వెతుక్కోవక్కర్లేకుండా. అలా మా ఇంట్లో చిన్న చిన్న పనులు చేసి చేసి మా ఇంట్లో మనిషయి పోయాడు. మా ఇంట్లో అతనంత చనువుగా తిరగటం కొందరికి వింతగానే ఉండేది ముస్లిం కాబట్టి. మా ఇంట్లో పనున్నా లేకున్నా రెండు మూడు రోజులకొకసారి వచ్చి కనపడే వాడు. మందులు కావాలన్నా, కూరలు కావలన్నా పక్కనే ఉన్న మార్కెట్ నుంచి తెచ్చిపెట్టేవాడు. ఏం కొనాలన్నా మంచి క్వాలిటీ చౌకగా, ఎక్కడ దొరుకుతుందో చెప్పి మా ఆయన్ని తీస్కెళ్ళిపోయేవాడు. చార్మినార్ బజార్లో ఏవస్తువు ఎక్కడ దొరుకుతుందో అతనికి కొట్టిన పిండి. చివరికి అతీక్ మా ఇంట్లో, ప్లంబర్, గార్డెనర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, హౌస్ కీపర్ అన్నీ తనే అయిపోయాడు. ఇంట్లో ఏ వస్తువు ఎక్కడ ఉందో ఒక్కోసారి అతీక్కి ఫోన్ చేసి అడగాల్సొచ్చేది.

ఒక్కోసారి ఎటువంటి చదువూ లేని అతీక్, ఎలక్ట్రానిక్ అప్లియన్సెస్ పని చేసే విధానాన్ని చక్కగా అర్థం చేసుకోవడం, ఎక్కడ ప్రాబ్లెం వచ్చుండచ్చు ఎలా రిపేర్ చెయ్యొచ్చు అనే విషయాల మీదున్న అవగాహన నాకు ఆశ్చర్యం కలిగించేది. అంతే కాకుండా ఒక్కోసారి మా ఆయనతో ఫిలసాఫికల్ విషయాలు చర్చించేవాడు. నేనెప్పుడైనా సడెన్ గా వస్తే సిగ్గుపడి ఆపేసే వాడు. ఒకసారి ఇల్లు సర్దుతూ టేపంతా ఊడి బయకొచ్చేసి చిక్కుపడిపోయిన కేసెట్టు పారెయ్యమని చెపితే దాని చిక్కు విప్పి మళ్ళీ వెనక్కి చక్కగా చుట్టి ప్లే చేసి చూపెట్టి, "అంత మంచి ఘంటసాల కేసెట్టు పారెయ్యడం ఎందుకమ్మా!?" అన్నాడు. "నీకు ఘంటసాల కూడా తెలుసా?" అని

నేనాశ్చర్యపోతే, "అదేంటమ్మా నాదగ్గర ఘంటసాల కేసట్ల కల్లెక్షన్ ఉంది కానీ టేప్ రికార్డర్ ఇంక రెపేర్ కానంతగా పాడైపోయింద"ని బాధగా చెప్పాడు. నాకది నిజంగా షాకే. ఎందుకంటే మెహ్దీపట్నం ముస్లిం బస్తీలో ఘంటసాల పాటలకి అభిమాని ఉంటాడని ఘంటసాల వీరాభిమాని నైన నేను ఊహించలేనిది. నా చిన్నప్పుడు ఘంటసాల పాటలు ఇష్టపడ్డవారితోనే స్నేహం చేసేదాన్ని. ఇప్పుడు తలుచుకుంటే నవ్వొస్తుంది. మా ఇంట్లో వాడకుండా ఉన్న పాత టేప్ రికార్డర్ అతనికి బహుమతిస్తే ఎంతో సంతోషపడిపోయాడు.

ఒకసారి నా పనిమనిషి ఊరెళ్తాను రెండు నెలలు అని చెప్పి వెళ్ళిపోయింది. అదొచ్చేవరకు ఎవరూ దొరక్క ఇబ్బంది పడుతూ అతీక్ నడిగా "మీ ఆవిడని పంపరాదా.. కొంచం నాకు సాయానికి" అని. అతీక్ ఒక నవ్వు నవ్వాడు "ఆమె ఇలాంటి పనులు చేయదమ్మా" అని. నాక్కొంచం చిరాకొచ్చి అడిగా "ఏం? ఎందుకు చెయ్యదూ" అని.

అప్పుడు చెప్పాడు వాళ్ళావిడ గురించి. వాళ్ళావిడ నల్గురన్నతమ్ముల్లో ఒక్కర్తి గారాబంగా పెరిగిందట. అన్నతమ్ములందరూ కూడా బస్తీలో గూండాలే. ఇక వాళ్ళ అండ చూసుకుని ఈమె కూడా తన లెవల్లో చుట్టుపక్కలవాళ్ళతో ఆడ గూండాలా గొడవలూ కొట్లాటలూ, పోలీస్ కేసులూ వగైరా వగైరా అని. చాలాసార్లు పోలీసులకి డబ్బులు తినిపించి మరీ విడిపించుకు రావాల్సిన పరిస్తితి. వాళ్ళు ఈమెను బురఖా స్త్రీ కాబట్టి బెదిరించి వదిలేసేవాళ్ళట. "పిల్లలు మాత్రం బుద్ధిమంతులు, తల్లి ప్రవర్తన ప్రభావం పిల్లల మీద పడకుండా నేను చాలా పాట్లు పడతానమ్మా, నేను కానీ పిల్లలు కానీ వాళ్ళ పుట్టింటి వైపు కూడా వెళ్ళం" అని చెప్పుకొచ్చాడు. అతీక్కి ఐదుగురాడపిల్లలు ఆఖరున ఒక మగపిల్లాడు. ఒక్క మగ నలుసు కోసం ఇంతమంది ఆడపిల్లల్ని కని వాళ్ళకి చదువూ సంధ్యా లేకుండా పెంచడం చివరికి వయసు రాంగానే ఎవడో ఒక వెధవకిచ్చి కట్టబెట్టడం. ఇటువంటి మానసిక దౌర్బల్యానికి ఆడపిల్లలు బలైపోవడం నిజంగా బాధాకరం అనుకుని ఊరుకున్నాను.

ఇలా ఉండగా ఇల్లంతా రెన్నొవేషన్ చేసాము. ఇంక అతీక్కి బోలెడు పని. మేస్త్రీ పని అయిపోయాకా, అతీక్ మళ్ళా వుడ్వర్క్ మొదలు పెట్టాడు. ఈసారి పెద్దపనే. అది కూడా ఇంకెవర్నైనా తెచ్చుకోమంటే లేదు నేనొక్కడినే చేస్తా అని కూర్చున్నాడు. పొద్దున్నే అతను పని మొదలెట్టాకా ఇల్లు అతనికి వదిలి ఇద్దరం ఆఫీసుకెళ్ళే వాళ్ళం. ఇంట్లో కనీసం బీరువా కూడా లాక్ చేసి వెళ్ళాలని ఎప్పుడూ అనిపించలేదు. తాళాలు అలా ఎదురుగుండానే ఉండేవి. కొంత డబ్బు, ఇంట్లో ఉన్న బంగారం అంతా బీరువాలో తాళం వెయ్యకుండానే ఉండేది. అతీక్ కుదురుగా జాగ్రత్తగా ఒక రూం తర్వాత ఒక రూంలో మూణ్ణెల్లు పనిచేసాడు. చివరికి ఇల్లంతా కిచెనూ అటకలతో సహా మొత్తం చక్కగా తయారు చేసాడు. అలమార చెయ్యడం పూర్తయ్యాకా అందులో వస్తువులు కూడా చక్కగా కడిగి తుడిచి, మెరిపించి లోపల సర్ది సాయంత్రం వచ్చే వేళకి మాకు సర్ప్రైస్ ఇచ్చి మురిసిపోయేవాడు. .. మొత్తానికి అతీక్ కీ మాకూ ఒక అనుబంధం ఏర్పడిపోయింది. ఏ పనీ లేకపోయినా, డబ్బూ అక్కర్లేకపోయినా కష్టం, సుఖం చెప్పుకోవడానికైనా వచ్చి కాసేపు కూర్చుని వెళ్ళేవాడు.

తనకు పనిలేనప్పుడల్లా వచ్చి ఇంకేదో చేస్తా అనే వాడు. మా ఆయన వెంటనే ఒప్పేసుకునే వారు. నేనే కొంచం చిరాకు పడేదాన్ని. కానీ అతీక్కి డబ్బు అవసరం అని అర్ధం అయ్యేది. పోనీ డబ్బే అప్పుగా అడగచ్చు కానీ అడిగేవాడు కాదు, ఆ విషయం నచ్చే అతనికి ఏదో ఒక పని వచ్చినప్పుడల్లా ఇచ్చే వాళ్ళం. అలా అతీక్కి పనిలేని రోజుల్లో అతనికి కల్పించిన పని చక్కటి పూజా మందిరం చెయ్యడం. పని దొరకడం ఆలస్యం, అతీక్ ఉత్సాహంగా మొదలుపెట్టేసాడు. పూజా మందిరం డిజైన్కి , దాని తలుపుల మీద డిజైన్ కి అతను ఎంత శ్రమ పడుతున్నాడో చూస్తుంటే నాకాశ్చర్యం వేసింది. ఎంతయినా అతను ముస్లిం. తిరుపతి ప్రసాదం ఇస్తే మేం తినమన్న ఇతర మతాల వాళ్ళని

నేను చూసాను మా అఫీసులో. సంస్కారవంతులు, విద్యావంతులైన వారిదే ఈ ప్రవర్తన అయితే, పూజా మందిరానికి అతను పెట్టిన శ్రద్ధ మళ్ళీ మళ్ళీ బయటికి వెళ్ళి గంటల ఆకారంలో చెక్కలో చేసే హోల్స్ కోసం, ఓం అక్షరాన్ని తలుపులమీద అందంగా చెక్కించడం కోసమని తనకి తృప్తి కలిగేవరకూ విడిచిపెట్టకుండా ఎంతో టైం తీసుకుని చేస్తున్నాడు. ఉండబట్టలేక ఒకరోజు అడిగేసాను.

"అతీక్ మీ దేవుడు కాదు, అసలు హిందువుల పొడ గిట్టని బస్తీ లోంచి వచ్చిన నువు ఇంత శ్రద్ధగా ఎలా చెయ్యగల్గుతున్నావ"ని. అతీక్ చెప్పిన సమాధానం నేనెప్పుడూ మర్చిపోలేను.

"అమ్మా.. దేముడూ అల్లా అని మనమందరం పూజిస్తాం గానీ అసలు ఉన్నాడో లేదో ఎవరు చూసారు? ఒకవేళ ఉన్నా కృష్ణుడనీ, అల్లా అనీ జీసస్ అనీ ఇంతమంది ఉండరు కదమ్మా, ఈ భూప్రపంచాన్ని మొత్తం ఒక దేముడే కద సృష్టించి ఉండాలి. ఉన్నాడని నమ్మినపుడు రూపం ఏదయితే ఏంటమ్మా, పూజ చేసే విధానం ఏదయితే ఏంటమ్మా అని. ముస్లింగా పుట్టాను కాబట్టి నమ్మితే అల్లా అనే అంటాను మీరు శివా అనో కృష్ణా అనో అంటారు అంతే కదమ్మా. అసలు నాకు తిండి పెట్టే నా ఈ పనిముట్లే నాకు దేవుళ్ళమ్మా. నేను చిన్నవాణ్ణి, నామాటలు ఎవరు పట్టించుకుంటారు? ఇంతకంటే గొప్ప మాటల్లో నేను చెప్పలేనమ్మా" అన్నాడు. నేను మనసులో అనుకొన్నాను, ఎంత గొప్ప మాటల్లో చెప్పినా, ఎంత భాష ఉపయోగించి క్లిష్టతరంగా చెప్పినా సామరస్యం పాటించే విజ్ఞత ఉన్నవాళ్ళు చెప్పే మాటల సారాంశమే చెప్పావు కదయ్యా అని.

"ఏమైనా జాగ్రత్త అతీక్, ఓల్డ్ సిటీలో గొడవలవుతున్నాయి. అక్కడ పొగొస్తే మీ బస్తీలో నిప్పంటుకుంటుంది, గొడవలు చెయ్యడానికి నీ బామ్మర్దులే తయ్యారుగా ఉంటారాయె.నువు పూజా మందిరానికి కావాల్సిన వాటికోసం మీ బస్తీ లోకి మాత్రం వెళ్ళకు, కొన్నాళ్ళు ఆలస్యం అయితే అయ్యింది, ఈ గొడవలు సర్దుమణిగేవరకూ ఆగుదాం" అన్నాను.

"వాళ్ళు నన్నేం చేస్తారమ్మా.." అంటూ తేలిగా కొట్టి పారేసాడు.

పాత సిటీలో కర్ఫ్యూ, ముస్లింస్ ఎక్కువగా ఉన్న వేరే బస్తీలన్నిటిలోనూ నిఘా నడుస్తోంది. ఏంటో ఈ మూర్ఖత్వం జనాలకి పుట్టుకతోనే మతద్వేషం వస్తోంది వారసత్వంగా, కానీ పెరుగుతూ నేర్చుకునే విద్య, సంస్కారం, మత సహనం ఇవ్వట్లేదు కదా బాధేసింది. పందిని చంపి వీళ్ళూ, ఆవుని చంపి వాళ్ళు, చివరకు మనుషుల్నే చంపుకునే పరిస్థితి తెస్తారు.

ఆ తరవాత అతీక్ రెండు మూడు రోజులు రాలేదు. ఏ కబురూ కూడా లేదు. బస్తీ కదా గొడవలు కూడా ఎక్కువగానే ఉన్నయిలే, రాకపోవటమే మంచిది అని మేమూ ఊర్కున్నాం. ఇంకొక రెండు మూడు రోజులు గడిచాయి. అతీక్ ఉండే బస్తీలోక్కూడా గొడవలు పాకి ఇద్దరు ముగ్గురు చనిపోయారని, కొందరు గాయపడ్డారని టీ వీ వార్తల్లోనూ,పేపర్లోనూ వస్తున్నాయి. అక్కడా కర్ఫ్యూ పెట్టారు. ఏంటో ఈ హైదరాబాదు సామాన్య జనం అంతా బస్తీల్లో ఎంతో చక్కగా కలిసిపోయే ఉంటారు. కొందరు మాత్రం ద్వేషంతో రగిలిపోతూ మత రక్కసి కత్తులు ఒళ్ళంతా మొలిపించుకుంటారు. అమాయకులని వేటేస్తుంటారు.

ఆ తరవాత ఓరోజు ఫోన్ వచ్చింది అతీక్ చనిపోయాడనే పిడుగులాంటి వార్తను మోసుకొచ్చింది. తెలిసిన సబ్ ఇన్స్పెక్టర్ని వెంటబెట్టుకుని మావారు హుటాహుటిని బయల్దేరి వెళ్ళారు. దిట్టంగా ఉండి, కష్టపడి పనిచేసుకునే అతీక్ ఇంత హఠాత్తుగా పోవడం ఏంటని. నాకైతే తట్టుకోలేని షాక్. మావారు వెళ్ళేప్పటికే అతీక్ని తీస్కెళ్ళిపోతున్నారు. వాళ్ళతోపాటే టోపీ పెట్టుకుని మా వారు కూడా

చివరివరకూ వెళ్ళారు. అయితే తరవాత తెలిసిన విషయం ఏంటంటే అతీక్ పూజా మందిరానికి గంటలు కొనడానికివెళ్ళి వాళ్ళ బామ్మరుదుల తోటి వాడెవడితోనో గొడవ పడ్డాడట. ఇలాంటి సమయంలో "నువు హిందువుల ఇంట్లో పూజా మందిరం చేస్తావా, మనవాళ్ళు ఎంతమంది చనిపోయారో నీకు తెలియదా, నీ బామ్మరుదులకి తెలిస్తే ఊరుకుంటారా?" అంటూ మొదలెట్టాడట అతను. అంతే మాటా మాటా పెరిగి కొట్టుకునేవరకూ వచ్చి, అతీక్ని చంపాలన్న ఉద్దేశ్యం లేకపోయినా, తలమీద తగలకూడని చోట దెబ్బ తగిలి, ఇంటర్నల్ బ్లీడింగ్ అయి చనిపోయాడట. అతీక్ పూజా మందిరానికి కొన్న గంటలు మాత్రం భద్రంగా ఇంటికెళ్ళాయి. విషయాలు ఏడుస్తూ చెబుతూ వాళ్ళవిడ ఆ గంటలు ఇచ్చిందట.

మతఘర్షణల్లో ఇంతమంది పోయారు, అంతమంది పోయారు అని చేప్పే వార్తలెప్పుడూ లెక్కలే మాకు ఈ సారి మాత్రం ఆ ఘర్షణల మంటలు మా గుండెల్ని మండించాయి. చాన్నాళ్ళ పాటు ఆ మంటల వేడి మా ఇంటిపరిసరాల్లో తచ్చాడుతూనే ఉంది. అతీక్ కుటుంబానికి కొంత ఆర్థిక సాయం చేసాం కానీ అతను లేని లోటునైతే ఆ పసిపిల్లలకీ అతని భార్యకీ తీర్చలేనిదికదా . అతీక్ లేకపోయినా ఆ గంటలు మాత్రం మా గుండెల్లో ప్రతి రోజూ మోగుతూనే ఉన్నాయి మత సహనాన్నో, అసహనాన్నో గుర్తు చేస్తూ...!!

# ప్రేమకు వయసుందా!? బోడపాటి రమేష్

జనం చేసిన మాధవయ్య ముందు గదిలోకి వస్తూనే మనవడిని చూసి

" ఒరే.. కృష్ణా.. అలమరలో వక్కపొడి ఉందేమో చూడు మెత్థని పలుకులు తీసుకురా" అన్నాడు.

"అల్లాగే తాతయ్యా" అన్నాడే కాని చదువుకుంటున్న కృష్ణ లేవలేదు.

అది గమనించిన మాధవయ్య మనసు చివుకుమన్నా ఇప్పుడు వక్క వేసుకోకపోతే వచ్చిన నష్టమేంటి అనవసరంగా పిల్లవాడిని కష్టపెట్టటం కాకపోతే అని సర్దిచెప్పుకుని వాలు కుర్చీలో కళ్ళు మూసుకుని స్థిమిత పడ్డాడు.

"ఇదుగోనండీ వక్కపొడి" అన్న భార్య మాటలు వినబడటంతో కళ్ళు తెరిచి చూశాడు.

ఆవిడ ఇచ్చిన వక్కపొడిని అయిష్టంగానే అందుకుంటూ

"నువ్వెందుకే లేచి వచ్చావు?. ఇప్పుడు వక్క వేసుకోకపోతే ఏం? మందులు వేసుకున్నావా? ఏదో పని హడావుడిలో పడి అశ్రద్ధ చేయటం నీకు అలవాటు. మన ముసలి ప్రాణాలు పిల్లల్ని ఇబ్బంది పెట్టకుండా శరీరాలలోంచి జారుకోవాలి తెలిసిందా!?" అన్నాడు నవ్వుతూ.

" ఈ మాత్రానికే అలసిపోతానుటండీ! మందులు మానటం లేదు". అయినా ఆ మాత్రం నాకు తెలీదా అన్నట్టు చూసిందావిడ..

" తాతాజీ ఈ పాఠం కాస్త చెప్పండి ఎంత చదివినా అర్థం క్కావటం లేదు" అంటూ వచ్చిన మనవడిని చూస్తూనే

"ఒరేయ్ ఈ పాఠాలు మీ ప్రయివేట్ మేష్టారిని అడిగి చెప్పించుకో. అంతేగానీ తాతగారిని అడిగి విసిగించకు. అసలే ఆయన అరోగ్యం బాగుండటం లేదు "అని కసురుకుంది కోడలు.

"ఛా.. ఊరుకో చిన్నవాడిని మనమే పైకి తీసుకురావాలి. నువ్వు పోయి పడుకో ఆలస్యం అయిందంటే నిద్ర పట్టలేదని మర్నాడంతా బాధ పడతావు" అన్నాడు.

"మీరు కూడా ఎక్కువ సేపు మెలకువగా ఉండకండి." అంటూ ఇంకొక్కసారి భర్తను హెచ్చరించి వెళ్ళిందావిడ.

"మీరు లేచారెందుకు అత్తయ్యా, మామయ్యగారికి కావలసినవి మేం చూస్తాం" అంటూ కోడలు శాంత ఎదురు రావటంతో తన చికాకునంతా ఆ అమ్మాయిమీద చూపిస్తూ

"ఆ అందరూ పడుకోమని చెప్పేవారే. ఆయన వక్క అడిగితే ఎవరూ ఇచ్చిన పాపాన పోలేదు" అనేసి తన మంచం దగ్గరకు చేరుకుంది.

"'ఏమిటో ఈవిడ పిచ్చి! ఈయన వక్క వేసుకోకపోతే వచ్చిన నష్టమేంటో" అనుకుంటూ ఆఫీసు నుండి ఇంటికి రాని భర్త కోసం ఎదురుచూస్తూ వాకిట్లో నే తారట్లా దుతోంది శాంత.

వెళ్ళి పడుకుందే కాని రుక్మిణమ్మ నిద్ర పోలేదు. ఆవిడ ఆలోచనలు భర్త చుట్టూ తిరుగుతున్నాయి. తాను అందించిన తాంబూలం అందుకుంటూ ఆయన చూపిన చిలిపితనం గుర్తుకొచ్చినప్పుడలా ఆవిడ ఇప్పటికీ సిగ్గుతో ముడుచుకుపోతుంది. ముసిముసిగా నవ్వుకుంటుంది.

కృష్ణా రామా అనుకుంటూ కాలక్షేపం చేస్తున్నా కృష్ణా అన్నా రామా అన్నా భర్త మాధవయ్యే కనిపిస్తాడు. పిల్లలంతా జీవితాల్లో స్థిరపడి ఎవరికివారు వీళ్ళని తమ దగ్గరికే వచ్చి ఉండమన్నా ఆఖరి సంతానం అయిన విశ్వం దగ్గరే ఉండటానికి ఇష్ట పడతారు.

"విశ్వం వచ్చాడా శాంతా?" అన్నాడు మాధవయ్య మనవడి కి పాఠం పూర్తిచేసి.

"లేదు మావయ్యా..! ఈయన బయటకు వెళితే ఇల్లు, సంసారం గుర్తుండవు. వేళకు తిండి తినరు. ఈయన కోసం కాచుకుని కూర్చొలేక ప్రాణాలు పోతున్నాయి" అన్నదామె అసహనంగా.

ఆ చికాకులో ఆప్యాయతను గమనించిన మాధవయ్య నవ్వుకున్నాడు.

నిద్ర పట్టని రుక్మిణమ్మ మాత్రం" అదేమిటే అనవసరంగా అబ్బాయిని ఆడి పోసుకుంటావు!? బయటకు వెళ్ళిన మగాడికి సవాలక్ష పనులుంటాయి. అయినా వాడు కష్టపడేది మనకోసమే కదా." అన్నది.

"ఇప్పుడు నేనేమన్నానని? ఎవరు ఎప్పుడు వస్తే నాకేం..!? అయినా ఇదేమైనా కొత్తా? రోజూ ఉంటున్నదే. ఓ ముద్దూ లేదు, ముచ్చట లేదు." అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది కోడలు.

'ఏమిటో ఈ కాలం ఆడవాళ్ళు.. 24 గంటలూ మొగుళ్ళని కొంగున కట్టేసుకోవాలనుకుంటారు. మా రోజుల్లో ఇలా ఉండే వాళ్ళమా?" అనుకుంటూ భర్తను ఒకసారితృప్తిగా చూసుకుని నిద్రలోకి జారుకుందావిడ .

★★★★

"ఏమండి పిలిచారా? "అంటూ లేచి భర్త వద్ద నుండి ఎటువంటి సమాధానం రాక మళ్ళీ కళ్ళు మూసుకుంది.

మాగన్నుగా నిద్ర పట్టిన ఆవిడకు వంటింట్లో గిన్నెల శబ్దాలకు మెలకువ వచ్చినా, కోడలు గొంతు వినిపించడంతో లేవవలసిన అవసరం లేదనుకుంది. వినిపించే మాటలను బట్టి విశ్వం వచ్చినట్లుగా గ్రహించిందావిడ.

"ఇవాళ అనుకోని పని తగలటంవల్ల ఆలస్యమయింది. అన్నట్లు నువ్వు భోంచేసావా?" అంటున్నాడు విశ్వం

"నా భోజనానికేంగాని మీ కోసం కనిపెట్టుకుని కూర్చోవటం కూడా నా దినచర్యలో భాగమయ్యింది." అన్నది శాంత.

"కోపం వచ్చినట్లుందే రాణీగారికి?"

"అవునులెండి. నేనంటే చాలా భయం. ఒక రోజు అనుకోని పని, ఒకరోజు అనుకున్న పనికి అనుకోని ఆలస్యం. ఏదయితేనేం ఆలస్యంగా ఇంటికి రావటం మీకు బాగా అలవాటయ్యింది. సరదాలంటూ ఎటూ తీరటం లేదు. ఆరోగ్యమైనా చూసుకోవాలి కదా!"

"నీకేం తక్కువయిందని? అయితే రోజంతా నీ ఎదురుగానే కూర్చుంటాను. తిండి పెట్టేవాడెవడైనా ఉంటే చూడు." నవ్వుతున్నాడతను.

"ఈ కబుర్లకేం తక్కువ లేదు. ఈ కూర కాస్త వేసుకోండి. మీ కిష్టమైందే కదా. మీరీమధ్య సరిగా భోజనం కూడా చెయటం లేదు."

"నువ్వు నవ్వుతూ ఎదురుగా ఉంటే ఎంత తింటానో చెప్పలేను. అవునూ.. అమ్మా వాళ్ళు పడుకున్నారా?"

"ఆ.. ఇప్పుడే.. మీరొచ్చారా అని అడిగారు. ఇవాళ ఏమయిందో తెలుసా? మీ నాన్నగారు భోజనం చేసి మన వాడిని వక్కపొడి తీసుకురమ్మని అడిగారు. వీడు సరిగా వినిపించుకోలేదు. దానితో పడుతూలేస్తూ తనే వక్కపొడి ఆయన కిచ్చేదాకా మీ అమ్మగారు స్థిమితపడలేదు. అయినా ఈ మధ్య అత్తయ్యగారి సంగతి అంతు పట్టటం లేదు. మామయ్యగారు ఎప్పుడైనా బయటకు వెళితే ఆయనను వీధిగుమ్మం దాకా సాగనంపుతారు. ఆయన వచ్చే సమయానికి వాకిట్లో నిలబడి తీసుకు వస్తారు. రోజురోజుకి ఆవిడ మరీ చిన్నపిల్లలాగా తయారవుతున్నారు. అసలే ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంటున్న మనిషి. తిరుగుడు తగ్గించుకోమంటే వినరు."

"పోనీలే ఆవిడకు తోచినట్లుగా చేస్తుంది. పెద్దతనం, చాదస్తం.. నువు పట్టించుకోకు"

"చాల్లెండి ఎంతైనా కన్నతల్లి కదా అని వెనకేసుకొస్తున్నారు. ఈ ముసలితనంలో కృష్ణా రామా అనుకోకుండా ఇవేం పనులండీ."

"వంటిల్లు సర్ది తొందరగా రా. నాకు నిద్ర ముంచుకొస్తోంది ."

"అంతేలెండి పెళ్ళయిన కొత్తలో అయితే నిద్ర రావటం లేదనేవారు. ఇప్పుడేమో నిద్ర ఆగటం లేదంటున్నారు. "

ఇవన్నీ వింటున్న రుక్మిణమ్మకు నిద్ర తేలిపోయింది. కోడలు దగ్గర చులకనవుతున్నందుకు బాధ పడుతోంది.తను చేస్తున్న తప్పేమిటో కొడలు గేలి ఎందుకో ఆవిడకు అంతు పట్టటం లేదు. మాధవయ్యగారికి ముసలితనంలో మతిమరుపు ఎక్కువవటంతో ఆయనకు కావలసినవన్నీ తనే అందించాలి. బయటనుండి వచ్చిన ఆయన అలసట తగ్గేవరకు తనకు తోచదు. ఇంట్లో పిల్లలున్నా ఎవరి పనులు వాళ్ళకుంటాయని ప్రతిపనికీ తననే పిలుస్తారు. అందులో తప్పేముంది? నిజానికి తను లేకపోతే ఆయనకు క్షణం గడవదు.

" ఏమిటో ,ఈ కాలం వాళ్ళకు భర్తకు కావలసినవి స్వయంగా చూసుకోవటం కూడా చాదస్తమనిపిస్తోంది" అనుకుంటూ నిద్రలోకి జారుకుంది.

★★★

" రాత్రి ఆలస్యమయినట్లుంద"' అన్నాడు ఉదయాన్నే కొడుకుతో మాధవయ్య.

" ఈమధ్య పని ఎక్కువవుతోంది. మీ వంట్లో ఎలా ఉంది? మందులు మానకండి."

" ముసలితనంలో మందులు వేసుకున్నా మానినా పెద్ద తేడా ఉండదు. వచ్చిన పనులన్నీ అయిపోయినాయి. ఇక పైవాడి దయ."

"అవేం మాటలండీ. ఇప్పుడు మీ కేమంత వయసు మించిపోయిందని. మీరు పదికాలాల పాటు చల్లగా ఉండాలి" అన్నది రుక్మిణమ్మ కళ్ళొత్తుకుంటూ .

"ఎందుకమ్మా అనవసరంగా బాధ పడతావు. నాన్నగారు మందులు వాడుతున్నారు కదా. ప్రతి చిన్న విషయం నువ్వు పట్టించుకోకు. ఆయనకు ఏం కావాలో మేము చూస్తూనే ఉన్నాం కదా."

"అదేం కాదులెండి. అత్తయ్యగారి ఉద్దేశంలో మనం మామయ్యగారిని సరిగా చూడటం లేదు. అందుకనే ఆయనకు కావలసినవన్నీ తనే చూసుకుంటున్నారు. ఎంత చేస్తున్నా.. మెప్పు లేదు." శాంత రుసరుసలాడుతోంది.

"మీరు చూడటం లేదని ఎవరన్నారు?" రుక్మిణమ్మ తీసిపోవటం లేదు.

వ్యవహారం ముదురుతోందని గ్రహించిన విశ్వం" ఎవరి పనులు వాళ్ళు చూసుకోండమ్మా! నువ్వుకూడా ఎక్కువ శ్రమ పడకుండా విశ్రాంతి తీసుకో "అని వెళ్ళిపోయాడు.

కోడలు కూడా భర్త వెనకాలే వెళ్ళిపోయింది.

వాళ్ళిద్దరే ఆ గదిలో మిగిలారు.

" రుక్కూ.." మాధవయ్య పిలుపు వినబడటంతో భర్త వైపు చూసిందావిడ, నీళ్ళు నిండిన కళ్ళతో.

ఏమయిందన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించాడాయన.

"ఏం లేదండీ.. నా బాధ మీకయినా అర్థమవుతుందో లేదోనని నా భయం. మీకు కావలసినవన్నీ నేనే చూసుకోవటం, ఇంట్లో వాళ్ళ దృష్టిలో వెర్రిగాను, చాదస్తంగానూ అనిపిస్తోంది. ఇన్ని సంవత్సరాలుగా చూస్తున్న నాకు కాక ఇంకెవరికి తెలుస్తాయండీ మీ అవసరాలు? ఇంకెన్నాళ్ళో ఉండమని నాకు తెలుసు. అందుకనే ఎప్పుడూ మిమ్మల్నే చూసుకుంటూ ఉండాలని నాకనిపిస్తుంది. చూసేవాళ్ళకి మిమ్మల్నే అంటిపెట్టుకుని తిరుగుతున్నట్లుగా ఈ వయసులో కూడా మిమ్మల్ని ఇంకా కొంగున ఉంచేసుకుంటున్నట్లుగా అనిపిస్తోంది. ఇందులో నా తప్పేమిటో నేను చేస్తున్న కాని పనేమిటో అర్థం కావటం లేదు. ఒకవేళ తప్పయినా ఇది వద్దని మాత్రం చెప్పకండి." బావురుమందావిడ.

"పిచ్చిదానా! మనిద్దరం ఒకరికొకరం కాక ఎట్లా ఉంటాం. కానీ మన ప్రేమను మన సంతానంలోనూ మనవలు మనవరాళ్ళలోనూ చూసుకోవాలి. పిల్లల దృష్టిలో చులకన కాకూడదు. ప్రతి చిన్న పనికీ నువ్వు నాకోసం శ్రమ పడకు.. తెలిసిందా!? కొన్ని లేకపోయినా సర్దుకుపోగలను. మనకు ఈ వయసులో కావలసింది మనశ్శాంతి, దానికి అవసరమైన శారీరక విశ్రాంతి. కానీ ఒకటి మాత్రం స్పష్టంగా చెప్పగలను. నువ్వు నా కళ్ళ ఎదురుగా ఉంటేనే నాకు తృప్తి, మనశ్శాంతి. మన చివరి రోజులు ప్రశాంతంగా ఇలాగే గడిపేద్దాం సరేనా." అంటూ భార్యను దగ్గరకు తీసుకున్నాడాయన.

సిగ్గు పడుతూనే భర్తకు చేరువయ్యింది రుక్మిణమ్మ.

తన గురించి ఎవరేమనుకున్నా పట్టించుకోకూడదని ఆ క్షణం లోనే నిశ్చయించుకుంది.

## మనసుకు మరో రూపం

దేగల అనితాసూరి

**కొందర్ని చూస్తే పెట్ట** బుద్ధేస్తుంది, కొందర్ని చూస్తే మొట్టబుద్దేస్తుంది అంటారు. అలాగే చూడగానే ఒక మనిషినైజమేంటో ఇట్టే పసిగట్టేయడంలో ముఖం మనసుకు అద్దంలాంటిదని బలంగా నమ్ముతుంది సుమలత. అలా చాలా విషయాల్లో ఆమె అంచనాలు నిజమయ్యాయి కూడా.

"అయ్యబాబోయ్! అప్పుడే పదింబావు అవుతోందా?" కంగారుగా రిస్ట్‌వాచ్‌కేసి చూసుకుని ఆఫీసుకు టైమైపోతుండటంతో గబగబా తలుపుకు తాళం పెట్టి వడివడిగా వీధిలోకి అడుగులు వేయసాగింది సుమలత.

బస్టాండు చేరుకోడానికి మరో పదినిమిషాలైనా అయ్యేలా ఉంది. ఇవాల్టికి ఆటో ఎక్కక తప్పేలా లేదు అనుకుంటూ చుట్టూ చూస్తూ పరికించింది.

వీధి మలుపు దగ్గర 'అదే ఆటో..!' తనకెప్పుడు అవసరమై వెదికినా సిద్ధంగా ఉండే ఆటో ఉంది. అయినా తను ఎక్కడానికి ఎప్పుడూ పొరపాటున కూడా ఇష్టపడని ఆ ఆటో కనిపించగానే, అసలే టెన్షన్‌గా ఉందేమో ఆ పైన తనకస్సలు నచ్చని ఆటోను చూస్తూనే, చిరాకేసి పరుగులాంటి నడకతో తనవైపు ఆశగా ఎక్కుతుందేమోనని చూస్తున్న ఆ ఆటోవాడిని పట్టించుకోకుండా, చరచరా ముందున్న మరో నాలుగైదు ఆటోల్ని దాటి వెళ్ళి పాతిక రూపాయల దూరానికి యాభైరూపాయలన్నా కిమ్మనకుండా ఎక్కి కూర్చుంది సుమలత.

''సుమలతగారూ.. ఆలస్యమైనట్టుందే?'' అంటూ పలకరించాడు కొలీగ్ ప్రసాద్.

''లేదు..లేదు.. ఆఖరి నిమిషంలో రిజిష్టర్ అందుకున్నాలెండి'' హ్యాండ్ బ్యాగ్ తన ముందున్న టేబుల్ మీద ఉంచి క్యారియర్ బ్యాగ్‌లోంచి మంచినీళ్ళ బాటిల్ తీసుకుంటూ చెప్పింది సుమలత.

''ఐతే.. ఇవ్వాళ కూడా ఆటోనా?'' నేను కరెక్టేకదా? అన్నట్టు చూసింది ప్రక్క సెక్షన్ రమ.

''అవునండీ.. మన అవసరాన్ని గమనించి ఆటోవాళ్ళు చెలరేగిపోతారు తెలుసా?'' కంప్యూటర్‌లోకి కళ్ళుసారిస్తూ ఉడుక్కుంది సుమలత.

''ఎంత గుంజాడేంటి? వాడిమీద అంత గుర్రుగా ఉన్నారు?'' అడిగాడు ప్రసాద్.

''ముప్పయ్ రూపాయలు కూడా కాదు. కానీ.. యాభై తీసుకున్నాడు''

''సర్లెండి మరి పెట్రోల్ ధరలు కొండవీటి చేంతాడులా పెరిగిపోతుంటే వాళ్ళు మాత్రం ఏం చేస్తారు?'' ఆటోవాలా వైపు వకాల్తా పుచ్చుకున్నట్టు చెప్పి నవ్వింది ఎదురు సీటు జ్యోతి.

''అబ్బో.. చాలా ఉదారత్వం ఉందే తనది కాకుంటే కాశీదాకా దేకమన్నాడుట వెనకటికెవడో'' వెక్కిరించి అంది సుమలత.

ఇంతలో ''మేడం... సార్ పిలుస్తున్నారు'' అంటూ వచ్చాడు అటెండర్ సుందరం.

''ఎవర్ని నమ్మాలో.. ఎవర్ని నమ్మకూడదో తెలీకుండా పోతోంది ఈ రోజుల్లో'' పేపర్లోంచి తలెత్తి సుమలత అందించిన కాఫీ కప్పు అందుకుంటూ అన్నాడు విజయ్.

''ప్రతిరోజూ పత్రికలూ, టి.వి.లు అదే విషయాన్ని కోడై కూస్తున్నా ఈ జనానికి అర్థం కాదేంటో'' తనూ ప్రక్క ఛైర్‌లో కూర్చుని మరో పేపర్ అందుకుంటూ అంది సుమలత.

''అదేంటి సుమా.. అలా అంటావ్? జనాలకేం తెలుస్తుంది వాడేలాంటివాడో మోసపోయేదాకా'' అన్నాడు విజయ్ ఖాళీకప్పు టీపాయ్ మీద పెడ్తూ.

''మొన్నామధ్య టి.విలో చూపించారు. అర్థరాత్రి ఆటో ఎక్కిన ఓ అమ్మాయిని అత్యాచారం చేసి, చంపేసిన ముగ్గురు ఆటోవాళ్ళని. మొహాలు చూస్తేనే తెలుస్తోంది ఆ వెధవలు ఎలాంటి వాళ్ళో. అసలు ఈ ఆడవాళ్ళకు బుద్ధిలేదు. అలాంటి వాళ్ళని నమ్మి ఎలా ఆటో ఎక్కుతారో అసలు'' ఇద్దరి ఖాళీ కప్పులు తీసుకుని పైకి లేస్తూ అంది.

"మరి నమ్మిన వాళ్ళనే కదా మోసం చేయడానికి సులభం అయ్యేది." అప్పుడే తలస్నానం ముగించి వచ్చిన రేవంత్ అన్నాడు టవల్‌తో తలరుద్దుకుంటూ.

"కూర్చోండి... మీకూ కాఫీ తెస్తాను" చెప్పేసి కిచెన్ వైపు నడిచింది సుమలత.

"రారా.. మా పెళ్ళైన సంవత్సరానికి వచ్చావ్. ఎన్నిసార్లు ఈ మధ్యలో ఆఫీస్ పనిగా హైదరాబాద్ వచ్చావో. ఇప్పటికైనా నేనిక్కడ ఉన్నట్టు గుర్తొచ్చినందుకు సంతోషం" ప్రేమగా మాట్లాడ్తూనే నిష్ఠూరపోయాడు విజయ్ బాల్యస్నేహితుడు రేవంత్‌తో.

"అదేం కాదులేరా.. మీరు క్రొత్తగా పెళ్ళైనవాళ్ళు. మీ మధ్య పానకంలో పుడకలా నేనెందుకనే గాని.. మరేం కాదురా" చెప్పాడు రేవంత్.

"ఇంకా ఏం క్రొత్తలేగానీ... ఇంతకీ నువ్వెప్పుడు పెళ్ళిపీటలు ఎక్కబోతున్నావ్?" ఆరాగా అడిగాడు విజయ్.

"మరికొంతకాలం నన్నిలా స్వేచ్ఛగా ఉండనీరా బాబు.." అంటూ నవ్వుతూ కబుర్లతో ముగ్గురూ కలిసి టిఫిన్లు ముగించి ఆఫీసులకు బయలుదేరారు.

"సుమా నేనో ముఖ్యమైన ఆఫీసు పనిగా బెంగుళూరు వెళ్ళాలి రేపు. రాత్రికి సూట్‌కేస్ సర్దవోయ్" అంటూ వచ్చాడు విజయ్ ఆఫీస్ నుంచి వచ్చీరాగానే.

"నేనూ ఓ గవర్నమెంట్ ఆఫీసులో ఉద్యోగస్తుడిని చేసుకుంటే బాగుండేది. హాయిగా నా ఫ్రెండ్ రమలా ఇద్దరూ పదింటికి ఇంటి నుంచీ బయలుదేరి సాయంత్రం ఆరింటికల్లా ఇల్లు చేరొచ్చు. మీ ప్రైవేట్ జాబేమోగానీ నెలకో వారం రోజులు ఊళ్ళు పట్టుకు తిరుగుతారు. నేనేమో చుట్టు పక్కల ఇంకా డెవలప్ కాని ఈ రెండుమూడు ఇళ్ళ మధ్య బితుకు బితుకుమంటూ ఉండాలాయె. నావల్లకాదు" బుంగమూతి పెట్టింది సుమలత.

"నేనూ అదే అనుకుంటున్నా. నా ప్రక్కసీటు లావణ్యను చేసుకుంటే ఎంచక్కా ఇద్దరం ఆఫీసు తరపునే ఊళ్ళు తిరుగుతూ ప్రతీనెలా హానీమూనే చేసుకునేవాళ్ళం కదా అని. పోనీ.. ఈసారి అలా కుదుర్తుందేమో చూద్దామా?" కొంటెగా ఉడికిస్తూ అన్నాడు విజయ్.

"మీకంతా వేళాకోళమే. బయటకెళ్ళి చూడండి. ప్రతిరోజూ న్యూస్‌లో ఎన్ని దొంగతనాలు, ఆగడాలు జరుగుతున్నాయో" చపాతీల పిండి కలుపుతూ అంది.

"ఈసారి నీకేమీ భయంలేదు. ఒక్కరోజేపని. రేపు సాయంత్రం వెళ్ళటం. మళ్ళీ ఎల్లుండి సాయంత్రం బయలుదేరి వచ్చేస్తా" చెప్పాడు విజయ్.

"ఐతే.. రమకు ఫోన్ చేసి రేపు లీవని చెప్పేస్తా. ఇద్దరం వెళ్దాం బెంగుళూరు" ఆశగా అంది సుమలత.

"రేపు రాత్రి ఎనిమిదింటికి రేవంత్ కూడా విజయవాడకు బయలుదేరతాడు. ఇద్దరం వెళ్ళిపోతే ఏం బాగుంటుంది?" అన్నాడు విజయ్.

"అవును కదూ.. పోనీ అతనికో తాళం చెవి ఇచ్చేసి వెళ్ళిపోదాం. ఇంకో రెండుమూడు రోజులుండి, మా కజిన్ వాళ్ళింటికి కూడా వెళ్ళిరావచ్చు" సంబరపడిపోతూ అడిగింది సుమలత.

"నువ్వుండవే బాబూ.. వాడ్ని చూశావా. ఆ మాట చెప్పామంటే ఇప్పుడే తెగ ఫీలైపోయి, మనల్ని ఇబ్బంది పెట్టేశాడనన్న బాధతో రాత్రికే వెళ్ళి ఏ హోటల్ రూమో చూసుకుంటాడు" అన్నాడు విజయ్.

రేవంత్ తెల్లగా పొడవుగా హిందీ సినిమా హీరోలా ఉంటాడు. వయసులో విజయ్ కన్నా ఏడాది పెద్దయినా రెండేళ్ళు చిన్నవాడిలా కనిపిస్తాడు. మాన్లీనెస్‌కన్నా ఎక్కువగా బేబీ ఫేస్‌లా అనిపిస్తాడు, అమీర్‌ఖాన్ చిన్నతనంలో ఉన్నట్టు. మొహమాటం, అమాయకత్వం కలగలిసినట్టుంటుంది ముఖం. మనసులోనే గుర్తుచేసుకుని "అవును పాపం" అనుకుంది సుమలత.

"సుమగారూ కూకట్‌పల్లిలో ఉన్న మా తమ్ముడి కూతురి బర్త్‌డే ఇవాళ. సాయంత్రం వెళ్తున్నా. మీరూ రాకూడదు. మా తమ్ముడు, మరదలు మిమ్మల్ని తీసుకుని రమ్మని మరీ మరీ చెప్పారు" అంది ఎదురింటి శారద.

"లేదండీ. ఇవాళ మావారు, ఆయన ఫ్రెండ్ ఊరికి బయలుదేరతారు. ఇంకోసారి వస్తాను. అవునుగానీ మీ పిల్లల్ని స్కూలుకి పంపడానికి ఏ ఆటో మాట్లాడుకున్నారు? నిన్న చూశాన్నేను. జాగ్రత్తండీ బాబూ" అంటూ ఆమెను భయపెట్టేసింది.

"ఎందుకండీ... ఆ ఆటోవాడు మంచివాడు కాదా? మీకు ముందే తెలుసా?" గాభరా పడిపోతూ అడిగింది శారద.

"భలేవాళ్ళేనండీ మీరు. అతనెలాంటి వాడో వాడి వాలకం చూస్తే ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. నల్లగా తుమ్మమొద్దులా ఎలా ఉన్నాడో. ఆ గిరజాల జుట్టూ.. బుగ్గమీద పెద్దగాటు. పాన్లు నమిలి గారకట్టిన పళ్ళు... మెడలో గళ్ళ కర్చీఫు. చేతికి అన్నేసి రంగుల దారాలు. వాడ్ని చూడగానే ఈ వీధికే పెద్ద రౌడీ అని ఇట్టే తెలిసిపోతుంటే మళ్ళీ నన్నే అడుగుతారా?" ఇదెక్కడి చోద్యం అన్నట్టు అంది సుమలత.

"అవునండోయ్ మావారికి చెప్పి రేపట్నుండీ మాన్పించేస్తా"

"మేమీ ఇంటికొచ్చి పదినెలలైంది. ఎంత అవసరం వచ్చినా సరే పదిరూపాయలు ఎక్కువైనా ఫర్లేదు. ఆ ఆటో తప్ప వేరే ఏదైనా మాట్లాడుకుంటానంటే నమ్మండి."

"మంచి విషయం చెప్పారు. రేపు మేము ఉదయాన్నే వచ్చేస్తాం. కాస్త ఇల్లు కనిపెట్టుకోరూ.. ఇకపై నేనూ ఇలాంటివి కనిపెట్టుకుంటాను ఇక మరి మేమీ ఏరియాకి వచ్చి రెండునెలలేగా అయ్యింది. మీ సలహా తప్పక పాటిస్తా" చెప్పేసి బాల్కనీలో ఆరిన బట్టలు లాక్కుని ఇంట్లోకి వెళ్ళింది శారద.

"అన్నీ అరటిపండు వలిచి నోట్లో పెట్టినట్టు చెప్తేగానీ తెలీని అమాయకుల్లా ఎలా ఉంటారో ఈ జనాలు" నిట్టూర్చి లోపలికొచ్చింది సుమలత.

"ఓ.కె. సుమా... బై.. జాగ్రత్త మరి. ఎల్లుండి ఉదయానికల్లా నీ ముందుంటాగా" అంటూ ఆఫీస్ కార్లో బయలుదేరి వెళ్ళాడు విజయ్.

"ఈ రేవంత్ గారేంటి. ఎనిమిదింటికే బస్సుకెళ్తాడని ఆయన అన్నారు. రాత్రి పది అయినా జాడలేదు. కొంపదీసి ఇంటికి రాకుండా అట్నుంచటే వెళ్ళిపోయారో ఏంటో" అనుకుంటూ అలాగే నిద్రలోకి జారుకుంది సుమలత.

ఉన్నట్టుండి మెలుకువ వచ్చి చూస్తే బయట జోరుగా వర్షం కురుస్తోంది. ఏదో ఆటో వచ్చి ఆగిన అలికిడికి గుమ్మంలో కెళ్ళి చూసింది. తానెప్పుడూ భయపడిచచ్చే ఆటోలోంచే దిగుతున్నాడు రేవంత్. సగం పైగా తడిచిపోయి ఉన్నాడు.

ఆటో వాడికి డబ్బులిచ్చి లోపలికి రావటం చూసి కిచెన్ వైపు అడుగు వేసేసరికి కరెంటు పోయింది. ఎమర్జెన్సీ లైటు వెలుగులో షూలు కూడా విప్పకుండా తూలుతూ వచ్చిన రేవంత్‌ని ఆశ్చర్యంగా చూస్తూ" భోంచేశారా? టిఫినేమైనా చెయ్యనా?" అంటూ నాలుగడుగుల దూరానికి వచ్చేసరికే ఘాటైన మందువాసన గుప్పున ముక్కుపుటల్ని తాకడంతో "ఇతను డ్రింక్ చేస్తాడా?" నమ్మశక్యం కానట్టు నిశ్చేష్టురాలైంది.

"మీ పరిస్థితేం బాగున్నట్టులేదు. వెళ్ళిపడుకోండి. ఉదయాన్నే మాట్లాడుకోవచ్చు" అనేసి చిరాగ్గా ముఖం పెట్టి తన గదివైపు వెళ్ళబోతుంటే చటుక్కున ఆమె చేతిని పడిసి పట్టుకున్నాడు రేవంత్.

ఆ తక్కువ వెలుతురులో సైతం అమాయకత్వం ఉట్టిపడే అతని ముఖంలో పశువాంఛ కొట్టొచ్చినట్టు కనిపించింది. ఆ చేతిని లాగి విసిరికొట్టి బయటకెళ్ళి గట్టిగా కేకలేసింది. ఆ వర్షం శబ్దంలో ఆమె గొంతు కలిసిపోయింది. పెద్ద పెద్ద అంగల్తో అతను సమీపిస్తుంటే వీధిలోకి ఉరికింది.

ఎలా వెళ్ళాలో దిక్కుతోచక నిర్మానుష్యమైన వీధిలో పరుగెడ్తూ కన్నీళ్ళతో వర్షపు నీళ్ళు చేరి అడ్డొస్తుంటే చూపు మసకబారి వీధి మలుపును చేరుకుంది. పెనం మీంచి పొయ్యిలోకి జారినట్టు ఆటోలో కూర్చుని సిగరెట్ కాల్చుకుంటున్న ఆ రౌడీలాంటి మొరటైన ఆటోవాడు తనకేసి తల్లతిప్పి చూశాడు. సుమలతకు పై ప్రాణాలు పైనే పోయాయి.

ముందు చూస్తే నుయ్యి వెనుక చూస్తే గొయ్యి అంటే తెలిసొచ్చింది. ఎటూ కదలకుండా మ్రాన్పడిపోయింది సుమలత.

ఇంతలో రకరకాల దారాలతో నిండిన ఆటోవాడి చెయ్యి తనవైపు చురుగ్గా కదలటం చూసి తప్పుకోబోయి క్రింది పడిపోయింది. అప్పుడు గమనించింది అతను చెయ్యి చాపింది తన వెనకొచ్చిన రేవంత్ దవడ పగలగొట్టడానికని.

నాలుగైదు పిడిగుద్దులు తిన్నాక మత్తు వదిలిపోయి బ్రతుకు జీవుడా అనుకుంటూ వర్షంలోనే పరుగెడ్తూ పారిపోయాడు రేవంత్.

"ఏమీ అనుకోకమ్మా. ఆడు మీ ఇంటికొచ్చిన సుట్టమని తెల్సుగానీ, ఇందాక అయ్య సూటుకేసట్టుకుని ఊరెళ్ళినట్టనిపించె, ఈడేమో తాగి నా ఆటోలోనే వచ్చిండు. నాకెందుకో మంచిగనిపియ్యలే. చూడనీకి హీరోలా ఉన్నా ఈ కాలం సదుంకున్నా బుద్దీ గ్యానం లేదమ్మా ఎదవలకి. పొద్దున లెగిస్తే పేపరోళ్ళు ఇట్టాంటోళ్ళ గురించే రాస్తారు. జరంత జాగర్తగుండాల. ఇంకేం భయ్యం లేదు. నా బిడ్డలాంటిదానివనే ఇంటికి పోబుద్దికాక ఈడ్నేవుంటి. ఇంటికెళ్ళి పడుకోమ్మా" అంటుంటే ఎలా వచ్చి ఇల్లు చేరిందో అర్థంకాలేదు సుమలతకు.

ఉదయాన్నే విజయ్ ఊర్నుంచీ వచ్చాడు. కబుర్లతో మునిగి టిఫిను, వంట ముగించేసరికి ఎప్పట్లాగే లేటైపోయింది. విజయ్ వెళ్ళాల్సిన ఆఫీసు సుమలత ఆఫీసుకి సరిగ్గా ఆపోజిట్ దారి కావడంతో ఆమెను డ్రాప్ చేయడం కుదరదు. అలవాటుగా ఇంటికి తాళం పెట్టి వీధి మలుపులోకొచ్చింది. ఖాళీ ఆటోలు ఆమె ముందు ఆపి "ఆటోకావాలా?" అన్నట్టు చూస్తుంటే వద్దన్నట్టు తలాడించి "ఫలానా ఆఫీసుదాకా వస్తావా?" అని అడిగిన సుమలతను చూస్తూనే సిగరెట్ పక్కకు పడేసి ఆటో స్టార్ట్ చేశాడు ఆమె దృష్టిలో ఇన్నాళ్ళూ రౌడీలా కనిపించి జడిపించినా మనసులోని మరో రూపంతో హీరోలా ఎదిగిన ఆ గిరజాల జుట్టు ఆటోవాలా.

నిన్ననే తనకన్ని నీతులు చెప్పి, ఇప్పుడు అదే ఆటోలో వెళ్తున్న సుమలతను అర్థంకాక చూసింది అప్పుడే కూరగాయలు కొనుక్కుని వస్తూ ఆటోకు ఎదురుపడిన శారద.

# పెద్దమనుషులూ - పూర్వీకులూ

మూలా రవికుమార్, జొన్నాడ వంశీకృష్ణ

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

ఉదయాన్నే మురళి ఫోన్ చేసాడు "మరో పావుగంటలో రూంలో ఉంటాను, గీజర్ ఆన్ చెయ్యి".

మురళీ నేనూ, డిగ్రీ నుంచీ క్లాసుమేట్లం. డిగ్రీ తర్వాత ఇద్దరం వేర్వేరు చోట్ల తిరిగి, ఐదేళ్ళ విరామం తర్వాత హైదరాబాదులో పడ్డాం. ఇద్దరం కలిసి ఒక రూం తీసుకున్నాం. ఇప్పుడిప్పుడే మమ్మలిని మా కుటుంబాలు పెళ్ళికి అర్హులుగా గుర్తిస్తున్నాయి. ఏడాదిలో ఈ రూం ఖాళీ చేయాలన్న ఆరాటంలో ఉన్నాం. ఎవరైనా ఒకరం మా ఊరు వెళ్ళి తిరిగి వస్తే, రైల్వే స్టేషన్ లో దిగ్గానే ఫోన్ చేస్తే, రూం లో ఉన్నవాళ్ళం గీజర్ ఆన్ చెయ్యటం, కాఫీ పెట్టటం లాంటివి చేస్తాం.

ఫోన్ పెట్టేసి గీజర్ ఆన్ చేసేలోపల కరెంటు పోయింది. సరే అనుకొని కాఫీ పెట్టాను. కప్పుల్లో పోసేసరికి వాడొచ్చాడు. కాఫీ తాగుతూ అడిగాను, "మీ ఇంట్లో నీపెళ్ళి విషయం ఎంతవరకూ వచ్చింది?"

వాడు బావురుమనలేదు గానీ, నిశ్శబ్దంగా బావురుమంటే పెట్టాల్సిన ముఖ కవళికలు పెట్టాడు.

"ఏమైంది?"

"మా పెదనాన్న తెలుసు కదా?" కొంచెం ఆగాడు.

మురళివాళ్ళ నాన్నగారు విశాఖా స్టీలుప్లాంటులో ఇంజనీరుగా రిటైరయ్యి ఏడాది దాటింది.. ఆయనకో అన్నయ్య ఉన్నారని తెలుసు. మనసు కొంచెం కీడు శంకించినా బయటికి ఏమీ అనకుండా, "ఆయనగురించి వివరాలు నువ్వెప్పుడూ చెప్పలేదురా" అన్నాను.

"మా పెదనాన్న మానాన్నగారికంటే ఐదేళ్ళే పెద్ద. కానీ నాన్నగారిని ఇప్పటికీ చిన్నపిల్లాడిలా ట్రీట్ చేస్తారు. ఇప్పుడు అరవై ఐదు దాటారు. తన కొడుకుల పెళ్ళిలో ఆడపెళ్ళివారిని హడలెత్తించారు. తన తమ్ముడి పెద్దకొడుకు, అంటే మా అన్నయ్య పెళ్ళిలో, మాకెవరికీ మగపెళ్ళివారిమన్న ఆనందం మిగలనీయలేదు" అన్నాడు.

"ఇప్పుడు మీ పెదనాన్నగారు నిన్ను తిట్టారా, ఏదైనా సమ్మందం చెడగొట్టేరా?" వాళ్ళ పెదనాన్నగారు క్షేమంగా ఉన్నారో లేదో తెలుసుకోవాలంటే ఇలాగే అడగాలి.

"లేదు, ఆయనకి మా ఊరివాళ్ళమీద విరక్తి వచ్చింది."

"మీ ఊరివాళ్లమీద ఆయనకి విరక్తి వస్తే నువ్వెందుకు బాధ పడటం?"

"ఊరివాళ్ళంతా ఆయన్ని చూసి నవ్వుకుంటున్నారు"

"ఐనా నువ్వు బాధ పడక్కర్లేదు కదా!! అదీకాక, మీనాన్నగారు కూడా ఆఊరొదిలి ముప్పయ్యేళ్ళు పైనే అయింది కదా?"

“మామూలుగా ఐతే అక్కర్లేదు. నిన్న పెళ్ళిచూపులికి వచ్చిన అమ్మాయీ వాళ్ళ నాన్నగారు మాఊళ్ళోనే టీచరుగా చేస్తున్నారు. అమ్మాయితో విడిగా మాట్లాడుతున్నప్పుడు, మామాటల్లో పెదనాన్నగారి పేరు దొర్లగానే ఆ అమ్మాయే మొహమాటం, సిగ్గూ అన్నీ వదిలేసి బళ్ళున నవ్వింది. ఆపుకొనే ప్రయత్నంలో నవ్వుపెరిగిందే గానీ తగ్గలేదు. అంతవరకూ బయట హాల్లో, మా మాటలు వినబడనంత దూరంలో ఉన్న మా పెద్దవాళ్ళు, నేనేదో అమ్మాయికి కితకితలు పెట్టాననుకొని, కంగారుగా మా రూంలోనికొచ్చేరు.”

“ఇంతకీ సంబంధం కుదిరిందా?”

“కుదిరింది. గానీ, అందరూ మా పెళ్ళిచూపుల తతంగాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకొని నవ్వుకుంటున్నారు.”

“అదిసరే. పెళ్ళిచూపులకొచ్చిన అమ్మాయి, అంతలా ఎందుకు నవ్వినట్టు?”

వాడు హుం అని నిట్టుర్చి, ఎఫెక్టు కోసం ఆగి అన్నాడు. “మా పెదనాన్నగారిపేరు రాఘవరావు గారు. మా ఊళ్ళో మొదటి ఇంజనీరు.” అంటూ ఫ్లేష్‌బేకులోకెళ్ళేడు.

రాఘవరావుగారు నీటిపారుదల శాఖలో సూపరింటెంట్ ఇంజనీరుగా చేసి రిటైరయ్యారు. హైదరాబాదులో స్థిరపడ్డారు. ఆయన ఇరవయ్యో ఏట వదిలేసిన ఊరిని రిటైరయ్యాకనే పరిశీలించే అవకాశం వచ్చింది. ఊరికోసం ఏమైనా చేద్దామన్న తపన ఉంది. తను చిన్నప్పుడు ఉన్న మండువాఇంట్లో రెండుగదులిని నివాస యోగ్యంగా మార్పించుకొని, తను ఊళ్ళో ఉన్నన్నాళ్ళూ భోజనాదులను ఊళ్ళో ఉన్న టీ కొట్లో ఏర్పాటు చేసుకున్నారు. మొదటి సమస్య తాగునీటి సమస్య. పదేళ్ళక్రితం ఊళ్ళో ఒక చివరన నీళ్ళటేంకు కట్టరు. దాని దిగువనే ఉన్న కొళాయిల్లో నీళ్ళు పట్టుకొని ఊరంతా తెచ్చుకొనేవారు. అప్పుడు సర్పంచుతో మాట్లాడితే, నిధుల కేటాయింపు చేసే సంస్థకీ, ప్రభుత్వ గ్రామీణ నీటిసరఫరా విభాగం వారికీ సమన్వయం లేదని అర్థం అయ్యింది. ఒకరు వచ్చినపుడు రెండోవారు రాక, ఎవరు రావాలనుకున్నా రెండోవారికి చెప్పటం నాబాధ్యతకాదు, తెలుసుకొని నాతోపాటు రావటం వాళ్ళ బాధ్యతేఅన్న నమ్మకాల వల్ల మూడేళ్ళగా కాలయాపన జరుగుతోంది. మొత్తమ్మీద ఈయన రెణ్ణెల్లు ఆఊళ్ళొనే ఉండి టెండర్లు పిలిచేదశ వచ్చేసరికి ఈయనకి అమెరికా వెళ్ళవలసిన పని పడింది. వెళుతూ వెళుతూ సర్పంచుగారికి వెయ్యి అప్పగింతలు పెట్టి, చాలా బెంగతో వెళ్ళారు. అక్కడ కొత్తగా పుట్టిన మనవణ్ణి చూడగానే అన్నీ మరిచిపోయి, మూణ్ణెల్ల తరవాత హైదరాబాదు వచ్చిన వారం గడిచేకా స్వగ్రామానికి వచ్చారు. అప్పటికి పైపులైనులు వేయటం పూర్తయి, వీధికో ఉమ్మడి కొళాయి, డబ్బుకట్టినవారి ఇంటిక్కూడ ఒక్కో కొళాయి పనిచేస్తోంది కూడా.

“ఐతే ఆయనకు వాళ్ళూర్లో ఘనస్వాగతం లభించి ఉండాలే” నేనన్నాను.

మేమూ అలాగే అనుకున్నాం. కానీ జరిగింది వేరే. ఆయన అమెరికా పర్యటన తరువాత మొదటిసారి ఊళ్ళొకి వెళ్ళి వచ్చాకా, మనాన్నగారిని కలిసినప్పుడు “ఇది పాడు లోకంరా చిన్నోడా అన్నారు”

“ఆవిషయం ఆయనకు అరవయ్యో ఏట తెలిసిందా?” అన్నాను నేను.

జరిగిందేమిటంటే, ఈయన మొదటిసారి ఊరికి త్రాగునీటి సమస్యగురించి పట్టించుకున్నప్పుడు, అప్పటి వరకూ ఏం చెయ్యాలో తెలీని సర్పంచ్ చాలా సంతోషించాడు. మొదటినెల పూర్తయి, రెండొనెలలో అంచనాలు తయారీలో గ్రామీణ నీటిసరఫరా ఇంజనీర్లని ఈయన లిబరల్‌గా ఉండనీయలేదట. ఈయన అదే సబ్జెక్టులో రిటైరవటం వల్ల, ఈయన్ని తోసిపడెయ్యలేక వాళ్ళు పదిలక్షలు అనుకున్న పనికి ఎనిమిది లక్షలే అంచనాలు వేసి వెళ్ళేరట. ఈయన అమెరికావెళ్ళేకా టెండరు వేసే వాళ్ళు, పనీ, అంచనా విలువ చూసీ, పెదవి విరిచేరట. అప్పుడు ఎమ్మెల్యే కలుగజేసుకొని, పూర్తిపనికి టెండరు వేసి, పని ముప్పాతిక వంతు  పూర్తయ్యాకా ఆపెయ్యమనీ, తర్వాత పైపులైనులు

తవ్వకంలో రాళ్ళు తగిలి, కూలీల ఖర్చు పెరిగినట్లు రాయించి మొత్తం నిధులు విడుదలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చి, రాఘవరావుగారు అమెరికా వచ్చేలోగా పనిపూర్తవటం, ఎమ్మెల్యేగారి హామీ నెరవేరటం జరిగాయి. ఫలితంగా ఊళ్ళో మూడొంతులమందికి నీళ్ళొచ్చాయి. రెండువీధుల వాళ్ళు మాత్రం ప్రక్కవీధినుంచి తీసుకెళుతున్నారు. నీళ్ళురాని వీధులవాళ్ళు కూడా రాఘవరావుగారు కలుగజేసుకోముందుతో పోలిస్తే హాయిగా ఉన్నట్లే లెక్క. నీళ్ళకోసం వాళ్ళు నడవాల్సినదూరం పావువంతుకి తగ్గింది. ఇదివరకు ఒకబిందెకి పడ్డశ్రమతో ఇప్పుడు నాలుగుబిందెలు తెచ్చుకోవచ్చు.

"మరి ఆయనకు ఘనస్వాగతం లభించకపోవటానికి కారణమేంటీ?"

"నీటిసరఫరా ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేగారు ఉపన్యసిస్తూ, ఈ నీటిసరఫరా వెనుక తానెంత శ్రమపడిందీ వివరిస్తూ, కొందరు వ్యక్తులు అతిగా కలుగజేసుకోవటం వల్ల రెండువీధుల వారికి నీటిసరఫరా కార్యక్రమం పూర్తికానందుకు చింతిస్తున్నాననీ చెప్పేడట. ఆ రాత్రి సర్పంచుగారింట్లో జరిగిన మందుపార్టీలో, అతిగా వాగిన సర్పంచు, అందరికమీషన్లూ పోనూ కంట్రాక్టరు అంతకంటే చేయలేకపోయేడనీ, రాగవరావు (మందు మత్తులో రాఘవ అలాగేపలికింది) సేదత్తం (చాదస్తం) వల్ల పదిలచ్చలపనికి ఎనిమిదిలచ్చలే సేంచను అయ్యేయి." అన్నాడట.

వెంటనే సర్పంచుగారి వందిమాగధులు "అయ్యో పెద్దాయన రిటైరయ్యాకా హైదరాబాదులో ఉండక ఈ ఊరొచ్చి రెండువీధుల ప్రజల ఉసురు పోసుకున్నాడు" అన్నారు. రాఘవరావుగారి పేరు ప్రస్తావించకుండానే. నిజానికా వందిమాగదులంతా, మూణ్ణెల్లక్రిందటివరకూ రాఘవరావుగారి ప్రయత్నాలను అపహాస్యం చేసినవారే "ఎగేసుకుంటూ ఐదరాబాదునించొచ్చీసేడు. మన సరపంచుకే సేతగానిది ఏదో పొడిచెద్దామని"

"ఇందులో రాఘవరావుగారి నీతినీ, కమీషన్లు తీసుకున్నవారి అవినీతినీ ఎవరూ గుర్తించలేదా?"

"కమీషన్లు సహజమైనవి. అందులో తప్పులేదు. కమీషను డబ్బులు ఈయన కోయించెస్తే, పనిలో కోతపడదా? ఏళ్ళురాగానే సరికాదు, చదువుకోగానే సరికాదు. ఎవరి పని వాళ్ళని చేసుకోనివ్వాలి." వందిమాగదుల ఉద్దేశ్యం.

తరువాత జరిగిన పంచాయితీ బోర్డుమీటింగులో నీళ్ళురాని వార్డు మెంబరు (అతను సర్పంచుకి ప్రతిపక్షి) తనప్రజలకు జరుతున్న అన్యాయం మీద బల్లగుద్దుతూ ఉంటే, సర్పంచుకూడా, లేచి నుంచొని, "విద్యావంతులూ, పెద్దలూ నన్ను తప్పుదారి పట్టించటంవల్లే ఈ అన్యాయం జరిగింద"ని చెప్పి, అందుకు ఆ వార్డు ప్రజలకు క్షమాపణ చెప్పాడు. వందిమాగదులంతా, తప్పులేకపోయినా క్షమాపణ చెప్పిన సర్పంచుగారి నైతికవిలువలను కొనియాడుతుంటే, ప్రతిపక్షి మాత్రం సర్పంచుని నైతికబాధ్యత వహించేలా మెడలు వంచింది తానేననీ తనగొప్ప చెప్పుకున్నాడు. ఆ సమావేశంలో పేరుప్రస్తావించకపోయినా ఏ తీర్మానం ప్రవేశపెట్టకపోయినా పక్షులూ, ప్రతిపక్షులూ ఏకగ్రీవంగా రాఘవరావుగారిని అభిసంశించినట్టే లెక్క.

ఇవేవీ తెలీని రాఘవరావుగారు అమెరికానుంచొచ్చి, గర్వంగా వీధికొళాయిదగ్గిరికెళితే, పొరుగు వీధిలోవాళ్ళు ఈయన్ని చూసిన చూపు చూస్తే ఈయనకప్పుడెప్పుడో ఎర్రసినిమాలో భూస్వామిని నక్సలైటు చూసిన చూపు గుర్తొచ్చిందట. "ఏమ్మా బావున్నావా?" అని నీళ్ళు మోసుకెళుతున్న ఒకమ్మాయిని ఈయన ఆప్యాయంగా పలకరిస్తే "ఇప్పుడు మీకళ్ళు చల్లబడ్డాయా?" అని రుస రుసా వెళ్ళిపోయిందట. ఈయన పంచాయితీ ఆఫీసుకెళితే అక్కడ సర్పంచుగారు మర్యాదకు లోటులేకుండా పలకరించి "పదిలక్షలు సేంక్షను అయ్యే అవకాశం చేజేతులారా వొదులుకున్నామండీ. వాళ్ళు సగం వీధులు చేసి చేతులెత్తేస్తే నేను వాళ్ళని బతిమాలీ, బెదిరించీ మరో రెండు వీధులు వేయించేను" అన్నాడు.

వందిమాగదులు ఈయన్నేమీ నేరుగా అనలేదు గానీ, వారి మాటలు విన్న ఒక గోచీధారి "ఐతే సర్పంచుగారు గట్టిగా నిలబడకపోతే మావీధిక్కూడా నీళ్ళొచ్చీవికాదా!!??" అని ఆగి, రాఘవరావుగారివేపు తిరిగి చేతులు జోడించి "దరమప్రెభువులు మా పున్నెం కూడా కట్టుకున్నారన్నమాట" అన్నాడు. గోచీధారి తెల్లకార్డు పని త్వరగా ముగిసేలా చూసి సర్పంచుని ప్రజా పక్షపాతిగా నిరూపించారు వందిమాగదులు. ఆతర్వాత మా ఇంటికొచ్చినప్పుడే "ఇది పాదులోకంరా చిన్నోడా" అనే డైలాగ్.

"ఇంతకీ నీ పెళ్ళిచూపుల్లో అమ్మాయి నవ్వటనికి కారణం ఈనేపథ్యమేనా?"

"కాదు ఇది మూడేళ్ళనాటిది. అమ్మాయి నవ్వుక్కారణం నెల్లాళ్ళ క్రిందటి తాజా గాయం."

"ఏమా గాయం? ఏమాకథ?" అని పంచతంత్రం కథలోలా అడిగి "ఎవరుచేసారు?" అని అన్నాను

మళ్ళీ మా ఊరివాళ్ళే గాయం చేసారు. ఈసారి ఎమ్మెల్యే, సర్పంచూ, కాంట్రాక్టరూ, ఇంజనీర్లు వంటి పెద్దమనుషుల ప్రమేయం లేకుండా ఊరివాళ్ళే నేరుగా గాయం చేసారు. ఐతే ఆ గాయం చేయటంలో మనపూర్వీకుల పాత్ర కూడా ఉంది. ఇప్పుడు రాఘవరావుగారిని చూస్తే పూర్వీకులూ, పూర్వీకులిని చూస్తే రాఘవరావుగారూ గుర్తొస్తున్నారు. అదితలుచుకొనే, నాక్కాబోయే భార్య నవ్వింది.

"అలాంటి ఊరిజోలికి మీపెదనాన్నగారు మళ్ళీ ఎందుకు వెళ్ళేరు?"

మళ్ళీ చెప్పేదు

ఊళ్ళోవాళ్ళకి రాఘవరావుగారు చేసిన మేలు మరిచిపోవటనికీ, కీడుకూడా చేసేడనే అబద్ధాన్ని నమ్మటానికీ మూణ్ణెల్లు పడితే, ఆఊరివాళ్ళు తనకు చేసిన గాయం మరిచిపోవటానికి రాఘవరావుగారికి సంవత్సరం పట్టింది. రెండేళ్ళ క్రితం రాఘవరావుగారిలాంటి సీనియర్ సిటిజెన్లు హైదరాబాదులో ఏర్పాటుచేసుకొన్న ఏదో ఆయుర్వేద సలహా శిబిరానికి వెళ్ళేరు. అక్కడికి వచ్చిన నిపుణుడు, మధుమేహ పీడితులు ప్రతిరోజూ జామ ఆకులు నమిలితే రక్తంలో చక్కెర సహజంగా నియంత్రించబడుతుందనీ, ఈ నమిలే ప్రయత్నంలో నోటి కండరాలూ, దంతాలూ కూడా గట్టిబడతాయనీ చెప్పేడు. అక్కడినించి వచ్చాకా, ఈయన రోజూ జామ ఆకులు నమలటం, వారం రోజుల్లో అది సత్ఫలితాన్నిచ్చినట్లు ఋజువు కావటంతో, ఈయనలో సంఘ సేవకుడు మళ్ళీ మేల్కొన్నాడు. సంఘసేవకి మళ్ళీ వేదిక మా ఊరే.

"మీఊళ్ళో కూడా మధుమేహపీడితుల్లున్నారా?"

ఈయన ఉద్యోగంలో ఉన్నప్పుడు నీటిపారుదల వ్యవస్థని కనీసం మూడు దశాబ్దాల ముందుచూపుతో కట్టాలని నమ్మేవారు. ఆ మధ్య ఏదో పేపర్లో, పల్లెల్లో చాపకింద నీరులా విస్తరిస్తున్న మధుమేహం, అన్న వ్యాసం గణాంకాలతో సహా వచ్చింది. అదీకాక త్రాగునీటి వ్యవహారంలో ఈయన్ని ఆడిపోసుకున్న వారంతా, యాభైఏళ్ళ లోపువారే గానీ, ఈయన చిన్ననాటి మిత్రులు కారు. అందులో ఎవరికి మధుమేహం ఉన్నా, ముందు ముందు వచ్చినా తన వంతు సహాయం చేద్దామని మళ్ళి ఊళ్ళో దిగి, అరవైకి పైబడ్డవాళ్ళని ఓపాతికమందిని పిలిచి, ఆయుర్వేద నిపుణుడి ఉపాన్యాసాన్నీ క్లుప్తంగానూ, తన స్వీయ అనుభవాన్ని వివరంగానూ చెప్పి, వచ్చిన వాళ్ళందరితోనూ, ఎవరైనా జామమొక్కలు తెస్తే, తమ ఇంటి ఆవరణలో వేయించటానికి వాళ్ళని ఒప్పించేసేరు.

"మంచిదేకదా!"

"త్రాగునీటి వ్యవహారం కూడా 'మంచిదేకదా?' అన్న డైలాగ్‌తో ప్రారంభమైందని నువ్వు మరిచిపోతున్నావ్."

"జామమొక్కలు పాతించి కూడా చెడ్డపేరు మోయాల్సిన కథ కొంచెం ఆసక్తికరంగానే ఉన్నట్టుంది. ఛెప్పు."

ఆవిధంగా ఉత్సాహం చూపిస్తున్న వాళ్ళున్న ఇళ్ళవాళ్ళవి ఒక వంద పేర్లు రాసుకొని, ప్రభుత్వ ఉద్యానవనశాఖవారి వద్దకి వెళ్ళి, మొక్కకి పదిరూపాయల చొప్పున ఈయన స్వంతడబ్బు కట్టి, రెండునెలల తరువాత తొలకరినాటికి మరో వెయ్యిరూపాయల స్వంత

ఖర్చుతో మొక్కలిని ఊళ్ళోకి తీసుకొచ్చి ఇళ్ళకి పంచేరు. ఆవిధంగా ఆ ఊళ్ళో మొక్కలు నాటే కార్యక్రమం ముగిసింది. కర్కాటక సంక్రమణం, అనగా జూలై మధ్యలో నాటిన మొక్కలు దసరా, అనగా మూడునెలల్లో గుబురుగా పెరిగాయి. అప్పుడు మొదలయ్యాయి రుసరుసలు.

"అదేంటి? గుబురుగా నవనవలాడుతూ ఉన్న మొక్కలిని చూడగానే ఆయనిచ్చిన మొక్క అని కృతజ్ఞతాపూర్వకంగా తలుచుకోవాలికదా?"

పచ్చటిమొక్కని చూడగానే మేకలూ, కోళ్ళూ రావటం, వాటిని అదిలిస్తున్నప్పుడల్లా, ఈముసిలాయన తిన్నగా ఉండకుండా ఈ జామ్మొక్కలిచ్చేడు. ఒకరోజుతో ఆయన వొదిలించుకున్నాడు కానీ రోజూ మే చస్తన్నాం, అని అనుకుంటూ ఉండేవారు. మరికొందరు, ముఖ్యంగా కోడళ్ళు, రాఘవరావుగారి ప్రేరణతో మొక్కలు తెచ్చిన తన మామగారి మీద ఉన్న కోపాన్ని, రాఘవరావుగారి పేరు నేరుగా పెట్టి, పరోక్షంగా స్వంతమామగారిని తిట్టేవారు.

"తిట్టటం ఎందుకూ, ఆ మొక్కలిని పెంచటం ఆపొచ్చుకదా?"

"పైకిచెప్పే కారణం, పచ్చటి చెట్టుని చూస్తూ చూస్తూ అలా చెయ్యకూడదు."

"అసలుకారణం?"

"మేకకి అందనంత ఎత్తు ఎదిగేకా, జాంపళ్ళు కొనుక్కోనక్కర్లేదన్న ఆశ. కొంతమంది ఐతే, భవిష్యత్ ఫలసాయాన్ని అమ్ముకొనేందుకు చిల్లర వర్తకులతో మాట్లాడుకొని కూడా, మేకని అదిలించినప్పుడల్లా రాఘవరావుగారి నామం జపిస్తూనే ఉన్నారు. ఇది అన్యాయమని తెలిసినా ఆయా ఇళ్ళల్లో పెద్దలు వారించి, కొరివితో తల గోక్కొలేకపోయారు."

"దసరానాటికి సరే, సంక్రాంతికేమైంది?"

సంక్రాంతినాటికి రాఘవనామస్మరణ తగ్గుతూ, ఉగాదినాటికి ఈమొక్కల కొమ్మలు అన్నీ మేకకి అందనంత ఎత్తుకి ఎదిగాయి. అందరూ, వొచ్చే, పోయే చుట్టాలికి మొక్కలు పెంచటంలో తాము పడ్డశ్రమా, ఆ శ్రమ ఫలితంగా ఏపుగాపెరిగిన చెట్టు, చూపెడుతూ, ఎవరైనా చెట్టుని మెచ్చుకుంటే, వాళ్ళువెళ్ళిపోయేకా, ఇరుగు దిష్టీ, పొరుగుదిష్టీ, రాఘవరావుదిష్టీ అని మెటికలు కూడా విరవటం మొదలయ్యింది. వాళ్ళ భయమల్లా, మళ్ళీ రాఘవరావు పొరపాటున ఈ ఊరు వచ్చి, ఈమొక్కలు చూసి, అప్పుడిచ్చిన మొక్కలేనా అని అడుగుతాడేమోనని భయపడ్డారు కూడా. వేసవి రావటం వెళ్ళటం జరిగేసరికి చాలా మొక్కలు పూతపట్టాయి. అప్పుడు మళ్ళీ రాఘవరావుగారిని తలుచుకున్నారు. సారీ. తిట్టుకున్నారు"

"అదేం?"

చాలావరకూ పూతపట్టాయి గానీ, పూతపట్టనివి కూడా ఉన్నాయి కదా. పక్కవాళ్ళు వచ్చి, మా మొక్కలు పూతకొచ్చాయి అని చెబుతూ పూతరాని మొక్కలు చూసి, పూతవచ్చిన తమమొక్కలికి తామెంత సంరక్షణ చేసిందీ వివరిస్తూ ఉంటే, వీళ్ళకి తాము నిర్లక్ష్యంగా పెంచటంవల్లే పూతపుయ్యలేదంటున్నారేమోనన్న అనుమానం బలపడి, అనుమానాన్ని పైకి చెప్పలేక, నేరుగా ఖండించలేక, 'రాఘవరావు మాకు నాసిరకం మొక్కలు అంటగట్టేడు' అంటూ నిష్టూరాలాడేవారు. రాఘవరావుగారి ప్రసక్తిరాగానే, పూతపట్టిన మొక్కలవాళ్ళు జారుకొనేవారు. నెల్లాళ్ళ లేటుగా ఈ మొక్కలూ పూతపట్టాయి. రాఘవరావుగారిని అంతా మరిచిపోయారు. ఒకసీజన్ పళ్ళు తిన్నారు, కొంతమంది అమ్ముకున్నారు. జామమొక్కలున్న నాలుగిళ్ళల్లో పెద్దవాళ్ళకి మధుమేహం బయటపడటం, రాఘవరావుగారికి జామమొక్కపై ప్రేమకి తొలి కారణం అక్కడ నిజం కావటం జరిగింది.

"మరి తమ ఇళ్ళల్లో పెద్దవాళ్ళకి మధుమేహం రావటం కూడా రాఘవరావుగారి ఇనుపచేతితో ఇచ్చిన మొక్కలేనని ఎవరూ

ఆయన హస్తవాసి గురించి అనలేదా?"

"జామ పళ్ళ దిగుబడీ, మధుమేహం ఒక్కసారే రావటంతో, వీళ్ళు మధుమేహం గుర్తుచేసుకున్నా, జామపళ్ళతో కలిపి గుర్తొచ్చేస్తారేమోనని ఆయనపేరు జోలికి వెళ్ళలేదు."

"అంటే అంతా ఈయన్ని మరిచిపోయేరన్నమాట."

పూర్తిగా మరిచిపోయేరనీ చెప్పటానికి లేదు. ఊరకుక్క జామచెట్టుమొదలు పైకి వెనక్కాలు ఎత్తినప్పుడో, జామచెట్టుమీది పక్షి వీళ్ళమీద రెట్టవేసినప్పుడో, ఆయా జీవరాసుల్ని అదిలిస్తూ, ఈయన్నీ తల్చుకున్నా, దాదాపు మరిచిపోయేరనే చెప్పాలి. మళ్ళీ రెండో పూతలో విరగాసి, కాయల సైజు పెరుగుతూ కసురు తగ్గుతూ ఒకటీ రెండూ కాయలు దోరగా కనపడే వరకూ ఈయన్ని గట్టిగా తలుచుకున్నవారు లేరు.

"న్యాయంగా ఐతే, అప్పుడు కూడా తలుచుకోకూడదు కదా?"

"కూడదు. కానీ, మాఊరికి ఐదు కిలోమీటర్ల అవతల పెద్ద పెద్ద బండలతో కొండ ఉంది. దానిమీద బండ లు ఒక్కోటీ కారు కన్నా పెద్దవీ, కొన్నైతే బస్సు సైజువి కూడా ఉన్నాయి. ఆ కొండని ఒక కాంట్రాక్టర్ వేలం పాడుకొని స్టోన్ క్రషింగ్ యూనిట్ పెట్టేడు."

"ఐదు కిలోమీటర్లంటున్నావ్. స్టోన్ క్రషింగ్ శబ్దాలు ఈఊరికి వినిపించే అవకాశం లేదు. ఐనా అందుకు రాఘవరావుగారేం చేస్తారు?"

"కొసాకూ విను. ఆకొండమీద బండలమద్య సీతాఫల చెట్లున్నాయి. అవికాక, ఏడాదిపొడవునా కాయో, కసురో ఇచ్చే చెట్లూ, పొదలు ఉన్నాయి. ఆకొండని నమ్ముకొని కొన్ని కోతులు తరతరాలుగా అక్కడే ఉంటూ, సీతాఫల కాలంలో గట్టిగా తిని, పిల్లల్ని కని, మిగిలిన కాలాల్లో ప్రాణాలు నిలుపుకుంటూ వస్తున్నాయి. స్టోన్ క్రషింగ్ డైనమేట్ల వల్ల అవి నిర్వాసితులై కిలోమీటరుదూరంలో ఉన్న ఒక ఊరిమీద పడ్డయి. రెండురోజుల్లో ఆఊరివాళ్ళు తగుజాగ్రత్తలు తీసుకున్నాకా, మరోఊరు. అలా, డైనమేట్లు పేలిన వారానికి ఈ ఊరికి కోతుల దండు వచ్చింది. ఊరిజనం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, నెల్లాళ్ళు తరగని ఖజానాలాగా దోరకాయలతో ఉన్న జామచెట్లు స్వాగతం పలికాయి. జామచెట్లు ఖాళీ అవటానికి నెలపట్టింది. నెలపాటు ఈ ఊళ్ళోనే ఉండటం వల్ల కోతులదండు స్థిరనివాసం ఏర్పరచుకొన్నాయి. పళ్ళు తిందామనుకున్నవారూ, అమ్ముకుంటే వచ్చే ఆదాయాన్ని ఎలా ఖర్చుపెట్టలో నిర్ణయించుకున్న వారూ, అంతా కలిసి మళ్ళీ రాఘవరావుగారిని గట్టిగా తలుచుకోవడమే కాక, అమెరికాలో ఉన్న రాఘవగారి అబ్బాయికీ, బెంగుళూరులో ఉన్న అల్లుడికీ, వీళ్ళ దీవెనలు చేరేంత గట్టిగా బాకా ఊదేశారు. వాళ్ళ కొడుకూ, కోడలి పుట్టింటివారూ, అల్లుడూ, మాజిల్లాలో ఉన్న వీరందరి బంధుగణం అంతా ఈయన్ని "మీకెందుకు? అంత తపన ఉంటే మీకు నమ్మకం ఉన్న ఏ రామకృష్ణా మఠానికో, ఇస్కాన్ వాళ్ళకో చందా ఇచ్చి ఉండొచ్చు కదా" అని మందలించారు. కోతులదండు వచ్చినప్పటి నుండీ, ఈరోజువరకూ, ఎవరికి ఏకోతి కనబడ్డా రాఘవరావుగారే గుర్తొస్తున్నారు. నాక్కాబోయే భార్య కూడా పెళ్ళిచూపుల్లో మేమిద్దరం కూర్చొని ప్రైవేటుగా మాట్లాడుకుంటున్నప్పుడు, షోకేసులో జాంపండు తింటున్న కోతిబొమ్మ చూసే అంతలా నవ్విందట.

"ఇందాకా ఎవరో పూర్వీకులన్నావ్. పూర్వీకులంటే కోతులా?"

"ఔను"

"మరి మీ ఊళ్ళోవాళ్ళకి అంత ఇబ్బంది ఉన్నప్పుడు జామచెట్లు కొట్టించెయ్యొచ్చు కదా?"

"ఏనాటికైనా తమ ఊరికి కోతుల బెడద తగ్గి, తమ శ్రమఫలం అయిన జాంపళ్ళని తామే అనుభవించలేకపోతామా అన్న ఆశ."

"కోతులు వెళ్ళేకా కూడా రాఘవగారికి ఏమంచీ ఆపాదించరన్నమాట."

"రెండేళ్ళు శ్రమపడి జామచెట్లు పెంచిన వాళ్ళం, ముప్పై రూపాయలమొక్కని గవర్నమెంటు సబ్సిడీలో పదిరూపాయలకే కొనీసి, మా మానాన్ని మేం మొక్కలతో, కుక్కలతో, మేకలతో, కోతులతో, కోతుల్లాంటి స్కూలుపిల్లలతో తంటాలు పడ్డాకా ఆయనచేసిన పనిని మెచ్చుకోవాలా?" మావాడు వాళ్ళ ఊరిగృహిణులను అనుకరిస్తూ చెప్పేడు.

"ఆగాగు. ముప్పైరూపాయలమొక్క పదిరూపాయల కొచ్చినట్టు మీ ఊరివారికెవరు చెప్పేరు?"

"మొక్కలు నాటించేకా, ఉద్యానవన శాఖాధికారిని ఊరికి పిలిచి, అందరికీ పరిచయం చేసి, సబ్సిడీ వివరాలు చెప్పి, ముందుముందు పళ్ళూ, కూరగాయల పంటలకి ప్రభుత్వ ప్రోత్సాహం కావాలంటే ఈయన్ని సంప్రదించవలసిందని చెప్పిందీ, స్వయంగా రాఘవరావుగారే."

"విధి ఆవిధంగా సంఘసేవ చేద్దామనుకున్నాయన్ని విధి నవ్వులపాలు చేసిందన్నమాట. సంఘసేవగురించి మాట్లాడేవాళ్ళంతా చదవాల్సిన పిట్టకథ (కథ అనకూడదంటే పిట్టసంఘటన) నేనోసారి చదివాను. ఆది అక్షరాలా నిజం."

"ఏంటది?" మావాడడిగేడు.

"గాంధీగారి దగ్గరకి ఒకడు వచ్చి, తను లా చదివాననీ, న్యాయవాదవృత్తి చేపట్టకుండా దేశసేవ చేద్దామనుకుంటున్నాను అనీ, తగు బాధ్యతలు అప్పగించమనీ అడిగాడు. అలా అంటే గాంధీగారు, కాంగ్రెస్ పార్టీలో ఏదో వైట్‌కాలర్ బాధ్యత అప్పజెపతారని అతడి ఉద్దేశ్యం."

"గాంధీగారేమన్నారుట?"

"నీకు తగిన బాధ్యతలు అప్పగించేవరకూ, సబర్మతీ ఆశ్రమంలో కొన్ని మరుగుదొడ్లు శుభ్రపరచమని చెప్పి, చేటా, చీపురూ ఇచ్చి, మిగిలిన పనివాళ్ళని పరిచయం చేసారట. పాపం ఆ యువన్యాయవాది ఉస్సురుమనుకుంటూ, రెండురోజులు పనిచేసి, మూడోరోజు 'ఇదేం దేశసేవ మహానుభావా?' అని అడిగాడాట."

"గాంధీగారేమన్నారుట?"

"మరుగుదొడ్లకంపుని అసహ్యించుకోకుండా ఉండగలిగేంత సహనం అలవడ్డవాళ్ళే దేశసేవ సందర్భంగా వాళ్ళకి కనపడే, వినబడే కుళ్ళుని తట్టుకొని స్వచ్ఛంగా నిలబడగలరు అన్నారుట. అంచేత రాఘవరావుగారిని.."

"ఛి, ఛీ. మాపెదనాన్నగారిని సులబ్‌కాంప్లెక్సుల్లోకెళ్ళి సహనం అలవరచుకోవాలంటావా?"

"నా ఉద్దేశ్యం అదికాదురా నాయినా. సమాజంలో చాలామందికి వాస్తవాలు అటకమీది నిలవ పచ్చళ్ళలాంటివనీ, పరిస్థితికి అనుకూలమైన వాస్తవాన్ని బయటకు తీసి, అవసరమైతే మరిన్ని రుచులు కలిపి వడ్డిస్తారనీ, ఏవాస్తవమైనా వెలికి తీసేటప్పుడు తన గొప్పదనాన్నో, తన కృషినో చూపించే వాస్తవాలనే తప్ప, ఎదుటివాడి గొప్పతనాన్ని చూపే వాస్తవాలను అటకమించి తియ్యరనీ అర్థం చేసుకోవాలి. మన కార్పొరేట్ సంస్థల మానవ వనరుల విభాగం వాళ్ళ శిక్షణలో కూడా, పాక్షిక సత్యాలు అనబడే సెమీ ట్రూత్‌స్, ఎంపికచేయబడిన సత్యాలు లేదా సెలెక్టివ్ ట్రూత్‌స్ అని చెబతారుకదా."

వాడి మౌనం చూసి కొంచెం ఆగాను. అంతలో కరెంటు రావటంతో గీజర్ ఆన్ చెయ్యటానికి లేచాను.

# రెండు నాన్నలు జి.ఎస్.లక్ష్మి

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

రాత్రి పదిగంటలైంది. ధనంజయ్ తలుపు చప్పుడుకాకుండా తీసి నెమ్మదిగా కూతురు రమ్య గదిలో కొచ్చాడు. నిద్రపోతున్న ఎనిమిదేళ్ళ రమ్య మొహం అమాయకంగా వుంది. నిద్రలో యే కల వచ్చిందో యేమో పెదవులమీద సన్నగా దరహాసం తొంగిచూస్తోంది. అది చూసిన ధనంజయ్ మొహంలో ఆనందం ప్రస్ఫుటంగా కనిపించింది. మళ్ళీ అంతలోనే అతని భృకుటి ముడిపడింది.

నెమ్మదిగా రమ్య మంచం దగ్గరినుంచి ఆమె కూర్చుని హోమ్‌వర్క్ చేసుకునే టేబిల్ వైపు నడిచాడు. టేబుల్ మీదున్న స్కూల్‌బేగ్‌లోంచి పుస్తకాలు తీసి ఒక్కొక్కటీ పరీక్షగా చూస్తున్నాడు.

ఆరోజు పొద్దున్న రమ్య స్కూల్‌కి వెడుతూ, ప్రోగ్రెస్‌రిపోర్ట్ మీద ధనంజయ్ సంతకం కోసం వచ్చినప్పుడు రమ్య నోట్‌బుక్‌లో ఓమాట చూసాడతను. తెలుగు నోట్‌బుక్ మధ్యలో పెట్టిన రిపోర్ట్ ని రమ్య బయటికి తీస్తుంటే యథాలాపంగా ధనంజయ్ దృష్టి ఆ పేజీలో పైనున్న హెడ్డింగ్ మీద పడింది. "రెండు నాన్నలు.." అన్న ఆ హెడ్డింగ్ అతన్ని అయోమయంలోకి నెట్టింది. ఇంతలో కూతురు సంతకంకోసం రిపోర్ట్ ధనంజయ్ చేతిలో పెట్టింది. తండ్రి సంతకం పెట్టగానే రమ్య పుస్తకాలు బేగ్‌లో సర్దేసుకోవడం, టైమ్ అయిపోయిందని స్కూల్‌కి వెళ్ళిపోవడం జరిగిపోయాయి. కాని ఆ పదం మటుకు ధనంజయ్ బుర్రలో అలా వుండిపోయింది. "రెండునాన్నలు" అని రమ్య యెందుకు రాసుకున్నట్టు..? మామూలుగా తెలుగు కొత్తగా నేర్చుకునేవాళ్ళు "ఇద్దరు" అనడానికి "రెండు" అంటుంటారు. రమ్య కూడా అలాగే ఇద్దరికి బదులు రెండు అంది అనుకుంటే దాని అర్థం "నాకు ఇద్దరు నాన్నలు" అని వస్తుంది. మరి ఆ రెండో నాన్న యెవరు? పొద్దుట్నించీ కుమ్మరిపురుగులా బుర్రని తినేస్తున్న ఈ ప్రశ్నకి జవాబుకోసం ధనంజయ్ రాత్రి కూతురు పడుకునేవరకూ ఆగాల్సొచ్చింది. ఇప్పుడు ఆ రెండో నాన్న పేరుకోసం రమ్య పుస్తకాలు పరీక్షగా చూస్తున్నాడతను.

రమ్య హైద్రాబాదులో మంచిపేరున్న స్కూల్‌లో మూడోతరగతి చదువుతోంది. క్లాస్‌లో యెప్పుడూ మొదటి ముగ్గురిలో వుంటుంది. అది చాలా గర్వకారణం ధనంజయ్‌కి. అతనికి చదువంటే చాలా ఇష్టం. కాని పరిస్థితులు అతన్ని పెద్దచదువులవైపు వెళ్ళనీకుండా సంపాదనవైపు మళ్ళించాయి.

ధనంజయ్ యింకా నైన్త్‌క్లాస్‌లో వుండగానే అతని తండ్రి ఇల్లు వదిలి వెళ్ళిపోయేడు. అంతస్తుకు మించిన అప్పులుచేసి, తీర్చడమెలాగో తెలీక పారిపోయేడు. తండ్రి ఇంట్లోంచి వెళ్ళిపోయిన బాధకన్నా అప్పులవాళ్ల బాధ రెట్టింపయింది ఆ కుటుంబానికి. ధనంజయ్ తల్లి అన్నాళ్ళూ భర్త డబ్బు ఖర్చు పెడుతుంటే అతని సంపాదనే అనుకుంది తప్పితే యిలా తలకి మించిన అప్పులు చేసేడని తెలీదు. తెలుసుకోవాలనేంత తెలివితేటలు కూడా లేవు ఆవిడకి. భర్త కావలసినవి తెస్తున్నాడు అని అతన్ని పూర్తిగా నమ్మింది. అంత నమ్మకాన్నీ వమ్ము చేసి పారిపోయేడతను. కట్టుకున్న భార్యనీ, నలుగురు పిల్లలనీ నట్టేట్లో ముంచి వెళ్ళిన తండ్రి మీద వచ్చిన కోపాన్నంతట్నీ ధనంజయ్ తన

సంపాదనలో చూపించాడు. ఇల్లు, బంగారం తెగనమ్మేసి కొంతవరకూ అప్పులు తీర్చేడు. మిగిలినవి తీర్చడానికి అతను సంపాదనలో అడ్డదారులు తొక్కాల్సివచ్చింది.

ఏ గడ్డి తినైనా సరే డబ్బు సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకున్నాడతను. అందుకోసం అతను మంచీ చెడ్డా, ఉచ్చం నీచం, పాపం పుణ్యం అన్నీ మర్చిపోయేడు. రూపాయిలు పాపాయిల్లా కనిపించడంతో చాలా జాగ్రత్తగా వాటిని పెంచి పోషించుకున్నాడు.

ఎలాగైతేనేం.. తండ్రి యిల్లు వదిలి వెళ్ళిన పదేళ్ళకి ధనంజయ్ ఆయన చేసిన అప్పులు తీర్చడమే కాకుండా చెల్లెళ్ళిద్దరికీ మంచి సంబంధాలు చూసి పెళ్ళి చేసేడు. తమ్ముడిని పెద్ద చదువులు చదివించి అమెరికా పంపించాడు. ప్రతీదీ వ్యాపారదృష్టితోనే చూడడం అలవాటైన అతను పెళ్ళి కూడా బాగా డబ్బు, పలుకుబడి వున్న అమ్మాయినే చేసుకున్నాడు. మామగారు ధనంజయ్‌కి కొండంత అండగా వుండి అతన్ని అన్నివిధాలుగానూ కాసుకుంటున్నాడు. చిన్న చిన్న కాంట్రాక్టులతో మొదలుపెట్టి ప్రస్తుతం అతను హైద్రాబాద్‌లో ఒక పెద్ద కాంట్రాక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు.

పాపపుడబ్బు రావడం యెక్కువవుతున్నకొద్దీ ధనంజయ్‌లో యెప్పుడో చిన్నప్పుడు అతనిలో వున్న పాపభీతి నెమ్మదిగా తలెత్తడం మొదలైంది. అతను కట్టిన బిల్డింగులు, బ్రిడ్జిలు కూలిపోతున్నప్పుడు జనాలు చేసిన ఆక్రందనలు అతన్ని అర్ధరాత్రి లేపి కూర్చోబెడుతున్నాయి. సుడిగుండంలో పడి కొట్టుకుంటున్న అతను తనను ఒడ్డున పడేసే మనిషికోసం వెతకడం మొదలెట్టాడు. ఆ వెతుకులాటలోనే ఆ భయాన్ని పోగొట్టి, అతను చేసిన పాపాలు పటాపంచలు చేస్తానంటూ ఒక బాబా పరిచయమయ్యేడు. అంతే... ఆ బాబాకు దాసానుదాసు డయిపోయేడు ధనంజయ్. ఆ బాబా చెప్పినట్టే తన సంపాదనలో కొంత వాటా తిరుమలహుండీలో వేస్తున్నాడు. ఇంకొంతవాటా మంచిపనులు చెయ్యడానికి వినియోగిస్తున్నాడు. అందులో భాగంగానే బాబాగారి పేరుమీద ఒక స్కూల్ కట్టిస్తున్నాడు. ఆ స్కూల్ దగ్గర కెళ్ళేసరికి అతని కింక ఒళ్ళు తెలీదు. ఆ స్కూల్‌ని యెంత శ్రద్ధగా కడితే తమ మనసుకి సంతృప్తి వస్తుందో అంతకన్న శ్రద్ధగా, గట్టిగా కడుతున్నాడు. చిన్నతేడాని కూడా వదలకుండా దగ్గరుండి కట్టిస్తున్నాడు. అందులో అతనికి యెంతో తృప్తి లభిస్తోంది. ఆ స్కూల్ దగ్గరికి వెళ్ళినప్పుడల్లా మనసంతా ప్రశాంతంగా వుంటోంది.

కాని యిప్పుడీ “రెండు నాన్నలు” అనేమాట కూతురి పుస్తకంలో చూసినప్పట్నించీ అతని మనసు మనసులోలేదు.

ధనంజయ్ చప్పుడు కాకుండా పుస్తకాల మధ్యనుంచి రమ్య తెలుగు నోట్స్ తీసాడు. పుస్తకం చేతిలో పట్టుకుని, వెనకాల కూతురి రూమ్ తలుపు నెమ్మదిగా మూసి, ముందరిగదిలోకొచ్చి, సోఫాలో కూలబడ్డాడు. పరిపరివిధాలపోతున్న మగబుద్ధిని పగ్గంవేసి లాగి కట్టడి చేస్తూ పుస్తకం తెరిచాడు.

రమ్యవాళ్ల స్కూల్‌లో ఈ యేటినుంచే తెలుగు చెప్పడం మొదలుపెట్టారు. సంవత్సరం చివరికొచ్చేసరికి ఆ టీచర్ అప్పుడప్పుడు యేదైనా టాపిక్ యిచ్చి దానిమీద పిల్లలకి తోచింది రాయమని హోమ్‌వర్క్ యిస్తూంటూంది. అలాగే ఈవారం “దేవుడు ప్రత్యక్షమైతే యేం కోరుకుంటారు..?” అన్న అంశం యిచ్చింది. పేజీలు తిప్పుతున్న ధనంజయ్ ఆ పేజీ దగ్గర ఆగిపోయాడు. పైనే వుందా మాట..”రెండు నాన్నలు..” అంటూ..దడదడలాడుతున్న గుండెలతో చదవడం మొదలెట్టాడు.

రమ్య చేతివ్రాత యింకా అంత గుండ్రంగా లేదు. వంకరటింకరలు యెక్కువగా వున్నాయి. ఒత్తులూ, దీర్ఘాలూ కూడా వుండవలసినచోట లేకుండా అక్కర్లేనిచోట వున్నాయి. అయినాసరే ధనంజయ్ అదేమీ పట్టించుకోకుండా అక్షరాలబారులవెంట తన దృష్టిని పోనిచ్చాడు.

"ఓ దేవుడా, నువ్వు చాలా మంచివాడవని అమ్మ చెప్పింది. అడిగినవన్నీ యిస్తావని నాన్న చెప్పాడు. మరి నాకు ఈ నాన్న ఒద్దు. ఆ నాన్న కావాలి.."

చదువుతున్న ధనంజయ్ కళ్ళు పెద్దవయ్యాయి.

"రోజూ నాన్న నీకు దండం పెడతాడు కదా... అప్పుడేమో ఎంత బాగుంటాడో..కాని ఆ నాన్నే మళ్ళీ ఇంటికి చాలామంది రౌడీలు వస్తారు కదా.. వాళ్లతో మాట్లాడుతున్నప్పుడు నాకు చాలా భయం వేస్తుంది.

ఆ నల్లగా పెద్దమీసాలున్న అంకుల్‌కి ఎఱ్రసూట్‌కేసిచ్చి ఏదో చెపుతాడు. ఇంకో గుండంకుల్‌కి నల్లసూట్‌కేసిచ్చి ఎక్కడో ఇచ్చి రమ్మంటాడు. ఇంకో అంకులుంటాడు. చూడ్డానికి ఎంత బాగుంటాడో..నాకు అస్తమానం చాక్లెట్లు ఇస్తుంటాడు... ఆ అంకుల్ యేదైనా చెపితే నాన్న ఎంత బాగా వింటాడో... అంతా విని.. "అయితే బదిలీ చేయించెయ్యి..లేదా పైకి లేపెయ్యి.." అనగానే అదేవిటో అంతబాగున్న అంకుల్ కళ్ళు ఎఱ్రగా అయిపోతాయి.

అప్పుడు మా నాన్న మొహం ఎలా ఐపోతుందంటే...దేవుడా.. నాకు గబుక్కున మా అమ్మ ఒళ్ళో దూరిపోవాలన్నంత భయమేస్తుంది. పైకి లేపెయ్యమంటే నీ దగ్గరికి పంపెయ్యమనేకదా..నాకు తెలుసులే. అమ్మమ్మ కూడా ఇలాగే పైకెళ్ళిపోయిందని ఎవరో అంటుంటే నాన్న నాకు అర్థమయ్యేలా దేవుడి దగ్గర కెళ్ళిందని చెప్పేడు. అప్పుడు అమ్మమ్మకోసం అమ్మ ఎంత ఏడిచిందో.. అలాగే ఆ గుండంకుల్ ఎవర్నైనా పైకి పంపేస్తే వాళ్ళమ్మాయి కూడా ఏడుస్తుంది కదా పాపం..మరి నాన్న ఎందుకలా చెప్తాడూ..

దేవుడా.. మొన్న టీవీలో ఏదో సినిమా చూస్తుంటే అందులో ఒక అంకుల్ ఇలాగే అందర్నీ పైకి పంపేస్తుంటాడు తెలుసా!? ఇలా అందర్నీ పైకి పంపించేసేవాళ్లని నువ్వు నరకానికి పంపేస్తావుట కదా..ఆ సినిమాలో మామ్మ చెప్పింది. నరకమంటే ఏవిటని పనిపిల్ల వెంకి నడిగితే చెడ్డపనులు చేసినవారిని దేవుడు బాగా కాగే నూనెలో వేయిస్తాడూ, మంటల్లో తోస్తాడూ అని చెప్పింది. మరి పాపం మా నాన్న కాఫీకూడా వేడిగా వుంటే తాగలేడు. కప్పులో బాగా చల్లారబెట్టుకుని తాగుతాడు. మరి ఇలాంటి పనులు మా నాన్న చేసేడని నువ్వు నూనెలో వేయించేస్తావా..ఒద్దు దేవుడా..ఒద్దు... పాపం నాన్న...ఏడుస్తాడు.

అన్నట్టు మొన్న నాన్న దగ్గర కూర్చుని హోమ్‌వర్క్ చేసుకుంటున్నానా. అప్పుడో ఫోనొచ్చింది. నాన్న కట్టిన బ్రిడ్జేదో కూలిపోయిందిట. బోల్డుమంది పైకెళ్ళిపోయేరుట.

అప్పుడు నాన్న గబగబా చాలామందిచేత చాలా సూట్‌కేసులు పంపించేడు. ఆ రోజంతా అమ్మ నీకు దండం పెడుతూనే వుంది. అమ్మ నెమ్మదిగా నిన్నడిగినా పక్కనే వున్న నాకు వునిపించిందిలే..నాన్నని జైలుకి పంపకుండా చెయ్యమని నిన్నడిగింది కదా.. నాకు తెలిసిందిలే..అమ్మ మాట విన్నావు..నాన్నని జైలుకి పంపలేదు. మరి నామాట వినవా...దేవుడా...

బాబాగారు చెప్పేరని మా నాన్న స్కూల్ కట్టించేడు. తొందరగా అవాలని దానికోసం రాత్రీపగలూ పనిచేసేడు. ఆ స్కూల్ ముందు పెట్టిన సరస్వతీదేవి బొమ్మ కళగా లేదని, అది తీసేయించి, ఇంకెక్కడో దూరంనించి ఎవర్నో తీసుకొచ్చి, మంచిబొమ్మని చేయించేడు. ఆ స్కూల్ ముందు కట్టిన హాల్ సరిగ్గాలేదని మొత్తం పడగొట్టించి, దగ్గరుండి మళ్ళీ దాన్ని ఇంకా పెద్దగా, అందంగా చేయించేడు. అమ్మ చెప్పింది. ఈ స్కూల్ కట్టడానికి నాన్న ఎవర్నీ డబ్బులడగలేదనీ, మొత్తం తనే కట్టేడని. మరి బాబాగారి స్కూల్ అంత జాగ్రత్తగా కట్టించిన నాన్న ఈ బ్రిడ్జిలెందుకు ఇలా పడిపోయేలా కడుతున్నాడూ..అందర్నీ ఎందుకు పైకి పంపిస్తున్నాడూ..!?

ఓ దేవుడా, మా నాన్నని నువ్వేమీ చెయ్యకేం.పా పం మా నాన్నచాలా మంచివాడు. ఆ బాబా దగ్గరికి వెళ్ళినప్పుడు ఎంత బాగుంటాడో...

ఆ స్కూల్ మాట వచ్చినప్పుడల్లా నాన్న మొహం ఎంత బాగుంటుంద. నవ్వుతూ వుంటుంది. వెళ్ళి ఒళ్ళో కూచోవాలనిపిస్తుంది. మరి అదే నాన్న మొహం ఈ బ్రిడ్జిలు కడుతున్నప్పుడు ఎందుకంత ఎర్రగా అయిపోతుంది? బలే భయం వేస్తుంది. ఇలా ఈ రెండు నాన్నలు నాకు బాగులేదు.

అందుకే ఓ దేవుడా..నాకు బ్రిడ్జిలు కట్టించే నాన్న వద్దు. స్కూల్ కట్టించే నాన్న కావాలి. నాకు రెండునాన్నలు వద్దు. ఒక్క నాన్నే కావాలి...ఒక్క నాన్నే కావాలి..."

కూతురు రాసింది చదివిన ధనంజయ్ కొయ్యబారిపోయేడు. అతని మనసులో ఆలోచనలు స్తంభించిపోయేయి. ఇంకా చిన్నపిల్ల అనుకుంటున్న తన చిట్టితల్లి మనసులో ఆలోచనలు ఇంత తీవ్రంగా వుంటాయని అనుకోడానికి కూడా అతనికి భయం వేసింది. ఇంకా పెద్దదైనకొద్దీ ఆమె ఆలోచనలు తనకు వ్యతిరేకంగా మారిపోతాయేమోనని ఒక్కసారి వెన్ను జలదరించింది. తను తన తండ్రిని ద్వేషించినట్టే తన చిట్టితల్లి కూడా తనని ద్వేషిస్తుందా.. తన బంగారుతల్లి దృష్టిలో తను ఇంత దుర్మార్గుడుగా కనిపిస్తున్నాడా!! అయ్యో... గుండె పట్టుకుపోతోందే..ఏం చెయ్యాలీ...

చేతుల్లోంచి జారి కిందపడిపోయిన ఆ పుస్తకం తియ్యడానికి కిందకి వంగిన ధనంజయ్ అలా కుర్చీలోంచి కిందకి జారిపోయెడు. పుస్తకం అందుకుని చదువుదామనుకున్న అతనికి అందులోంచి బ్రిడ్జి కూలినప్పుడు చనిపోయినవారి ఆర్తనాదాలు పీలగా వినిపించాయి.

వాస్తవంలోకొచ్చి ఆలోచిస్తున్న అతనికి రమ్య రాసిన మాటలు కనిపించాయి. ఊపిరి బిగపట్టి మరోసారి రమ్య దేవుణ్ణి కోరిన కోరిక చదువుతున్న ధనంజయ్ మొహం పాలిపోయింది. గొంతు తడారిపోయింది. అసలే పాపభీతితో కొట్టుకుపోతున్న ధనంజయ్ కూతురు రాసింది చదివాక మరీ డీలా పడిపోయేడు. ఇంతేనా ఇంక తన బతుకు..తన చిట్టితల్లి దృష్టిలో చెడ్డనాన్నగానే మిగిలిపోతాడా? ఇంక తనకి దారే లేదా..!?

అతని లోపలనుంచి తన డబ్బు యావవల్ల చనిపోయిన యెన్నో గొంతులు ఆక్రోశంగా అరుస్తున్నట్టు వినిపించిందతనికి.

తన చిట్టితల్లికి తనంటే యెంత యిష్టం. తనను మంచివాడుగా చెయ్యమని యెంత బాగా అడిగిందీ.. కానీ ఇది సాధ్యమా? ఇంతగా కుళ్ళిపోయిన ఈ వ్యవస్థలో తన బంగారుతల్లి కోరినట్టు మారడం తనకి సాధ్యమా? పూర్తిగా సుడిగుండంలో పడి కొట్టుకుంటున్న తనకి అందులోంచి పైకి రావడానికి యెవరు చెయ్యందిస్తారు?

తీవ్రంగా ఆలోచిస్తున్న ధనంజయ్‌కి ఒక్కసారిగా యేదో మెరుపు మెరిసినట్లయింది.

వ్యాపారం అనుకుంటూ కూలిపోతున్న బ్రిడ్జిలు కట్టిన పాపం పోడానికి బాబాని ఆశ్రయించి, స్కూల్ కట్టించి యిస్తే ఆ పాపం పోతుందని అనుకున్నాడు తను.

కానీ రమ్య యెంత బాగా చెప్పిందీ..అసలు పాపమే చెయ్యొద్దంటోంది..

నిజమే కదా..ఆ బ్రిడ్జిలనే స్కూలంత పవిత్రంగా భావించి కట్టిస్తే ఈ పాపభీతి వుండదు కదా! అలా చేస్తే అ భగవంతుడు తన చిట్టితల్లి కోరిక తీర్చకుండా వుంటాడా..కల్మషం లేని హృదయంతో అమాయకంగా కోరిన తన బంగారుతల్లి మొర వినకుండా వుంటాడా?

పాప హృదయం తెలుసుకున్న ధనంజయ్ అలా కింద కూలబడే ఆర్తితో దేవుణ్ణి వేడుకున్నాడు.. "ఓ దేవుడా,

నా చిట్టితల్లి కోరిక తీర్చు. నన్ను రమ్యకి నచ్చే నాన్నగా మార్చు. నా చిట్టితల్లి పరిగెడుతూ వచ్చి నా ఒళ్ళో కూర్చునేలా నన్ను మార్చు. నా బంగారుతల్లికి నచ్చినట్టు నవ్వే నాన్నలా మార్చు. నా ఇంటి దీపానికి రెండునాన్నలు వద్దు. నన్ను రమ్యకు నచ్చే నాన్నగా మార్చు దేవుడా...

అప్పుడు రమ్యకి ఇద్దరు నాన్నలుండరు. ఒకే నాన్న...

రమ్యకి నచ్చే నాన్న...

చూడగానే వచ్చి ఒళ్ళో కూర్చోవాలనిపించే నాన్న..

రమ్యకి నచ్చినట్టు నవ్వే ఒక్క నాన్నే వుండాలి

రెండు నాన్నలు వద్దు...

నా చిట్టితల్లి కోరిక తీర్చు దేవుడా.."

భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ధనంజయ్ అలా ముందుకి ఒరిగిపోయేడు.

# రామకృష్ణ husband of వైదేహి

నాగేశ్వరరావు

వైదేహి గురించి రెండుముక్కల్లో చెప్పాలంటే ఆమె ఒక మెరుపు తీగ ప్లస్ జాజిమల్లె పందిరి................ పోలిక బాగోలేదు కదూ !

సరే ! ఇంకా వివరంగా చెప్పాలంటే ఆమెను చూస్తే గుండెలోతుల్లో ఎక్కడో ఒక మెరుపు మెరిసి కళ్ళుమూతలు పడి ఎక్కడికో ఊహల్లోకి వెళ్ళిపోతాము. మనసు వశం తప్పుతుంది. సరిగ్గా ఆ సమయానికే ఒక పిల్లతెమ్మెర మల్లెపందిరి మీదుగా జాజిమల్లెల పరిమళాన్ని మోసుకుంటూ సన్నగా తాకుతూ వెళ్లిపోతుంది. ఆ తర్వాతేమౌతుందని ఆలోచించనవసరము లేదు. మనసు పూర్తి సుషుప్తావస్తలోకి వెళ్ళిపోతుంది. తర్వాత కలలు కనటము తప్ప ఇంక ఏమీ చేయలేము.

అవును ! ఇదంతా నిజమే. వైదేహిది నిజంగానే గొప్పసౌందర్యం. ఇది ఎవరూ కాదనలేని సత్యం.

శ్రీనాధుడు కనుక చూసి ఉంటే శృంగారనైషదాన్ని పక్కన పెట్టి మరో ప్రబంధకావ్యాన్ని వ్రాసి ఉండేవాడు. అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మన మొదలైనవారంతా చరిత్ర ప్రసిద్ధికెక్కిన ప్రబంధ కవులు. వాళ్ళంతా స్వంత బుర్రతో ఆ ప్రబంధాలన్నీ రాసి ఉండరు. ఏ వైదేహి లాటివారో తారసపడితే ఆ ఇన్స్పిరేషన్‌తోనే ఆ ఊహలతోనే ఆ అద్భుత ప్రబంధాలని రాసి ఉండి ఉండవచ్చు. వేటూరి సుందరరామ్మూర్తిగారు తన 'సిరిమల్లె నీవే' పాటను వైదేహి లాటి లలనను చూసే రాసి ఉంటారు. వైదేహిని చూస్తే మళ్ళీ దానిని మించిన మరో పాటను ఖాయంగా రాసిఉండేవారు. అయితే ఆమెను చూడకుండానే ఆయన వెళ్ళిపోయారు. మనకు మరో మంచి పాట మిస్సయింది.

సామాన్యంగా అందమూ తెలివి జమిలిగా కలిసి ఉండాలని రూలేమీ లేదు. కాకపోతే వైదేహి విషయంలో ఆ రూలుకు

కొద్దిగా మినహాయింపు ఉన్నది. ఎందుకంటే వైదేహి చాలా తెలివైంది. దానికితోడు ధైర్యవంతురాలు. జీవితం అంటే ఏదైనా సాధించటానికే గానీ ఊరికే తిని తొంగోవటం కాదన్నది ఆమె పాలసీ. రిస్క్ తీసుకోనిదే ఏమీ సాధించలేమని ఆమెకు తెలుసు. రిస్కు తీసుకోవాల్సివస్తే వెనకాడే మనిషి కాదు. కాస్త మొండితనం కూడా ఉన్నది. అదే లేకపోతే ఈ కథ చెప్పుకోవటానికి ఏమీ ఉండేది కాదు.

తెలివైనవాళ్ళంతా తెలివితక్కువ పనులు చెయ్యరని ఎక్కడా లేదు. లేకపోతే వైదేహి లాటి అమ్మాయి రామకృష్ణను ఇష్టపడటమేమిటి. తనకోసం ఎంతోమంది క్యూలో నిలబడి ఉంటే, ఆ క్యూలో నిలబడి ఉన్నవాళ్ళలో మహామహా ప్రయోజకులున్నాగానీ, వాళ్ళందరినీ త్రోసిరాజని, తండ్రిని ఎలాగోలా ఒప్పించి రామకృష్ణను పెళ్ళి చేసుకోవటమేమిటి !

రామకృష్ణ చాలా సీదాసాదా వ్యక్తి. పదిమందిలో ఒకడు. అతడిని గురించి ఏమైనా చెప్పాలని ఉంది కానీ ఏమి చెప్పాలో మాత్రం తెలియదు. అంతే ! మామూలు వ్యవహారిక పరిభాషలో చెప్పాలంటే అతడు చాలా మామూలు కుర్రాడు. అంతకంటే ఏమీ లేదు. మనిషి బాగానే ఉంటాడు. ఒక మోతుబరి కొడుకు. ఒకటి రెండు తరాలవరకు ఏ పని చేయకపోయిన జరిగిపోయే కుటుంబంలో పుట్టాడు. మనిషిలో ఒకరకపు నిర్లక్ష్యం. దేని గురించి అట్టే సీరియస్‌గా ఆలోచించడు. తన జీవితం మీద తనకి పెద్ద అంచనాలేమీ లేవు. రావల్సింది ఎలాగూ వస్తుంది, రానిది ఎంత కొట్టుకున్నా రాదు. ఇది రామకృష్ణ ఫిలాసఫి. కాకపోతే రామకృష్ణకు కూడా ఎంతో కొంత మెరిట్ లేకపోలేదు. భగవంతుడు భూమ్మీదకు ఎవరినైనా పంపేటప్పుడు చిన్నదో పెద్దదో వరమిచ్చి పంపుతాడు. అలాగే రామకృష్ణను కూడా భూమ్మీదకు పంపాడు. శివాజీగణేషన్, నంబియార్, ఎమ్.ఆర్.రాధాల నక్షత్రంలో పుట్టాడు. ఆ మహానుభావులతో పోల్చినంత మాత్రాన వాళ్ళంత మహానటుడు అని పొరబడనవసరం ఏ మాత్రం లేదు. స్టేజ్ ఎక్కంగానే ఆ ముగ్గురు మహానటులూ మనవాడిని పూనతారు. అంతే ఇక చెలరేగిపోతాడు. విపరీతంగా యాక్షన్‌చేసి పారేస్తాడు. అంటే రూపాయకు రూపాయన్నర యాక్షన్ అన్నమాట. ఓవర్‌యాక్షన్ అనేది తెరమీద ఎబ్బెట్టుగా ఉంటుంది కానీ స్టేజ్ మీద కాదు. స్టేజ్ మీద ఓవర్‌యాక్షన్ అనేది ఒకరకంగా ప్లస్‌పాయింటే ! అందుకే రామకృష్ణకు నటుడిగా ఎంతో కొంత గుర్తింపు.

వైదేహిని చూడగానే ఊహల్లోకి వెళ్ళిపోయిన అనేకానేకమందిలో రామకృష్ణ కూడా ఒకడు. అతడికి చాలా తొందరలోనే జ్ఞానోదయం అయింది. క్యూలో తనకంటే ముందు చాలామంది ఉన్నారు. పడదోసుకుంటూ వెళదామంటే ముందున్నవాళ్ళంతా మహామహులు, తనేమో అర్భకుడు. ఎందుకొచ్చిన ఆయాసం. తన లిమిటేషన్స్ ఏమిటో రామకృష్ణకు బాగా తెలుసు. ఊరుకున్నంత ఉత్తమం బోడిగుండంత సుఖం లేదని విజ్ఞుల ఉవాచ. ఆ సూత్రాన్ని రామకృష్ణ చాలా నిజాయితీగా నమ్ముతాడు. రామకృష్ణకు అట్టే కష్టపడే అలవాటేమీ లేదు. వైదేహి కోసం తలకిందులుగా తపస్సు చేసినా తనకు దక్కదని అతడికి తెలుసు. ఇంకెందుకు కష్టపడటము, వృధా ప్రయాస. ఆమె గురించి ఆలోచించి మనసు పాడుచేసుకోవటము అనవసరము. అదంతా గిట్టుబాటు కాని వ్యవహారం. అందుకే వైదేహిని తన మనస్సులోనుండి తుడిచేసాడు. ఆమె గురించి ఆలోచించే ప్రయత్నం కూడా పూర్తిగా మానేసాడు.. బహుశా అదే అతనికి కలిసివచ్చి ఉంటుంది.

వైదేహికి అప్పుడప్పుడు సినిమాలు చూసే అలవాటుంది. మంచి సినిమా అని తన ఫ్రెండ్స్ తో కలసి సినిమాకు వచ్చింది. హిట్‌పిక్చరేమో ! బాగా రష్‌గా ఉంది. ఆడవాళ్ళ కౌంటర్‌కూడా బాగా రష్‌గా ఉంది. ఇంతదూరం వచ్చి సినిమా చూడకుండా వెళ్ళాలంటే ఉసూరుమనిపించింది. పైగా ఆటో ఖర్చు గుర్తుకొస్తున్నది. సినిమా చూడలేకపోతే అదొక దండగ. డబ్బులేమీ ఊరికినే రావుగా . సరిగ్గా అదే సమయంలోనే రామకృష్ణ ఎదురుగా వస్తున్నాడు.

రామకృష్ణ దగ్గరకు రాగానే అతడిని పిలిచింది.

"రామకృష్ణా ! శివరామ్ నీకు ఫ్రండేగా. నాలుగు టిక్కెట్లు ఇప్పించవా ! ప్లీజ్ " అని రిక్వెష్టు చేసింది.

శివరామ్ హోలు ఓనర్‌గారి అబ్బాయి. వీళ్ళ కాలేజీలోనే చదువుతున్నాడు. రామకృష్ణకు మంచి స్నేహితుడు.

రామకృష్ణ చాలా కాజువల్‌గా ఆ రిక్వెష్టును రిసీవ్ చేసుకున్నాడు. నో ఎక్జయిట్‌మెంట్. అందని ద్రాక్ష కోసం నోరూర్చుకునే అలవాటు అతడికి పుట్టుకతోనే లేదు.

" వైదేహీ ! నేను ప్రయత్నిస్తాను. టిక్కెట్లు అయిపోతే నేనేమీ చేయలేను" అని డబ్బులు తీసుకుని లోపలకు వెళ్ళాడు.

రామకృష్ణ లోపలికి వెళ్ళీ గొప్ప ప్రయత్నమేమీ చేయలేదు. మేనేజరును అడిగాడు. టిక్కెట్లు ఉన్నవి. అతడు ఇచ్చాడు. వాటిని తెచ్చి వైదేహికి ఇచ్చాడు.

" థాంక్యూ రామకృష్ణా ! థాంక్యూ " వైదేహి కృతజ్ఞతలు చెప్పింది.

" ఓకే ఓకే " చాలా మామూలుగా చెప్పి సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా వెళ్ళిపోయాడు.

వైదేహికి ఇదొక షాక్ ! ఇన్నాళ్ళు ఎవరైనా సరే తనతో మాట్లాడానికి ఎగిరిగంతేసేవారు. పనున్నా లేకపోయినా ఏదో ఒకటి కల్పించుకుని మాట్లాడేవారే ఆమెకు తెలుసు కానీ ఇలా చాలా మామూలుగా వెళ్ళేవారెవరినీ ఆమె ఇంతవరకూ చూడలేదు. మొదటిసారి ఆమె అహం దెబ్బతిన్నది. బహుశా ఆమె తప్పులో కాలేస్తానికి అదే కారణం కావచ్చు. ఆమె జీవితంలో చేయబోతున్న ఒకే ఒక తెలివితక్కువ పనికి అది నాంది అయింది.

ఇది జరిగిన తర్వాత మరో రెండు సంవత్సరాలు వాళ్ళిద్దరూ ఆ కాలేజీలోనే చదివారు. అనవసరంగా కష్టపడే అలవాటులేని రామకృష్ణ సహజంగానే ఆ రెండేళ్ళలో ఎప్పుడూ వైదేహిని పట్టించుకోలేదు. అసలు రహస్యం తెలియని ఆమె వీడిని ఒక ఋష్యశృంగుడని పొరబడింది.

కోరి వచ్చినవాళ్ళు ఎప్పుడూ లోకువే ! వైదేహికి కూడా. తన కంటిచూపు కోసం పడిగాపులు పడేవాళ్ళు ఆమెకు సహజంగానే ఆనలేదు. తనంటే ఆట్టే లెక్కలేని రామకృష్ణమీద కొద్దిగా ఆసక్తి పెరిగింది. అమె కాలు తప్పులో మరింత దిగింది.

ఫైనల్ ఇయర్ మొదటిలో ప్రతి సంవత్సరంలాగానే కాలేజీ ఎలక్షన్లలొచ్చాయి. పొరపాటున కూడా ఏ రిస్కూ తీసుకోవటం అలవాటు లేని రామకృష్ణ స్నేహితుల బలవంతము మీద పోటిచేసాడు. పేరుకు కాలేజీ ఎలక్షన్లయినా జనరల్ ఎలెక్షన్లంత ధాటిగా జరిగాయి. డబ్బు మంచినీళ్ళలా ఖర్చయింది. రామకృష్ణకు కూడా చేతి చమురు బాగానే వదిలింది. అవతలివాడు గట్టివాడు. రామకృష్ణను మట్టి కరిపించాడు. చాలా పెద్ద మార్జిన్‌తొ అతడు గెలిచాడు. కౌంటింగ్‌రూం నుండి ఏడుపు మొహంతో రామకృష్ణ బయటకు వచ్చాడు.

రామకృష్ణ మొహం చూస్తే వైదేహికి జాలి కలిగింది. పాపం అనిపించింది.

"బాధపడకు రామకృష్ణా ! గెలుపోటములు సహజం. పోతేపోనీ ఈసారి కాకపోతే వచ్చేసారి నీవే నెగ్గుతావు" అంటూ ఓదార్చింది.

" ఓదిపోయినందుకు కాదు నా బాధ. ఇంత ఘోరంగా ఓడిపోతాననుకోలేదు. రేపటినుండి ఎలా తలఎత్తుకోవాలో అర్థం కావటం లేదు వైదేహీ ! అందుకే నాకు చాలా బాధగా ఉంది" ఇంకో రెండు మాటలు మాట్లాడిస్తే బేర్ మని ఏడ్చేటట్లున్నాడు.

వైదేహికి సీను అర్థమయ్యి పక్కకు వచ్చేసింది.

ఎందుకో తెలియదు వైదేహికి మనసు పొరల్లో ఎక్కడో చిన్న కదలిక.

"పాపం రామకృష్ణ ! అనవసరంగా రొచ్చులోఇరుక్కున్నాడు" అని జాలిపడింది. తప్పులో వేసిన వైదేహి కాలు ఇంకొంచెం

దిగింది.

జాలి అనేది ప్రేమకు మొదటి మెట్టా ? అవునోకాదో ఏ సిద్ధాంతకారుడూ నిర్ధారించని సత్యం ఇది. ఏమో కావొచ్చేమో ! ఎంత కాదనుకున్నా అమె మనసు రామకృష్ణ గురించి చిన్నచిన్న ఆలోచనలు చేస్తున్నది. అయితే అది జాలా! జాలి రూపంలో ఉన్నా ప్రేమా ! అసలు ప్రేమేనా ! ఇతమిద్ధంగా తెలియదు. తెలిసే సమయం ఫైనల్ఇయర్ చివరిలో వచ్చింది.

ప్రతి సంవత్సరమూ యూనివర్సిటీలో డ్రమటిక్ కాంపిటీషన్లు జరుగుతాయి. ప్రతి కాలేజీ తమ కాలేజీ తరఫున ఒక టీంను పోటీలకు పంపటము ఆనవాయితీ. అది రివాజు. ఈ సారి వీళ్ళ కాలేజీ తరఫున రామకృష్ణ టీంను తీసుకెళ్ళాడు. పోటీలు కూడా చాలా రసవత్తరంగా జరుగుతవి. ఈసారి కూడా నాటక పోటీలు యూనివర్సిటీలో చాలా బాగా జరిగినవి. కారణాలేవైనా కావచ్చు, పోటీలో కాలేజీ టీం చాలా అద్భుతమైన ప్రతిభ కనపరిచింది. దాదాపు అన్ని ప్రైజులూ అంటే ఉత్తమ నటుడి దగ్గరనుండీ ఉత్తమ ప్రొడక్షన్ వరకు చాలా ప్రైజులు గెల్చుకుంది. రామకృష్ణ ఆ సంవత్సరపు బెస్ట్ యాక్టర్బహుమతి గెలుచుకున్నాడు.

కాలేజీ యానివర్సరీ నాడు నాటక ప్రదర్శన తప్పనిసరిగా ఉండే అంశము. యూనివర్సిటీలో వేసిన నాటకాన్నే ఆరోజూ వేసారు. టీం మొత్తం మహా ఉత్సాహంగా ఉన్నారు. అసలే గెలుపు గుర్రం మీదున్నారు. స్టేజ్ మీద చెలరేగిపోయారు. దానికితోడు ఆ నాటకం కూడా 'వీరపాండ్యకట్ట బ్రహ్మన'. ఇక చూస్కో ! రామకృష్ణను పట్టుకునేవాడే లేకపోయాడు. పద్నాలుగుమంది శివాజీ గణేషన్‌లను స్టేజ్ మీద అవిష్కరించాడు. నాటకం జరుగుతున్నంతసేపూ ఆడిటోరియం చప్పట్లతో హోరెత్తిపోయింది. చూసేవాళ్ళు పూనకం వచ్చినట్లు ఊగిపోయారు.

నాటకం చూసిన వాళ్ళందరి మీద రామకృష్ణ పెద్ద ప్రభావం చూపాడు. చాలామంది గుండెల్లో మెరుపులా మెరిసాడు. ముఖ్యంగా వైదేహి గుండెల్లో. ప్రేమ పుట్టటానికి పెద్ద కారణాలవసరం లేదు. ముఖ్యంగా ఆ వయసులో. వైదేహి వేసిన కాలు తప్పులో పూర్తిగా దిగబడిపోయింది. ఆమె మనసును రామకృష్ణ పూర్తిగా ఆక్రమించేసాడు. మొగ్గ పూర్తిగా వికసించింది. మళ్ళీ ముదుచుకునే ఆవకాశం లేనేలేదు.

నాటకం విజయవంతంగా పూర్తయిన తర్వాత తోటి కుర్రాళ్ళు ఈ లోకల్ మహానటుల్ని చుట్టుముట్టేసారు. విపరీతంగా తోపుల్లాట. వైదేహికి రామకృష్ణను అభినందించాలని అనిపించింది. కాని అతడిని సమీపించే అవకాశం మాత్రం దొరకలేదు. అయితే ఆ రాత్రి వైదేహి కలల్లోకి రామకృష్ణ వచ్చిన మాట మాత్రం వాస్తవం.

మర్నాడు బస్ దిగి కాలేజీలోకి అడుగుపెడ్తున్న వైదేహికి రామకృష్ణ ఎదురు వచ్చాడు. ఆమే అతడిని పలకరించింది.

"రామకృష్ణా నిన్న మీ నాటకం చూసాను. చాలా బాగుంది. నీవైతే ఎంత బాగా చేసావో చెప్పలేను. కంగ్రాచ్యులేషన్స్ టూ యూ " వైదేహి మనస్ఫూర్తిగా అభినందించింది. ఆ అభినందనలో తన ప్రేమను కూడా రవ్వంత రంగరించింది.

అయితే రామకృష్ణకు నిన్నటి పొగడ్తల జల్లు తడి ఇంకా ఆరలేదు. వైదేహి అభినందన కూడా వాటిలో ఒకటే అనుకున్నాడు. అంతకు మించి ఆలోచించలేదు. కొద్దిగా బుర్రపెట్టినా లేదా ఒకింత పరీక్షగా చూసినా ఆమె అభినందన వెనకనున్న భావం అర్థమయి ఉండేది. తనమీద తనకే అట్టే నమ్మకం లేని అతడు అంత శ్రమ తీసుకోలేదు.

"థాంక్యూ వైదేహి.మళ్ళీ కలుస్తా" అని వెళ్ళిపోయాడు.

ఆ మళ్ళీ కలవటమనేది తన జీవితంలో అత్యంత మధుర ఘట్టంగా తన ఊహకు అందనంత అద్భుత వరంగా ఉంటుందని ఆ క్షణంలో అతడు ఊహించి ఉండలేదు.

వైదేహికి మాత్రం అలా ఏమీ మాట్లాడకుండా వెళ్ళిపోవటము ఏమీ నచ్చలేదు. అయినా ఇలాటి చిన్న చిన్న విషయాల

గురించి పట్టించుకునే రకం కాదు. తనకు కావలిసింది ఎలా సాధించుకోవాలో వైదేహికి బాగా తెలుసు. కాకపోతే తనకు కావలిసింది ఎన్నుకోవటంలో పొరపాటుపడటమే అసలు విషాదం.

ఇది జరిగిన నెలరోజులకి ఫైనలియర్ పరీక్షలు వచ్చాయి. అంతా పరీక్షలలో పాస్ అవటానికి ఎవరి పద్ధతుల్లో వారు కష్టపడ్డారు. చదివి పాసవుదామనుకునేవారు కష్టపడి చదివారు. అంత ఓపికలేనివారు స్లిప్పులు రాసుకోవటంలో కష్టపడ్డారు. మొత్తం మీద అందరూ కష్టపడి పరీక్షలు రాసారు. తర్వాత కొన్నాళ్ళకు రిజల్ట్స్ కూడా వచ్చాయి. వైదేహి మంచి మార్కులతోపాసయింది. రామకృష్ణ మాత్రం ఏదో అలా అలా అయిందనిపించాడు.

----

గంగాధరానికి కూతురంటే వల్లమాలిన ప్రేమ. చిన్నప్పటినుండి గుండెలమీద పెట్టుకుని పెంచాడు. మహా గారాము. కూతురు అడిగింది లేదనకుండా కళ్ళల్లో పెట్టుకుని చూసుకున్నాడు. వైదేహి గంగాధరం గారి ఏకైక పుత్రిక. లేకలేక పుట్టింది కావటంతో ఆమెకు చిన్న నెప్పి కలిగినా విలవిలలాడిపోయేవాడు. ఆమెకు మంచి జీవితం ఇవ్వాలనేది ఆ తండ్రి కోరిక. అందుకోసం సరి అయిన పద్ధతిలో సరి అయిన ఆలోచనలతోనే ఆయన ప్రయత్నాలు చేస్తున్నాడు.

కూతురి వివాహం వీలైనంత త్వరలో జరిపించాలని ఆయన ఆలోచన. దానికి తగ్గట్లుగానే మంచి సంబంధాల కోసం ఆయన వెతుకుతున్నాడు. నలుగురయిదుగురికి చెప్పి ఉంచాడు. అందులో ఒకరు ఆయనకు ఒక సంబంధం గురించి చెప్పాడు. కుర్రాడు బాగా చదువుకున్నాడు. మంచి ఉద్యోగం. బాగుంటాడు. ఏ ఆక్షేపణా లేదు. తనకి కూడా బాగా నచ్చింది.

ఆ రోజు సాయంత్రము గంగాధరం పెళ్ళికొడుకు ఫొటోను కూతురికి చూపించాడు.

" ఏమిటి నాన్నా ఇది ?'

"మంచి సంబంధమమ్మా ! ఇతడు సెంట్రల్ గవర్నమెంటులో ఉద్యోగం చాలా మంచి హోదా తల్లీ"

"నాకొద్దు నాన్నా" వైదేహి ఖరాకండీగా చెప్పింది.

సామాన్యంగా తండ్రి మాటకు ఎదురు చెప్పే మనిషి కాదు. ఎందుకు వద్దంటున్నదో గంగాధరానికి అర్థం కావటం లేదు. ఎంత నచ్చచెప్పినా వినటము లేదు.

ఆయన తన ప్రయత్నము మానుకోలేదు.

" కాదమ్మా ! ఇంత మంచి సంబంధం మనకు దొరకదమ్మా. ఒక్కసారి కుర్రాడిని చూద్దాము.అంతగా నచ్చకపోతే వదిలేద్దాము.ఈ ఒక్కసారి నామాట వినమ్మా" అని గంగాధరం కూతుర్ని బ్రతిమాలాడు. ఈయన ఎంతచెప్పినా తన మొండితనము తగ్గలేదు.

అప్పుడు కలిగింది ఆయనకు మొదటిసారి భయం కూతురేమన్నా ప్రేమలో పడిందేమోనని. ధైర్యం ఉగ్గబట్టుకుని కూతుర్ని అడిగాడు.

" ఏమ్మా ! ఇంకెవరైనా నీ మనసులో ఉన్నారా తల్లీ !"

వైదేహి వెంటనే సమాధానం చెప్పలేదు. ఆమెకూ ధైర్యం చాలలేదు రామకృష్ణ గురించి చెప్పేందుకు. కానీ చెప్పక తప్పలేదు. తండ్రి వత్తిడి భరించలేకపోయింది. అదీ కాక ఇవాళ కాకపోయినా రేపెప్పుడైనా చెప్పక తప్పదు. తెగించింది. ధైర్యంకూడగట్టుకుని చెప్పేసింది.

" మా కాలేజీలో చదువుతున్న రామకృష్ణను చేసుకుంటాను నాన్నా !"

వాళ్ళుండే ఊరు చిన్న పట్టణం. దాదాపు ఒకరికి ఒకరు తెలిసే అవకాశమున్నంత చిన్న ఊరు.

"ఎవరూ ? రామస్వామి కొడుకు రామకృష్ణా ?" గంగాధరానికి గుండె అటునుండి ఇటు జరిగింది.

వైదేహి ఊ అంటూ తలూపింది. గంగాధరానికి తలగిర్రున తిరిగింది కూతురు దెబ్బకు. ఏమి చెయ్యాలో తెలియని పరిస్థితి. నీరసపడిపోయాడు.

"అంతకంటే ప్రయోజకుడు నీకు దొరకకపోయాడా తల్లీ! చదువుసంధ్యాలేని వాడెక్కడ దాపురించాడే నీకు. వద్దమ్మా అలాటి పనికిమాలినవాడిని కట్టుకుని నీవు పావుకునేది ఏమీలేదు. నా మాట వినమ్మా.నీకు రాజాలాటి సంబంధము తెస్తాను"

ఏ తండ్రికైనా కూతురికి మంచి సంబంధము చేయాలని ఉంటుంది. దానికి గంగాధరం ఏమీ అతీతుడుకాదు. పోయి పోయి కూతురు ఇలాటివాడిని చేసుకుంటాననంటే ఏ తండ్రి కైనా బాధే !

గంగాధరం ఎంత బ్రతిమిలాడినా వైదేహి తన పట్టు వీడలేదు. తల్లి కూడా నచ్చచెప్పుతానికి విశ్వ ప్రయత్నం చేసింది. లాభం లేకపోయింది.

"సరేనమ్మా నీ ఖర్మ ఎలా రాసి ఉంటే అలా జరుగుతుంది. నేను రామస్వామితో మాట్లాడుతాను"

-----

రాత్రి ఎనిమిదయ్యింది. టీవీ లో సీరియల్ వస్తున్నది. మాంచి రసపట్టులో ఉన్నది. కాళ్ళు బారజాపుకుని రామకృష్ణ సీరియల్ ను ఏకాగ్రతతో చూస్తున్నాడు. సీరియల్ అయితే బాగుంది కానీ హీరో పెరఫార్మెన్స్ రామకృష్ణకు అట్టే నచ్చలేదు. తనైతే ఎంత బ్రహ్మాండంగా చేసి ఉండేవాడో ఆలోచిస్తున్నాడు. రామస్వామి ఇంటికి వచ్చేప్పటికి పుత్రరత్నం సీరియల్‌లో లీనమయిపోయి ఉన్నాడు.

" ఏరా! మీ కాలేజీలో చదివే వైదేహి నీకు పరిచయమేనా ?"

" ఆ తెలుసు. ఎందుకు ?" కొడుకు సమాధానం.

" ఆ ఏమీ లేదు ఆ అమ్మాయి తండ్రి గంగాధరం ఇందాక బజారులో కలిసినపుడు సంబంధం గురించి మాట్లాడాడులే అందుకు"

వైదేహి తండ్రి తన కూతురు సంబంధము గురించి తన తండ్రితో ఎందుకు మాట్లాడాడో రామకృష్ణకు అర్ధం కాలేదు.

" నీ గురించే అడిగాడు. ఆలోచించి చెబుతానన్నాను " రామస్వామి పెద్ద ఉత్సాహంగా ఏమీ లేదు.

రామకృష్ణకు గుండె లయ తప్పింది. తను వింటున్నది నిజమో కలో అర్ధం కాలేదు. వైదేహి ఏమిటి తనతో సంబంధమేమిటి ? తన తండ్రేమైనా పొరపాటు పడ్డాడా ? అన్నీ అనుమానాలే !

" గంగాధరం సంబంధము గురించి మాట్లాడాడురా ! కానీ కట్నమేమీ పెద్దగా ఇచ్చేట్లుగా లేడు! దీనికంటే ఏలూరు నుండి వచ్చారు చూడు. వాళ్ళది మంచి సంబంధము. బాగా కట్నమిస్తారు. దాని గురించి ఆలోచిద్దాము"

తండ్రి మాటలతో గుండెల్లో రాయి పడింది. "ఓర్నాయినో ! ముసలాడు కొంపముంచేట్లున్నాడు బాబోయ్. ఏం చేయాలిరో దేవుడో ."

పోనీ తెగిద్దామా అంటే తండ్రంటే చచ్చేంత భయం. ఎదురు చెప్పలేదు.

నెమ్మదిగా తల్లిని మంచి చేసుకున్నాడు. వైదేహిని తప్ప మరొకరిని చేసుకునే ప్రసక్తిలేదని తల్లికి తేల్చి చెప్పాడు. ఆమెకు అంతగా డబ్బు పిచ్చి లేదు. ఆమెకు కొడుకు ముఖ్యం. ఎలాగోలా భర్తను వప్పించింది.

మొత్తంమీద ఇక్కడ రామకృష్ణ అక్కడ వైదేహి అనుకున్నది సాధించారు.

----

అనుకున్న తర్వాత కథ వేగంగా నడిచింది. గంగాధరం కూతురి పెళ్ళి చాలా ఘనంగా జరిపించాడు. పెళ్ళికి పిలిచినవాళ్ళంతా వచ్చారు. విశేషమేమిటంటే పిలవానివాళ్ళు కూడా వచ్చారు. అసలు వైదేహిలాటి అమ్మాయి ఈ రామకృష్ణను ఎందుకు చేసుకుంటుందో చూడాలనే ఆసక్తితో.

చాలామందికి ఈ పెళ్ళి ఒక పజిల్‌గా మిగిలిపోయింది. పోరాడి ఓడిన వీరులకు మరీ పెద్ద పజిల్. తమలో లేనిదేమిటి ఈ వెధవలో పొడిచేసింది ఏమున్నది ?

మాథ్స్ స్టూడెంట్స్ కు ఏ ఈక్వేషన్ ప్రకారం పెళ్ళి జరిగిందోఅర్థం కాలేదు.

కెమిస్ట్రీ వారికి ఈ పెళ్ళికి ఏ ఫార్ములా పనిచేసిందో తెలియరాలేదు.

కామర్స్ విధ్యార్థులు బాలన్స్ షీట్ టాలీ కాలేదని నిట్టూర్చారు.

ఫిజిక్స్ స్టూడెంట్స్ కొద్దిగా నయం. ఉన్నంతలో వాళ్ళకే కొద్దిగా క్లారిటీ ఉన్నది. సజాతి ధృవాలు వికర్షించుకొనును. విజాతిధృవాలు ఆకర్షించుకొనును. బహుశా ఆ సిద్ధాంతము ఇక్కడ నిరూపితమైందని వాళ్ళొక అభిప్రాయనికొచ్చారు.

ఆహుతలంతా రామకృష్ణ అదృష్టవంతుడని తీర్మానించారు. అయితే ఈ పెళ్ళి రామకృష్ణ అదృష్టం కొద్దీ కాదు వైదేహి అదృష్టం కొద్దీ జరిగిందని కాలం బుజువు చెయబోతున్నది.

ఏదిఏమైనా ఆ పెళ్ళిలో వచ్చిన వారందరూ మనస్ఫూర్తిగానే ఆశీర్వదించారు. కేవలం ఇద్దరికే అసంతృప్తి.

పెళ్ళికూతురు తెచ్చే కట్నం చాలక పెళ్ళికొడుకు తండ్రి, పెళ్ళికొడుకు నచ్చక పెళ్ళికూతురి తండ్రి. ఆ ఇద్దరికే అసంతృప్తి.

మూడు నిద్రలకు వచ్చినపుడు వైదేహి అత్తవారిల్లు గమనించింది. ఆమెకు తృప్తిగానే అనిపించింది. ఇంటి వాతావరణం ఆమెకు నచ్చింది. ముఖ్యంగా అత్తగారు  ఆమెతో పాటు ఆడపడుచు కూడా. ఆడపడుచు ఇంకా కాలేజీ స్థాయికి రాలేదు. ఏదో స్కూల్లో చదువుకుంటున్నది.

తరవాత జరగవలిసిన కార్యక్రమాలన్నీ విజయవంతంగా పూర్తయినవి. ఎక్కడా రవ్వంత తడబాటు లేదు. ఇక్కడకూడా ఓవర్ యాక్షన్ ఎబ్బెట్టు అనిపించలేదు, పైగా బాగుంది కూడా ! రామకృష్ణకు అందని ద్రాక్ష అందింది మరి. మరి ఆ మాత్రం స్పీదు ఉండదా ! ఆషాఢం వచ్చేంతవరకూ రామకృష్ణ అత్తారిల్లు వదలలేదు.  తర్వాత తప్పలేదు. ఆషాఢం పూర్తయ్యేంతవరకు కాలం చాలా నెమ్మదిగా గడిచింది.

శ్రావణమాసంలో ఒక మంచిరోజున వైదేహి చీరె సారెతో అత్తారింటికి కాపురానికి వచ్చేసింది. కోడలును చూసి అత్త మురిసిపోయింది. ఆడబిడ్డ తనకు మంచి ఫ్రండు దొరికిందని సంతోషించింది. రామకృష్ణ సంగతి సరేసరి.  మామగారి సంగతి అనవసరము.

ఆషాఢమాసంలో అతినెమ్మదిగా నడచినా,  శ్రావణమాసం తర్వాతనుండి కాలం రెట్టింపు వేగంతో పరుగెత్తుతున్నది. నెల అయింది రెండు నెలలయింది వైదేహి కాపురానికొచ్చి. వైదేహితో కాలక్షేపం తప్ప రామకృష్ణకు ఏ ఇతర వ్యాపకం లేదు.  ఉద్యోగ ప్రయత్నాలేమీ లేవు.  ఏమైనా చేయాలనే తపన లేదు. నాటకాల రిహర్సల్స్ ఉంటే మాత్రం ఉత్సాహంగా వెళతాడు. మిగిలిన సమయాలలో

వైదేహితో మాత్రమే గడుపుతాడు. వైదేహిలాటి వ్యక్తికి ఈ సోమరితనము నచ్చకపోవటములో ఆశ్చర్యమేమీ లేదు. కూర్చుని తినటమనేది ఆమె నిఘంటువులోనే లేదు.

"స్వామీ ! ఏమిటీ సోమరితనము ఎన్నాళ్ళిలా మీ నాన్నగారి మీద ఆధారపడి బ్రతుకుతాము? ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేయండి మహాప్రభో" అని పోరేది.

"ఉద్యోగం పురుషలక్షణం తెలుసా" అని కూడా గుర్తు చేసేది "మరి మీరింతకూ ఎవరు ? పురుషులేగా" సందేహనివృత్తి కోసం కూడా ప్రయత్నించేది.

ఈ షంటింగు పడలేక రామకృష్ణ ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టాడు కానీ పెద్దగా కలిసిరాలేదు. పెద్ద ఉద్యోగాలు కుదురైన కొలువులు దొరకలేదు. దొరికిన చిన్నపాటివి అతడికి ఆనలేదు. సంవత్సరం గడిచిన తర్వాత కూడా పరిస్థితి యధాతథం.

ఆర్థిక ఇబ్బందులు లేని కుటుంబము కాబట్టి ఇదేమీ వాళ్ళమీద ఏమీ ప్రభావం చూపలేదు. కానీ వైదేహి సర్దుకోలేక పోయింది. ఇక భర్త మీద ఆశ వదులుకుంది. ఎన్నాళ్ళిలా! తనే ఏమైనా చేయాలి. దానికి సమాధానం చాలా తొందరలోనే దొరికింది. తమ ఇంటిదగ్గరే జాకెట్లు కుట్టుకుంటూ జీవితాన్ని నెట్టుకొస్తున్న ఒక ఇల్లాలిలో ఆమెకు ఒక దారి కనిపించింది. ఆ పేదింటి ఇల్లాలు చేస్తున్న పనే తను పెద్ద స్థాయిలో చేస్తే !

ఈ ఆలోచన వచ్చిన తర్వాత ఆమె నిమిషం కూడా వృధా చేయలేదు. సగటు మధ్యతరగతి ఇళ్ళల్లో చాలామందికి కుట్టుమిషన్లు ఉంటాయి. వారికి ఆ పనిలో ఎంతో కొంత ప్రవేశం ఉంటది. అలాగే వైదేహికి కూడా. దానికి తోడు వైదేహిలో క్రియేటివిటి ఎక్కువే !

ప్రతి ఊరిలోనూ చిన్నదో పెద్దదో ఫాషన్ డిజైనింగ్ ఇన్స్టిట్యూట్లు ఉంటున్నవి. అలాటి ఒక స్కూల్లో వైదేహి జాయినయ్యింది. స్వతహాగా చురుకైంది కావటంతో దానికితోడు సృజనాత్మకత కూడా జత కలవటంతో కొత్త డిజైన్లను రూపొందిచటమనే కళను చాలా త్వరగా అంది పుచ్చుకుంది.

కోడలి ప్రయత్నాలకు ఇంట్లో ఎవరూ ఏమీ అభ్యంతరం పెట్టలేదు.రామస్వామి అయితే సంతోషించాడు కూడా. కొడుకు చేయలేని పని కోడలు చేయగలుగుతుంది. కోడలిని ప్రోత్సహించాడు. అవసరమయిన పెట్టుబడిని కూడా అందించాడు. వాళ్ళ ఇల్లు చాలా పెద్ద స్థలంలో ఉండటము వైదేహికి కలసి వచ్చింది. ఖాళీ స్థలంలో షెడ్లు వేసి పనిమొదలు పెట్టారు. పదిమంది స్త్రీలను పనిలో పెట్టుకున్నారు.

అయితే వైదేహి ప్రయత్నం మొదట్లో ఏమంత ఆశాజనకంగా లేదు. ఆమె ఈ రంగానికి కొత్త. పైగా స్త్రీ. చాలా మంది రడీమేడ్ వ్యాపారస్తులు ఆమెను తక్కువ అంచనా వేసారు. పైగా అందరూ బొంబాయి డిజైన్లకు అలవాటు పడ్డారు. అవన్నీ దూరపు కొండలు. నునుపుగా ఉంటవి. వైదేహి ఉత్పాదనలు దగ్గరివే కాదు చాలా దగ్గరివి. ఎవరికీ ఆనటం లేదు. డిజైన్లు బాగోలేదని కాదు, బాగున్నవి. కానీ ఎవరికీ నచ్చువేమోనన్న సందేహం. ఎవరూ స్టాక్ పెట్టటానికి ముందుకు రావటం లేదు.

వైదేహి పిరికిమనిషి కాదు. నిరుత్సాహమన్నది తన డిక్షనరీలోనే లేదు. తనమీద తనకు పూర్తి నమ్మకముంది. ఏదో ఒకరోజు ఈ రంగాన్ని తను శాసిస్తుంది, కాకపోతే కొద్దిగా ఆలస్యమవుతుంది. బ్రేక్ రావటం మాత్రం ఖాయం.

రామకృష్ణ స్వంతంగా ఏమైనా చేయలంటే బద్ధకస్తుడే కానీ భార్యకు సహకారమందించటంలో మాత్రము ఏమీ బద్ధకించలేదు. రోజూ ఆమెను తన బండిమీద ఎక్కించుకుని ప్రతిషాపుకు తిరిగేవాడు. చుట్టుపక్కల ఊళ్లకు కూడా తీసుకెళ్ళేవాడు. అమెకు అవసరమైన సరంజామాను నిమిషాలమీద అందించేవాడు. తను చేయగలిగిన ప్రతి సహాయాన్ని ఆమెకు అందించేవాడు.

వైదేహికి ఒకరోజు ఒక ఆలోచన వచ్చింది. తను తయారుచేసిన డ్రస్సులు తన దగ్గరే ఉంచుకునే బదులు షాపుల్లోనే ఉంచుదాము. ఎక్కడైనా ఖాళీగా పడి ఉండటమేగా ! అమ్మినపుడే డబ్బులిస్తారు. ఈ ఆలోచన వచ్చిన తర్వాత ఆమె నిమిషమాగలేదు. నాలుగైదు షాపులవారిని కలుసుకుని తన ప్రతిపాదనను వాళ్ళ ముందు ఉంచింది.

" సార్ ! మా ప్రోడక్ట్స్ ను మీరు మార్కెట్ చేసి పెట్టండి. అవి అమ్ముడయిన తర్వాతనే మాకు డబ్బు ఇవ్వండి. ఇందువలన మీకు నష్టమేమీ లేదు కదా!"

పెట్టుబడిలేని వ్యవహారం కాబట్టి వాళ్ళకు సహజంగానే ఏమీ అభ్యంతరము లేకపోయింది.

" అమ్మా నీ మీద అభిమానం కొద్దీ మేము ఒప్పుకుంటున్నాము. మీ రేటు ఎంతో చెప్పండి అమ్మిన దానిలో పదిశాతం మేము కమీషన్ తీసుకుంటాము. మిగిలినది మీది.. సరేనా?"

వ్యాపారస్తులు వ్యాపారస్తులే ఎక్కడైనా ! ఇందులో వాళ్ళకు పోయేది ఏమీలేదు. అమ్మగలిగితే కమీషన్ వస్తుంది. లేకపోతే లేదు. వాళ్ళ పెట్టుబడేమి నష్టపోవటము లేదు. ఆమె స్టాక్‌ను అమ్మిపెట్టటానికి వప్పుకున్నారు.

వచ్చేవన్నీ పండగరోజులే. క్లిక్ అయితే ఇప్పుడే అవ్వాలి. అవుతుంది కూడా ! వైదేహి కృషి సామాన్యమైంది కాదు. తన కెరీర్ మొదటి దశలో ఉన్నది. ప్రయత్నంలో పూర్తి అంకిత భావమున్నది. పైకి రావాలన్న తాపత్రయమున్నది. నాణ్యత ఉంది. అది ఆమె సృజనాత్మకత అదనపు బలం.

షాపుల్లో అమ్మే డ్రస్సులన్నీ వాళ్ళు పెట్టుబడి పెట్టి తెచ్చినవి. పైగా మంచి ఆకర్షణీయమైన ప్యాకింగుల్లో ఉంటాయి. షాపు వాళ్ళు కూడా వాటినే అమ్మేందుకే ప్రాధాన్యతనిచ్చేవారు. వైదేహి ప్రోడక్ట్స్ కు ఆఖరి ప్రాధాన్యత. ప్రారంభంలో ఏమీ అమ్ముడుపోలేదు.

జీవితంలో చాలా సంఘటనలు నాటకీయంగా జరుగుతాయి. ఒక్కోప్పుడు అవే ఒక పెద్ద మార్పుకు కారణంకావచ్చు. అలాటి సంఘటనే సంక్రాంతికి పదిహేనురోజుల ముందు జరిగింది. కాలేజీకి ఇంక రెండు మూడు రోజులలో శలవులిస్తారనగా పండక్కి బట్టలు కొనుక్కొని ఇంటికి వెళ్ళే ప్రయత్నంలో ఉన్న రమ అనే ఒక స్టూడెంటు దగ్గరలో ఉన్న రడీమేడ్ షాపుకెళ్ళింది. ఆమెకు ఏదీ నచ్చటంలేదు. అన్నీ పాత డిజైన్లే. మార్చి మార్చి పాత డిజైన్లనే మళ్ళీ మళ్ళీ కుట్టిన బాపతే. ఆ అమ్మాయి దృష్టి అనుకోకుండా దొంతరలో అడుగున పడిఉన్నఒక డ్రస్సు మీద పడింది. అది వైదేహి వర్కుషాపులో తయారైన డ్రస్సు.

సేల్స్ మాన్ దానిని తీసి చూపించాడు. రమకు ఆ డ్రస్సు చాలా వెరైటిగా అనిపించింది. దానిలో ఆ అమ్మాయికి చాలా నవ్యత కనిపించింది. సేల్స్ మాన్లు సామాన్యులు కాదు. వాస్తు పండితులు, జ్యోతిష్కులు లాగా చాలా ఘటికులు. ఎదటివాడి మనసులోని భావాలు ఇట్టే పసిగట్టేస్తారు. తర్వాత జరగబోయే సంభాషణ తదనుగుణంగానే జరుగుతుంది.

" చాలా మంచి డిజైనమ్మా. వైదేహి అని మీ కాలేజీలోనే చదివింది. ఆమె డిజైన్‌చేసినదే ఇది. చాలా అద్భుతమైన ప్రోడక్టు. ఇప్పటికి ఇలాటివి 30 పీసులదాకా అమ్మామండి. తీసుకోండి మీ శరీరానికి బాగా నప్పుతుంది. మీ కలర్‌కు సూటయ్యే డిజైనమ్మా ఇది " సేల్స్ మాన్ చెలరేగిపోయాడు.

వైదేహి పేరు రమ విని ఉన్నది. అయినా ఆ విషయమేంతగా ఆమెను ఆకర్షించలేదు. ఆమెకు నచ్చినది ఆ డ్రస్సు మాత్రమే. పైగా రేటు కూడా మిగిలిన వాటితో పోలిస్తే తక్కువే.

సేల్స్ మాన్ తక్కువవాడేమీ కాదు. కస్టమర్ల నాడీ పట్టుకోవటంలో మాంచి అనుభవశాలి " వీటిని కూడా చూడండమ్మా. ఇవి కూడా మీకు నచ్చుతాయి. ఒకవేళ మీకు నచ్చకపోతే తర్వాతనైనా వెనక్కి తీసేసుకుంటాము. కావలంటే డబ్బులు కూడా వాపస్

చేసేస్తాము"

రమ ఇంకేమీ ఆలోచించలేదు. వాపస్ సౌకర్యం ఉంది. అంతగాబాగోలేదంటే తర్వాత చూసుకోవచ్చు. నచ్చకపోయే ప్రసక్తే లేదు. ఆ డిజైన్లు ఆమెను అంతగా ఆకర్షించాయి. తనకు తన చెల్లెలుకు నాలుగు డ్రస్సులు వేరే వేరే డిజైన్లలో కొన్నది.

మగవెధవలు చదువు తప్ప అన్ని విషయాల్లోనూ వేలెట్టి కెలుకుతారు. కానీ ఆడపిల్లలు అలాకాదు. వాళ్ళకు రెండే రెండు విషయాల్లో అమితాసక్తి. ఒకటి బట్టలు రెండు నగలు. ఈ ఆసక్తి విశ్వవ్యాప్తం. రమ హాస్టల్‌కు చేరగానే తోటి పిల్లలంతా బిలబిలమంటూ చుట్టు చేరారు. రమ పండగకు కొన్న బట్టలు ఛూడాలన్న ఆసక్తితో ఆమె చుట్టూ మూగారు.

రమ కొనుక్కున్న డ్రస్సులు ఆ పిల్లలకి ఎంతబాగా నచ్చినవి అంటే అప్పటికప్పుడు షాపును తెరిపించి కొనుక్కోవాలనేంతగా. రేపు ప్రొద్దునే లేవగానే చేయాల్సిన మొదటి పని షాపుకు వెళ్ళి డ్రస్సులు కొనుక్కోవటమే . పోలిక సరిఅయినది కాదు కాని ఈ ఆసక్తి అనేది దురదగుంటాకు లాటిది. గోక్కోందే దురద పోదు. పక్కవాడికి చెప్పందే ఈ కుతి తీరదు. మొత్తంమీద తెల్లారేప్పటికి హాస్టల్‌మొత్తానికి తెలిసిపోయింది.

ప్రతిభ అనేది నివురు కప్పిన నిప్పు. చిన్నగాలి అల చాలు నిప్పు బయట పడటానికి. అనుకోకుండా రమ అనే ఆ అమ్మాయి వైదేహి జీవితంలో ఒక పెద్ద మార్పుకు కారణమయ్యింది. ఆ రోజు రమ కొన్న నాలుగు జతల బట్టలు ఆమె కెరీర్‌ను ఒక పెద్ద మలుపు తిప్పాయి. హాస్టల్ పిల్లల పుణ్యమా అని వైదేహి డిజైన్లకి చాలా ప్రాచుర్యం వచ్చింది. ఎవరికైనా నచ్చకపోతే నలుగురికి చెప్తారు మరి అదే నచ్చితే నలభైమందికి చెపుతారు. నోటి మాటమీద మంచి పబ్లిసిటీ జరిగింది. మొత్తం మీద సంక్రాంతిలోపు వైదేహి షాపులవాళ్ళకు ఇచ్చిన స్టాక్ దాదాపు అమ్ముడైపోయింది. అది కాదు ముఖ్యం వైదేహి మీద నమ్మకం వారికి బాగా పెరిగింది. ఫర్వాలేదు దగ్గరి కొండలైనా నునుపుగానే ఉంటవి అని వైదేహి ఋజువు చేసింది

నెమ్మదిగా వైదేహి ప్రోడక్ట్స్ కు డిమాండ్ కాస్త వేగంగానే పెరుగుతూ వచ్చింది. కలసి రావాలే గానీ అదృష్టమనేది జంఝూమారుతమే. వైదేహి పేరు క్రమంగా పెరుగుతూ వచ్చింది. దానికి తగ్గట్లుగానే డిమాండ్ కూడా. ఊపిరి సలపనంత పని. నెమ్మదిగా వర్కుషాపును పెద్దది చేసింది. ఉద్యోగులు పెరిగారు. వ్యాపారం పెరిగింది. పెరగనిదల్లా ఆమె అహం. మొదటి రోజు ఎలా ఉన్నదో ఇప్పుడూ అంతే. ఆ రోజు ఎంత తాపత్రయమున్నదో ఇప్పుడూ అంతే. ప్రతి డిజైన్‌లోనూ ఏదో నవ్యత చూపించేది. నాణ్యతలో రాజీ పడేది కాదు. ఇవి చాలు కదా కొనుగోలుదారులలో అభిమానం పెరగటానికి. క్రమంగా వైదేహి ఒక బ్రాండ్‌గా ఎదిగింది.

ఇంతై అంతై వటుదంతై చివరకు విశ్వాన్నే ఆక్రమించింది. ఊరు దాటింది, జిల్లా దాటింది, చివరకు రాష్ట్రాన్ని కూడా దాటింది. ఒక చిన్న పట్నంలో పుట్టిన సామాన్యురాలు, చదువుకునేప్పుడు కేవలం ఒక అందగత్తెగా మాత్రమే గుర్తింపబడిన సామాన్యురాలు, పెళ్ళైన తర్వాత ఒక గృహిణిగానే మిగిలిపోవాల్సిన సామాన్యురాలు నేడు మాత్రం ఒక అసమాన్యురాలు. గొప్పవాళ్ళు ఎక్కడో దూరతీరాల్లో పుట్టరు. మనతోనే ఉంటారు. మన మధ్యే ఉంటారు. మనం చూస్తూనే ఉంటాము వాళ్ళు మనని దాటిపోతారు. మనం చూస్తూనే ఉంటాము వాళ్ళు ఎదిగి పోతారు. ఏ భగవంతుడూ వాళ్ళను ప్రత్యేకంగా ఆశీర్వదించడు. ఏ అదృష్టమూ ఎదురొచ్చి అందలము ఎక్కించదు. వాళ్ళ కృషి, వాళ్ళ కష్టమూ, వాళ్ళ పట్టుదలా మాత్రమే వారికి కలిసివచ్చేది. ఇది జీవిత సత్యం. ఇది మాత్రమే సత్యం.

వైదేహి ఎదిగింది కానీ ఒదిగే ఉంది. నెమ్మదిగా ఆమె సామ్రాజ్యం విస్తరించింది. పంజాబ్, ముంబైల నుండి కాదు ఇక్కడి నుండే అక్కడికి మోడల్స్ వెళ్ళుతున్నవి. పది సంవత్సరాల తర్వాత చూసుకుంటే వర్కుషాపు ఫాక్టరీ అయింది. పదిమందితోమొదలు పెట్టిన వ్యాపారం ఈరోజు వెయ్యిమందికి ఉపాధి కల్పిస్తున్నది. లక్ష రూపాయల టర్నోవరు కాస్తా కోట్లరూపాయల టర్నోవర్‌ను అందుకుంది.

రామకృష్ణను కాక మరెవరినైనా చేసుకుని ఉంటే వైదేహి ఒక మామూలు గృహిణిగానే మిగిలి ఉండేదేమో? ఆమె ప్రతిభ బయటకు వచ్చేదో లేదో ? ఏమో !

నిస్సందేహంగా చెప్పవచ్చు రామకృష్ణతో వివాహం మూలంగా మాత్రమే వైదేహి తన విశ్వరూపం చూపగలిగే అవకాశం వచ్చింది. ప్రతిభ ఉండటం కాదు ముఖ్యం అది బయటకు వచ్చే మార్గాలు కూడా ఉండాలి. అందుకే ఈ పెళ్ళి రామకృష్ణ అదృష్టం కాదు వైదేహిదని చెప్పేది.

ప్రతి కథకూ ఒక క్లైమాక్స్ ఉంటుంది. ఎక్కడో ఒకచోట ముగింపు తప్పదు. ఈ కథకు కూడా ముగింపు దగ్గరకు వచ్చింది.

ప్రతి సంవత్సరం లాగానే రాష్ట్రప్రభుత్వం ఉత్తమ పారిశ్రామికవేత్త అవార్డు ప్రకటించింది. ఈ సంవత్సరానికి వైదేహి ఎంపిక అయ్యింది. నిస్సందేహంగా ఆమె అందుకు అర్హురాలే! ఆ ఊరి చాంబర్ ఆఫ్ కామర్స్ కూడా అదే అనుకుంది. ఎంతైనా ఆ ఊరి ఆడపడుచు. ఈ అవార్డు ద్వారా ఊరికి గౌరవం తెచ్చిపెట్టిన సమర్థురాలు. ఆ ఊరికే గర్వకారణం. ఆ ఆనందాన్ని నలుగురితో పంచుకోవాలి. అందరికీ తెలిసింది ఒకే మార్గం సన్మానం. వైదేహికి సన్మానం చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ తీర్మానించింది.

వైదేహికి సన్మానం చాలా ఘనంగా జరిగింది. పాత స్నేహితులు, బంధువులు, ఊరి పెద్దలు అందరూ హాజరయ్యారు. కుటుంబసభ్యులకైతే ఆనందం వర్ణనాతీతం. సభకు అధ్యక్షుడు మున్సిపల్ ఛైర్మన్. ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్. అందరూ ఆమెను అనేక విధాలుగా కొనియాడారు. ఊరికే కాదు రాష్ట్రానికే గర్వకారణమని ఆకాశానికెత్తేసారు.

తనకు జరిగిన సన్మానానికి కృతజ్ఞతలు చెప్పుతూ వైదేహి ప్రసంగించాలి. ఆమె ప్రసంగానికి ముందు రామకృష్ణ మాట్లాడుతాడు. తర్వాత వైదేహి మాట్లాడుతుంది.

రామకృష్ణ మైకు దగ్గరికి వచ్చి తన ప్రసంగాన్ని మొదలు పెట్టాడు.

" నా పేరు రామకృష్ణ. నేను వైదేహి భర్తను...................." రామకృష్ణ ప్రసంగం సాగిపోతూ ఉన్నది.

చెప్పుకునేందుకు ఇంకేమీ లేదు.

# పెంపకం

జి.శ్రీనివాస్

ఉదయం 5 గంటలు దాటింది. కారు డ్రైవరు రైల్వే స్టేషన్ కి వెళ్ళాడో లేదో, సరిగ్గా అవసరం అయినప్పుడే సెల్ సిగ్నల్ ఉండదు. నర్సాపురం ఎక్స్ ప్రెస్ స్టేషన్ కి వచ్చే ఉంటుంది. చిన్నాన్న, చిన్నాన్న రెండో కూతురు శాంతి రాత్రి పాలకొల్లు నుండి ట్రైన్ లో బయలుదేరారు. డ్రైవరు మొబైల్ నెంబర్ చిన్నాన్నకు ఎస్ఎంఎస్ చేశాను అలాగే చిన్నాన్న మొబైల్ నెంబర్ రాత్రే డ్రైవరు కి ఇచ్చి కారుని కూడా ఇంటికి

తీసుకెళ్లి ఉదయాన్నే డైరెక్ట్ గా స్టేషన్ కి వెళ్ళమని చెప్పాను. నిన్నటి నుండి ఈయన తీవ్రమైన జ్వరంతో బాధ పడుతున్నారు, లేకపోతే ఈయనే స్టేషన్ కి వెళ్ళేవారు. డ్రైవరు వెళ్ళే ఉంటాడులే కానీ అక్కడైనా సిగ్నల్స్ ఉన్నాయో లేవో. నాలుగు సంవత్సరాలు క్రితం మా గృహప్రవేశం ఫంక్షన్ కి వచ్చిన చిన్నాన్న మళ్ళీ రావటం ఇదే.

నేను ఉన్న ఈ పరిస్తితుల్లో వాళ్ళు రావటం వలన నాకు కలిగే ఓదార్పు కంటే నేను ఓడిపోయాను అనే బాధే ఎక్కువగా ఉంది. జీవితంలో నేను నిజంగానే ఓడిపోయాను. నామీద నాకు చాలా నమ్మకం ఉండేది. అంతా నేను అనుకున్నట్టే జరుగుతుంది అనుకున్నాను, అలా జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది. నేను ఇబ్బందుల్లోనో కష్టాల్లోనో ఉన్న ప్రతిసారి చిన్నాన్న నాకు అండగా ఉన్నాడు అయినా ఎందుకో ఆయనంటే నాకు చిన్న చూపు ఉండేది. ఆయన చదువుకున్నది ఆరో తరగతి, చేసేది వ్యవసాయం నేనేమో డిగ్రీ చదివి ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి ఆయన కంటే అన్నీ విషయాలు నాకే బాగా అవగాహన ఉంటాయి అని అనుకోవటం వలనేమో ఆ చిన్న చూపు. నేను ప్రతివిషయాన్ని అవగాహన తో కాదు స్వార్ధం,అహంకారం తో ఆలోచించాను, చిన్నాన్న కూడా నాలాగే స్వార్ధంగా ఆలోచించి ఉంటే నేను ఈ స్తితి లో ఉండేదాన్నా?.

మా తాతయ్యకి ఇద్దరు కొడుకులు. నా చిన్నతనంలోనే నాన్న చనిపోయారు. అమ్మ నన్ను తాతయ్య దగ్గర వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పుడప్పుడు వచ్చి చూసివెళుతుండేది. ఒక సంవత్సరం తర్వాత తాతయ్య కూడా చనిపోయారు. చిన్నాన్న వాళ్ళింటికి నన్ను తీసుకువెళ్లాడు. పెళ్ళయి ఏడు సంవత్సరాలు అయినా అప్పటికింకా చిన్నాన్నకి పిల్లలు లేరు. నేను ఇంటికివెళ్లిన ఏడాదికి చిన్నాన్నకి మొదటి సంతానం శకుంతల. ఆ తర్వాత మూడు సంవత్సరాలకు శాంతి పుట్టారు. ఇదంతా నేను ఇంట్లో అడుగు పెట్టిన వేళా విశేషం కారణం గానే జరిగిందని చిన్నాన్న నన్ను చాలా ప్రేమగా చూసుకునేవాడు. ఒక విధంగా చెప్పాలంటే తన ఇద్దరి కూతుళ్ళకంటే కూడా ఎక్కువగ, అంతేకాదు చదువులో కూడా వాళ్ళ ఇద్దరికంటే నేనే బాగా చదివేదాన్ని, మేము చదువుకుని మంచి ఉద్యోగాలలో స్థిరపడాలనేది ఆయన కోరిక. శకుంతల,శాంతి చదువు విషయంలో కొంత వెనకబడి ఉండేవారు, దాంతో రోజురోజుకు ఇంట్లో నా మాటకు విలువ పెరుగుతూ వచ్చింది, పండుగలకు కొత్త బట్టలు కొనడం నుండి ఇంట్లో జరిగే అన్నీ నిర్ణయాలలో నా జోక్యం ఉండేది. ఇంట్లో అందరూ నన్ను ఎంతో గౌరవంతో చూసేవారు దీనికంతటికి కారణం నేను చాలా తెలివి కలదాన్ని కావటమే అనుకున్నాను.

నేను బి.ఎస్.సి పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలలో ఉండగా చిన్నాన్న నా పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టారు. నాన్న వాటా క్రింద వచ్చిన రెండు ఎకరాలు భూమి, దాని మీద వచ్చే ఆదాయం మొదటినుండి నా పేరు మీద బేంక్ లో ఎప్పటికప్పుడు చిన్నాన్న జమచేస్తూనే ఉన్నారు. కాబట్టి వీటితో నాకు మంచి సంబంధమే కుదిరింది. వాళ్ళది భీమవరం, పెళ్ళికొడుకు హైదరాబాద్ సెక్రెటేరియట్ లో ఉద్యోగం,అతని తల్లితండ్రులు భీమవరం లోనే ఉంటారు. పెళ్ళైన తర్వాత అత్తవారింటికి వెళ్ళేటప్పుడు ఆడపిల్లలు అందరూ ఎంతోకొంత బాధ పడతారు, కానీ నాకెందుకో ఆ బాధ కలగలేదు, అనదంగానే హైదరాబాద్ లోని కొత్త కాపురంలో అడుగు పెట్టాను. చిన్నప్పటి నుండి చిన్నాన్న ఇంటిలో పెరిగినా, వాళ్ళు ఎంత ప్రేమ చూపెట్టిన అది నా సొంత ఇల్లు కాదని, వాళ్ళు నా సొంత మనుషులు కాదని మనసులో ఏ మూలనో ఉండిపోయింది. హైదరాబాద్ లో అడుగు పెట్టగానే ఏవో తెలియని బంధాల నుండి విముక్తి అయినట్టు,నా సొంత సామ్రాజ్యంలో అడుగు పెట్టిన భావన కలిగింది. నా సామ్రాజ్యాన్ని ఎటువంటి కష్టాలు,నష్టాలు లేని చాలా ఆనందమైనదిగా తీర్చి దిద్దు కోవాలనే కోరిక ఉండేది. దానికి తగ్గట్టుగానే మా వారు చాలా మంచివారు. నన్ను అన్నీ విషయాలలో బాగా ప్రోత్సహించారు, పెళ్ళి అయిన తర్వాత బి.ఇడి చేశాను గవర్నమెంట్ స్కూల్ లో టీచర్ ఉద్యోగం సంపాదించాను.

పెళ్ళైన ప్రతి ఆడదాని జీవితంలో వచ్చే మొదటి మధురమైన సంఘటన, ఇద్దరం ఉండే మా ఇంట్లోకి మూడో వ్యక్తి రాబోతున్నారు. నేను తల్లిని కాబోతున్నానే వార్త తెలిసి చిన్నాన్న, పిన్ని వచ్చారు, నాకు చాలా జాగ్రత్తలు చెప్పి ఏడవ నెల రాగానే ఇంటికి తీసుకు వెళ్తామని చెప్పారు, అలాగే ఏడవ నెల రాగానే వాళ్ళ ఇంటికి తీసుకు వెళ్లారు. ఎప్పటిలాగే వాళ్ళు నన్ను చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. కాన్పు సులువుగానే జరిగింది. శ్రవణ్ కి అచ్చు నా పోలికలే వచ్చాయి. శ్రవణ్ ని చూడటానికి వచ్చిన మా వారు నన్ను మొదటి నెలలోనే పంపేయమని చిన్నాన్నకు చెప్పారు.చిన్నాన్న నన్ను హైదరాబాద్ కి నన్ను తీసుకువచ్చి తిరిగివెళ్లే ముందు

"అమ్మా! నీ చెల్లెళ్ల సంగతి నువ్వే పట్టించుకోవాలి,నాకు ఈ చదువులు,ఉద్యోగాల గురించి అంతగా తెలియదు, వాళ్ళు కూడా నీలాగే ఏదో ఒక ఉద్యోగం చేస్తే చూడాలని ఉంది. నువ్వే వాళ్ళకు సరైన దారి చూపించాలి" అన్నారు.

నేను "అలాగే చూద్దాం" అన్నాను

కానీ నా మనసులో ఏదో అనుమానం నన్ను పెంచినందుకు ప్రతిఫలం ఆశిస్తున్నారా, ఆయన పిల్లల విషయం లో నన్ను ఉపయోగించు కోవాలనుకుంటున్నారా? అని ఆలోచిస్తుండగానే

"అమ్మా, నువ్వు ఉద్యోగం చేసుకుంటూ పిల్లడాని చూసుకోవటం కష్టమౌతుందేమో, కొన్నాళ్లు మీ పిన్ని,చెల్లెళ్ళు ఎవరో ఒకరు వచ్చివెళుతుంటారు" అన్నారు.

"నాకింకా శలవలు ఉన్నాయి. అంతే కాకుండా మా అత్తగారు కూడా కొన్నాళ్లు ఉంటానన్నారు, అయినా నా కోసం శకుంతల,శాంతి ల చదువు చెడగొట్టి పంపనవసరం లేదు" అని చెప్పాను ఏ విదమైన సహాయం ఇకముందు తీసుకోకూడదని.

"సరే, ఉంటాను" అన్నారు అప్పటికే సిద్దంగా ఉన్న ఆటో ఎక్కుతూ..

వారానికి ఇంచుమించు రెండుసార్లు చిన్నాన్న ఇంటి నుండి నా యోగక్షేమాలు శ్రవణ్ యోగ,క్షేమాలు తెలుసుకోటనికి ఫోన్ వస్తుండేది. ఒకరోజు ఎప్పటిలాగే చిన్నాన్న నుండి ఫోన్ కానీ ఈసారి మా యోగ,క్షేమల గురించి కాదు. శకుంతల ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుంది, కాలేజీ దగ్గర జిరాక్స్ సెంటర్ లో పనిచేసే ఎవరో అబ్బాయిని ప్రేమించిందట, ఆ అబ్బాయి తో సినిమాలు,షికారులు చేస్తుంటే ఎవరో చూసి చిన్నాన్న కు చెప్పారట. శకుంతలను నిలదీస్తే అది నిజమేనని అతన్ని తప్ప ఎవరిని పెళ్లి చేసుకొనని మొండికేసిందట. నన్ను ఏదో రకంగా వీలు చూసుకుని వచ్చి శకుంతలకు నచ్చచెప్పమని అడిగారు. అది అలా తయారవటానికి కారణం చిన్నాన్నే అనిపించింది లేకపోతే ఈ వయసులో ప్రేమేంటి పెళ్ళేంటి. అదే విషయం నిర్మొహమాటంగా చెప్పాను.

"చూడు చిన్నాన్నా.. పిల్లల్ని సరిగా పెంచటం చేతకాకపోతే ఇలానే జరుగుతాయి,పిల్లలకి ప్రేమ, గారాబమే కాదు క్రమశిక్షణ కూడా అవసరమే, పిల్లల్ని క్రమశిక్షణలో పెట్టటానికి నువెప్పుడు ప్రయత్నం చేయలేదు. తప్పంతా నీదే,ఇప్పుడు నేను దానికి ఏమిచెప్పినా ప్రయోజనం ఉండదు" అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

కానీ నేను కూడా అదే ఇంటిలో ఆయన దగ్గరే పెరిగాను అనే విషయం ఆ సమయంలో నేను ఎందుకో మర్చిపోయాను. అసలే పెద్ద కూతురి నిర్వాకం వలన గాయపడ్డ మనస్సును నా మాటలతో మరింత గాయం చేశాననే విషయం గ్రహించలేకపోయాను.

కొన్నాళ్ళ తర్వాత శకుంతలకు అదే అబ్బాయితో పెళ్లి జరిపించేశాడు చిన్నాన్న. అందులో నాకు ఆయన చేతకానితనమే కనిపించింది. అదిరించో బెదిరించో పెద్దవాళ్లే వేరే సంబంధం చూసి చెయ్యాలి కదా అనుకున్నాను.

నేను మాత్రం శ్రవణ్ ని ఎంతో ప్రేమగా అంతకంటే ఎక్కువ క్రమశిక్షణతో పెంచి పెంపకం అంటే ఏంటో చూపాలని నిర్ణయించుకున్నాను. శ్రవణ్ యొక్క ప్రతి విషయంలొ శ్రద్ద తీసుకుని పెంచసాగాను, వాడు కూడా నా అంచనాలకు తగ్గట్టుగానే పెరగసాగాడు. క్రమశిక్షణ తో పాటు చదువులో కూడా క్లాస్ లో అందరికంటే ముందుండేవాడు.

ఇంజనీరింగ్ అయిపోగానే శ్రవణ్కి పెద్ద ఐ.టి.కంపెనీలో మంచి ప్యాకెజతో జాబ్ వచ్చింది. జాబ్ లో జాయినై సంవత్సరం అయింది. ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులోనే జరగాలి, ఈ మధ్య అందరూ కెరియర్ అంటూ ముప్పై సంవత్సరాలు దాటినా పెళ్లి ఊసేత్తటం లేదు. శ్రవణ్ కి అలా జరగకూడదని తెలిసిన వాళ్ళందరికీ మంచి సంబంధం చూడమని చెప్పాం. మాట్రిమోని లో కూడా రిజిస్టర్ చేసి ఫోటో పెట్టాము.

బయట కారు హారన్ మ్రోగింది. చిన్నాన్న వాళ్ళు వచ్చినట్టున్నారు, టైమ్ ఆరున్నర అవుతుంది. రైలు లేటైనట్టుంది. నేను తలుపు తెరిచాను అప్పటకి వాళ్ళు గేటు తీసుకుని లోపలికి వస్తున్నారు. చిన్నాన్న లో మార్పు అంతగా కనపడటంలేదు జుట్టు మాత్రం తెల్లబడింది. శాంతి మాత్రం బాగా లావైంది, దానికి ఇద్దరు ఆడపిల్లలు.

"ప్రయాణం ఎలా జరిగింది?" అని అడిగి చిన్నాన్న చేతిలో బేగ్ అందుకుంటూ "పిల్లలెల ఉన్నారు శాంతి?" అని అడిగి హాల్ లో సోఫా చూపించి కూర్చోమని చెప్పి బేగ్ రెండో బెడ్ రూమ్ లో పెట్టటానికి వెళ్ళాను.

శాంతి నా కూడా వచ్చి "పిల్లలు బాగానే ఉన్నారు అక్కా.." అంది తన చేతిలో ఉన్న బేగ్ కూడా అక్కడ పెడుతూ. "వాళ్ళను కూడా తీసుకురావాల్సింది" అంటూ హాల్ లోకి వచ్చాను.

చిన్నాన్న సోఫా పక్కని కుర్చీలో కూర్చొని తను వేసుకున్న స్వెట్టర్ తీసి పక్కనపెడుతు "అల్లుడు గారేరమ్మా?" అని అడిగారు.

"రాత్రంతా జ్వరంతో బాధ పడ్డారు, ఇంకా లేవలేదు. ఇప్పుడైతే జ్వరం నార్మల్ కి వచ్చింది " అన్నాను.

"అక్క నువ్వు చాలా చిక్కిపోయావు, వాడి గురించి బెంగ పెట్టుకున్నట్టున్నావ్" అంది శాంతి.

శ్రవణ్ విషయం ప్రస్తావనకు నాకు దుఃఖం తన్నుకు వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరిగాయి.

"అసలు వాడు ఎందుకిలా చేశాడు?" చిన్నాన్న ప్రశ్న.

"నా అహంకారానికి, నా మీద నాకున్న మితిమీరిన నమ్మకానికి పడిన శిక్ష " అన్నాను జీరబోయిన గొంతుతో.

అతి కష్టం మీద దుఃఖాన్ని కళ్ళల్లో నీళ్లను ఆపుకున్నాను కానీ గొంతులో జీరను దాచలేకపోయాను.

"మీరు ఇటువంటి సమస్యతో ఉన్నప్పుడు నేను నా కనీస బాధ్యత కూడా నిర్వర్తించలేదు,పైగా అవమానకరంగా మాట్లాడాను, అందుకే దేవుడు నాకు తగిన శాస్తి చేశాడు" అన్నాను.

"అవన్నీ ఇప్పుడేందుకమ్మా, అసలు ఏమైందో చెప్పు" అన్నారు.

ఈసారి కన్నీటిని ఆపటం నా వల్ల కాలేదు "ఎటువంటి ప్రక్కదారులు,వ్యామోహాలకు లోను కాకూడదని,వాడిని ఎంతో క్రమశిక్షణతో పెంచాను,కాని చివరకు ఏదయితే జరగకూడదనుకున్నానో ఆదేజరిగింది" కళ్ళు తుడుచుకుని మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాను.

. "వాళ్ళ ఆఫీసులో పనిచేసే అమ్మాయిని ప్రేమించాడట,ఆ అమ్మాయివాళ్ళది కూడా ఇదే కాలనీ రెండో రోడ్ లో ఉంటారు. అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలు చూసి సంబంధం కుదుర్చుకోవాలి. పెళ్లిలో ప్రతి విషయం నా అంగీకారంతోనే జరగాలని వాడి పెళ్లి గురించి చాలా కలలు కన్నాను. కానీ వాడు ప్రేమ విషయం చెప్పేటప్పటికి తట్టుకోలేక పోయాను, నా గొంతులో ప్రాణం ఉండగా ప్రేమ వివాహానికి అంగీకరించేది లేదని తెగేసి చెప్పాను. గత ఆరునెలలుగా వాడు నన్ను ఒప్పించాటినికి, నేను వాడిని మార్చటానికి ప్రయత్నం చేశాము.

అటువైపునుంచి నరుక్కు రావాలని ఒకరోజు ఆ అమ్మాయిని,ఆ అమ్మాయి తల్లి తండ్రులను ఇంటికి పిలిచి అవమానకరంగా మాట్లాడి, బెదిరించి పంపించాము కనీసం అలాగైనా పెళ్లి ఆపొచ్చని. కానీ ఇది జరిగిన వారానికి వాడు పిడుగు లాంటి విషయం చెప్పి నా గుండె ముక్కలుచేశాడు." మళ్ళీ కన్నీటి ప్రవాహం, బాధతో గొంతు పూడిపోయింది. శాంతి నాదగ్గరకు వచ్చి నా చెయ్యి పట్టుకుని సోఫాలో కూర్చోపెట్టి తను నాపక్కనే కూర్చుంది. కాసేపు ఆగి మళ్ళీ చెప్పటం మొదలుపెట్టాను.

"రేపు ఆర్యసమాజ్ లో పెళ్లి చేసుకుంటున్నాం. మా ప్రేమను అంగీకరిస్తే వచ్చి దీవించండి లేకపోతే మీ ఇష్టం. ఇంకో విషయం.. పెళ్ళైన తరువాత నా భార్యను ఇక్కడకు తీసుకువస్తాననుకుంటున్నారేమో! అది జరగదు. తను ఇక్కడకురావాలంటే వాళ్ళను ఇక్కడకు పిలిచి అవమానించినందుకు మీరు వాళ్ళ ఇంటికెళ్ళి క్షమాపణలు అడగండి. అప్పుడు ఆలోచిస్తాము. అంతవరకు నేను కూడా వాళ్ళింట్లోనే ఉంటాను. అని చెప్పి విసురుగా వెళ్లిపోయాడు, మాకు యిష్టంలేని పెళ్లి చేసుకోవటమేకాకుండా వాడు కూడా మాకు దూరమైపోతున్నాడనే షాక్ నుండి తేరుకోటానికి చాలా టైమ్ పట్టింది. వాడు అన్నంత పని చేశాడు పెళ్లైయ్యాక వాళ్ళింటికే వెళ్లిపోయాడు. పిల్లల్ని పెంచటంరాదని మిమ్మల్ని అవమానకరంగా మాట్లాడాను. పెంపకం అంటే ఏంటో మీకు చూపించాలని అహంకారంతో విర్రవీగాను అందుకే నాకు సరైన శిక్ష పడింది " ఏడుపుని ఆపుకోటానికి ప్రయత్నం చేశాను కానీ నా వల్ల కాలేదు.

చిన్నాన్న కుర్చీలోనుండి పైకి లేస్తూ "చూడమ్మా పిల్లల్ని ఇలానే పెంచాలి అని చెప్పే సిద్ధాంతమేది ఈ ప్రపంచంలో లేదు. ఏ తల్లి తండ్రులైన పిల్లల్ని ప్రేమతో పెంచినా, క్రమశిక్షణతో పెంచినా గారాబం చేసినా వాళ్ళు బాగునే కోరుకుంటారు. పిల్లలు దానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే అది తల్లి తండ్రుల తప్పుకాదు. ఇక పెళ్లి విషయానికి వస్తే మంచి చెడుల గురించి చెప్పటం వరకే మన బాధ్యత. తర్వాత వాళ్ళు తీసుకునే నిర్ణయాలను గౌరవించినప్పుడే మన పెద్దరికం నిలబడుతుంది" అని బయటకు చూస్తూ డ్రైవరుకి శ్రవణ్ అత్తవారిళ్ళు తెలుసా అని అడిగారు. తెలుసని చెప్పాను.

"నేను శ్రవణ్ తో మాట్లాడటానికి వెళుతున్నాను" అని బయలుదేరారు.

# ఓ క్షణం..!

నిశీధి

వీధి విషయాల్లో ఎన్సైక్లోపిడియాలని, ప్రపంచ వేదాంతాలని భుజాల పై మోసే ప్రతి బుద్ధుడు ఇంటి విషయంలో అగ్నిహోత్రావధాన్లే కదూ . మనసుకి విలువివ్వలేని స్వేచ్చా ప్రియులు తల్లీ మీరంతా..! " హేట్ యూ అల్ !!" దుఃఖంతో బొంగురు పోతున్న ఆవేదనని క్రోధంగా ఎక్స్ప్రెస్ చేయడానికి మరింత బలంగా కార్ హార్న్ హాంక్ చేస్తూన్న జీత్ ని ఎలా ఓదార్చాలో అర్ధం కాని పరిస్థితి.

"జీత్.. ప్లీజ్ కూల్ డౌన్! కొంచం టైం తీసుకుందాం మనం, ఇంత ఆవేశం ఎవరికీ మంచిది కాదు. కొంచం రిలాక్స్ అవ్వు. మనందరికి సరిపోయే సొల్యూషన్ ఏదో ఉండే ఉంటుంది." అంటూ జీత్ చెయ్యి మీద భరోసా చెయ్యి వేసానే కాని, కొన్ని సమస్యలకి

సొల్యూషన్స్ అంటూ ఏమీ ఉండవు అన్న నా నమ్మకం మీద నాకే పెరిగిపోతున్న కాన్ఫిడెన్స్, ఏమి చేయాలో అర్థం కాని అభద్రపు భావనై మొహమ్మీద పరుచుకోవడం తెలుస్తూనే ఉంది.

" షిట్ దీ స్టాప్ ఫీడింగ్ మీ విత్ ఫాల్స్ హోప్స్. నాకు తెలుసు ఏమి జరగబోతుందో! నేను తనని అయినా వదులుకోవాలి లేదా మీ అందరికి దూరంగా అనాధలా బ్రతకాలి! అంతే కదా, ఇపుడు మీరంతా కలిసి తీసుకోబోయే గొప్ప డెసిషన్ , కనీసం నువ్వన్నా ఒప్పుకుంటే మిగిలిన వాళ్ళకి సర్ది చెప్పుకోవడం పెద్ద సమస్య కాదనుకున్నా" మళ్ళీ చెమ్మగిల్లుతున్న జీత్ కనురెప్పలు.

జరగబోయేది అదే అని అర్థం అవుతున్నట్లు భారం అయిపోతున్న నా శ్వాస. .

ఆగిపోయిన కార్లో ఆగని ఎంబారసింగ్ మూమెంట్స్ , వేగంగా పరిగెత్తుతున్న ఆలోచనలు..

ఇరుకు వీధుల్లో దూరం నుండి కేకలు, నిరసనలు అరుపులు ధర్నా, ఆడ మగ సమూహాల్లో కూడి నడుస్తూ, అయినోళ్ల కి ఆకుల్లో కానోళ్ళకి కంచాల్లో వడ్డిస్తున్న డెవలప్మెంట్ అంక్షల సంకెళ్ళలో ఇరుక్కొని తలెత్తుకు నిలబడలేక కొంచం భయంగా వంగి చూస్తున్న ప్ల కార్డ్ల మీద ఎఱ్ఱ పచ్చ మార్కర్ ముద్రలు.

గొప్ప దేశం రా బాబు! బ్రతుకేలాగు లేదు. కనీసం కావాల్సింది తినే యోగ్యం కూడా లేదు, ప్రతిది ఎవరో చెప్తే డు డు బసవన్నల్లా జీ హుజూర్ అంటూ బ్రతకడమే. క్యా కోయా క్యా పాయా జగ్ మే , మిల్తే ఔర్ బిచడ్తే పగ్ మే.. జగ్జీత్ సింగ్ సూతింగ్ వాయిస్ ని కూడా ప్రశ్నిస్తూ జీత్ చిరాకు గొణుగుళ్ళు . అటల్ బిహారీ సంవేదన నుండి అనుకుంటా కదా, సరిపోయింది సిట్యువేషనల్ సాంగ్ .

రోడ్ క్లియర్ అయ్యే సరికి ఇంకో పది నిముషాలు పడుతుందేమో. భయంకరమైన ట్రాఫిక్ జామ్, మోహ మొహాలు చూస్కొని ఇంటరెస్ట్ లేని క్షణాన కిటికీ అద్దాలని చూపులతో తడిమేస్తూ మరి కొన్ని యుగాల సెకన్లు .

"ఎక్ లేలో భయ్యా బస్ బీస్ రుపయ్యా" విండో అద్దాలు బద్దలు కొడుతూ అడుగుతుంది ఒక అలసిన లేత మొఖం. వాడిపోయిన కళ్ళు, నల్లబడి పొడి బారిన వసంతకాలపు చర్మం. ఎడం చేతిలో బొమ్మల సంచి , కుడి చేతిలో నవ్వాలో వద్దో అర్థం కాక బావురుమంటున్న జేగురు రంగు లాఫింగ్ బుద్ధా మట్టి ముద్ద.

"ఏం పేరు?" సడెన్గా మృదువుగా మారిపోయిన జీత్ కంఠం? పిల్లలంటే అంత అప్యాయత కదా, మరీ ఫ్యూచర్ అలోచించడా ఏమిటీ ఎదో కన్ఫ్యూజన్ నాలో ఇంకా!?

రిత్తిక్ విచ్చుకున్న నగుమోములో గర్వంగా బయటపడ్డ తొస్సిపళ్ళ మధ్య..

వాస్తవిక పరిపూర్ణతకి దూరంగా మిగిలే ఉన్న పిక్చర్ పర్ఫెక్ట్ ఆశావాదం .

బోసి నవ్వుల గాంధీకి, లాఫింగ్ బుద్ధాకి మధ్య మారకపు ఆదానప్రదాన ఆటలో ఇంకొంత వాడిపోయిన నిరాశలో" సౌ కా చిల్లర్ నహి సాబ్ , చిల్లర్ దేనా జల్దీ" ఆ ఇరవై నోటు దొరికేదాకా గ్రీన్ లైట్ పడకుండా ఉండాలని కనపడని దేవుళ్ళందరికి మొక్కుకుంటూ ఒక విన్నపం .

"ఉంచుకో, బిర్యాని ఖాలో.." ఇంకో వందని చిరుగుల జేబులో జమ చేస్తూ ప్రేమగా ఇదంతా నమ్మలేని వాడి బుగ్గలు తడుముతున్న జీత్ హస్తాలు.

పిచ్చా ! వాడ్ని పనికిమాలిన వాడినో నేరస్తుడినో చేయడం అవసరమా? లేదా మనం అందరం కలిసి చేసిన నేరాలకి నీదయిన ప్రాయశ్చిత్తమా? హమ్మయ్య ఇంతసేపటికి నేను నోరు తెరిచి అరవడానికో ఔట్లెట్ దొరికిన హాయితనం తెలుస్తూనే ఉంది నాలో .

ఆ రెండొందలకి వాడేమి చార్లెస్ శోభరాజ్ అవ్వడని తెలిసినా ఇంకా ఎక్కడో యాక్సెప్ట్ చేయలేని తనం .

గ్రీన్ లైట్

జీవన్ బీత్ చలా కల్ కల్ కర్తే

ఆజ్ హాత్ సే నిక్లే సారే

గుప్పిళ్ళ గుండెల్లో హత్తుకోవాల్సిన క్షణాలన్నీ అనంగీకారపు మాయలో ఇసుకలుగా గుప్పిళ్ళ నుండి జారిపోతూ ప్రశ్నార్ధకాలై హృదయాన్ని ముక్కలు చేస్తున్న ఉక్కిరిబిక్కిరి..

తిండి తిప్పల మీద శాసనాలని ప్రశ్నిస్తున్న తరం సెక్సువాలిటీస్ మీద తిరగరాస్తున్న నయా శాసనాలు.

జీత్ కరక్టేనేమో, తన శారీరకవసరాలు నా ఉహకి అందనంత దూరం ఏమో.

తన మానసిక సంఘర్షణలకి సమాధానం తన సంతోషం తను వెతుకున్న ప్రేమలోనే ఉందేమో!?

"నిజమే కదా సర్ప్రైజ్ దీ ! మీట్ మై లవ్ సభి , తెలుసా దీ సభి అంటే హ్యాండ్సం అని మీనింగ్. సరిగ్గా అతికినట్లు ఉంది కదా పేరు. నా బర్త్ డే నాకెంతో ప్రియమయిన మీ ఇద్దరి మధ్య గడపడం ఎంత సంతోషంగా ఉందో!" అంటు తుళ్లిపడుతున్న జీత్ , తన భుజంమ్మీద చెయ్యేసి, దాదాపు తనలోకి లాక్కొని ప్రపంచం నుండి జీత్ ని అపురూపంగా కాపాడుకుంటున్నట్లు దగ్గరగా హత్తుకొని కూర్చొని కూడా నా రియాక్షన్ ఎలా ఉంటుందో, అన్న కలవరపాటు కళ్ళతో సభి . ఎంత సంతోషంగా ఉన్నారు వాళ్ళు ఆ రోజు! ఆ క్షణం వాళ్ళిద్దరూ . ప్రేమలు శారీరకమయినవో మానసికమయినవో తెలియజెప్పే యంత్రం ఏది కనుక్కోలేదు ఇంకా. కాని వాళ్ళ కళ్ళలో ఒకరి పట్ల ఒకరికి ఉన్న అవాజ్యనీయమయిన అనురాగాన్ని కాదనే శక్తిని మాత్రం మిగిలిన వాళ్ళకి ఎలా ఇచ్చింది సమాజం ?

జీత్ ఎపుడు మృదుహ్రుదయుడే , చిన్న విషయాలకే కదిలిపోతాడు , కరిగిపోతాడు. అవసరం అనుకున్న చోట కలిసి నడుస్తాడు, తనది కాని చోట మౌనిగా మారిపోతాడు , లోటస్ సూత్రనెంత ప్రేమిస్తాడో తన సితార్ తీగలనంతకంటే ఎక్కువ ప్రేమిస్తాడు .తలుచుకుంటే ఎంత ఆశ్చర్యం తన జీవితానికి సంబంధించిన ఇంత పెద్ద నిర్ణయం అంత తేలిగ్గా తీసుకున్నాడు. ఇదంతా నిజంగానే తనకేమి కావాలో తనకి తెలిసిన స్థిత ప్రజ్ఞతేనా ? జీత్ , సభి ఇండివిడ్యువల్స్గా వెల్ సెటిల్డ్

పర్ఫెక్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్ , ఓహ్ మై వాళ్ళిద్దరు ఒకరినొకరు ఎన్నుకోవడంలోనే ఉంది సమస్య అంతా. వాళ్ళిద్దరికీ లేని సమస్య ఎదో మిగిలిన వాళ్ళని కాల్చి దహించేస్తూ వాళ్లిద్దరి జీవితాలని కూడా దగ్ధం చేస్తుంది.

"దీ ! దీ !! ఆర్ యూ ఓకే!?" కుదుపుల్లో ఉలిక్కిపడి లేచిన మగతల మధ్య కోపం చాయలు మాయమయిన అవే వాత్సల్యపు కళ్ళు .

"నేను తప్పు చేస్తున్నాను అనిపిస్తుందా దీ నీక్కూడా? సితార్ తీగలని మృదువుగా ముట్టుకున్నట్లు తన చేతులతో నా చేతులు పెనవేస్తూ , ఒక్కసారి చెప్పు దీ నేను తప్పు కాదని ప్లీజ్ . నువ్వు నా ధైర్యమే కాదు నా నమ్మకం కూడా నీకు తెలుసు కదా ప్లీజ్ ఒక్కసారి చెప్పు , నా ఆసరా మాటలకోసం ఒళ్ళంతా చెవులై అడుగుతున్న నా ప్రియ నేస్తం ."

"పిల్లలేలారా మరి ! నీకెంతో ప్రేమ కదా పసిపిల్లలంటే" ఇష్టం దిగులుతో కూడిన అక్సేప్టెన్స్.

"ఓహ్ మై ఇడియట్ దీ !"

సంతోషంలో హత్తుకొని చప్పున బుగ్గ మీద ముద్దుగా మారిపోతూ "ఒక అరడజన్ చార్లెస్ శోభరాజ్లని పెంచుకుంటాం , సభి ఆల్రెడీ ఆ విషయాలు కనుక్కోవడానికి లీగల్ అడ్వైజర్ని కలుస్తున్నాడు త్వరలో. పాపాయిలని పెంచుకోవడానికి లీగల్ సిస్టం ఒప్పుకోకపోతే

మొదటి బాబుకి నీకెంతో ఇష్టమయిన సూర్యకాంతం పేరుని కొంచం ట్విస్ట్ చేసి సూర్యకాంత్ గా ప్రెజెంట్ చేస్తాను. నీకిష్టమేగా అయితే!" ఆనందంలో చుక్కల్లా మెరుస్తున్న జీత్ కళ్ళు నాలో ఏదో తృప్తి వెలుగుని కొత్తగా నింపుతూ !!

# 'అం...బా '

## సి. హెచ్.సీత

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

**సూర్యోదయం.** భానుని లేలేత కిరణాలు. దూరంగా తాడిచెట్లు. పక్షుల నాదస్వరం. పట్టనట్టు వెళ్తూనేను.

నా కావడి కుండల్ని నేనే చేసుకుంటా, నా కలిమి లేముల్ని నేనే మోసుకుంటూ, నా శరీరాన్ని నేనే తోసుకుంటూ.. అంతలో వచ్చాడు. వాడు. అరసున్నాల ప్రీతివాడు. ఆంగ్లంలో కాముడు. తెలుగులో కాఁవుఁడు.

నిద్రమాత్రలు మింగిన తాబేలులాగా నడిచి, నడచి వచ్చాడు. వస్తూనే అడిగాడు "తీక్షణంగా ఉన్నావేం?" అని.

"ఈ క్షణంలోనే ఉన్నానే" అన్నాను.

"ఖర్మ! నీ తీరే అంత."

"అంతో, కొంతో, నేనింతే."

"నీవిక మారవా?"

"మారను"

"వద్దులే" మామిడి పళ్ళు ఇచ్చి వెళ్ళాడు. పళ్ళమీద వాలింది మనస్సు. రమ్మంటే పొమ్మంది. తినేశాను. ఆపై మిగిలాను. ఒంటిగా. అనంతశూన్యంలో రవంత ధూళిలా 'ఇప్పుడు ఏంచేయాలి?'

'గతాన్ని తవ్వుకో'

'ఓ.. అలాగే. పసితనంలో అమ్మానాన్నలు, కౌమారంలో స్నేహితులు, యవ్వనంలో భార్యాబిడ్డలు, ముసలితనంలో గతస్మృతులు.. సంతోషాన్నిచ్చే విషయాలు.'

నలభై ఏళ్ళనాడు నేనైదేళ్ళవాడిని. కోడి మందకొడిగా కూసింది. 'కొక్కర్రో...క్కో'

"అత్తా!" అన్నాను.

"ఇంకా మూడే అయ్యింది కాస్సేపు పడుకో" అంది అత్త.

గోధూళి వేళయ్యాక అంది. "పద.. నిన్ను దించి వస్తాను" అంది.

ఆ గోధూళివేళ.

బడినుండి పిల్లలు త్వరగా ఇళ్ళు చేరతారు. తల్లిదండ్రులు వాకిట్లో ఆడుకుంటున్న పాపల్ని లోపలికి పిల్చుకుంటారు. అమ్మకాలవారు త్వరగా ఇస్తారు. కొనుగోళ్ళు వాళ్ళు త్వరగా తీసుకుంటారు. వృద్ధులు గమ్యాలకు, పూజారులు గుళ్ళకి, చివరకు తాగుబోతులు తాడి చెట్లకి త్వరగా చేరుకుంటారు.

ఎందుకంటే కోదండ రామయ్యగారి గోవులు వెనక్కి వచ్చేవేళది. అరగంట దాటాకే దారి ఖాళీ అవుతుంది. అపారమైన గో సంపద వారిది. వాళ్ళింటి ముందు శంకరయ్య శెట్టి ఇంటి అరుగుంది. అరుగు మీద కూర్చుని ఆ గోవుల్ని చూస్తాను. చిన్నప్పటినుండి గోవులంటే నాకు చాలా ఆసక్తి.

చివరి గోవు లోపలికి వెళ్ళేదాకా ఉండి ఇంటికి వెళ్ళేవాడిని. వాకిటికి అటువేపు కోదండరామయ్యగారు, అరుగుమీద నేను, గోవుల్ని పరికించి చూసేవాళ్ళం. ఎన్ని పనులున్నా ఆ సమయానికి ఆయన, ఎన్ని ఆటలాడినా ఆ టైముకి నేనూ అక్కడికి చేరేవాళ్ళం. గోవుల నడక చూడగానే దేనికి ఏ అనారోగ్యమో ఆయన చెప్పేవారు.

"ఏరా గంటా.. కోడె నీళ్ళు తాగిందా?"

"లేదయ్యా!"

"దీన్ని, నంకాల ఆవుని ఈరస్వామికి చూపించు. రెంటికీ అదిగో ఆ అకుల్ని తినిపించు."

ఆయన వద్యాలు వింటూ, గోవుల్ని చూస్తూ నెలలు గడుస్తున్నాయి. ఓ రోజు ఆయన అడిగారు.

"ఏరా! నువ్వెవ్వరి పిల్లాడివి?" అని.

"నేను లక్ష్మయ్య కొడుకుని పంతులుగారూ" అన్నాను.

"ఏ లక్ష్మయ్య?" మళ్ళీ ప్రశ్న.

"హిందీ పంతులు లక్ష్మయ్య"

"గోవులు వచ్చాయా?"

"ఆఁ"

"నీక్కావాలా?"

అంతే. ఒక్కసారి లేచి నిల్చున్నాను. "ఇస్తారా?" అన్నాను. అంతలోనే నీరసించి కూర్చున్నాను.

"ఇస్తాను. ఏం?" అన్నారాయన.

"మా నాన్న దగ్గర డబ్బులు లేవు" అన్నాను.

"డబ్బు వద్దులే. వీటిలో నీకు నచ్చిన ఆవునో కోడెనో పట్టుకుపో" అన్నారు. అంతే, నేను వెంటనే లేచి ఆయన దగ్గరికి వెళ్ళాను.

"కానీ నల్లావు. దాని దూడ మాత్రం కాదు."

నేను తలవంచుకుని అన్నాను. "నాకు అదే కావాలి"

"ఇందులో చాలా గోవుల్ని ఆయా ఊళ్ళు వెళ్ళి నేను ఎంచి తెచ్చుకున్నవే. కానీ నల్లావుని మాత్రం నేను నెల్లూరు నుండి ఎక్కువ ధరకి తెచ్చుకున్నాను. నాకది చాలా ఇష్టం. అది తప్పించి ఇంకేది కావాలో పట్టుకుపో"

నే పలుకలేదు. ఆయనా పలికించలేదు. నల్లావు చాలా బాగుంటుంది. బలంగా, పొడవుగా, నల్లగా మెరిసిపోతూ ఉంటుంది. 'అంమ్..మ్బా' అంటుంది. ఆ అరుపులోనే ఏదో ప్రత్యేకత. దాని దర్పమూ ఠీవి చూసి ఊరివాళ్ళు దానికి 'కాళి' అని పేరు పెట్టారు. క్రమంగా అదే దానిపేరయ్యింది.

మరికొంతకాలం గడిచింది. ఓరోజు ఆయన నన్ను పిలిచారు. "రేయ్ చంటోడా! ఇలారా!" అన్నారు.

వెళ్ళాను.

నా తలమీద చేయివేసి "ఇలాంటి గోవులు అరుదుగా పుడతాయి. మళ్ళీ ఇలాంటిది ఇంకో నలభై యాభై ఏళ్ళకి గానీ పుట్టదు. అపుడు కాబోయే కాలం నీది. కనుక కొనుక్కుందుగాని. అంతదాకా బాగా కష్టపడి చదువుకో. మంచి ఉద్యోగం సంపాదించు. అపుడు కొనుక్కుందువుగాని వెళ్ళు." అన్నారు.

"బాగా చదువుకుంటే ఇలాంటి ఆవుని కొనుక్కోవచ్చు" అని అర్థమయింది నాకు. అప్పటినుండి రోజా కాకుండా ఎప్పుడైనా వెళ్ళేవాడిని. క్రమంగా అదీ తగ్గించేశాను. అప్పుడప్పుడు మా అత్తతో "అత్తా! మనమూ అలాంటి ఆవుని కొనుక్కుందాం" అనేవాడిని.

"కొందాం" అనేది అత్తయ్య.

మా ఊరి పేరు నెలవంక. నెలొంక అంటారు. బస్సువెళ్ళే రోడ్డునుండి ఊరు ఐదు కిలోమీటర్లు లోపలికి ఉంది. అక్కడినుండి ఊరికి కేవలం మట్టిరోడ్డు. ఎప్పుడోగాని రాని బస్సులు. అప్పుడప్పుడు దిగే ప్రయాణికులు. దిగంగానే బిత్తర చూపులు. కలవారికి బండ్లు. లేనివారికి కడగండ్లు.

ఊరినానుకుని చిన్నకొండ. కొండమీద వెలసిన నామాలదేవుడు. శనివారం సంత. ఆదివారం అంగడి. ఊరికి దూరంగా బావి. అక్కడ మాత్రమే నీళ్ళు. ఊళ్ళో ఎక్కడ తవ్వినా రాళ్ళు. ఒక్క కోదండ రామయ్యగారింట్లో తప్పించి ఎక్కడ తవ్వినా రాళ్ళు. కులమతాల కతీతంగా ఒక్కటే బావి. అందరికీ అవే నీళ్ళు.

ఇంటికి పదిబిందెలు, వేసవిలో రెండురోజులకోసారి స్నానం. ఊరు పెద్దది. ఉన్నతి చిన్నది. ఐనా ఉన్నత పాఠశాల. ఇలాంటి కొన్ని చిన్న ఊళ్ళకి ఇదే విద్యాకేంద్రం. ఎందరో విద్యార్థులు. పోటీ ఉండేది. బాగా చదివేవాళ్ళం. కానీ నాకు అర్థం కాని సబ్జెక్టు లెక్కలు. కారణం లెక్కలు మాస్టారు. ఆయనతోనే సమస్య.

లెక్కలు చెప్పరు. చేయించరు. గైడ్ చూసి చేస్తారు. అవి సరిగా అర్థంకావు. సున్నా మార్కులు. అమ్మ చేత తిట్లు, చీవాట్లు, దెబ్బలు కూడా. అంకెలు సంఖ్యలుగా, సంఖ్యలు అంకాలుగా, అంకాలు గణాంకాలుగా మారతాయి. లెక్కలకు లెక్కలేని తనం. నాకేమో గందరగోళం.

"అత్తా! నేనిక చదవను" అన్నానోరోజు.

"ఎందుకు?" అడిగింది.

విషయం చెప్పాను. నెల తరువాత లెక్కల మాస్టారికి ట్రాన్స్‌ఫర్ అయింది. "కొత్త పంతులుగారు బాగా చెబుతున్నారు" సంతోషంతో చెప్పాను.

"ఇకముందెప్పుడూ చదువు ఆపేస్తాననకు" అంది అత్త.

"సరే"నన్నాను.

మూడురోజులకి కుంటి సాయిలు మా ఇంటికి వచ్చాడు.

చక్రాల కుర్చీ ఇచ్చి పంపించింది అత్త.

"ఏమిటది?" అడిగాను.

"చక్రాల కుర్చీ" అంది..

"అతనికెందుకు ఇచ్చావు?"

"చలనం మానవనైజం. అదే జీవన విధం. దాన్ని బ్రతికించేందుకు చిన్న ప్రయత్నం."

"అంటే?"

"దేవుడికి మొక్కాను"

"ఏమని?"

"మీ లెక్కల పంతులుగారికి ట్రాన్సఫరైతే ఇతనికి బండి కొనిస్తానని" అంది.

మరోరోజు తలపై బిందె చేతిలో చెంబు. మంచినీళ్ళు తెస్తోంది అమ్మ. కాలుజారిపడిపోయింది. కాలంతా వాపు. నొప్పి. మూలుగు. జ్వరం. కాలు విరిగి ఉంటుందని భయం. రోడ్డుదూరం. ఆస్పత్రి మరీ దూరం. వానాకాలం. ఆగని వర్షం. రోడ్లన్నీ జలమయం. పట్నం వెళ్ళాలంటే ఎడ్ల బండే ఆధారం. చేసేది లేక ఆర్.ఎం.పి డాక్టరుతో వైద్యం. కానీ పదోనాటికి అమ్మ మళ్ళీ బావికి వెళ్ళగలిగింది.

తరువాత అత్త బడి బావిలో పూడిక తీయించింది.

మరోసారి నాన్నకి జ్వరం. పల్లె, పట్నపు వైద్యాలు అయ్యాయి. స్థితి యధాతథం. కాని ఆయుర్వేదం మందుసీసాలు మూడింటితో తగ్గింది. ఆయనకి పత్యం పెట్టినరోజే పశువైద్యశాలకి స్థలమిచ్చింది అత్త. అప్పుడు అన్నాను.

"అత్తా! ఊరివారంతా నవ్వుతున్నారు. నాకు అవమానంగా ఉంది. ఇలాంటి మొక్కులేంటి?"

"ఊరివారికన్నా నాకు దేవుడి మొక్కు చెల్లడం ముఖ్యం."

"అందరిలాంటి మొక్కులు మొక్కచ్చుగదా?" అంది అమ్మ.

"అవి త్వరగా తీరవు."

"ఎందుకు?

"పదిమందికి పనికొచ్చేపని మనం చేస్తే మన పనులు పైవాడు త్వరగా తీరుస్తాడు."

"మీదంతా వేరేవాదం" అంది అమ్మ.

"అక్కా! లోకం నడిచినట్టు నడవరాదూ?" అన్నారు నాన్న.

"గుడ్డిగా ఆచరించే పాత పద్ధతులకన్నా, తర్కించి ఎన్నుకున్న కొత్తరీతి మిన్న" అంది అత్త.

"ఆచరించాక లోపం కనిపిస్తే?"

"లోపాలు కనిపిస్తే సవరించుకోవచ్చు. పొరపాట్లు అనిపిస్తే దిద్దుకోవచ్చు"

"సిద్ధాంతమే తప్పనిపిస్తే?"

"రాద్ధాంతమేంటి? అప్పుడే పాత పల్లకీ ఎక్కవచ్చు."

అత్త వినదని నాన్న తెలుసుకున్నారు. అత్త నిజమని నే తెలుసుకున్నాను. అంతలో ధన్మని శబ్దం చేస్తూ అక్కడ పడిపోయాయి. మాటలో, మూటలో, తూటాలో కాదు. ఇరుగు, పొరుగువారు ముందు మాట్లాడుకుని, తరువాత పోట్లాడుకుని, పిదప కొట్టలాడుకుంటున్న (పదం సరైనదేనా? ఆఁ పోనిద్దురూ! సారీ మన్నిద్దురూ) ధ్వని తరంగాలు రాతలకు పనికిరాని అనాగరిక భాషవచ్చి వాలిపోతున్నది మా ఇంట్లో. వాటిని చెవుల్తో మోసుకుంటూ కదిలాం వాకిట్లోకి 'వాళ్ళు', 'వీళ్ళు' చేసుకుంటున్న యుద్ధ, శబ్ద - నిశ్శబ్ద శకలాల నకళ్ళు. కారణం వీళ్ళు.

మెలికల ముగ్గుల మధ్య చుక్కల్లా నిల్చిపోయి ఉన్నాం అందరము. "పదండి లోపలికి" అన్నారు నాన్న. ఆయనకి మరో ఊరికి ట్రాన్స్‌ఫర్ అయింది. సైకిల్ మీద వెళ్ళివస్తున్నారు.

ఆరోజుదయం రామరాజుగారి భార్య వచ్చారు. "రమా! మా కోడలికి పురిటి నొప్పులు వస్తున్నాయి" అన్నారు కన్నీళ్ళతో.

"మంచిదే కదండీ! కంగారెందుకు?" అంది అత్త.

"అమ్మాయి చాలా బాధ పడుతోంది నెప్పితో. అచ్చమ్మని పిలిస్తే బిడ్డ అడ్డం తిరిగింది అంది." అన్నారామె.

"పదండి చూద్దాం" చేతిలో చీపుర్నలా పడేసి వెళ్ళింది అత్త.

రాజుగారికి ఒక్కడే అబ్బాయి. కులాంతర వివాహం చేసుకున్నాడు. ముందు కాదన్నారు. తరువాత చేరదీశారు. అబ్బాయికి బొంబాయిలో ఉద్యోగం. నెలలు నిండాక ఇక్కడ దించి వెళ్ళాడు.

కారణం అతనికి ఢిల్లీలో ట్రైనింగేదో ఉందిట. అమ్మాయికి తల్లిదండ్రి లేరు. ఉద్యోగం మానేస్తానన్నాట్ట. "మేమున్నామ"ని నచ్చచెప్పి, ఆమెని రప్పించి, కొడుకుని పంపించారు.

కోడలికేదైనా అయితే కొడుకు ముఖం చూసేదెలా? ఇదే ఆలోచన. రాజుగారు, ఆయన భార్య ఇద్దరి ముఖాలు పాలిపోయాయి. కారు తెప్పించారు. ఊరు ఊరంతా కారుదగ్గరే. చమట తుడుచుకుంటూ కారెక్కారు రాజుగారు వాళ్ళు. అత్తకూడా కారెక్కింది.

కారులో అత్త చేసిన సపర్యల వల్లో, ధైర్యవచనాలవల్లో తెలీదు. ఆసుపత్రిలో చేర్చిన ఐదు నిముషాల్లో ప్రసవించింది కోడలు. పండంటి పాపాయి పుట్టింది. పాప బారసాల మర్నాడు ముత్యాలమ్మ చెరువుకి గంది పూడ్పించి పూడిక తీయించారు రాజుగారు.

"ఇదేం పని?" అన్నారు ఊరిజనం.

"వినండి. ఆ రోజు అమ్మాయికి ఏమైనా అయ్యుంటే వెంటనే నేను ఏ నుయ్యో చెరువో చూసుకునే వాడిని. నా వెనుక నా భార్య. తరువాత నా కొడుకు. రమాదేవిగారి మొక్కులు గుర్తొచ్చాయి. నేనూ మొక్కాను. అంతే. పది నిముషాలకల్లా పాపాయి జననం. అందుకే యీ పని."

తరువాత కొడుకు అన్నాడు "రోడ్డునుండి ఊరిదాకా సున్నం, కంకర కలిపిన రోడ్డు నే వేయిస్తాను." వేయించాడు. అంతే. ఊరివాళ్ళకిలాంటి మొక్కుల మీద నమ్మకం కుదిరింది. అందరూ మొక్కుతున్నారు. ఊరివారి మొక్కులు ఎక్కువయ్యేకొద్దీ ఊరికి వసతులు పెరిగాయి.

జియాలజిస్ట్‌ని రప్పించి మరో బావి, దానికి నాలుగు వేపుల గిలకలు, కరణంగారి అమ్మాయి ఏ.యి.గా వచ్చాడు. అతని సహకారంతో ఊరికి విద్యుత్తు. వాటర్ ట్యాంకు చిన్న ఆసుపత్రి. అందులో వసతులు ఊరి స్వరూపమే మారిపోయింది. మా ఊరివాళ్ళ మొక్కుల్ని చూసి ప్రభుత్వం వారు ముక్కున వేలేసుకున్నారు.

వారుకూడా కాస్తో, కూస్తో చేయూతనిచ్చారు. ఆ చేయూత పేరు ఊరి తారు రోడ్డు. ఆర్టీసీ వారి బస్సు.

ఒక ఐడియా జీవితాన్నే మారుస్తుందని ఇప్పుడు అంటున్నారు. కానీ ఒక ఊహ ఊరినే మార్చేసింది. అత్యల్పమైన కోరికల మొక్కులకు ఉన్నతమైన సంకల్పాన్ని జోడించింది అత్త.

ఆశల చిట్టాకి సమాజ శ్రేయస్సనే అట్టని అతికించింది.

దేవడనే భావనకి - దైవత్వమనే భావుకతని జోడించింది.

నేనిది పొందాలనే తాపత్రయానికి నీవిది చేయమనే ప్రేరణ కలిగించింది. నాకిది చెందాలనే స్వార్థానికి నీవిది చేయాలనే 'గీత'ని గీసింది.

క్రమంగా ఇలాంటి మొక్కులు పక్క ఊర్లకి వ్యాపించడం మొదలయ్యింది. ఈ మొక్కులు త్వరగా తీరుతుండడం కొసమెరుపు.

కాలచక్రం కంగారుగా పరుగిడుతోంది. నా చదువు అయింది. ప్రభుత్వోద్యోగం వచ్చింది. చెల్లెళ్ళిద్దరికీ డిగ్రీలు వచ్చాయి. మంచి సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేశాం. అమ్మా, నాన్న నీ పెళ్ళి అన్నారు. వద్దన్నాను పెళ్ళాడే ఉద్దేశ్యం లేదన్నాను. ఎవరెంత చెప్పినా వినలేదు. గుండెనొప్పితో అమ్మపోయింది. అమ్మ మీద దిగులుతో నాన్నపోయారు. అత్త నాకిక పెద్ద దిక్కు అయింది. ఓరోజు అత్త అడిగింది. "అంబూ.. పెళ్ళి ఎందుకు వద్దు?" అని

"పెళ్ళి అనేది జూదం అత్తా! వైవాహిక సమబంధం సరిగా లేకపోతే జీవితం జవాన్ని కోల్పోతుంది. చెల్లెళ్ళని, వాళ్ళ పిల్లల్నీ చూసుకుంటూ కాలం గడుపుతాను."

"అంబూ! మన ఇంటిపేరు ముక్కంటివారు. గోత్రం వాచస్పతి. ఇలవేలుపు రామచంద్రుడు. బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు ఒకేచోట కలసిన వంశం మనది. అరుదుగా ఇలాంటి అద్భుతాలు జరుగుతాయి. మనకి దాయాదులు ఎవరూ లేరు.

నీతో మన వంశం ఆగిపోకూడదు. నావల్ల ఊరు బాగుపడిందని ఎన్నోసార్లు అన్నావు. నీ పిల్లలో, మనుమలో, ముని మనమలో ఎవరివల్ల సమాజానికి ఎంతమేలు జరుగనుందో ఎవరికి తెలుసు? అందుకని పెళ్ళివద్దనకు."

"కానీ అత్తా! వచ్చినావిడ నిన్ను సరిగా చూడదు."

"చూడకపోతే పోనీ"

"మాకోసం ఎంతో చేశావత్తా! అలాంటి నిన్ను మలిసంధ్య వయసులో చూడకుండా ఎలా?"

"అంబూ! నీరు, నిప్పు, వాయువు, అగ్ని, ఆకాశం ఇవి ప్రాప్తాలు. ఎవరికి, ఎక్కడ,ఎంత ప్రాప్తముంటుందో అంతవరకు అక్కడ ఉంటాము. నువ్వు పెళ్ళి చేసుకున్నా, మానినా జరిగేది జరుగుతుంది. దేనికోసమో, ఏదో మానేయడం తగదు."

"అత్తా! ప్రాప్తానికి నిన్ను వదిలిన్నాడు నేను జీవన్మృతుడనే."

"అది తప్పు. మరణించాలి అన్న ఆలోచనే ఆత్మహత్యతో సమానం. బ్రతుకంటే ఆశ. ఆశ నెరవేరితే సంతోషం. సంతోషానికి పరాకాష్ఠ ఆనందం. నిత్యమైన ఆనందమే ముక్తి. సత్యమైన ఆనందమే మోక్షం. ఆనందమే బ్రహ్మము. ఆనందమే పరబ్రహ్మము. అందుకే ఆనందో బ్రహ్మ అంటారు."

"అత్తా! బుద్ధి గడ్డితిని ఏదో వాగాను. దీనికింత వేదాంత చర్చ అవసరమా?" అన్నాను నవ్వుతూ, చేతులు జోడిస్తూ. అత్త నవ్వింది - ఆనందంగా. ఆనందో బ్రహ్మ అంటే ఇదేనన్నట్టుగా. "కాశీకి వెళ్ళినా ఖర్చు తప్పదు. చర్చికి వెళ్ళినా చర్చ తప్పదు. మసీదుకి వెళ్ళినా నసీబు తప్పదు. ఇది దేవుడి తాఖీదు" అంది అత్త.

"అమ్మాయితో నేను మాట్టాడాలి" అన్నాను. ఇది ఆరోజుల్లో అరుదే కానీ సంబంధం తెచ్చిన శాస్త్రిగారు, అమ్మాయి తండ్రి సర్దుకున్నారు. "ఈరోజుల్లో ఇలాంటివి వింటున్నాం. పర్లేదు. మాట్లాడండి" అంటూ అందరూ వెళ్ళడానికి లేచారు.

"ఆగండి. మీ అందరి ముందే మాట్లాడాలి"

"మా ముందు ఏం మాట్లాడతావయ్యా!"

"ఏదో ఒకటి. ముందు ఆమెని పెదవి విప్పనీయండి."

"అడుగమ్మా! ఏం మాట్లాడాలో.."

"చెప్పండి"

"వినండి. నా తల్లి, తండ్రి గురువు దైవం అన్నీ మా అత్త. ఆమెవల్లే మాకుటుంబం ఈరోజిలా ఉంది. నా బొందిలో చివరి ఊపిరి ఉన్నంతవరకు ఆమె మనతోనే ఉంటుంది. బాగా ఆలోచించుకుని ఇందుకు ఇష్టమైతే కబురు పెట్టండి. అత్తా పద" బైటపడ్డాను. తరువాత పెళ్ళి.

ఆమె పుట్టింటివారి ఆర్థికస్థితి బాగోలేదు. అందుకని పురుళ్ళు, బారసాలలు, రోగాలు, రొష్టులు అన్నీ అత్త చేతులమీదుగానే. అవసరం తీరింది. అప్పుడు మొదలయ్యింది నస. చాలాసార్లు సర్ది చెప్పాను. ఆమె మంచితనాన్ని నటించేది. 'అత్త ఆమెతో చాలా బాధలు పడుతోంది' అనిపించేది.

ఓరోజు ఒంట్లో బాగోలేదు. ఆఫీసునుండి అర్థాంతరంగా వచ్చాను. అప్పుడు విన్నాను. వినకూడని మాటలు "పెళ్ళిచేసినప్పుడూ, కాన్పులకీ, రోగాలకీ చేసినప్పుడూ కనిపించని లోపం ఇప్పుడు కనిపిస్తోంది. కాదు అవసరం తీరింది. ఇప్పుడు అత్తవద్దు. పుట్టింటివాళ్ళు కావాలి. ఛీ" అన్నాను. లాగి గూబమీద ఒక్కటిచ్చాను.

"అదికాదురా అంబూ! ఆగరా!"

"నువ్వుండత్తా! ఓ చెంపకొడితే మరో చెంప చూపమనే గాంధీగారు కూడా ఆశయసాధనకోసం సత్యాగ్రహం చేశారు. అంటే ఆగ్రహం చెందారు. నిన్ను కాటు వేయమనలేదు. బుస కొట్టమన్నాను. అదికూడా చేయక అలుసైపోయావత్తా" అన్నాను. బయటికి వెళ్ళాను. తెల్లవారే అత్త వెళ్ళిపోయింది. ఇంటినుండి. ఆ ఊరి నుండి.

'అంబూ! మానాన్న నాకిచ్చిన పొలం అమ్మేశాను. నే వెళ్తున్నాను. నాకోసం వెతకొద్దు.'

పిచ్చాడిలా ఊరంతా తిరిగాను మూడురోజులు ఇంటికి రాలేదు. ఏవేవో ఊళ్ళు వెదికాను. "అనుబంధాల కూడికలనుండి, ఆర్థిక స్థితుల తీసివేతలు ఇవే మధ్య తరగతి జీవితాలు" అంది పెద్ద చెల్లెలు. వాక్కుల వడగళ్ళు కురిపించింది చిన్న చెల్లెలు. "అత్తా!" అంటూ ఆక్రోశించింది. "అత్త అనాథగా ఎక్కడుందో?" అంది.

ఇంటికి వచ్చాను. "అత్త నా తల్లి వంటిది. ఆమెని వెళ్ళగొట్టావ్. పెళ్ళికి ముందే చెప్పాను. ఆమె నాకు బరువుకాదు. బాధ్యత అని. పిల్లలు, అవసరాలు, సిటీలో సొంతిల్లు, అన్నీ చేకూర్చున్నావు. ఇప్పుడు అత్తవద్దు. తరిమేశావు. పుట్టింటివాళ్ళు కావాలి కదూ! ఇద్దరు కూతుళ్ళు, కొడుకు నువ్వు ఉండి నేనూ అనాథగా బ్రతుకుతాను.

నీతో పలుకను. నీ చేతి తిండి తినను. అనాథగా నా గదిలో పడుంటాను. నా శక్తిమేర లంచాలు లేకుండా సంపాదించింది దేవుడి దగ్గర ఉంచుతాను. నీకేం కావాలో అక్కడ రాసివుంచు. నాకు చేతనైనంత అక్కడుంచుతాను. తింటావో, పుట్టింటి వాళ్ళకి పెడతావో నీ ఇష్టం. నాలాంటి వాడు వద్దనుకుంటే విడాకులు తీసుకో. ఇదే నేన్నీతో మాట్లాడే చివరిమాట. ఉంటాను" నమస్కరించాను. ఆమె గొడవ చేసింది. తన్ని తాను తిట్టుకుంది. కొట్టుకుంది. అత్తకోసం వెదికించింది. పుట్టింటి వాళ్ళని పిలిపించింది. వాళ్ళు 'ఆమెదే తప్పు' అన్నట్టున్నారు. నాతో ఏదో చెప్పడానికి వచ్చారు.

నేను అందరికీ నమస్కరించి బైటపడ్డాను. అంతే బతుకుతున్నానలా. బతుక్కి దూరంగా. దూరానికి చేరువలా. సమయం వెళ్తోంది. క్షణాల పద్దులు రాసుకుంటు. పిల్లలుకూడా దూరంగా ఉన్నారు. కారణం ఉగ్గుపాలతో పాటు నామీద, అత్తమీద ద్వేషం నింపి

పెట్టింది. ఇక ఇప్పుడేం వస్తారు? నా కోసం. నాన్న ప్రేమకోసం? చెల్లెళ్ళిద్దరూ ఫారిన్‌లో. బావలిద్దరికీ అక్కడే ఉద్యోగం. సంసార సాగరంలో మునగానాం, తేలానాం. అప్పుడప్పుడు ఫోన్లు. ఎప్పుడైనా అరుదుగా వస్తే నేనే వెళ్ళి చూసివస్తాను.

ఆ రోజు తెల్లవారుఝామునే పిలుపు. గేటు శబ్దం "అబోనిధిగారూ, అంబోనిధిగారూ!" గబగబా బైటికి వచ్చాను.

"మీ అత్తయ్య రమాదేవిగారు పోయారు" అన్నారు. చాలాసేపు వెక్కి వెక్కి ఏడ్చాను. ఇంట్లోకి వెళ్ళాను. నాకు సంబంధించిన వన్నీ సూట్ కేసులోనూ, బ్యాగులోనూ సర్దుకున్నాను. బైటపడ్డాను. ఈ ఊరు విడిచాను. ఆ ఊరు చేరాను.

ఆ ఊరు చాలాదూరం. పేరు రామవరం. నూరుశాతం చదువు మధ్య, పాలిథిన్ కవర్లు లేని ఊరు. చెట్లు, పైర్లు, పచ్చదనం. సాముహిక వ్యవసాయం. అత్తే దీనికి కారణం.. ఊరంతా కదలి వచ్చారు. అది స్మశానంలా లేదు. పెళ్ళిమంటపంలా ఉంది. అంతా దుఃఖించారు. అందమైన ఊరు. పర్ణశాల వంటి అత్త గుడిశ. అత్త నడయాడిన చోటు.

అక్కడే ఉండిపోయాను. ఉద్యోగానికి రాజీనామా. సగం డబ్బు నాకు. మరోసగం నా భార్యాపిల్లలకి పంపించాను.

'పది పదైంది' అంది గడియారం. షేర్ ఆటోలో నేను. "దాని మొగుడు పోయి అదేడుస్తుంటే దాన్ని సూస్తే నా మొగుడు పోడవేంది? ఏది సూస్తా ఎట్ట బోతరో... కాదు తెస్తా"

"ఎవర్ని? ఏడకు?"

"సెంద్రిని. నా ఇంటికి."

"తెచ్చి ఏం చేస్తా?"

"పెళ్ళి. నా తమ్ముడికిచ్చి పెళ్ళిచేస్తా"

"ఇపుడు ఆడుపోయి వారం కాలేదు. ఆళ్ళు పంపద్దూ?"

"వారం గాదు. ఇయ్యాల్టికి తొమ్మిదిరోజులు. ఆళ్ళు పంపేదేంటి? నేనే ఎళ్లి తీస్కొస్తా"

"ఒద్దే రాజీ. నా మాటిను."

"ఇననక్కా. దేవున్ని నమ్మమంటే నమ్ముతాగానీ. ఇట్టాంటి దెయ్యప్పనులు చెయ్యనీయనక్కా"

"ఆటోన్నా! మున్నూరు కాణ్ణుండి నా మరదల్ని పూలొంక తీస్కెల్లాల. ఒస్తవా?"

"ఎందుకురానమ్మా! ఒస్తా"

"ఆడపిన్న గొడవైద్దేమో. పారిపోవుగందా?"

"సూద్దుగాని. ఈ ఆటో ఎంకటేసం అంటే ఏందో.. సూసి సెప్పు."

జనాలంతా రాజాపురంలో దిగాక అన్నాడు డ్రైవరు. "సార్! ఈడినుండి మున్నూరు వెళ్తాం. మీరూ దిగండి"

"నేనూ వస్తాను మున్నూరు" అన్నాను.

"ఎందుకు?" అడిగింది రాజి.

"మీరు ఎందుకో నేనూ అందుకే. పదండి. ఒకరికొకరం తోడు."

పూలొంక వెళ్ళాం. అబ్బాయికి ఎపెండిసైటిస్. ఆర్.ఎం.పీ డాక్టర్‌కి చూపించారు. అతను చెప్పాడు. కానీ వాళ్ళు వినిపించుకోకుండా పసరు పోయించారు. అది వికటించి పొయ్యాడు. అత్తా,మామ చంద్రిని ఆడిపోసుకుంటున్నారు. అతనున్నప్పుడూ ఆమెని బాగా చూళ్ళేదు. ఇపుడు మరీ ఘోరం.

"ఒదినా!" అంటూ ఏడ్చింది చంద్ర. ఆమె వీపంతా వాతలు. దెబ్బలు. ఆమెని తీసుకెళ్తానంది రాజి. అబ్బాయి బంధువులంతా నాటుమనుషులు. గోల. గొడవ. ఊరివాళ్ళు మంచివాళ్ళే వీళ్ళకి దడిసి దూరంగా ఉన్నారు. నేను పోలీసులకి ఫోన్ చేశాను. పోగల కార్యం పోలీసులు తీర్చారు. అందరినలా నుంచోబెట్టి అమ్మాయిని ఆటో ఎక్కించారు.

ఐతే వారి చేతుల్ని చాటుగా, చాలా ఘనం (ధనం)గా తడిపాను. రాజి చూసింది. "మీ రునం తీరేదెట్టాసారూ!" అంది.

"నాక్కొన్ని పనులున్నాయి. అవి నీలాంటి వాళ్ళవల్లే అవుతాయి. మళ్ళీ వచ్చి నిన్ను కలుస్తాను" అంటూ వెళ్ళిపోయాను.

రాత్రి.. గాలి, వాన. బస్సునిండా జనం. అందులో నేను. ఉన్నట్టుండి బస్సు ఆగింది. చిన్న బ్రిడ్జ్ బస్సు ముందు టైర్లు దాటాయి. శబ్ధం. డ్రైవర్‌కి అనుమానమొచ్చి బస్సు ఆపాడు. ముందు టైర్లకి, వెనుక టైర్లకీ మధ్య బ్రిడ్జ్ లేదు. కనుక బస్సు అటుగానీ, ఇటుగానీ వెళ్ళలేదు. సన్నని తుంపర.

"ఒక్కొక్కళ్ళుగా దిగండి. లైట్లు వేసి ఉంచాను. డ్రైవర్ అన్నాడు. ముందువేపునుండి జాగ్రత్తగా దిగండి. కింద గొయ్యివుంది. కండక్టర్ చెప్పాడు. అందరూ దిగుతున్నారు. వాళ్ళ వాళ్ళని దించుకుంటున్నారు. ఒంటరి ప్రయాణీకులకి చేయూతనిస్తున్నారు. అప్పుడు చూశాను. బస్సు వెలుగులో రాజిని. నెమ్మదిగా దిగండి సారూ' అంది. చెయ్యి అందించింది.

"అంతా దిగారా? ఇకెవ్వరైనా ఉన్నారా?" కండక్టర్ కేకేశాడు.

"త్వరగా ఆ గడ్డమీదకి నడవండి. అక్కడ పాతగుడి ఉంది" ఓ ప్రయాణీకుడు అన్నాడు.

అతడు స్థానికుడు కాబోలు. ఏదో శబ్ధం. ఏంటది? నేను ఆలోచిస్తున్నాను. సగం దూరం నడిచాం.

అంతలో బస్సులో నుండి చంటిబిడ్డ ఏడుపు. "బస్సులో చంటిబిడ్డ ఉంది" అన్నాను.

"ఔను. పన్నెండో నెంబరులో పాప, ఆమె తల్లీ ఉన్నారు" కండక్టర్ చెప్పాడు.

"నే వెళ్ళి ఇద్దర్నీ తెస్తాను" రాజి అంది.

"వద్దు" ఇందాకటి స్థానిక ప్రయాణీకుడు అన్నాడు.

"దూరంగా పెద్ద చెరువుంది. దానికి గండి పడబోతోంది. అందుకే ఈ శబ్దం. ఇహనో, ఇప్పుడో ఈ బస్సుకూడా కొట్టుకుపోతుంది. అంత ప్రవాహం రానుంది. త్వరగా ఆ ఎత్తు ప్రదేశం చేరాలి పదమ్మా. "

"మీరంతా నడుస్తూ ఉండండి. నేవెళ్ళి వాళ్ళని తీసుకొస్తాను"

"వద్దు. నామాట విను. శబ్ధం దగ్గరవుతోంది."

"ఇప్పుడే వస్తానయ్యా!"

"నువ్వు పోతావమ్మా! వినవేంటి?" అందర్నీ ముందుకు నడిపిస్తూనే అతను హెచ్చరిస్తున్నాడు. "వాళ్ళు పోవడం చూసేకన్నా నే పోవడం మంచిది" అప్పటికామె బస్సులో ఉంది. నేను బస్సు ముందు "సారూ! ఆమె పోయింది. పాప బతికుంది" అంటూ కేకేసింది. "పాపని తీసుకురా" అన్నాను. అంతే చేరువలో నీటి శబ్ధం. పాపతో ఆమె, ఆమె చేయి పట్టుకుని నేనూ పరుగులు. పాప ఏడుపు. 'హోరు' మని గాలి. జోరుగా నీటి శబ్ధం. మేమిద్దరం పరుగులు. తోటి ప్రయాణీకులు అరుపులు.

వారు గుడిని చేరారు. మేం వెళ్తున్నాం. శబ్దం మరింత ఇంకా, ఇంకా చేరువలో 'గల' 'గల'మని కాదు. 'ఫెళ, ఫెళ' మంటూ ప్రయాణీకుల అరుపు "త్వరగా రండి". పాప ఏడుపు 'పాలు తెండి' కాబోలు. మేం మెట్ట ప్రాంతం చేరుకున్నాం. అంతే! పెద్ద ధ్వని. జలప్రళయం లాంటి నీరు. ఆవురుమంటూ వచ్చింది.

అవలీలగా బస్సుని తోసుకుంటూ, లాక్కుంటూ తనతో తీసుకుంటూ వెళ్తోంది. మేం గుడిని సమీపించాం. అంతా వచ్చి మమ్మల్ని గుడిలోకి లాక్కుపోయారు. చీకటి, వర్షం. కానీ మెరుపుల వెలుగులతో మాకు దారి కనబడింది. ఇద్దరి దగ్గర టార్చి లైటు కూడా ఉంది. గుడి పెద్దది. సోలార్ లైట్ వెలిగించాను. వర్షం కాస్త తగ్గింది. చీకటి మాత్రం బొగ్గు గుట్టలా పడుంది. అంతా కూర్చుని ఉన్నాం.

కొందరు చిరునిద్రలు. కొందరు గురకలు. కొందరు గుసగుసలు, ఇకిలింపులు, సకిలింపులు. పాప ఏడుపు. వాన, మెరుపులు. ఉరుములు. క్షణాలు వేకువ నిరీక్షణాలై గడుస్తున్నాయి. పాపకి ఓ తల్లి బ్యాగ్‌లోనుండి టవల్ తీసిచ్చింది. ఒకతను లుంగీ ఇచ్చాడు. ఓ కన్నతల్లి ఏకంగా పాలు ఇచ్చింది. తల్లికాదని ముందుగా తిరస్కరించిన పాప, కాస్సేపు పోయాక స్వీకరించింది. బొజ్జ నిండింది. పాప బజ్జుంది. హాయిగా రాజి ఒడిలో.

రాత్రి గడిచింది. వేకువ వచ్చింది. అప్పుడు కలిగింది భయం. "రాత్రివల్ల చీకటి భయమే కానీ వెలుగులో జలప్రళయం కనిపిస్తోంది" అన్నారెవరో. నాకు మాత్రం ఆ ప్రళయంలో ఓ ప్రణవం కనిపించింది. ఆ ప్రణవం పేరు రాజి.

"మా ఆయన్లో లోపం ఉందట సార్. అందుకని మాకు సంతానం కలుగలేదు. ఇప్పుడీ పాప దేవుడిచ్చిన బిడ్డ" అంటూ తనతో తీసుకెళ్ళింది.

***

తరువాత నెలరోజులకి నేను దత్తత చేసుకున్న లంబాడీ తండల రక్షణ, బాధ్యత డబ్బు, లెక్కలు, పద్దులు అన్నీ ఆమెకి అప్పగించాను. మూడేళ్ళకల్లా రాజి అద్భుతాలు సాధించింది. అంతర్జాతీయ ఖ్యాతినార్జించింది. ప్రస్తుతం లండన్‌లో ఉంది. ఏదో అవార్డు అందుకోవడానికి వెళ్ళింది.

***

కాంవుంఁడు చిన్ననాటి మిత్రుడు. ఈమధ్యే కలిశాడు. ఈ ఊళ్ళోనే ఉంటున్నాడు. పట్టెడు చదివాడు. పుట్టెడు పండిస్తున్నాడు. అందర్ని కలుపుకుని పోతాడు. హాయిగా నవ్వుతాడు. హాస్యాన్ని పండిస్తాడు.

సాంబశివుడు వాడి పనివాడు. "కాదు సంరక్షకుణ్ణి" అంటాడు సాంబశివుడు.

"కాదు. నేను బాడీని వాడు నా బ్రెయిన్" అంటాడు వీడు. వీడు ఎక్కడుంటే అతనక్కడ. క్షణం కూడా విడవడు సాంబశివుడు. వీడికేమో అతని మీద హాస్యం. జోకులు. బాకులు. ఓనాడు

తరచుగా వాళ్ళింటికి పిలుస్తాడు. తినమనీ, టీ తాగమనీ, టిఫిన్ చేయమనీ బలవంతపెడతాడు.

"వ్యాఁవ్!" ఏడుపు గొంతుతో అన్నాడు.

"ఏమయింది?" అన్నాను నేను.

"మా ఇంట్లో నీళ్ళన్నీ వీడే తాగుతున్నాడు" అన్నాడు. అటుచూస్తే పెద్ద చెంబుతో సాంబశివుడు నీళ్ళు తాగుతూ కనిపించాడు.

మరో రోజు ఎక్కడో ఉన్న అతణ్ణి అర్జంటుగా రమ్మని ఫోన్ చేశాడు. అతను పరుగెత్తుకుంటూ వచ్చాడు. అతను లోపలికి రాగానే "ఆ టిఫిన్ కూడా వీడి మొహాన తగలెయ్యి" అన్నాడు వాడి శ్రీమతితో.

"ఏం?" అంది చిరుకోపంతో.

"వెధవ చచ్చూరుకుంటాడు" అన్నాడు.

ఆమె చురచుర చూసింది. "అదేనోయ్! ఆ టిఫిన్ చేశాక చస్తేనేం? స్వర్గం లేకపోతేనేం?" అన్నాడు.

అంతలోనే "వ్యాఁవ్" అన్నాడు ఏడుపు గొంతుతో.

"మళ్ళీ ఏమయింది?" అనడిగాను.

"గదిలో ఉన్న గాలినంతా వీడొక్కడే పీల్చుకుంటున్నాడు" అన్నాడు

వెనుదిరిగాను. సుదీర్ఘమైన ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో సేదతీరుతున్నాడు సాంబశివుడు.

"వెధవ!" అన్నాను నేను. కొద్దిసేపున్నాక పక్క ఊరునుండి ఓ ఆసామి వచ్చాడు. ఆయనకేదో రాత సాయం కావాలట.

ఉత్తరాలకి - ప్రత్యుత్తరాలు, అప్పు పత్రాలకి 'క్లిప్పు' పత్రాలు, నోటీసులకి 'ధాటీ'సులు, ఉద్యోగాలకి దరఖాస్తులు, కట్టవలసిన శిస్తులు, తగాదాల్లో ఉన్న ఆస్తులు, వీటికి ఉచితంగా రాతకోతలు సమర్పించే సమున్నతుడు వాడు.

ప్రస్తుతానికి వస్తే వచ్చినాయనకి నన్ను పరిచయం చేశాడు. "వీడు.." అన్నాడు.

"తెలుసండీ, మీ బాడీగార్డ్ సాంబశివుడు గారంటగా?" అన్నాడాయన.

"తప్పుగా విన్నారండీ! వీడేమో నా బాడీ - ఆవిడేమో నా గాడ్ (వాళ్ళావిణ్ణి చూపించి) ఇద్దరిమధ్యనా అంతర్లీనంగా ఉన్న 'ర'కారాన్ని నేను. ఆనాడు వచ్చినాయన తెగ మెచ్చేసుకుని, తెచ్చిన మొక్క జొన్న పొత్తులు ఇచ్చేసుకుని, వచ్చిన పని చెప్పేసుకుని, పత్రాలు పుచ్చేసుకుని వెళ్ళిపోయాడు. వాడికి బాడీగార్డ్ అవసరమేంటో నాకు అప్పుడు అర్థమయింది. ఇదీ కాఁవుడోపాఖ్యానం. వాడు నన్నుకూడా వదల్డు.

"చెల్లెల్ని (నా భార్యని) పిలు" అంటాడు.

"అత్త గతం. నీ భార్య వర్తమానం మొదటిది. తవ్వుకోకు. రెండవది వదులుకోకు" అంటుంటాడు.

"చేసిన పని, వేసిన శిక్ష చాలు. సంఘం, సమాజం అంటావు. ఆమె ఆమె అందులో భాగం కాదూ? క్షమించు"

నేను పలుకను.

ఆ రోజు వాడింటికెళ్ళాను. "గాయత్రి ఏదీ?" అనడిగాను. "అలాంటి పేరుగలాళ్ళు ఇక్కడ లేరే?" అన్నాడు.

"మీ ఆవిడరా!" అన్నాను కోపంగా.

"ఓ.. ఆవిషయం మరిచేపోయాను. ఆ గదిలో సీరియళ్ళ జోరులోపడి టీ.వీ బోరుమని విలపిస్తోంది. అది చూసేందుకు వెళ్ళింది. ఐనా చెట్టంత వాడిని నేనున్నాగదరా!"

తరువాత నేను బదులీయలేదు. నా జవాబు మరో ప్రశ్నకి తావిస్తుందని తెలుసు.

"తెలుసుకున్నావు. తెలివైనవాడివి" అన్నాడు.

నే పలుకలేదు.

"లోకంలో మహానుభావులైన మగాళ్ళంతా పెళ్ళాం ముందు శాడిస్టులు అని చదివానెక్కడో. అది నిజం చేయకురా! తగ్గి ఉండటం తక్కువదనంకాదు. గుర్తుంచుకో."

"నేనా తగ్గాలి? ఆమే తగ్గి నా దగ్గరికి రావచ్చుగదా?"

"నువ్వు రానిస్తావన్న నమ్మకం లేదుగదా?"

"వస్తేకదా నేనేమంటానో తెలిసేది?"

"నా మాట వినరా"

"ఆత్మద్రోహం చేసుకున్నది నేను. అమ్మలాంటి అత్తను కోల్పోయింది నేను. పిల్లలు, ఇల్లు, సంసారం, పుట్టింటాళ్ళు హాయిగా ఉన్నది తను. ఒంటికన్ను సొంటి కొమ్ములా బ్రతుకుతున్నది నేను. కనీసం నా చుట్టూ నలుగురు లేక ఏకాకిలా ఉన్నది నేను. ఇప్పుడు చెప్పు. ఎవరు తగ్గాలి? ఎవరు బ్రతిమాలాలి. ఎవరికి నష్టం జరిగింది?"

"అంటే... ఆమె వస్తే స్వీకరిస్తావా?"

"నాక్కొన్ని నియమాలున్నాయి. అవి చెప్పాలి ముందు."

"రూల్స్ పెట్టేందుకు మీది కాపురమా? కొలువా?"

"కొలువు. ఉద్యోగం. నీవే నేననే సత్‌యోగం. ఒకరికొకరమనే ప్రమాణ యాగం. ఒక్కళ్ళు కాదు. ఇద్దరికీ ఇందులో సమభాగం"

"ఏం మాయరోగం? నువ్వే తగ్గేడవచ్చుకద?"

"విను. ఇప్పటికైనా నీమాట వినడం, తను వస్తే రానీ అనడం నీకు అవసరం కాదు. బాధ్యత. కానీ ఆమెకి? సామాజిక భద్రత. సమాజం నుండి, చెడు విషయాల నుండి పిల్లలనుండి, చివరకు మానసిక వేదననుండి. ఇది నీ మాటల ప్రభావంతో ఈరోజు తీసుకున్న నిర్ణయం కాదు. ఆ ఇంటినుండి వచ్చిననాడే తర్కించుకుని తీసుకున్న తీర్పు. "

మర్నాడు వచ్చాడు. "రైట్. నీవే కరెక్ట్. ఆమే రావాలి" అన్నాడు. సాంబశివుడు పరుగున వచ్చాడు నన్ను పట్టుకున్నాడు. నా ఒళ్ళంతా చమటలు. ఎక్కడో నొప్పి. అంతే గుర్తుంది.

"చూడండి. మేం చేయగలిగినంత చేస్తున్నాం. కానీ ఆయన బ్రతకాలని ఆయనకుండాలి. జీవించాలనే ఆశ కలగాలి. ఆయన మరణాన్ని ఆహ్వానిస్తున్నాడు."

ఎక్కడినుండో సన్నని మాటలు. వినడం మానేశాను. నేనున్నది చీకట్లో. దురంగా వెలుగు. చాలా ప్రయాసపడుతున్నాను. చీకట్లో నుండి వెలుగులోకి వెళ్ళబోతున్నాను. ఏవో బంధాలు చుట్టేస్తున్నాయి. బంధనాలు పట్టేస్తున్నాయి. వెలుగువేపు చేరనీడంలేదు. ఆపేస్తున్నాయి. ఆక్రోశిస్తున్నాయి. 'వెళ్ళ'ద్దు. వెళ్ళకు.' అడుగు ముందుకు వేయనీడంలేదు.

కూడదీసుకుంటున్నాను. ఏవో పాశాలు. పట్టి చుట్టేస్తున్నాయి. చాలు. చాలింక. అటువేపు.. వెలుగువేపు వెళ్తాను. బలమైన నిర్ణయం. అడుగులు వేస్తున్నాను. పాశాలు బంధాలు తెల్లబోతున్నాయి. బంధనాలు వెలవెలబోతున్నాయి.

ధైర్యం వచ్చేసింది. ఆగలేదు. బలంగా అడుగులు. సత్, చిత్‌మయమైన ఆనందం కోసం అర్రులు చాస్తూ, వెళ్తున్నాను. ఆగలేదు. బలంగా అడుగులు. వెలుగువేపు. ఇంకెంత? చిటికెడు దూరం. వచ్చేస్తోంది. వెళ్తాను. వెళ్తున్నాను. ధైర్యం వచ్చేసింది. వెలుగు చేరువౌతోంది. చివరి క్షణాలు.

అంతే! అంతలో ధ్వని. కేక. శబ్ధం పిలుపు.

"అంమ్‌మ్..బ్బా!"

అడుగు ఆగింది. 'అంబా!' 'అంబూ!' 'అంబ్రూ' 'అవును. అదెవరు? అత్త?'

'అవును. అత్త. నా తల్లిగాని తల్లి. పిలుస్తోంది. చీకట్లోంచి.'

'అంబా! అంబూ! అంబ్రూ!'

అంతే. వెనుదిరిగాను. చీకట్లోంచి చీకట్లోకి వెలుగు నుండి 'మిగులు'లోకి.

'అత్తా!'

'అంబా!'

"ఏయ్! వెనక్కి తిరిగావేం? వెలుగులోకి రావూ?"

'రాను. మా అత్త నాకోసం వచ్చింది.'

'అత్తకాదది - ఆవు. ఆవు విను'

'అవును. అత్త ఆవురూపంలో వచ్చింది. నాకోసం.'

'ఎలా వెళ్తావ్? అంతా చీకటి. చాలాదూరం వచ్చేశావ్. వెలుగు చేరువలో ఉండగా వెళ్తున్నావ్.

'అత్త వెలుగు. అత్త దీపం. దారి చూపిస్తుంది' నడుస్తున్నాను. కాదు. పరుగెత్తుతున్నాను. వెనక్కి. చీకట్లోకి. చిత్రం చీకట్లో కూడా చిరువెలుగు.

'అమ్..బా! 'అంబా!'

'అత్తా! వస్తున్నాను.'

'అంబూ! మరణించాలనుకోవడం ఆత్మహత్యతో సమానం.'

'నన్ను క్షమించు అత్తా!'

'అంబా! అంబూ'

శబ్దం మరింత చేరువలో "అద్భుతం. ఆయన బ్రతికారు. ఔటాఫ్ డేంజర్. కారణం ఆవు. 'అంబా' అనే ధ్వని."

"డాక్టర్ నా భర్తని బ్రతికించారు. మీ పాదాల్ని నా కన్నీళ్ళతో కడుగుతాను."

"వద్దు. ఆ ఆవుని చూపండి. చాలు" ఎక్కడినుండో మాటలు. తరువాత స్పృహ లేదు.

"ఆపరేషన్ సక్సెస్ అన్నారు. ఇంకా మెలుకువ రాలేదు."

"వస్తుంది. ఆవుని తెచ్చారా?"

"ఆఁ తీసుకువచ్చాం. మీరు చెప్పినట్టే ఈ కిటికీకి బయటివేపు కట్టేశాం."

"ఆవుకోసమే ఈయన్నీ రూములోకి మార్పించాను. ఆయన కళ్ళు తెరిచేటప్పటికి అది కిటికీ ముందుండాల"

"సరే! డాక్టర్."

"అది సరే! ఆ పక్కనున్న గుడి మైకులోనుండి ఆవుని అంబా అనిపించింది ఎవరు? "

"వీడు మా మనమడు. అబ్బాయి కొడుకు. తాతయ్యకి జీవితం మీద ఆశ నేను కలిగిస్తాను" అంటూ చెప్పివెళ్ళాడు.

"అచ్చు మీవారిలాగే ఉన్నాడే?"

"ఔను."

"ఇంత పెద్ద ఫోటో తెచ్చారే. ఎవరీమె?"

"మా అమ్మ. మా వారి అత్తయ్య"

"నాకెందుకో ఈ నల్లావులో ఆవిడ పోలికలు కనిపిస్తున్నాయి"

"అవునండీ ఆమె నుదుట నల్లని పుట్టుమచ్చ. ఎడమ కాలి పాదానికి పైన కాలిన మచ్చ. భుజం మీద ఓం అనే పచ్చబొట్టు ఉండేవి."

"అరే! ఈ నల్లావుకి అన్నీ తెల్లని మచ్చలు. అలానే ఉన్నాయే! ఇది అద్భుతం" మాటలు వినబడుతున్నాయి. అంతలో 'అంబా' అని అరుపు.

నే కళ్ళు తెరిచాను. కిటికీ బయట కట్టి ఉన్న నల్లావుని చూశాను. అంతే.

సంబరపడిపోయి "అత్తా!" అన్నాను ఆనందంగా.

# గోడలు — గంటి భానుమతి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో బహుమతి పొందిన కథ

**"మీకూ, మీ భార్యకి బీజింగ్** చూడడం కోసం ఓ వ్యక్తి స్పాన్సర్ చేసారు. ఓసారి మీరు మీ పాస్‌పోర్టులు, ఈ మధ్య తీసుకున్న ఫోటోలు తీసుకుని మా ట్రావెల్స్ ఆఫీసుకి వస్తారా?"

అర్థం కాని భాష వింటున్నట్లుగా మొహం పెట్టాడు సుబ్బారావు. వెంటనే తేరుకున్నాడు.

"క్షమించండి. నాకు మీరెవరో తెలీదు. మేము బీజింగ్ వెళ్ళాలని అనుకోడం లేదు. మాకు తెలిసిన వాళ్ళు ఎవరూ కూడా అక్కడలేరు. మమ్మల్ని స్పాన్సర్ చేసి తీసుకుని వెళ్ళేంత దగ్గరవాళ్ళు లేరు. మీరు ఏదో తప్పు నంబరుకి ఫోన్ చేసినట్లున్నారు. మీరు అనుకుంటున్న వ్యక్తిని నేను కాకపోవచ్చు.." అని ఆగిపోయాడు.

"లేదండి. మేము ఏం పొరపాటు పడలేదు. ఇదే నంబరు. అడ్రస్సు ఇదే మీ పేర్లు సుబ్బారావు, విజయ అవునా..?"

ఆశ్చర్యంగా, ఫోన్ చేతిలో ఉంచుకుని, ఆలోచిస్తూ ఎదురుగా ఉన్న గోడకేసి చూసాడు నిజమే. ట్రావెల్స్ ఏజెంటు చెప్పినది పూర్తిగా నిజం. పొరపాటులేదు. కానీ, దీన్ని ఎలా నమ్మాలి? ఇదివరకూ ఇలాంటి ఫోన్ కాల్స్ వచ్చాయి. మీకు లాటరీ తగిలింది. మా ఆఫీసుకి వచ్చి బహుమతి తీసుకెళ్ళండి. ఫలానా రిసార్ట్స్ వాళ్ళు మిమ్మల్ని డిన్నర్‌కి పిలుస్తున్నారు. ఆరుగంటలకి ఫలానా హోటలుకి రావాలి. ఇవి విన్నవి. అయితే ఈసారి ఏకంగా విదేశయానం. అసలు ఎవరూ మా గురించి శ్రద్ధ తీసుకుని మమ్మల్ని చైనా పంపుదామనుకుంటున్నారు. తెలుసుకోవాలి. అదే విషయాన్ని అడిగాడు.

"అతని పేరు చెప్పద్దన్నారు. ఒకటి మాత్రం చెప్పారు. మీరు అతనికి సాయపడ్డారుట. ఆ అభిమానాన్ని చూపించుకోవాలనుకుంటున్నారు." ఆలోచనలో పడ్డాడు సుబ్బారావు.

అభిమానాన్ని చూపించుకోవాలనుకుంటున్నాడు అంటే, ఎవరో తన శిష్యుడు.

"నాకేం అర్థం కావడంలేదు."

"పర్వాలేదు. రెండు రోజుల్లో ఈ ట్రిప్ గురించిన వివరాలు, బ్రోచర్లు అవీ పంపిస్తాం. అందులో మా ఆఫీసు అడ్రస్సూ అదీ ఉంటుంది. మీరు తప్పకుండా రండి."

అంతలోనే విజయ ఏవిటన్నట్లుగా తల ఎగరేస్తూ చూసింది భర్తని. జరిగింది వివరంగా చెప్పాడు. ఆమె కొట్టిపారేసింది.

కానీ, రెండు రోజుల తర్వాత, ఓ చిన్నపుస్తకం, చైనా గురించిన విశేషాలు తెలిపే కాయితాలు చూసాక, కొట్టిపారేయలేకపోయింది. "సాయంత్రం ఓసారి వెళ్ళి ఆ ఆఫీసు ఏవిటో చూసొస్తాను. విషయం కనుక్కొని వస్తాను. అప్పుడే వాళ్ళు అడిగినవి యిస్తాను."

అన్నట్టుగానే సాయంత్రం ట్రావెల్స్ వాళ్ళ ఆఫీసుకెళ్ళాడు. ఆఫీసు పెద్దగా ఉంది. నలుగురైదుగురు బిజీగా ముందు కూచున్న వాళ్ళతో మాట్లడుతున్నారు.

అక్కడికి వెళ్ళి తను వచ్చిన పని చెప్పాడు. అతను మనిషిని పిలిచి, సుబ్బారావుని తీసుకెళ్ళమన్నాడు.

"నేనే మీకు ఫోన్ చేసాను. మిమ్మల్ని జాగ్రత్తగా పంపించమని మళ్ళీ చెప్పారు."

"నాకు ఆ మనిషి ఎవరో తెలీదు. నేను అలాంటి మనిషి పంపుతానంటే ఎలా వెళతాను?" ఇంకా నమ్మకం కుదరలేదు.

"అతను మీ శిష్యుడట. మీ దగ్గర చదువుకున్నాడుట. అన్ని ఏర్పాట్లు చేయమని అన్నాడు షాంగాయ్, బీజింగ్ చూపిస్తాం. షాంగాయ్‌లో పుడాంగ్ ఏర్ పోర్టులో ఇంగ్లీషు వచ్చిన చైనీస్ గైడ్‌ని ఏర్పాటు చేయమన్నారు. హోటల్, ఇండియన్ భోజనం, సైట్‌సీయింగ్. బుల్లెట్ ట్రెయిన్‌లో బీజింగ్, అక్కడ ఓ రెండు రోజులు. మళ్ళీ ఢిల్లీ ఆ తర్వాత హైదరాబాదు. ఇవన్నీ మీ యిద్దరికీ."

సుబ్బారావుకి నమ్మశక్యంగా అనిపించడంలేదు. ఆ విద్యార్థి ఎవరో తెలుసుకోవాలి.

"ఓసారి అతనితో మాట్లాడాలని అనుకుంటున్నాను."

"ఒక్క నిమిషం. మీరు ఇక్కడ కూచోండి" అంటూ వెళ్ళిపోయాడు. మరో ఐదు నిమిషాలకి, సెల్ సుబ్బారావుకి యిచ్చాడు.

"నేను మీ శిష్యుడినండి. మీరు చెప్పినవి మాకు అన్నీ గుర్తున్నాయి. మీకు గుర్తుందో లేదో.. కానీ.. మాకు బాగా గుర్తు. ఇంగ్లీషులో ఓ పోయెం చెపుతూ, గోడల గురించి చెప్పారు. గోడలు గదులని వేరు చేస్తాయి. ఇళ్ళని వేరు చేస్తాయి అంటూ మొదలు పెట్టి ఎన్నో చెప్పారు అవన్నీ మాకు బాగా గుర్తుండిపోయాయి. అందుకని, మిమ్మల్ని ఎంతో అభిమానంగా చైనాకి పిలుస్తున్నాం. నేను షాంగాయ్‌లో పనిచేస్తున్నాను. మిమ్మల్ని స్పాన్సర్ చేయడం నాకు కష్టంకాదు. మా పిల్లల మధ్య గోడలుండకూడదని, తేడాలుండకూడదని, అందరూ ఐక్యంగా ఉండాలని చెప్పారు. అంతే కాకుండా, మా మధ్య ఉండే లక్ష్మణరేఖలని చెరిగిపోయేలా చేసారు. అందుకే మీరు ఈ ట్రిప్‌కి అర్హులు. మీరు చేసిన దానిలో ఇది ఎంత?"

ఇంటికి వచ్చాక, విజయకి అంత చెప్పాడు. "ఈ అబ్బాయి ఎవరో మీకు గుర్తురావడం లేదంటున్నారు. కానీ, తను మాత్రం, హోం వర్కు బాగా చేసాడు.." అంది.

నిజమే. కాలేజీ వదిలేసి నాలుగేళ్ళయింది. కాలేజీ ఆవరణలో ఉన్న యిల్లుని, అంతకు ముందే ఖాళీ చేయాల్సి వచ్చింది. గోడలు బీటలు వారాయి. బాగుచేసేంత డబ్బు యాజమాన్యానికి లేదు. వేరే యిల్లు తీసుకున్నారు. ఇంటివాళ్ళమ్మాయి పెళ్ళికి యిల్లు కావల్సివస్తే ఖాళీ చేసారు. ఆ తర్వాత విజయ గైనిక్ ప్రాబ్లెంతో, కూతురింట్లో ఉన్నారు. ఆ తర్వాత ఓ ఫ్లాటు కొనుక్కున్నారు. కొనుక్కున్న

ఫ్లాటులోకి వెళ్ళేముందు, మరో రెండేళ్ళు మారాల్సి వచ్చింది. అందుకే విజయ అంది హోం వర్క్ బాగానే చేసాడని. అడ్రసు బాగా కష్టపడి కనుకున్నాడు. ఎవరు? ఎవరయి ఉంటారు? ఇన్ని ఏళ్ళ తర్వాత చైనా గోడని చూడమని స్పాన్సర్ చేస్తున్నాడు.

నిజమే. మెండింగ్ ద వాల్ అన్న పోయెం చెప్తున్నప్పుడు గోడల గురించి చెప్పడం అలవాటు. ఆ అలవాటు ప్రకారంగా చెప్పే ఉంటాడు. సందర్భం వచ్చిందని బెర్లిన్ గోడ గురించి చెప్పి ఉంటాడు. రాజకీయ శక్తులు, మనుషుల్ని ఎలా విడదీసాయో చెప్పి ఉంటాడు. ప్రజలు ఊహించని విధంగా, ఆ దేశ విభజన ఎక్కువ కాలం నిలవ లేదని చెప్పే ఉంటాడు, ఆ గోడ ఎలా కూల్చేసారో, దాని గురించి కూడా చెప్పే ఉంటాడు. ప్రపంచ వింతల్లో ఒకటైన చైనా గోడ గురించి కూడా చెప్పే ఉంటాడు.

రాజకీయాల్లో ఈ గోడలు, ఈ ఇనపతెరలు చాలా సహజం. అవి కుట్రలతో, కుతంత్రాలతో కూడుకున్నవి. ఓ క్లాసులో ఉండేవాళ్ళకి, చదువుకునే వాళ్ళకి. ఈ గోడలు ఉండకూడదని చెప్పే ఉంటాడు. ప్రతీ క్లాసులో నైతిక విలువలు గురించి చెప్పడం అలవాటు.

అలా చెప్పినంత మాత్రాన, పిల్లలు జీవితాంతం గుర్తు పెట్టుకోవాలని నియమం ఏం లేదు. నిజంగా గుర్తుపెట్టుకుంటే, ప్రతీ విద్యార్థి ఆణిముత్యంగా మారుతాడు.

కానీ, ఈ అబ్బాయి ఏవిటీ? ఆణిముత్యమా! మాణిక్యమా !

ఇన్ని ఏళ్ళు గుర్తుపెట్టుకున్నాడా! పైగా చైనా గోడ చూడడానికి టిక్కెట్లు పంపాడు. ఎవరు? ఏ బ్యాచ్‌వాడు. ఉహూఁ.. ఎంత ఆలోచించినా, గుర్తురావడంలేదు.

సుబ్బారావు దగ్గర ఎంతో మంది చదువుకున్నారు. ఎన్నో ఏళ్ళు. ఆ ఎంతో మదిలో ఎవరయి ఉంటారు?

ఈ క్షణాన, అతని ఫోటో చూపించినా గుర్తు పట్టలేడు. గుర్తు పట్టడం కష్టం. ఎన్నో మార్పులు. జూనియర్ కాలేజీలో పనిచేసిన సుబ్బారావుకి, అతనెవరో తెలీడం లేదు. తన దగ్గర చదువుకున్నప్పుడు, అతని వయసు పదహారు, పదిహేడు. అంతకుమించి ఉండదు. ఈ అబ్బాయికి ఇప్పుడు ముప్పయి నలభై మధ్య ఉండీ ఉండాలి. ఓ మనిషి కోసం ఇంత ఖర్చు పెడ్తున్నాడంటే, మంచి ఉద్యోగంలో ఉండీ ఉండాలి.

ఎవరబ్బా! పోనీ పేరు తెలిస్తే ఓసారి రివైండ్ చేసుకుని ఆలోచిస్తే గుర్తొస్తుందా! కష్టం అలాంటి పేరున్న వాళ్ళు చాలామంది ఉంటారు. అతనెవరో తెలీకుండానే, సుబ్బారావు ఏజెంటుకి సాయపడ్డాడు. సంతకం పెట్టమన్న చోట పెట్టాడు. కొత్తగా తీయించుకున్న ఫోటోలు పాస్‌పోర్టులు అన్నీ యిచ్చాడు.

ఓ పదిరోజులు తర్వాత, ట్రావెల్స్ వాళ్ళు సుబ్బారావుకి, విజయకి ఎయిర్ ఇండియా విమానంలో టిక్కెట్లు కొని యిచ్చారు. వీసా వచ్చాక, కొంత డబ్బుకి సుబ్బారావుని యిచ్చారు.

ఈలోపలే, సుబ్బారావు అతని పేరు, వివరాలు చెప్పమని చాలాసార్లు అడిగినా వాళ్ళు ఇవ్వలేదు.

ఢిల్లీ నుంచి, డైరెక్టుగా షాంగాయి ఫుడాంగ్ ఏర్‌పోర్ట్‌లో దిగాక, బయటికొచ్చేసరికి, ఓ యిద్దరు ఇండియన్స్ ఓ ప్లా కార్డు పట్టుకుని ఉన్నారు.

వాళ్ళిద్దరూ పూషీలో ఉంటారుట. టాక్సీలో అక్కడ వాళ్ళింటికి తీసుకెళ్ళారు. సుబ్బారావు, వాళ్ళిద్దర్నీ పదే పదే చూస్తున్నాడు. వాళ్ళల్లో తనకి ఏవైనా కనిపిస్తాయేమోనని. వాళ్ళు ఎక్కడ చదివారో అన్ని వివరంగా కనుక్కున్నాడు. మాటల్లో, తమకి స్పాన్సర్ చేసిన వ్యక్తి గురించి అడిగాడు.

"మాకు తెలీదు. ఇది మేము ఇలా ఇండియా నుంచి వచ్చిన తెలుగు వాళ్ళకి, తోడుగా వెళ్తూంటాము అంతే. మేము వివరాలు ఏవీ అడగం. మళ్ళీ మిమ్మల్ని ప్లేను ఎక్కించే వరకు మీకు తోడుగా ఉంటాం. మీరు ఏమైనా కొనాలనుకున్నా, నిస్సంకోచంగా అడగచ్చు. ఇవన్నీ మాకు చెప్పారు."

షాంగాయ్ చూస్తున్నా, బుల్లెట్ ట్రైన్‌లో బీజింగ్ వెళ్ళినా, ఇంపీరియల్ పాలెస్, తియాన్‌మెన్ స్క్వేర్, మంగోలుల దాడి నుంచి రక్షించుకోవడానికి వందల సంవత్సరలు కష్టపడి కట్టిన కొన్నివేల కిలోమీటర్ల చైనా గోడని ఆశ్చర్యంగా చూస్తున్నా, ఆ అజ్ఞాతశిష్యుడే కనిపిస్తున్నాడు. మసక మసకగా కనిపిస్తున్నాడు. ఈ అదృష్టాన్ని కల్పించాడు.

ఓ గురువుని ఇన్ని ఏళ్ళూ మర్చిపోకుండా ఉండటం ఓ ఎత్తైతే, యధాలాపంగా, పాఠం చెప్తున్న దానిలోని ఓ చిన్న ఆశని తీర్చాలనుకోడం మరో ఎత్తు. మళ్ళీ మనసులో అతనికి కృతజ్ఞత చెప్పుకున్నాడు.

మరిచిపోలేని విధంగా జరిగిపోయింది ప్రయాణం. జరుగుతున్నది కలా, నిజమా అన్న సందేహం తీరకుండానే హైదరాబాద్ వచ్చేసారు.

ఓ నెల తర్వాత, సుబ్బారావుకి కొరియర్‌లో ఓ పొడుగాటి కవరు వచ్చింది. దాన్ని చింపి చూస్తే అందులో ఉత్తరం ఉంది.

ఉత్తరం అంటే ఏవిటి అనే రోజుల్లో ఉత్తరమా!

అంతలోనే విజయ కూడా వచ్చి చూసింది ఆ ఉత్తరాన్ని.

"ఉత్తరమా! ఎక్కడి నుంచి?"

ఏం మాట్లాడకుండా ఆ ఉత్తరాన్ని చూసారు.

అది ఓ జిరాక్స్ కాపి. పేరు మాత్రం పెన్నుతో  రాసి ఉంది. అంటే తనలాంటి వాళ్ళు ఇంకా ఉన్నారన్న మాట.

గట్టిగా చదవడం మొదలెట్టాడు.

"చాలా ఏళ్ళ క్రితం, ఓ స్థానిక ప్రభుత్వ పాఠశాలనుంచి, ఓ ఆరుమంది పిల్లలం, మీ జూనియర్ కాలేజీలో చేరాం. వెనకపడిన ఓ ప్రాంతం నుంచి వచ్చిన మాకు, కాలేజీ చూసి ఆశ్చర్యపోయాం. ఇన్ని క్లాసులా! ఇన్ని గదులా!

ఎందుకంటే, మేం చదివిన బళ్ళో అస్సలు గోడలు లేవు. గదులు లేవు. ఓ పొడుగాటి వరండాలాగా ఉండే షెడ్డు. దాన్లోనే క్లాసులు. ఆ షెడ్డులోంచి ఆకాశ్మ కనిపిస్తూంటుంది. ఆ తర్వాత క్లాసులు చెట్లకింద ఇక్కడ పైన కప్పు ఆకాశం. ఇక్కడ కూడా గోడలు లేవు.

ఓ సహజమైన ప్రపంచంలో చదువుకున్నాం. విశాలంగా ఉన్న ప్రకృతిలో పాఠాలు నేర్చుకున్నాం. పైన కప్పులా ఉన్న ఆకాశం మా హద్దు అనుకున్నాం. అలా అనుకునే నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న మీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో చేరాం.

కొత్త ప్రపంచం. ఇంతవరకు చూడని ప్రపంచం. ఊహించని ప్రపంచం. గోడల మధ్య క్లాసులు. మనుషుల మధ్య గోడలు, తేడాలు, హెచ్చు తగ్గులు, మాభాష, మా వేషం, అన్నీ కూడా మాకు మిగిలిన పిల్లల మధ్య గోడలు కట్టాయి.

ఇది భరించలేకపోయాం. తెలుగు మీడియం నుంచి వచ్చిన మాకు, ఈ వాతావరణం ఉక్కిరి బిక్కిరి చేసింది. అవమానాలు భరించలేకపోయాం. ఈ చదువక్కర్లేదు. మా ఊరు వెళ్ళిపోవాలని అనుకున్నాం. కానీ, ఎలా! వెనక్కి ఊరు వెళ్ళిపోతే ఎలా? మా ఊరు నుంచి, పదోక్లాసు పాసయ్యి, ఇంటరు చదవడానికి వచ్చిన మొదటివాళ్ళం. మా ముందు తరాల వాళ్ళు చేసినదే మేము చేసినట్లవుతుంది. మా తర్వాత తరం అభివృద్ధి చెందాలంటే, మేం ఉండిపోవాలి. మా తర్వాత వాళ్ళు కూడా ధైర్యంగా పై చదువులు చదువుకోవాలి. మార్పులు రావాలి. ఇవల్యూషన్ రావాలి. ఉండిపోవాలని లేదు. అలా అని వెళ్ళిపోలేము. అయోమయం.

సరిగ్గా, అలాంటి సమయంలో, మీరందరూ మా పక్కగా నుంచున్నారు. అండగా నిలిచారు.

భయపడ్తూంటే, ధైర్యం చెప్పారు. వెనక్కి వెళ్ళిపోతూంతే, చేయి పట్టుకుని ముందు దారి చూపిస్తూ నడిపించారు.

ఆత్మన్యూనత భావంతో కళ్ళుదించుకుని మాట్లాడుతుంటే, ధైర్యంగా తలని ఎత్తి, కళ్ళని ఎత్తి మాట్లాడేలాగా చేసారు.

డబ్బులకి ఇబ్బంది పడినప్పుడు, ఆలోచించకుండా సాయం చేసారు. ఓ విద్యార్థి ముందు ముందు ఎలా పైకిరావాలో, దానికి ఎలాంటి పునాది కావాలో, దాన్ని గట్టిగా వేసారు. మా పెద్దవాళ్ళు చేయనివి, ఎన్నో చేసారు. విద్యార్థులంతా ఒకటే, వాళ్ళ మధ్య తెరలుండకూడదు. గోడలుండకూడదూ, అంటూ చెప్పి, మానసికంగా దృఢంగా తయారు చేసారు. మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలి? ఇది ఓ నూలుపోగు మాత్రమే. మేమందరం పెద్ద చదువులు చదవడానికి పరోక్షంగా సాయం చేసారు.

మమ్మల్ని చూస్తే, మీరు కృతజ్ఞతలు చెప్తారు. అది మాకు ఇష్టంలేదు. కృతజ్ఞతలు చూపించాల్సింది మేము. అసలు మేము ఎవరమో మీకు తెలియనక్కరలేదు. మీ దగ్గర చదువుకున్న వేలమందిలో మేముకూడా ఉన్నాం. మీరు మర్చిపోయినా ఎప్పటికీ మర్చిపోలేని మీ శిష్యులు.''

భార్యని చూసాడు. ఏదో తెలీని భావం కడుపులో చుట్టుకుని, గొంతు వరకూ వచ్చి ఆగింది ఇద్దరికీ.

# కుడి ఎడమైతే..!

శ్రీనిధి యెల్లాల

తంజావూరులో పీజీ సీటు వచ్చినప్పటి నుండి అమ్మ ముభావంగా ఐపోయింది. మూడు రోజుల నుండి చెప్పిన జాగ్రత్తలే మళ్ళీ మళ్ళీ చెపుతోంది. ఇంకా అమ్మ దగ్గర నుండి వస్తున్న సుప్రభాతం వినలేక హాల్లోకి వచ్చి నా పిజి అడ్మిషన్ లెటర్ తెరిచి ఒకసారి చూసుకున్నాను.

కొత్త ప్రదేశాలకి వెళ్ళడం అన్నా, అక్కడి చరిత్ర, సంస్కృతి-సాంప్రదాయాలు, ఆచార- వ్యవహారాలు తెలుసుకోవడమంటే నాకు ఎంతో ఇష్టం. మనకి తెలియని ప్రపంచం బోలెడు వుంది బయట. నా వరకు నేను, దీన్ని ఇంకో కోణంలో ప్రపంచాన్ని చూసేందుకు వచ్చిన అవకాశం అనుకుంటున్నాను. ఎప్పుడెప్పుడు వెళ్తానా అనీ ఆసక్తి గా వుంది.

మనకు తెలిసిన భాష, మన మనుషులు, మన పద్ధతులలో పెరిగి ఇప్పుడు కొత్తగా ఇంకో రాష్ట్రానికి వెళ్ళడం అంటే మనసు ఒకలాంటి ఆసక్తితో వింత అనుభూతికి లోనవుతోంది. ఇలా ఎన్నో ఆశలు, సంశయాలు, అతిశయాల నడుమ నాన్నతో తంజావూరు ప్రయాణానికి బయలుదేరాను. తంజావూరు .. ఆ ఊర్లో దిగగానే నాకు వేరే ప్రపంచం లోకి వచ్చినట్టు అనిపించింది.

ఫ్యాక్షన్ సినిమా షూటింగ్ లాగా సగం మంది తెల్లటి పంచల్లో ఉన్నారు. విభూతి బొట్లతో, తాంబూలంతో పండిన ఎర్రని పెదాలతో మగవాళ్ళు, మెడలో లావుపాటి గొలుసులతో ముక్కుకి చెవులకి రాళ్ల దుద్దులతో, జడలో పూలతో నిండుగా, కచేరి చేస్తున్న ఎం.ఎస్.సుబ్బలక్ష్మి లాగా వున్న ఆడవాళ్ళూ , ఎక్కడ చూసినా పూల దుకాణాలు, పళ్ళ దుకాణాలు, అడుగడుక్కి చిన్నదో పెద్దదో ఒక గుడి, అంతా సందడి సందడిగా ఏదో రంగుల ప్రపంచంలోకి వచ్చినట్టు,"యుగానికొక్కడు" సినిమా సెట్టింగ్ లోకి వచ్చినట్టు అనిపించింది.

హాస్టల్లో సామాను పెట్టేసి నాకు కావలసిన వస్తువుల కోసం బజార్ కెళ్ళాము. అసలు జనాలు తమిళ్ భాష తప్పితే ఇంకో భాష మాట్లాడట్లేదు. చచ్చి చెడి సైగలతో ఎలాగో అలా మానేజ్ చేసి హాస్టలుకి కావలసిన సామాను కొన్నాం. నాన్న నాకు ఒక గంటపాటు జాగ్రతలు చెప్పి

బయలుదేరాడు. మెల్లగా రూమ్మేట్స్ తో పరిచయాలు అయ్యాయి. ముగ్గురం తెలుగు వారమే. హాలో హాయ్ లతో మెల్లగా మొదలైన స్నేహం ఏమే, ఒసేయ్ వరకు చేరింది. మూడు గంటల్లో ఒకరి చరిత్ర ఒకళ్ళకి తెలిసిపోయి, చిన్ననాటి స్నేహితుల్లాగా కలిసిపోయాం.

ఇలా హాస్టలుకి అలవాటు పడ్డాం. కాలేజికి బస్సు ప్రయాణం ఇంకో చిత్రమైన అనుభవం. మొదటి రోజు బస్సు స్టాండుకి వెళ్ళినప్పుడు చదువురాని దద్దమ్మలా అనిపించాను. అన్ని బస్సుల పైనా తమిళ్ భాషలోనే రాసుంది. మా కాలేజి రూటు బస్సుని ఎలాగా కనుక్కోవడం? మాలో ఎవరికీ భాష రాదు. ఒకరి మొహాలు ఒకరం చూస్కోను సరిపోయింది.. చేసేదేం లేక అక్కడ వున్న వాళ్ళని అడుక్కుని చివరికి మా రూటు బస్సుని పట్టుకున్నాం.

సాయంత్రం మా హాస్టలు ఇంజనీరింగ్ అమ్మాయిలని దొంగల్లాగా వెంబడించి వాళ్ళు ఏ బస్సు ఎక్కితే ఆ బస్సు ఎక్కి హాస్టలు చేరాం. ఇలా లాభం లేదని ఆ రోజు రాత్రి పక్క రూము అమ్మాయి దగ్గరికి వెళ్లి, మా రూటు బస్సు పేరుని తమిళ్ లో రాయించుకుని గుర్తుపెట్టుకోడానికి ప్రయత్నించాము. అబ్బే ఏమి లాభం లేదు. జపాన్ వాళ్ళు అందరు ఒకేలా అనిపిస్తారు కదా, అలాగే ఈ అక్షరాలు కూడా అన్ని ఒకలాగే ఉన్నాయ్. గజిబిజిగా జిలేబిల్లాగా, వాన పాముల గుంపులాగా అనిపించాయి.

రోజూ చూస్తూ చూస్తూ వుంటే ఆ అక్షరాలన్నీ నన్ను వెక్కిరిస్తున్నట్టు, నన్ను చూసి నవ్వుతున్నట్టు అనిపించేది. ఎలాగైనా సరే వీటి అంతు చూడాలి అని డిసైడ్ అయ్యాను.

బాచిలర్స్ డిగ్రి అయితే క్లాసు రూము మన ఊర్లో ఉండే టూరింగ్ టాకీస్ లాగా నిండుగా, గోల గోలగా వుండేది. కాని పిజి కొచ్చేసరికి క్లాసు రూము పలచగా మల్టీ ప్లెక్స్ థియేటర్ లాగా అయిపొయింది. ఉన్న పన్నెండు మందిలో సగం మంది నాలాగా వలస వచ్చిన వాళ్ళే. నలుగురే తమిళ్ వాళ్ళు వుండే వాళ్ళు. అందులో ఒకడు రాజ్ కుమార్. వారానికి ఒకసారి మొహం చూపించేవాడు. పైగా తెలుగోళ్ళంటే కచ్చి. మనమంతా వచ్చి వాళ్ళని దోచేస్తున్నామని వాడి ఫీలింగు. మాట్లాడితే కరిచేటట్లు ఉంటాడు.

ఇంకో అమ్మాయి కాత్యాయని. సెంట్రల్ సిలబస్సట, తమిళ్ రాయడం రాదు అంది. ఇంకో అమ్మాయ్ ఫాతిమా ఆ అమ్మాయికి డిగ్రీ లో తెలుగు ఫ్రెండ్సు ఉన్నారట.."నాకు తెలుగు బాగా వస్తుంది. నాకు పెద్ద ఫామిలీ వుంది. ఇద్దరు అన్న వుంది, మూడు అక్క వుంది, అందరు జాలీగా వుంది.."అంటూ తెలుగుకి తెగులు పుట్టిస్తూ వుంటుంది.

ఇలా కాదని ఈ ఆప్షన్ కూడా వదిలేసుకున్నాను. చివరికి మిగిలింది ఇంకో అబ్బాయ్ మాత్రమే. పేరు చక్రపాణి. క్లాసులు మొదలెట్టి పది రోజులు అవుతున్నా, ఇంకా దర్శనం కాలేదు. ఈ అబ్బాయైనా నేర్పిస్తాడేమో చూడాలి అనుకున్నాను.

ఇలా ఓ పది రోజుల తర్వాత ఇక తమిళ భాష గురించి మరచిపోయాను అనుకునే టైం లో వచ్చాడు చక్రపాణి. పక్క పాపిడి, అడ్డ బొట్టుతో రాముడు మంచి బాలుడు అనేటట్లు వున్నాడు. ఇన్ని రోజులు ఎందుకు రాలేదని లెక్చరర్లు అడిగితే, "మంచి రోజులు లేవని మా ఇంట్లో పంపలేదు" అని చెప్పాడు.

"ఏంటి, కాలేజికి రావడానికి కుడా ఇంకా వారాలు, వర్జ్యాలు చూస్తున్నారా?," అని ఆశ్చర్యపోయాం. వాళ్ళ నాన్న గారు కుంభకోణంలో గుడి పూజారి అంట. చాలా నెమ్మదస్తుడిలా అనిపించాడు. నేర్చుకుంటే ఈ పిల్లోడి దగ్గరే నేర్చుకోవాలి అని అనుకున్నాను. కొత్త సిలబస్సు,సెమిస్టర్ ఎగ్జామ్స్ తో చూస్తుండగానే మూడు నెలలు గడిచిపోయాయి.

ఇలా కొత్తదనం పోయి ఊరు అలవాటు పడ్డాక మెల్లగా తంజావూరుతో ప్రేమలో పడిపోయాను. వెయ్యేళ్ళ క్రితం కట్టిన భృహదీశ్వరాలయం, చోళ రాజుల కాలం నాటి కోటలు, గుళ్ళు, పాత కాలం నాటి డాబా ఇల్లులు, తంజావూరు బొమ్మలు, వీణలు, ఆ ఊరిలోనే ప్రాణం పోసుకున్న భరత నాట్య కళ, ఆ ఊరికే ప్రత్యేకమైన పెయింటింగులు, ఇలా ఎన్నో వింతలు విశేషాలతో ఎప్పుడు కొత్తగా గమ్మత్తుగా వుండేది.

ఇవన్ని కళ్ళకి విందైతే, నోటికి, కడుపుకి పసందు కలిగించడానికి మా ఆర్య విలాస్ ఎప్పుడు తయారుగా వుండేది. హాస్టలు తిండికి ఎడారిలా మారిపోయిన జిహ్వకి పన్నీటి జల్లులా వుండేది మా ఆర్య విలాస్. ఎప్పుడు సాంబ్రాణి ధూపంతో ఫ్రెష్ గా వుండేది హోటల్. అక్కడ అన్ని అద్భుతాలే. నీర్ దోస, పనీర్ దోస, ఉల్లి దోస, రవ దోస ఇలా ఓహ్.. ఇరవై దోస రకాలు, సాదా ఇడ్లి,చిల్లి ఇడ్లి,ఇడ్లి 65, ఇడ్లి మంచురియన్,మినీ ఇడ్లి ఇలాగ ఇడ్లి లో ఓహ్.. ఇరవై రకాలు, ఇదియప్పాలు, పొంగళ్ళు, తైర్ వడలు, మూడు రకాల చట్నీలు అబ్బో.... బ్రహ్మాండం. నోట్లో పెడితే రుచుల విస్ఫోటనమే

లోపల. ఏది ఆర్డర్ చేసినా కూడా స్టీలు ప్లేటులో చక్కగా అరటి ఆకు వేసి, వేడివేడిగా పొగలు కక్కే టిఫిన్లు మన ముందు పెట్టేవాళ్ళు. చివరికి చైనీస్ నూడుల్స్ కూడా అరటాకు వేస్కుని చక్కగా సాసు పోసుకుని చేత్తో తినేవాళ్ళు అక్కడి పెద్దాళ్ళు.

రోజులు గడిచేకొద్దీ క్లాసులో అందరం బాగా కలిసిపోయాం. ఒకరోజు మా బయో టెక్నాలజీ లెక్చరర్ గారి అబ్బాయి మొదటి పుట్టిన రోజుకి మమ్మల్ని పిలిస్తే క్లాసు మొత్తం వెళ్ళాం. అక్కడ భోజనాల దగ్గర చక్రపాణి నా పక్కనే కూర్చున్నాడు. అవి ఇవీ మాట్లాడాక ఇంక అసలు విషయం అడిగాను. నాకు తమిళ్ నేర్పుతావా అని. "అయ్యో,ఎందుకు అంత కష్టం?"అని అన్నాడు.

"లేదు.. కొత్త భాష నేర్చుకోవాలని నాకు ఇంటరెస్టు." అని చెప్పాను. తమిళ్ భాష అంటే ఇష్టమని ఒక రాయి కూడా వేసాను, అంతే అతని మొహం ఒక్కసారి మతాబులాగా వెలిగిపోయింది. అసలు తమిళ్ భాష ఎలా పుట్టింది,అందులో ఎన్ని రకాలు వున్నాయి, దాని చరిత్ర మొత్తం చెప్పి, కండిపా(కచ్చితంగా) నేర్పిస్తానని చెప్పాడు.

అప్పటినుండి నేను తనని వాజ్యారు(మేష్టారు) అని పిలిచేదాన్ని. చాలా చక్కగా చెప్పేవాడు. ఎప్పుడు అంటూ వుండేదాన్ని, "వాజ్యారు నువ్వు లెక్చరర్ అయితే పిల్లలు బాగుపడతారు" అని.

పాణి చాలా ఒద్దికైన కుర్రాడు. అనవసరంగా ఏమి మాట్లాడడు. చాల సున్నితమైన మనసు. తన స్థాయికి మించన దాని గురించి ఆశ పడడు. తనవల్ల ఎవరికీ ఇబ్బంది కలగకూడదు అనుకుంటాడు. అలాగే ఎవరి వల్లనైనా తనకి ఇబ్బంది కలిగినా బాధ వేసినా, తనలో తానే మధనపడతాడు తప్పించి, ఎదుటి వారిని ఒక్క మాట అనడు. తనతో ఉన్నంత సేపు జాగ్రతగా మాట్లాడాల్సి వచ్చేది. తెలుగు వారికి వెటకారం అలవాటు కదా, ఒక్క మాట తమాషాకి అన్నా చిన్నబుచ్చుకునే వాడు. మంచితనం, మన్నన, సున్నితత్వం ప్రోది చేస్తే ఎలా వుంటుందో అలా ఉంటాడు. ఈ రోజుల్లో చాలా అరుదైన వ్యక్తిత్వం, పాణిది.

మొత్తానికి ఒక నెలలో కూడబలుక్కుని చదవడం వచ్చేసింది. ఆ మాత్రం చాలు, చెలరేగిపోయాను. ఇక చూడండి బస్సులో వచేటప్పుడు , వెళ్ళేటప్పుడు దార్లో కనిపించిన ప్రతి బోర్డుని, హోర్డింగులని చదివే దాన్ని. షాపుల పేర్లు అన్నీ చదివి మా వాళ్ళ ప్రాణం తినేసేదాన్ని. హాలిడేస్ లో ఎక్కడికైనా వెళ్ళాలంటే మాత్రం మా వాళ్ళకి నేనే దిక్కు.ఏ బస్సెక్కాలో ఏ వీధోలో ఉన్నామో నేనే చదివి చెప్పాలి. అప్పుడు నేనే వాళ్ళకి మార్గదర్శి , శ్రీ రామ్ చిట్స్ అన్నీనూ.

ఇలా మా ఫ్రెండ్సులో నాకు ఇంత గొప్ప పేరు తెచ్చినందుకు మా వాజ్యారుకి ఒక రోజు పార్టీ కూడా ఇచ్చాను. అర్యవిలాస్ కి తీస్కెళ్ళి మాంచి స్పెషల్ ఉల్లిదోస, వెన్ పొంగల్ ఇప్పించాను.

కాకపోతే నా తమిళ్ బాషా పరిజ్ఞానం కేవలం చదవడానికి మాత్రమే, దాని అర్ధం తెలిసేది కాదు. ఊరిపేర్లు, షాపు పేర్లు, సినిమా పోస్టర్లు మాత్రమే అర్ధం అయ్యేవి మిగతావి చదివేదాన్ని కాని ఎం చదివానో తెలిసేది కాదు.

మళ్లీ పరీక్షలు,ప్రాక్టికల్స్ తో బిజీ అయిపోయాము.చూస్తుండగానే మొదటి సంవత్సరం అయిపోవచ్చింది. సెకండ్ ఇయర్ అంతా ప్రాజెక్ట్ వర్క్. ఇంకా మేమంతా కలిసి చదవడానికి నెల రోజులు మాత్రమే వుంది.

ఇలా వుండగా ఒక రోజు మా హాస్టల్లో ఒకమ్మాయి మెస్సు లో ఒక తమిళ మ్యాగజిన్ చదువుతూ కనిపించింది. ఎప్పుడు బస్సు బోర్డులు, షాపు పేర్లే చదువుతానని మా వాజ్యారు ఏడిపిస్తుంటాడు. ఫైనల్ గా నా తమిళ్ పైత్యాన్ని నిరూపించుకుందామని ఆ అమ్మాయిని అడిగి ఆ మ్యాగజైన్ తీస్కున్నాను.

గురువు మెచ్చని విద్య విద్యే కాదనీ, ఎలాగైనా సరే మా వాజ్యారు దగ్గర మెప్పు పొందాల్సిందే అని, తీర్మానించుకున్నాను. రాత్రంతా కూర్చుని ఒక పద్యాన్ని సెలెక్టు చేసుకుని భట్టీయం వేసాను. మరుసటి రోజు లంచ్ టైములో పాణి నీ బలవంతంగా కాంటీన్ కి లాకెళ్ళి కూర్చోపెట్టాను.

నాకు తమిళ్ నేర్పించినందుకు గురుదక్షిణ ఇవ్వదలుచుకున్నాను అనీ, తమిళ భాషలో ఒక పద్యం తనకు అంకితమివ్వాలని అనుకుంటున్నానని చెప్పి, కళ్ళు మూసుకుని, అక్కడికి అదేదో నా సొంత పద్యం అన్నంత ఇదిగా, తల ఊపుతూ, తన్మయత్వంతో చెప్తున్నట్టు, మొత్తం అప్పజేప్పేసాను.

కళ్ళు తెరిచి చూసేసరికి వాజ్యారు, అదోలాంటి ఆశ్చర్యంతో, ఆనందంతో నన్నే చూస్తూ వున్నాడు. నా పాండిత్యానికి నేనే మురిసిపోయాను.

"ఎలా వుంది వాజ్యారు. నీ అభిప్రాయం ఏంటి ?"అని అడిగాను.

కాసేపయ్యాక "నాక్కొంచం టైం కావాలి దివ్యా" అని చెప్పి వెళ్ళిపోయాడు పాణి. అంత గొప్ప కవిత చదివానన్నమాట అనుకుని నేను వెళ్ళిపోయాను.

తర్వాత ఎగ్జామ్స్ హడావిడిలో ఉండిపోయాము. ఎక్కువ మాట్లాడుకునే అవకాశం రాలేదు. ఫైనల్ ఎగ్జామ్ రాసిన తర్వాత అందరం క్లాసులో కలుసుకున్నాము. తన ఆటోగ్రాఫ్ కోసం బుక్కు తనకి ఇచ్చాను, ఆటోగ్రాఫ్ తీసుకుని వచ్చేస్తుంటే, "దివ్యా ." అని పిలిచాడు, ఏంటని అడిగే సరికి, "ఏమి లేదులే" అని చెప్పాడు.

క్లాస్ అందర్నీ తరువాత రోజు కుంభకోణం రమ్మనమని చెప్పాడు. వాళ్ళ నాన్న పనిచేసే గుడి, చుట్టూ పక్కల వుండే ప్రదేశాలు చూపిస్తానని చెప్పేసరికి అందరం సరేనన్నాం.

మరుసటి రోజు అందరం కుంభకోణం బయల్దేరాం. తంజావూరు నుండి గంట ప్రయాణం. రోజూ ఇంత దూరం వచ్చేవాడా అని ఆశ్చర్యపోయాం. ఈ ఊరు కూడా బ్రహ్మాండంగా వుంది. అడుగడుక్కి ఒక గుడి ఉంది. ప్రతి గుడికి ఒక కోనేరు. అన్ని గుడులు సుమారు 500 సంవత్సరాల ముందువే. చాలా అందమైన గుడులు. రాళ్ళకి ప్రాణం పోసినట్టు వున్నాయి శిల్పాలు. ఇన్ని ఏళ్లయినా జీవ కళ ఉట్టిపడుతున్నాయ్ వాటిలో.. ప్రతి శివాలయం పక్కన ఒక వైష్ణవాలయం ఉంది. ఒకదాని గోపురంతో ఇంకోటి పోటి పడుతున్నట్లు ఉన్నాయి, ఆకాశానికి నిచ్చెన వేసినట్లుగా. చోళులూ పాండ్యులు పోటీలు పడి మరీ కట్టారట. చూడగలిగినన్ని గుడులు చూసాక చివరికి మళ్లీ చక్రపాణి వాళ్ళ గుడికి చేరుకున్నాం. అందరికీ కమ్మని చక్కర పొంగలి, పులిహోర పెట్టించాడు. గబా గబా తినేసి అందరం మంటపంలో కూర్చున్నాం. నాకెందుకో కోనేటి దగ్గరకు వెళ్ళాలనిపించింది.

మా వాళ్ళని అడిగితే వల్ల కాదని చెప్పారు. సరే అని నేనే వెళ్ళాను. పెద్ద కోనేరు. ఒక వైపు రావి చెట్టు. చెట్టు నీడ వైపు వెళ్లి చివరి మెట్టు పై కుర్చుని కాళ్ళని నీటిలో ఉంచాను చల్లని నీళ్ళు తాకేసరికి ప్రాణం లేచి వచ్చినట్టు అయ్యింది.

కోనేరు నిశ్చలంగా వుంది. ఎంతో నిర్మలంగా వున్న కోనేరుని చూస్తుంటే మనసంతా పవిత్ర భావంతో, ప్రశాంతతతో నిండిపోయింది. ఇంతలో అటువైపు గట్టు నుండి ఒక ఆకతాయి ఒక పెద్ద రాయి విసిరాడు. నిశ్చలంగా వున్న కోనేరులో అలజడి నెలకొంది. చేపలన్నీ చెల్లా చెదురై పోయాయి. ఆ అబ్బాయి మీద పట్టరాని కోపం వచ్చింది. మన లోకం తీరే అంత, పచ్చగా వున్న వారిని కెలికితే కానీ జనాలకి తృప్తి వుండదు కాబోలు అనుకున్నాను...కాసేపటికి కోనేటి అలజడి సద్దుమణిగింది.

కదలకుండా కూర్చునేసరికి కొంచేపటికి చిన్నిచిన్ని చేపలు కాళ్ళ దగ్గరికి వచ్చాయి. చక్కలిగింతలు పుట్టి కాళ్ళు బయటికి తీసేసాను. అన్ని చేపలు రివ్వున పారిపోయాయి.

"అవి ఏమి చెయ్యవు"అంటూ ఇంగ్లీషులో ఒక గొంతు వినిపించింది. అలవాటైన గొంతే, అది మా వాజ్యారుది. చూసి నవ్వాను.

వచ్చి నాకు కాస్త ఎడంగా ఒక మెట్టు పైన కూర్చున్నాడు. వెంట తెచ్చిన మరమరాలను నీటిలో వేస్తుంటే చేపలు చిన్నిచిన్ని నోటితో వాటిని గుట్టుక్కున మింగుతున్నాయి. నాకు కొన్ని ఇచ్చాడు. ఎందుకో చాలా ప్రశాంతంగా అనిపించింది.అదే అన్నాను,

"నువ్వు చాలా లక్కీ పాణి,ఇంత అందమైన ప్రదేశం లో పెరిగినందుకు ,"అని.

చిన్నగా నవ్వాడు.

నాకైతే అలాగే అక్కడే ఇంకాసేపు వుండాలనిపించింది.

"దివ్యా"...

"దివ్యా"...

" ఊ.."

"చెట్లు చాలా పచ్చగా ఉన్నాయ్ కదా .."

ఒక్కసారి ఉలిక్కి పడ్డాను...

ఏ చెప్పాలో తెలియక "నా చిన్నపటి నుండి చెట్లు పచ్చగానే ఉన్నాయ్ పాణి "అన్నాను.

"ఇంకా నన్ను ఏడిపించకు దివ్యా.." అన్నాడు.

"నేనా,నిన్ను ఏడిపిస్తున్నానా?" అన్నాను ఏమీ అర్థం కాక,తనని చూస్తూ..

నా చూపులు తప్పించుకోవాలని నీటిలో చేపలని దీక్షగా చూస్తూ

"కంటికి నచ్చిన చోట్ల కల్లా మనసు వెళ్ళకూడదు దివ్యా.." అన్నాడు.

"కరెక్టే కొటేషన్ చాలా బాగుంది. ఇంగ్లీషులో చాలా మంచి ప్రొవెర్బ్స్ తెలుసు నీకు..ఈసారి వాటికి ట్యూషన్ చెప్తావా?"అని అన్నాను, ఎందుకో వేడెక్కుతున్న వాతావరణాన్ని చల్లబరుద్దామని.

"చాలు దివ్యా.. నేను చెప్పేది విను,"...హఠాత్తుగా వచ్చిన ఈ వడగాలి ఏంటో అర్థం కాక అలా వింటూ ఉండిపోయాను.

"దివ్యా,కొలనులో వున్న చేపకు బయటి ప్రకృతి అందంగా ఉండొచ్చు.బయట వున్న పక్షికి కొలనులో స్వేచ్ఛగా ఈతకొట్టే చేప నచ్చవచ్చు",..

"కానీ చేప బయటికి వచ్చి సుఖపడలేదు, పక్షినీటిలోకి వెళ్లి ఈత కొట్టలేదు"...

"నేను ఆ కొలనులో చేప అయితే నువ్వు పక్షివి"..

"మనం పెరిగిన వాతావరణాలు వేరు.నన్ను మర్చిపో. నీ పై నాకు ఎలాంటి కోపం లేదు.కొన్ని అనుభవాలు, అనుభూతులు, వాస్తవాలయ్యేకంటే ,జ్ఞాపకాల లాగానే బాగుంటాయ్"..

"మన పరిచయం ఒక అందమైన జ్ఞాపకం అనుకో .."అని ఒక పెద్ద లెక్చర్ ఇచ్చాడు.

నేనేం వింటున్నానో నాకేమి అర్థం కాలేదు...అలా చూస్తూ ఉండిపోయాను.

అసలు ఈ ఆంగ్ల సూక్తి ముక్తావళి ఎందుకు ఉపదేశించాడో తెలుసుకుందామని అడిగే లోపు, మా ఫ్రెండ్స్ వచ్చారు, బస్సు టైం అవుతోంది వెళ్ళాలని. మా వాజ్యారు కూడా తరువాత ఒక్కడే దొరక లేదు. అందరితో పాటు టాటా చెప్పి,చివరిగా నా వైపు జాలిగా ఒక చూపు చూసాడు.

నాకేంటో కొరియన్ సినిమాని చైనీస్ సబ్ టైటిల్స్ తో చూసినట్టు అనిపించింది. రూములోఅన్ని సర్దుకుని బస్సు స్టాండ్ కి బయల్దేరే సమయంలో పక్క రూమ్ అమ్మాయ్ వచ్చింది, తన దగ్గర తీసుకున్న మేగజైన్ కోసం.

"ఏమి అనుకోకు దివ్యా..మాములు మ్యగజైన్ అయితే అడిగే దాన్ని కాదు. ఇది స్పెషల్ ఎడిషన్, ప్రేమకి సంభందించి ఓల్డ్ తమిళ్ లో రాసిన కవితలు ఉన్నాయ్. ఎన్నో పాత తమిళ్ పదాలను ఇందులో వాడారు. అందుకే తిరిగి తీసుకుంటున్నాను," అంది.నా మట్టి బుర్రకు అప్పుడు బల్బు వెలిగింది. అనుమానం వచ్చి నేను పాణికి చదివి వినిపించిన చిన్న కవిత చూపించి అర్థం అడిగాను.

"వావ్ మంచి టేస్ట్ దివ్యా నీది. ఇది నచ్చిందా నీకు ..? గోదా దేవి శ్రీ రంగనాథ స్వామి కోసం పాడిన పాశురాలలో ఇది ఒకటి. నీకోసం నీ సాన్నిత్యం కోసం ఎదురుచూస్తుంటాను అని అర్థం వస్తుంది,"అని చెప్పి వెళ్ళింది.

చివరికి ఇదన్నమాట విషయం. నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు నాకు.

బస్సులో తిరుగు ప్రయాణం మొత్తం ముభావంగా ఉండిపోయాను. ఏమైంది అని మా ఫ్రెండ్స్ అడిగితే తలనొప్పి అని తప్పించుకున్నాను.

మనసంతా ఎవరో కెలికేసినట్టు వుంది. ఎంత పొరపాటు చేసాను.ఇందాక కోనేటిలో రాయి విసిరిన అబ్బాయిని చూసి ఎంత తిట్టుకున్నాను.

చూస్తుంటే వాడికి నాకు అట్టే తేడా లేదనిపించంది. నిర్మలంగా వుండే పాణి మనసులో కలకలం సృష్టించాను. ఎంత మధనపడి ఉంటాడు ఇన్ని రోజులు.

కాస్త కూడా ఆలోచించకుండా ఎంత పొరపాటు చేసాను.

పాణి నా గురించి తప్పుగా అనుకున్నాడనే బాధ కన్నా,ఒక మంచి స్నేహాన్ని నిలుపుకోలేక పోయానన్న బాధే ఎక్కువగా వుంది. తెలిసి చేసే తప్పులకన్నా, తెలియకుండా చేసే తప్పులకి పడే శిక్ష మనల్ని ఎంతో బాధ పెడ్తుంది.

జరిగిన పొరపాటుని అతనికి చెప్పి క్షమాపణ అడుగుదామంటే అది మరీ మూర్ఖంగా ఉంటుందేమో అనిపించింది..తను నమ్మొచ్చు,నమ్మక పోవచ్చు. తనపై నాకు అటువంటి అభిప్రాయం లేదని చెప్తే, తనని ఇంకా బాధపెట్టిన దాన్ని అవుతాను.

చేసేదేమీ లేదు. జీవితంలో ఒక పెద్ద తప్పు చెయ్యకుండా నన్ను కాపాడానని అనుకుంటున్నాడు పాణి..అలాగైనా తనని సంతోషపడనీ. తనన్నట్టే ఇదో జ్ఞాపకంగా మిగిలిపోనీ..నాకు చేదుదీ, తనకు తియ్యనిదీ అని మనసుకి సర్దిచెప్పుకున్నాను.

# ఏడుపు మంచిదే! మెరిమి దినేష్ కుమార్

నవ్వితే 62 కెలోరీలు కష్టపడకుండా కరుగుతాయని నవ్వుకి విలువిచ్చారు, అదీ ఘోరంగా గట్టిగా నవ్వితేనే! మామూలుగా ముసి ముసి నవ్వులు నవ్వితే 12 కేలరీలు కూడా కరగవనే నిజాన్ని ఎవ్వరూ చెప్పడానికి సాహసించలేదు అదే మామూలుగాఏడిస్తే 50 కెలోరీలు కరుగుతాయ్! సో.. ఏడుపు మంచిదే.

సినిమా తీద్దామని ఇంట్లో చెప్పకుండా జాబ్ వదిలేసి హైదరబాద్ కి వచ్చి కరెక్ట్ గా 9 నెలలవుతోంది. మొదటి నెలలో అమ్మని బాగా ఏడిపించాను, రెండో నెల నుండి ఎక్కువ సార్లు ఫోన్లు చేస్తూ కొద్దిగా ఏడుపుని తగ్గించాను. అలా ఏడుపుని నవ్వుదాకా తీస్కురావడానికి 5 నెలలు పట్టింది. కానీ నేను మాత్రం ఇంకా సినిమా తీయలేదు.

“ఇంకా ఎన్ని రోజులు పడుతుంది రా?“ అని అమ్మ అడుగుతుంటే “తొందర్లో అవుతుంది మా“ అని నిజమైన అబద్ధం చెప్పేవాడిని. నన్ను చూడాలని తెగ ఆరాటం.. నేనంటే అంత పిచ్చి ప్రేమ మా రమాదేవికి!

‘కల కనడానికి నిద్రపోతే చాలు, నిద్ర పోడానికి బస్సో రైలో ఎక్కితే చాలు, కానీ కలని నిజం చేసుకోవాలంటే నిద్ర పోకుండా కష్టపడాల్సిందే!! అదే సినిమా అయితే దారి తెలియకుండా గుడ్డిగా నడవాల్సిందే’ అనే గొప్ప తత్వాన్ని మాయమ్మకు ఎలా చెప్పేది?

నాలోనే ఓ పెద్ద రాక్షసుడున్నాడు. చిన్నప్పటి నుండి ఆమె అనుకున్నట్టు పెరగలేదు. ఇంటర్లో సమాజంలోని అన్యాయం, కుల దూషణ, అసమానత్వం లాంటి గొప్ప లక్షణాలను భరించలేక, ముఖ్యంగా మా శ్రీశ్రీ నల్ల కాకిగా ఉన్న నన్ను తెల్లకాకిగా మారిస్తే ఆపై మనుషుల మనస్థత్వాలను చూసి ఎర్ర కాకిగా మారిపోయాను. అభ్యుదయ ఆవేశంతో ఉద్యమంలోకి వెళ్లిపోవాలని అర్థరాత్రి ఇంట్లో నుండి వెళ్లిపోయాను, చిన్నప్పటి నుండి అల్లరితో ఏడిపిస్తూనే అప్పుడు ఆవేశంతో ఏడ్పించాను.

అర్థరాత్రిలో తిరుపతి వీధులు అంత భయంకరంగా ఉంటాయని అప్పటి దాకా తెలీదు, చీకట్లో చంద్రుదున్నట్టు దొంగలు పోలీసులు అన్నదమ్ములని ఆ రోజే తెల్సింది. అలా ఓ రోడ్డు పక్కన పడుకుని ఉంటే ఆవు దూడను ఎలా పట్టుకుంటుందోఅలా మాయమ్మ నన్ను పట్టేసుకుంది. ఏడిస్తే నేను మాట విననని, ఏడుపుని ఆపుకుని “రారా ఇంటికి” అంది.

తడబడుతూ వచ్చే మాటలే గద్గద స్వరం అని పరిచయమైన ఆ రాత్రి, మా నాన్నేమో తాగేసి నన్ను పట్టుకుని ఏడుస్తున్నాడు. అది నిజమైన ప్రేమైనా నేను నమ్మకుండా చేస్తోంది ఆయన చర్య. ఇంజనీరింగ్ లో చదువు బాగా లేదని మానేస్తానని ఫోన్లో చెప్పినపుడు అదే ఏడుపు నన్ను

ఆపేసింది. ఆరోజే మాటిచ్చాను ఎన్ని బాధలైన ఇబ్బందులైనా పడతానుగాని ఇంజనీరింగ్ మాత్రం పూర్తి చేసే వస్తానని. ఒక్క ఏడుపు నన్ను ఎంత ప్రభావితం చేసిందో!

కన్నీళ్లు ఎప్పుడూ నన్ను మార్చలేదు ఏడుపే మారుస్తోంది. ప్రపంచపు బాధను పట్టించుకున్నపుడైనా నాలోని రాక్షసుడి ఏడుపుని విన్నా మారిపోతాను ఏడుపుతోనే మారుతూ ఉన్నాను.

జీవితంలో ఏడుపే ప్రారంభం, ఏడుపే ముగింపు కదా.

ఒక పరమహంస ఏడిస్తే కాళికమ్మే కదిలింది. మా అమ్మ ఏడిస్తే నేను కదలనా? ఆగనా?? ఇంతలో రైలు రేణిగుంటలో ఆగింది. టైం 3:30. ఇపుడు "కాళాస్తి కి బస్సులుంటాయా?" అని ఒకటే డౌటు. ఎందుకంటే నేనెపుడు ఇంత పొద్దున వెళ్లలేదు, సర్లే అని రోడ్లో నడుచుకుంటూ చూస్తున్నాను. కొందరు నాలాగే బస్సు కోసం ఉన్నారు. అరె ప్రపంచం నాలాగే ఉందే అనుకుని చూస్తున్నా, ఏదో బెంగుళూరి బండి కాళాస్తి కి పోతోంది. కాళహస్తికి బెంగుళూరి నుండి బస్సుందా అని ఆశ్చర్యపడ్డాను. ఇదే కదా మొదటిసారి.

ఏడుపు వల్లే మనిషి ఇంకో మనిషిని చూడగలడు, మనిషిలా బ్రతకగలడు.

బహుశా త్యాగయ్య,,అన్నమయ్య,,రామయ్యలు దేవుడి కోసం ఏడ్చారు. ఆ ఎడుపులే ప్రపంచానికి గొప్ప కృతులు, కీర్తనలు, జీవితాలయ్యాయి. ఈ నిజం తెల్సుకోడమే జీవితం కాబోలు. ఎందుకంటే నవ్వుతూ పలకరించమని చెప్తారు, నవ్వుతూఫోటోలు దిగమని చెప్తారు, నవ్వుతూ బ్రతకాలిరా అని పాటలు కూడా పాడి ఏడ్చేవాళ్లు లోకువ అని మనుషులు ఆలోచించని బావిలోకి తోసేస్తున్నారు. అందుకే సమాజం= లో ఇన్ని అసమానతలున్నాయని నాకనిపిస్తుంది.

అలా నవ్వి నవ్వి ఇంజనీరింగు అయిపోయింది. మా నాన్న తరుపున ఓ ఉద్యోగం ఇప్పించాడు. అదీ సినిమా స్టైల్లో నాకే తెలియకుండా నన్ను కారు ఎక్కించి 4 గంటలే అని చెప్పి చేతిలో ఓ 10 వేలు పెట్టి "సరే ఉంటా జాగ్రత్త" అని చెప్పివెళ్లిపోయాడు. నిద్రలో 12 గంటలైనా 1 గంటలాగే తెలుస్తుంది. ఈ నిజం తెల్సుంటే డబ్బు పిచ్చోళ్ళు గంటగంట కు అలారం పెట్టుకుంటారేమో! అలా 4 గంటల నిద్రలో ఆంధ్రా దాటి ఎక్కడో తమిళనాడు చివర బెంగుళూరికి 30కి.మీ లదగ్గరున్న హోసూర్ లో దిగుతానని కలలో కూడా అనుకోలేదు. ఆ ఉద్యోగం ఆ ప్రపంచం నావల్ల అస్సలు కాలేదు.

అప్పుడే అర్థమైంది మనిషికి ఎక్కడా స్వాతంత్ర్యం ఉండదని. కడుపులో ఇరుకిరుగ్గా ఉందని కష్టపడి బయటకొస్తే, గాలి పీల్చుకునే లోపు బళ్ళో చేర్పించి, తర్వాత కాలేజీ, ఉద్యోగం, పెళ్లి, పిల్లలు....చావు.. రొటీన్ సినిమానే జీవితమని ఇక తప్పదని, ఎలాగొలా నాలోని రాక్షసుడికి స్వాతంత్ర్యం ఇప్పించాలని, సినిమాల్లోకి వెళ్లాలని ఫిక్స్ అయ్యి ఛాలెంజ్ లో చిరులా కాకపోయిన ఓ మోస్తరులో గొడవేస్కుని, ఊర్లో ఆటో ఎక్కి "హైదరబాదు వెళ్తున్నా" అని అంటే అదే ఏడుపు! అవే చెమ్మగిల్లిన కళ్ళు!! ఈ సారి మాత్రం నాలో చలనాన్ని తీస్కురాలేదు. గమనాన్నే చూస్తూ కూర్చుండిపోయాను.

ఆ క్షణం నాలో రాక్షసుడు లేడు, నేనే రాక్షసుడినని అనిపించింది.

బస్సు కాళహస్తి వచ్చింది. మా ఊరికి 4:30కి బస్సులుండవ్. అసలు పల్లెలకి బస్సులే ఉండవ్. ఇక నాకోసం ఇప్పుడు రావు. అపుడే నాలో ఓ తాత్వికుడు, రాక్షసుడి మాట వినకుండా "మా కన్నప్ప దేవుడ్ని కళ్ళారా చూడు. చాలా రోజులైంద"ని చెప్తే "ఎలాగూ ఇపుడు చేసేదేమీ లేదు. 6 గంటలకి గాని మా బస్సు రాదు" అని గుడికి వెళ్ళాలని వీధిలోకి అడుగేశాను

"సార్ బాత్రూంలు సార్.. రూములు సార్" అని నస పెట్టేశారు. సర్లే వీళ్ళు ఇంతే అనుకుని పరుగెట్టుకుని వెళ్లకపోయినా అదే మోతాదులో పారిపోయాను. గుడి మొదట్లో భిక్షగాళ్ళు లేరు.

కొద్దిగా ముందుకెళ్ళగానే "లాకర్లు సార్, చెప్పులు ఇక్కడే పెట్టండి సార్" అంటుంటే పట్టించుకోకుండా వెళ్తుంటే "సార్ దేవస్థానం స్టాండ్. ఇందులో పెట్టండి" అనే మాటకు విలువిచ్చి అలా వాడిని చూస్తే వాడు వ్యాపార సూత్రాలను వల్లించాడనే నిజం తెల్సి కోపం వచ్చి" పో.." అన్నాను. "వాడేమో నేను దొంగతనం చేసి పారిపోయే వాడి లాగా తిడుతున్నాడు. ఏంటి శివయ్యా ఇదంతా!?" అనుకుని ముందుకు నడిచాను. అప్పుడొచ్చింది నిజమైన దేవస్థానం ఉచిత పాద రక్షలు బ్యాగ్ లు ఉంచుస్థలం, అది చూసి వెళ్ళాను. చెప్పులు 2రూ అయ్యింది బ్యాగ్ 10రూ అయ్యింది ఫోన్ 5రూ అయింది.

10 రూ లాకర్ ఇస్తానని చెప్పిన వాడే మేలనిపించింది.

నాకేమో అడుక్కునే వాళ్ళు, మోసం చేసే వాళ్ళు, దౌర్జన్యంగా లాక్కునే వాళ్ళు నచ్చరు. ఇ .ఓ కి కంప్లైంట్ చేద్దామని ఉంది. ఊడ్చేవాళ్లే ఇంకా రాలేదు, ఇ.ఓ ఎందుకొస్తాడు.. అనుకుని తిట్టుకుంటూ లోపలికి నడిచాను. నా చిన్నతనంలో కాళహస్తిగుడికి వెళ్ళేవాడిని కాదు. అప్పుడు దేవుడ్ని నమ్మలేదు. ఇప్పుడూ నమ్మను. కానీ నాకు ఆనందం దొరికితే అడుక్కోడానికైనా వెనకాడను. నేను దేవుడ్ని నమ్మను కాక నమ్మను, ఆస్వాదించానంతే! ఇప్పుడు నమ్మాల్సిన అవసరం లేదు అనేఅభిప్రాయానికి వచ్చేశాను. గుడి తలుపులు మూసి ఉన్నాయి. రాహు కేతు పూజ కోసం జనాలు సినిమా హాలు వద్ద వెయిట్ చేసినట్టు గోలగోలగా ఉంది. 750రూాల టికెట్టు, 1000రూ ల టికెట్టు ,1500రూ టికెట్టు అని పూజ చేసేవాళ్ళు నిజంగా పూజలుచేస్తారా? వాళ్ళ వెర్రి ఇంతలా ఉంటే ఏంచేస్తాను? ఆ కొంచం ఆలోచించలేరు? అయినా పాపాలు చేసేసి డబ్బులు హుండీల్లో, పాపాలు పూజల్లో వేసేయొచ్చని కొన్ని యుగాలుగా నిరూపిస్తున్న పెట్టుబడిలేని వ్యాపారం. లక్షల కుంభకోణాలు, కోట్ల అక్రమాలు అంటే జనాలు ర్యాలీలు,ధర్నాలు చేస్తారు. దేవుడి దగ్గరికి వెళ్లాలంటే 100ల రూపాయలు, పూజలకి 1000రూ, పాలు పోస్తే 100రూ ,ఇంకా ఏవేవో అక్కడ దర్జాగా దొంగతనం చేస్తుంటే పద్దతిగా 4 గంటలకే పంచ కట్టుకుని మరీ క్యూ లో నిల్చుని కడతారు.

ఒకానొక దశలో దేవుడ్ని ప్రశ్నిస్తున్న నాకు దొరకిని సమాధానాలలో దేవాలయాలు ఎందుకు కట్టారు అంటే తిండి కోసం, వైద్యం కోసం, న్యాయం కోసం...... అన్నిటి కోసం ప్రభుత్వం ఏమేం చేస్తుందో అన్నిటి కోసం.

ప్రభుత్వానికి గుళ్లకి తేడా ఒక్కటే. జ్ఞానం.. దేవుడు జ్ఞానం కోసమే అని గట్టిగా నమ్ముతాను నేను. అలా ధ్వజస్థంబం చూస్తుంటే ఓ ఆవు వచ్చింది. వెనకనే ఇద్దరు దాన్ని పట్టుకుని వచ్చారు. పూలతో మనకు నచ్చేలా అలంకరించారు. బహుశా అది ఆకలికి వచ్చుంటుంది. అరటి పండ్లు పెడుతుంటే తింటూనే ఉంది, అరటి పండు పెట్టాలంటే 5రూ అట!

అదే ఆవుకి గుడి బయట అరటి తొక్క కూడా వేయరు, ఈ ఆవుకి ప్రదక్షిణ చేసేవాళ్ళు పోటీలు పడి మరి చేస్తున్నారు. ప్రదక్షిణలు వాకింగ్ కి హెల్ప్ అయితే వాళ్ళు బాగానే చేశారు. నేనేమొ ఇవన్నీ చూడలేకపోతున్నా. అక్కడ తలుపులేమో ఇంకాతీయలేదు, ఉచిత దర్శనం చేస్కునే వాళ్ళు చివర్లో అట!

'దేవుడు కూడా ఉదయాన్నే కళ్ళు తెరవంగానే ముందు 200రు,100రు వాళ్ళని మాత్రమే చూస్తాడు, తర్వాతనే మిగిలిన వాళ్ళని చూస్తాడన్నమాట. మన న్యాయస్థానాల్లో దొంగతనం చేస్తే 1000రూ, లంచమిస్తూ దొరికితే 2000రూ ఇచ్చి ఎలాబయట పడతారో అలా అన్నమాట.

ఏ జ్ఞానం కోసం గుళ్ళు, దేవుళ్ళు వచ్చారో అవే గుళ్ళు ఇపుడు అజ్ఞానులకు కేంద్రాలయ్యాయి. టైమ్ 5:30 అయింది. ఇక నావల్ల కాక "ఎప్పుడు తెరుస్తారు?" అని అడిగా. 6 గంటలకి అని ముందున్నామె అంది. వెంటనే ద్వజస్థంభాన్ని చూశాను, గోపురాన్ని చూశాను, గుడి మొత్తం చూశాను. ప్రారంభ మేలుకొలుపు నాదస్వరం, డోలు విన్నాను, నీళ్ళు తాగి ఓం:నమశ్శివాయ అనుకుని బస్సు కోసం బయల్దేరాను. నందిని చూసి మా అమ్మని చూడ్డం నాకు ఆనందం. సారీ ఇంకోసారి అందరూచూస్తున్న ఆ చీకటి మూలకొచ్చి చూస్తా. ఈ సారికి సర్వాంతర్యామిలా దర్శించినందుకు క్షమించు అని చెప్పుకుని వడి వడిగా బస్టాండుకి బయల్దేరాను.

ఇంకా బస్సు రాలేదు. పేపర్ చదువుతోంటే ఎవరో ఒకాయన వచ్చి, మిగిలిన పేపర్ టక్కున తీసుకున్నాడు. సర్లే టీ అంగడి దగ్గర ఇలాంటివి కామనే అనుకుని, మిగిలిన పేపర్ చదువుతోంటే ఆయన జాలిగా మొహం పెట్టి "టీ తీసివ్వు బాబు! పుణ్యముంటుంది" అన్నాడు. 'నేను తీసివ్వను నాకు పాపమే కావాలి' అని టక్కున నాలోని రాక్షసుడు బయటకొచ్చి చెప్పాడు. అడిగుంటే లేదు అని చెప్పేవాడిని, తీసివ్వు పుణ్యమొస్తుంది అంటే ఇలానే నాలోని రాక్షసుడు బయటొస్తాడు, బస్సొచ్చింది. ఎక్కాను 5నిమిషాల తర్వాత బయల్దేరింది. నేను,కండక్టరు, డ్రైవరు.. అంతే! ఎవ్వరూ ఎక్కలేదు. ఏదో ప్రీమియర్ షో చూసినట్టుంది. పోయినేడాద్దాకా మా బస్సుకోసం ఎదురు చూపులు సీట్ల కోసం పోటీలుండేవి. ఎప్పుడైతే ఆటోలు ఇంటిదాకా దిగపెట్టడంమొదలయ్యిందో అప్పుడే బస్సులు బుస్సాయ్యాయి. కానీ జనాలు మాత్రం బస్సు రాకపోయినా, టైముకి ఉండకపోయినా డైరెక్ట్ గా కలెక్టర్ దగ్గరికెళ్లి ధర్నాలు చేస్తారు.

అసలు అమ్మకు తెలియదు నేనోస్తోంది. ఊర్లోకి అడుగు పెట్టగానే నవ్వొచ్చేసింది. ఎందుకంటే ఇదే స్థలంలో నేను మాయమ్మని ఏడిపిస్తూ వెళ్ళానని గుర్తొచ్చి. ఇంటి గేటు తీసి "ఏమ్మా ఇలా చూస్తావా?" అన్నాను.

బట్టలుతుకుతోంది.. ఆ మాటకి వెనక్కు తిరిగి అలానే సర్రున చిరునవ్వుతో వచ్చి "అరె! ఎన్ని రోజులయిందిరా వెళ్ళి!?"అంటూ వీపుని తడిమింది. ఎన్ని కోట్లు సంపాదించినా అలాంటి స్పర్శను, జ్ఞాపకాన్ని పొందలేను.

సినిమాలోలా కొడుకు చాలా రోజుల తర్వాత కనిపిస్తే ఏడుస్తుందని అనుకుంటే ఇలా నవ్వి నా సినిమాలో ఓ గొప్ప జ్ఞాపకం అయిపోయింది. నవ్వు మంచిది కాదనను ఎందుకంటే ఎక్కువసేపు నవ్వినా వచ్చేది ఏడుపే కాబట్టి..!ఏడుపు చాలా మంచిది మనసుకి చేరే భాష, మనిషిని చేసే భాష!

## మల్లిగాని కుక్క

మన్నె ఏలియా

**అయ్యవ్వ పెట్టిన పేరు** "మల్లేషు" వాళ్ళ ఇంటిదేవుని పేరు. మల్లిగాడంటేనె ఊర్లో ఎరుక. తాగుబోతు మల్లిగాడంటే అందరికి ఎరుక. వాడినడిగిన నాపేరు "మల్లిగాడు" అని చెప్తాడు. తాగేది తక్కువ వదిలేది ఎక్కువ.

మూడు నాలుగురోజుల నుండి ముసురు. దట్టమైన మేఘాలు సూర్యున్ని కమ్మేసినాయి. ఎడతెరిపిలేని వర్షానికి ఇండ్లల్ల నుండి ఎవరు బయటికి వెళ్ళలేదు. గొడ్డుగోడను పశువుల కొట్టాల్లో కట్టేసి, "ఎప్పుడు తగ్గుతుందా? ఈ ముసురు" అని ఎదురు చూస్తున్నారు. కోళ్ళు వర్షంలో తడిసిపోయి రెక్కలాడించుకుంటు, వణుక్కుంటూ వచ్చి అరుగుల మీద తిరుగుతున్నాయి. ఊరపిచ్చుకలు గూళ్ళల్లనే గుసగుసలు పెట్టుకుంటున్నాయి. ఎటు చూసినా నీళ్ళే కనిపిస్తున్నాయి. ఈదురు గాలికి చెట్లు లయబద్ధంగా నాట్యమాడుతున్నాయి. ముసలోల్లు నిండ దుప్పటి కప్పుకుని పొగాగు చుట్టలు తాగుతు శరీరాన్ని వెచ్చగా వుంచుకునె ప్రయత్నం చేస్తున్నారు. పిల్లలు బయట ఆడుకోలేక ఇంట్ల ఉండలేక గోల చేస్తున్నారు. అత్యవసరమైతే తప్ప ఎవరు బయటకు వెళ్ళే సాహసం చెయ్యడంలేదు.

నాలుగురోజుల తర్వాత వరుణదేవుడు దయదలచి కాస్త శాంతించిండు. ముసురు తగ్గి, సన్నని చినుకులు పడుతున్నాయి. ఆకాశం మాత్రం నల్లని మబ్బులతో నిండు గర్భిణిలా వుంది. హమ్మయ్య: అనుకుని అందరు ఇండ్లు విడ్చి బయట పనులకు, పశువులు మేతకు వెళ్తున్నాయి.

అపుడపుడు వీస్తున్నగాలికి ఆకులమీది వాన చినుకులు కడిగిన ముత్యాల్లాగా రాలుతున్నాయి. చిన్న పిల్లలు రోడ్ల మీదికొచ్చి కేరింతలు కొడ్తూ ఆడుకుంటున్నారు.

సన్నధారల ప్రవహిస్తున్న వర్షపు నీటికి అడ్డంగా బురద, ఇసుక, రాళ్ళతో కట్టలు కట్టి, నీళ్ళను నిల్వజేసి డ్యాంలు కట్టినట్టు ఫీలవుతున్నారు పిల్లలు. ముసలివాళ్ళు నిండా కప్పుకుని "వర్షమ్ల తడిస్తె సర్దిపడుతుంది లోపలికి రండని కేకలు వేస్తున్నరు. " కానీ అవేవి పట్టించుకునే స్థితిలో లేరు పిల్లలు.

ఇండ్ల పక్కనున్న పెంటకుప్పల మీద పురుగుల్ని ఏరుకుని తింటున్నాయి కోళ్ళు.

మల్లిగాడు గొర్లె మందను తోలుకుని అడివికి బయలుదేరిండు ముసలొల్లు, పిల్లలు, తప్ప ఊర్లె ఎవరు లేరు. అందరు చేలల్ల పొలాల్ల పనుల్లో తీరిక లేకుండున్నారు.

సాయంకాలమైంది. అందరు ఇండ్లకు, పశువులు గొడ్లల్లకు చేరుకుంటున్నాయి. మబ్బు కారణంగా తొందరగా చీకటిపడినట్టయింది.

గొడ్లను దొడ్లో తోలి తడిక పెట్టి, తాడుతో గట్టిగా కట్టేసి వస్తున్నాడు మల్లిగాడు. దినమంత తుంపర పడుతుండడంతో వాని బట్టలు, తలమీద కోరాటమేసుకున్న గొంగడి, భుజం మీది తువ్వాలు తడ్చిపోయినాయి. చెకుముక సంచి మాత్రం తడ్వకుండా ప్లాస్టిక్ కవర్లో భద్రంగా వుంది. మట్టి రోడ్డంత బురద అక్కడక్కడ గుంతల్లో నీళ్ళు నిలిచాయి. దూరంగ ఎక్కడో వర్షం పడుతున్నట్టుంది.

గొల్లోలకు ఇలా తడ్వడము కొత్తేమీ కాదు. మేకపిల్ల తీరునున్న నల్లని కుక్కపిల్లను చంకనెత్తుకుని, చేతిలో కర్రను ఊపుకుంటూ, తడ్చిన చింపిరి జుట్టు, మాసిన గడ్డం, నెరసిన మీసాలకెళ్ళి నీళ్ళు కారుతుంటే ఇంటికొచ్చిండు మల్లేషు. ఇంటి అరుగుమీదినుండి చూసి మేకపిల్లనేమోననుకుని "గా..మేకపిల్ల మనకెక్కడిది మనయన్ని గొర్లెగదా!" అనుమానంగా అంది వాని భార్య భూమక్క.

"గదేందే. మబ్బుపడితే కండ్లు కనపడ్తలేవా? నీయవ్వా! కుక్కపిల్లకు, మేకపిల్లకు ఫరక్ తెలుత్తలేదా? నేను తాగితే నీకెక్కిందా? ఏందే?" సటైరేసిండు మల్లేషు.

"కుక్కపిల్లనా?... ఛీ.ఛీ పాడుగాను గదిన్నెందుకు దెచ్చినవ్ ఇది నీకేడ దొరికింది?" అడిగింది భార్య.

"గొర్లను ఇంటి తోలుకుని రాంగ నాలుగు పానాదుల కాడ ఆనకు తడిసి, గజగజ అనుకుతుంటే పాప మనిపిచ్చి పట్టుకచ్చినా" సానుభూతి వ్యక్తపరుస్తు చెప్పాడు.

"తను దూర సంధులేదంటే మెడకో డోలన్నడట ఎనుకటెవడో నీ అసొంటోడు. నీకు తిండి పెట్టుడే దండగనుకుంటే దీన్ని పట్టుకచ్చినవా నా గండానికి" కాస్త కోపం, విసుగు ధ్వనించేలా అంది భార్య భూమక్క.

చక్కలో గట్టింగా అదిమి పట్టుకుని, "మన మల్లన్న దేవుడేగిది. గట్లునవడ్తింది. పాపం ఏమనకు గీర్రాత్రికుండని" అనుకుంటు వెళ్ళి వాకిట్లున్న బావి గోడకు చేతి కర్రను నిలబెట్టి గోలెమ్లు నీళ్ళను చెంబుతో తీసుకుని వంగి కుడికాలు మడిమతో ఎడమ పాదాన్ని, ఎడమకాలు మడిమతో కుడిపాదాన్ని రాస్తూ బురదకాళ్ళను కడుక్కొన్నాడు. చేతిలోని చెంబును గోలెంల ఎత్తేసి, చేతికర్ర తీసుకుని పందిరికింద వాకిట్ల నిలిచిన వర్షపు నీళ్ళను మెల్లగా దాటుకుంటూ వచ్చి అరుగుమీద దింపిండు. కుక్కపిల్లను. చలికి ముడ్చుకుని కూర్చున్నది కుక్కపిల్ల. చేతికర్రను ఒక మూలకు ఆనించి, తడ్చిన గొంగడిని, తువ్వాలును, తీసి దండెం మీద వేసిండు. భార్య తెచ్చిచ్చిన పాత గుడ్డతో ముఖం, తల తుడ్చుకుని, అదే గుడ్డతో కుక్కపిల్లను తుడ్చి, దండెం మీద వ్రేలాడుతున్న చిరిగిన గొంగడి తీసి కప్పిండు. గొంగడి అలవాటులేనిది ములముల పెట్టింది. తలను అటు ఇటు విదిలించుకుని గొంగడ్ని కింద పడేసి దానిమీద పడుకొన్నది. మెత్తని పరుపులాగుంది గొంగడి.

"తడ్చిన బట్టలు ఇప్పేసి, పొడి బట్టలు కట్టుకోపో సర్దివడ్తది" అని ఇంట్లోనుండి భూమక్క కేకేసింది.

తడ్చిన దోతి, బనీను, విప్పేసి పొడి బట్టలు వేసుకుని, తడ్చిన బట్టలను బావిదగ్గర ఒక మూలకున్న బండమీద కుప్పవేసిండు.

"కుంపటి ముట్టిచ్చిరా" భార్య అంది. అరుగు మీద మూలకున్న వేపాకు కుంపటి ముట్టిచ్చి పెట్టిండు. దోమల బాధకు వెచ్చదనానికి కుంపటి పక్కన హాయిగా నిద్రపోయింది కుక్కపిల్ల.

తెల్లవారి లేవగానే కుక్కపిల్లను వాకిట్ల గుంజుకు తాడుతో కట్టేసిండు మల్లేషు. కుయ్.. కుయ్య్ మంటు నేలను వాసన చూసుకుంటూ, తాడున్నంత పొడవు అటు ఇటు తిరుగుతుంది.

భూమక్క వంటపనుల్లో నిమగ్నమయ్యింది. అన్నంలో గంజి వంపెటప్పుడు పల్లెంలో పట్టుకుని, ఒక పాత మట్టి చిప్పలో పోసి కుక్కపిల్లముందు పెట్టిండు. గబగబ నాకేసింది. ఇంకో చిప్పలో నీళ్ళు పోసిపెట్టి, గొర్ల దొడ్లెకు పోయిండు. తడుక తాడు విప్పి జూసిండు.

కొన్ని గొర్లు పడుకున్నాయి. కొన్ని పడుకుని కండ్లు మూసుకుని నెమరేస్తున్నాయి. బౌ.. బౌ. అని అరుస్తున్నయి కొన్ని, దొడ్లె రొచ్చువాసన, వానకు తడ్సిన గొర్రెల బొచ్చు వాసన ముక్కుపుటాలను తాకింది. గొర్లన్నిటిని ఒకసారి కలియజూసిండు. తడిక పెట్టేసి, పెరట్లోని వేపపుల్ల విర్చుకుని రోజులాగే పండ్లు తోముకుంటు బావి మీదకొచ్చి ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుని తువ్వాలుతో తుడ్చుకుంటు ఇంట్లోకి వెళ్ళిండు.

భూమక్క కట్టెల పొయ్యిమీది కూరగంజు దింపి అన్నం గంజు పక్కన పెడ్తుంది. పొయ్యిచుట్టు, భూమక్క తలమీద బూడిద పడింది.

తలమీద పడిన బూడిదను వ్రేళ్ళతో దులిపేసి, మసిగుడ్డతో పొయ్యిచుట్టున్న బూడిదను ఊడ్చి కుప్ప జేసింది.

"దా అచ్చినావా?" అంటు వెళ్ళి కొంగు నడుముకు చుట్టుకుని, ఉట్టిమీదున్న రాత్రి మిగిలిన జొన్నరొట్టె, పెరుగు దుత్త దింపి కిందపెట్టింది. మట్టిగోడకు ఆనించి నిలబెట్టిన పీట. తీసి వేసుకుని కూర్చున్నడు మల్లేషు.

జొన్నె రొట్టె, వేడి వేడి వంకాయ కూర పల్లెంలో వడ్డించింది. జొన్న రొట్టె తినడం అయిపోగానే, కొంచెం అన్నం పెట్టి పల్లెం నిండా గడ్డ పెరుగు వేసింది. మంచిగా కలుపుకుని కడుపు నిండా తిని లేచి వ్రేళ్ళు నాక్కుంటూ వెళ్ళి బయట చేతులు, మూతి కడుక్కుని తువ్వాలుతో తుడ్చుకున్నాడు.

ఎంగిలి పల్లెం, పీట తీసి పక్కన పెట్టి, వేడి వేడి అన్నం, వంకాయ కూర, ఎల్లిపాయ కారం, మోతుకాకు విస్తరిలో చుట్టి తువ్వాలుతో ముళ్ళె కట్టిచ్చింది.

సద్దిముల్లె తువ్వాలును భుజానికేసుకుని, మూలనున్న చేతికర్ర అందుకుని, దండెం మీది గొంగడిని తీసి భుజం మీద వేసుకుని, వాకిట్ల కొచ్చిండు.

కుయ్ కుయ్ మంటు గుంజ చుట్టు తిరుగుతున్న కుక్కపిల్లను జూసి, భుజం మీది గొంగడ్ని చద్దిముళ్ళను ఎడమ చేత్తో పట్టుకుని, చేతి కర్రను కిందపెట్టి కుక్కపిల్ల మెడతాడు విప్పేసి పోతే పాని అనుకొని, కర్ర చేతపట్టుకొని దొడ్డి చేరుకున్నాడు. తడక తాడు విప్పి చేతి కర్రతో పడుకొన్న గొర్లను లేపుకుంటూ బయటకు తోలుతున్నాడు. గొర్లన్ని బే..బే.. అరుస్తు వెళ్ళిన తర్వాత, తడక దగ్గరేసి అడవికి బయలుదేరిండు మల్లేషు.

కొద్దిసేపటి తర్వాత భూమక్క తిని, చద్దికట్టుకుని, నీళ్ళబుడ్డి, కొడలి గంపలో పెట్టుకుని గడప బయటపెట్టింది. తలుపులు మూసేసి, గొళ్ళెం పెట్టి తాలం వేసి, తలమీద బట్ట కుదురు పెట్టుకుని గంప నెత్తుకుని చేన్ల పనికి వెళ్ళింది.

కుక్కపిల్ల వాకిట్ల తిరుక్కుంటూ వాకిట్ల కొచ్చిన కప్పల్ని కోడిపిల్లల్ని బెదిరించుకుంటు ఆడుకుంటుంది.

చేన్లపని ముగించుకుని సాయంత్రం అలసిపోయి ఇంటికి వచ్చిన భూమక్కను జూసి కొద్దిదూరం నుండే తోకాడించుకుంటూ కుయ్‌కుయ్ మనుకుంటూ ఎదురుగా రావడంతో, "అయ్యో పాపం సూడు. మూగజీవంకు ఎంత పేమ, పిల్లగాండ్ల తీరురికచ్చింది" అలసటను మర్చిపోయి మనసులో అనుకుంది. కుక్కపిల్లను చూసుకుంటూ ఇంటివైపు నడుస్తుంటే ఆమె వెనకాలె వస్తుంది.

అరుగుమీద గంపను దింపేసి వెళ్ళి ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుని, నోట్లో నీళ్ళు పుక్కిలించుకుని చీర కొంగుతో తుడ్చుకుంటూ వచ్చి, మెడలోని గొలుసుకున్న తాలం చెవితో తాళం తీసి, గంపను తీసుకొని ఇంట్లోకి వెళ్ళింది.

కుక్కపిల్ల అరుగు మీది దాకా వెళ్ళి వెనక్కి వచ్చి పందిరి కింద ఆట మొదలుపెట్టింది.

భూమక్క ఇంటి పనుల్లో మునిగిపోయింది.

పొద్దుగూకిన తర్వాత గొర్లమందను దొడ్లో తోలి తడక పెట్టి తాడుతో గట్టిగ కట్టేసి వచ్చిండు ఇంటికి.

భుజం మీది తువ్వాలు, గొంగడి తీసి అరుగుమీదున్న దండెం మీద వేసి చేతికర్రను ఒక మూలకు ఆనించి, అరుగు అంచుకు కూర్చున్నాడు.

బయట ఆడుకుంటున్న కుక్కపిల్ల పరుగెత్తుకుంటూ వచ్చి, మల్లేష్ పక్కన కూర్చుంది.

చేతితో తల నిమిరాడు. ఆ ఆప్యాయతకు పరవశించిపోయి కండ్లు ముసుకొని మరింత దగ్గరగా జరిగింది.

ఇంట్లోనుండి భూమక్క "మెల్లగరా.. కింద సూసుకుంటరా. సీకట్ల కుక్కపిల్లను తొక్కేవు" సలహా ఇచ్చినట్టు ఆర్డరిచ్చినట్టు అర్థంకాని విషంగా చెప్పింది.

"తాగుతీ కండ్లు కనపడయనుమంటున్నవా ఏందే " అని నా పక్కనె కూసున్నది,

"మరి సప్పుడు లేకపోతే ఎటన్నవోయిందేమోననుకున్న" అంది.

"ఎటువోయెటట్టు లేదే"

"పాకపోని.. ఉండని" అనుమతిచ్చినట్టు అన్నది.

"ఎంతసేపు దానితో నుంటవు. పొద్దుగల్ల. ఎంగిలి బువ్వ తీసుకుపోయి, సల్లకల్పి కుక్కకు పెట్టు" మెల్లగా లేచి ఇంట్లకెళ్ళి భూమక్కతో "నిన్న అద్దంటివి గదనే"

"పిల్లలు లేని మనకు గిదే పెద్దకొడుకు తీరుంటది. మనకింత తోడుంటది. సిన్నపిల్ల ఎటనిపోతది దిక్కులేనిది వేరే కుక్కలు జూస్తె కొరికి పంపుతయి. దానికెంత గావాలే పిడికెడు మెతుకులేస్తే తిని బతుకుతది. మనకు పిల్లలుంటే పారేసుకుంటమా? పోని ఇంటికాడ కావలుంటది."

మొదట వద్దనుకున్న భూమక్క మనసు మార్చుకుని జాలి పడింది.

తెలియకుండానే ఇంటిలో ఒక సభ్యుడైపోయింది.

మల్లిగాడు గొర్రెల మందను మేతకు అడవికి తోలుకెళ్తుంటే వాటితోపాటు వెళ్ళడం, తిరిగి రావడం కుక్కపిల్లకు దినచర్య అయ్యింది. చిన్నపిల్లప్పటి నుండి గొర్లమందతో కలిసి వెళ్ళడంతో మల్లేషుకు మంచి కంపెని లభించింది. రమ్మంటే వస్తుంది, పొమ్మంటే పోతుంది. మందను మలుపుకొస్తుంది మాటలు రాని మిత్రుడయ్యింది.

మల్లిగాడు తన చద్దితోపాటు కుక్కను కూడ తీసుకు రావడం ఏనాడు మర్చిపోవడం లేదు. అడవికి వెళ్ళినప్పుడు వెడల్పు టేకు టాకులు కోసుకొచ్చి అందులో కుక్కకు అన్నంపెట్టి, తను ఇంకో ఆకులో తినడం, వాగుల్లో, చెలిమల్లో నీళ్ళు తాగడం ఎంతో సరదాగా వుంది ఇద్దరికి.

రోజు విస్తరి భోజనమే. ఒకరికొకరు తోడు.

కుక్క చిన్నపిల్లగా నున్నప్పుడు మల్లిగాడు మంద ముందు చేతికర్ర పట్టుకుని నడుస్తుంటే, అది వెంబడించేది. మంద కాపల ఎలా చేస్తారో, ఏమేమి చేస్తారో అన్ని తెల్సిపోయినవి.

ఇపుడు మంద వెనుకాల మల్లిగాడు నడుస్తుంటే గొర్లమంద ముందు ఠీవిగా తోకూపుకుంటు తలను అటు ఇటు తిప్పి పండించుకుంటూ నాయకత్వం వహిస్తుంది. అది చూసి మురిసిపోతున్నాడు మల్లేషు.

గొర్లతో కుక్కకు సహవాసం ఏర్పడింది. కుక్కను అనుసరిస్తు వెళ్తున్నాయి గొర్రెలు. ఏ భయములేదు. ఏదైన గొర్రె పచ్చిగడ్డి మేసుకుంటు మందనుండి తప్పిపోతే వెదికి మందలో కలుపుతుంది. తోడేళ్ళ ఎత్తుకపోయిన సందర్భాలున్నాయి. గొర్లకు కుక్కపై పూర్తి విశ్వాసం ఏర్పడింది. మల్లిగాడు పనిలో సగం పంచుకోవడంతో ఇద్దరి మధ్య బంధం మరింత బలపడింది. ప్రతిక్షనం మందను, మల్లిగాడ్ని కనిపెట్టుకుని వుంటుంది.

చెకుముక రాయితో చుట్ట వెలిగించుకుని తాగుతుంటే పొగవాసన పీల్చుకుంటు ఎంజాయ్ చేస్తుంది. అపుడపుడు వీడు ఎండకు అలసిపోయి చెట్లకింద నీడలో పడుకొంటే మందను కాపలా కాస్తుంది. ఆ విషయం వాడికి తెలుసు. అందుకె వాడికి నిశ్చింత.

ఒకరోజు మధ్యాహ్నం చెట్టుకింద పడుకొని లేచి వచ్చిండు. గబగబా వెళ్ళి పడిపోయిన సగం తాగి దాచుకున్న పొగాకు చుట్టముక్కను నోట కర్చుకొచ్చి మల్లిగాడికిచ్చింది. సంతోషించి, కృతజ్ఞతతో దాని వీపు నిమిరి చుట్టముక్కను తీసుకుని చెవి వెనుకాల చెక్కుకున్నాడు.

కొన్నేండ్లుగా రాత్రి పగలు ఎటువెళ్ళిన మల్లిగాడి వెంట వెళ్తుంది.

మొన్నటి అమావాస్య రాత్రి చేన్ల గొర్ల మంద కాపల పడుకొన్నాడు మల్లిగాడు. తాగిన మత్తులో గుర్రుపెట్టి నిద్రపోయాడు. మందకాపల కాస్తున్నప్పుడు గొల్లలు పడుకొని నిద్రపోరు. చేతికర్రను చంకలో పెట్టుకుని నెత్తిమీద గొంగడి కోలాటం వేసుకుని మధ్య మధ్య కండ్లు మూస్తు తెరుస్తు రాత్రంతా మేల్కొనె వుంటారు. అపుడపుడు మంద చుట్టు తిరిగి వస్తుంటారు.

కుక్కలేనప్పుడు మల్లిగాడు ఇంత హాయిగా నిద్రపోయేవాడుకాదు. చలికి నిండుగా గొంగడి కప్పుకుని వరిగడ్డిలో వెచ్చగా పడుకున్నాడు కుక్కమీది భరోసాతో.

తెల్లవారింది. లేత సూర్యకిరణాలు ముఖం మీద పడుతున్నాయి. గొంగడి తన్నేసి బద్ధకంగా లేచి కండ్లు నులుముకుంటు కూర్చొనె తల తిప్పి మంద చుట్టు చూసిండు, కుక్క కనిపించలేదు. కండ్లు పెద్దవి చేసి నిల్చుండి చూసిండు. కన్పించలేదు. అయోమయంగా వెనక్కి తిరిగి చూసిండు. మల్లిగాడికి కొద్దిదూరంలో కాళ్ళు చాపుకుని పడుకుని వుంది. దాని మూతికి రక్తం అంటుకుని ఎర్రగా వుంది. రాత్రి దేన్నో వేటాడి చంపి కడుపునిండా తిని మబ్బుగా నిద్రపోతుందేమోననుకున్నాడు. కాని కుక్క చుట్టు పాము ముక్కలు పడివున్నాయి. అనుమానంగా చేతికర్రతో కుక్కను కదిపి చూసిండు.

మల్లిగాని గుండె ఝల్లుమన్నది. "గీ..తాగుబోతు మల్లిగాని కోసం నీ ప్రాణం బలిచ్చినవా?" అని ఉద్వేగానికి లోనయ్యాడు కండ్లల్ల నీళ్ళు ఉబికివస్తున్నాయి.

రాత్రి తాగిన కల్లు నిషా క్షణంలో దిగిపోయింది. కుక్కమీద పడి స్వంత బిడ్డ చనిపోయినట్లు గుండెలవిసేలా విలపిస్తున్నాడు. ఆ ఏడుపు ఎంతో దూరం వినబడుతోంది. దగ్గరి చేన్లల్ల నున్న గొల్లలకు స్పష్టంగా వినబడింది.

"మల్లిగానికేమో అయ్యింది" అని పరుగెత్తుకొస్తున్నారు.

"రాత్రి మందెక్కువయ్యిందేమో?" అని ఒకడు, తిన్న అరుగక ఏడుస్తండ్నీ అనుకుంటు వస్తున్నారు - "కాదుగా.. మల్లిగాడుకి మస్తు ధైర్యం. దేనికి ఆడు ఏడ్వడు. ఏదో అయ్యింది" అని ఇంకొకడు అనుకుంటూనే పరుగు పరుగున మందను చేరుకున్నారు. వాళ్ళకు పరిస్థితి అర్థమయ్యింది.

"అబ్బా! ఎంత పనైంది. కుక్కె లేకుంటే మల్లిగాడు పోతుండె. మనమేడుస్తుంటిమి" వేగంగా శ్వాస పీల్చుకుంటు ఒకరితో నొకరు అనుకుంటున్నారు. ఆ దృశ్యాన్ని చూసి అందరూ నిశ్చేష్టులయ్యిపోయారు.

"మల్లిగాని పెండ్లం సచ్చిపోయినప్పటి నుంచి గిదే ఆనికి మంచి సావతి. మల్లిగాడు తాగి ఏడన్న పడిపోతే, వాడు లేచేదాక అక్కడికెళ్ళి కదలకపోతుండె వానిమీద ఈగ వాలనిచ్చేదికాదు మోరుజోపు కుక్క అది. ఎంత తాగినగాని కట్టమనుకోకుండా కుక్కకు బుక్కెడు బువ్వ తిండి పెడ్తుంటే, ఆడు తిన్న తినకపోయిన దాన్ని మాత్రం ఉపాసం ఉండనియ్యకపోవు. ఆనికి గీ కుక్కంటే పాణం. దానికి గూడా ఈడంటే పాణం. " కుక్కతో మల్లిగాడికున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు.

"మల్లేషు! లెవ్వురా. లెవ్వు. బాధపడకు దాని ఆయుసు గంతె వుందనుకో. నువ్వేమి సేత్తవు. ధైర్నం చేసుకో. లే. దీన్ని తీసుకపోయి ఏడన్న వాసన రాకుండా దూరంగా పడేద్దాం" అంటు భుజం తట్టి లేపె ప్రయత్నం చేశారు. వద్దన్నట్టు తల అడ్డంగా ఊపిండు.

"మరి ఏమి చేద్దామనుకుంటున్నవ్?" అని అడిగేలోపు చనిపోయిన కుక్కను లేపి గొర్రెనెత్తుకున్నట్టు వీపు భుజాల మీద వేసుకుని రెండు చేతులతో కాళ్ళను గట్టిగా పట్టుకుని, మందనక్కడే వదిలేసి ఇంటిదారి పట్టిండు.

పక్కింటి బానయ్య మల్లిగాడి గొర్లమందను ఇంటికి తోలుకొస్తున్నాడు.

ఊర్లోకి అడుగుపెట్టగానే చలికి నీరెండకు నిల్చున్నవాళ్ళు మల్లిగాన్ని ప్రశ్నార్థకంగా చూస్తున్నరు. "తాగుబోతు మల్లిగాన్కి పినగిట లేసిందా ఏంది? సచ్చిన కుక్కనేమి సేసుకుంటడు" అని లోలోన అనుకుంటున్నరు. ఒకరిద్దరు అడుగనె అడ్గిను. "అవురా! మల్లిగా సచ్చిన కుక్కను అందరేమో ఊరవతల పారేస్తరు. నువ్వేమో ఊళ్ళోకి తెత్తున్నవు?" ఎవరి మాటలు పట్టిచ్చుకోలేదు. పట్టించుకొనే స్థితిలో లేడు. తలకిందికేసుకుని మౌనంగా ఇంటికి చేరుకున్నాడు.

ఇంటి వెనుకాల పెరట్లో కుక్క శవంను దింపేసి, దొడ్డిలోని పార, గడ్డపార, తట్ట (గంప) తీసుకొచ్చి తువ్వాలు నడుముకు చుట్టుకొని, మోకాలు లోతు గోతి తవ్విండు. కుక్క శవం మీదపడి వెక్కి వెక్కి ఏడ్చిండు. బావి దగ్గరకెళ్ళి బకెట్ నిండా నీళ్ళు తెచ్చి కుక్కకు స్నానం చేయించిండు. తువ్వాలుతో తుడిచి, రెండు చేతుల మీద ఎత్తుకుని, కన్నీటితో పాతిపెట్టి మట్టి పూడ్చేసిండు. ఆ సమాధిమీద పడి దొర్లుకుంటు ఏడ్చిసిండు.

బావి మీదికెళ్ళి చేతాడు బక్కెనతో నీళ్ళు తొడుకుని నాలుగైదు బొక్కెన్ల నీళ్ళు తలపై పోసుకున్నాడు. తడ్చిన బట్టలతోనే వెళ్ళి అరుగుమీద కుక్క పడుకునే చోట కూలబడి తల బాదుకొంటూ రోదిస్తున్నాడు. దాని గొలుసును, నీళ్ళ చిప్పను తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు.

ఏడ్పు విని వచ్చిన వారికి మల్లిగాన్ని ఓదార్చడం కష్టమయ్యింది. బరువెక్కిన హృదయంతో మెల్లగా లేచి మొలదారానికున్న తాళం చెవితో తాళం తీసి, తలుపులు తెరుచుకుని ఇంట్లో దేవుని గూట్లో నున్న ఊదబత్తులు (అగరబత్తులు) అగ్గిపెట్టె తీసుకొచ్చిండు.

అగరుబత్తులు వెలిగించి సమాధి మీద పెట్టిండు. మోకాళ్ళమీద కూలబడి దండం పెట్టిండు. నెమ్మదిగా లేచి నడ్చుకుంటూ వెళ్ళి అరుగు మీద గుంజకు ఆనుకుని తలను వెనక్కి వాల్చి, ఎరుపెక్కిన కండ్లు మూసుకున్నాడు. కండ్ల కొలుకుల్లోంచి ఉబికి వస్తున్న కన్నీరు టప టప కిందరాలి ఇంకిపోతున్నాయి.

"పాపం మల్లిగాడు ఒంటరోడయ్యిండు. ఇన్నేండ్ల సోపతి ఇయ్యాలటితోని తెగిపోయింది." అనుకుంటు చెమ్మగిల్లిన కండ్లతో ఒక్కొక్కరు వెళ్ళిపోయిను.

మరుసటి రోజు.

దొడ్డిలో గొర్రెలు అరుస్తున్నాయి. "ఈ పాటికి మేతకు తోలుకుపోయేటోడు. వీడింక లేవ్వలేనట్టున్నడు. తాగుబోతోడు. కుక్క సచ్చిపోయిందని బాధతో రాత్రి ఇంకో పెగ్గు ఎక్కువ తాగిండేమో." అని తిట్టుకుంటు వచ్చిండు పక్కింటి బానయ్య. ఇంటి తలుపులు తెరిచేవున్నాయి.

మల్లిగాడు అరుగుమీద కుక్కపడుకునే జాగాలో పడుకున్నాడు. గోడవైపు ముఖం పెట్టి ప్రక్కకు ఒదిగి కుడి చేతిని తలగడగా పెట్టుకొని కనిపించిండు. రాత్రి మత్తు ఇంకా దిగలేదనుకుని దగ్గరకు వెళ్ళి "ఓరి మల్లిగా! .. అరేయ్ మల్లిగా.. లెవ్వు. ఎంత పొద్దెక్కిందో సూడు. నీ తాగుడు పాడుగాను. గొర్లు దొడ్లె ఆకలితోని ఒర్రుతున్నయి." అంటూ దండపట్టి పక్కకు దొర్లించిన బానయ్య నోటమాట రాలేదు. శరీరం చల్లబడి, కట్టె సర్సుకు పోయింది. పక్కలోని సీసా నిండా కల్లు అట్లాగే వుంది. బొట్టు గూడ తాగినట్టు లేదు.

"అయ్యో మల్లిగా! ఎంతపని జేస్తివిరా!" లోలోన బాధపడుతూ ముక్కు దగ్గర చూపుడు వ్రేలుంచి చూసిండు.

"పోయిండు మల్లిగాడు సచ్చిపోయిండు. ఇన్నిరోజులు మల్లిగానితోని కుక్కపోతుండే ఇయ్యల్ల మల్లిగాడే కుక్కతోని పోయిండు" చెమ్మగిల్లిన కన్నులతో బానయ్య బయటకొచ్చిండు.

మల్లిగాడు మరణవార్త ఊరంత పాకింది. ఆఖరి చూపుకోసం వచ్చిన వాళ్ళందరు కన్నీరు పెట్టుకున్నారు. ఊరు ఊరంత తరలి వచ్చిను.

స్నానం చేయించి, కొత్త బట్టలు కప్పి, పాడెకట్టి డప్పుల మోతల నడుమ ఊరవతల అంత్యక్రియలు పూర్తి చేసిను. దగ్గరిలోనున్న చెరువు తూముకింద స్నానం జేసి, తడ్చిన బట్టలతో చెరువు గట్టెక్కి నడ్చుకుంటూ.

"ఊరవతల పడేసె కుక్కకు పెరట్ల గోరి గట్టిండు. ఊర్లుండే మల్లిగాన్ని ఊరవతల కాలనెట్టిను. సక్కని సావచ్చింది. ఎంతటి పున్నెం జేసుకుంటే గిసోంటి సావత్తది. ఊల్లె ఎవని సావుకు రానంత మందివచ్చిను." అని మాట్లాడుకొంటు ఒకరి వెనుక ఒకరు నడ్చుకుంటూ చెరువుగట్టు దిగి ఊరువైపు తిరుగుముఖం పట్టిండ్రు.

# ఒక మార్దవ మధ్యాహ్నం

## వి-రాగి

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

పాశ్చాత్యులు నామకరణం చేసిన 'షార్ట్'గా దిగుమతి అయ్యే వరకూ– సమాజంలో దిగువ తరగతి వర్గాల పురుషులు, శ్రమజీవులు మాత్రమే ధరించే ఉడుపుగా తరతరాలు చులకనకు గురైన నిక్కర్ వేసుకుని ఉన్నాను. ఈ వస్త్రానికి గతానికీ, ఇప్పటికీ ఉన్న తేడా అల్లా– మోకాళ్ళ పైకి ఉండేది కాస్త మోకాళ్ళ కిందకు దిగడం, రేటు మాత్రం జాస్తి అయి ఎన్నో రెట్లు పెరగడం. ప్రతి మనిషితో బంధుత్వం కలుపుకునే పాత కాలపు కలుపుగోలు పల్లె మనిషిలా చిక్కుడు పాదు– ప్రహరీకి ఆనుకుని పెంచిన కానుగ, సీతాఫలం, దానిమ్మ, వేప, నందివర్ధనం చెట్లను పెనవేసుకుని పోయింది. కాలం మారుతున్నా కపటులుగా మారలేని అలాంటి పల్లె మనుషుల నవ్వుల్లా– రథసప్తమి వెళ్ళినా పాదు సొంతం తెల్లని పువ్వులే. ఆ నవ్వులకు తగ్గ వారి నడవడికలాగే కణుపుకణుపునా కాయలే. పాదు మొదలు మా పెరట్లోనే ఉన్నా ప్రహరీ దాటి ఈ మొక్కల పైకి పాకింది. చెట్ల చుట్టూ తిరుగుతూ చేతికి అందిన కాయలు కోస్తున్నాను. అందని కాయల్ని కోసేందుకు చెట్లు ఎక్కుతుంటాను.

పెరట్లోని పాదులూ, పూలూ కూరగాయల మొక్కలూ, ప్రహరీకి ఆనుకుని ఉన్న చెట్లూ నేను పెంచినవే. ఇదే ఇంట్లో పదేళ్ళుగా అద్దెకు ఉంటున్నాము. ఓ దినపత్రికలో సబ్ ఎడిటర్ గా పని చేస్తున్న నేను కథలూ, కవిత్వమూ రాస్తుంటాను. అవి అచ్చయినప్పుడల్లా సంతోషం కలుగుతుంది. అంతకన్నా ఆనందం నేను పెంచిన మొక్కలు మొగ్గ తొడిగినప్పుడూ, పువ్వై విచ్చుకున్నప్పుడూ, పిందె వేసి, అది కాయగా పెరిగి చేతికి వచ్చినప్పుడూ దక్కుతుంది. ప్రతికూల పరిస్థితుల్లోనూ సహజ స్వభావానికి అనుగుణంగా పూలు పూసి, కాయలు కాసేందుకు 'శాఖోపశాఖ' శక్తులా ప్రయత్నించే, పరిమళాన్ని పది దిక్కులకూ, ఫలాల రుచిని ఆరగించే వారందరికీ సమానంగా పంచే మొక్కలంటే, నాకు ఎంతో గౌరవం, ప్రేమా, గురీ. మామిడి, నేరేడు, సీమచింత వంటి మొక్కలను అవి కాపు కాసే రుతువులో తప్ప మిగిలిన కాలాల్లో వృధా అనుకుంటారు కొందరు. దాన్ని నేనొప్పుకోను. కాపు కాయడం వాటికి ప్రకతి నిర్దేశించిన కర్తవ్యాల్లో ఒకానొకటి మాత్రమే. దాని కన్నా గొప్ప పని అవి అన్ని రుతువుల్లో– నిత్యం, రేయింబవళ్లు, అనుక్షణం నిర్వర్తిస్తూనే ఉంటాయి. అదే– తాము బొగ్గుపులుసు వాయువును పీల్చుకుని, మన కోసం ప్రాణవాయువును ప్రసాదించడం. నేను పెంచిన కరివేప మొక్క ఆకులు నిత్యం మా ఇంట్లోనే కాదు ఇరుగుపొరుగు ఇళ్ళలోనూ పోపులకు ఘుమఘుమలను అద్దుతుంటాయి. నేను పూయించిన గులాబీలు కోసుకుంటున్నప్పుడు మా కాలనీ ఆడపిల్లల కళ్ళలో ఆ పూల కన్నా సొగసైన ఆనందం కనిపిస్తుంటుంది. మా ఉసిరిచెట్టు కాయలను ఉప్పూకారం అద్దుకుని తింటూ పిల్లలు వేసే లొట్టలు నాకే తెలియకుండా నేను కట్టిన బాణీల్లా వినిపిస్తాయి. ఇక నందివర్ధనాలైతే అంటూ సొంట్లకు అతీతంగా కాలనీలోని అన్ని కులాల వారి పూజామందిరాలనూ చేరుతుంటాయి. మనుషులు మొక్కల్ని ఆదర్శంగా తీసుకుంటే చాలు– లోకం బాగుపడి పోతుందనీ, 'సంతోషం మూడు పువ్వులూ.. ఆరు కాయలుగా' వర్ధిల్లుతుందనీ అంటాను. దాన్ని 'పిచ్చి' అంటుంది స్వర్ణ. 'యాభై దాటిన ఈ వయసులో ఒళ్ళు పులిసేలా వాటికి అంత చాకిరీ చేయడం అవసరమా? రైతు బజార్లో వంద రూపాయలు పెడితే వారానికి సరిపడా కూరగాయలు వస్తాయి. పది రూపాయలు పెడితే బోలెడు పూలు వస్తాయి. చెట్టెక్కి పడి, ఏ చెయ్యో, కాలో విరగొట్టుకుంటే లాభం గూబల్లోకి వస్తుంది' అంటూ నాకు అత్యంత ప్రీతిపాత్రమైన పనిని తెలివి తక్కువతనమని తీర్మానిస్తుంది. 'అయినా — అద్దె ఇల్లు శాశ్వతమన్నట్టు ఈ మొక్కలు పెంచడం ఏమిటివెర్రిబాగులతనం కాకపోతే!' అని ఒకనాటికి ఇల్లు ఖాళీ చేయాల్సి వచ్చే వాస్తవాన్ని గుర్తు చేస్తుంది. 'అయితే మాత్రం– మొక్కలు పెంచకూడదా? 'మనిషి ఆత్మ ఈ శరీరాన్ని చినిగిన వస్త్రాన్ని విడిచినట్టు విడిచి పెట్టక తప్పదు' అని మీ శ్రీకష్ణుడు చెప్పాడని



కౌముది

రోజూ దానికి భోజనస్నానపానాదులు లేకుండా నిర్లక్ష్యం చేస్తున్నామా ఏమిటి?' అని హాస్యమాడుతుంటాను. ఓ హాస్పిటల్లో ల్యాబ్ టెక్నీషియన్ గా చేస్తున్న తాను ఇప్పుడు డ్యూటీలో ఉంది.

★★★

స్కూటీ మీద నన్ను దాటుకుని కొంచెం ముందుకు వెళ్ళి రోడ్డు మొగలో ఆగిన ఇద్దరమ్మాయిలు దిక్కులు చూస్తూ నిలుచున్నారు. పంజాబీ డ్రెస్లు వేసుకున్న వాళ్ళకు 25 ఏళ్ళ వయసుంటుంది. వాళ్ళ వాలకం చూస్తుంటే అడ్రస్ కోసం వెతుక్కుంటున్నట్టున్నారు. ఆ మధ్యాహ్నం వేళ సాధారణంగానే మా కాలనీలో జన సంచారం ఉండదు. అటూఇటూ చూసినా ఏ ఇంటి వాకిట్లోనూ ఎవరూ కనిపించక అమ్మాయిలిద్దరూ నా వంకే చూస్తున్నారు. అయితే నేను మగవాడిని కావడం, ఒంటిపై నిక్కర్ తప్ప మరేమీ లేకపోవడంతో పలకరించడానికి తటపటాయిస్తున్నట్టు అనిపించింది. అయినా నేనూ పలకరించలేదు. తలలు బోడులైనా తలపుల నిండా మొలిచిన మదపు ముళ్ళను అవకాశం వస్తే, అలుసు చిక్కితే చూపులుగా, మాటలుగా, చేష్టలుగా గుచ్చే మగాళ్ళకు లోటులోని ఈ కాలంలో– ఏ వయసు మగాడైనా పనిగట్టుకుని అపరిచితులైన అమ్మాయిలను పలకరిస్తే ఆ బాపతే అనుకునే ప్రమాదం ఉంది. అందుకే వాళ్ళు నా కూతురు వయసు వాళ్ళైనా మాట్లాడకుండా చిక్కుడు కాయలు కోస్తున్నాను.

ఇద్దరిలో ఓ అమ్మాయి కొంచెం ముందుకు వచ్చి అడిగింది "మీది ఈ కాలనీయేనా?"

"అవును.. ఏం కావాలి?" అడిగాను.

"ఈ డోర్ నంబర్లు ఎక్కడొస్తాయో తెలుసా ?" చేతిలో ఉన్న పేపర్ చూపుతూ అడిగింది. చెమట పట్టి, జిడుతూ, ఒంటిపై అక్కడక్కడా రాలిన ఆకులు అంటుకునీ కూలిమనిషిలా ఉన్న నా వాలకం చూసి అండీ అనాలో, ఏకవచనంతో సరిపెట్టొచ్చో తేల్చుకోలేక పోతున్న సందిగ్ధం ఆమె గొంతులో,

"మా కాలనీలో డోర్ నంబర్లు వరసగా ఉండవు. అంతా జంబ్లింగ్. ఇంతకీ మీకెందుకు అవి?"

నిజమైన అర్హత, అనర్హతలతో పని లేకుండా మంది ఓట్లు పడగానే ఒకడికి పాలనాయోగ్యత దక్కినట్టు జంబ్లింగ్ అన్న ఆంగ్లపదం వాడగానే ఆమె ద్రుష్టిలో నాకు బహువచన యోగ్యత లభించినట్టుంది "అంకుల్! మేము మున్సిపల్ టీచర్లం. ఎకనమిక్ సెన్సస్ డ్యూటీ మీదొచ్చాం. ఈ నంబర్లు పట్టుకోలేక పోతున్నాం. కొంచెం చూసి చెప్పండి, ప్లీజ్!" అంది.

ఆమె ఇచ్చిన కాగితం చూసినా ఆ డోర్ నంబర్లు మా కాలనీలోని ఏ వీధిలోకి వస్తాయో నాకర్థం కాలేదు. కాగితం వెనక్కి ఇచ్చేస్తూ చెప్పాను "ముందే చెప్పానుగా.. ఇలా పట్టుకోవడం కష్టం. ఇంటింటికీ అడుగుతూ వెళ్ళాల్సిందేనమ్మాయ్"

"సరే అంకుల్ ! ఏం చేస్తున్నారు? చిక్కుడు కాయలు కోస్తున్నారా? నాకు ఇలా పాదు నుంచి కోయడం ఎంతిష్టమో!" అంటూ, నా అనుమతి అడగకుండానే మునివేళ్ళపై నిలిచి, కిందకు వేలాడుతున్న తీగలను అందుకుని కాయలు కోయడం మొదలు పెట్టింది. రెండో అమ్మాయి కూడా వచ్చి ఆమెతో చేరింది.

చెట్టు మొదలుకు కాళ్ళతో బంధం వేసి, ఛాతీ కొట్టుకుపోతున్నా లెక్కచేయకుండా చేతుల్లోని బలమంతా ఉపయోగించి కొమ్మల పైకి పాకి, జామ కాయలు కోసుకుని.. ఎవరెస్టు ఎక్కినంత సంబరపడ్డ నా బాల్యం గుర్తుకొచ్చింది. "పెరడుకు నోచని ఫ్లాట్ జీవితాలకు కుండీ మొక్కలే కీకారణ్యం. పాపం, ఈ చిక్కుడుపాదే వీళ్ళకి వనకన్య విరబోసుకున్న కురుల్లా కనిపిస్తున్నట్టుంది" అనుకుంటూ "తప్పలు కొయ్యకండి. గింజ కట్టిన వాటినే కొయ్యండి" అని సూచించాను.

"అలాగే అంకుల్ !" అంటూ రెట్టించిన ఉత్సాహంతో, మునివేళ్ళపై లేచినా అందని తీగలను అందుకోవడానికి చెంగుచెంగున ఎగురుతూ కాయలు కోశారు. ఆ ప్రయత్నంలో కొన్ని తీగలు తెగిపోతున్నాయి. అయినా వాళ్ళ హుషారును చిన్నబుచ్చడం ఇష్టం లేక ఏమీ అనలేదు.

"ఏయ్ ! అదిగో! ఆ పక్కనే ఉన్న గుత్తి అందుకో! భలేభలే! ఈ తీగ నిండా కాయలే! అరెరే.. లేత కాయ కూడా తెగిపోయిందే! అంకుల్! ఎన్ని కాయలు కాసిందో, చూశారా !" తన, పర భేదం వంటబట్టక ఎవరింటికి వెళ్లినా అల్లరి చేసే పసిపిల్లల్లా– కేవలం మాట మాత్రపు పరిచితుడినైన నా సమక్షంలోనే యువతులిద్దరూ కేరింతలు కొడుతూ, గంతులు వేశారు. నేను పెంచిన పాదు గురించి నాకే గొప్పలు చెప్పారు. వాళ్ళను చూస్తుంటే– చిన్నప్పుడు మా మండువా లోగిలి ముందు విశాలమైన వీధి వాకిట్లో, వెన్నెలలో హాయిగా తొక్కుడుబిళ్ళలాడిన నా తోబుట్టువులు గుర్తొచ్చారు. చుట్టూ ఉన్నది అంతా తమ వాళ్ళే అయి, అంతా సురక్షితమైన వాతావరణమేనన్న నమ్మకం కుదిరినప్పుడు ఆడపిల్లలుగా తమ చుటూ కట్టిన ఆంక్షల గోడలను తొక్కుడుబిళ్ళాటలో బద్దిని దాటినంత అవలీలగా లంఘించే సహజ ప్రవర్తన అది. చిరుగాలికే పగిలి అంతర్ధానమైన నీటిబుడగల్లా– ఆ ఇద్దరమ్మాయిల్లో బెరుకు, బిడియం అణుమాత్రం లేవు. వాళ్ళను చూస్తుంటే నాకు ముచ్చటేసింది. మనుషులు అందునా ఆడవాళ్లు అపరిచితులతో, కొత్త పరిసరాల్లో కనిపించని కటకటాల మధ్య చిక్కుకున్నట్టు ప్రవర్తించాల్సిన అగత్యం తప్పని లోకం కదా ఇది ! అలాంటి లోకంలోనే. తల్లి పొత్తిళ్ళ సులివెచ్చదనం లాంటి ఈ ఫిబ్రవరి మధ్యాహ్నపు మార్దవపు ఎండలో– వాళ్ళిద్దరూ సీతాకోక చిలుకలు ఈ మొక్క నుంచి ఆ మొక్కకూ, అక్కడి నుంచి మరో మొక్కకూ చక్కర్లు కొడుతున్నంత తేలికగా, చేపలు నీళ్ళలో ఈదినంత సహజంగా చెట్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటే ఏ మతానికీ కాక మనుషులకు చెందిన పండగ ఏదో వచ్చినంత సంతోషం వేసింది.

★ ★ ★

"వామ్మో ! అంకుల్! ఇక్కడ తేనెపట్టుంది!" ఒక్కంగలో నా దగ్గరకు వచ్చి పడింది ఓ అమ్మాయి.

"చెప్పడం మరిచిపోయాను. ఇంకా నయం తుట్టె కదల్లేదు. కదిలితే మీ పనీ, నా పనీ అయిపోయేది" అన్నాను. సీతాఫలం చెట్టు కొమ్మకు చాలాకాలంగా తేనె పట్టు పట్టింది. అది పట్టాక అన్ని రుతువులూ వచ్చి వెళ్ళాయి. అంటే ఈ పరిసరాల్లో ఒక సంవత్సర కాలంలో విరిసే అన్నిరకాల పూలమధువూ ఆ పట్టులో చేరిందన్న మాట. మా ఇంటికి వచ్చిన పిల్లలకు పనిగట్టుకుని ఆ పట్టు తేనెను రుచి చూపిస్తుంటాను. అందుకు నేనో ఉపాయం కనిపెట్టాను. పొడవాటి కర్ర చివర సన్నని పుల్ల కట్టి, తేనెటీగలు కదిలి రెచ్చిపోకుండా మెల్లగా పట్టులో గుచ్చుతాను. అంతే మెల్లగా వెనక్కి తీసి ఆ పుల్లకు అంటిన తేనెను పిల్లలతో నాకిస్తుంటాను. ఆ తేనెలోని ప్రతిబొట్టులో రకరకాల పూలసారం, సౌరభం ఉంటుంది. 'తేనెను రుచి చూసి, లొట్టలు వేసే పిల్లలు రేపు ఎదిగి, పెద్దలయ్యాక వాళ్ళ వ్యక్తిత్వాలు కూడా అదేరకంగా తోటి మనుషులకు ప్రీతికరంగా ఉంటే ఎంత బాగుంటుందో కదా!' అనుకుంటుంటాను.

"అంకుల్! పొగపెడితే తేనెటీగలు చెదిరిపోతాయంటగా. మీరూ అలా చేసి తేనె తీసుకోవచ్చుగా?" అడిగింది ఓ అమ్మాయి.

"ఛ.ఛ. అవి పువ్వు పువ్వూ తిరిగి వాటి కోసం పోగేసుకునే తిండి అది. అలా చేస్తే అన్యాయం కదా! అయినా నేనూ ఆ తేనెలో కొంత కాజేస్తుంటాను. అయితే నువ్వన్నట్టు పొగపెట్టి కాదు. అవి చెదిరిపోకుండా, పట్టును ధ్వంసం చేయకుండా కొంచెమే తీసుకుంటాను" అన్నాను.

"అదెలా అంకుల్ ?"

నా ఉపాయం గురించి చెప్పాను.

"అంకుల్! అంకుల్! నాక్కూడా అలా రుచి చూపించరా?" నా మనుమడు వాడికి ఇష్టమైన 'మాజా' కొనిపెట్టమన్నప్పుడు అడిగినంత గోముగా చనువుగా అడిగిందా అమ్మాయి. కొన్నేళ్ళ క్రితం మా స్వగ్రామంలో అమ్మవారి తిరణాలకు తీసుకు వెళ్ళినప్పుడు అప్పటికి పీజీ చదువుతున్న మా అమ్మాయి బెలూన్లు కొన్నాక బూరలూ, అవీ కొన్నాక లక్కపిడతలూ, ఆ తర్వాత జీళ్ళు మారాం చేస్తున్నట్టు అడుగుతూ కొనిపించిన విషయమూ గుర్తుకొచ్చింది. వాత్సల్యంతో మనసు పులకించిన నాకు మా మనుమడికి, మా అమ్మాయికి చేసినట్టే ఆ అమ్మాయి బుగ్గలు పుణికి, మెటికలు విరవాలన్నంత మురిపెం కలిగింది.

"ఎందుకైనా మంచిది– మీరు దూరంగా ఉండండి" అని వాళ్ళతో చెప్పి, పెరట్లో సిద్ధంగా ఉన్న పుల్ల కట్టిన కర్ర తెచ్చి ప్రహరీగోడ ఎక్కాను. పువ్వు కడుపులో తేనెటీగ దూరినంత మదువుగానే పుల్లను తేనెపట్టులోకి జొనిపాను. తేనె పుల్లను అంటుకుని బొట్లుబొట్లుగా కారింది. ఈగలు కొంచెం కదిలినా పైకి ఎగరలేదు. అతిమెల్లగా కర్రను వెనక్కి లాగి వాళ్ళ ముందు పెట్టాను. పుల్లకంటిన తేనెను చూపుడువేళ్ళతో ఊడ్చుకుని, రుచి చూశారిద్దరూ.

"అబ్బ. ఎంత థియ్యగా ఉందో ! కొన్న తేనె తప్ప ఇలా నేచురల్ గా ఎప్పుడూ రుచి చూడలేదంకుల్!" తేనె తీపి వారికి ఎంతగా నచ్చిందో లేని ఒత్తులు ఉచ్చరించి మరీ చెప్పారు. చిన్నప్పుడు మా అమ్మ చేతి సున్నుండ తిన్నప్పుడు నాకు కలిగిన ఆనందం లాంటిదే అచ్చం వాళ్ళ ముఖాల్లో కనిపించింది. కొద్దిసేపు పచ్చదనం నీడన చేరి, ప్రకతి ఫలాన్ని కొద్దిగా చవి చూసినందుకే వాళ్ళు – డ్రిల్ పీరియడ్లో పిల్లల్లా సంబరపడిపోయారు. మనుషులు నానాటికీ ఎవరి లోపలికి వాళ్ళు ముడుచుకుపోతున్నవేళ కొద్దిసేపే కావచ్చు గాక, వాళ్ళు తీర్చుకోలేని చిరుసరదా కోసమే కావచ్చు గాక ఈ అమ్మాయిలిద్దరూ నీరు పల్లానికి పారినంత, గాలి అన్ని దిక్కులకూ వీచినంత సహజంగా ప్రవర్తించడం నాకు అపురూపంగా అనిపించింది. వాళ్ళు నాకు పాఠాలు నేర్పే టీచర్లుగా కాక క్లాస్ రూమ్లో టీచర్ లేనప్పుడు హాయిగా అల్లరి చేసే పిల్లల్లా కనిపించారు.

"థేంక్స్ అంకుల్! మా పని సంగతెలాగున్నా.. ఇవాళ మీ కాలనీకి వచ్చినందుకు భలే బాగుంది" వాళ్ళలా అంటుంటే నాకు వాళ్ళ సంతోషాన్ని రెట్టింపు చేయాలనిపించింది.

"ఉండండి అమ్మాయిలూ! కష్టపడీ, ఇష్టపడీ కోశారు. చెరో కాసిని చిక్కుడుకాయలు పట్టుకెళ్తురు గాని. అలాగే మీకు బోనస్ కూడా ఇస్తానుండండి" అంటూ పెరట్లో విరగకాసిన ఉసిరిచెట్టు నుంచి నాలుగు గుత్తులు తెంపి, చిక్కుడు కాయలతో కలిపి క్యారీ బ్యాగుల్లో వేసి ఇచ్చాను.

అంతవరకూ వేకువ వేళ ఆకాశంలా కళకళలాడిన వాళ్ళిద్దరిలో ఓ అమ్మాయి ముఖం ఉన్నట్టుండి మబ్బులు కమ్మిన నింగిలా మారిపోయింది. ఆమె కళ్ళలో నీటిపొర!

"అంకుల్! మా నాన్నకు కూడా మీకులాగే మొక్కలంటే ప్రీతి. అయితే అప్పట్లో మేము అద్దెకున్న ఇంట్లో తులసి మొక్క వేయడానికి కూడా జాగా లేదు. ఇప్పుడు మేము కట్టుకున్న ఇంట్లో బోలెడు పెరడున్నా మొక్కలు పెంచడానికి నాన్నే లేరు" ఆమె కళ్ళ వెంబడి జలజలా నీరు కారింది.

దుఃఖంతో, ఆనందంతో నా కళ్ళూ చెమ్మగిల్లాయి. 'పాకే ప్రాయపు పసివాళ్ల చుటూ ముళ్ళూ, రాళ్ళూ పరిచినట్టు– మనుషుల ఆలోచనలూ, మాటలూ, ప్రవర్తనల చుట్టూ కనబడని ఆంక్షలు ఎన్ని ఉన్నాయో కదా! మనుషులందరూ తోటి మనుషుల్ని ఆడైనా, మగైనా, ఎక్కడైనా, ఎప్పుడైనా హాయిగా పలకరించి, అత్యంత సహజంగా, స్వేచ్ఛగా ప్రవర్తించగల సందర్భాలు ఎంత అరుదైపోతున్నాయో కదా! రోహిణీకార్తెలో ఎండలా ఆధునిక జీవితంలో పొడితనం నానాటికీ పెరిగిపోతోంది కదా!' అన్న ఆలోచనతో దుఃఖం! మగవాడినైనప్పటికీ ఆ అమ్మాయిలు నన్ను ఒక్క శాతం కూడా శంకించకుండా, అంత స్వల్ప వ్యవధిలోనే నాన్నలాగే నమ్మదగ్గ మనిషిలా జమ కట్టినందుకు, చివరికి వారిలో ఒకరు నా సమక్షంలో స్వేచ్ఛగా దుఃఖించగలిగినందుకు ఆనందం ! అప్రయత్నంగా ఆ అమ్మాయి నెత్తి మీద చెయ్యి వేసి నిమిరాను. మా ఇద్దరి కళ్ళలో చెమ్మ చూసి రెండో అమ్మాయి కళ్ళలోనూ కన్నీరు చిప్పిల్లింది. మా ముగ్గురి కన్నీళ్ళ తడినీ ఏదైనా పూలమొక్కకు అందిస్తే కనీసం ఓ మొగ్గ తొడగడానికి చాలదా !

# మట్టి పరిమళం  అత్తలూరి విజయలక్ష్మి

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

"రేపు రాత్రికి మనం ఊరు వెళ్తున్నాం అనూ !" ఆఫీస్నుంచి వస్తూనే చెప్పిన సారధి వైపు మింగేసేలా చూసింది అనుపమ..

"మీ నానమ్మ దగ్గరికేగా నేను రానని తెలిసీ పదేపదే ఎందుకు చెప్తారు?" అంది.

"నీకోసం కాదు బాబుకోసం నిన్ను కూడా రమ్మంటున్నాను. వాడు పుట్టిన ఈ మూడేళ్లలో ఆవిడ వాడిని చూడలేదు. చూడాలని తహ, తహలాడుతోంది. పైగా ఆరోగ్యం కూడా బాగాలేదు ఏ క్షణాన ఏమవుతుందో మొండితనం మానేసి వెంటనే బయల్దేరు.." అంటున్న సారధితో ఖచ్చితంగా చెప్పింది. "రానుగాక రాను ఆ ముసలావిడ చాదస్తం నేను భరించలేను. వాడిని కూడా తీసికెళ్లి ఆ అపరిశుభ్ర పరిసరాల్లో ఆ పిచ్చి తిండి పెట్టి ఆరోగ్యంపాడుచేయలేను" అంటూనే గిరుక్కున తిరిగి లోపలికి వెళ్లిపోయిన అనుపమ మాటలకి నిశ్చేష్టుడై చూశాడు.

నానమ్మకీ తనకీ ఉన్న అనుబంధం గురించి ఈమెకి ఎంత చెప్పినా అర్థం కాదేం.. ఏమైంది ఆ ఊరికి, ఇంటికి. అభిమానం, ఆప్యాయత రంగరించిపోసి చేసిపెట్టే కమ్మని వంటలు, ఇంట్లో పాడి అందించే కమ్మటి గడ్డ పెరుగు, చిక్కటి పాలతో స్ట్రాంగ్ గా, రుచిగా చేసిచ్చే కాఫీ ఎక్కడ దొరుకుతాయి.. ఏ మందులూ, కెమికల్స్ లేకుండా పెరట్లో నానమ్మ అనుభవంతో పండించి వండే కూరగాయలు.. ఆర్గానిక్ కూరలు తెచ్చుకుందాం బిగ్ బజార్ కి వెళదాం అక్కడ ఆర్గానిక్ కందిపప్పు కూడా అమ్ముతున్నారట అంటూ పరుగులు తీయించే అనుపమకి అసలు ఆర్గానిక్ అంటే ఏంటో తెలుసా! నానమ్మ ఏ ఎరువులూ లేకుండా పండించే కూరగాయలు ఆర్గానిక్ అంటే వినిపించుకోదు.

"అవి ఆర్గానిక్ ఏంటి? ఒక పద్ధతి, పాడూ లేకుండా మొలిచినవి. మొక్కల నిండా పురుగు, చీడా.. ఆకులు, కొమ్మలు విరిచేస్తే పోతాయా పురుగులు? బయోటెక్నాలజీ ఉపయోగించి పెంచే తోటలు, ఆ తోటల్లో పండే కాయగూరలు, ధాన్యాలు అవి ఆర్గానిక్ అంటే" అని వాదిస్తుంది.

అందుబాటులో ఉన్న ఆరోగ్యం విలువ ఆమెకి అర్థం కావడంలేదు..ఎలా చెప్తే తెలుస్తుంది! ఇప్పటికి మూడేళ్లు అవుతోంది నానమ్మని కాదని, ఆ ఊరు కాదని, ఆ ఇల్లు కాదని ఈ నగరానికి వచ్చి ఏం ఉందిక్కడ? తనకి ఎంతమాత్రం ఇష్టం లేకపోయినా అనుపమకోసం తప్పనిసరిగా ఉంటున్నాడు.. కనీసం తనకోసం ఏడాదికొక్కసారి అయినా వచ్చి నానమ్మని సంతోషపెట్టడానికి ఏమైంది? ముని మనవడు పుట్టాడని మురిసిపోయి, "ఆరోనెల్లో తీసుకురారా ఇక్కడే అన్నప్రాశన చేద్దాం నా ముచ్చటా తీరుతుంది" అని బతిమాలింది నానమ్మ ససేమిరా అంది అనుపమ.. "అమ్మో నా కొడుకుని ఆ అన్ హైజెనిక్ కండిషన్స్ లో పెంచను" అని రాలేదు.. పసివాడిని నానమ్మ ఇంతవరకు చూడలేదు.. పెద్దావిడ ఎంతకాలం బతుకుతుంది!? ఆవిడ చూడకుండా పోతే తనని తాను క్షమించుకోలేడు.

"అనూ! మళ్లీ చెబుతున్నాను. మనం వెళ్లాలి, వెళ్లి తీరాలి. నువ్వెక్కువ గొడవ చేస్తే నేను ఉద్యోగం రిజైన్ చేసి నా ఊరు వెళ్లిపోతాను" అన్నాడు తనూ మొండిగా, అతనికి ఎలాగైనా ఈసారి అనుపమని కూడా తీసికెళ్లాలని ఉంది. ఇప్పుడు ఆమె రాకపోతే నానమ్మని ఎప్పటికీ చూడలేదు అందుకైనా తనూ మొండిగా ఉండి తీసికెళ్లాలి వజ్రాన్ని వజ్రంతోటే కోయాలి గట్టిగా నిర్ణయించుకున్నాడు.

"ఎందుకు అక్కడ ఏం ఉంది మీకు మట్టి? ఏం చేస్తారక్కడికి వెళ్లి ?" మండిపడుతూ అరిచింది.

"మట్టే.. ఆ మట్టిలో బంగారం ఉంది.. అది తవ్వుకుంటాను సరేనా.. అయినా ఇక్కడేముంది? కక్షలు, కుళ్ళు రాజకీయాలు ఈర్ష్యా ద్వేషాలతో రగిలే మనుషులు . వీళ్లచేత మాటలు పడడం దేనికి? మెడపట్టుకుని వెళ్లగొట్టించుకోడం దేనికి? చూస్తున్నాగా ఈ మధ్య ప్రాంతీయగోల.." కసిగా అన్నాడు సారథి .

"నేను తెలంగాణాలో పుట్టాను.. ఇక్కడే పెరిగాను నన్నెవరూ వెళ్లగొట్టరు.. నాభర్తనీ, నా కుటుంబాన్ని కూడా ఎవరూ వెళ్లగొట్టరు ఆ మట్టి కూడు నేను తినలేను" అంటూ చాలా ఖచ్చితంగా, పరుషంగా మాట్లాడింది.

"వెళ్లగొట్టించుకునేదాకా ఉండడం ఎందుకసలు?" అన్నాడు..

"హైదరాబాదు ఎవరి బాబుసొత్తూ కాదు.. ఇది కాస్మాపాలిటన్ సిటీ.. మనం వెళ్లాల్సివస్తే ఇక్కడ ఉన్న ఎంతోమంది ఇతర మతాల వాళ్లు, జాతులవాళ్లు, రాష్ట్రాలవాళ్లు, కూడా వెళ్లిపోవాలి."

ఇలాంటి మొండిఘటాన్నిచ్చి చేసినందుకు నానమ్మనే తిట్టుకోవాలి అనుకున్నాడు సారథి. తను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అని వాదించేవాళ్లతో ఏం మాట్లాడగలడు!

నానమ్మకి తోడుగా ఉన్న ఊళ్లోనే ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసుకుంటూ హాయిగా ఉండాలనుకున్న సారధి, అనుపమ పోరుపడలేక అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఉద్యోగం చూసుకుని భార్యని తీసుకుని హైదరాబాదు వచ్చేసి కాపురం పెట్టాడు.

శివరావయ్యకి నలుగురు మగపిల్లలు, ఇద్దరాడపిల్లలు .. ఆయన మాత్రం ఒక్కడే కొడుకు. శివరామయ్య జిల్లాపరిషత్ స్కూల్లో పనిచేసేవాడు ఆయనకి తరచూ బదిలీలు అవుతుండడంతో తండ్రి పోయాక తల్లి ఒంటరిదైపోడంతో తన కొడుకుల్లో రెండో వాడైన సారధిని, మూడో కొడుకు చక్రవర్తిని తల్లి దగ్గరే ఉంచేసాడు.. పిల్లలిద్దరూ నానమ్మ దగ్గర ఉంటూ చదువు పూర్తిచేశారు. సారధి అగ్రికల్చర్లో ఎమ్మెస్సీ చేశాడు. చక్రవర్తి ఎం. ఏ. బిఇడి చేసి టీచర్ అయాడు. చక్రవర్తికి విజయవాడలో గవర్నమెంటు స్కూల్లో ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. ఆ ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు కూడా తన ఆధ్వర్యంలోనే, తనకు నచ్చిన అమ్మాయిలతోటే పెళ్లిళ్లు చేసింది. చక్రవర్తి భార్యతో విజయవాడ వెళ్లిపోయినా, సారధి మాత్రం నానమ్మ మీద ఉన్న అభిమానంతో చదువు పూర్తి అయాక "నానమ్మా నేను ఉద్యోగం చేయను ఆధునిక పద్ధతుల్లో ఎంచక్కా వ్యవసాయం చేసి మన ఊరిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాను" అనడంతో ఆవిడ ఆనందంతో ఉప్పొంగిపోయింది. ఒక మనవడు దూరం వెళ్లినా ఇంకో మనవడు ఈ చివరి రోజుల్లో తన దగ్గర ఉంటాననడంతో కొత్త శక్తి ఏదో వచ్చినట్లై ఆవిడకి ఆనందంతో కళ్లనీళ్లు వచ్చాయి.

అన్నపూర్ణమ్మకి భర్త సంపాదించి ఇచ్చిన పెద్ద ఇల్లు, కొంత డబ్బు ఉంది కాబట్టి కొడుకు సంపాదన అతని సంసారానికే సరిపోతోందని ఎన్నడూ కొడుకుని డబ్బులడగదు.. ఆవిడకి రెండు గేదెలు, ఒక ఆవు ఉంది. ఇంటి వెనకాల ఉన్న ఖాళీస్థలంలో తనకీ, సారధికీ సరిపడా ఏవో కూరగాయలు పండించుకుంటూ వాటితో కాలక్షేపం చేస్తుంది. అన్నపూర్ణమ్మ శివరామయ్యని కడుపుతో ఉన్నప్పుడు చాలా అనారోగ్యం చేసి, మనిషిపోతుందనుకున్నారు. నెలలు నిండుతుంటే మద్రాసు తీసికెళ్లి మంచి హాస్పిటల్లో చేర్పించాడు భర్త. దాదాపు నెలరోజులపాటు డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్న అన్నపూర్ణమ్మ పండంటి పిల్లాడిని ప్రసవించాక మరోసారి గర్భం వస్తే ఆవిడ ప్రాణానికి ముప్పు అని గర్భసంచి తీసేశారు.. అంచేత ఒక్కడే కొడుకు అయాడు.. చాలాకాలం "ఒక పిల్లాడు పిల్లాడా గొడ్డుమోతుకీ, ఈవిడకీ పెద్ద తేడా ఏం ఉంది!?" అనే అమ్మలక్కల మాటలు శూలాల్లా తగిలి బాధపెట్టేవి. క్రమంగా అన్నిటికీ అలవాటు పడింది..

శివరామయ్యకి పద్దెనిమిదేళ్లు వచ్చేసరికి, తన భర్తపోవడంతో, పియుసి పాసైన శివరామయ్యని టీచర్ ట్రైనింగ్లో చేర్పించింది అన్నపూర్ణమ్మ. శివరామయ్యకి టీచర్ గా ఉద్యోగం రాగానే అన్నగారికూతుర్నిచ్చి పెళ్లి చేసింది. మేనత్తే కాబట్టి రత్నమాల కూడా తన పిల్లల్ని భర్త తల్లి దగ్గర వదిలిపెడుతుంటే పెద్దగా అభ్యంతరపెట్టలేదు.

భార్యాభర్తలు మిగతా పిల్లల్నితీసుకుని వినాయకచవితి, దసరా, దీపావళి, సంక్రాంతి పండగలకే కాక శివరాత్రిక్కూడా వచ్చేస్తుంటారు.. అప్పుడు అందరూ కలుసుకుని ఆనందంగా గడిపేస్తారు.. ఇల్లంతా గంపెడు పిల్లలతో కళకళ్లాడుతుంటే అన్నపూర్ణమ్మ ఆనందానికి హద్దుండదు. ఎక్కడలేని ఓపికా వచ్చేసి రకరకాల వంటలు, పిండివంటలు చేసి పెట్టి, అందరికీ తనకి చేతనైన విధంగా కానుకలిచ్చి పంపిస్తుంది.. అందుకే నానమ్మ అంటే పిల్లలందరికీ

చాలా ఇష్టం సారధికి మరీ ఇష్టం . అందుకే ఆ ఊళ్లోనే ఉండిపోవాలని అతని కోరిక అన్నట్టుగానే ఊరి పెద్దల సహకారంతో ఏడాదిలో ఆ ఊళ్లోని పొలాల్లో బంగారం పండించాడు సారధి..

ఒకసారి ఆ ఊరికి ఏదో పనిమిద వచ్చిన ఎమ్మార్వో ఉమాపతి ఆ ఊరుని, పచ్చగా కళ,కళ్లాడుతున్న పంటపొలాలను చూసి ముగ్ధుడైపోయాడు. దీనికంతటికీ కారణం ఒక ఆధునిక యువకుడని తెలుసుకుని సారధిని చూసి ముచ్చటపడి హైదరాబాదులో ఎం బి ఏ పూర్తి చేసిన తన కూతురు అనుపమని ఇచ్చి పెళ్లి చేయాలని నిర్ణయించుకోడం, అందుకు అన్నపూర్ణమ్మగారి అంగీకారం కోరడం ఆవిడ అంగీకరించి కొడుకు, కోడలుతో కూడా అవుననిపించడం జరిగిపోయి, హైదరాబాదులో అంగరంగవైభవంగా పెళ్లి జరిగింది. తనే స్వయంగా బస్సు మాట్లాడి ఊరివాళ్లను కూడా తీసుకుని వెళ్లింది అన్నపూర్ణమ్మ.. కోడల్ని తీసుకుని తన ఊరు వచ్చేటప్పుడు వియ్యపురాలు కళ్లనీళ్లతో చెప్పింది "మా అమ్మాయికి మొండితనం ఎక్కువ తనమాటే నెగ్గాలనే తత్వం.. చిన్నపిల్ల ఏదన్నా తప్పుచేసినా పెద్ద మనసుతో క్షమించి కడుపులో పెట్టుకోండి. దానికి ఉద్యోగం చేయడం కూడా ఇష్టం లేదు పెద్ద చదువే చదివించాం ఎందుకైనా మంచిదని. దానికి తనని కూర్చోబెట్టి పోషించే మొగుడు కావాలని కోరిక చిన్నప్పటినుంచీ. భర్తంటే భార్యని పోషించేవాడు, భార్యని మనసు కష్టపెట్టకుండా చూసుకునేవాడు అని తప్ప భర్త పట్ల తన కర్తవ్యాలు, బాధ్యతలు కొన్ని ఉంటాయని కూడా తోచదు. నేను చెప్పి, చెప్పి అలసిపోయాను.. అందుకే మిమ్మల్ని చూసి నా కూతురు మీ దగ్గర సుఖంగా ఉంటుందని, దాన్ని మీరు అర్థం చేసుకుంటారని ఆశించి ఈ పెళ్లి చేశాను" అని.

దానికి అన్నపూర్ణమ్మ కూడా పెద్ద మనసుతో స్పందిస్తూ అంది.

"మీ అమ్మాయి ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు, మా ఇంట్లో దేనికీ లోటు లేదు. సుఖంగా ఉంటుంది మీరేం బెంగపెట్టుకోకండి" అని. ఆయన, ఆయన భార్యా ఆవిడ విశాలహృదయానికి మురిసిపోయారు..

అయితే అనుపమ కాపురానికి వచ్చాక కొంతకాలం బాగానే అనిపించింది.. కమ్మగా వండిపెట్టే నానమ్మ, ప్రేమగా చూసుకునే భర్త, దేనికీ లోటులేని జీవితం పుట్టినప్పటినుంచీ నగరపు గందరగోళంలో గడిపిందేమో ప్రశాంతమైన ఊరు, ఆ ఊళ్లోని మనుషులు, పచ్చటి పొలాలు ఎంతో నచ్చాయి.. పేరుకి పల్లెటూరు అయినా మూడు సినిమా థియేటర్లున్నాయి.. వారానికి రెండురోజులు సినిమాకి వెళ్లిపోతారు మొగుడూ,పెళ్లాం.. బోర్ కొట్టినపుడల్లా అలా పొలాల మీదికి షికారు వెళ్తారు. ఇప్పటిదాకా సారధి తనేం కోరినా చేస్తున్నాడు కాదని అనడంలేదు అయితే అది కొద్దికాలమే..

దానికి కారణం కొన్నాళ్లు కొత్త కదా అని వదిలేసినా అనుపమ ఇంట్లో పూచికపుల్ల కూడా తీయకుండా టి వి చూస్తూ, రేడియో వింటూ కూర్చోడం, లేకపోతే నిద్రపోడం చూసి ఈ అమ్మాయికి నెమ్మదిగా పనీ, పాటా నేర్పాలి. ఇంక ఈ ఇంటి వాతావరణానికి, పద్ధతులకి అలవాటు చేయాలి అనుకుంటూ నెమ్మదిగా అనుపమని పనిలో పడేసే ప్రయత్నం చేసింది.. ఆ ప్రయత్నంలో తనకు తెలిసిన పాత పద్ధతే పాటించింది..

ఆ పద్ధతి అనుపమకి నచ్చలేదు.."అమ్మాయ్ ఆడపిల్లవి పనీ, పాటావచ్చి ఉండాలి ఇలారా వంటలో నాకు సాయం చేయి" అంటూ పిలిచి ఆ పనీ, ఈ పనీ చెబుతూ, చేయిస్తూ ఉంటే ఆ వంటగది, కట్టెలపొయ్యి పొగ, ఓ పక్క పెద్ద రోలు, రోకలి, పొత్రం, కాఫీ డికాషన్ వడగొట్టిన బట్ట అదంతా చూడగానే ఛీ, ఛీ వంటిల్లు ఇలాగా ఉంచుకునేది ఇక్కడ చేస్తున్న వంట తింటున్నానా ఛీ అనుకుంది.

"నేనిక్కడ వంటచేయను. నాకు వంటరాదు" అని తప్పించుకోబోతుంటే

" ఇప్పుడంటే నేనున్నాను.. ఎంతకాలం ఉంటాను నేను పోతే మొగుడికి వంటచేసుకు పెట్టవూ.. ఇలారా నేను వంట చేస్తాలేగానీ పైనుంచి నాకు నువ్వు అన్నిఅందించాలి. చేతికింద సాయానికి ఉండాలి.. అలా ఊరికే కూర్చోకూడదు.. ఇలారా ఈ టమాటా పండు కుళ్లిపోయిందిగానీ తీసికెళ్లి పెరట్లో పడేసిరా ఇదిగో ఈ కాకరకాయ పండిపోయింది. ఇది కూడా పెరట్లో పడెయ్ . అలాగే కాసిని బెండకాయలు, దొండకాయలు కాసాయేమో చూసి తెంపుకురా" అంటూ పనులు పురమాయిస్తుంటే ఒళ్లు మండిపోసాగింది అనుపమకి..

వంటగదే కాదు పెరట్లోకి వెళ్లడం కూడా ఏ మాత్రం ఇష్టం లేదు అనుపమకి. కాపురానికి వచ్చిన నెలలోపలే సారధిని పోరి దక్షిణం వైపు సందులో ఓ బాత్రూమ్ కట్టించింది . లేకపోతే తడికలు దడిగా కట్టిన ఓపెన్ ఏరియాలో స్నానం చేయాల్సి వచ్చింది.

ఓ పక్క బావి, మరో పక్క పంపు, దేని చుట్టూ సిమెంటుతో హద్దులు కట్టి లేదు.. మరోపక్క గొడ్లచావిడి కాంపౌండ్ వాల్, ఆ వాల్ మీద అంటించిన పిడకలు. ఆవులు, గేదెల పేడవాసన. కాళ్ళు కడిగిన నీళ్లు, బియ్యం కడిగిన నీళ్లు, బట్టలుతికిన నీళ్లు పోసి పెంచే కూరగాయల చెట్లు.. చిత్తడిగా ఉండే నేల.. పైగా గోడమీదలకి పాకిన దొండపాదు, కాకరకాయ నుంచి కాయలు తెంపాలంటే ఆ చిత్తడిలోంచి నడవాలి. కప్పలు పెరడంతా తిరుగుతూ ఉంటాయి. ఆ పెరడు చూస్తే వాంతి వచ్చినట్టు అవుతుంది అనుపమకి. కుళ్లిన, పాడైన కూరగాయలు చెత్తలో పడేసి బైట పారేయకుండా అన్నీపెరట్లో పారేయడంతో వాసన వస్తున్నట్టు అనిపిస్తుంది అనుపమకి. ఏంటో ఈ మనిషి బొత్తిగా శుచీ, శుభ్రం లేవు అని తిట్టుకోడం దాకా వచ్చింది పరిస్థితి..

'బెండకాయలు తెంపుకొస్తే అయ్యయ్యో ఇవి ముదిరాయి రేపట్నించీఏరోజు కాసినవి ఆరోజు తెంపేస్తూ ఉండు. ఒక్కరోజు అయినా ముదిరి చస్తాయి. ఇంద తీసికెళ్లి ఇలా చీల్చి పెరటో పడేసిరా మళ్లీ మొలకలొస్తాయి. అన్నట్టు గోంగూర వలిచిన కాడలు పారేయకు కొద్దిగా తవ్వి పాతిపెట్టు మళ్లీ గోంగుర వస్తుంది' అంటూ పనిమీద పని చెబుతుంటే ఈవిడకి ఇంత కక్కుర్తి ఏంటి? పదిరూపాయలు పడేస్తే కిలోలకు కిలోలు వస్తాయి కూరలు వాటికోసం ఈ కుళ్లిపోయినవి, ఎండిపోయినవి వేయాలా? వీటితో ఎంత పంట పండిస్తుందో మహాతల్లి పిసినారి అనిపించేది.. గొడ్ల చావిడిలో పనివాడున్నా ఈవిడ ఖచ్చితంగా ఉదయమే చావిట్లోకి వెళ్లి ఈ వెధవ సరిగా పనిచేసి చావడంలేదు అంటూ చేత్తో పేడ తీసి శుభ్రం చేస్తుంటే కంపరం పుట్టేది. ఆ చేతులు డెట్టాల్తో కడుక్కోకుండా నీళ్లతో కడిగేసుకుని వచ్చి వంట చేస్తుంటే చూసిన అనుపమకి ఈవిడ ఇంత అన్ హైజెనిక్ గా చేస్తుందా వంట బాబోయ్ దీన్నేనా నేనిన్నాళ్లు లొట్టలేసుకుంటూ తిన్నాను అని భయపడిపోయింది..

అప్పటికప్పుడు ఆమెకి తన కడుపులో రక రకాల పురుగులు తిరుగుతున్నట్టు అనిపించింది.

"అమ్మో ఇలాంటి చోట తనని తీసుకొచ్చి వదిలారా అమ్మా, నాన్న.. వెళ్లిపోవాలి ఇక్కడినుంచి వెళ్లిపోవాలి" అనుకుని, వెంటనే సారధితో అంది.. "మనం వెంటనే హైదరాబాదు వెళ్లిపోవాలి తక్షణం వెళ్లాలి" అని.

"ఇక్కడ నీకొచ్చిన ఇబ్బందేంటి ?" అని అడిగిన సారధితో

"అన్ని ఇబ్బందులే అవన్నీ మీకు చెప్పినా అర్థం కావు. అయినా ఇంత చదువు చదివి పల్లెటూరి బైతులా వ్యవసాయం చేయడం ఏంటి మీరు ? మంచి ఉద్యోగాలు వస్తాయి. అప్లై చేయండి" హైదరాబాదు వెళ్దాం అంటున్న భార్యవైపు పరిశీలనగా చూస్తూ అన్నాడు సారధి..

"అనూ అలా అంటున్నావుకానీ, ఒక్కసారి అద్దంలో నిన్ను నువ్వు పరిశీలనగా చూసుకో వచ్చినప్పటికన్నా ఇప్పుడు రంగు వచ్చావు, నిగనిగలాడుతున్నావు. సన్నగా ఉండేదానివి చక్కగా ఒళ్ళొచ్చింది. ఇక్కడ మనం తినే తిండి ఆర్గానిక్ తిండి. మనం ఎటూ వెళ్లకుండా వెతుక్కోకుండా ఆర్గానిక్ తిండి లభిస్తోంది. కెమికల్స్ వేసి పండించే పంట వలన ఆరోగ్యం పాడుఅవుతుందని సూపర్మార్కెట్ వాళ్లు ఎంత ధరకు అమ్ముతున్నారు నీకు తెలియదా? నా మాట విను ఇది మరీ పల్లెటూరేం కాదు.. డెవలప్డ్ .. కాలేజీ ఉంది, మంచి హాస్పిటల్ ఉంది. సినిమా హాల్సు చూశావుగా బానే ఉన్నాయి ఉన్న మూడు, తోచనప్పుడు అలా పొలాలవైపు స్వచ్ఛమైన గాలి పీలుస్తూ నడుస్తుంటే ఎంత హాయిగా ఉంటోంది. హైదరాబాదులో ఆ ట్యాంక్ బండ్ మీద నడుస్తుంటే కంపుతో ముక్కు బద్దలైపోతుంది. వాహనాల పొగతో నిండిన కాలుష్యపు గాలి ఏం బాగుంటుంది" అంటూ నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు..

కానీ ససేమిరా అంది అనుపమ "మీ నానమ్మ చాదస్తం కన్నా నాకు ఆ కాలుష్యమే బాగుంటుంది" అంది..

అప్పటికే తెలంగాణా, ఆంధ్రా ఉద్యమం మొదలై, తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం అనివార్యం అని తెలిసిపోయిన సారధికి అనుపమ మొండిపట్టు పడుతుంటే చికాకొచ్చింది. "మళ్లీ నన్నక్కడ నుంచి ఆంధ్రావాడివని వెళ్లగొడితే ఏం చేయను?" అన్నాడు.

"ఎందుకు వెళ్లగొడతారు? వాళ్ల రాష్ట్రం వాళ్లు పాలించుకుంటాం అంటున్నారు కానీ, ఉన్న వాళ్లని వెళ్లగొడతాం అనలేదు. ఇదంతా రాజకీయ లబ్దికోసం ఏడిచే ఏడుపు కామన్ మాన్ కి వచ్చే ఇబ్బంది ఏం ఉండదు. ఎట్టి పరిస్థితుల్లో నేనిక్కడ ఉండను. మీరు రాకపోతే నేనొక్కదాన్నే వెళ్లిపోతాను" అని పంతం పట్టు పట్టడంతో అన్నపూర్ణమ్మ మనవడికి చెప్పింది "వెళ్లు నాయనా.. కొంతకాలం అక్కడా ఉండి ఆ జీవితం కూడా చూసిరా.."

నానమ్మ కూడా అలా అనడంతో సారధికి తప్పలేదు.. హైదరాబాదు వచ్చాక ఆ గందరగోళంలో అతనికి చాలాకాలం ఏమీ అర్థం కాలేదు. ఏనాడూ ఒక్క పదిరూపాయలు పెట్టి ఏమీ కొనని అతను పాలకూరకట్టలు పదికి నాలుగు కొంటుంటే గుండె ఆగిపోయింది.. ఈ లెక్కన నెలకి తనకొచ్చే జీతం సరిపోదు అనుకుని అనుపమని అడిగాడు "ఉద్యోగం చేస్తావా?" అని.

"నేనా? ఉద్యోగమా? నో నెవ్వర్.. నాకు అడ్డమైన వాళ్లనీ సార్, సార్ అంటూ వాళ్లదగ్గర పనిచేయడం అంటేనే అసహ్యం. అయినా నేనెందుకు చేయాలి? ఉద్యోగం అనేది మీ బాధ్యత. మీకు ఒండిపెట్టడం నా బాధ్యత. అంతే!" అంటున్న ఆమె వైపు ఈమె ఈ ట్వంటీయత్ సెంచరీలో ఎలా పుట్టిందిరా బాబూ అనుకున్నాడు.

సారధికి గడిచిన రోజుల జ్ఞాపకాలతో అనుపమ అంటే మొండితనానికి మారుపేరు అనిపించింది. ఈమెకి సమాధానం తనూ మొండిగా ఉండడమే అని ఆ క్షణమే నిర్ణయించుకుని అన్నాడు.

"నేను బాబుని తీసుకుని వెళ్తున్నాను. నువ్వు కూడా వస్తే బాగుంటుంది.. లేకపోతే నేను తిరిగి ఇక్కడికి రాను. మనదికాని చోట ఉండడం నాకిష్టం లేదు.."

"అంటే నా ఇష్టం లేకుండా బాబుని తీసికెళ్తారా?"

"ఏం ఎందుకు తీసికెళ్లకూడదు?వాడు నాకు కూడా కొడుకే."

"కన్నది నేను.."

"అందుకు కారణం నేను."

"అలాగా.. సరే అయితే తీసికెళ్లండి నేను మాత్రం రాను మీ ఇష్టం ఏం చేసినా సరే."

"ఏం చేస్తాను.. ఏమీచేయను మొండివాడు రాజుకన్నా బలవంతుడు" అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు సారథి

అనుపమ మండిపడుతూ చూసింది.

అన్నట్టుగానే మర్నాడు బాబుని ఎత్తుకుని, సూట్కేస్ తీసుకుని వెళ్తున్న సారథివైపు నివ్వెరపోతూ చూసింది.

"నిజంగా తీసికెళ్తున్నారా వాడిని? నాకేం విలువ లేదా ఇక్కడ?"

"నీకు ఇంతకాలం చాలా విలువ ఇచ్చాను అనూ. కానీ, నువ్వే అది నిలుపుకోడం లేదు. నేనేం శాశ్వతంగా నిన్ను వదిలి వెళ్లడంలేదుగా! నానమ్మకి ఏ క్షణాన ఏమైనా కావచ్చు. ఆవిడకి ఏదన్నా అయితే జీవితాంతం నన్ను నేను క్షమించుకోలేను. మునిమనవడిని చూడాలని ఆవిడ ఎంత తహ, తహలాడుతోందో నాకు తెలుసు. అమ్మా, నాన్న అయినా ఒక్కసారి వచ్చి చూసి వెళ్లారు కానీ, నానమ్మ అసలు చూడలేదు. నువ్వు పెద్దదానివై నీకూ మనవడు, మునిమనవడు వస్తే తెలుస్తుంది ఆవిడ బాధ." అన్నాడు సారధి. అతని స్వరంలో అణచుకున్న బాధ, వేదనా తొంగిచూసాయి. కానీ అవేం అనుపమని తాకలేదు..

"శాశ్వతంగా ఉండండి నేనేం వద్దనడంలేదు. కానీ, నా బాబుని మాత్రం నాకు ఇచ్చేసి వెళ్లండి."

"ఇవ్వను. నీ ఇష్టం నీకు రావాలనిపిస్తే ఇప్పుడు రా లేదంటే మీ తెలంగాణా వాళ్లు మెడపట్టి గెంటిందాకా ఉండి రా" అంటూ గుమ్మం దాటుతున్న సారధి మొండితనానికి నిర్ఘాంతపోయిన అనుపమ చక, చకా గదిలోకి వెళ్లి నాలుగు చీరలు, జాకెట్లు, పెటీకోట్లు ఎయిర్ బ్యాగ్లో పెట్టుకుని ఉన్నదున్నట్టు బయలుదేరి సారధిని కలుసుకుని అతడిని అనుసరించింది.

ఆమె అలా రావడంతో సారధికి విజయం సాధించానన్న తృప్తితో పాటు ఆనందం కూడా కలిగింది. బస్సులో పక్కన కూర్చున్న భార్యతో థాంక్స్ అన్నాడు.

విసురుగా అంది అనుపమ "మీకోసం రావడంలేదు. నా కొడుకు కోసం వస్తున్నాను. అక్కడికి తీసికెళ్లి ఆ పేడ, మురుగులో నా కొడుకుని పడేస్తారేమో అనే భయంతో వస్తున్నాను."

పోనీలే ఎలా అయితే ఏం వస్తున్నావు చాలు అనుకున్నాడు సారధి మనసులో..

కానీ బాబుని ఒళ్ళో పెట్టుకుని ముభావంగా కూర్చుని,మధ్య, మధ్య కళ్ళు తుడుచుకుంటున్న అనుపమని చూడగానే జాలేసి అన్నాడు మృదువుగా..
"అనూ చదువుకున్న దానివి, నువ్వు ఒక మామూలు స్త్రీలా ప్రవర్తిస్తున్నావు. పెద్దావిడ ఆవిడ భావాలు అర్థం చెసుకోకపోతే ఎలా? ఎనభై ఆరేళ్లు ఆవిడకి ఎంతకాలం బతుకుతుంది చెప్పు. పెంచిన నామీద, రక్తసంబంధంతో కూడిన మమత వాడిమీదా ఆవిడకి ప్రేమ ఉండదా?"

"నేను పరాయిదాన్ని కదా.. నామీద లేదుగా! నేనెందుకు రావాలి?" చటుక్కున అడిగింది.

ఆమె వైపు నిశితంగా చూస్తూ అన్నాడు "ఆ ప్రశ్నకి నీకే తెలుస్తుంది సమాధానం కొంచెం ఆలోచిస్తే.."

అనుపమ మాట్లాడకుండా కిటికీలోంచి బైటకి చూస్తూ కూర్చుంది. అద్దాల్లోంచి సిటీ లైట్లు ధగ, ధగా మెరిసిపోతున్నాయి. బస్సు దిల్సుక్ నగర్ డిపో దాటి ముందుకు వెళ్లిపోయింది గమనించలేదు కానీ, దాదాపు రామోజీఫిల్మ్ సిటీకి చేరుతోంది..

ఏసి చల్లగా తగులుతోంది..

సారధి మీద పీకలదాకా కోపం వచ్చింది అనుపమకి. నానమ్మ, నానమ్మ అంటూ చిన్నపిల్లాడిలా ఆవిడ దగ్గరకు ఈ పరుగులేంటో! అయినా ఎనభై ఏడేళ్లు వచ్చినావిడకి ఆరోగ్యం బాగాలేకపోడం అనేది చాలా కామన్. దానికోసం ఈయన ఆఫీసుకి లీవుపెట్టి మరీ వెళ్లాలా? పైగా మా ఊరు వెళ్తాను, మా ఊరు వెళ్తాను అక్కడే హాయిగా పంటలు పండిస్తాను అంటూ గెంతులొకటి. వెళ్లి చూస్తే తెలుస్తుంది. ఇదివరకంటే అక్కడే పుట్టి పెరిగాడు కాబట్టి హాయిగా ఉన్నాడు. ఇప్పుడు మూడేళ్ల నుంచీ హైదరాబాదు వాతావరణం, ఇక్కడి జీవనవిధానం, ఈ సౌకర్యాలు ఇవన్నీ చూశాక అక్కడ ఉంటాడా చూద్దాం ఎలా ఉంటాడో! అసలు ఈ మూడురోజులు ఎలా ఉంటాడో చూస్తాను. కనీసం ఒక్కసారన్నా ఖచ్చితంగా అంటాడు తనతో "అనవసరంగా వచ్చాను అనూ! ఉండలేకపోతున్నాను" అని అనుకుంది అనుపమ. ఆలోచిస్తుండగానే కళ్లు మూతలు పడ్డాయి..

మెలకువ వచ్చేసరికి బస్సు గుంటూరుచేరింది.. అక్కడి నుంచి మరో బస్సు ఎక్కాలి.. అదృష్టవశాతూ కావాల్సిన బస్సు వెంటనే దొరికింది. గబ, గబా సారధి బాబునెత్తుకుని ఎక్కి, అనువమకి సీటు పెట్టాడు. అనుపమ కూడా ఎక్కి మొహం చిట్లించుకుని వచ్చి కూర్చుంది.

ఓ గంటలో వాళ్ళు దిగాల్సిన ఊరు రావడంతో దిగేసారు. అటుగా వచ్చిన రిక్షా సుబ్బయ్య సారధిని చూసి గుర్తుపట్టి ఆప్యాయంగా నవ్వుతూ రిక్షా తీసుకొచ్చి సారధి చేతిలోంచి, అనుపమ చేతిలోంచి బాగులందుకుని రిక్షాలో పెట్టాడు. "బాబునివ్వండి" అంటూ చేతులు చాపుతోంటే అనుపమ చటుక్కున తను ఎత్తుకుని రిక్షా ఎక్కింది ఆ మట్టి చేతుల్తో ఎత్తుకుంటాడు కాబోలు అనుకుంటూ..

సారధి కూడా "రిక్షా ఎక్కి పోనీయ్" అన్నాడు.

మూడేళ్ల నాడు ఎలా ఉందో అలాగే ఉంది ఊరు. కాకపోతే అక్కడక్కడా ఆటోలు కనిపిస్తున్నాయి. కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు సైకిళ్ల మీద చుడీదార్లు వేసుకుని వెళ్తున్నారు. పొలాల మీంచి చల్లగాలి వీస్తోంది. అనుపమకి చాలా హాయిగా, ఆహ్లాదంగా అనిపించింది కానీ, ఆ మాట పైకి అనడానికి పౌరషం అడ్డొచ్చింది.

ఇల్లు చేరేటప్పటికి మావగారు, అత్తగారు, మరుదులు, తోటికోడళ్ళు, ఆడపడుచు అందరూ కనిపించి ఆశ్చర్యంతో పాటు కొంత ఆందోళన కూడా చోటు చేసుకుంది అనుపమ మనసులో. సారధి అందర్నీ చూసి గాభరాగా అడిగాడు "నానమ్మకెలా ఉంది?"

అంటూనే ఎవరి సమాధానం ఆశించకుండా లోపలికి పరిగెత్తాడు.. అన్నపూర్ణమ్మ మంచం మీద ఉంది..

సారధి వెనకే బాబునెత్తుకుని గదిలోకి వచ్చిన అనుపమ స్థాణువైపోయింది..

మంచానికి అంటుకుని పడుకుని ఉందావిడ. మంచం పక్కన స్టూలు మీద మందులు, మంచినీళ్ల గ్లాసు .. ముడతలు పడిన మొహం చూస్తుంటే ఆవిడ మాటలు చెవుల్లో గింగురుమన్నాయి. "ఈ వెధవ టమాటా కుళ్లిచచ్చింది. దీన్ని తీసికెళ్లి ఆ పెరట్లో పారెయ్.."

అచ్చు కుళ్లిన టమాటాలాగే ఉంది ఆవిడ మొహం. అనుపమ ఒళ్లు జలదరించింది. ఆ పరిసరాలు, వాతావరణం బాబుని ఎక్కడ దింపాలో, ఎక్కడ కూర్చోబెట్టాలో అర్థం కాలేదు. ఇల్లంతా జనం. ఈవిడ పోతుందో, పోదో కానీ ఏడాదికోసారి హడావుడి చేసి అందర్నీ పిలిపించుకోడం బాగా అలవాటైనట్టుంది. ముసలమ్మ తక్కువదికాదు తిట్టుకుంది అనుపమ. అందరూ అటూ, ఇటూ తిరగడంతో అంతా మట్టి, మట్టిగా ఉంది అందుకని వాడిని ఎత్తుకునే లోపలికి వెళ్లింది. వాడిని ఎత్తుకునే నిలబడ్డది.

అనుపమ వెనకే వచ్చిన ఆడపడుచు బాబుని అనుపమ భుజం మీద నుంచి తీసుకుంటూ "బుజ్జిగాడొచ్చాడే .. కన్నగాడు" అంటూ అన్నపూర్ణమ్మ మంచం దగ్గరగా వెళ్లి "నానమ్మా . ఇదుగో నీ మునిమనవడు .. లె, లేచి కళ్లు తెరువు" అంది ..

అనుపమకి కాళ్లు, చేతులు వణికాయి. ఆడపడుచుని ఈడ్చి తన్నాలనిపించింది. రోగిష్టి మనిషి దగ్గరకు పసివాడ్ని అలా తీసికెళ్లడమేనా, వాడికి ఏదన్నా అయితే ! పిల్లలకి ఇన్ఫెక్షన్స్ త్వరగా వస్తాయి. ఈ మనుషులు నిజంగా పల్లెటూరి వాళ్లంటే పల్లెటూరివాళ్లు అనుకుంటూ బాబుని తీసుకోడానికి మంచం దగ్గరకు నడవబోతుంటే అత్తగారు వచ్చి అంది "రామ్మా అనూ.. మొహం కడుక్కో స్నానం కూడా చేస్తే చేసెయ్ నీళ్లు కాగి ఉన్నాయి. కాఫీ తాగుదువుగాని" అంది..

సారథి మంచం దగ్గరగా వెళ్లి డగ్గుత్తికతో పిలిచాడు "నానమ్మా" అంటూ ..

ఆవిడ నెమ్మదిగా కళ్లు తెరిచింది. సారథి కళ్లు మెరిసాయి. చెల్లెలి చేతిలోంచి బాబునందుకుని ఆవిడ దగ్గరగా చూపిస్తూ

"ఇదుగో నీ ముని మనవడు" అన్నాడు. ఆవిడ గాజుకళ్లలో రెప్పపాటుకాలం ఆనందం. తరవాత కన్నీళ్లు వచ్చాయి. వణుకుతున్న స్వరంతో

" నా తండ్రిని ఎత్తుకోలేనురా నాయనా! అయిపోయింది.. ఇంక ఆ దేవుడు పిలుస్తున్నాడు వెళ్లిపోతున్నాను" అంది.

"అలా అనకు నానమ్మా! ఎక్కడికీ వెళ్లవు నువ్వు నా దగ్గరే ఉంటావు. నిన్ను హైదరాబాద్ తీసికెళ్తాను" ఏడుస్తూ అన్నాడు సారథి.

జీవం లేని ఆ మొహంలో నవ్వు శవం దగ్గర వెలుగుతున్న దీపంలా అనిపించింది అనుపమకి. గిర్రున తిరిగి అక్కడినుంచి వెళ్లిపోయింది. "తీసుకురా.. నేను ఇంట్లోంచి వెళ్లిపోతాను" అనుకుంది కసిగా.

"నానమ్మా." అన్నాడు సారథి పొంగివస్తున్న దుఃఖంతో.

"నాన్నా! మీ ఆవిడకి నచ్చచెప్పి ఇక్కడికి వచ్చెయ్. ఈ ఇల్లు నీకే రాశాను. అయిదరాబాదులో ఉండలేవు. అది మనదికాదు. మనవాళ్లు ఎవరూ అక్కడ లేరు. మనకక్కడ స్థానబలిమి ఉండదు నాయనా! ఆంధ్రులంటే ఆత్మాభిమానం, పౌరుషం ఉన్నవాళ్లు – అక్కడ అందరూ ఆంధ్రావాళ్లు, ఆంధ్రావాళ్లు అంటూ వాగుతున్నారుటగా. మన దేశం వాళ్ల దేశం వేరు, వేరుటగా ఇకనుంచీ వాళ్లచేత మాటలు పడుతూ ఎందుకురా అక్కడ? నా మాట విని వచ్చేయండి నాన్నా. మన దేశానికి వచ్చేయండి మనకేంరా మహారాజులం దర్జాగా బతకచ్చు ఇక్కడ" అంది.

సారథికి ఉప్పెనలా ముంచుకొచ్చింది దుఃఖం.. "అలాగే నానమ్మా" అన్నాడు. ఆవిడ మాటలు, సారథి దుఃఖం ఎంత ఒద్దనకున్నా వినిపిస్తుంటే అనుపమకి అయోమయంగా అనిపించింది.

వాళ్ల మాటలు వింటూ శిలలా నిలబడిన అనుపమకి అత్తగారు టవల్ అందిస్తూ అంది "వెళ్లమ్మా.. నువ్వు వెళ్లి మొహం కడుక్కో.."

అనుపమకి సారథి అలా ఏడుస్తుంటే తిక్కరేగుతోంది. ముసలావిడ పోక ఇంకా ఉంటుందా? ఈయనకేం పిచ్చా ఆ ఏడుపేంటి? అనుకుంటూ బాగ్లోంచి బ్రష్, టంగ్ క్లీనర్ తీసుకుని కొత్తగా కట్టిన బాత్ రూమ్ లోకి వెళ్లిపోయింది.

అనుపమ స్నానం చేసి వచ్చేసరికి సారథి బ్రష్ చేసుకుని వచ్చాడు. అతను కాఫీ తాగుతున్నాడు. బాబుకి పాలు పడుతోంది ఆడపడుచు. అనుపమకి మతిపోయింది "బాబుకి ఏం పాలు పడుతున్నారు?" అడిగింది అత్తగారిని.

"ఏం పాలేంటమ్మా! ఆవుపాలకన్నా శ్రేష్టమైనవి ఏమున్నాయి? మన ఇంటి పాడి, కమ్మటి పాలు అడిగి మరీ తాగుతున్నాడు" అంది నవ్వుతూ..

అనుపమ కోపం అణచుకుంటూ అక్కడినుంచి వెళ్లిపోయింది.

కాస్సేపటికి అత్తగారి పిలుపు వినిపించింది "అమ్మాయ్ అనూ.. రామ్మా ఇడ్లీ వేడిగా ఉంది తిందువుగాని.."

అనుపమ వీధివాకిలి అరుగుమీద కూర్చుని వీధిలో తిరుగుతున్న జనాన్ని, పశువులని, పక్షులని చూస్తూంది. ఆమె మనసు కుత కుతలాడుతోంది. ఇంక ఇక్కడ తనమాట ఎవరూ వినరు విన్నా విలువ ఇవ్వరు. బాబుని కూడా తన చేతుల్లోంచి లాగేసుకుని వాళ్ల దగ్గరే పెట్టుకున్నారు. వాళ్లకి తోచిన తిండి పెడుతున్నారు. వాడి ఆరోగ్యం ఏమన్నా కావాలి వీళ్ల సంగతి తీస్తాను" అనుకుంటోంది.

వెనకనుంచి వచ్చిన సారథి "అనూ వినిపించడం లేదా!? అమ్మ పిలిచింది నేను పిలిచాను. ఏంటి ఇక్కడ ఏం చేస్తున్నావు?" అడిగాడు.

అనుపమ విసురుగా తలతిప్పి చూసి "గాడిదలు కాస్తున్నాను. నా జోలికి రాకండి వెళ్లండి మీ నానమ్మ దగ్గరకు. ఛీ, ఛీ డిసిప్లిన్ లేదు నీట్ నెస్ లేదు ఎవరికీ. ఈ మురికి మనుషుల దగ్గరకు వద్దన్నా తీసుకొచ్చారుగా! ఇంక నా జోలికి రావద్దు" అంది.

సారధికి అర్థమైంది. అలిగింది బాబుని అందరూ ఎత్తుకుని తిప్పుతూ వాళ్లే పాలు తాగిస్తున్నారు. వాళ్లే ఇడ్లీ పెట్టారు నీళ్లుపోసారు. ఇప్పుడు ఆమెని బతిమాలే సమయం కాదు, సందర్భం కాదు. అందుకే అన్నాడు నెమ్మదిగా "అలిగితే అలిగావుకానీ వచ్చి టిఫిను తిను."

తినను గట్టిగా అంది అనుపమ "తినను వెళ్లండి మీ ఇష్టం వచ్చినట్టుచేసుకోండి"

"ఏంటి అనూ ఈ మొండితనం.."

"అవును నేను మొండిదాన్నే సరేనా.."

సారధి చేసేది లేక లోపలికి వెళ్లాడు . అతనికి ఎదురు వచ్చిన చెల్లెలు శోభ ఏంటి సంగతి అన్నట్టుగా చూసింది.

"ఏముంది? మీ ఒదిన మొండిది. ఆవిడ ఏదంటే అదే కరెక్ట్ అనాలి అనకపోతే అలుగుతుంది. ఆవిడ కుందేలుకు మూడేకాళ్లంటే నాలుగోది విరగ్గొట్టి అయినా మూడేఅనాలి" అంటూ నానమ్మ గదిలోకి వెళ్లిపోయాడు..

అనుపమ టిఫిను తినకుండా అలా పంతం పట్టి కూర్చోడంతో విషయం అర్థం అయిన అత్తగారు పిల్లవాడిని తీసుకొచ్చి ఆమె చేతికి ఇచ్చింది..

"రామ్మా లోపలికిరా.. ఇక్కడ కూర్చుంటే బాగుండదు. ఇది పల్లెటూరు. ఎవరన్నా ఏమన్నా అనుకుంటారు" అంటూ బలవంతంగా లోపలికి తీసుకుపోయింది.

ఆ సాయంత్రానికి తెలిసిన సంగతి ఏంటంటే అన్నపూర్ణమ్మ పెరట్లో పనిచేస్తు, చేస్తూ జారి పడింది. మోకాలు వాచిపోయింది, నడుం విరిగింది. దానివలన జ్వరం వచ్చింది. దాంతో ఖంగారు పడి అందరికీ ఫోన్లు చేయించింది. అది విన్న అనుపమకి అరికాలి మంట నెత్తికెక్కింది. ఈవిడకి ఎప్పుడో నాన్నా పులి కథలోలా అవుతుంది అనుకుంది. ఆయుర్వేద వైద్యుడు శంకరాచారి వచ్చి రెండుపూట్లా కాళ్లకి ఏదో మూలికల నూనెతో మర్దనా చేసి, మందులిచ్చి వెళ్తున్నాడు.

రెండు రోజులు గడిచాయి. అనుపమ సంగతి తెలిసిన ఇంటిల్లిపాదీ బాబుని ఎత్తుకోడం మానేసారు. ఆమెతో జాగ్రతగా మెలగసాగారు. అన్నపూర్ణమ్మ కొంచెం కోలుకుంది. గాజు కళ్లల్లో కొంత వెలుగు వచ్చింది.

ఆరోజు సోమవారం సాయంత్రం బస్సుకి సారధి కుటుంబం బయలుదేరాలి. శంకరాచారి వచ్చి, కాళ్లకి మర్ధనా చేసి "మామ్మగారూ! మీ ముద్దుల మనవడొచ్చాడు. ముని మనవడు వచ్చాడు ఇంక లేచి తిరుగుతారా? నాలుగు అడుగులు వేయండి నెప్పి తగ్గిందేమోచుద్దాం" అన్నాడు.

ఆవిడ అంటోంది "నాలుగేం ఖర్మ నలభై అడుగులు వేస్తాను. నా బుజ్జికన్న వచ్చాడు.నా ఇంట్లోవెలుగొచ్చింది"

"నాకు తెలుసులెండి మీరు నడవగలరని. మీకేమండి ఇనపశరీరం మీది. సారధీ! మీ నానమ్మ ఇంకా పదేళ్లు గ్యారంటీనయ్యా. ఆవిడ తినే తిండి మామూలు తిండా!? ఈ రోజుల్లో మందులు వేసి కృత్రిమంగా పండించిన పంట తాలూకు ధాన్యాలు, కూరలు, పండ్లు తింటూ మనుషులు అర్ధాయుష్కులై పోతున్నారు. ఉన్నవాళ్లకి చిన్న వయసులోనే బిపి లు షుగర్లు. మీ నానమ్మగారు ఆవిడ చేతుల్లో స్వయంగా పండించుకున్నవి తిని ఎంత ఆరోగ్యంగా ఉన్నారో! ఇంక నా అవసరం ఏం లేదీవిడకి" అంటూ ఉంటే అందరి మొహాల్లో ఆనందం పొంగిపోసాగింది..

బాబుకి అన్నం తినిపిస్తూ ఎత్తుకుని అటూ, ఇటూ తిరుగుతున్న అనుపమకి వాళ్ల నవ్వులు, ఆచారి మాటలు చిరాకేసాయి. ఆ మాటలు వినిపించకుండా వంటింటి తలుపు తీసుకుని పెరటి గెటు దగ్గరకు వచ్చింది. అక్కడి దృశ్యం చూసి స్థాణువైపోయింది. ఆమె వచ్చిన దగ్గర్నించీ పెరటివైపు వెళ్లకుండా జాగ్రత్తపడింది. ఆమెకి తెలుసు అటువెడితే తనకి తిండి సయించదని.

ఈ మధ్య పెరడు కాంపౌండ్ వాల్ అవతల ఉన్న ఖాళీ స్థలంలోంచి కుక్కలు, పందికొక్కులు వచ్చేస్తున్నాయని పెరటివైపుకి ఓ చెక్కగేటు పెట్టించారని ఆగేటు తీసుకుని వెళ్లి తోటికోడలు కూరగాయలు తెంపుకుని రావడం చూసింది అనుపమ. కాకపోతే ఆ గేటు తీసినవాళ్లు ఎప్పటికప్పుడు వేసేసి వస్తున్నారు. అందుకే అనుపమకి అటు వెళ్లినా పెరడు కనిపించలేదు ఈ రెండు రోజులూ.

ఈ రోజు ఎవరు తీశారో వేయలేదు. తెరిచి ఉన్న గేటులోంచి కనిపిస్తున్న పెరడుని అనుపమ కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది పచ్చని ఆకుల్లో, రంగు, రంగుల పూలతో విరగపూసిన కాయగూరల మొక్కలతో నిండి పక్షుల కిల,కిలారావాలతో శోభాయమానంగా, ఆహ్లాదకరంగా ఉన్న

ప్రకృతిసోయగం. ఎంత బాగుంది పెరడు! ఏంటి ఇన్ని చెట్లు, ఇన్ని మొక్కలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఇంత పరిశుభ్రంగా ఎలా ఉంది? ఈ పక్షులన్ని ఎక్కడినుంచి వచ్చాయి.

నెమ్మదిగా అటు నడిచింది. ఏపుగా పెరిగిన గన్నేరు చెట్టుమీద పక్షిగూడు అందులో కువ,కువలాడుతున్న పక్షిపిల్లలు. వాటిని చూడగానే అనుపమ విప్పారిన మొహంతో బాబుకి వాటిని చూపిస్తూ చుట్టూ చూసింది.

ఓ పక్క కాకర తీగ, చిక్కుడు తీగ, దొండపాదు, బెండపాదు, టమాటా మొక్కలు, దోసపాదు. మరో పక్క సన్నజాజి తీగ, గులబీలు. బావికి వెనగ్గా ఏపుగా పెరిగిస సపోట, జామచెట్ల నిండా విరగకాసిన జామకాయలు, సపోటాలు పక్వానికి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. అప్రయత్నంగానే ఆమె పాదాలు ఆ వైపు నడిచాయి. విరగకాసిన చిక్కుడుకాయలు, ఆకు, ఆకుచాటునా తొంగిచూస్తున్న దొండకాయలు, దోరగా పండి దోబూచులాడుతున్న టమాటాలు, తీగమీదా, నేలమీదా బరువుగా జారుతూ తొటి చెలిమొక్కలతో బంతులాడుతున్న దోసకాయలు....

ఎక్కడివివన్ని ..! ఎలా అయింది ఈ కుళ్ళు కంపు కొట్టే పెరడు ఇలా ఇంత పచ్చ, పచ్చగా, ఎఱ్ఱ, ఎఱ్ఱగా కళ,కళ్లాడుతూ!!?? ..

కళ్లప్పగించి నిలబడిపోయిన అనుపమ భుజం మీద చేయేసి అంది తోటికోడలు మీర "నానమ్మగారు కుళ్లిన టమాటాలు, పండిన కాకరకాయలు పాడైపోయిన బెండకాయలు పడేసి పెంచిన తోట అనుపమా ఇది. ఆవిడకి గొప్పులు తీయడం, విత్తనాలు నాటడం, మందులేయడం ఏమీ తెలియదు. దోసకాయ తరిగి ఆ గింజలు తీసి చల్లేది ఇక్కడంతా. ఎన్ని దోసకాయలో ఊరంతా పంచిపెట్టినా కాస్తూనే ఉంటాయి. నీకు తెలుసా.. ఈ చుట్టుపక్కల వాళ్ళెవరూ కూరగాయలు ఎక్కడా కొనరు. ఇక్కడినుంచే కావల్సినన్ని తెంపుకుని వెళ్తారు. పాపం నానమ్మగారు ఒక్కరే వండుకోలేరని వాళ్లే వండి ఆవిడకీ ఇంత తీసుకొచ్చి ఇస్తూ వచ్చారు. నానమ్మ సారధి వెళ్లిపోయాక చాలా బాధపడింది. అక్కడినుంచే ఆవిడకి అనారోగ్యం కూడా మొదలైంది. అంతకు ముందు తలనొప్పి అని కూడా ఎరగదు."

అనుపమ సమాధానం చెప్పలేదు.. ఆమెకి చిత్రంగా ఉంది. తమాషాగా ఉంది. ఏదో తెలియని అనుభూతితో మనసంతా నిండి పోయింది. ఆచారి మాటలు, తోటికోడలు మాటలు పదే, పదే చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే అన్యమనస్కంగా ఉండిపోయింది..

సాయంత్రం ఆరు దాటింటి. సారధి సాయంతో కఱ్ఱ పట్టుకుని నడిచి వచ్చి హాల్లో కూర్చుంది అన్నపూర్ణమ్మ. పిల్లలు, పెద్దలు అందరూ ఆవిడ చుటూ కూర్చున్నారు.

"నేనివాళ వెళ్లిపోతున్నాను నానమ్మా" అన్నాడు సారధి.

ఆవిడ ఏం మాట్లాడలేదు.. కొద్దిసేపటికి అంది "తప్పదుగా నాయనా! పట్నం ఉద్యోగం కదా. నీ పై వాడికి సమాధానం చెప్పకోవాలాయె. కానీ వెళ్లు ఏం చేస్తాం" అంది నిర్లిప్తంగా..

సారధికి బాధగా అనిపించింది. ఏం మాట్లాడకుండా అక్కడి నుంచి లేచి పడకగది గుమ్మంలో నిలబడి చూస్తున్న అనుపమతో అన్నాడు "సామాను సర్దావా ?"

"ఏం సామాను ?" అడిగింది అనుపమ.

సారధి చికాగ్గా చూసాడు.. "వెళ్లిపోతున్నాంగా ఇంకా అలకేనా ! సామాను సర్దు.. దేనికీ సమాధానం తిన్నగారాదు" అన్నాడు.

"మీ సామాను సర్దుకోండి నేనూ, నా కొడుకూ ఇక్కడే ఉంటాం" అంది తప్పటడుగులు వేస్తూ అటుగా నడిచి వచ్చిన బాబుని ఎత్తుకుని అన్నపూర్ణమ్మ దగ్గరకు నడుస్తూ ..

సారధి ఏమీ అర్థంకానివాడిలా భార్యవైపు అయోమయంగా చూడసాగాడు..

అనుపమ అడ్డుగా ఉన్న వాళ్లని దాటుకుంటూ అన్నపూర్ణమ్మ దగ్గరకు వెళ్లి బాబుని ఆవిడ ఒడిలో కూర్చోబెట్టి తాను ఆవిడ పాదాల దగ్గర చతికిలబడి అంది "నానమ్మగారూ ! ఇవాళ నాకు మీ చేత్తో చేసిన పొట్లకాయ పెరుగుపచ్చడి తినాలని ఉంది.." సారధి నోరు తెరుచుకుని చూస్తూ ఉండిపోయాడు..

# అప్పివ్వనివాడు మిత్రుడు

డా. జల్లా నాగరాజు

"విన్నపాలు వినవలె...వింత వింతలూ..." అంటూ సెల్ ఫోను శ్రావ్యంగా మోగింది. అటువైపు నా బాల్య మిత్రుడు కిషోర్. ఒకసారి ఫోన్ చూసి, చిరాగ్గా పక్కన పెట్టాను.

"ఇవన్నీ ఏం చేయమంటావు....ఇంట్లో నీ పాత పుస్తకాలే ఎక్కువైపోయాయి.." అల్మారా తీసి చూపించింది అమ్మ. అవన్నీ నా బుక్స్, నేను వైజాగులో చదువుకుంటున్నపుడు నాన్న నాకోసం సేకరించిన పాత ఈనాడు ప్రతిభ, కాంపిటిషన్ బుక్స్, ఎంప్లాయిమెంట్ న్యూస్, వగైరాలు.

"ఎవరైనా స్టూడెంట్స్ కిచ్చేయి" బట్టలు సర్దుతూ అన్నాను. "నాన్న ఎక్కడ?"

"ఇంకా ఆఫీస్ నుంచి రాలేదు. వచ్చేటపుడు బజారు నుంచి నీకు పూతరేకులు తెస్తానన్నారు..స్టేషన్ కి వస్తానన్నారు.." పచ్చడి సీసాలు వేరే సంచిలో సర్దింది అమ్మ.

"ఎందుకమ్మాఅవన్నీ ఇప్పుడు? ఆయన్ని కొంచెం త్వరగా ఇంటికి వస్తుండమను ఆఫీసునుంచి... సరే నేను దివాకర్ వాళ్ళింట్లో డిన్నర్ చేసి బయల్దేరతా... మా బాచి అంతా ఇవాళ కలుద్దాం అనుకున్నాం...".

చేతిలో కొబ్బరినూనె సీసాతో ప్రత్యక్షం అయింది అమ్మ. నేను భయంతో కొంచెం దూరంగా జరిగా. పావు సీసాకి తక్కువ రాయదు. ఇప్పుడు రాయించుకుంటే వారం రోజులు జుట్టు పడుకుంటుంది మరి.

దేవుడి దగ్గర దణ్ణం పెట్టిస్తూ అంది "బుజ్జిగాణ్ణి, అమ్మాయిని ఈసారి పండక్కి తీసుకురా....వాణ్ణి చూడాలని ఉంది...".

సరే అంటూ బయల్దేరాను. అమ్మ సర్దిన మూడు బాగులు హాల్లో వెయిట్ చేస్తున్న నా మిత్రుడు దివాకర్ అందుకున్నాడు. అమ్మ కన్నీళ్ళు తుడుచుకొంటూ ఎదురు రాగా నేను, దివాకర్ వాడి కార్లో బయల్దేరాం.

మేం దివాకర్ వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి మరో మిత్రుడు రాంబాబు సరంజామాతో సిద్ధంగా ఉన్నాడు. దివాకర్ వాళ్ళ ఆవిడని, పిల్లల్ని పలకరించాక ముగ్గురం పైన డాబాకి చేరుకున్నాం. చల్లటి సాయంత్రం వేళ దూరంగా కనిపిస్తున్న గోదారి నుంచి గాలితెమ్మెరలు ముఖాన్ని తాకుతున్నాయి. అక్కడక్కడా విహరిస్తున్న తెరచాప పడవలు... గూటికి చేరుకోవడానికి అటూ ఇటూ ఎగురుతున్న పక్షులూ...అదొక కాన్వాస్ చిత్రంలా ఉంది. "ఈసారి మన పార్టీ లాంచీలో పెట్టించు గురూ..." వళ్ళు విరుచుకుంటూ అన్నాను.

"ఏం సైంటిస్ట్. ఎలా ఉంది నీ ఢిల్లీ జీవితం?" పెగ్గులు కలుపుతూ అడిగాడు దివాకర్.

నేను చిన్నగా నవ్వాను. "మా జీతం గాళ్ళకు ఏముందిరా...అంతా రొటీనే...నీ సంగతి చెప్పు. కొత్తగా ఏం కడుతున్నావ్..."

"ఆడికేంటేహే... మొన్నే ఒక అపార్ట్ మెంట్ పూర్తి చేసాడు. ఇప్పుడు ఇంకోటి మోరంపూడిలో..." ఇకిలించాడు రాంబాబు. దివాకర్ ఈమధ్యే నగరంలో ప్రసిద్ధ బిల్డర్ గా ఎదుగుతున్నాడు.

ఇంతలో దివాకర్ ఫోన్ మోగింది. దివాకర్, రాంబాబు మిలిటరీ జవానుల్లాగా లేచి నిలబడ్డారు.

"జగదీష్ వస్తున్నాడ్రా...రారా కిందికి వెళ్దాం" రాష్ట్రానికి ముఖ్యమంత్రి వస్తున్నట్లు చెప్పాడు దివాకర్. నేను అయిష్టంగానే వాళ్ళను అనుసరించాను. మేము గేటు దగ్గరికి చేరేసరికి బ్లాక్ కలర్ ఆడి ఒకటి వచ్చింది. మరొక పాత మిత్రుడు, ప్రస్తుతం కార్పొరేటరుగా ఉన్న జగదీష్, అతని పిఏ కారు దిగారు. జగదీష్ నాతో చేతులు కలిపాడు.

"చాలాకాలానికి కలిసాం...కంగ్రాట్స్ గురూ. కార్పొరేటర్ గా గెలిచినందుకు.." అభినందించాను.

జగదీష్ గర్వంగా నవ్వాడు.

"పైకి వెళ్దాం వస్తారా?..." గౌరవంగా పిలిచాడు దివాకర్. రాంబాబు వినయంతో సగం వంగాడు. మా వాళ్ల అతి గౌరవం చూసి నాకు మండింది. 'ఒక సైంటిస్ట్ కన్నా పొలిటికల్ ఫిగర్ కే ఈ సొసైటీ లో ఎక్కువ విలువ కదా' అనుకున్నా.

"మరోసారి. ఎమ్మెల్యే గారితో ఇప్పుడు మీటింగ్ ఉంది. సుబ్బుని కలుద్దామని వచ్చా."

సుబ్బు అంటే సుబ్రహ్మణ్యం అనుకునేరు. కాదు. నేను సుబ్బారావుని.

నా వైపు తిరిగాడు జగదీష్. "నీ సైట్ ఏదో లిటిగేషన్ లో ఉంది అని దివాకర్ చెప్పాడు. ఏదైనా హెల్ప్ కావాలా?" నా భుజం మీద చేయి వేసాడు.

"అదేమంత ప్రాబ్లెం లేదురా. నావల్ల కాకపోతే నిన్నే కలుస్తా!"

మేము అందరం ఒకే స్కూల్లో చదివాం. జగదీష్ వాళ్ల తాతగారు ఒకప్పుడు ఈ ఊరి ఎమ్మెల్యే. అందుకని వాడు స్కూల్లో బాగా బిల్డప్ ఇచ్చేవాడు. చిన్న గాంగుతో తిరిగేవాడు. అతికష్టమ్మీద డిగ్రీ కానిచ్చాడు. సినిమా హాలు, హోటల్ బిజినెస్, లారి ట్రాన్స్ పోర్ట్ వంటి వాళ్ల ఫ్యామిలీ వ్యాపారాలు వాళ్ల నాన్నతో కలిసి చూసుకుంటున్నాడు. వీణ్ణి కూడా ఎమ్మెల్యే చేయాలని వాళ్ళ నాన్న ఆశయం.

"సరే నీ ఇష్టం. మళ్ళీ కలుద్దాం" పొలిటికల్ గా రెండు చేతులు జోడించాడు జగదీష్.

"అపర్ణ ఎలా ఉంది?"

"అంతా బాగున్నాం. ఓసారి ఇంటికి రా..."

వాడు మొహమాటానికి అన్నాడనిపించింది. రాంబాబు కార్ డోర్ తెరిచాడు. జగదీష్ ఠీవిగా బయల్దేరాడు.

మళ్ళీ డాబా మీదికి చేరుకున్నాం. మా మందు పార్టీ మొదలైంది. పక్కనే టాబ్లెట్ లో మంద్ర స్థాయిలో..."ఏ కాగజ్ కి కష్తి...." అంటూ జగ్జీత్ హిందీ గజల్.....గొంతులో దిగుతున్న జానీ వాకర్ ....వేరే లోకాల్లోకి నెమ్మదిగా తీసుకెళ్తున్నారు....

"నీ జాబ్ లైఫ్ ఎలా ఉందిరా?" చికెన్ లాలిపాప్ నోట్లో వేస్కుంటూ రాంబాబును అడిగా.

"ఇప్పుడు గవర్నమెంట్ జాబ్స్ లో ఏం ఏడ్చింది గురూ. పెన్షన్లు పీకేసారు. ముప్పై ఏళ్ళు గాడిద చాకిరీ చేసినా, మన జీతంలో కోసిందే తిరిగి కాంట్రిబ్యూటరీ పెన్షన్ గా ఇస్తారు. అదే పాలిటిక్స్ తీసుకో. ఒక్కసారి ఏమ్మెల్యేగానో, ఎంపీగానో గెలిస్తే చాలు...జీవితాంతం పెన్షనట....ఇంకా బోలెడన్ని రాజభోగాలూను..." చర్చ మొదలెట్టాడు రాంబాబు మందులో సోడా సరిపోయిందో లేదో చూస్కుంటూ.

వీడికి మొదటి పెగ్గుకే ఎక్కేసింది అనుకున్నా. " అయితే ఏమంటావ్?"

"అందుకే పొలిటిక్స్ లో దూకేద్దాం అనుకుంటున్నా!"

నేను, దివాకర్ పగలబడి నవ్వాం. "గుర్రం పని గుర్రం, గాడిద పని గాడిద చేయాలి" నవ్వుతూ అన్నాను.

"కరెక్ట్ గా చెప్పావు" అని ఒక నిమిషం ఆలోచించి " ఇంతకూ నేను గుర్రాన్నా గాడిదనా?" రాంబాబు ముఖంలో కొంచెం తింగరితనం.

"ఏమన్నా తొక్కి ఒచ్చావా? రోజంతా ఫ్యాన్ కింద కుర్చీని రాజాలా ఉద్యోగం చేసుకుంటున్నావుగా" దెప్పి పొడిచాడు దివాకర్.

"మరదే ఎటకారం. మేమెప్పుడు ఒకడి కిందే పని చేయాలి. నువ్వలా కాదే. నీకు నువ్వే కింగువి" నన్ను కూడా కలుపుకున్నాడు రాంబాబు.

పెళ్ళాం మెడలో నెక్లెస్ పోయినట్టు బిర్యానీ సంచుల్లో రాంబాబు వెతకటం చూసి "ఏంటి?" అన్నాడు దివాకర్.

"ఉల్లిపాయలు...."

"ఆశకు హద్దుండాలి మామా. వంకాయ కొని గుమ్మడికాయ కొసరు అడిగాట్ట నీలాటోడు.." ఖాళీ చేసిన గ్లాస్ టేబుల్ మీద పెట్టాను.

"మీ కిచెన్ లోంచి తేరా.... అది లేనిదే నాకు మందు దిగదు.." ఆశగా అడిగాడు రాంబాబు.

పెట్రోల్ రేట్ తగ్గించమంటే ఆర్థిక మంత్రి ఎలా చూస్తాడో అలా చూసాడు దివాకర్. "కష్టం గురూ. ఇప్పుడు మా ఇంట్లో యుద్ధం మొదలవటం నాకిష్టం లేదు...కావాలంటే జీడిపప్పు తేగలను..."

"కామెడీ బాగా చేస్తావురా ...!" ముక్తాయించాడు రాంబాబు.

"ఇదేం కామెడీరా. మన లీడర్ల జోకులముందు ఇదెంత. పన్నెండు రూపాయలకు సుష్టుగా భోంచేయవచ్చని ఆ మధ్య ఒకాయన సెలవిచ్చాడుగా...!!!" దివాకర్ చర్చ మొదలెట్టాడు.

"మరే. రోజుకు ముప్పై రెండు రూపాయలు పైన సంపాదిస్తే వాళ్ళు ధనికులేనని కొంతకాలం క్రితం మన ఆర్థిక పథక రూపకర్తే అన్నాడట..." నేను కూడా చర్చలో చేరాను.

"ఇదింకా హైలైట్. ఫాస్ట్ ఫుడ్స్ తినడం వల్లనే రేపులు పెరుగుతున్నాయట..! బాల్య వివాహాలే దీనికి మందు అని మరో పెద్దాయన చెప్పాడు..." చెప్పాడు రాంబాబు.

"అసలు జోకంటే ఇది. ఆ మధ్య కామన్వెల్త్ గేమ్స్ కోసం ఒక్కో గొడుగుని అరువేలకి కొన్నారట... తెలుసా!......" నేను కూడా నా విజ్ఞానాన్ని ప్రదర్శించాను.

"మరి ప్రతి హిందూ మహిళ కనీసం నలుగురు పిల్లల్ని కనాలని ఈ మధ్య ఒక నేత ఘంటాపథంగా చెప్పాడు...అంటే వీళ్ళకి జనాభా సమస్య పట్ల ఎంత అవగాహన ఉందో చూడు..?"

"అదలా ఉంచు. రాన్రాను సొసైటీ ఎంత దారుణంగా తయారవుతోందో చూడు. గుళ్ళోకి వెళ్ళినందుకు ఒక దళితుణ్ణి చంపేసారట....చంద్రుని మీదికి రాకెట్ పంపాం కానీ సాటి మనిషిని మనిషిగా గుర్తించలేకపోతున్నాం...." దివాకర్ గొంతులో ఆర్ద్రత.

"ఛస్. దేశం ఎటుపోతుందో తెలియడం లేదు. ఎటు చూసినా అవినీతి...రేపులు...మర్డర్లు....." గుమ్మడిలా బాధ పడ్డాడు రాంబాబు.

"సరే నువ్విప్పుడు ఉల్లిపాయ, పెన్షన్ కోసం రాజకీయాల్లోకి చేరక్కరలేదు. ఎవడి పని వాడు కరెక్ట్ గా చేస్తే చాలు..." ఓ సలహా పడేసాను.

ఇలా చాలా సమస్యల మిద చర్చించి మందు బాటిల్ ఖాళీ చేసాం. టైం చూసుకున్నా. ట్రైన్ కి ఇంకా గంటన్నర సమయం ఉంది. రాత్రికి బయలుదేరి మర్నాటి పొద్దున్న హైదరాబాద్ లో ఢిల్లీ కి ఫ్లైట్ పట్టుకోవాలి. రాంబాబు బిర్యానీ పాకెట్స్ తెరిచాడు. నా సెల్ మోగింది. చూసి కట్ చేశాను. ఈసారి సెల్ స్విచ్ ఆఫ్ చేశాను.

"ఎవరు?" అడిగాడు దివాకర్.

"కిషోర్"

"ఏం ఎత్తలేదు. వాడు నీ బెస్ట్ ఫ్రెండ్ కదా..."

నేను జవాబివ్వలేదు.

"ఏంటి. అప్పు అడిగాడా?"

"ఇంకేముంటుంది. ఇంతకుముందు మూడు నాలుగుసార్లు ఇలానే ఇచ్చా. ఇంకా ఓపిక లేదు. మళ్ళీ విసిగిస్తాడేమోనని ఫోన్ కూడా ఆఫ్ చేశాను."

"వాడికి హెల్ప్ చేసావంటే గోడకు కొట్టిన సున్నమేరోయ్. మేము అలానే బలి అయిపోయాం. ఇప్పుడు వాడ్ని కట్ చేసాం. నువ్వు కూడా దూరం పెట్టు.." రాంబాబు బల్ల గుద్దాడు.

" ఇప్పుడు ఏం చేస్తున్నాడు వాడు?" రాంబాబును అడిగాను.

"ఆటో నడుపుతున్నాడు....చాలా చెడిపోయాడు గురూ... ఒకటే తాగుడు... ఊరంతా అప్పులు....తాగేసి పెళ్ళాన్ని కొట్టడం కూడానట...."

కాస్ట్లీ బ్రాండ్ మందు తాగేవాళ్ళు మీరు తాగుబోతులు కారా? అని మనసు హెచ్చరించింది. బిర్యానితో దాని నోరు మూసేసా.

మేమంతా టెన్త్ దాకా ఒకే స్కూల్. స్కూల్లో కిషోర్ నా బెస్ట్ ఫ్రెండ్. ఇద్దరం చదువులో పోటాపోటీగా ఉండేవాళ్ళం. ఇద్దరం మిడిల్ క్లాస్ వాళ్ళమే. వాడు ధైర్యంగా పొగరుగా....నేను మెతకగా...సిగ్గరిగా ఉండేవాళ్ళం. చిన్నపుడోసారి చిరంజీవి ఫోటో ప్రింట్ ఉన్న టీషర్టు క్లాసు కి వేసుకొచ్చి మాస్టారు చేతిలో తన్నులు తిన్నాడు. ఇద్దరం కలిసి సైకిళ్ళ మీద ఊరంతా తిరిగేవాళ్ళం. అప్పుడప్పుడు వాడింటికి వెళ్లి ఇద్దరం చదువుకొనే వాళ్ళం. ఒకరాత్రి వాళ్ల నాన్న ఫుల్గా తాగేసి వచ్చి బెడ్రూంలో వాళ్ల అమ్మని చితక్కొట్టే ప్రోగ్రాం పెట్టడంతో ఆ కేకలు విని నేను హడలి పోయా. మళ్లీ వాళ్ళింటికి వెళ్తే ఒట్టు. ఆటల్లోనూ, క్లాసు డెకరేషన్లోనూ వాడే ముందుండేవాడు. ఒక ఒరలో రెండు కత్తులు పట్టవన్న సిద్ధాంతం వల్ల జగదీష్ కి వీడికి పడేది కాదు. టెన్త్ స్కూల్ ఫస్ట్ కిషోరే సంపాదించాడు. నేను సెకండ్ ప్లేసుతో సరిపెట్టుకున్నాను.

ఇంటర్ లో దాదాపు అందరం ఒకే కాలేజీలో చేరాం. కొత్త స్నేహాలవల్ల మొదటి బెంచిలో కూర్చునే కిషోర్ వెనుక బెంచిలకు చేరాడు. వీడు, జగదీష్ రెండు గేంగులు నడిపేవారు. అపర్ణ అనే ఒక మెరుపుతీగ రాకతో కిషోర్ జీవితంలో పెను మార్పు మొదలైంది. పాలమీగడ రంగుతో, చురుకైన చూపులతో, వయ్యారంగా లంగా వోణితో ఘల్లు ఘల్లు మని అపర్ణ నడుస్తుంటే కిషోర్ గుండె ఝల్లు ఝల్లుమంది. చదువుని గోదాట్లో పడేసి ఫుల్ టైం అపర్ణ వెనకాల పిచ్చివాడిలా తిరగడం మొదలెట్టాడు. కేవలం వీడి మీద కోపంతో జగదీష్ కూడా అపర్ణకు లైన్ వేసేవాడు. దాంతో వీళ్ళిద్దరి మధ్య వైరం మరింత ముదిరింది. కొన్నిసార్లు కొట్టుకున్నారు కూడా. అపర్ణ ఎవరికీ పడలేదు గాని, వీళ్ళిద్దరూ ఇంటర్ ఎగ్జామ్స్ లో బొక్క బోర్లా పడ్డారు. అపర్ణ ఫస్ట్ క్లాసులో పాస్ అయింది. పై చదువులకి అపర్ణ విజయవాడ వెళ్ళిపోవటంతో మనవాడి ప్రేమకథ కంచికి చేరింది. కానీ దారి తప్పిన వీడి జీవితం మళ్లి సరైన గాడిలో పడలేదు. చాలాకాలం విజయవాడ లో చక్కర్లు కొట్టాడని విన్నాను. నేను కూడా వైజాగ్ వెళ్లి పోవటంతో వాడితో కాంటాక్ట్ పూర్తిగా తెగిపోయింది. జగదీష్ తన పలుకుబడి, ఆస్తి అంతా ఉపయోగించి పెద్దవాళ్ళ ద్వారా సంబంధం కుదుర్చుకొని అపర్ణని తర్వాత పెళ్ళి చేసుకున్నాడు. అది తెలిసి నేను చాలా బాధ పడ్డాను. కిషోర్ అప్పుడు సూసైడ్ ప్రయత్నం చేసుకున్నాడని కూడా విన్నాను.

మళ్ళీ వాణ్ణి చూడటం పోయిన ఏడాది సంక్రాంతికి వచ్చినపుడే. వాడింట్లో పరిస్థితి చూసి వాడి పిల్లలకు స్కూల్ ఫీజులకు హెల్ప్ చేశాను. ఇలా రెండు మూడు సార్లు జరిగింది. చివరిసారి కలిసినప్పుడు సొంతంగా ఆటో కొంటానని సాయం చేయమన్నాడు. అప్పుడు ఏదో చెప్పి తప్పించుకున్నా. మళ్ళీ ఇవాళే వాడు ఫోన్ చేయడం.

భోజనం ముగించి బయట పడ్డాం. రాంబాబు తన స్కూటర్ మీద నాకు వీడ్కోలు చెప్పి బయల్దేరాడు. డ్రైవర్ కారు తీసుకొచ్చాడు. నేను, దివాకర్ ఇద్దరం కారెక్కి రైల్వే స్టేషన్ కి బయల్దేరాం. బయట చిమ్మ చీకటి..కారుమబ్బులు. స్ట్రీట్ లైట్స్ స్ట్రైక్ లో ఉన్నాయి. చినుకులు పడటం మొదలైంది. కారు పేపర్ మిల్ దాటింది. రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. కళ్ళు మత్తుగా మూతలు పడుతున్నాయి. వెనుకనుంచి పొలోమని హారన్. తల తిప్పి చూసాను. ఇన్నోవాలో కుర్ర బాచి. మందు బాటిల్స్ బయటికే కన్పిస్తున్నాయి. మా డ్రైవర్ వాడికి దారి ఇవ్వగానే ఇన్నోవా తారాజువ్వలా దూసుకెళ్ళింది. చినుకులు కుంభవృష్టి గా మారాయి.

"నేను చెప్పిన సైటు గురించి ఏం ఆలోచించావు?" సిగరెట్ ముట్టిస్తూ అడిగాడు దివాకర్.

"ఇంకొంచెం తక్కువ రేటులో వేరే చూడకూడదా" జోగుతూ చెప్పాను.

ఇంతలో ఢఢేల్ మంటూ కొంత దూరంలో పెద్ద శబ్దం. కిర్రుమంటూ సడన్ బ్రేకుతో మా కారు ఆగింది. మా వెనకే మరో రెండు కార్లు కూడా ఆగాయి. మా డ్రైవర్ గొడుగు తీసుకుని చూసి వస్తానని దిగి వెళ్ళాడు. మరో ఇద్దరు కొంచెం ముందు వెళ్తూ కనిపించారు. మా ముందు అల్లంత దూరంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న ఇన్నోవా సర్రుమంటూ మళ్ళీ టర్నింగ్ తీసుకుని ఫాస్ట్ గా వెళ్ళిపోయింది.

"ఏక్సిడెంట్ సర్. ఇందాక మనల్ని క్రాస్ చేసిన ఇన్నోవా ఎవరో ఒక స్కూటరిస్టుని గుద్దిందట. పాపం పెద్దాయన. దెబ్బలు గట్టిగా తగిలాయి" డ్రైవర్ రొప్పుతూ వచ్చి చెప్పాడు.

"అంబులెన్సుకి ఫోన్ చేసారా?" అడిగాను.

"108కి ఫోన్ చేసారంట. అదెప్పటికి వస్తుందో. ఎవరైనా హాస్పిటల్ కి తీసుకెళ్తారా అని జనం అడుగుతున్నారు...?"

"నీ మొహం. వీడికసలే ట్రైన్ కు లేట్ అవుతోంది. మనం తీసుకెళ్ళినా, మందుమీద ఉన్నాం కాబట్టి మనమే గుద్దాం అంటారు..." దివాకర్ చిరాగ్గా అన్నాడు.

ఇంతలో మా ముందున్న కారు బయల్దేరింది. వెనక వాడు హారన్ కొడ్తున్నాడు.

"ఇంకా చాలా మంది ఉన్నారుగా! ఎవరో ఒకరు హెల్ప్ చేస్తార్లే! నువ్వు పోనీయ్...." అన్నాను ట్రైన్ కు ఎక్కడ లేట్ అవుతానో అని. ఈ వర్షంలో దిగే ఓపిక అసలు లేదు.

మా కారు బయల్దేరింది. విండోలోంచి చూద్దామని ట్రై చేశాను. ఇద్దరు ముగ్గురు దెబ్బలు తగిలిన మనిషి చుట్టూ మూగారు. స్కూటర్ ఎక్కడ పడిందో గాని చీకట్లో దాని ఆచూకి లేదు. మా వెనుకనే మిగతా కార్లు మమ్మల్ని అనుసరించాయి. పోన్లే జనసంచారం ఉంది...ఎవరో ఒకరు తీసుకెళ్లకపోరు అనుకున్నా.

కాసేపట్లో స్టేషన్ కు చేరుకున్నాం. ట్రైన్ అరగంట లేటని తెల్సింది. లగేజిని రిజర్వేషన్ వెయిటింగ్ రూంలో చేర్చాము. దివాకర్ నాకు సెండాఫ్ చెప్పి బయల్దేరాడు. ప్లాట్ ఫాం జనంతో కిటకిటలాడుతోంది. ఒక వాటర్ బాటిల్ కొని అక్కడ తగిలించిన టీవీ చూస్తూ కాసేపు కాలక్షేపం చేశాను. చుట్టూ చూస్తూ తుళ్ళి పడ్డాను... దూరంగా కిషోర్......వర్షంలో బాగా తడిసినట్టున్నాడు. బట్టలనుంచి నీళ్ళు కారుతున్నాయి. ఎవరికోసమో అటు ఇటు తిరుగుతున్నాడు. వీడి బండ బడ....ఇంకెవరి కోసం నా కోసమే...అప్పివ్వని మొండికి చండిలా తగులుకున్నాడే!

ఫోన్ స్విచ్ ఆఫ్ చేసిన సంగతి గుర్తొచ్చింది. ఇంటికి వెళ్ళుంటాడు. అమ్మ నా ప్రయాణం గురించి చెప్పి ఉంటుంది. అందుకే డైరెక్ట్ గా ఇక్కడ తగులడ్డాడు. వాడు నావైపు రావటం చూసి వేగంగా వెయిటింగ్ రూంలోకి లంఘిచాను. వీలైనంత మూలకి వెళ్లి ముఖం గోడవైపు చేర్చి కూర్చుని, ఓ కన్ను ఎంట్రన్స్ మీద వేసాను. వాడు సరాసరి వెయిటింగ్ రూంలోకే దూసుకొచ్చాడు. ఆపద్బాంధవనిలా ఒక ఆయా వాడికి అడ్డంగా వచ్చి, టికెట్ అడిగింది. వాడు చేసేదేమీ లేక అక్కడ్నుంచే ఓసారి లోపలి చూసి, నిరాశగా వెనుతిరిగాడు.

ఇంతలో అనౌన్సుమెంట్....ఆ వెంటనే నిండు గర్భిణిలా నేను గౌతమీ ఎక్స్ ప్రెస్ వచ్చింది. పరిగెడుతున్న జనాల మధ్యలోంచి అభిమన్యునిలా దూసుకెళ్ళి నా బోగీలో సెటిలయ్యా. 'అమ్మయ్య! బానే తప్పించుకున్నా!' అని నిట్టూర్చి మంచి నీళ్ళు గొంతులో పోసుకున్నాను. ఎందుకైనా మంచిదని కిటికీ తలుపు మూసేస్తుంటే...టింగ్ టింగ్ మంటూ బిగ్గరగా మరో అనౌన్సుమెంట్ ........

"గౌతమీ ఎక్స్ ప్రెస్ లో సికింద్రాబాద్ వెళ్ళబోతున్న ప్రయాణికుడు మిస్టర్ సుబ్బారావు...మీ కోసం ఒక ఎమర్జెన్సీ మెసేజ్... మీ మిత్రుడు మిస్టర్ కిషోర్ నుంచి...దయ చేసి అనౌన్సుమెంట్ రూంకి త్వరగా రాగలరు..." అంటూ తెలుగు, ఇంగ్లీషులో రిపీట్ కావటం మొదలెట్టింది.

ఏవిట్రా అంత ఎమర్జెన్సీ?...ఇక తప్పేలా లేదని....అనౌన్సుమెంట్ రూం వెతుక్కుని లోపలి వెళ్ళాను. లోపల చెమటలు కక్కుతూ ఉన్నాడు కిషోర్.

నన్ను చూస్తూనే "ఒరేయ్ సుబ్బు. మీ నాన్నకి ఏక్సిడెంట్ అయింది. పేపర్ మిల్ దగ్గర రోడ్డు మీద పడుంటే నేనే హాస్పిటల్ లో జాయిన్ చేశాను. కొంచెం సీరియస్... పద త్వరగా....." నన్ను ఊపేసాడు.

ఎవరో బలమైన రాడ్ తో కొట్టినట్టు ఒక్కసారే తలంతా దిమ్ముగా అనిపించింది. కళ్ళ ముందు చీకట్లు కమ్ముకున్నాయి.

'అంటే ఇందాక తాము దార్లో చూసిన ఏక్సిడెంట్లో......నాన్నే అన్నమాట......ఛస్....ఎంత పాపాత్ముణ్ణి!!!......' మత్తు మొత్తం వదిలింది. కాళ్ళలో వణుకు మొదలైంది.

నన్ను వాడు చేయి పట్టుకొని వాడి ఆటోలోకి లాక్కెళ్ళాడు. ఆటోలో వెనుక సీటు నిండా రక్తం. కడుపులో తిప్పింది. వాడు ఫోన్ చేసినట్టున్నాడు రాంబాబు తూలుతూ వస్తూ కనిపించాడు. సీటు నెంబర్ అడిగాడు లగేజి దించటం కోసం. ఏం చెప్పానో గుర్తు లేదు.

హాస్పిటల్లో ఐసియు బయట కన్నీళ్ళతో అమ్మ....పక్కన బాబాయి కుటుంబం.....

"సుబ్బూ....నాన్నగారు...." అంటూ నన్ను చుట్టుకుపోయింది అమ్మ.

"చాల రక్తం పోయిందిటరా.....సమయానికి కిషోర్ దేవుడిలా వచ్చి కాపాడాడు. ఆలస్యం అయితే ప్రాణానికి ప్రమాదం అయ్యేది అన్నారు.....ఇంకా టెస్టులు చేస్తున్నారు....నీ ఫోన్ స్విచ్ ఆఫ్ లో ఉంది...అందుకే కిషోర్ స్టేషన్ కి వచ్చాడు నిన్ను తీసుకురావటానికి..." భుజం మీద చేయి వేసాడు బాబాయి.

కన్నీళ్ళు జల జలా నేల రాలుతున్నాయి. కిషోర్ చేతులు పట్టుకున్నాను... తలవంచుకుని...

"నీ ఋణం ఎలా..."

నా మాటని మధ్యలోనే ఆపేసాడు.

"ఋణం నాది...నీది కాదు....నువ్వు ఫోన్ స్విచ్ ఆఫ్ చేయటం తప్పు కాదు. నువ్వు నాకు చాలా సార్లు హెల్ప్ చేసావు. నేనే నిన్ను అస్తమానం విసిగించాను. అయినా ఇప్పుడు నేను చేసిందేముంది...ఆ టైంలో నా స్థానంలో నువ్వున్నా ఇలానే చేసేవాడివి. నీ మంచితనమే మీ నాన్న గార్ని కాపాడింది...."

నా మీద నాకే సిగ్గేసింది. ఒక అరగంట ముందు పురుగులా కనిపించినవాడు ఇప్పుడు దేవుడిలా ఆకాశమంత ఎత్తెదిగిపోయాడు. పశ్చాత్తాపంతో వాణ్ణి హత్తుకున్నాను.

## డబ్బు పవరాఫ్ డబ్బు.. జీడిగుంట నరసింహమూర్తి

"మీరేది అడిగినా ఇవ్వడానికి సిద్ధం కాని దయచేసి హైద్రాబాద్లో పెళ్ళిచెయ్యమని మాత్రం అడక్కండి. అక్కడ నాకంటూ ప్రత్యేకంగా నడుం బిగించి పెళ్ళి కర్యక్రమాన్ని నెత్తిమీద వేసుకునే వాళ్ళు లేరు. ఇంతకు ముందు మా పెద్దమ్మాయి పెళ్ళి ఇక్కడే చేసి భయంకరమైన అనుభవాలు మూటగట్టుకున్నాను" అన్నాడు పద్మనాభరావు రెండవకూతురు పెళ్ళి చూపుల్లో.

ఎప్పుడూ హైద్రాబాద్లోనే పెళ్ళిళ్ళు చేసి చేసి చూసి చూసి విసిగెత్తిపోయి ఉన్న కొంతమంది పెళ్ళి చూపులకొచ్చిన మగపెళ్ళివారి తాలూకు బంధువుల్లో ఒకాయన పెళ్ళి కొడుకు తండ్రి వెంకట్రావును పక్కకు పిలిచి "ఒప్పేసుకుందురూ.. మనక్కూడా ఆటవిడుపుగా ఉంటుంది. పైగా సగం చాకిరీ తప్పుతుంది. ఇంకోవిషయం ఆయన అంతగా మొండికేస్తున్నాడు కాబట్టి రానూ పోనూ పెళ్ళికొచ్చేవారికి ప్రయాణం ఛార్జీలు భరించమని చెపితే సరి. అయినా మనలో మనమాట... ఆడపిల్ల పెళ్ళి వాళ్ల ఊళ్ళోనే చేయడం విధాయకం. ఈ విషయంలో మనం పేచీ పెడితే అసలుకే మోసం వస్తుంది. అసలే ఈ రోజుల్లో మగపిల్లలకు పెళ్ళి సంబంధాలు రావడం కష్టంగా ఉంది" అన్నాడాయన ఆయనకు వేరే ప్రదేశాలు చూడాలన్న కోరిక బలీయంగా ఉండటంతో అటువంటి సలహా ఇచ్చినట్టున్నాడు.

ఆ పెద్దమనిషి చెప్పింది సబబుగానే అనిపించింది వెంకట్రావుకు కాని వెంటనే ఒప్పేసుకుంటే లోకువ కట్టేస్తారన్న భయంతో కొంతసేపు మౌనం వహించి నాన్చి నాన్చి ఆ తర్వాత అన్నాడు "మీ సమస్యలు మీకుంటాయి లెండి. కాని మా చుట్టాలు చాలామంది ఈ ఊళ్ళోనే ఉన్నారు. వీళ్ళందరిని తీసుకుని పెళ్ళికి అంత దూరం రావాలంటే కష్టమైన పనే. పైగా ఆర్థిక భారం కూడాను. మీ కోరిక ప్రకారం పెళ్ళి మీ ఊళ్ళోనే జరగాలి అంటే రానూ పోనూ

ప్రయాణం ఖర్చులు కూడా మీ మీదే పడతాయి మరి" అన్నాడు వెంకట్రావు తెలివిగా. చావుకేస్తే లంఖణానికొచ్చినట్లు చివరకు ఒక వైపు చార్జీలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు పద్మనాభరావు.

పెళ్ళి సరిగ్గా వారం రోజులుందనగా ఆడపెళ్ళి వారి ఊరిలో సముద్రంలో వాయుగుండం ఏర్పడి అది తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర వారు నిముషం నిముషానికీ హెచ్చరికలు గుప్పిస్తున్నారు. మరో ప్రక్క హైద్రాబాద్లో కూడా ఆకాశం మేఘావృతమై విడవకుండా వర్షం పట్టుకుంది. ఈ పెళ్ళికి ఎలా వెళ్ళడం ? అని ఒక పక్క మగపెళ్ళివారు ఆందోళన పడిపోతూ ఉంటే పద్మనాభరావుకు చీమకుట్టినట్టుగా కూడా లేదు. పైగా అక్కడ ఎండలు విరగకాస్తున్నాయని, వాతావరణ సూచనలను పట్టించుకోవద్దని చెపుతున్న ఆయన ధైర్యానికి, ఉదాసీనతకు బోల్డంత ఆశ్చర్యపోయారు వెంకట్రావు ఆయన బంధువులూనూ.

రేపు పెళ్ళనగా మగపెళ్ళివారు రైల్వే స్టేషన్ కు చేరుకోవడం అక్కడ గాలి దుమారంలో హోరున కురుస్తున్న వర్షానికి తడిసి ముద్దవడం ఒక్కసారిగా జరిగిపోయింది. ఊళ్ళో దిగగానే నెత్తిమీద ముసుగు వేసుకుని వచ్చిన పద్మనాభరావు చలికి వణుకుతున్న గొంతుతో ముఖ్యమైన వ్యక్తులందరినీ పలకరించాడు.

"అయ్యా మేము తడి బట్టలతో చలికి గడ్డకట్టుకుని పోతున్నాం. ముందు బట్టలు మార్చుకుని కాస్త వేడివేడి కాఫీ, టిఫిన్ సేవిస్తే కాని మనసు, శరీరం కుదుట పడేటట్టు లేదు. మాకోసం తీసుకున్న హోటళ్లకు తీసుకెళ్ళి పడేయండి. కాస్త కాలకృత్యాలు, స్నానం చేస్తేకాని ఈ జిడ్డు వదిలేటట్టులేదు" అన్నాడు వెంకట్రావు తమ్ముడొకాయన గజగజా వణుకుతూ.

"క్షమించండి సార్, నిన్న అర్ధరాత్రి వరకు ఈ ఊళ్ళో లాడ్జింగ్ లన్నీ వెతికేసాం. విపరీతమైన 'పవర్ కట్' ఉండటంవల్ల మొహం కడుక్కోవటానికి కూడా నీళ్ళు అందించలేని పరిస్థితిలో మొహం చెల్లక అన్ని లాడ్జింగులు మూసుకు కూర్చున్నారుట. అయినా మీరేమీ ఆందోళన పడకండి. కళ్యాణమండపంలోనే మీకు పదిహేను రూములున్నాయి. కడుపులో చల్ల కదలకుండా అక్కడే స్నానాలు ముగించేసి టిఫెన్లు తినేసి మిగిలిన పనులు కానీయొచ్చు – ఏమంటారు?" అన్నాడు పద్మనాభరావు తన తెలివి తేటలకు మురిసి ముక్కలవుతూ. ఇంకోపక్క పట్టపగలే చీకట్లు కమ్మేసాయి. చెవుల్లో సముద్రఘోషలు భీకరంగా వినిపిస్తున్నాయి. వర్షం ఎడాపెడా బాదేస్తోంది. కళ్ళు కూడా కనిపించడం లేదు.

"ఏదో ఒకటిలెండి. ముందు మమ్మల్ని కళ్యాణ మండపంలోకి తీసుకెళ్ళి పడేయండి మహానుభావా.. ఇప్పటికే తడిసి ముద్దయిపోయాం. జ్వరం రావడం ఒక్కటే తక్కువ. అయినా ఇక్కడ ఇంతగా మునిగిపోతూంటే ఎండ ఫెళఫెళ లాడుతుంది. ఆ ఎండలో వడియాలు కూడా పెట్టుకోవచ్చు అంటూ మమ్మల్ని ఎలా నమ్మించాలని ప్రయత్నం చేసారండి బాబు!" అంటూ వెంకట్రావు త్రాచుపాములా లేచాడు.

"ఇవే మీ గదులు. శుభ్రంగా స్నానం వగైరా కానిచ్చుకురండి. ఈలోపు టిఫెన్లు మీకోసం ఎదురు చూస్తూ ఉంటాయి" అన్నాడు పద్మనాభరావు వాళ్ళెవరి మాటలు పట్టించుకోకుండా.

"ఏమండీ ఇవి రూములా గుర్రపు శాలలా ? ఒక్క బాత్ రూమ్ కు తలుపులు లేవు. పంపులన్నీ పీకేసి ఉన్నాయి. లోపల ఒక్క చుక్క కూడా నీళ్ళు లేవు. కనీసం పెళ్ళి కొడుక్కి కింద ఎక్కడైనా పొయ్యి వెలిగించి కాసిని వేన్నీళ్ళు పెట్టించండి. మేమంతా కాసేపలా వర్షంలో జలకాలాడొస్తాం. అదే స్నానం అనుకుంటాం" అన్నాడు పెళ్ళి కొడుకు బాబాయి ఒకాయన ఉద్రేకంగా ఊగిపోతూ.

ముందు ముందు ఘోరమైన విపత్తు జరగబోతోందన్నట్టుగా దాని తీవ్రత తుఫానుకు మించి ఉంటుందేమోనన్న అనుమానం పెళ్ళి కొచ్చిన వారందరిని పీడించసాగింది. ఆ రోజు రాత్రి భయంకరంగా రక్తం తాగేస్తున్న దోమలమధ్య నరకాన్ని చవిచూసారు మగపెళ్ళివారు.

తర్వాత రోజు ఉదయం పెళ్లి కార్యక్రమం మొదలయ్యింది. ఇంకోప్రక్క బ్రాహ్మలు పెళ్ళి కూతురు తల్లిని, తండ్రిని పీటలమీద కూర్చోమని ఊదరగొట్టేస్తున్నారు. అప్పటికే పెళ్ళి హాలు ముప్పాతిక భాగం పైగా నిండిపోయింది.

వంటగదిలోంచి కమ్మటి వాసనలు బయటకు రావడంతో అప్పటికప్పుడు కొన్ని కుర్చీలు ఖాళీ అయిపోయాయి.

పద్మనాభరావు పీటల మీద కూర్చున్నాడన్నమాటే కాని లోపల ఏదో తెలియని ఆందోళన మొదలయ్యింది. ఇంకా జీలకర్రా, బెల్లానికి చాలా టైముంది. "మీకేమి అభ్యంతరం లేక పోతే ఒక పది నిముషాల్లో వస్తాను" అంటూ పురోహితుడి వద్ద అనుమతి తీసుకుని పద్మనాభరావు హడావిడి పడుతూ వేదిక దిగి ఎక్కడికో పరిగెత్తాడు.

అలా వెళ్ళిన పద్మనాభరావు నేరుగా కేటరింగ్ హాల్లోకి జొరబడ్డాడు. అక్కడ అతని అన్నాదమ్ములు భార్యాపిల్లల సమేతంగా సిగ్గు పడకుండా వేడివేడి టిఫెన్లు ఆరగించేస్తున్నారు. వాళ్లల్లో తాము ఆడపెళ్ళివారం అన్న భావన ఎక్కడా కనిపించడం లేదు. అతను కూడా తనకిష్టమైన ఐటమ్స్ రెండు మూడు తినేసి జేబులోంచి ఏవో టాబ్లెట్లు తీసి నోట్లో వేసుకున్నాడు.

పెళ్ళి కూతురి తండ్రి ఉన్నట్టుండి మాయమవడంతో వియ్యపురాలు అనుమాన పడుతూనే కేటారింగ్ హాల్లోకి అడుగుపెట్టింది. అక్కడి దృశ్యం చూసేసరికి ఆమెకు మూర్ఛవచ్చినంత పనయ్యింది. ఆమెను సడన్ గా చూసిన పద్మనాభరావు ఉలుకూ పలుకూ లేకుండా అలాగే కొయ్యబారిపోయాడు. పులిమీద పుట్రలా వియ్యపురాలి వెనుక వెంకట్రావు కూడా లోపలికొచ్చాడు. అతనుకూడా విద్యుద్ఘాతం తగిలిన వాడిలా నిశ్చేష్టుడైపోయాడు. జరుగుతుంది కలోనిజమో తెలియని పరిస్థితి. పద్మనాభరావు వెన్నులో సన్నటి జలదరింపు ప్రారంభమయ్యి మొహం చెమటతో ముద్దయ్యింది. మొహానికి నవ్వు పులుముకుని "రండి రండి.. మీరు కూడా టిఫెన్ తినేద్దురు గాని.." అంటూ పిచ్చి పిచ్చిగా పొందిక లేకుండా మాట్లాడుతున్నాడు.

తనేకారణం వల్ల వేదిక దిగి ఇటువైపుగా రావాల్సి వచ్చిందో తనకు మాత్రమే తెలుసు. పొద్దున్న షుగర్ టాబ్లెట్ వేసుకుని దాంతోపాటు ఏదో కొంత అల్పాహారం తీసుకోవడం మర్చిపోయాడు. దాంతో లోపలనుండి వెర్రి నీరసం ముంచుకొచ్చింది. ఒక్క నిముషం కూడా పీటలమీద కూర్చోలేకపోయాడు. అదే విషయాన్ని వియ్యపురాలితో చెప్పాడు. అతని మాటలకు వియ్యపురాలు తల విసురుగా తిప్పేసుకుంది. ఆమె గుండెల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. రక్తం వేడెక్కి పరుగులు తీస్తోంది. పెదవులు ఉద్వేగంతో కంపిస్తున్నాయి. ఇంతకన్నా తీవ్రమైన అవమానం మరొకటి ఉండదనుకుంది.

వియ్యంకుడివైపు అసహనం, రోత మిళితమైన చూపులు చూస్తూ "అవసరం లేదు లెండి. ఆడపెళ్ళి వారంతా శుభ్రంగా ఆరగించారుగా మా కడుపు నిండిపోయింది. అయినా మీకు తెలియదేమో అసలు పెళ్ళయ్యేంత వరకు మేము పచ్చి మంచినీళ్ళు ముట్టుకోం. ఒక ఆడపిల్ల పెళ్ళి మీరు ఇంతకుముందు చేసేసారు. అయినా కూడా మీకు ఏమాత్రం జాగ్రత్తలు తెలియవని అర్థమవుతుంది. పెళ్ళి హైద్రాబాదులో చెయ్యమంటే కుదరదన్నారు మావాళ్ళందరికి లాడ్జింగ్ లో రూములు చూపించమంటే చివరిక్షణం వరకు ఎటూ తేల్చక తలుపుల్లేని, నీళ్ళు లేని కూలగొట్టటానికి సిద్ధంగా ఉన్న కళ్యాణ మండపంలో రూములు మాకంటగట్టారు. మీదృష్టిలో మగపెళ్ళివారికి ఏ ఆప్షన్స్ ఉండవనా ? అంతా మీప్రకారమే జరగాలనా? ఇంకా అసలు కార్యక్రమం ముందుంది.. ఇప్పటికైనా మీరు చేస్తున్న తప్పుల మీద తప్పులు గ్రహించి ఒక ఆడపెళ్ళి వారిలా నడుచుకుంటే సంతోషిస్తాం". ఆ మాటలు వినలేనంత కటువుగా ఉన్నాయి. ఆమె మాట్లాడే ప్రతిమాటలోనూ వ్యంగ్యం తొంగి చూస్తోంది. పద్మనాభరావులో అంతర్మథనం మొదలయ్యి నిలువెత్తునా పశ్చాత్తాపం ఆవరించింది. మగపెళ్ళి వారిని టాకిల్ చెయ్యడం అదేమంత పెద్ద విషయం కాదని ప్రతివిషయాన్ని తనకనుగుణంగా మార్చుకుంటూ ఎన్నో పెద్ద తప్పులు చేసాడు తను. చేసేదిలేక వియ్యపురాలి దగ్గర నేరస్తుడిలా తలదించుకున్నాడు.

పెళ్ళికొచ్చిన ఆడపెళ్లి వారు అతని తరపున డిఫెన్సివ్ గా మాట్లాడటానికి ప్రయత్నం చేసినా పద్మనాభరావు మనసులో మాత్రం ముల్లు మెదులుతూనే ఉంది. ఏదో రకంగా వియ్యపురాలిని ప్రసన్నం చేసుకోవాలి. లేకపోతే తన చిట్టితల్లి ఈ ఇంట్లో జీవితాంతం మనశ్శాంతి లేకుండా బ్రతకాల్సిందే. అసలు తను ఏవిషయంలోనూ తన బంధువులను దగ్గరికి రానీయలేదు. ఎవరి సలహాలు తీసుకోవడానికీ ప్రయత్నం చెయ్యలేదు. అందుకే వాళ్ళు తనని కావాలని అపహాస్యంపాలు చేశారు. తను ఎన్నోసార్లు తెలివి తక్కువగా లేకిగా ప్రవర్తించినా ఇది తప్పు అని వారించటానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. జీవితంలో మరల మరల రాని అపురూప ఘట్టం పెళ్ళి. అటువంటిదాన్ని తెలివి తక్కువగా భయంకరమైన కలగా చేసుకున్నాడు.

పద్మనాభరావు మెదడులో రకరకాల ప్రశ్నలు సందేహాలు ఇంకెన్నో శంకలు, అలుకలు తొలిచేస్తున్నాయి. తెల్లవారుఘామున అతని మస్తిష్కంలో చటుక్కున మెరుపులాంటి ఆలోచన మెదలింది. తూర్పు దిక్కున వెలుగు రేఖలు అప్పుడే ఉదయిస్తున్నాయి తన ఆలోచనల్లాగా.. వియ్యపురాలిలో నిన్నటి తాలూకు అవమానపు ఛాయలు ఇంకా వీడిపోలేదల్లే ఉంది. ఆమె ముఖంలో ముభావం తాండవమాడుతుంది. బరువైన వాతావరణాన్ని తేలిక పరిచే ప్రయత్నం చేస్తున్నాడు పద్మనాభరావు. అనుకున్న ప్లాన్ ప్రకారం మధ్యాన్నం భోజన కార్యక్రమం పూర్తయిన తర్వాత పద్మనాభరావు భార్య వరలక్ష్మి అందంగా ప్యాక్ చేయ్యబడిన కవర్ లోంచి ఒక విలువైన వస్తువును బయటకు తీసి వియ్యపురాలికి బొట్టు పెట్టి ఇచ్చింది దాని విలువ ఇరవై వేల రూపాయలని దానికి కట్టి ఉన్న ట్యాగ్ చెపుతోంది. దాంతో పాటు మరో ఇరవై ఐదువేల రూపాయల గిఫ్ట్ కవరొకటి కూడా జతచేసి ఉంది.

"నాకివన్నీ ఎందుకండీ ? పెళ్ళిలో జరిగినవన్నీ నిన్ననే మర్చిపోయాను ఏదో బంధువుల మధ్య చిన్నతనంగా అనిపించి అలా ప్రవర్తించాను" అంది వియ్యపురాలు సిగ్గుపడుతూ. ఇప్పుడు ఆమె ముఖంలో నిన్నటి అలుక లేదు.

ధగధగ మెరిసి పోతున్న పట్టుచీరను, పెళ్ళి మాటల్లో ప్రసక్తిరాని అత్తగారి లాంఛనాల క్రింద ఇరవై ఐదువేల రూపాయల గిఫ్ట్ కవరును అప్పటికప్పుడే వియ్యపురాలు పెట్టెలో పెట్టుకోవడం చూసాక పద్మనాభరావు దంపతులకు అప్పటివరకూ ఉన్న భయాలు, టెన్షన్స్ తుడిచిపెట్టుకు పోయాయి. గుండెల మీదనుండి పెద్ద బరువును దించి నట్టయి ఈ ప్రపంచాన్ని జయించినంత ఆనందం వాళ్లల్లో కనిపించసాగింది.

అవును మరి.. మనలో ఎన్ని అవకతవకలున్నా అవలక్షణాలున్నా, సూర్యుడు చుట్టూ భూమి తిరిగినట్టుగా డబ్బు చుట్టూ ప్రపంచం తిరుగుతున్నంత కాలం ఈ కాలంలో మనిషి సాధించలేనిదేముంటుంది ? ❦❦❦

# సోక్రటీస్ ఎల్రక్ట్రాన్

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**బోధిరామయ్య** స్థానిక పురపాలక సంఘం ఆధ్వర్యంలో నడపబడ్తోన్న ఆరు ఉన్నత పాఠశాలల్లోనూ నాలుగో నెంబరు ఉన్నత పాఠశాలకి ప్రస్తుత కాలంలో ప్రధానోపాధ్యాయుడు. ముప్పై సంవత్సరాల క్రితం తను బి.ఎస్.సి, బి.యిడి విద్యార్హతలతో విజ్ఞాన శాస్త్ర అధ్యాపకుడిగా చేరాడు. ఒక పాఠశాలనుంచి మరో పాఠశాలకి తరుచు బదిలీలు జరిగినా, యింటి నుంచి దూరాలు మారడమే తప్ప బోధిరామయ్యకు గృహసంబంధమై ఏవిధమైన అసౌకర్యమూ కలగలేదు. బోధిరామయ్య బోధనా పద్ధతులు చాలా ఆసక్తికరంగా వుండే కారణంగా గణిత, విజ్ఞాన శాస్త్రాలలో విజయశాతం బోధిరామయ్య పనిచేసిన చోటల్లా ఎనభై శాతం దాటేది. అకాలమైన కొన్ని బదిలీలు ఈ విషయంలో బోధిరామయ్యను క్రుంగదీసేవి. విద్యార్థులు అభివృద్ధి సాధిస్తున్న సమయంలో అది స్థిరపడకుండా తన్ను మరో బడికి బదిలీ చేయడం విద్యార్థులకీ, తనకీ కూడా చాలా బాధగా ఉండేది. కొందరు తోటి అధ్యాపకులు తమ వ్యక్తిగతమైన సౌకర్యాలకోసం ఈ బదిలీలకు కారణమని తెలిసినా బోధిరామయ్య వాటిని ప్రతిఘటించలేకపోయాడు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా కాలపు

పురపాలకాధికారులతో మొరబెట్టుకుంటే, బోధిరామయ్య వారిని ఉసికొల్పుతున్నాడని కొందరు వ్యాఖ్యానిస్తే, యితర పాఠశాలల అభివృద్ధి కూడా ముఖ్యమని మరికొందరు సమాధాన పరిచేవారు.

అయితే బయటి ప్రపంచంలో బహుశాతం ప్రజల మన్ననలు పొందినా, యింటి వ్యవహారాలలో మట్టుకు కుటుంబ సభ్యుల్ని ఆకట్టుకోలేక వారిని అసంతృప్తికి గురిచేశాడు. అసంతృప్తికి అనేకమైన కారణాలుంటాయి. మొదటిదీ, ముఖ్యమైనదీ ఎదుటివారితో పోల్చి చూసుకోవడం. అయితే, ఎదుటివారిలా సాధించాలనుకోవడం వేరు, వారిని చూసి ఈర్ష్య చెందడం వేరు. బోధిరామయ్య ఈ మనస్తత్వం లేనివాడైనా అతన్ని తక్కువగా చూసే కుటుంబ సభ్యుల మూలాన పలు సందర్భాలలో అశాంతికి గురయ్యాడు.

బోధిరామయ్య భార్యపేరు సూర్యకాంతం. యింటా, బయటా అందరూ సూరీడు, సూరీ, సూరీడమ్మ అని పిలిచేవారు. ఆ పేరు ఆమెకి చిన్నతనం నుంచీ యిష్టంలేదు. సూరేకాంతానిది చామనఛాయ అయినా చూడచక్కని మొరటు అందం. 'ఇంటర్'తో తండ్రి చదువు ఆపుచేయించాడు. భర్త చదువుకున్నవాడే అయినా, తన అందానికి తగని వాడన్న భావన అంతరాంతరాలలో తరచూ తలెత్తేది. తనని ఏ ఆఫీసరుకో కట్టబెట్టక బడిపంతులికి కట్టబెట్టారని తల్లిదండ్రులమీద కోపం. ఆయనగారి పరిచయస్తులూ, చిన్ననాటి స్నేహితులూ ఇంటికొచ్చినప్పుడు తనవైపు వారు సంధించే ఆకలిచూపులు ఈ ఆలోచనని మరింతగా బలపర్చేవి. అయితే వెంటనే మనసులో చెంపలు వేసుకున్నా ఆ భావన మట్టుకు అణిగిపోయేదికాదు. యిక రెండో విషయమేమంటే బోధిరామయ్యకి భార్యని మనసా మెప్పించే, బెల్లిపించే విధానాలు తెలియవు. అడక్కుండా ఓ చీరేనా కొననివాడు నగలేం చేయిస్తాడు? అడిగినా, 'పది చీరలు ఒకేసారి కొనడం కన్నా, ఓ రెండు పాతబడితే రెండు కొత్తవి కొనడం మంచిద'నేవాడు. నగల ఊసెత్తితే 'నువ్వు బోసి మెడతోనే బావుంటావు. చేతికున్న ఆ జత బంగారం గాజులూ, కాలివేళ్ళకున్న మట్టెలూ, నల్లపూసలూ, నానుతాడూ - యింతకు మించిన ఆభరణాలెందుకు? ఆభరణాలూ, అలంకరణలూ అందంగా లేనివారికి మాత్రమే!' అని సమాధాన పరిచేవాడు. ఏదో కనీసం తన అందాన్నైనా గుర్తించినందుకు అప్పటికప్పుడు సంతోషపడినా, పేరంటాలకీ, పెళ్ళిళ్ళకీ వెళ్ళినప్పుడు ఎదుటి స్త్రీల వంటిమిది బంగారాన్ని చూసి నిట్టూర్పులు వదిలేది. అయితే ఎదుటి స్త్రీలు తన ఎద సంపదను చూసి ఈర్ష్య పడేవారని సూరేకాంతానికి తెలియనిదికాదు.

తన విషయంలో యిలా ప్రవర్తించే భర్త, ఆడపడుచులూ, వారి పిల్లలూ వచ్చినప్పుడు వారిని ఘనంగా చూసి, బట్టలు అవీ పెట్టి పంపేవాడు. మేనకోడళ్ళకి సన్నపాటి బంగారు గొలుసులు చేయించాడోసారి. యిదీ సూరేకాంతానికి మనసుని చాలా కష్టపెట్టేదిగా ఉండేది. డబ్బు ఖర్చయిందని కాదుకాని 'తనాపాటి చెయ్యనా?' అని ఓసారి ఉండబట్టలేక భర్తని అడిగేసింది కూడా. 'నీ పెళ్ళయి ఈ యింటి గడప తొక్కిన తర్వాత, ఏ సందర్భంలోనూ నీ పుట్టింటివారు ఓ మంచి పట్టుచీరయినా కొనిపెట్టలేదని ఎన్నిసార్లు వాపోయావు. కారణం నీ వదినలని నిందవేశావు. అలాంటి అపఖ్యాతి నువ్వెందుకు తెచ్చుకోవాలి?' యిలాంటి సమాధానాలు చెప్పిమాట దాటించేవాడు. సూరేకాంతం యిద్దరు పిల్లల తల్లయింది. కొడుకు శశికాంత్. కూతురు జ్వాల. 'బంగారాలు ఎలానూ కొనలేదు, కనీసం సంతానానికైనా బంగారంలాంటి పేర్లు పెట్టుకోనీయండి' అంటూ నామకరణ సమయంలో కావాలని కాస్త గొడవచేసి తన పంతం నెరవేర్చుకుంది. యిటు అత్తమామలూ, అటు తల్లిదండ్రులూ కాస్త పెదాలు విరిచారు. వాళ్ళ పేర్లున్న యితర మనవల్ని వారు తన సంతానం కన్నా అధికంగా చేరదీస్తున్నారని మరో అసంతృప్తికి గురైంది కొంతకాలం.

పిల్లలు నడక ప్రారంభించే సరికి ఓనమాలకి కూడా దిగువస్థాయిలో వెలిసిన శిక్షణా తరగతుల్లో దిగేసింది. దీనికి బోధిరామయ్య సుతారమూ యిష్టపడలేదు. కానీ రాజీ పడక తప్పలేదు. అటుపైన సూరేకాంతం పిల్లల చదువును పూర్తిగా తన అధీనంలోకి తెచ్చుకుంది. 'మీరు పనిచేసే దుంపల బడుల్లో వాళ్ళు చదవడానికి వీల్లేదు' అంటూ దిగువ తరగతులనుంచీ ఆంగ్ల మాధ్యమంలో నడిచే వ్యవస్థాగత పాఠశాలల్లో చదివించింది. 'ఏమిటి సార్, మీ పిల్లల్ని కాన్వెంట్ స్కూళ్ళలో చేర్పించేశారు. మీరు పనిచేసే మునిసిపల్ స్కూళ్ళ

విద్యాప్రమాణాలు బాగోలేకనా?' తెలియక కొంతమందీ, తెలిసి కావాలని కొంతమందీ బోధిరామయ్యని అడుగుతూనే ఉండడంతో బోధిరామయ్యకి మొదటిసారిగా చికాకు కలగనారంభించింది.

'అలాగని కాదు. మన నగర విద్యాసంస్థల్లో నాకున్న పరపతిములాన, మా పిల్లలకి నేనంటే అభిమానపడే సహోపాధ్యాయులు అవసరానికి మించి మార్కులు వేస్తారేమోనన్న భయం వల్లా, లేదా నేనే నా వాళ్ళకి మంచి మార్కులు వేసుకుంటానన్న అప్రధకి భయపడి కాన్వెంట్ స్కూళ్ళలో చేర్పించాను. అదీకాక ఆ స్కూళ్ళ విద్యావిధానం గురించి తెలియాలంటే మా పిల్లలద్వారా తెలుసుకోవడం కన్నా మించిన మార్గమేముంది? అంతేకాదు, పెరటి చెట్టు ముందుకు రాదన్న సామెత ఉండనే ఉందికదా?' అని నవ్వుతూ కప్పదాటు సమాధానం చెప్పడం నేర్చుకున్నాడు, వారి చదువు తన భార్య ఆధిపత్యంలో జరుగుతోందని చెప్పలేక.

పది, పన్నెండు తరగతి పరీక్షల్లో పిల్లలకి మంచిమార్కులే వచ్చాయి. 'మీ ఆయనగారు యింట్లో పిల్లలకి మంచి తర్ఫీదునిచ్చి ఉంటారు. మాకా అదృష్టం లేదంటూ' సూరేకాంతంతో ఎవరైనా అంటే, 'ఆయనగారికి బయటివాళ్ళ మీదున్న శ్రద్ధ యింటివారి మీద లేదు. అయినా కాన్వెంట్ స్కూళ్ళలోలాగా ఈయన పాఠాలు చెప్పలేరు. వారి విధానాలే వేరు' అని భర్తని కాస్త కించపరిచే విధానంలోనే సమాధానం ఇచ్చేది. శశికాంత్‌ని ఐఐటి ప్రవేశ పరీక్షల తర్ఫీదుకోసం హైదరాబాదు పంపించింది. శశికాంత్ మోటారు సైకిలు కావాలని పేచీ పెట్టాడు.

మొదటిసారిగా బోధిరామయ్యకీ, కొడుకు శశికాంత్‌కీ ఓ పాటి వాగ్వాదం జరిగింది. తల్లి అండ చూసుకుని శశికాంత్ గీరగా మాట్లాడ్డంతో బోధిరామయ్య మనస్సు చివుక్కుమంది.. చెల్లి కూతురు వివాహానికి ఆర్థిక సహాయంకోసం ఆదా చేసిన సొమ్ముని దారి మళ్ళించాల్సి వచ్చింది. యిటు సూరేకాంతానికి మనసు శాంతించినా, అటు చెల్లి, అంతవరకూ జరిగినదంతా మరిచి అన్నగారి మీద ధ్వజమెత్తింది. "చేసిందంతా మరిచి ఎలాటి మాటలంటూందో చూడండి? అయినదానికీ, కానిదానికీ నెత్తికెక్కించుకుని స్వయంకృతాపరాధం చేసుకున్నారు" అంటూ వ్యంగ్యరాజ్యాన్ని పోసింది సూరేకాంతం. బోధిరామయ్యకి మనసు కకావికలై, అన్యమనస్కుడై ఓ రెండు రోజులు పాఠాలు సరిగా చెప్పలేకపోయాడు. తన మనసు అధీనం తప్పుతోందని గ్రహించిన బోధిరామయ్య పరిస్థితులతో రాజీపడిపోయి శాంత పడ్డాడు.

శశికాంత్‌కి మధ్యస్థమైన స్థాయి వచ్చి ఐఐటిలో ప్రవేశం లభించింది. కానయితే, ప్రథమభాగ పరీక్షల్లో ఘోరంగా విఫలమైయ్యాడు. మూడురోజుల సెలవుల్లో యింటికొచ్చిన శశికాంత్‌ని భార్య ఎదురుగా కాకుండా కాలవగట్టుకి తీసుకుపోయి, "బట్టీ పట్టడమనేది కొన్ని పాఠ్యాంశాలకి కొంతకాలం సహకరించినా, పోనూపోనూ విజ్ఞానశాస్త్ర, సాంకేతిక పాఠ్యాంశాలకి సంబంధించి - అవగాహన అనేది చాలా అవసరం. జాగ్రత్తగా చదువు" అని రెండు ముక్కలు చెప్పాడు. శశికాంత్ తిరిగి సమాధానం చెప్పలేదు. శశికాంత్ తల్లి దగ్గర నిజం దాచాడు. నిజం తెలిసిన బోధిరామయ్యా భార్యకీ సంగతి చెప్పలేదు. నాలుగు వీధులకావతలుండే భవానీశంకరం కూడా మునిసిపల్ స్కూల్లో ఉపాధ్యాయుడు. తండ్రితో శశికాంత్ వైఫల్యాన్ని గురించి చెప్పాడు. భవానీశంకరానికి బోధిరామయ్య అంటే యిష్టంలేదు. అతనితో మొదలై ఈ వార్త రెండుమూడు రోజుల తర్వాత సూరేకాంతం చెవినపడింది. కొడుకుని నిలదీస్తే పంపే సొమ్ములు చాలక ధ్యాస చెడిందన్నాడు.

సూరేకాంతం భర్తమీద విరుచుకు పడింది.

"వాడే కారణంగా పరీక్ష తప్పాడో నాకు తెలియదు. నాకు తెలిసిన కారణం నీకు చెప్పినా నచ్చదు. యిక డబ్బు విషయానికి సంబంధించి వాడి సంప్రదింపులన్నీ నీతోనే. నా పొదుపు పథకాలు తప్ప, బ్యాంకు అకౌంట్లూ అవీ నువ్వే చూసుకుంటున్నావ్. వాడెంత అడుగుతున్నాడో, నువ్వెంత పంపిస్తున్నావో నాకు తెలియదు," అన్నాడు.

"అడిగినంతా పంపడానికి తగ్గ సంపాదన మనకుంటేగా?" సూరేకాంతం విసురు విసిరింది.

"మన వృద్ధాప్యం కోసం, జ్వాల వివాహంకోసం రెండు పథకాల్లో కొంత ఆదాచేస్తూ వచ్చాను. జ్వాల పథకం ఆపుచేస్తాను సరేనా?"

"వీడి చదువు పేరు చెప్పి పిల్ల పెళ్ళికి ఎసరు పెట్టడమేమిటి?"

"పోనీ మన వృద్ధాప్యం కోసం చేస్తున్న పొదుపు పథకానికి స్వస్తిచెప్పేస్తాను. శశికాంత్‌కి మంచి ఉద్యోగమొచ్చి మనల్ని చూసుకొంటాడు."

"అంతేకాని, గుమ్మంలో బైఠాయించే విద్యార్థులకు ఉచితంగా గంటలకి పాఠాలు చెప్పే బదులు వాళ్ళదగ్గర్నుంచి 'ట్యూషన్ ఫీజులు' తీసుకునే యిదిలేదు"

"వాళ్ళందరూ బీద విద్యార్థులు. కుటుంబ పరిస్థితుల కారణం, కేవలం తరగతి పాఠాలతో వారికి పూర్తి అవగాహన రాదు. అందుకనే వారికి ఉచితంగా ట్యూషన్లు చెబుతున్నా. ఈ విషయంలో నేను రాజీపడేది లేదు."

బోధిరామయ్య రెండు పొదుపు పథకాలకీ స్వస్తి చెప్పేశాడు, కానున్నది కాకమానదన్న ఓ రకమైన వైరాగ్యంతో.

ప్లస్‌టూలో మొదటి సంవత్సరం చదువుతున్న జ్వాలకీ ఆధునిక మనస్తత్వమే చాలావరకూ అబ్బింది. అవసరానికి మించిన చాలా పరిజ్ఞానం ముందుగానే టీవీ ఛానెళ్ళు, సినిమాలు, కంప్యూటర్లు అందించడం మూలాన వయసును అధిగమించిన పరిపక్వత చెందింది. వేసవి సెలవుల్లో ఓ టీవీ ఛానల తలపెట్టిన 'తల్లీకూతుళ్ళు - విజయసాధన' అనే ఓ వినోద, కాస కార్యక్రమానికి సూరేకాంతం తమిద్దరి ఫోటోలు పంపింది. 'వచ్చే నెల కాకుండా ఆ పై నెల ప్రోగ్రాం మొదలౌతుందనీ, వచ్చేనెల షూటింగ్ జరుగుతుందనీ, ఆ లోపుగా ఏవైనా సినిమా పాటలు పెట్టుకుని లయబద్ధంగా అడుగులు వేసే సాధన చెయ్యండ'నీ, సందేశ మొచ్చింది. యింట్లో ఎవరూ లేనప్పుడు సూరేకాంతం, స్కూలు నుంచి తిరిగి వచ్చిన తర్వాత జ్వాలా అలానే సాధన చేసారు, తర్వాత స్వంత ఖర్చులమీద బయలుదేరి వెళ్ళారు. హైదరాబాదులో సూరేకాంతం అక్క యింట్లో బసచేసింది.

మూడురోజుల అభ్యాసపర్వం తర్వాత చిత్రీకరణ మొదలైంది. అలంకరణ, ఆహార్యం అత్యంత ఆధునికంగా చేశారు. లంగరమ్మ ఓ దరువు పాటకి ('బీట్‌సాంగ్') రెండడుగులు వేసి, ఒకసారి నడుం తిప్పి, వీరిచేత నృత్యదర్శకుడు చెప్పిన యిరవై లయబద్ధమైన అడుగులూ (స్టెప్పులూ), పది నడుం వంపులూ చేయించింది. కెమేరా కోణాలు కొన్ని సూరేకాంతం పొంగుల్ని దృశ్యాదృశ్యంగా బంధించాయి. వీరి భావాలతో సంబంధం లేకుండా' స్క్రిప్ట్' ప్రకారం సంభాషణల పర్వంతో, బఠానీలు ఎగరేసి నోటితో పట్టడం, కళ్ళకు గంతలు కట్టుకుని భాగస్వామి దిశానిర్దేశం చేస్తుండగా వెళ్ళి దుష్టుడి మట్టిబొమ్మని కర్రతో కొట్టి బద్దలు కొట్టడం లాంటి ఆటలతో కార్యక్రమ ప్రసారం ముగిసింది. 'ఉత్తమ ప్రతిభా, నేర్పూ చూపించిన తల్లీకూతుళ్ళ జంట' అంటూ ప్రసార ప్రాయోజకులు సూరేకాంతానికి ఓ కానుకల సజ్జని అందజేసారు. అదంతా అలంకరణ సామాగ్రితో నిండి ఉంది. రానూ, పోనూ ఖర్చులూ, యితరత్రా అయిన వ్యయాలు - అన్నీ కలిపి అయిదువేలకి పైగా ఆముదం వదిలింది.

ప్రసారం చేసే రోజున జ్వాల స్కూలు మానేసింది. కొంత మంది చేత మాన్పించింది. 'చెప్తే ఎక్కడ చూడరేమోన'ని సూరేకాంతం చుట్టుపక్కల వాళ్ళని ప్రత్యేకించి పేరంటానికి పిలిచింది. గంటసేపు కొనసాగిన ప్రసారంలో పదిహేను నిముషాల సమయం వీళ్ళిద్దరూ బుల్లి తెరమీద కనిపించారు. కొందరు సూరేకాంతం అదృష్టాన్ని మెచ్చుకుంటే, మరికొందరు ఆమె గమనించకుండా బుగ్గలు నొక్కుకున్నారు.

ఆ కార్యక్రమం రెండో రోజు సాయంత్రం పునఃప్రసారమైంది. ముందే కర్ణాకర్ణిగా విన్న చాలామంది ఊళ్ళో వాళ్ళు ఆ కార్యాక్రమాన్ని తిలకించారు. బుల్లితెరమీద సెక్సీ గృహిణిగా కనిపించిన బోధిరామయ్య భార్య గురించి అనేకానేకమైన చర్చలు జరిగి, ఆ సంగతి ఎలానో బోధిరామయ్య చెవినబడింది. భవానీశంకర్ పనికట్టుకొని ఆ ప్రసారాన్ని 'రికార్డ్' చేసి, తన 'ల్యాప్ ట్యాప్'లో స్కూల్లో అందరికీ చూపించాడు. బోధిరామయ్యకూడా నిర్లిప్తంగా ఒక్క నాలుగు నిముషాలు చూసి అక్కణ్ణుంచి లేచిపోయాడు. అక్క యింట్లో ఏదో వ్రతముందని చెప్పి వెళ్ళిన సూరేకాంతం చేసిన పని యిదా అని బోధిరామయ్య మనస్సు చివుక్కుమంది. కొందరు బోధిరామయ్య హృదయ వైశాల్యతని అభినందించారు, మరికొంతమంది అతని పరిస్థితికి ఓదార్పు నటించారు. అయితే అందరి వ్యాఖ్యానాలలోను పుష్కలంగా వ్యంగ్యముంది.

"గుర్తింపు అనే ఓ ప్రగాఢమైన కోరిక అందరి హృదయాంతరాళాలలోనూ దాగి ఉంటుంది. సినిమా చూస్తున్నప్పుడు లయబద్ధమైన మంచిపాటకి అసంకల్పితంగా పాదాలని మడమ మీద ఆన్చి పైకీ, కిందకీ కుదుపుతూ చిన్నపాటి అదృశ్యనృత్యం చేస్తాం. వేళ్ళతో చిటికెలు వేస్తాం. పండుగల పేరిట దేశవ్యాప్తంగా అనేక సంప్రదాయాలలో సాముహిక వృత్తనృత్యాలు రూపొందడానికి కారణమిదే వయసుతో సంబంధించిన ఏ విధమైన బిడయమూ లేకుండా స్వేచ్ఛగా లయబద్ధమైన అడుగులు వేసి ఓ రకమైన తృప్తి పొందడం జరుగుతుంది. గుజరాత్‌లోని గర్బానృత్యాలూ, అస్సాంలోని బిహూనృత్యాలు యిలా ఎన్నో. అయితే సాంకేతికాభివృద్ధి జరగడంతో, జీవనవిధానాలు కొత్తపుంతలు పట్టడంతో ఈ సంస్కృతికి బుల్లితెర ఓ వేదికగా తయారైంది. అనేకమంది గృహిణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తప్పేమీలేదు. కానయితే చూపించే విధానాల్లోనూ, ప్రశ్న జవాబుల తీరులోనూ అసభ్యత గోచరించకూడదు. అయితే నా కుటుంబాన్ని ఉదాహరణగా తీసుకుని, మీరు చూసినదాన్ని ఓ గుణపాఠంగా తీసుకుని మీ మీ గృహిణుల్ని యిలాంటి ప్రలోభాలాకి లోనుకావొద్దని చెప్పండి." పనికట్టుకుని వెనకబడ్డవారికి బోధిరామయ్య ఈ మాటలు చెప్పాడు. నష్టనియంత్రణకీ, వాళ్ళనోళ్ళు మూయించడానికీ యింతకంటే వేరు మార్గం గోచరించలేదు బోధిరామయ్యకి.

స్కూల్లో యిరకాటమైన పరిస్థితిలో బోధిరామయ్య పడ్డట్టు సూరేకాంతానికి తెలిసి కాస్త యిబ్బంది పడ్డా, 'పమిటచాటు లేకుండా, ఓణీ లంగాలు కట్టకుండా, చున్నీలు వేసుకోకుండా షర్ట్ - జీన్ ప్యాంట్లలో ఎంతమంది ఎదల ఎత్తుల్నీ, లోయల్నీ, వంటి వంపుల్నీ చూపించటల్లేదు?' అని మనస్సుని ఝాడించి దులిపేసుకుంది. బోధిరామయ్య ఆ ప్రసక్తి భార్య వద్ద తీసుకురాలేదు. జ్వాల మట్టుకు తండ్రి ముఖంలోకి ధైర్యంగా చూడలేకపోయింది. చిత్రీకరణ జరుగుతోన్న సమయంలో తమకి తెలియకపోయినా కెమేరాలు ఎంతపని చెయ్యగలవో అవగాహనకొచ్చింది.

నాలుగో రోజున బోధిరామయ్యకి శశికాంత్ నుంచి ఫోనొచ్చింది. "నాన్నగారూ! అమ్మా, చెల్లీ ఆ ప్రోగ్రాంలో పాల్గొనేటందుకు ఎందుకు ఒప్పుకున్నారు? నా స్నేహితులూ, ప్రొఫెసర్లూ అమ్మని గురించి అన్యాపదేశంగా అశ్లీలత గుప్పించి మాట్లాడారు. యికముందు అటువంటి కార్యక్రమాల్లో పాల్గొనవద్దని చెప్పండి" అన్నాడు.

"మీకు జ్ఞానమొచ్చినప్పటినుండీ అమ్మ మాటనే విన్నారు, అమ్మ చూపిన బాటలోనే నడిచారు, అమ్మని అడ్డం పెట్టుకుని ఆటలాడారు. మానసికమైన వానప్రస్థాన్ని నేనాడో చేపట్టాను. నేను చెప్పినా, నిన్ను వంకగా తీసుకొని తనకి నీతులు చెప్తున్నానని రాద్ధాంతం చేస్తుంది. నాకలా చెప్పే అధికారం లేకుండా చేయడానికి నువ్వూ నీ వంతు సాయం చేశావు. మనసులో మధనపడేకంటే ధైర్యం చేసి మీ అమ్మతో నువ్వే మాట్లాడు. ఏం జరిగేదీ, ఆ తర్వాత దాని ఫలితం అనుభవించేది నేను కాని, దూరంగా వున్న నువ్వుకాదు. యిప్పటికే ఊరివారి మాటలతో నా మనసు మొద్దుబారిపోయింది. అందుకని పర్వాలేదు. మీ అమ్మతో మాట్లాడి, నీ మనసులోని భారాన్ని

దింపేసుకుని, అటుపైన ఈ విషయమై ఆలోచించక, మనశ్శాంతిని దూరం చేసుకోక, చదువుమీద శ్రద్ధ పెడితే నీకే చాలా మంచిది.'' బోధిరామయ్య హితవు పలికాడు.

శశికాంత్ తల్లికి ఫోన్ చేశాడా? చేస్తాడా?

దాడి జరిగితే అయినవారికోసం ప్రాణాలైనా అర్పించవచ్చు, ఉన్న ధనాన్ని ఊడ్చిపెట్టి యివ్వొచ్చు. కానీ అయినవారే అపసవ్యంగా ప్రవర్తిస్తే కాపాడుకోవల్సింది 'నేను అనే అహానికి మారుపేరైన పరువు.' దానికి రెండే మార్గాలు. అయినవారిని తీవ్రంగా మందలించి లేదా దూరం చేసుకుని, సమాజం చేత 'ఓహో!' అనిపించుకోవడం, లేదా యోగితత్త్వంతో మనసును సమాధానపర్చుకుని, నిర్మోహమాటంగా జీవించడం. ప్రతికాలంలోనూ, ప్రతి సమాజంలోనూ సోక్రటీస్‌లు ఉంటూనే ఉంటారు.

# అవసరం

## ఉరిమళ్ల సునంద

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**ఫట్ ఫట్ టప్ టప్** సుఁయ్ సుఁయ్ మన్న పెద్ద సప్పుడుకు ఉలిక్కిపడ్డాడు శివయ్య. సగం కాలిన పీనుగ కొరివి దయ్యమోలె పైకి లేచింది. గది చూసిన శివయ్యకు అంత సలిలో గూడ ఒళ్ళంత దిగజెమటలు పట్టినయి. ఎన్నులోంచి వణుకుడొచ్చింది. సంకనున్న కర్రను బిర్రుగ పట్టుకున్నడు. గీ సమయంలో ఎవ్వరైన తోడుంటే బాగుండనిపించింది. సుట్టు ముట్టు కలియజూసిండు. శీతాకాలం పొద్దు ఆరు దాటిందో లేదో చిమ్మన్న చీకటి భూతమోలె కమ్ముకుంది. కాష్టంల మంటకు అక్కడున్న చెట్లకొమ్మలు జడలు ఈరబోసుకున్న దయ్యాల్లా అగుపిస్తున్నయి. గాలి యీస్తున్నప్పుడల్లా చెట్లనీడలు చేతులు సాస్తూ మీదికొస్తున్నయి. ఎండిన ఆకులు కదిలి సమాధుల్నించి పీనుగులు లేచి నడిచొస్తున్నట్టయి. పారేసిన దండలు పగిలిన కుండలు, బెచ్చెలు వాటి గురించి చెబుతున్నట్టనిపిస్తుంటే గుండె బేజారవుతున్నది. గా వాటన్నటి మద్దెలో తనొక్కడే అనుకునే తలికి శివయ్యకు పై పాణాలు పైన్నే పోయినయి. కడుపుల బయం జేరితే బయం ముచ్చట్లే మనసుల జేర్తుంటయి. గదే జరిగిందిప్పుడు. సిన్నప్పుడు తాత జెప్పిన దయ్యాల భూతాల కథలు గుర్తుకొచ్చి శివయ్య ఒంటిమీద ఎంటికలు నిక్కబొడుసుకున్నయి. గిదేంది గింత భయం కమ్ముకుంది నన్ను అనుకుంట, ధైర్నాన్ని కూడగట్టుకోడానికి నేలమీద కర్రను గట్టిగా అదిమి పట్టిండు. భుజమ్మీదున్న తుండు గుడ్డను గట్టిగా దులిపి ముఖమ్మీద సెమటను తుడుసుకున్నడు.

ఒక్కసారిగా తలను గట్టిగా యిదిలించిండు. 'నేనేంది!? గీ బయపడుండేంది? గాయన్నిటికి తలొగ్గే కద గీపనికి ఒప్పుకొంది! బయం గియం అన్ననంటే యింకేమన్నుందా? శేతులున్న ముద్ద మట్టిపాలు కాదు మరి గద్దలాగ నోటికాడ ముద్దును కోడిపిల్లను తన్నుకు పోయినట్టు తన్నుకు పోయేటోళ్ళు శానా మందే ఉన్నరు. గప్పుడిగ గా నాల్గు పైసలుగూడ కండ్ల జాడని బతుకవుద్ది. పైసలోనే గందా పరమాత్తుడుండేది గా డబ్బు లేకపోతే డుబ్బుకు గొరగాడు. ' పైసలేని మనిషి పాణం పోయినోడితో సమానం పైస పైసకు

పందెమాడినట్టయ్యింది తన బతుకు ఒగపుడు తన రెక్కల్లో మస్తు బలముందని ఎంత మురిసిండు ఒంట్లో సేతయినప్పుడే పిలగాండ్ల సదువుల కోసం నాలుగురాళ్లు ఎనకేద్దాం అనుకున్నడు. గుడిసె పీకి రెండు గదులు కట్టుకోవాలని కలలుగన్నడు. ఎంత కట్టమొచ్చినా పిలగాండ్లకు పెద్ద సదువులు సదివియ్యాలనుకున్నడు. తనొతికె పూట పూటకు ఎతుక్కునే బతుకు పిల్లలకు రానీయొద్దనుకున్నడు. ఎన్ననుకున్నడు తానోటి దలిత్తె దేవుడోటి తల్సిండని పెపంచంకం తల్లకిందయినట్టు తన జీవితం తల్లకిందయిపోయె. తన ఆశలన్నిటిని మొగ్గలోనే తుడిసిండా దేవుడు. అయినా గా దేవున్ని అనుకోని ఏం నాభం. నోరులేని బండరాయి. నా తలరాత అట్ట రాసి పెట్టుంది. మోచ్చానికి పోతే మొసలెత్తుక పోయినట్టు పనికి పోయొత్తుంటే గా పెమాదం జరిగె. గానాడు గట్లవుద్దని కలగన్నడా మనమెంత సరింగ పద్దతిగా బోతున్నా ఎదురుంగొచ్చెటోడుకు పద్దతి లేకుండ వత్తె పెమాదాలు జరగవా మరి.

ఎప్పటిలాగే పనికి పోయిండానాడు. పోయిన కాడ పనిబాగా సేసిండని యజమాని మెచ్చుకున్నప్పుడల్లా చేసిన కట్టం మరిచి ఒంట్ల ఎక్కడలేని ఉషారొస్తది. పెండ్లాం పిల్లలతో పంచుకోవాలనిపిస్తది. పనేల అయిపోయినా మరికొద్దిసేపు అవి యివి సదిరేసరికి ఆలీసం అయిపోయె. ఎగ్స్ట్రా చేసిన పనికి గా యజమానిచ్చింది మెచ్చుకోలేగా. దానికే ఉబ్బితబ్బిబ్బయిపోయిండు తను.

పిలగాండ్లకు అరటికాయలు బజ్జీలు కొనేతలికి సీకటి పడిపాయె. గిట్ల సంతోషమెక్కువైనప్పుడు గీ ముచ్చట్లు చెబితే "నాయినా! నువ్వు సంతోషం దెచ్చుకున్నవు, మరి మాకేం దెచ్చినవు?" అని ఆట పట్టిస్తరు గౌరి, పిల్లలు. గిసుంటప్పుడు ఏదన్న కొనుక్కుపోయే అలవాటు శివయ్యకు.

"సీకటైందని సైకిలు మీద గబ్బగబ్బ తొక్కుకుంట ఎల్తున్నడు" అడ్డదిడ్డంగ వత్తున్న కారోడిని చూసి సైకిలు బెల్లు కొడతనే ఉన్నడు తను. అయినా కనుమూసి తెరిసేంతల్లనే సైకిలుకు గుద్దిపోయిండు. పడేసినోన్ని లేపాలన్న మానత్వం గూడా లేనోడు. ఆపకుండా లగెత్తిండు. సైకిలు గ్ర్ర ఊడిపోయింది. మోకట్ల కిరిగింది కాలు. ఏలాడబడ్డ కాలుతో ఒంటినిండ దెబ్బలతో బాధతో అరుత్తుంటే ఒక్కడన్న పట్టించుకోడాయె బలాన్ని కూడ గట్టుకోని దేక్కుంట రోడ్డు పక్కన జేరిండు. ఏడ్పులు మూలుగులు యిని తాగి పడిపోయిండనుకున్నరు అటు ఇటు తిరిగేవోళ్ళు ఒళ్ళంతా రకతంతో స్పృహ తపి పడున్న నన్నుగానాడు నర్సింహులు బాబాయి సూడకపోతే ఏమయ్యేది? సూపు సుక్కల్లో గలిసేది పానం పైకి ఆనాడే పోయేది భూమ్మీద నూకలుండయి అందుకే బతికిండేమో. గావాటిని ఎతుక్కోమనే ఆయుసిచ్చిండేమొ దేవుడు ఎక్కడ్నించి ఎక్కడికో ఆలోచన్లు మతిలోకి రాంగనే అప్పటిదాకా ఒంట్ల జేరిన భయం పోయి బతుకు భయం గుర్తొచ్చింది. గీ భయం ముందు గా భయం ఏపాటిది? అనుకుంట కాష్టమ్ల సగం కాలి లేచిన పీనుగ మీద కిందున్న మొద్దులు పెట్టి అదిమిండు.

'ఈ కాష్టం కాలిబూడిదయ్యినంకనే ఇంటికెళ్ళాలా అనుకుంట అక్కడే ఉన్న సిమెంటు అరుగుమీద కూలబడ్డడు. శానామంది పొద్దుపోకముందే దానం చేస్తరు. ఎప్పుడో ఓసారి గింత రేతిరి అవ్వద్ది. గీ మడిసి సుట్టమెవరో వచ్చేతలికి ఆలిసం అయ్యిందట. గిసుంటివి ఇంకెన్ని సుడాల్నో అనుకుంట, ఆలోచనలను ఇంటివైపు మళ్ళించాడు.

గౌరిని తిని పడుకోమని ఎంత సెప్పినా ఇనుకోదు కదా! ఆలిసం అయినా అద్దమరాతిరిదాకా తన కోసం కాసుకొంటది. అసలీ పని సేయడం గౌరికస్సలు యిట్టంలేదు. 'గాపని ఒద్దు మావా! గసంటి పనంటే నాకు బయ్యం. ఇంకేమన్నా సూసుకుందాం' అంటుంటది. కాళ్లేతులు అన్ని సక్కంగున్నొళ్ళకే పనులు దొరకటం కట్టంగున్నది. ఇప్పుడు అవిటోడైన తనకెవ్వలు పనిత్తరు. 'పిచ్చి గౌరి ఒక్కతి రెక్కలు ముక్కలు సేసుకుంటున్నది. అంతో యింతో కూడేసిన సొమ్మంతా కాళ్ళ వైద్యానికి "హారతి కప్పురమొలె" అరించుకుపోయె. పిల్లను సదివించె శత్తిలేక కూసిన్ని డబ్బులతో నెత్తిల యిత్తులేసి ఎల్లగొడితిమి. ఒక్కదాని కట్టం. పిలగాని సదువాపొద్దని ఆడిని. సేతులు ముంగలేసుకున్న నన్ను సాత్తుంటే ఎంత దుఃఖమొచ్చింది తనకి. ఏ పని సేద్దామన్నా అవిటోనికి పనెవ్వరిత్తరు. రోజూ

అడ్డకాడ ఎంతెంత మందిని సూసిండు. పనిదొరక్క ఏలాడే ముఖాల్తో ఇండ్లకు మళ్ళేటోళ్ళు. ముసలి ముతకోళ్ళు అడుక్కోడానికి అభిమానం అడ్డొచ్చి దిగులుగా కూసునేటోళ్ళు, ఎంగిలి బీడి ముక్కతోనో, సుట్టతోనో ఆకలిని మరిపిచ్చేటోళ్ళు గసొంటోళ్ళలా తన బతుకు గావద్దు అనుకున్నడు. గట్లాంటి పెపంచకంలో గీ పనికోసం ఎంత తండ్లాడాల్సొచ్చింది. గీ పనికి వయసు పోరగాండ్లు కూడా పోటీ బడ బట్టిరి. అద్దమరేతిరైనా ఉంటానని బతిలాడుకోబట్టే గదా! రామయ్య మావ నా మాటల నియతు చూసి గీ పనిల కుదిరిచ్చింది. ‘ గవన్ని తల్సుకుంట పీనుగ మీదకు ఆలోచనలు మళ్ళించిండు.

గీ పీనుగ సరిగా కాలకుంటే సుట్టు పక్కల కుక్కలు మాసం వాసన పసిగట్టి వత్తియుట. ఎనకటికోపాలి వచ్చి కాష్టాన్ని గెలికి సిందరవందర సేసినయంట. మరందుకే ఉండాలి అనుకున్నడు. మంటంత పోయి బొగ్గులు అయ్యేదాకా ఉండి లేచిండు.

మెల్లగా సశానమ్లు నడుసుకుంట రోడ్డు మీద కొచ్చిండు రేత్తిల్లు ఆటోలేసే అడ్డదగ్గర ఆగిండు.

ఆటో నాగులు శివయ్యను చుసి "ఏంటన్నా గిప్పటిదాకా గా కాష్టమ్లనే ఉన్నవా?" ఆశ్చర్యంగా అన్నడు.

"మరె తమ్మీ!" అనుకుంట నాగులు ఆటో ఎక్కిండు. "ఎసుమంటోడివి ఎట్లయినవన్న. నిన్ను సూత్తావుంటేనే దుఃఖమొత్తున్నది. పులిలా బతకాలనుకున్నోడివి సివరికిట్టయినవు" అని జాలిపడుతుంటే "గవన్నెందుకు మతికి తెస్తవు తమ్మీ గిప్పుడన్న ఈ సిన్న ఆధారం దొరికింది. గిది సాలు కడుపు మాడ్సుకోకుండా బతకడానికి, మీ ఒదినకింత సాయం సెయ్యడానికి" అన్నడు.

ఆటో సప్పుడిని గలమట్ల కునికిపాట్లు పడుతున్న గౌరి ఒక్కంగలో ఉరుక్కుంట ఆటో దగ్గరికి వచ్చింది.

"నాగులు బాగున్నవానయ్యా?" పలకరించింది గౌరి.

శివయ్య జేబుల డబ్బులు దయబోతుంటే "వద్దన్నా! ఎప్పుడన్న వచ్చి వదినమ్మ సేతి చాయ్ తాగుతలే" అనుకుంటు ఎంత పిల్చినా ఇనుకోకుండా ఎల్లిపోయిండు నాగులు.

గబ్బగబ్బ పొయ్యి కుండుల నీళ్ళు బకెట్లకు తొల్పింది. శివయ్య ఒంటిమీద గుడ్డల్ని ఒలిపించి జారట్ల పడేయించింది.

పీటమీద గూసబెట్టి ఒళ్ళు రుద్ది తానం సేయిత్తుంటే "గీ చాదస్తమేందే గౌరి.. గుడ్డలన్ని ఒలిపించినవు" అన్నడు.

‘సాదస్తం కాదు మావా! రకరకాల ముసలీ ముతక మంచి సెబర పీనిగలు కాలిన బూడిదంత ఒంటిమీద పడతై. గవీటి ఆసనలు ఒంటి మీదున్న గుడ్డలకు పట్టుకుంటయి‘వాటితో ఇంట్లకొత్తె లేనిపోని రోగాలొత్తయి అంది"

"నువ్వు సదూకుంటే డాట్టరయ్యేదానివే గౌరీ! మీ అయ్య సదివించలే గానీ" అంటు చతుర్లాడుతుంటే

"మారె నాదయిపోయింది కాలంగానీ నీ పిలగాని సంగతి సూడు ముందల‘ అని సురకేసింది ఉడుక్కుంటూ

ఆ మాటలకి సప్పున ముఖం ముడుసుకున్నాడు శివయ్య. ఎంటనే తప్పు తెలుసుకున్న గౌరు "అదికాదు మావా ఊరికే అన్న" అంది పొరపాటుకు నాలిక్కరుసుకుంటు.

"నువ్వుత్తిగన్నా. నిజంగన్నా అది నిజమెనే గౌరి. బాగా సదివించాలనే ఉంది. నా రాత గిట్లాయె. మనవల్లవుద్దా. అందుకేగా నీ కిట్టం లేని గీ పనిని ఒప్పుకుని సేత్తున్నది" అన్నాడు.

"ఒద్దొద్దు మావా మనసు పాడుచేసుకోమాకు. కట్టం వెంట సుఖముంటదని పెద్దోళ్ళంటరు. మనకూ మంచి రోజులొత్తయి. మావా! ముందుగాల నువ్వన్నం తిందువుగాని రా!" అంటూ ఉతికిన బట్టలేసుకుని గుడిసెలకు రాంగనే పళ్ళెమ్ల వేడి వేడి అన్నం పెట్టింది గౌరి.

"తను పెట్టుకో బోతుండంగనే నువ్వు తినవా! గిప్పటిదాకా ఉంటె ఎట్ల సెప్పు" అనుకుంట కలుపుకున్న ముద్ద గౌరికి పెట్టిండు శివయ్య మొగుడి ప్రేమకు మురిసిపోయింది గౌరి. ఎలాంటి పాడలవాట్లు లేని శివయ్యంటే గౌరికి పాణం. తన అదృష్టానికి తనే మురిసిపోతుంటుంది. ఆ రోజట్ల జరక్కుంటే తమ రాత ఎంత గొప్పగుండేదో అనుకుంది.

గౌరి ప్రేమతో కొసరి కొసరి పెడుతుంటే శివయ్యకు కడుపుతో పాటుగ మనసు కూడా నిండిపోయింది.

సెయ్యి కడిగి తుడుసుకుంట ఆదమరిసి పడుకున్న పిల్లల్ని సూసిండు. పెద్ద సదువులు సదివించాలనుకున్న బిడ్డను బాగా పెండ్లి చేసే. తన మంచం మీద నెలల కడుపుతో ఉన్న బిడ్డను మురిపెంగా సూసుకుంట తొరలో తను తాత కాబోతున్నడు అనుకున్నడు. అంతట్లనే అసలు యిసయం గుర్తుకొచ్చింది. అప్పటి వరకున్న సంతోషం పోయింది. మనసులో ఓలాంటి కలవరం మొదలయ్యింది. ఎట్లా ఏం జెయ్యాల అని ఆలోచించుకుంట అట్లాగే కూసుండిపోయిండు. అప్పటిదాకా కంటి మీద వాలిన నిద్దర కాస్త ఎగిరిపోయింది.

"ఏంది మాఁమా! గింత రాతిరయ్యింది. నిద్దరవోకుండ ఏమాలోచిత్తున్నవ్?" పడుకో మావ. కంటినిండ నిద్దరబోతేనే ఒంటికి మంచిదంట" ఆవులించుకుంట కొడుకు పక్కన బొంతను వేసింది. లేచి కొడుకు మీద సెయ్యేసి పడుకున్నడు శివయ్య. ఆ పక్కనే ముడుసుకుని పడుకున్న గౌరి ఎంటనే నిద్దట్లోకి జారిపోయింది.

ఎంతకూ నిద్రపట్టలేదు శివయ్యకు. రాత్రంతా నిద్రపోలేదు. ఎంత ఆలోచించినా దారి తెన్నూ దొరకడం లేదు. ఏం సెయ్యాలో తోచడం లేదు. కాళ్లేతులు ఆడనట్టయింది శివయ్యకు.

పొద్దుగాల లేసిన గౌరి. ఎర్రబారిన కళ్ళతో ఉన్న శివయ్యను "రాతిరంతా నిద్దరపోలేదా మావా?" అంది.

"పోయిన గని సరిపోలే నిద్దర అనుకుంట" సద్ది మూట గట్టుకుని సశానానికి వచ్చిండు. రాత్రి కాలిన శవం బూడిద ఒక్కదగ్గరికి జరిపిండు రాత్రి బయపడింది గుర్తొచ్చింది. ఎంటనే తన అవసరమూ మనసుల మెదిలింది. రాతిరి బయం కంటే అవసరమే ఎక్కువ బయపెడుతున్నది అనుకున్నడు శివయ్య.

రామయ్య మావ మరికొందరు పనోళ్ళు వచ్చినరు. రెండు మూడు పీనుగలొస్తున్నాయంటే ఆళ్ళతో కాష్టాలు పేర్చిండు. అరుగు మీద కూసొని వచ్చే శవాలను సూడసాగిండు.

ఆడపీనుగను అదే పనిగ సూసుకుంట అనుకున్నడు. బాగా బతికినోళ్ళమో అదృష్టవంతురాలు కాలేటప్పుడు కూడా ఖరీదైన బట్టలు సుట్టుకుని పోతుంది అనుకున్నడు. "ఆఁ గవన్నీ ఆమె సూత్తదా! గంత ఖరీదుగల సీర ఉచ్చితార్దానికి మంటల కాలిబూడిదవ్వడమేగా!" అనుకోంగనే శివయ్య మనొస్సెటో పోయింది. సీసీ గసుమంటి పాడాలోచనలు ఎందుకొత్తున్నయి అనుకుంట రెండు సెంపలు టపటపా వాయించుకున్నాడు.

ఎందుకోగానీ ఆ ఆలోచనలు ఆగట్లేదు శివయ్యకు. ఒంటిమీద గట్టంగ, పైన వేసిన బట్టల్ని ఆ మడుసులతో పాటు కాలుస్తున్నప్పుడల్లా శివయ్య మనసు పరిపరివిధాల పోతున్నది. ఆ కాల్చే ఖరీదుగల్ల గుడ్డలకు రేటు గట్టడం గుండెల మీద సెయ్యేసుకుని అది నిప్పుల్ల కాలిపోతుంటే విలవిల్లాడిపోతున్నడు శివయ్య. గసుమంటిది కొనుక్కోవాలంటే ఓ కూలోడు నెలంతా కట్టపడ్డా కొనగలడా! అనుకుని వాపోవడం మామూలయిపోయింది శివయ్యకు.

రోజులు దగ్గర బడుతున్నయి. ఏదో ఒకటి సెయ్యాలి. అదే ఏం సెయ్యాలో అర్ధంకాక సతమతమవుతున్నాడు శివయ్య.

ఓరోజు

ఎవరో ఆడమడిసి యాక్సిడెంటులో పోయిందట. ఆ పీనుగును వేరే రాష్ట్రం నుంచి గాజుపెట్టెలో పట్టుకొచ్చినా ఆసన పట్టింది. అందుకే గాజుపెట్టె మూత తెరవకుండనే తతంగమంత జరుపుకుని పెట్టెపైన్నే పట్టుచీర పూలదండలు వుండటం చూశాడు శివయ్య.

పేర్చిన కాష్టం మీదికి శవాన్ని చేరుస్తుంటేనే ఎన్ని సెంట్లు కొట్టినా వాసన పోలేదు. అందరూ ముక్కుమూసుకుని కట్టెలు పైన ఎయ్యడానికి కూడా రాలేక శివయ్యకు అందియ్య సాగిండ్రు.

ఇదే అదనుగా శివయ్య పైన కట్టెలు సర్దుకుంట పూలదండలతో పాటు గా చీరను తుండుగుడ్డల మలిచి సుట్టి పక్కనే ఉన్న సమాధి వైపు పూలదండల్ని యిసిరేసినట్టు ఇసిరిండు. అదురుతున్న గుండెలతో ధైర్యాన్ని సిక్కబట్టుకుని ఎవరైనా సూసారేమోనని అటు ఇటు సూసిండు. నెమ్మదిగా కట్టెలని సవరిచ్చి కష్టసాయంతో పక్కకు నిలబడబోయిండు.

ఒక్కసారిగా పిడుగులు పడ్డట్లు అరుపులు యినిపించి బిక్కసచ్చిపోయిండు శివయ్య.

"అలగా జనం అలగా బుద్దులు. శవాల మీద పైసలేరుకునేటోళ్ళ బుద్దులేడికి బోతయి. అమ్మో! అమ్మో! ఎంతపని జరిగింది నేను చూడకుంటే ఏమయ్యేది? ఇంకేమైనా ఉందా! పుట్టింటి పట్టు చీర లేకుండనే శవం కాలిపోయేది.ఆమె ఆత్మ మనసుట్టే తిరిగేది ఇంతకు ముందు ఎన్నిసార్లు చేసిండో ఇలాంటి పనులు. ఎంత తెలివిగ కాజేసిండో చూడు". అంటూ పెద్ద నోరేసుకుని శివయ్యను వేలెత్తి చూపుతూ ఇష్టమొచ్చినట్లు తిడుతుంటే అందరూ ఒక్కసారిగా శివయ్య వైపు సమాధులవైపు చూశారు.

తుండుగుడ్డలో చుట్టిన చీర బయటికి కనిపించి అందరిముందు ఒక దొంగ తప్పుచేసినవాడు అయ్యాడు శివయ్య. సిగ్గుతో కుంటు కుంటూ వెళ్ళి ఆ చీర తీసుకొచ్చి మండుతున్న కాష్టంపై పరిచిండు.

అవమాన భారంతో ఆ పక్కనే కుప్పకూలిపోయిండు శివయ్య. అరుపులు కేకలు విని జరిగింది అర్థమై "అయ్యో! శివా! " అనుకుంటూ దగ్గరికొచ్చిన రామయ్య. అక్కడున్న వాళ్ళవైపు తిరిగి "మావాడు ఏ దొంగతనమూ చేయలేదు. ఎవరికీ నష్టం కలిగించలేదు. సీమంతానికి బిడ్డ కొక పట్టుచీర కొనియ్యలేని దుస్థితి అత్తింటి పోరుతో బిడ్డ ఎక్కడ ఆగమైవోద్దోనని మొదటిసారి మనసు సంపుకొని ఏమీ చేయలేని స్థితిలో అలాంటి పని చేసిండు. అసుమంటోడయితే మొండి కాళ్ళు చూపుకొని రోడ్లమీద అడుక్కొని తినోటోడు. అభిమానం గల్లోడు గీ పనికి నన్ను కాళ్ళా ఏళ్ళా బడి ఇందుల కుదిరిండు. వేలకు వేలు బెట్టి కొన్న బట్టలు మీ నమ్మకాలతో గిట్ల అగ్గికి ఆహుతిస్తరు గని గదే చేత్తో పేదోళ్ళకు గవి దానం చేస్తే అవి కట్టుకున్నంత కాలం తల్సుకు తల్సుకు బతుకుతరు గదా! మీరిప్పుడుడాడిని సూసి సూడనట్టుంటే బిడ్డ ఆ చీరతో తిరిగినప్పుడల్లా చనిపోయిన ఆయమ్మను తల్సుకునేటోడు. మా శివ అవసరానికే చేసిండుకానీ అపచారం చేయాలనో, అమ్ముకోవాలనో కాదు తల్లీ" అని చెమ్మగిల్లిన కళ్ళను తుడుసుకుంట శివయ్యను లేపబోయిండు రామయ్య.

అప్పటికే అవమానం తట్టుకోలేక శివయ్య గుండె ఆగిపోయింది. ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయినవి.

జరిగిన హఠాత్పరిణామానికి వచ్చిన వారంతా నివ్వెరబోయారు. అంతర్మధనం వారిలో మొదలయ్యింది.

అవసరం ఎలాంటివారినైనా ఎప్పుడో ఒకప్పుడు లొంగదీసుకుని పొరపాటు చేయిస్తది. అది గ్రహించిన ఆత్మాభిమానం దెబ్బతిని మనిషి ప్రాణాలు తీస్తుంది. శివయ్య విషయంలో అదే జరిగింది. ఆమె చూసీ చూడనట్లు ఉన్నట్టయితే ఒక నిండు ప్రాణం పోయేదా! కాలి బూడిదవ్వడం కంటే ఆ చీర మరొకరికి ఉపయోగపడుతుంది కదా అని ఒక్క క్షణం అనుకుంటే శివయ్య బిడ్డ కోరిక తీరేది. శివయ్య జీవితం కొనసాగేది.

# మాకివీడు అత్తయ్య రాజ్యలక్ష్మి

మాకివీడు అత్తయ్యంటే మా మామగారికి వేలువిడిచిన అక్కగారు. మా అత్తగారు మావారి చిన్నతనంలోనే పోతే మా వారిని, ఆడపడుచుని, బావగారిని ఆవిడే పెంచింది. ఆవిడ పుట్టిల్లూ, అత్తిల్లూ కూడా ఆకివీడే. ఆ ఊళ్లోని చెరువు, కోదండరామస్వామి గుడి... ఒకటేమిటి, అసలు ఆవిడ దృష్టిలో ఆకివీడు ఒక భూలోక స్వర్గం. ఆవిడ ఎప్పుడూ "మా ఆకివీడులో అలా..., మా ఆకివీడులో ఇలా..." అంటూ ఉంటుంది. అలా ఆకివీడు మాకివీడుగా రూపాంతరం చెంది, ఆకివీడు అత్తయ్య కాస్తా మాకివీడు అత్తయ్య అయింది.

అసలు నా పెళ్లే అనుకోకుండా, నాకిష్టం లేకుండా జరిగిపోయింది. నేను బియెస్సి సెకెండ్ యియర్ ఎగ్జామ్స్ రాస్తున్నాను. మర్నాడు లాస్ట్ ఎగ్జామ్. సాయంకాలం గదిలో చదువుకుంటున్నాను.

మా నాన్న ఆఫీస్ నించి వచ్చి మా అమ్మతో "నారాయణ ఘనాపాఠిగారు తెలుసు కదా! మన గాయత్రిని చూసుకోవడానికి ఇంకో గంటలో వస్తున్నారు" అన్నారు.

మా అమ్మ కంగారుగా "అదేంటి ఇంత హడావిడిగా! అయినా మనమేమీ అనుకోలేదుగా దాని పెళ్లిగురించి" అంది.

"ఘనాపాఠిగారి మేనమామ మధ్యాహ్నం మా ఆఫీస్‌కి వచ్చి కలిసారు. వాళ్లకి మన సంగతి మా పెద్దమామయ్య ద్వారా తెలిసిందిట. ఈ ఊరికి ఏదో పనిమీద వచ్చారుట. వీలైతే పిల్లని చూపించమన్నారు. నేనూ సరేనన్నాను. ఘనాపాఠిగారు బయట ఏమీ తినరు కదా... అరటిపళ్లు తెచ్చాను. కరివేపాకో, దబ్బాకో వేసి మజ్జిగ చేయి. ఆ పిల్లవాడు తింటాడేమో కాసిని బజ్జీలు వేయి. అమ్మాయిని తొందరగా రెడీ అవమని చెప్పు" అంటూ మా నాన్న కూడా హడావిడి పడిపోయారు.

మా అమ్మ కంగారుగా నా దగ్గరకి వచ్చి "నిన్ను చూసుకోవడానికి పెళ్లివారు వస్తున్నారు. తొందరగా మొహం కడుక్కుని రా, తల దువ్వుతాను" అంటూ ఆవిడదే ఒక పట్టు చీర ఇచ్చి "ఇది కట్టుకుని ఇక్కడే కూర్చో. నేను పిలిచినప్పుడు వద్దూగానివి. సమయానికి మీ మామ్మ కూడా లేదు." అంటూ మళ్లీ అంతే కంగారుగా వెళ్లిపోయింది.

కాసేపటికి తిరిగి వచ్చి నేనలాగే ఉండడం చూసి "ఇంకా అలాగే ఉన్నావే? కానీ..." అంది.

"ఎవరిని అడిగి పిలిచారు వాళ్లని? నాకొద్దు" అని అరిచాను.

"ఇదొక్కసారికే. అవతల వాళ్లొచ్చేస్తారు. మా అమ్మవు కదూ! తొందరగా లేచి తెములు" అని బతిమాలింది.

నేనూ మెత్తపడ్డాను. "సరే. ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్. మళ్లీ పెళ్లి గిళ్లి అన్నారంటే ఒప్పుకోను" అని లేచాను. నేను రెడీ అయ్యేలోపలే వాళ్లు వచ్చారు.

వాళ్లు ముందు గదిలో కూర్చున్నారు. పరిచయాలయ్యాక మా అమ్మ నన్ను తీసుకెళ్లింది. మా తమ్ముడు అక్కడే కూర్చుని ఉన్నాడు. అలాంటివారెవరైనా ఇంటికి వస్తే మా నాన్న నాతో, మా తమ్ముడితో నమస్కారం చేయిస్తారు. కానీ ఇవాళ కోపంగా ఉన్నాను. చేయలేదు. మా నాన్న "మా అమ్మాయి గాయత్రి. బియెస్సి రెండో సంవత్సరం చదువుతోంది." అని, నాతో "నమస్కారం చేయమ్మా" అన్నారు. ఇక తప్పక ఆయన కాళ్లకి నమస్కారం చేసాను.

"నాకు ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. వీడు చివరివాడు. ఎం.ఏ. సంస్కృతం చదివి మా ఊళ్లోనే కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. పైపిల్లలకి చిన్నతనంలోనే వివాహాలు చేసాను. వీడు చిన్నప్పుడు చేసుకోనని మొండికేసాడు. ఏం చేస్తాం? మనం చెప్పి వాళ్లు వినే రోజులు పోయాయి. వాళ్లు చెపితే మనం వినాల్సిన రోజులొచ్చాయి." అన్నారు ఘనాపాఠిగారు.

"మా అన్నయ్యగారి పెద్దమ్మాయి విషయంలో చిన్నప్పుడు వివాహం చేసి బాగా ఇబ్బంది పడ్డాము. దాంతో మిగతావాళ్లకి కాస్త వయసు వచ్చిన తర్వాతే చేస్తున్నాము. మా నాన్నగారుంటే ఒప్పుకునేవారు కాదనుకోండి. మా అబ్బాయికి మాత్రం ఎనిమిదోయేటే ఉపనయనం చేసాము." అన్నారు మా నాన్న.

"మీ నాన్నగారి సంగతి చెప్పేదేముంది. వెంకట్రామశాస్త్రిగారంటే అప్పట్లో ఎంతో పేరు. ఎంత విద్వత్తు! ఎంత అనుష్ఠానం! ఉపనయనం అంటే మన చేతిలో పని కానీ, వివాహం అంటే అవతలవాళ్ల మీద కూడా ఆధారపడ్డ ధర్మం కదండీ! అయినా రోజులని బట్టి మనం కూడా పోవాల్సిందే!" అన్నారు ఘనాపాఠిగారితో వచ్చినాయన.

ఘనాపాఠిగారి అబ్బాయంటే ఎలా ఉంటాడో అనుకున్నాను కానీ, తెల్లగా, పొడుగ్గా, ఒత్తయిన క్రాఫ్‌తో, పాంట్ షర్ట్ వేసుకుని సినిమా హీరోలా ఉన్నాడు. వాళ్లందరూ మమ్మల్ని పట్టించుకోకుండా లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు. మేమిద్దరం దిక్కులు చూస్తూ కూర్చున్నాము.

వాళ్లు వెళ్లిన తర్వాత, మా నాన్న "ఇంతకీ మన సంబంధం వాళ్లకి ఆనుతుందంటావా?" అంటూ మా అమ్మతో చర్చ మొదలు పెట్టారు.

"ఎందుకు ఆనదూ! మనకేమన్నా అచారం తక్కువా! మీకు కూడా దేవతార్చన ఉంది, మడితోగానీ తినరు. మామయ్యగారి గురించి వాళ్లెంత గొప్పగా మట్లాడారో విన్నారు కదా. అయినా కుదరకపోతే పోయింది. ఇలా చూస్తూ ఉంటే ఎదో ఒక సంబంధం అదే కుదురుతుంది." అంటూ మా అమ్మ ధైర్యం చెప్పింది.

నేను పెళ్లివారికోసం మా అమ్మ చేసిన బజ్జీలు తింటూ పక్క గదిలోంచి వింటున్నాను. వాళ్లకి మా మడి, ఆచారం సరిపోదు. ఆయనేమో ఘనాపాఠి, మా నాన్న వేదం పూర్తిగా చెప్పుకోలేదు. ఎదో నమకం, చమకం వగైరాలతో ఇంట్లో అభిషేకం చేస్తారంతే. పైగా ఆ అబ్బాయి అంత తెల్లగా ఉన్నాడు, నేనేమో చామనఛాయలో ఉంటాను. కచ్చితంగా నచ్చను. ఇలా అలోచించిన తర్వాత నాకు ఈ సంబంధం కుదరదనే ధైర్యం వచ్చి మళ్లీ చదువులో పడ్డాను. అయినా ఎందుకైనా మంచిదని మర్నాడు పొద్దున్నే మా కాలనీలో ఉన్న వేణుగోపాలస్వామి గుడికెళ్లి, ఈ సంబంధం కుదరకపోతే నూటెనిమిది ప్రదక్షిణాలు చేస్తానని దణ్ణం పెట్టుకున్నాను.

లాస్ట్ ఎగ్జామ్ రాసి, ఫ్రెండ్స్ తో కాలక్షేపం చేసి సాయంకాలం ఇంటికి వచ్చేటప్పటికి మా నాన్న అప్పటికే ఆఫీస్ నించి వచ్చేసారు. ఇంత పెందరాడే ఎందుకొచ్చారా అనుకుంటూ లోపలికి వెళ్లగానే, మా అమ్మ "వాళ్లకి మన సంబంధం నచ్చిందిట. కట్నం, లాంఛనాలు కూడా అక్కర్లేదన్నారుట" అంటూ సంతోషంగా చెప్పి మళ్లీ మా నాన్న పిలిస్తే వెళ్లింది.

మా నాన్న "ఇంతకీ వాళ్లకి ఏం చెప్పమంటావు?" అని మా అమ్మని అడిగారు.

"ఇంకా అలోచించేది ఏముంది? వెంటనే ముహూర్తం పెట్టుకోవటానికి వస్తామని చెప్పండి" అంది మా అమ్మ.

"పెళ్లి ఈ వైశాఖంలో కానీ, జ్యేష్ఠంలో కానీ చేయాలంటున్నారు. మా అన్నయ్యని రమ్మని రాస్తాను. ఇద్దరం వెళ్లి ముహూర్తం పెట్టుకొస్తాము" అన్నారు. మా అమ్మ "అత్తయ్యని కూడా తీసుకురమ్మని రాయండి" అంది. సరేనంటూ మా నాన్న బయటకి వెళ్లిపోయారు.

నాకేమిటో అయోమయం అయిపోయింది. "అయినా ఎలా కుదిరింది? కుదరకూడదని వేణుగోపాలస్వామికి దణ్ణం పెట్టుకున్నానే!" తెలీకుండా పైకే అనేసాను.

"ఏమిటీ... పెళ్లి కుదరకూడదని వేణుగోపాలస్వామికి దణ్ణం పెట్టుకున్నావా? ఆయనకి ఎనిమిదిమంది భార్యలు. నీ పెళ్లి ఎలా కాన్సిల్ చేస్తాడు? ఏ ఆంజనేయస్వామికో దణ్ణం పెట్టుకోవాల్సింది." అంటూ మా తమ్ముడు పెద్దగా నవ్వడం మొదలు పెట్టాడు. నాకు ఉక్రోషం వచ్చి వాణ్ణి బయటకి తోసి తలుపేసుకున్నాను.

మర్నాడు మా నాన్న ఆఫీసుకి వెళ్లిన తర్వాత మా అమ్మ వంటింట్లో పని చేసుకుంటుంటే దగ్గర చేరి నస పెట్టడం మొదలు పెట్టాను.

"అంత దగ్గరకొస్తావేమే... తాకుతావు. నేనికా అన్నం తినలేదు" అంది మా అమ్మ.

"ఛీ... ఈ మడి ఉన్న వాళ్లింట్లో పుట్టకూడదు వచ్చే జన్మంటూ ఉంటే" అనుకున్నాను ఏ లక్షోసారో.

మేమసలు తొంభైల్లోనే ఉన్నామా అనిపిస్తుంది ఒక్కోసారి. మామూలుగా అయితే మా అమ్మ మాటలకి నేను కోపంతో వెళ్లిపోవాలి కానీ, అవసరం నాది కాబట్టి కొంచెం దూరం జరిగి మళ్లీ మొదలు పెట్టాను.

అంతా విని "అదేమిటే అలా అంటావు? ఒక్క సంవత్సరమేగా, ప్రైవేటుగా చదవచ్చులే. నారాయణ ఘనాపాఠిగారి సంబంధం అంటే మాటలా..." అంది మా అమ్మ.

"నాది సైన్స్ గ్రూప్, ప్రాక్టికల్స్ ఉంటాయి. ప్రైవేటుగా చదవడం కుదరదు. అయినా పులస్త్యబ్రహ్మ మనవడని రావణాసురుడిని ఎవరేనా పెళ్లిచేసుకుంటారా?" అన్నాను కోపంగా.

"నిక్షేపంలాంటి పిల్లవాడిని పట్టుకుని రావణాసురుడంటావేమిటే? వెధవ పోలికా, నువ్వూనూ..." అంది మా అమ్మ.

"బావ చాలా బావున్నాడు కదక్కా!" అన్నాడు మా తమ్ముడు అప్పుడే వరస కలిపేస్తూ.

"అంత బావుంటే నువ్వే చేసుకో" అని వాడి మీద ఇంతెత్తున లేచి అక్కడినించి వెళ్లిపోయాను.

రెండు రోజులకి మా పెదనాన్న, మామ్మ వచ్చారు. మా నాన్న ఇంట్లో లేరు. మా మామ్మ రాగానే వివరాలన్ని మా అమ్మ దగ్గర కనుక్కుని, పెళ్లికొడుక్కి తల్లి లేదని తెలిసి "హవ్వ! ఆడదిక్కు లేని చోట పిల్లనిస్తామిటే... రేపు కాపురానికి వెళ్లినప్పటినించీ కష్టానికైనా, సుఖానికైనా ఇంట్లో ఆడతోడు ఉండద్దూ! వాడంటే మగాడు, ఆడదానివి నీకైనా తెలియద్దుటే పార్వతీ..." అంటూ మా అమ్మని దులిపేసింది.

"నారాయణ ఘనాపాఠిగారి సంబంధం ..." అంటూ మా అమ్మ నీళ్లు నమిలింది.

"నారాయణ ఘనాపాఠిగారి సంబంధం అయితే ఏంటిట! మన పిల్లకేమైనా కన్నొంకరా...? కాలొంకరా...? అయినా వాళ్లంతట వాళ్లు వచ్చి పిల్లనడిగారని ముందూ వెనకా చూసుకోకుండా ఒప్పేసుకోవడమేనా? చిన్నవాడు రానీ మాట్లాడుతాను" అంది మా మామ్మ ఆవేశంగా. చిన్నవాడంటే మా నాన్న.

ఒకసారి ఇలాగే మా మామ్మ మా అమ్మని ఏదో అంటూంటే "ఎప్పుడూ మా అమ్మని తిడ్తావేం?" అన్నాడు మా తమ్ముడు. మా అమ్మే అనిపించిందని మా మామ్మ అనుకుంటుందని భయపడ్డాను. సినిమాల ప్రభావం! కానీ మా మామ్మ "ఒరేయ్.. అది నీకు అమ్మ కాకముందే నాకు కోడలురా! ఈ ఆపేక్ష నీ పెళ్లాం వచ్చిన తర్వాత చూపించు, భడవా...! అయినా నీకిక్కడేం పనిరా, కుండల్లో గుఱ్ఱాలు తోలుకుంటూ! పో... అవతలికి" అని వాడిని కసిరి, "చూసావుటే... వీడెన్ని మాటలు నేర్చాడో...!" అంది మా అమ్మతో నవ్వుతూ.

ఇందాకే విసుక్కుంది కదా మా మామ్మ, అంతలోనే "పిల్ల పెళ్లి అన్నారని నీ తోడికోడలు పసుపు, కుంకం పంపించిందే పార్వతీ! అట్లపెనం అరిగిపోయింది కదా... ఇది చూడు ఎంత బావుందో. డబ్బాసోల అంచులు చిట్లిపోయి గీసుకుపోతోందే... ఇంకోటి తెచ్చాను. మనింట్లో కృష్ణతులసి విత్తనం పోయింది కదే, ఇదిగో... వెన్ను. ఈ బుల్లి రోలు చూసావా... ఏ ఏలక్కాయలో, మిరియాలో కొట్టుకోవడానికి బావుంటుంది. వడియాలకోసం బూడిదగుమ్మడి కాయ; పులుసులోకి మంచిగుమ్మడికాయ; పచ్చడికి గోంగూర; అరటి ఊచ; చిట్టింటాకు..." ఇలా వ్యాఖ్యానం చేస్తూ బయటపెట్టిన వస్తువులతో సగం గది నిండిపోయింది.

మా అమ్మ వాటన్నింటినీ తన్మయత్వంతో చూస్తోంది. చివరికి "నీ కట్టుడు చీరెలు బాగా పాతబడ్డాయే పార్వతీ! వాకిట్లోకి మూటలవాడు వస్తే నీకు రెండూ, నీ తోడికోడలకి రెండూ తీసుకున్నాను. ఈ రంగులు నువ్వీమధ్యలో కట్టలేదు కదా..." అంటూ పెట్టెలోంచి రెండు చీరెలు తీసి మా అమ్మ చేతిలో పెట్టింది. మా అమ్మ వాటిని తిరగా బోర్లా వేస్తూ మురిసిపోయింది. మా మామ్మ, అమ్మ నాకీ జన్మకి అర్థం కారు. మా అమ్మేమో "పెద్దవాళ్లు మన మంచికే చెప్తారు. మీ మామ్మకి నేనంటే ఏమన్నా కోపమా! చిన్నదానివి, నీకిప్పుడు తెలీదులే" అని నవ్వేస్తుంది.

ఇంతలో మా నాన్న వచ్చారు. మా మామ్మ మాట మా నాన్న కాదనరు. సో... ఈ సంబంధం కాన్సిల్. ఈ ఆనందంలో నేను ఇంజనీరింగ్ చదువుతానంటే మా మామ్మే అడ్డం కొట్టిందన్న విషయం తాత్కాలికంగా మర్చిపోయాను. కానీ మా నాన్న ఏం చెప్పారో కానీ, మా మామ్మ,

"పోనీలే ఏం చేస్తాం... అన్నీ కావాలంటే కుదరద్దూ! అసలే ఈ రోజుల్లో ఆడపిల్లలకి సంబంధం దొరకటమే కష్టంగా ఉంది. కాళ్లదగ్గరకి వచ్చిన సంబంధం కాలదన్నుకోకూడదు" అని ప్లేట్ మార్చేసింది.

నాకు మా మామ్మ మీద పీకలదాకా కోపం వచ్చింది. ఇంక లాభం లేదని, ఏకంగా మా నాన్నతోనే చెప్పాను.

"వాళ్లు అంత మూర్ఖంగా ఏమీ లేరు. నువ్వు చదువుకోటానికి ఒప్పుకుంటారు. నేను మాట్లాడుతానులే" అన్నారు.

మా నాన్న, పెదనాన్న వెళ్లి ముహూర్తం పెట్టుకొచ్చారు. వాళ్లు రాగానే అక్కడి మనుషులు, ఇల్లు, వాకిలి గురించి ఎంక్వైరి చేసి సంతృప్తి చెందింది మా మామ్మ. "పరీక్షలైపోయాయి కదా అని స్నేహితులు, సినిమాలు అంటూ ఎండలో తిరగకు, నల్లపడతావు. రోజూ ఒంటికి పసుపు, మీగడ రాసుకుని, నలుగు పెట్టుకుని స్నానం చేయి. చక్కగా కళకళ్లాడుతూ ఉంటావు" అంటూ మా మామ్మ పెళ్లి హడావిడి నాతోనే మొదలు పెట్టంది.

"నేను హడావిడిగా అటూ ఇటూ తిరగలేను. ఏదో వేళకింత ఉడకేసి పెడ్తాను, బయటపనులు నువ్వు చూసుకోవే పార్వతీ..." అంటూ వంటింటిని ఆక్యుపై చేసింది.

అప్పడాలు ఒత్తుతూ, వడియాలు పెడ్తూ, "కాపురానికొచ్చి ఇన్నేళ్లయినా నీకింకా పనిలో వివరం తెలియలేదేమే పార్వతీ..." అంటూ మా అమ్మని అదిలిస్తూ మా మామ్మ నానా హైరానా పడిపోతోంది. మధ్య మధ్య నాకుపదేశాలు –

"బారెడు పొద్దెక్కేదాకా పడుకోకు; మామగారి, బావగారి ఎదురుగా కూర్చోకు; పెద్దవాళ్లతో వేళాకోళాలు, వెక్కిరింతలు వద్దు; ఊరూరికే నవ్వకు; కసురుకుంటూ మాట్లాడకు – విసుక్కుంటూ పనిచేయకు; ఇక్కడలాగా మాటకి మాట చెప్పకు – కాస్త వినయం, వందనం నేర్చుకో; ఆడపడుచు, తోడికోడలితో పొరపొచ్చాలు లేకుండా కలిసిమెలిసి ఉండాలి; కట్టు మాయకుండా, బొట్టు మాయకుండా సలక్షణంగా ఉండు...." ఇలా మా అమ్మ, మామ్మ మార్చి మార్చి చేస్తున్న ఉపదేశాలు అనంతంగా సాగుతూనే ఉన్నాయి. మా మామ్మయితే, ప్రతి దానికీ "నవ్వగరాదు పలుమారు ..., మాసిన తల మాసిన ఇల్లు ..." లాంటి కుమారీ శతకంలో పద్యాలు జోడించేది.

నాకీ పెళ్లి ఏమాత్రం ఇష్టంగా లేదు. నాకిష్టం లేదని ఇంతకన్నా ఎలా చెప్పలో తెలియలేదు. గట్టిగా పోట్లాడడాలు, ఏడవడాలు, అన్నం మనేయడాలూ నాకు చేతకాదు. ఇంతవరకూ ఆ అవసరం రాలేదు. మేమడిగినవేవీ మా అమ్మా నాన్నా ఎప్పుడూ కాదనలేదు, వాళ్లు చెప్పినదానికి మేమెప్పుడూ ఎదురు చెప్పలేదు. ఇప్పుడు నా మాట ఎందుకు వినటంలేదో నాకర్థం కావటంలేదు. మా ఫ్రెండ్స్ అందరూ హాయిగా చదువుకుంటూంటే, నేనొక్కదాన్నే ఇలా పెళ్లి చేసుకుని... నాకు ఏడుపుకన్నా కోపం ఎక్కువ వస్తోంది. ఇష్టం లేని పెళ్లి తప్పించుకోవడానికి ఏమైనా మార్గముందా అని నేను చూసిన సినిమాలన్నీ గుర్తు తెచ్చుకున్నాను. అవేవీ ఉపయోగకరంగా, ప్రాక్టికల్‌గా అనిపించలేదు. నా బాధ ఇంట్లోవాళ్లే కాదు, నేను దణ్ణం పెట్టుకున్న దేవుళ్లు కూడా పట్టించుకోలేదు. పెళ్లయిపోయింది. అత్తగారింటికి పంపేటప్పుడు ఏడుస్తున్న మా అమ్మ మీద "నేనెంత వద్దంటున్నా నాకు పెళ్లి చేసి ఇప్పుడు ఏడుస్తావెందుకు?" అని అరిచి, అది విని "ఇంత అయోమయం మేళం ఎలా బతుకుందే..." అంటూ కళ్లు తుడుచుకుంటున్న మా మామ్మని మింగేసేట్టు చూసి విసవిసా నడుచుకుంటూ వెళ్లి కారెక్కేసాను.

మా ఆడపడుచు, బావగారు పిల్లల వేసవి సెలవలు అయ్యేవరకూ ఉన్నారు. వాళ్లందరూ వెళ్లిపోయాక కానీ నాకు దిగులు మొదలు అవలేదు. అన్నిటికన్న ముఖ్యంగా మా కాలేజ్ రిఓపెన్ అయిఉంటుంది, నా చదువు ఆగిపోయిందనే భావనే చాలా బాధగా ఉంది. ఆ బాధలో నేనసలు హైదరాబాదు వెళ్లనే వెళ్లను, అమ్మ, నాన్న వచ్చినా అసలు మాట్లాడను అనుకుంటూ బోలెడు శపథాలు చేసుకున్నాను.

ఈ వాతావరణానికి, నే పెరిగిన వాతావరణానికి ఏమాత్రం సంబంధం లేదు. మా మామగారు వేదాధ్యాపకులు. సుమారు పదిహేనుమంది విద్యార్థులు. ఒక పెద్ద కంపౌండ్. గేటుకెదురుగా కాంపౌండ్ మధ్యలో శారదామ్మవారి గుడి. మా అత్తగారిల్లు; పూజారి గారి ఇల్లు; గుడి, వేద పాఠశాల ట్రస్ట్ మేనేజర్ ఇల్లు; విద్యార్థులు ఉండటానికి ఒక పెద్ద హాలు; విద్యార్థులు చదువుకోవడానికి ఒక హాలు; విద్యార్థులకి వంట చేసేవాళ్ల ఇల్లు; ఒక చిన్నసైజు కళ్యాణమండపం, దానికి ఆనుకుని నాలుగు గదులు – ఇవన్నీ గుడికి రెండు వైపులా ఉండేవి. కాంపౌండ్ లో ఒక పక్కగా మంచి నీళ్ల పంపు. ఇక్కడున్న అందరికీ మదే. రోజూ పొద్దున్న పంపులో నీళ్లు వస్తున్నప్పుడు అందరూ తడిబట్టలతో రెండు మూడు బిందెలు మంచినీళ్లు

మడిగా పట్టుకుంటారు వంటకీ, తాగడానికీ. మిగిలిన అవసరాలికి బావి నీళ్లే. అందరిళ్లు ఒకే మోడల్. ముందు ఒక వరండా, లోపల ఒక హాలు, దానికి అవతల వంటగది, హాలుకి ఒక పక్కగా బెడ్‌రూం. ప్రతీ ఇంటికి విడిగా వెనకవైపు బావి, బాత్‌రూములు.

మా మామగారు తెల్లవారుఝామునే లేచి, బావిదగ్గర స్నానం చేసి, మడి కట్టుకుని బయట వరండాలో కూర్చుని సంధ్యావందనం, అనుష్ఠానం చేసుకుని పదకొండు గంటల వరకు పాఠం చేప్పేవారు. అప్పుడు ఇంటికి వచ్చి స్నానం చేసి మడి కట్టుకుని దేవతార్చన, భోజనం చేసి మళ్లీ సాయంకాలం నాలుగు గంటల వరకు పాఠం చేప్పేవారు. సుర్యాస్తమయం వేళకి సంధ్యావందనం, ఆ తర్వాత ఫలహారం చేసి వరండాలోనే పడుకునేవారు. ఒక్క భోజనానికి తప్ప దాదాపు ఇంట్లోకే వచ్చేవారు కాదు.

ఇంక ఇంట్లో టివి కాదుకదా, కనీసం గ్యాస్ స్టవ్ లేదు. కుంపటి మీదే వంట. నాకు ఊహ తెలిసి నేనెప్పుడూ కుంపటిమీద వంట చూడలేదు. ఇదంతా చూస్తుంటే నాకేదో బ్లాక్ ఎండ్ వైట్ సినిమాలా ఉండేది. మా ఇంటినే మా ఫ్రెండ్స్ "నైంటీన్ సిక్స్ టి మోడల్" అనేవాళ్లు. ఇది ఏకంగా "నైంటీన్ ఫోర్టి మోడల్!"

ఇదంతా ఒక ఎత్తు, మాకివీడు అత్తయ్య ఒక ఎత్తు. దాదాపు డెబ్బైయేళ్ల మనిషి. మంచి పొడుగు. పొడుగుకి తగ్గ లావు. నలుపు కిందకి వచ్చే ఒంటి రంగు. ముందు రెండుపళ్లు కొంచెం ఎత్తు. పెద్ద గొంతు. ఇక్కడ మాట్లాడితే నాలుగిళ్ల అవతలకూడా వినిపిస్తుంది. పూర్వ సువాసిని. ఆ పూర్వకాలం వేషంలోనే ఉండేది. హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ పని చేస్తూ ఉండేది.

"హమ్మయ్య, వంటిల్లు కడగటం అయిపోయింది. అంటగిన్నెలు బయట పడేసాను. బట్టలు ఇంకా తడపలేదు..." ఇలా చేస్తున్న పనికి, చేయాల్సిన పనికి రన్నింగ్ కామెంటరీ ఇస్తూ ఉండేది. అన్నిటికంటే ఆవిడ వస్తువులతో మాట్లాడడం వింతగా ఉండేది. ఒక గిన్నో, పళ్లెమో అక్కడ పెట్టి "ఇక్కడే ఉండు... కదలకు" అనో; ఏ నిమ్మకాయో దొర్లిపోతుంటే పట్టుకుని "ఇప్పుడెక్కడికి పోతావు" అనో; ఏదన్నా బుట్ట దారిలో ఉంటే "ఇలా మధ్యలోకొస్తావేమే... పక్కన ఉండక" అనో — ఇలా ప్రతి వస్తువుతో మనిషితో మాట్లాడినట్టు మాట్లాడుతూ ఉండేది. ఆవిడకి రిన్ సబ్బు, నిర్మా పౌడర్ అంటే మహా ఇష్టం. పనిమనిషి తోమిన గిన్నెలని మళ్లీ నిర్మా పౌడర్ బూడిదలో కలిపి కొబ్బరి పీచుతో తోమేది, "ఎంత మసి... ఎంత మసి..." అంటూ. చాకలి ఉతికిన బట్టలు మళ్లీ ఒకసారి రిన్ సబ్బు పట్టించి ఝాడించి ఆరేసేది, "ఎంత మురికి... ఎంత మురికి..." అంటూ. అన్నింటినీ తెల్లగా తోమి, ఉతికిన తర్వాత ఆవిడ మొహం శత్రుసంహారం చేసిన చక్రవర్తిలా ఒక రకమైన గర్వంతో మెరిసేది.

నాకు అత్తయ్యని చూస్తే ఎంత వింతగా ఉన్నదో ఆవిడకి నన్ను చూస్తే అలాగే ఉండేది. మాకెవరికీ బిగ్గరగా మాట్లాడే అలవాటు లేదు. ఆవిడ అంత పెద్ద గొంతుతో మాట్లాడుతుంటే నాకు గొంతు పెగిలేది కాదు. ఆవిడ "అలా నీలో నువ్వు గొణుక్కుంటావేమిటే... కాస్త పెద్దగా మాట్లాడు" అనేది. ముఖ్యంగా నా భోజనం చూస్తే ఆవిడకి నవ్వులాటగా ఉండేవి. "ఏమిటే... ఈ పిట్ట తిండి! గిరగిరా తిరుగుతూ కాళ్లా చేతులా పని చేసుకునే వయసులో..." అంటూ కంచం నిండా అన్నం పెట్టి తినమని ఎదురుగా కూర్చునేది. "ఆ నెయ్యి వేసుకోవడం ఏమిటే, కాస్త చెయ్యి తడవనీ..." అంటూ చారెడు నెయ్యి వేసేది. అత్తయ్య పక్కన నేను ఏనుగు ముందు ఎలుక పిల్లలాగా ఉండేదాన్ని.

మా వారు కాలేజి పని, రీసెర్చ్ పనితో పొద్దున వెళితే రాత్రికే వచ్చేవారు. లేకపోతే చదువుకుంటూనో, రాసుకుంటూనో ఉండేవారు. రోజంతా నేను, మాకివీడు అత్తయ్య — ఇద్దరమే ఇంట్లో. బెరుకు బెరుకుగా అటూ ఇటూ తిరుగుతుండేదాన్ని. నాలుగు రోజులు పోయాక కొంచెం అలవాటుపడి, "అత్తయ్యా, ఏదైనా పని చెప్పండి, చేస్తాను" అన్నాను.

ఆవిడ "బీరకాయ తరిగి పెడతావా, నేను మడి కట్టుకునేటప్పటికి. కారంపెట్టి వండుతాను, మరీ సన్నగా తరక్కు" అన్నది.

వంటింట్లో పీలర్ లేదు. కత్తిపీటతో పెచ్చు తీయడం రాదని చెప్పటానికి మొహమాటపడి, ఏదో తంటాలు పడి కత్తిపీటతోనే పెచ్చు తీసి తరిగాను. అత్తయ్య వచ్చి చూస్తూనే "ఏమిటీ తరగటం! పెచ్చుతో పాటు ఇంత కండ పోతే ఇక సంసారం చేసినట్లే! ఇంతత ముక్కలా తరిగేది! లే, నేను తరుక్కుంటాను" అని ఒక్క కసురు కసిరి కత్తిపీట లాక్కుంది. నాకు కళ్లనీళ్లు ఒక్కటే తక్కువ.

మా మామగారికి భోజనం వడ్డిస్తూ, "మీ హైదరాబాదు కోడలికి కూర తరగటం కూడా నేర్పకుండా కాపురానికి పంపింది మీ వియ్యపురాలు. బీరకాయ తరగమంటే నాలుగు ముక్కలు చేసి నా మొహాన పడేసింది. నేను మళ్లీ సన్నగా తరుక్కున్నాను. కంటికింపుగా ఉంటే కానీ కడుపుకింపుగా ఉండదు నాయనా!" అంది. నేను ఆయన ఏమంటారో అని భయంగా చూస్తున్నాను.

"నెమ్మదిగా నేర్చుకుంటుందిలే" అన్నారు తల కూడా ఎత్తకుండా.

కొద్ది రోజులకి గ్యాస్ కనెక్షన్ వచ్చింది. స్టవ్, సిలిండర్ తెచ్చి ఫిక్స్ చేసి వెళ్లాడు. వెంటనే అత్తయ్య "ఇదిగో సీతారావమ్మా... చూసావా! హైదరాబాదు కోడలు వచ్చిందని ఘనాపాఠిగారు గ్యాస్ పొయ్యి కొన్నాడు" అంది పూజారి గారి భార్యతో.

నాకు అక్కడ నుంచి పారిపోవాలనిపించింది. "స్టవ్ వంటింట్లో పెట్టనా?" అడిగాను ఆ ఎంబరాస్‌మెంట్ తట్టుకోవడానికి.

"ఆ గ్యాస్ బండని రోడ్డు మీద దొర్లించుకుంటూ వచ్చాడు.

"చూడు ఎంత మట్టిగా ఉందో!" అని నిర్మా పౌడర్, బూడిద వేసి కొబ్బరిపీచుతో సిలిండర్ ని బరబరా తోమి, "చూసావా ఎంత మురికో!" అంటూ రెండు బిందల నీళ్లు పోసి కడిగి, "ఇప్పుడు పెట్టు వంటింట్లో" అంది.

నేను నెమ్మదిగా కుంపటి అంటించటం, పీలర్ లేకుండా కత్తిపీటతో కూరల పెచ్చు తీయటం, నీళ్లు కారకుండా మడిబట్టలు గట్టిగా పిండడం, పారబోయకుండా బావిలోంచి నీళ్లు తోడడం వగైరా పనులు నేర్చుకుంటున్నాను. ఏదైనా పని చెడగొడ్తే వెంటనే "మీ హైదరాబాదు కోడలు ... " అంటూ మా మామగారికి చెప్పేది. ఆయన అసలు పట్టించుకునేవారే కాదు.

శ్రావణమాసం నోములకి తీసుకెళ్లడానికి మా నాన్న వచ్చారు. అంతవరకూ చేసుకున్న శపథాలేమైనాయో, మా నాన్నని చూడగానే పరుగెత్తుకుంటూ ఎదురెళ్లి చేతిలో సంచి అందుకున్నాను.

"అమ్మాయి ఏమైనా సహాయంగా ఉంటోందా?" అని అడిగారు నాన్న భోంచేస్తూ.

"మీ అమ్మాయికేం నాయనా, బంగారుతల్లి కదూ!" అంది అత్తయ్య. నేను ఆశ్చర్యపోయి చూసాను. అమ్మనీ, తమ్ముడినీ చూడొచ్చనే సంతోషంతో హైదరాబాద్ బయలుదేరాను.

మాకివీడు అత్తయ్య కబుర్లు చెప్పుకుని నేను, మా తమ్ముడు పడీ పడీ నవ్వుకున్నాము. "ఇంట్లో పెద్దవాళ్లు అలాగే అంటారు. అలా వెక్కిరించకూడదు" అని మా అమ్మ అంటున్నా పట్టించుకోలేదు. ఈ నెల రోజులలో నాకు పని నేర్పాలని మా అమ్మ నాతో రోజూ మడితో వంట చేయించింది. మిక్సీ ఉన్నా నాచేత రోట్లో పచ్చళ్లు నూరించింది, పప్పు రుబ్బించింది. నేను మా కాలేజి ప్రిన్సిపాల్‌ని కలిసి డిసెంబర్‌లో ఎగ్జామ్ ఫీజు కట్టి చివరి రెండు మూడు నెలలు కాలేజికి వచ్చేటట్లు పర్మిషన్ తీసుకున్నాను. నాకు కావాల్సిన పుస్తకాలు కొనుక్కున్నాను. మా పెళ్లిలో పెళ్లికొడుకు బావున్నాడటే మా మామ్మ ఒప్పుకోలేదుట. "పెళ్లికొడుకు బానే ఉన్నడు కానీ, మా గాయత్రి కన్నా ఒక ఛాయ తక్కువే" అన్నదిట అందరితో – పెళ్లి ఆల్బం చూస్తుంటే మా తమ్ముడు నవ్వుతూ చెప్పాడు. మా మామ్మకి తన మనవళ్ల, మనవరాళ్ల కంటే అందమైనవాళ్లు, తెలివిగలవాళ్లు, బుద్ధిమంతులు ఎవరూ లేరు మరి!

శ్రావణమాసం అయిన తర్వాత మా అమ్మ నన్ను మా అత్తగారింట్లో దింపింది. బయలుదేరేముందు మా నాన్న "భర్తని, పిల్లలని జాగ్రత్తగా చూసుకోవటంలో విశేషం ఏమీలేదు, అది సహజం. ఇంట్లో పెద్దవారు అత్తయ్యగారిని, మీ మామగారిని కనిపెట్టుకుని చూసుకోవాలి" అంటూ జాగ్రత్తలు చెప్పారు. వెళ్తూ వెళ్తూ మా అమ్మ "అన్ని పనులు మీరే చేసుకుంటున్నారు. ఈ నెలరోజులలో గాయత్రికి కొంచెం పని అలవాటు చేసాను. కనీసం రాత్రిపూటైనా మడి కట్టుకోమని చెప్పండి" అని అత్తయ్యతో చెప్పి మరీ వెళ్లింది.

మా అమ్మావాళ్ల దగ్గర ఉండి రావడం వల్లనో, నా చదువు కంటిన్యూ అవుతుందనో, మొత్తానికి నేను కొంచెం హుషారుగానే ఉన్నాను. మధ్యాహ్నాలు నేను తెచ్చుకున్న పుస్తకాలు పరీక్షలకోసం చదువుకునేదాన్ని. లేకపోతే మాకివీడు అత్తయ్య దగ్గర కూర్చుంటే ఆవిడ ఒత్తులు చేసుకుంటూనో, విస్తర్లు కుట్టుకుంటూనో కబుర్లు చెప్పేది.

"నా పుట్టిల్లు, అత్తగారిల్లూ కూడా ఆకివీడే. కాపురానికి వెళ్లి పదేళ్లయినా పిల్లలు పుట్టలేదు. ఇంతలో ఈగతి పట్టింది. మా బావగారువాళ్లు నాకు ఒక గది, ఒక ఎకరం పొలం ఇచ్చారు. ఆ పొలం మీద వచ్చే డబ్బు పెట్టుకుని ఆ గదిలో ఉండేదాన్ని. మీ అత్తగారు పోయిందని విని మీ మామగారిని పలకరించి వెళ్దామని వచ్చాను. నేను వెళ్లేటప్పటికి మీ మామగారు బయటకు వెళ్లాడు పిల్లల్ని పక్కింటివాళ్లకి అప్పచెప్పి. మీ బావగారు ఎనిమిదేళ్లవాడు, ఇంకా ఒడుగు కాలేదు. మీ ఆడపడుచు ఐదేళ్లది, మీ ఆయన ఏణ్ణర్థం పిల్లవాడు. నేను వచ్చేటప్పటికి మీ బావగారు, ఆడపడుచు దెబ్బలాడుకుంటున్నారు, మీ ఆయన ఏడుస్తున్నాడు. వాళ్లని విడదీసి, మీ ఆయన్ని చంకనేసుకుని, నేతెచ్చిన అరటిపళ్లు తలోటీ ఇచ్చి 'మీ అత్తయ్యనిరా' అని లోపలికి తీసుకెళ్లాను. ఇల్లంతా ఎలా ఉందనుకున్నావు! ఎక్కడి వస్తువులక్కడ, దుమ్ముకొట్టుకుని లంకాదహనమల్లే ఉంది. పిల్లలు కూడా దుమ్ముకొట్టుకుని ఉన్నారు. వెనక దొడ్లో పొయ్యి రాజేసి కాగుతో వేణ్ణీళ్లు కాచి అందరికి తలంటు పోసి ముందు ఒంటి మురికి వదల్చాను. పిల్లలందరికీ పాలిచ్చి ఆడుకోమని పంపించాను. ఆ తర్వాత ఇల్లు శుభ్రం చేసి మడి కట్టుకుని వంట చేసేటప్పటికి మీ మామగారు రానే వచ్చాడు. నన్ను చూస్తూనే 'వచ్చావా, అక్కాయ్యా!' అన్నాడు. 'వంటయింది, మడి కట్టుకో నాయనా! వడ్డిస్తాను' అన్నాను. అదే పలకరింపు! అదే పరామర్శ! ఇంట్లో ఆనపకాయుంటే పాలుపోసి వండి, రాచ్చిప్పలో మామిడి ఒరుగులుంటే పప్పులో వేసి, చింతకాయ పచ్చడి నూరి, పిల్లలున్నారని చారు పెట్టాను. అంతే! అదే తండ్రీ, పిల్లలూ ఆవురావురుమంటూ తిన్నారు. అలా రెండు గుడ్డలు సంచీలో కుక్కుకొచ్చిందాన్ని ఇక్కడే ఉండిపోయాను. పాతికేళ్లైంది! ఉండగలిగానంటే నా గొప్పేమీ లేదు, వాళ్ల గొప్పతనమే! నేనేమి పెట్టానో... వాళ్లేమి తిన్నారో... మూడోకంటికి తెలీదు. రొష్టు లేని పిల్లలు. మీ ఆయన పసివాడు కదూ, దింపితే ఏడ్చేవాడు. చంకనేసుకునే పనిచేసుకునేదాన్ని. రాత్రిపూట పిల్లలు ముగ్గురూ నాదగ్గరే పడుకునేవాళ్లు. మీ మామగారు మాత్రం! ఇదెందుకు చేసావని కానీ, అదెందుకు చేయలేదని కానీ ఏనాడూ అనలేదు. అయినా మీ మామగారేమన్నా పరాయివాడా, మా చినతాతగారి మనవడేగా!"

ఆవిడలా చెప్తుంటే నేను నోరు తెరుచుకుని వింటుండేదాన్ని.

"మరి మీ పొలం ఎవరు చూస్తున్నారు?" అడిగాను.

"నాకిక్కడ డబ్బుతో పనేముందే! పిల్లలుగలవాళ్లని మా బావగారినీ, మరిదినీ వాడుకోమన్నాను" అంటుంటే నాకావిడ ఏదో వేరే లోకంలోని మనిషిలాగా అనిపించింది.

అత్తయ్య ఊరికి వెళ్లింది. మిగిలిన పనంతా చేసినా పొద్దున్నే తడిబట్టలతో బయటకువెళ్లి మంచినీళ్లు తేవాలనే అలోచనకే రాత్రంతా టెన్షన్‌తో నిద్ర పట్టలేదు. ఇంతవరకూ అత్తయ్య ఆపని నాకు చెప్పలేదు, నేనుకూడా చేస్తాననలేదు.

పొద్దున్నే ఇద్దరు వేద విద్యార్థులు వచ్చి "మాకివీడు మామ్మగారు మడినీళ్లు తెచ్చిపెట్టమన్నా"రంటూ బిందెలు పట్టుకెళ్లారు.

హమ్మయ్య అనుకున్నాను. "ఆ విద్యార్థులు మంచినీళ్లు తెచ్చిపెట్టారుటే?" అంటూ అడిగింది మర్నాడు మధ్యాహ్నం వస్తూనే. తెచ్చారన్నాను.

"నేనే వెళ్తూ వెళ్తూ చెప్పాను. హైదరాబాదు పిల్లవు కదా! తడిబట్టలతో నీళ్లు తేవడానికి సిగ్గుపడతావని" అంది నవ్వుతూ.

ఎప్పుడూ "హైదరాబాదు కోడలు, హైదరాబాదు పిల్ల" అంటే కోపం వచ్చే నాకు చిత్రంగా ఇప్పుడు కోపం రాలేదు.

దసరాకి ముందు గుడికీ, అందరి ఇళ్లకీ సున్నాలు వేయించారు. నేను రంగురంగుల పెయింట్‌తో ఇంట్లోనూ, గుళ్లోనూ ముగ్గులు, గడపలకి డిజైన్లు వేసాను. అత్తయ్య "ఇవన్నీ ఘనాపాఠిగారి కోడలు వేసింది. హైదరాబాదులో బియ్యే చదివింది" అంటూ గొప్పగా చెప్పింది అడిగిన వాళ్లకీ, అడగని వాళ్లకీ!

తర్వాత రెండు నెలలకి వేవిళ్లు మొదలవడంతో నా చదువు పూర్తిగా అటకెక్కింది. నాకు వేవిళ్లు విపరీతంగా ఉండేవి. ఇంట్లో ఏదైనా వండుతున్న వాసనకే తిప్పేసేది. ఏమి తిన్నా ఇమిడేది కాదు. పాపం అత్తయ్యే రకరకాలుగా వండి "పోనీ ఇదన్నా సయిస్తుందేమో తిను" అంటూ ఏదో ఒకటి పెడ్తూ ఉండేది. "అయినా ఏడోనెల వచ్చేదాకా వేవిళ్లేమిటే, విడ్డూరం కాకపోతే!" అంటూ నవ్వేది. "ఒంట్లో కులాసాగా ఉందిటే, అమ్మా!" అంటూ వెనకాలే తిరిగేది. నాకు నీరసంగా ఉండో, ఒంట్లో బాలేకో పడుకునుంటే "ఏమిటో, ఆడపుటక! ఎంత కష్టపడితే వస్తారమ్మా పిల్లలు ఒళ్లోకి!" అనుకుంటూ పక్కనే కూర్చునేది. మా మామ్మ అనే 'ఆడతోడు' అంటే ఏమిటో అప్పుడు తెలిసింది.

నాకు ఆడపిల్ల పుట్టింది. అత్తయ్యకి ఎంత అపురూపమో దాన్ని చూస్తే!

“అమ్మ కడుపు చల్లగా, అత్త కడుపు చల్లగా…” అంటూ ఒళ్లంతా నూనె పట్టించేది.

"బావినీళ్లు పోస్తే పిల్ల నల్లపడిపోదూ!” అంటూ మంచినీళ్లతో స్నానం చేయించేది. పెసరపప్పు, బియ్యం, కచ్చూరాలు వేసి తిరగట్లో సున్నిపిండి విసిరింది, “మరలో పట్టిస్తే అన్నిరకాల పిళ్లు కలుస్తాయే. అసలే లేత ఒళ్లు. ఆనక ఏ దురదలో, దద్దుర్లో వస్తే కష్టం” అంటూ. బజారు కాటుక పెడ్తే మంచిది కాదని, పచ్చకర్పూరం వేసి ఇంట్లో కాటుక, చాదు వేసింది. దానికి శుభ్రంగా నీళ్లుపోసి, సాంబ్రాణిపొగ వేసి ఉయ్యాలలో పడుకోపెట్టి “అమ్మాయి మామలూ…, చందమామలూ …” అంటూ జోలపాట పాడేది. ఒళ్లో కూర్చోపెట్టుకుని “తారంగం… తారంగం…” అంటూ పాడి గోవిందా కొట్టించేది. “అంత పెద్దగా పాడ్తే అది దడుసుకుంటుందేమోనే…” అనేవాడు మా తమ్ముడు. “ఛ, ఎందుకు దడుసుకుంటుందీ… అత్తయ్య అంత చక్కగా పాడ్తుంటే!” అనేదాన్ని. అదేమిటో, నాకిప్పుడు అత్తయ్య మాటలు, పనులు, ఆఖరుకి నన్ను తిట్టే తిట్లు, “మీ హైదరాబాదు కోడలు…” అంటూ మా మామగారికి, “మీ ఆవిడేఁ…” అంటూ మా వారికి చెప్పే కంప్లైంట్లు కూడా చాలా సహజంగా అనిపిస్తున్నాయి. మా అమ్మ, మామ్మ మెల్లిమెల్లిగా అర్థం అవుతున్నారు.

నెమ్మదిగా ఇంట్లోకి టివి, మిక్సి, ఫ్రిడ్జ్, గ్రైండర్ వచ్చాయి. “అదేమిటే… పొత్రంతో పాటు రోలు కూడా తిరుగుతుంది! కరంటు దండగ కాదూ…” అంది అత్తయ్య గ్రైండర్ని చూసి అమాయకంగా. మంచినీళ్ల పంపు కూడా అందరి ఇళ్లల్లోకి వచ్చింది. నాకు రెండోసారి కూడా అమ్మాయే పుట్టిందని దిగులుపడుతున్న మా అమ్మతో “తప్పమ్మా… అలా అనుకోకూడదు, భగవంతుడు ఇచ్చిన పిల్లలు” అని నచ్చచెప్పింది. మా పిల్లలని దాదాపు డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లిందే లేదు. అత్తయ్యే ఇంట్లో చిట్కా వైద్యం చేసేది.

మా వారికి యూనివర్సిటిలో ఉద్యోగం రావడంతో మేము హైదరాబాదు వచ్చేసాము. అత్తయ్యని మాతో రమ్మంటే రాలేదు. మా మామగారితో పాటు అక్కడే ఉండిపోయింది. కొన్నాళ్లకి అత్తయ్య మరిదివాళ్లు మా మామగారిని బతిమలాడి అత్తయ్యని తీసుకెళ్లారు.

“మాతో చెప్పకుండా ఎందుకు పంపించారు?” అని అడిగాను మా మామగారిని. నా వస్తువుని నాకు చెప్పకుండా ఎవరికో ఇచ్చేసినట్లు అనిపించింది.

“ఇన్నాళ్లు మన కోసం కష్టపడింది. కనీసం ఇప్పుడైనా ఆవిడ పుట్టి పెరిగిన చోట సుఖంగా, సంతోషంగా ఉంటుందని” అన్నారు మా మామగారు. అత్తయ్యకి ఆకివీడంటే ఉన్న మమకారం తెలుసు కాబట్టి ఊరుకున్నాము. తర్వాత మా మామగారు కూడా ఓపిక తగ్గి పాఠాలు చెప్పలేక మా బావగారి దగ్గరకు వెళ్లిపోయారు, కృష్ణాతీరం అంటూ.

ఇది జరిగి దాదాపు అయిదేళ్లయింది. మధ్యలో రెండు మూడుసార్లు మా వారు ఏదైనా ఫంక్షన్లకి వెళ్లినప్పుడు చూసొచ్చారు కానీ నాకసలు ఆత్తయ్యని మళ్లీ చూడడం కుదరలేదు. అప్పుడప్పుడు ఫోన్లోనే పలకరింపులు. ఈ మధ్యలో అవికూడా తగ్గిపోయాయి, అత్తయ్యకి వినికిడి తగ్గటంతో. ఇప్పుడు ఎలాగైనా అత్తయ్యని చూడాలనే పిల్లల్తోపాటు బయలుదేరాను పిన్నిగారబ్బాయి పెళ్లికి. అక్కడనుంచి ఆకివీడు ఒక అరగంటే ప్రయాణం.

పెళ్లి చూసిన తర్వాత నేను, పిల్లలు, మా తమ్ముడు బయలుదేరి ఆకివీడుకి వెళ్లాము. మేము వెళ్లేటప్పటికి ఇంట్లో అందరూ డైనింగ్ టేబుల్ మీద భోజనం చేస్తున్నారు, టివి చూస్తూ. ఘనాపాఠిగారి కోడలినని పరిచయం చేసుకున్నాను వీధి గుమ్మంలోంచే. “ఓ… అత్తయ్య కోసమా, వెనకవైపుంది” అని మళ్లీ టివి చూడడంలో మునిగిపోయింది ఒక మధ్యవయస్సావిడ.

ఇంటి వెనక దాదాపు పడిపోయే స్థితిలో ఉన్న గదిలో ఉంది అత్తయ్య. గది కూడా కాదు ఒక రేకుల షెడ్డు! మమ్మల్ని చూసి “ఎవరూ…” అంటూ బయటకు వచ్చి, “ఓసి, నువ్వటే… హైదరాబాదు పిల్లా… రా… రా… లోపలికి! వీడు నీ తమ్ముడు కదూ! ఇంట్లో అందరూ కులాసానా నాయనా…” అంటూ ఆప్యాయంగా పలకరించింది.

"ఎలా ఉన్నారు?" అంటూ లోపలికి వెళ్లాను. "ఇదిగో..., పైవాడు ఎప్పుడు పిలుస్తాడా అని చూస్తున్నాను" అంది అత్తయ్య వేదాంత ధోరణిలో.

"ఇదిగో, మీ హైదరాబాదు మనవరాళ్లు" అంటూ పిల్లల్ని చూపించి "అమ్మమ్మకి దణ్ణం పెట్టండే... తాక్కుండా" అన్నాను అచ్చం మా అమ్మలాగే. "అదేమిటే... అంతదూరం నుంచి వచ్చి తాకొద్దంటావు. తర్వాత చెంబెడు నీళ్లు పోసుకుంటాలే" అంటూ ఇద్దరినీ దగ్గరకు తీసుకుని పక్కన కూర్చోపెట్టుకుని "ఎన్నోయేడే?" అనడిగింది.

"పెద్దదానికి పద్దెనిమిది, చిన్నదానికి పదిహేను" అన్నాను.

"అబ్బో... పెద్దవాళ్లయిపోయారే! పట్టుపరికిణీలు, వల్లెలు కూడా వేసుకున్నారే!" అంటూ మురిసిపోయింది. పేరుపేరునా అందరినీ అడిగింది.

"అయినా ఇక్కడ దొడ్లో ఉన్నారేంటి?" అనడిగాను ఆశ్చర్యంగా. నేనేదో అత్తయ్య ఇక్కడ మహారాణిలా ఉంటుందని ఊహిస్తూ వచ్చాను.

"పాత ఇల్లు పడగొట్టి కొత్తది కట్టారుగా, అప్పటినించీ నేనీ గదిలోనే ఉంటున్నాను. రాను రానూ ఇంట్లో కూడా మరీ అనాచారం అయిపోయింది. స్నానం కూడా చేయకుండా ఆ పాచిగుడ్డల్తోనే వండుకోవడం, ఆ బల్లమీద తినడం! నా వల్లకాలేదు. కుంపటి, నాలుగు గిన్నెలు తెచ్చుకుని ఇక్కడే వండుకుంటున్నాను. ఏదో నా కాలూ చేయి ఆడినన్నాళ్లు చేసుకుంటాను. ఆపైన వాళ్లిష్టం" అంది.

నేను అత్తయ్యని, ఆ గదిని పరిశీలనగా చూస్తున్నాను. ఈ ఐదారేళ్లల్లోనే వృద్ధాప్యం మీదపడ్డట్టైంది. అంత భారీ మనిషీ, ఇప్పుడు గువ్వలా అయిపోయింది. హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ ఎంతపనైనా ఒంటిచేత్తో చేసే మనిషికి, ఇప్పుడు అడుగు వేయడం కష్టంగా ఉంది. ఖంగున మోగే గొంతులో వణుకు వచ్చింది. చూపు కూడా తగ్గింది. కట్టుకున్న బట్ట మాసిపోయి ఉంది. గదంతా బూజు పట్టి, దుమ్ము కొట్టుకుని ఉంది. ఎప్పుడూ "ఎంత మురికి... ఎంత మట్టి..." అంటూ తోమిందే తోమి, కడిగిందే కడిగి ఇంటినీ ఒంటినీ అద్దంలా ఉంచుకునే అత్తయ్య, మాసినబట్ట కట్టుకుని, ఈ దుమ్ములో ఉండడం చూస్తే నాకు కళ్లనీళ్లు తిరిగాయి.

అవీ ఇవీ మాట్లాడుతూ "మీ పొలం ఎలా ఉంది? నాకు చూపించరూ..." అడిగాను.

"ఇంకెక్కడి పొలమే... అమ్మేసారుగా!" అంది.

"అయితే మీ దగ్గర ఇప్పుడు బోలెడు డబ్బుందన్నమాట" అన్నాను నవ్వుతూ.

"అదంతా మా మరిదీ వాళ్లే చూస్తున్నారు. అయినా నాకెందుకే డబ్బు! ఏదో గిద్దెడు బియ్యం ఉడకేసుకుంటే నాకు రోజెళ్లిపోతుంది." అని, "ఉండండే... మీకు రొట్టెముక్కన్నా కాల్చి పెడతాను, హైదరాబాదు నుంచి వచ్చారు నన్ను చూడాలని" పిల్లల్తో అంటూ లేచింది.

నాకర్థం అయింది. ఆ డబ్బు కోసమే అత్తయ్యమీద ప్రేమ కురిపించి తీసుకెళ్లారన్నమాట. దాదాపు ముప్పై లక్షలు! అవి చేతికి రాగానే బయటకి గెంటేసారు. పాపం, అత్తయ్యకి ఆ సంగతి తెలియడం కూడా లేదు!

మావారికి ఫోన్ చేసి ఇక్కడ సంగతి చెప్పి "అత్తయ్యని మనింటికి తీసుకొస్తాను" అన్నాను.

"అత్తయ్య వస్తుందంటావా?" ఆశగా అని, మళ్లీ "అయినా నాన్నేమంటారో? అత్తయ్య మరిదివాళ్లు ఏమనుకుంటారో?" అన్నారు.

"అదంతా నాకు తెలీదు. అత్తయ్యని ఇక్కడ ఒక్క నిమిషం కూడా ఉంచేది లేదు" అన్నాను మొండిగా.

ఆయన నవ్వి "సరే, అదంతా నేను చూస్తాలే. నువ్వయితే ముందు అత్తయ్యని ఒప్పించు." అన్నారు ఉత్సాహంగా.

"అత్తయ్యకి మడి, ఆచారం ఎక్కువ కదా, నువ్వు చేయగలవా?" అన్నాడు అంతా విన్న మా తమ్ముడు.

"చేస్తాను" అన్నాను స్థిరంగా.

"ఎంత మారిపోయావే! ఇదివరకు మడి ఉన్న ఇంట్లోనే పుట్టకూడదనుకునే దానివి కదా!" అన్నాడు వాడు ఆశ్చర్యంగా.

నేను నవ్వాను. "అత్తయ్య వస్తుందంటావా, ఈ ఊరొదిలి? ఇప్పటికిప్పుడు అన్నీ సర్దుకుని రావద్దూ!" అన్నాడు అనుమానంగా. అత్తయ్యని ఒప్పించగలనన్న నమ్మకం నాకుంది. అయినా సర్దుకోవడానికి అత్తయ్యకేం కావాలి, రెండు జతల బట్టలు తప్ప!

# నిశ్శబ్ద నీరవం

కె.అంజన

బీప్......బీప్... బీప్

ఆ చిన్న శబ్దమే ... నిశ్శబ్దం గా ఉన్న ఆ గదిలో ... భరించలేనంత పెద్దగా ఉంది.

నా గుండె చప్పుడు నాకే వింతగా వినపడుతుంది. అసలు ఎవరన్నా వారి గుండె చప్పుడు ఎలా ఉంటుందో శ్రద్ధ పెట్టి వింటారా?

ఏదైనా భయంకరమైన సంధర్భంలో గుండె వేగం పెరిగినట్లు తెలుస్తుంది.... అంతే...

కానీ...

మిషన్ల సాయంతో నా గుండె చప్పుడు నేను వింటున్నాను –

నా వూపిరి ఉందని తెలుస్తుంది –

మరి –

బరువుగా వున్న నా కనురెప్పలని ఎందుకు తెరవలేకపోతున్నాను –

నా పక్కన ఎవరున్నారో ఎందుకు తెలుసుకో లేక పోతున్నాను –

కనీసం చెయ్యి కూడా కదపలేకున్నా – ఎవరినన్నా పట్టుకోవాలని ఉంది.

ఆ ఆలంబనతో ఇంకొంచం శక్తి దొరుకుతుందా? ఏ అవయవము కదపలేకున్నా !

ఏవరో గదిలోకి వచ్చిన శబ్దం –

"సారీ రవి! ఇలా చెపుతున్నందుకు నాకూ బాధగానే ఉంది. కానీ ఇక మేము చేయగలిగేది ఏమి లేదు. ఆమె శరీరంలోని ఒక్క భాగం కూడా పని చేయటం లేదు. బ్రైన్ డెడ్ అయితే కాదు, కానీ మిషన్ల సాయంతోనే ఈ మాత్రం ఉంది. నిన్నటి నుండి స్పృహ లోకి కూడా రావటం లేదు"

డాక్టరు గొంతు మృదువుగా, ఓదార్పుగా వినపడింది.

ఏంటి వీళ్ళు మాట్లాడేది? .. లేదు . . లేదు, ఇంకా నాలో పోరాడే శక్తి ఉంది. అప్పుడే ఇంత నిరాశగా మాట్లాడొద్దు – మనస్సు ఆక్రోసించింది.

"చూడండి డాక్టర్ ఎంత ప్రశాంతంగా ఉందో మొహం – హాయిగా నిద్ర పోతున్నట్లు. ఇన్నాళ్ళు ఎంత పోరాడింది. ఎంత అందమైన రూపమో అంత కంటే అందమైన మనస్సు తనది. ఎందుకు తనకీ శిక్ష?" దుఃఖంతో గొంతు పెగల్లేదు రవికి.

"ధైర్యం తెచ్చుకో రవి. ఏమి చెయ్యాలో నిర్ణయం నీ చేతిలో ఉంది. కాస్త స్థిమితంగా ఆలోచించుకో"

తలుపు తీసిన శబ్దం –

డాక్టరు వెళ్ళిపోయారా ??

నా చెయ్యి మీద స్పర్శ తెలుస్తుంది ..

రవి – నా భర్త . . నా స్నేహితుడు .. నా ప్రాణం . . . నా సర్వస్వం . . . . .

ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే నా రవి – ఇప్పుడు దుఃఖంతో కదిలిపోతున్నాడు. వెక్కిళ్ళు వినబడుతున్నయ్ – ఏమి చెయ్యలేని నిస్సహాయత. కనీసం తన చెయ్యి పట్టుకోలేని అశక్తత !

------

ఇంజనీరింగ్ అవుతూనే పెళ్ళి సంబంధం వచ్చింది. అప్పుడే పెళ్ళి చేసుకోనని గొడవ చేశా. కానీ నాన్న వినలేదు. మంచి సంబంధం అన్నారు. పైగా అతను కాలేజిలో నా సీనియర్ అంట, నేను తెలుసంట, ఏంటేంటో చెప్పారు, పెళ్ళిచూపులు నిర్ణయించారు.

ఎవరా ఇతను అనే చిన్న క్యూరియాసిటీతో ఒప్పుకున్నా. రవి అనేది చాలా సాధారణమైన పేరు, ఆ పేర తో చాలా మంది ఉన్నారు. ఫొటో కూడా చూపలేదు నాకు.

పెళ్ళిచూపుల తతంగం అంతా చాలా ఎంబరాసింగ్ గా అనిపించింది నాకు. తలెత్తి అతని వైపు కూడా చూడలేకపోయా. నా ఇబ్బంది ఎవ్వరూ గ్రహించటం లేదు వాళ్ల మాటల్లో పడి.

"నేను సునీతతో ఒంటరిగా మాట్లాడొచ్చా" రవి గొంతు విని చప్పున తల ఎత్తి చూసా.

ఎక్కడో చూసినట్లు అనిపించిది... ఎక్కడా??? అన్న ఆలోచనల్లో ఉండగానే "లోపల గదిలోకి వెళ్ళి మాట్లాడుకోండి" అన్న నాన్న మాటలు వినపడ్డాయి.

"నేను ఎవరో మీకు గుర్తురాలేదనుకుంటా" గది లోపలికి వచ్చాక చనువుగా అడిగాడు రవి.

మొహమాటంగా నవ్వాను. నా మౌనం చూసి తనే గుర్తు చేసాడు, రెండు మూడు సంఘటనలు – అప్పుడు గుర్తువచ్చాడు – నా కంటే రెండు సంవత్సరాల సీనియర్ పైగా వేరే డిపార్టుమెంట్లు అవటంతో సరిగ్గా గుర్తు రాలేదు.

నవ్వుతూ మాట్లాడాడు – తన వివరాలన్నీ చెప్పాడు. పీజీ అయిపోయిందంట, అమెరికా ప్రయత్నాలు చేస్తూ ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాడు.

చెల్లెలు తలుపు తట్టి లోపలికి వచ్చేవరకు, దాదాపు గంట సేపు కబుర్లు చెప్పుకుంటూ ఉండిపోయామని గ్రహింపు రాలేదు.

వెంటవెంటనే నిశ్చితార్థం, పెళ్ళి అంతా హడావుడిగా అయిపోయింది. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండటం తన ప్రత్యేకత. అయినా తన గురించి ఏమీ తెలియకుండా బిడియంగా భయపడుతూ తన జీవితంలోకి అడుగు పెట్టా – చాలా తొందరలోనే నా భయాలన్నీ పోయాయి.

రెండు నెలల్లో రవికి అమెరికాలో ఉద్యోగం రావటం, తను అమెరికా వెళ్ళటం – నేను కూడా కొన్నాళ్ళు అత్తగారి ఇంట్లోనే ఉండి అమెరికా లో ఉద్యోగం సంపాదించుకొని కొత్త కాపురం మొదలుపెట్టె సరికి ఒక సంవత్సర కాలం గిర్రున తిరిగి పోయింది.

ఏంతో ఆనందంగా – మా చిన్న జీవితం – మూడేళ్ళకి అందులోకి బుల్లి సంజన –

ఎంత అదృష్టం . . .

. ---.

**రవి –**

ఎందుకు ఇటువంటి శిక్ష మా అందరికి? దేవుడిని నమ్మని నాకు – ఇప్పుడు ఇంకా బలంగా అనిపిస్తుంది దేవుడు లేడని.

నిజంగా దేవుడనే వాడే ఉంటే – కర్మ సిద్ధాంతం అనే పలాయనవాదం నేర్పించేవాడు కాదు. పసిపిల్లల ఆకలి కేకలు – ఆడవాళ్ళ పై అత్యాచారాలు, విధ్వంస కాండలు, అకాల మరణాలు – ఇవేవి ఉండేవి కావు.

మరి ఈ దేవుడిని సునిత ఎంతో నమ్ముతుందిగా – దేవుడు శాడిస్టా? ఏమో! లేకుంటే ఎంతో ఆనందంగా సాగుతున్న కుటుంబాన్ని విచ్చిన్నం ఎందుకు చేస్తాడు?

సునీత ను పెళ్ళి చేసుకున్న క్షణం నుండి నాకు అన్నీ తనే అయ్యింది. నా ప్రాణ స్నేహితురాలు, ప్రేయసి, భార్య – అన్నీ తనే. చాలా అమాయకంగా ప్రపంచ పోకడలు తెలియనట్లు ఉండే ముగ్ధ, ఎవరన్నా కటువుగా మాట్లాడినా తిరిగి గట్టిగా జవాబు కూడా చెప్పలేదు – కానీ ఎంతో తెలివిగలది ఉద్యోగంలో చాలా మంచి పేరు సంపాదించింది.

ఆఫీసు నుండి కూడా ఏదో ఒక టైంలో మాట్లాడుకునేవాళ్ళం. ఎం.బి.ఎ చెయ్యమని పోరుపెట్టాను, తన తెలివి తేటలకు ఇంకా ఉన్నత స్థానంకు వెళ్ళాలని.

పగలు ఉద్యోగం, సాయంత్రం కాలేజి, సంజన పెంపకం, కలిసి నవ్వుకుంటూ వంట చేసుకోవటం – రోజులో 24 గంటలు చాలవేమో అన్నట్లు ఉండేది. చిలిపి తగాదాలు – సరసాల సరాగాలు – ఎన్నో మధుర క్షణాలు.

ఎం.బి.ఎ క్లాసు టాపర్ అని తెలిసిన రోజు నా అనందానికి అవధులు లేవు ఆ రోజే ఇంకో శుభవార్త చెప్పింది – తనకి నాలుగో నెలని.

అమెరికాలోని ఆర్థికమాంద్యం దెబ్బకి నేను పని చేసే కంపెనీ కూడా నిలనబడలేక, నా ఉద్యోగం కూడా పోయింది– ఇంకో మంచి ఉద్యోగం వేరే వూరిలో వస్తే తనే ధైర్యం చెప్పింది దాంట్లో చేరటానికి.

"నాకు ఈ ఉద్యోగం లో చేరటం ఇష్టం లేదు. ఒక పక్క నీకు ఐదో నెల, ఉద్యోగం, సంజన – ఇన్నిటితో ఎలా కష్టపడతావు? నేను వీకెండ్ మాత్రమే రాగలను ఇంటికి"

"ఏమీ పర్లేదు. నాన్న రిటైర్ అయ్యారు. అమ్మ నాన్నను పిలిపిద్దాం. నా డెలివరీ కి సహాయంగా ఉంటారు. నిదానంగా ఈ ఊరిలోనే చూసుకో. తొందరలోనే మళ్ళా అందరం కలిసి ఉంటాం." అని చాలా నచ్చచెప్పి పంపింది.

ఆ దూరం మమ్మల్ని మరింత దగ్గర చేసింది. ఫోనులో ఎన్ని కబుర్లో, ప్రతి చిన్న విషయం ఒకరితో ఒకరం చెప్పకుండా ఉండలేము.

"పెళ్ళి అయ్యి పదేళ్ళు అయ్యింది, ఇంకా లవ్ బర్డ్స్ లా ఉంటారేంటి " అని స్నేహితులు ఆట పట్టించేవాళ్ళు.

సంహిత పుట్టాక, ఇక దూరం వుండలేక పోయా. తక్కువ జీతంకు వొప్పుకొని, ఇద్దరం ఒకే వూరిలో ఉండేట్లు ఉద్యోగం వెతుక్కున్నా.

సునీతకు ప్రొమోషన్ తో పాటు, పని వత్తిడి విపరీతంగా పెరిగిపోయింది. రాత్రిళ్ళు కంప్యూటర్ ముందేసుకొని ఎప్పుడు నిద్ర పోయేదో కూడా తెలియదు.

"ఏంటి ఈ పని తాపత్రయం నీకు. ఎంత మేనేజర్వి అయితే మాత్రం ఇలా తిండి నిద్రా త్యాగం చేసి పని చెయ్యాలా? నీ ఆరోగ్యం సంగతి ఆలోచించవా? " కోప్పడేవాడిని " నీ తోటి మేనేజర్ల గురించి నువ్వే చెపుతావు, పని తప్పించుకొని నీ మీద రుద్దుతారని. చూసి అన్నా నేర్చుకో"

"లేదు రవి. ఎవరెట్లా పోతే నాకెందుకు. నా పని నేను చేసుకుంటా అంతే" అని మాట తప్పించేది.

. . .

. . .

**సునీత**

బలవంతాన.. . లేని శక్తి కూడగట్టుకొని కళ్ళు తెరవాలని ప్రయత్నించా –

నా వల్ల కాలేదు –

ఎంతసేపట్నుండి అలా పడి ఉన్నానో నాకే తెలియదు –

ఏవేవో జ్ఞాపకాలు – గుర్తు వచ్చీ రానట్లుగా – తెలిసీ తెలియనట్లుగా –

చిన్నప్పటి చిలిపి తగాదాలు

ఆడుకున్న బొమ్మల పెళ్ళిళ్ళు –

పోటీ పడి వేసిన రంగవల్లులు –

పక్కింటి వాళ్ళ మామిడి చెట్టు ఎక్కి క్రింద పడ్డఅప్పుడు పగిలిన మోచిప్ప –

ఒకప్రక్క మందు రాస్తూ, కొప్పడుతూ, కళ్ళనీళ్ళు తుడుచుకునే అమ్మ –

కాలేజి ఎగ్గొట్టి సినిమాకు వెళ్ళి , మళ్ళ మనస్కరించక ఇంట్లో చెపితే, ఏమీ కోప్పడకుండా నవ్వేసిన నాన్న –

తలంబ్రాల వేళ స్నేహితులు ఆటపట్టిస్తుంటే , రవి అల్లరి –

మగత . . . . ఏమైంది తనకి . . . . ఇవి తన ఆఖరి క్షణాలా?

కంగారుగా అనిపించింది – గుండె వేగం పెరిగినట్లు – ఆఖరి సారిగా విశ్వప్రయత్నం చేస్తున్న నా చిన్ని గుండె ––––

. . .

ఏంటి ఆ శబ్దం – ఎవరో సన్నగా రోదిస్తున్నట్లు –

ఎవరది – లేత స్పర్శ నా చంప మీద – ఆ స్పర్శ నాకు తెలుసు –

నా చిన్నారి సంహిత – తనని ఓదారుస్తున్న నా బంగారుతల్లి సంజన.

నా చిన్ని తల్లి వెక్కిళ్ళు పెడుతోంది –

నా బుజ్జి తల్లి ఏడవకురా – అయ్యో ఓదార్చలేని నా నిస్సహాయత.

ఏంతో పెద్దరికంగా ఓదారుస్తుంది సంజన – పన్నెండేళ్ళకే ఇంత పెద్దదయ్యిందా –

ఎప్పుడూ వాళ్ళ గిల్లికజ్జాలతో, వాళ్ళ మధ్య పోట్లాటలు తీర్చటానికే సరిపోయేది నా సమయం–

ఒకోసారి విసుగ్గా అనిపించేది –

నా ఉద్యోగం టెన్షన్, రవి ఎంత సహాయం చేసినా ఎప్పుడూ ఎదో ఒక పని ఉంటూనే ఉండేది.

“రిలాక్స్ అవ్వటం రాదు నీకు” అని కోప్పడేవాడు రవి

పిల్లల అరుపులు, కేకలు, పేచీలు, వాళ్ళ పోట్లాటల పంచాయితీలు –

మళ్ళా వెంటనే వాళ్ళు కలిసిపోయి నన్ను ఏడిపించటం –

ఒకోసారి ఎక్కడికైనా ప్రశంతమైన చోటుకు పారిపోదాం అనిపించేది –

ఒంటరిగా – ఏ ఆలోచన లేని చోటు

నా ఆలోచనలు నేను వినగలిగే చోటు –

నాలో నేను – ఒక మంచి పుస్తకం చదువుతూ – కోరిన పాటలు వింటూ –

ఒక కప్పు కాఫీ తో –

. . . .

మరీ ఎక్కువ ప్రార్థించానా ఈ ప్రశాంతత కోసం?

అందుకే నేను ప్రార్థించే దేవుడు, తన దగరకు తీసుకువెళుతున్నాడా?

అయ్యో ఇవి నిజంగా నా ఆఖరి క్షణాలా?

అందుకే కనీసం కళ్ళు తెరవలేక పోతున్నానా?

అయినా ఏమైయ్యింది నాకు – లేదు ధైర్యం కోల్పోకూడదు –

సన్నగా మొదలయ్యిన కడుపులో మంట – ఇంతింతై వటుడింతై అన్నట్లు నన్ను కబళించింది . . .

రవి

“రేపట్నుండీ జిమ్ కి వెళ్ళలనుకుంటున్నా” డిన్నరు తింటున్నప్పుడు చెప్పింది సునీత

ఈ మధ్య పని ఒత్తిడిలో కొంచం బొద్దుగా తయారయ్యింది. అయినా నాకు ఎంతో అందంగా ముద్దుగా ఉంటుంది.

"ఏంటి ఈ సడన్ నిర్ణయం?" ఆశ్చర్యంగా అడిగా. కాస్త ఖాళీ సమయం కోసం ఎంతగా ఎదురుచూస్తదో నాకు తెలుసు కనుక.

"మా ఆఫీసులో పని చేసే శ్రీజ తెలుసు కదా, ఈ మధ్య రోజు నాకు క్లాసు పీకుతుంది, నా గురించి నేను పట్టించుకోవటం లేదని. రోజూ లంచ్ కి పిలుచుకు వెళుతుంది, పనిలో బడి తినటంలేదని. తను కూడా చేరింది జిమ్ లో, నాకూ అన్పించింది ఈ స్ట్రెస్ తో బాగా కడుపులో మంట వస్తుంది. స్ట్రెస్ తగ్గాలంటే జిమ్ కి వెళ్లటం మంచిదని"

"మంచి ఐడియానే – కాకపోతే నన్ను మాత్రం జిమ్ కి వెళ్ళమని అడగకు. నేను ఇలాగే సంతోషంగా ఉన్నా"

"ఒక్కసారి నీ బొజ్జ చూసుకున్నావా? " వంటిల్లు సర్దుతూ నవ్వింది.

"ఈ బొజ్జ మీదే మన పిల్లలు ఎంచక్కా పడుకునేవారని మర్చిపోకు" బుగ్గ మీద ముద్దు పెడుతూ చెప్పా . . .

ఏమయ్యాయి ఆ సరదా రోజులు?

ఒక చిన్న అనుమానం – కడుపులో అల్సర్లు ఏమో అని –

ఒక టెస్టు తరవాత ఇంకోటి – ఒక మందు తరవాత ఇంకోటి –

చివరికి ఊహించనిది చెప్పారు – కాన్సర్ –

వెంటనే సర్జరీ అన్నారు –

ఏమిటిదంతా – ఇలాంటివి ఎక్కడో జరుగుతాయి – మనం ప్రేమించే వాళ్ళకు కాదు ---

**సునీత –**

నరకం అంటే ఎక్కడో లేదు –

నేను నమ్మిన భగవంతుడు నన్ను మోసం చేస్తే ఉంటుంది –

నా శరీరమే నాకు ఎదురు తిరిగితే ఉంటుంది –

ప్రతి అవయవం ఛిద్రమైపోతూ, పని చెయ్యలేమంటూ మొరాయిస్తే ఉంటుంది –

కీమోథెరపీ, రేడియేషన్, వీటి వల్ల వచ్చే విపరీతమైన బాధలో ఉంటుంది –

నా కుటుంబమంతా ఏమీ చెయ్యలేక, నిస్సహాయతతో కన్నీరు పెడుతుంటే ఉంటుంది –

. . . .

ఇంత నరకంలోనూ – నా ధైర్యం బలం శక్తి – అంతా నా రవే!

ఒంటరిగా ఉన్నప్పుడు ఎలా ఉంటున్నాడో కానీ , నా ఎదురుగా మాత్రం అదే చిరునవ్వు – నవ్వుతూ నవ్విస్తూ !

. . . .

నన్ను చూడటానికి వచ్చి – మారిపోయిన నా రూపం, వూడిపోయిన నా జుట్టు –

ఇవేవి గమనించనట్లు కబుర్లు చెప్పి నవ్వించే నా మంచి స్నేహితులు –

ఆఖరికి నా చిన్ని బంగారాలు కూడా నా మందుల సంగతి గుర్తు చేయటం –

ఇంత ప్రేమను పొందే నాది అదృష్టమా ?

ఇంత చిన్న వయస్సులో రాలిపోతున్న దురదృష్టమా ?

. . . .

. . .

మాటలు కూడా అర్థం కావట్లేదు

అయ్యో వినికిడి కూడా తగ్గిపోయిందా?

నా సంజన పెరిగి పెద్దదవ్వటం చూడలేనా? తన చదువు, తొలి ప్రేమ, పెళ్ళి – ఏదీ చూడలేను. పెరిగే వయస్సులో ఎవరు ఉంటారు తనకి ?

ఇప్పటికి రాత్రి పూట ఏదో ఒక వంకతో నా పక్కలో దూరే సంహితకు ఎవరుంటారు?

జీవితాన్ని సాంతం అనుభవించకుండా తీసెయ్యదలచుకంటే , ఇంత అదృష్టాన్ని ఏందుకిచ్చావు?

ఇంకొన్నాళ్ళు ఇలాగే శరీరాన్ని కష్టపెడుతూ ఏదోరకంగా బ్రతికి ఉండాలా?

లేక

ఇంకా నరకం చూడకుండా త్వరగా వెళ్ళిపోవాలా?

ఎలా నిర్ణయించేది – ఎవరు నిర్ణయించేది?

క్వాలిటీ నా లేక క్వాంటిటీనా?

శారీరకంగా ఎదురుగా ఉండటమా లేక ఆ వ్యక్తి తో గడపిన అందమైన జ్ఞాపకాల మధ్య ఉండటమా?

ఏదో మత్తు – వినబడటం లేదు ఏమీ –

అస్పష్టత . . .

నా కోసం ఏడవకండి – నా జ్ఞాపకాల్లో సంతోషంగా ఉండండి మీ ముగ్గురూ–

మీతోనే ఉంటాను ఆ జ్ఞాపకాల్లో –

. . . .

మనసు తేలికగా ఉంది –

చిరునవ్వుతో వెళ్ళిపోతున్నా, ఇంతమంది ప్రేమను పొందిన గర్వంతో వెళుతున్నా –

ఓ భగవాన్! శరీరాన్ని నాకు ఎదురు తిరిగేట్లు చేశావ్, కానీ నా ఆత్మ పొందిన ప్రేమ ఏ బాధను తట్టుకునే శక్తిని ఇచ్చింది –

అందుకే . . . ఇప్పుడు . . . . ఇలా –

ఈ నిశ్శబ్ద ..... నీరవం . . . . లో. . . కి. . .

# మనిషి - దేవుడు

డొక్కా ఫణి

## శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
## 21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
## ఉత్తమ కథానిక విభాగం విజేత

**అతనొక యువకుడు**. బ్రహ్మచారి యువకుడు. అందం, ఆరోగ్యం, ఆదాయం అన్నీ అమరిన నవ యువకుడు. అతని కళ్ళలో వెలుగు. చూపులో చిన్నపాటి చులకన. తను తలుచుకుంటే ఆకాశాన్ని భూమిగా, భూమిని ఆకాశంగా మార్చగలనని అతని ధీమా. నమ్మకం. అతనికి సాధ్యపడనిది ఏదీ లేదు. అతను అనుకోవడమే ఆలస్యం, అంతే. కోరుకున్న ప్రతీ వస్తువూ అతని దగ్గర వచ్చి వాలుతుందని అతని విశ్వాసం. అతనిది అనితర సాధ్యమైన మేధస్సు. దానికి తోడు అకుంఠిత దీక్ష, పట్టు సడలని పరిశ్రమ. అందుకే అతను ప్రతి ప్రయత్నంలోనూ విజయుడే. అతని నడకలో, చూపులో, మాటలో, ఆహార్యంలో అన్నిటా ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది. అతనింకా ఎవరినీ ప్రేమించలేదు.

అతనొకరోజు తొందరగా తయారై హడావిడిగా ఉద్యోగానికి వెళుతున్నాడు. ఇంటి బయట కొచ్చి కారెక్కబోతూంటే చూసాడు ఓ వారగా అప్పుడప్పుడే కొద్ది కొద్దిగా విచ్చుకుంటోన్న ఒక ఎర్రటి మొగ్గని. అది ఏపువ్వో అతనికి తెలియదు. ఆ మొక్క అతను నాటించలేదు. అది అక్కడికి ఎలా వచ్చిందోనని ఆలోచించాడు, ఏ పక్షుల పనో అయ్యుంటుందని సమాధానపడ్డాడు. ఆఫీసుకు ఆలస్యమౌతోందని గుర్తొచ్చి, ఆ మొగ్గని పలకరించకుండానే వెళ్ళిపోయాడు. ఆఫీసులో ఎంతో ముఖ్యమైన లావాదేవీలు నడిపి సతమతమైపోయాడు ఆరోజు. సాయంత్రం కారెక్కగానే అప్రయత్నంగా ఆ మొగ్గ గుర్తొచ్చింది. బహుశా ఈ పాటికి ఇంకాస్త విచ్చుకుని వుంటుందని అనుకున్నాడు. పెదాలమీదకి చిన్న మందహాసం వచ్చి చేరింది. కారు నడుపుతూ ఇల్లు ఎప్పుడెప్పుడు చేరతానా అని తహతహలాడుతున్నాడు. ఆరోజే విపరీతమైన ట్రాఫిక్కు తగిలింది రోడ్డమీద. ఇంటికి వచ్చేసరికి సూర్యాస్తమయమైపోయింది. ఆ చీకటిలో ఆ మొగ్గని చూడడానికి ఇష్టపడలేదు అతను. మరుసటి రోజు ఉదయం చూద్దామనుకున్నాడు.

రాత్రి ఆ మొగ్గ కలలోకి వచ్చింది. ఆ కలలో అతను మొగ్గని సుతి మెత్తగా నిమిరాడు. ఒక అద్భుతమైన పరిమళంతో ఆ ప్రదేశమంతా గుబాళించింది. అతను ఆ మొగ్గని కోద్దామనుకున్నాడు. అంతలోనే అలారం మోగింది. అతను లేచి హడావిడిగా తయారై కారెక్కాడు. ఆ మొగ్గని చూసే సమయం లేకపోయింది ఆ పొద్దు కూడా. కారులోంచే ఆ మొగ్గని పలకరించాడు. అది మరికాస్త విచ్చుకుంది. ఒక కొత్త అందాన్ని సంతరించుకుంది. యువకుడి మనసు ఇంకాస్త ఆనందించింది. అతను ఆరోజు ఎంతో మెరుగైన పనితనం చూపించాడు. తనకు నచ్చిన విషయమొకటి తన ముంగిట వున్నది అనే భావన అతనిలో ఆనందాన్ని నింపేసింది. ఆ సాయంత్రమూ అతను రావడం ఆలీసమే అయింది. అప్పుడతను ఒక నిర్ణయానికి వచ్చాడు. వారాంతంలో ఆ మొగ్గ పూర్తిగా విచ్చుకున్నప్పుడు దానిని పలకరించాలనీ, దాని అందాన్ని

తనివితీరా ఆస్వాదించాలనీ నిర్ణయించుకున్నాడు. ఆ నిశ్చయం చేసుకున్న తరువాత అతనిలో ఎటువంటి వ్యాకులతా లేదు. రోజు రోజుకూ మరింత పటుత్వాన్ని సంతరిచుకుని, మొగ్గ నెర విచ్చిన పువ్వుగా మారింది. దానికి కొన్ని వందల రేకులున్నాయి. అటువంటి పువ్వు అంతకుముందు ఎవరూ చూడలేదేమో బహుశా.

ఆ వారాంతం మొత్తం అతను ఆ పువ్వు వద్దనే గడిపాడు. అక్కడే పచార్లు చేస్తూ కాఫీ తాగాడు. టిఫిన్ ప్లేటు అక్కడికే తెచ్చుకుని ఆ పువ్వునే తదేకంగా చూస్తూ టిఫిన్ కానిచ్చాడు. దానికి కనీసం వంద ఫొటోలు తీసాడు. తన మిత్రులందరికీ పంపించాడు. అందరూ అతన్ని ఎంతగానో మెచ్చుకున్నారు. కొంతమంది కేవలం ఆ పువ్వును చూడడం కోసం అతని ఇంటికి వచ్చారు. అందరూ ఆ పువ్వుతో ఫొటోలు తీయించుకున్నారు. అతనికి ఎంతో గర్వంగా అనిపించింది. ఆ పువ్వు అతని జీవితంలో భాగమైంది. అతను తన జీవితంలో జరిగే ప్రతి సంఘటనా ఆ పువ్వుకి చెప్పుకుంటున్నాడు. పార్కులో జాగింగు చేస్తున్నప్పుడు కనిపించి, తనవైపు చూసి నవ్విన అమ్మాయి గురించి, ఆఫీసులో అంచెలంచెలుగా ఎదుగుతున్న తన స్థాయి గురించీ, ప్రమోషన్ల గురించీ, ఒకటేవిటి, అన్నీ ఆ పువ్వుకి నివేదించుకుంటున్నాడు. అప్పటికి కొన్ని నెలలైంది, ఆపువ్వు వాడలేదు. ఆ మొక్క మరో మొగ్గ తొడగలేదు. ఒకనాడు అతని మిత్రులలో ఒకరు ఆ మొక్క కావాలని అడిగారు. "అంటుకట్టి చూడు మరో మొక్క వస్తుంది, అది మాకివ్వవచ్చు" అని కోరికవంటి సలహా ఇచ్చారు. అది అతనికి నచ్చలేదు. ఆ మొక్క ఈ సృష్టి మొత్తం మీద తన తలవాకిటే వుండాలి. అప్పుడే తనకి తృప్తి. అది మరొకరి ఇంటిలో కూడా వుంటే, ఇంకేమిటి లాభం? తన ప్రత్యేకతఏమీ వుండదు. అందుకనే అతడు సున్నితంగా తన మిత్రుల కోరిక తోసిపుచ్చాడు.

"ఒకటి రెండు సార్లు అంటు కట్టాలని ప్రయత్నించాను, కానీ ఆకొమ్మ వాడి పోయింది, కొత్త మొక్క రాలేదు" అని అబద్ధం ఆడేసాడు. ఆరోజున ఆ పువ్వు కాస్త వాడింది. అది చూసిన అతని మనసు కొట్టుకుంది. అతను ఎంతోమంది బాటనిస్టులని పట్టుకుని ప్రత్యేకమైన ఎరువులు తెచ్చి వేసాడు. అయినా పువ్వు వాడడం తగ్గలేదు. ఒకరోజు ఉదయం లేచి చూసేసరికి ఆ మొక్కవి రెండు కొమ్మలు ఎవరో విరిచి పట్టుకుపోయారు. ఆ పువ్వు కళ కోలుపోయి, పూర్తిగా వాడిపోయి వుంది. అతనికి అప్రయత్నంగా కళ్ళలోంచి నీళ్ళు కారాయి. అతను ఒక్కమారు ఆ పువ్వుని ఆప్యాయంగా నిమిరాడు. ఆ పువ్వు అతని చేతిలోకి వాలి, రాలిపోయింది. అతను ఆ పువ్వును తీసుకెళ్ళి దేవుడి పటం ముందు పెట్టాడు. ఎందుకో దేవుడు ఆ రోజు తనని చూసి నవ్వుతున్నట్లు అనిపించింది అతనికి. మరి రెండు రోజులు గడిచాయి. ఆ పువ్వు నల్లగా మారిపోయింది. ఆ రేకులన్నీ కుంచించుకుపోయాయి. తెలియని ద్రవమేదో బొట్టు బొట్టుగా ఆ పువ్వులోంచి కారి, దేవుని పటం పాదాలవద్ద తడి అవుతోంది. ఆ పువ్వులోంచి ప్రాణ శక్తి వెళిపోతోందని గ్రహించాడు యువకుడు. మరునాడు ఎంతో బెంగగా, ఎండిన ఆ పువ్వును తీసి చెత్తలో పారవేసాడు. ఆ మరునాడు అతనికి ఇంటి ముంగిట్లో ఆ మొక్కే కనిపించలేదు. అతను విలవిలలాడిపోయాడు. తన మిత్రులందరినీ దూషించాడు. అనరాని మాటలన్నాడు. కొమ్మలు విరుచుకుపోయారనీ, చివరికి మొక్కనే తవ్వి తీసుకుపోయారనీ నిందించి, వారితో స్నేహానికి స్వస్తి చెప్పాడు. మిత్రులంతా తెల్లబోయారు. మాకేపాపం తెలియదన్నారు. అతను నమ్మలేదు.

అతని జీవితం అతలాకుతలమైపోయింది. అతను మునుపటిలా ఉద్యోగంలో చురుకుగా వుండటంలేదు. అతనికి తను చేసే ఏ పనిమీదా ఆసక్తి లేదు. ఎప్పుడు చూసినా ఆ మొక్క గురించీ, ఆ పూవు గురించే అతని బెంగంతా. ఎందరినో అడిగాడు. ఎంతో పరిశోధన చేసాడు. అలాంటి మొక్క ప్రపంచంలోనే ఎక్కడా లేదని తెలుసుకుని మరింత బాధపడ్డాడు. ఎవరిని అడగాలో తెలియదు. ఆ మొక్క తనకు కావాలి. ఆ పువ్వు తనది కావాలి. తనదే కావాలి. లేకపోతే ఈ జీవితమే వృధా అనుకున్నాడు. చివరికి అతనికి ఒక ఆలోచన వచ్చింది. తను రోజూ పూజ చేసే ఆ దేవుణ్ణే అడుగుదామనుకున్నాడు. అడిగాడు. దేవుడు మాట్లాడలేదు. అడిగి అడిగి విసిగిపోయాడు. కోపం, వివేక శూన్యత రెండూ ప్రాప్తించాయి. ఉద్యోగ వైకుంఠ పాళీలో అతనిని అరుకాసురుడు మింగేసాడు. మొదటి గడిలోకి వచ్చి పడ్డాడు.

ఒకనాటి రాత్రి అతనికి కలలో దేవుడు కనిపించాడు. అతను దేవుణ్ణి వేడుకున్నాడు ఆ మొక్కనీ, ఆ పువ్వునీ తనకు ఇమ్మనీ, లేదా తనని తీసుకుపొమ్మనీ. దేవుడు నవ్వాడు. "ఆ పువ్వు లేకముందు నువ్వున్నావు, వున్నప్పుడూ వున్నావు, ఇప్పుడు లేకపోయినా వుంటున్నావు. ఇంక నీకా పువ్వుతో, ఆ మొక్కతో ఏవిటి పని?" అని అడిగాడు.

"నీకు తెలియదు. ఆ పువ్వు నా జీవితాన్ని మార్చేసింది. నాకొక ఉత్సాహాన్ని ఇచ్చింది. కొత్త దారులని చూపించింది. కొత్త పరిచయాలని, కొత్త స్నేహితులనీ అందించింది" అన్నాడు యువకుడు.

దేవుడు మందహాసం చేసాడు "ఇప్పుడు ఆ పువ్వు వల్లే నువ్వు ఆ స్నేహితులని కోల్పోయావు. నీకు ఆ పువ్వు తో ఏమీ పనిలేదు. నిన్ను నాలా చేద్దామనుకుని ఆ పువ్వు నీ ముంగిట్లో సృష్టించాను. కానీ నువ్వు నీలాకూడా మిగలలేకపోయావు. అందుకే ఆ అందాన్ని ఆస్వాదించే అర్హత నీకింకా రాలేదని గుర్తించి, ఆ మొక్క నేనే తీసేసాను. నీకా విచక్షణ వచ్చినప్పుడు, ఆ సంయమనం కుదిరినప్పుడు మళ్ళీ ఇస్తానులే" అన్నాడు చిద్విలాసంగా.

యువకుడు ఒప్పుకోలేదు. ఎల్లాగైనా మరొక్కసారి ఆ మొక్కనీ, ఆ పూవునీ తన సొంతం చేయమని బ్రతిమిలాడాడు. దేవుడు ఒప్పుకోలేదు. యువకుడు దేవుణ్ణి ఎన్నో నిష్ఠూరాలాడాడు. దేవుడికి విశ్వాసం లేదన్నాడు. భక్తుల కోరికలు తీర్చని దేవుడు దేవుడే కాదన్నాడు. ఇంకా ఏవేవో అన్నాడు. దేవుడు అన్నీ ఓపికగా విన్నాడు.

చివరికి అన్నాడు "సరే, నీకు మరో అవకాశం ఇస్తాను. ఈసారి ఏంచేస్తావో నాకు తెలుసు. నీకింకా తెలియదు. కానీ ఈ అనుభవం కూడా నీకు ఉపయోగపడుతుందిలే" అని నవ్వుతూ మాయమైపోయాడు.

మరునాడు అతని ముంగిట ఆ మొక్క మళ్ళీ ప్రత్యక్షమైంది. మరో అందమైన మొగ్గ, అర విచ్చిన రేకులతో, నవ పరిమళములతో అతనిని పూర్తిగా వివశుణ్ణి చేసింది. అతను ఆఫీసుకు వెళ్ళే ప్రయత్నమే మానుకున్నాడు. సెలవలు పెట్టేసాడు. ఆ మొక్కకి ఇతః పూర్వం వేసిన ఎరువులన్నీ వేసేసాడు. రోజుకి పన్నెండు సార్లు నీళ్ళు పోసాడు. ఎవరూ ఎత్తుకు పోకుండా, ఆ మొక్క చుట్టూ ఒక ముళ్ళ దడి కట్టేసాడు. ఆ ముళ్ళ దడి మధ్యలో ఆ దేవతా పుష్పం బందీ అయింది. అతను కూడా చప్పున వెళ్ళి దాన్ని స్పృశించలేని స్థితి అది. అయినా అదే అతనికి నచ్చింది. ఇంకెవరూ ఆ పుష్పాన్ని చేరలేరు అనేభావన అతనికి ఒక వింత భద్రతని ఇచ్చింది. మేలుకుని వున్న 16 గంటలూ అతను ఆమొక్క దగ్గరే గడిపాడు. నిదురపోయిన 8 గంటలూ ఆపువ్వు గురించే కలలు కనేవాడు. అలా వారం రోజులు గడిచే సరికి అతనికి ఆ అందం విసుగొచ్చింది. ఆ పరిమళం అతనిలో వెగటు పుట్టించింది. ఆ రాత్రి అతను కలలో ఆ మొక్క దగ్గరకు వెళ్ళాడు. ఎంతకూ వాడిపోని ఆపువ్వును చూస్తే అతనికి కోపం వచ్చింది.

"సృష్టిలో అన్నీ ప్రకృతి ధర్మాన్ని పాటిస్తున్నప్పుడు నీకెందుకీ ప్రత్యేకత. ఏం చూసుకుని నీ గర్వం?" అన్నాడు కోపంగా.

మొక్క మాట్లాడలేదు. పువ్వు తల ఎత్తి చిన్నగా మందహాసం చేసింది. అతనికి కోపం రెట్టింపు అయింది. ఒక్క సారి ఆ పువ్వుని అదిలించబోయాడు. కసుక్కుమని ఓ ముల్లు అతని అరచేతిలో దిగింది. ఆ పువ్వు రంగులోనే వున్న అతని రక్తం బొట్లు బొట్లుగా కారి మొక్క మొదట్లో పడుతోంది. అతని ఆవేశానికి అంతులేకుండా పోయింది. "నిన్నేంచేస్తానో చూడు" అని అరిచాడు కోపంగా.

విసురుగా లోపలికి వెళ్ళి పేద్ద గునపంతో తిరిగి బైటికొచ్చాడు. కసి తీరా మొక్క చుట్టూ పోట్లు పొడిచాడు. కంచెతోటీ, వేళ్ళతోటీ పెకిలించి అవతల పారేసాడు, కింద పడ్డ పువ్వు ఇంకా నవ్వుతూనే వుంది. అతను తమాయించుకోలేక ఆ పువ్వుని రెండు కాళ్ళతోటి తొక్కి తొక్కి భూస్థాపితం చేసేసాడు. అతని కల ఆగిపోయింది. అతనికి మత్తులాంటి నిద్రపట్టింది. మరుసటి రోజు ఉదయం అతను వాకిట్లోకొచ్చి

చూసాడు. మొక్క తాలూకు ఆనవాళ్ళే లేవు. పువ్వు అసలే కనపడలేదు. అతని మనసంతా చింతాక్రాంతమైంది. ఆలోచనలు అనంతంగా సాగిపోతున్నాయి. ఆరోజు అతను మౌనంగా దేవుడి గదిలోకి వెళ్ళిపోయాడు. అసలు జరిగినవన్నీ ఆలోచించుకోవడం మొదలుపెట్టాడు.

అందం ఆనందాన్ని ఇస్తుందా? అలజడిని సృష్టిస్తుందా? ప్రతి అందానికీ ఒక "సొంత"దారుని అవసరం వుందా? ఈ సృష్టిలో "నాది", "పరాయిది" అనే మాటలకి అర్థం ఏమిటి? కొన్నిటిని నేను "నావి" అనుకుంటే, తక్కినవి పరాయివి అవుతాయి. అన్నిటినీ "నావి" అనుకుంటే? అసలు పరాయితనమే లేకుంటే? అప్పుడు అసూయకి తావేలేదుగా. అందం అనేది ఆ పూవులో వున్నదా? నాలో వున్నదా? దాని ఉనికిని నేను ఎలా గుర్తించాను? కన్ను చూసింది, నాసిక ఆఘ్రాణించింది, మనసు వాటికి ఒక రూపు కలిపించి, ఒక మొక్కనీ, ఒక పూవునీ సృష్టించింది. ఇవన్నీ కలిసి ఆడిన నాటకంలో తన లోపల వున్న పెద్దమనిషి నటుడిగా మారి, ఒకసారి కేరింతలు కొట్టాడు, ఒకసారి వివశుడయ్యాడు, మరోసారి కన్నీరు కార్చాడు, ఇంకోసారి కోపంతో ఊగిపోయాడు, చివరికి ఆనందపు ఉనికినే ప్రశ్నించి, స్వహస్తాలతో తనని తానే బాధించుకున్నాడు. ఆ మొక్క, పువ్వు తన అనుభవంలోకి రానినాడూ తను వున్నాడు, వచ్చిన తరువాతా వున్నాడు, ఆ అనుభవం పూర్తైన పిదపా వుంటున్నాడు. అసలు ఈ అనుభవాలను ఉన్నవి వున్నట్టుగా తనతో చెబుతున్న ఆ పెద్దమనిషి ఎవరు? ఎన్ని భావాలు ప్రకటించినా, తిరిగి తన స్థితిలోకి చేరుకునే ఆ ఆనందమూర్తి ఎవరు? ఏ వికారమూ అంటని ఆ స్వరూపం ఏది? ...

ఇలా ఎంతసేపు ఆలోచించాడో తెలియదు. ఎన్నో గంటలకి అతను దేవుడి ముందే సొమ్మసిల్లిపోయాడు. అతని కలలో దేవుడు కనిపించాడు.

నవ్వుతూ అడిగాడు "ఏమి తెలుసుకున్నావు?" అని.

"కలలో నువ్వు సృష్టించిన మొక్క ఇలలో నాకు కనిపించలేదు ఒక సారి. ఇలలోని నీ మొక్కని కలలో అంతం చేసాను ఒకసారి. అసలు కల ఏది? నిజమేది? నీవెవరు? నేనెవరు? అని ఆలోచించాను. నాకు అనిపించింది చెబుతున్నాను విను. కల ఏదో, ఇల ఏదో చెప్పటం అసాధ్యం. నీ కల ఈ ఇల. మా కల కూడా ఈ ఇలలో నిజమయ్యింది కదా, కాబట్టి నీవే నేను, త్వమేవాహం. నేను చూసిన ఆ మొక్క, ఆ పువ్వు నేను సృష్టించుకున్నవే. ఈ విశ్వమతా నా సృష్టే. అన్నిటిమీదా నాకు అనురాగం వుంది, కాని వేటిమీదా మమకారం లేదు. ఒకప్పుడు నేను ఆ పువ్వుపై చూపిన మమకారమే మోహమైంది, అసూయ అయింది, క్రోధమైంది, కక్ష అయింది, తుదకు ఒక అంతానికి దారితీసింది. ఇప్పుడు నాకు "నేను, నీవు" అన్న విచక్షణ లేదు. నువ్వే నేను. నేనే ఆ మొక్క, నేనే ఆ పువ్వు. ఇది నా సృష్టి. నాలోపలి పెద్దమనిషివి నువ్వే. నువ్వంటే మళ్ళీ నేనే" అన్నాడు స్థిరమైన ఆనందంతో యువకుడు.

దేవుడు ఒక కాంతిగా మారి అతనిలో కలిసిపోయాడు.

మరోసారి సుప్రభాతమైంది. అతను స్వధర్మాన్ని నిర్వర్తిస్తూ ఆఫీసుకు బయలుదేరాడు. ఆ మొక్క ముంగిట్లో మళ్ళీ ప్రత్యక్షమైంది. ఆ మొగ్గ మళ్ళీ అతన్ని పలకరించింది. "ఎలావున్నావు?" అని అడిగింది.

"నీలాగే ఆనందంగా వున్నా" నన్నాడు యువకుడు.

"నాతో మాట్లాడవా మరి? నన్ను చేరదీయవా?" అని అడిగింది మొగ్గ.

"నువ్వున్నది నాలోనేగా. నన్ను నేను గుర్తించినంతకాలం నిన్ను గుర్తిస్తాను. నీ వికసించడంతో, వాడిపోవడంతో, ఉనికితో నాకేమీ సంబంధం లేదు. నాలోపల వున్న నువ్వు ఎప్పుడూ అందంగానే వుంటావు. నువ్వొక వసివాడని కుసుమానివి. నా సృష్టివి." అనేసి ఆనందంగా కారెక్కి వెళిపోయాడు. వెనక్కి తిరిగి చూడలేదు. పువ్వు దేవుడిలా నవ్వుకుంది.

# హంసగీతికలు నిర్మలాదిత్య ( భాస్కర్ పులికల్ )

## శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
## 21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
## ఉత్తమ కథానిక విభాగం విజేత

**అక్కడక్కడ** నీటి కొలనులు, వాటి చుట్టూ పచ్చటి తివాచిలా పెంచిన గడ్డి, అందం కోసం ఏరి కోరి వేసిన చెట్లు, పూల మొక్కలు, ఆ అందం మరింత సేపు ఆస్వాదించడానికా అన్నట్లు వేసిన మెలికలు తిరుగుతున్న రోడ్లు, ప్రశాంత్ మనస్సును అప్పటికే ఆహ్లాద పరిచేసాయి. నాలుగో అంతస్తు లో చుట్టూ ఉన్న పెద్ద కిటికీలనుంచి దూరంగా కనిపిస్తున్న సముద్రం కూడా పచ్చగానే కనిపిస్తున్నది. ఒకప్పుడు ఈ ప్రాంతం అంతా హాలిడే రిసార్ట్ కనే కట్టారు. దాదాపు ఓ వందమందిని అతిథులు ఉండగలిగేలా కట్టిన ఆ రిసార్ట్ ఇప్పుడో ఆసుపత్రి. బేబీ బూమర్స్ చరమ దశ వైద్యరంగానికి యవ్వనపూతలు పూసి అందంగా రూపు మార్చేసిందన్న దానికి తార్కాణం లాగా ఉంది అనుకున్నాడు ప్రశాంత్. తను ఉన్న విశాలమైన గది ఒకప్పుడు రిసార్ట్ లాబీ. అక్క దక్కడ సోఫాలు కుర్చీలు చాల వేసినా , ఖాళీగా కొన్నే కనిపిస్తున్నాయి. గది బాగానే కిక్కిరిసిపోయింది. మూడు వైపులా కిటికీలు ఉన్న ఆ గదికి నాలుగో వైపు మొత్తం గోడ, ఆ గోడను ఆనుకొని రిసెప్షన్ కౌంటర్ కనిపిస్తున్నది. గోడమీద డాక్టర్ వనజ ఆవిడతో అక్కడ పనిచేసే వారి ఫోటోలు ఓ అందమైన మోసాయిక్ లాగ తగిలించారు. ఆ ఫోటోలతో పాటూ మ్యూజియంలో ఉండే లాంటి కళాచిత్రాలు తగిలించారు. ప్రశాంత్ రిసెప్షన్ కౌంటర్ దగ్గర వేచిఉన్నప్పుడు అవి కాపీ చిత్రాలేమో కొంచెం దగ్గరగా వెళ్లి పరిశీలించాడు అవన్ని ఓ ప్రముఖ కళాకారుడు డాక్టర్ కు బహుమతిగా ఇచ్చిన, తను నయం అవ్వడానికి దోహదపడిన డాక్టర్ వనజకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆతను వ్రాసిన ఉత్తరం కూడా ఆ చిత్రాలపక్కనే ఫ్రేమ్ వేసి తగిలించారు. ఆ చిత్రాల ధర చాలనే ఉంటుంది, కాలం గడిచేకొద్దీ ఎక్కువవ్వు తూనే ఉంటుంది.

వనజ కార్డియో థొరాసిక్ సర్జన్. గూగుల్ ను అడిగినా బెస్ట్ కార్డియో థొరాసిక్ సర్జన్ అంటే వనజ పేరే ముందు చూపెడుతుంది. ఆ వచ్చిన వారిలో కొంత మంది డాక్టర్లు కూడా ఉన్నారని వారి పేర్లు పిలిచి వనజను కలవడానికి తీసుకొనిపోయినప్పుడు తెలిసింది. డాక్టర్ వనజ , ఆవిడ హాస్పిటల్ గురించి అప్పటికే తెలుసుకున్నా ప్రశాంత్ కు ఇక్కడ చూసిన వన్ని వనజ చేస్తున్న పని మీద మరింత గౌరవాన్ని పెంపొందించాయి ఇంతకూ ప్రశాంత్ వనజ దగ్గరికి రావడానికి కారణం తన ఆరోగ్యం కాదు. తను వనజ దగ్గర పనిచేయడానికి ఇంటర్వ్యూ కని వచ్చాడు .

ఇటీవల వనజ ఓ ఫౌండేషన్ ప్రారంభించింది. లాభాపేక్ష లేని ఈ సంస్థ కార్డియాక్ రీసెర్చ్ కని, ఆపరేషన్ కని వచ్చే బీదవారికి సహాపడాలన్న కొన్ని సదుద్దేశ్యాలతో స్థాపించారు. ఓ ముప్పై ఏండ్లు కార్పరేటు కంపెనీలకు పని చేసీ చేసీ విసిగిపోయిన ప్రశాంత్ కు ఇలాంటి ఓ మంచి లాభాపేక్ష లేని సంస్థ పని చేయాలని వెదుకుతూ వుంటే, వనజ దగ్గర ఇటీవలే ఆపరేషన్ చేసుకొని కోలుకున్న ఓ సన్నిహితుడు, వనజ గురించి ఈ సంస్థ గురించి పొగిడి ప్రశాంత్ ను వనజను ఈమెయిల్ ద్వారా పరిచయం చేసాడు. ప్రశాంత్ ను కలవమని వనజ కబురు పెట్టడంతో , ప్రశాంత్ ఆ హాస్పిటల్ కు రావడం జరిగింది. ప్రశాంత్ ఓ గంట ముందు గానే వచ్చాడు, వనజనే కాక మరికొందరు డాక్టర్లు ఫిజిషియన్ అస్సిస్టంట్లు కూడా వచ్చిన పేషంట్ లను చూ స్తుండాలి. ఓ గంటలో ఆ గదిలోని జనం పలచబడ్డారు. అనుక్కున్న సమయం దాటిన ఓ అరగంటకు వనజను కలవడానికి పిలుపు వచ్చింది. పేషంట్ కన్సల్టింగ్ గదులు దాటుకుంటూ చివరగా ఉన్న వనజ ఆఫీసుకు తీసుకెళ్ళి తలుపు మెల్లగా తట్టి “కమిన్” అని పిలుపు వినగానే వనజ అసిస్టెంట్, తలుపు తెరిచి ప్రశాంత్ ను ప్రవేశపెట్టింది

వనజను మొదటి సారి చూస్తున్న ప్రశాంత్ కు, ఆవిడ మామూలుగానే అనిపించింది. బిజినెస్ ఫార్మల్ దుస్తులు వేసుకున్న వనజ వాటిపై కప్పుకున్న తెల్ల కోటు తో తానూ చూసిన ఇతర డాక్టర్ల లాగానే కనిపించింది. అంత వరకు పక్కనున్న కంప్యూటర్ లో ఏదో చదువుతున్న వనజ తల తిప్పి ప్రశాంత్ ను “హలో” అని పలకరిచండంతో ప్రశాంత్ తన అభిప్రాయం మార్చు కోవాల్సి వచ్చంది. వనజ కన్నులలోని ఆ కాంతి, పలకరింపు లోని సృహుద భావం, ముఖంలో తన పని పైన ఉన్న నమ్మకం, ప్రశాంత్ బహు కొద్ది మంది లోనే చూసాడు. అనుకోకుండానే ప్రశాంత్ మదిలో వనజ పట్ల ఓ గౌరవము, మెప్పు కలిగాయి. జీవితంలో తమకేమి కావాలో చక్కగా తెలిసినవారు, ఆ గమ్యం కోసం ఆహోర్నిశాలు కష్టపడి సాధించిన వారిలోనే ఆ చూపు హావభావాలు ప్రశాంత్ ఇదివరకు చూసాడు .

" హలో డాక్టర్ వనజ గారు" అన్నాడు ప్రశాంత్.

"కూర్చోండి. వనజ అంటే చాలు" అంది వనజ .

" థాంక్స్.. వనజ"

"ప్రశాంత్, మీ గురించి మంచి మాటలు ఇప్పటికే విన్నాను. ఇదిగో మీ రెజ్యుమే కూడా ఇప్పుడే మరో సారి చదివాను. ఇంతకీ మీరు ఎందుకు మా ఫౌండేషన్ కి పని చేయాలనుకుంటున్నారు? "

" ఇంత వరకు కార్పరేట్ కంపెనీలకే పని చేసాను వనజ, లాభాపేక్ష లేని ఓ సంస్థ కు పని చేయాలని పించింది. అలా చేయటంలో ఇది వరకు పనిలో లేని సంతృప్తి లభిస్తుందనిపిస్తుంది. మీ గురించి విన్నాను. ప్రపంచంలోనే కార్డియాక్ సర్జన్ అంటే మీ పేరు ప్రస్తావనకు వస్తుంది, అలాంటి మీరు స్థాపించిన ఈ సంస్థ గురించి విన్న తరువాత నాకు వెంటనే చేరాలని పించింది. "

" కార్పరేట్ కంపెనీలలో పని చేస్తే డబ్బులు బాగా వస్తాయి కదా ప్రశాంత్! "

" నిజమే కాని, చేస్తున్న ప్రతీ పని వల్ల కంపెనీకి ఎంత లాభం వస్తుందన్న దానిగురించే ఆహోర్నిశాలు ఆలోచించడం రిటర్న్ ఆన్ ఇన్వెస్ట్మెంట్ సంఖ్యలతో కుస్తీలు పడడం నుంచి విముక్తి కావాలని పించింది "

" ఇక్కడ చేసే పనిలోనూ డబ్బు సంఖ్యలుంటాయి ప్రశాంత్ "

" కాని ఇక్కడ మనిషి సంక్షేమాన్ని మొదట తలపెట్టి అటు తరువాత డబ్బు గురంచి ఆలోచిస్తారు. కార్పరేట్ రంగమలో అది తారు మారవ్వుతుంది "

" నిజమే ప్రశాంత్ " వనజ నువ్వుతూ అంది. ఆ నవ్వు నప్పుడు వనజ కన్నుల్లో ఓ మెరుపు మెరిసింది.

అటు తరువాత వనజ ప్రశాంత్ లు, ప్రశాంత్ అంత వరకు చేసిన పని గురించి, వనజ సంస్థలో ఉన్న పని గురించి, ప్రశాంత్ చేరాలనుకున్న పని గురించి, ప్రశాంత్ కు ఇవ్వగలిగే జీతం మరి సదుపాయాల గురించి మాట్లాడుకున్నారు. ఇద్దరికీ ఒకే అభిప్రాయాలు ఉండడం వయస్సులో కూడా దాదాపు దగ్గరగా ఉండడంతో వారి సంభాషణలు కొద్ది సమయంలోనే చిరపరిచితులు మాట్లాడుకున్నట్లు మారి పోయింది. వనజ టేబిల్ మీద పెట్టిన సెల్ ఫోన్ మ్రోగడం మొదలు పెట్టింది. తను బిజీగా ఉన్న ఈ సమయంలో ఎవరు ఫోన్ చేస్తున్నారని వనజ ముఖంలో ఓ పాటి విసుగు మరో వైపు ఎవరన్న ఆలోచన ప్రస్ఫుటిస్తుండగా ఫోన్ తీసి కాలర్ పేరు చూసింది. వెంటనే తన ముఖం రంగులు మారాయి.

" ఏంటి రామం? " అంది సీరియస్ గా వనజ, ఒక నిమషం విడుపు కావాలని ప్రశాంత్ కు తన చూపుడు వేలుతో సంజ్ఞ చేస్తూ

ప్రశాంత్ కానీవండి అన్నట్టుగా తల వూపాడు

" వనజ ఎలా ఉన్నావు ?" ఫోన్ లోని రామం గొంతు.

" బాగానే ఉన్నాను. అస్సలు విషయం చెప్పు రామం "

" కాంచన డాన్సు ప్రోగ్రామ్ చారిటీ షో కని వేస్తున్నాము. ఈ శనివారం సాయంత్రం. తప్పకుండా రావాలి. నీ ఫ్రెండ్సు కూడా చెప్పు. వి వాంట్ బిగ్ గేదరింగ్ "

" సరే వస్తాను " అని వనజ ఫోన్ పెట్టేసి, ప్రశాంత్ ను చూసి "అన్నట్టు ప్రశాంత్ నీవు ఈ వీకెండ్ ఇక్కడే ఉంటున్నావా? మీ వూరికి వెళ్లి పోతున్నావా?" అంది

" ఈ వీకెండ్ ఇక్కడే ఉండదలచుకున్నాను. రీలొకేటు కావాలి కదా, రియాల్టర్ తో మాట్లాడి కొన్ని ఇండ్లు చూద్దాం అనుకుంటున్నాను "

" పర్ఫెక్ట్! అలా అయితే శనివారం సాయంత్రం ఓ డాన్స్ ప్రోగ్రాముంది. నిన్ను నీ హోటల్ నుంచి పికప్ చేస్తాను. రాగలవా? నీకు ఈ ఊళ్ళో ఉన్న ముఖ్యమైన వాళ్ళతో పరిచయం చేస్తాను. ఫండ్ రైజింగ్ లాంటి పనులు మన సంస్థకు చేయాలి కదా, నీ చే యబోయె పనికి బాగా ఉపయోగ పడుతుంది "

ప్రశాంత్ ఇది మంచి అవకాశం లాగానే అని పించింది.

" తప్పక వస్తాను వనజ. నన్ను ఇన్వైట్ చేసినందుకు థాంక్స్ " అన్నాడు ప్రశాంత్.

" నీవు ఊళ్ళో ఉన్నావంటే నేను కాకపోతే ఎవరో ఒకరు నీను తప్పక ఈ ప్రోగ్రామ్ కు పిలిచే వారే. రామం ప్రోగ్రామ్ కదా. ఉండే తెలుగు వారి నందరినీ పేరుపేరు తో పిలిచే ఏర్పాట్లే చేసి ఉంటాడు మనోహర్ " అని చిరు నవ్వు నవ్వింది వనజ. అది సీరియస్ గా అన్నదా , వెటకారంగా అన్నాదా అన్న సందేహం ప్రశాంత్ మదిలో ఓ క్షణం తళుక్కు మంది .

వనజ చెప్పిన సమయానికి ఓ పది నిమిషాలముందే హోటల్ లాబీ లో వచ్చి కూర్చున్నాడు ప్రశాంత్. ప్రొద్దున్నంతా రియాల్టర్ తో తిరిగి దాదాపు ఓ పది ఇండ్లు చూడడటంతో సమయం ఇట్టే గడిచిపోయింది. ప్రశాంత్ ఫోన్ తీసి వాళ్ళావిడకు చూసిన ఇండ్లగురించి చెప్పి వాటి లింక్లు పంపిస్తాను, వెబ్ లో చూసి తన అభిప్రాయం తెలపమని చెప్పాడు. వచ్చే వారం తను కూడా వస్తే ఇద్దరూ కలిసి మరోసారి చూసి నచ్చిన ఇంటికి ఆఫర్ ఇవ్వాలని నిర్ణయించుకున్నారు . వనజ నుంచి కాల్ రాగానే ప్రశాంత్ భార్య దగ్గర వీడ్కోలు తీసుకొని వనజ కాల్ కు మారి " హలో వనజ గుడ్ ఈవెనింగ్ , వచ్చేసారా ? " అంటూ హోటల్ బయటికి దారి తీసాడు. వనజ కారులో హోటల్ పోర్టికోలోనే వేచి ఉంది. ఖరీదైన ఎస్యువి మెరిసి పోతున్నది. వనజకి డబ్బుల కొదువేముంది అనుకున్నాడు ప్రశాంత్. కారు తలుపులు తీయబోయాడు ప్రశాంత్

. లాక్ అయ్యి ఉన్నాయి. వనజ వెంటనే తలుపులు తెరవడానికి బటన్ నొక్కడంతో క్లిక్ మన్న చప్పుడు రావడం ప్రశాంత్ తలుపు తెరిచి వనజని చూసి నవ్వుతూ కార్లో కూర్చోవడం జరిగింది. కొన్నివేల ఆపరేషన్లు విజయవంతంగా చేయగలిన వనజ తలుపులు ముందే తీయకపోవడం గురించిన ఆలోచన ప్రశాంత్ పలకరింపు నవ్వులో మిళితమై పోయింది.

వనజ పట్టు చీర కట్టుకొని వచ్చింది. పెద్ద మేకప్ లేదు. వనజ కళ్ళ లోని మెరుపు, జీవితంలో సఫలత సాధించిన వారిలో ఉండే ఆత్మవిశ్వాసం ప్రతిఫలించే చూపు తప్పితే, ఓ యాభై యేండ్ల సగటు వనితలాగానే ఉంది. వెంటుకలు డై చేసినట్లు ఆవిడ నల్లని వెంట్రుకల మధ్యలో అక్కడక్కడా ఉన్న బ్రవును స్ట్రీక్స్ చెప్పకనే చెప్పుతున్నాయి.

" ప్రశాంత్! గుడ్ ఈవెనింగ్. ఇండ్ల వేట ఎలా సాగింది? " అంటూ డ్రైవ్ చేయసాగింది .

అలా మాటలాడుతూ ఉంటే ప్రశాంత్ వనజ చేస్తున్న పని గురించి ఆవిడ స్థాపించిన చారిటీ గురించి పొగడడం మొదలు పెట్టాడు . అదీ ప్రశాంత్ మనసులోనుంచి వచ్చిన మాటలే.

" వనజా.. మీరు ఎలా ఇన్ని ఆపరేషన్లు చేయగలుగుతున్నారు. ప్రపంచము లోని పేరున్న వాళ్ళందరూ అవసరం పడితే మీ దగ్గరికే రాగలిగే లాగా ఇంత పేరు ఎలా సంపాదించ గలిగారు? ఇంత తీరికలేని పని ఉన్నా ఈ చారిటీ గురించి ఆలోచించి ఎలా స్థాపించగలిగారు? "

" ప్రశాంత్! ఇందులో పెద్ద రహస్యమో కిటుకో లేదు. మొదటి నుంచి నాకు సర్జన్ అవ్వాలని కోరిక. నా పని చాల బాగా చేయాలని తపన. నా దగ్గర వచ్చే రోగుల పట్ల శ్రద్ధ. ఇవ్వన్ని నన్ను ఈస్థితికి తీసుకొచ్చాయి, నేను చేసే పనిలో పొరబాట్లకు తావు లేదు, కాబట్టి ప్రతీ సారి సక్సస్ కావాలనే గట్టి ప్రయత్నం చేస్తాం. నాకు నచ్చిన నేను ప్రేమించే పనే నాకు దొరకడం అదృష్టం. అది అందరికి దొరకదు. ఇక ఈ చారిటీ అంటావా, వయస్సు పెరిగే కొద్ది ఈ జీవితం ఏమి సాధించాం, మన తరువాత కూడా నిలిచే లాంటి దాన్ని ఒకటి నిలబెట్టాలని ఆకాంక్ష వచ్చేస్తుంది. మన ఈజిప్ట్ ఫేరోలు పిరమిడ్లు కట్టినట్లనుకో. ఇది నా పిరమిడ్" అంటూ నవ్వేసింది .

అలా నవ్వుతూనే " నీవు ఇన్ని రోజులు కార్పరేట్ ప్రపంచంలో ఉండి ఇప్పుడు ఈ చారిటీ సంస్థ కు అదీ ఇంతకూ ముందు జీతం కంటే తక్కువే తీసుకొని ఎందుకు వచ్చావు? నీలో కూడా అలాంటి తపనే ఉండి ఉంటుంది" అంది వనజ.

వనజను చెప్పిన మాటలను విన్న ప్రశాంత్ కు ఓ నిమిషం స్వాన్ సాంగ్ అన్న పదం మదిలో అప్రయత్నగా మెదిలింది. హంసలు జీవితాంతం పాడుతూ ఉంటాయని కాని ఆ పాట మరువలేని విధంగా పాడగలిగేది ఆ హంస చనిపోవడాని కొద్ది ముందే నని. వనజ అదృష్టవంతురాలే. తన పాట ముందు నుంచే సరిగా ఎంచు కొంది, జీవిత కాలంలోనే పాటను చివరగా అందంగా పాడగలిగేలా పది కాలా పాటు నిలిచేలా చేసుకోగలిగింది. తను తన పాటను ఎంచుకోవాడంలోనే బాగా ఆలస్యం చేసేసాను, ఇక ఇప్పటికైనా ఈ చారిటీ సంస్థ కు బాగా పని చేసి నేనూ కొంత మంది జీవితాలు మెరుగు పడడానికి సహాయపడ్డానని ఓ సంతృప్తి పొందాలని అనుకున్నాడు ప్రశాంత్.

ఫంక్షన్ జరుగుతున్న కన్వెన్షన్ సెంటర్ చేరుకున్నామని కార్లు పార్కు చేయవలసిన స్థలం, ఆ కార్లలోనుంచి దిగి నడుస్తున్న వారి సూట్లు, చీరలు పరికిణీలు చెప్పకనే చెప్పేస్తున్నాయి. ఓ మినీ ఇండియాలాగా ఉంది ఆ ఆవరణ. వనజ ప్రశాంత్లు దిగి హాలు చేరగానే చాలామంది వనజ దగ్గర వచ్చి మరీ హలో అనడం మొదలు పెట్టారు. వనజ కూడా హలో అంటూ ప్రశాంత్ ను పరిచయం చేసింది. ఫంక్షను కు రావడం మంచి పనే అయ్యింది. ఇంత కొద్దిసమయంలో ఇంత మందితో పరిచయం అవ్వడం సాధ్యం అయ్యేది కాదు అనుకున్నాడు ప్రశాంత్.

అక్కడే అందిస్తున్న స్నాక్స్, మసాల టీ తీసుకొని కనబడిన వారందరితో కబుర్లు మాట్లాడుతూ ఓ అరగంట వనజ ప్రశాంతులు గడిపారు. ప్రోగ్రామ్ మొదలయ్యే సమయానికి ప్రదర్శన హాలులో ప్రవేశించారు. ఆ ప్రదర్శన కూడా చారిటీ ఈవెంట్ అవ్వడం వల్ల టికెట్

కొన్నవారికే అనుమతి ఇస్తున్నారు. వనజ ముందున్న రిజర్వ్డ్ సీట్లకి దారి తీసింది. అవి ప్రదర్శన ఏర్పాటు చేసిన, పాల్గొంటున్న, లేక దారాళంగా డొనేట్ చేసిన వారికి, వారి బందు మిత్రులకని కేటాయించినవి. వనజ బాగానే ఈ ఈవెంటుకు డొనేట్ చేసి ఉంటుదనుకున్నాడు ప్రశాంత్.

కార్యక్రమం ప్రార్థనతో మొదలైంది. అటు తరువాత ఆరోజు ప్రదర్శిస్తున "జానకి రాముల కల్యాణం " భరతనాట్యాన్ని పరిచయం చేయడానికి డాక్టర్ రామంను పిలిచారు. రామం పట్టు పంచ జుబ్బా ఈ సందర్భానికి సరిగా వేసుకొన్నాడు. పూర్తిగా పండి పోయినా తలనిండా ఉన్నా తెల్ల వెంటుకలు ఓ హుందాతనాన్ని ఆపాదిస్తున్నాయి. వయస్సు దాదాపు అరవై దగ్గర ఉన్నా అందగాడే అనిపిస్తున్నాడు. చిన్నప్పుడు అందగాడే అయ్యి ఉండాలి. ఈ దేశం వచ్చి చాలా సంవత్సరాలే అయ్యి ఉంటుందని ఆయన భాషలోని యాస ఆంగ్ల పదాలు దొర్లి నప్పుడు చెప్పకనే చెప్తున్నాయి. పరిచయం తెలుగులోనే చేస్తున్నాడు. కాంచన ఈ భరతనాట్యం ఏఏ గురువుల దగ్గర నేర్చుకుందో ఆ కళకు ఎంత సేవ చేసిందో, ఎన్ని ప్రదర్శనలు ఇచ్చిందో, ఎన్ని అవార్డ్ లు గెలుచుకొందో, ఇప్పుడు ఈదేశం వచ్చిన తరువాత ఓ డాన్సు అకాడమీ స్థాపించి ఇక్కడి పిల్లలకు ఏ విధంగా భరత నాట్యం నేర్పించి మంచి కళాకారులుగా మలచుతున్నదో అని చక్కగా వర్ణించాడు రామం. అయన మాటలలో కాంచన పట్ల ఉన్న మెప్పుకోలు బాగా ప్రస్పుటమైంది. పరిచయం చేస్తున్నది ఆయన భార్యనే కదా అంతగా పొగడాల, ఈ పొగడ్తలు వినడానికే మనల్ని పేరుపేరునా పిలవాల అన్న మంద హాసమిళితమైన మాటలు ప్రశాంత్ చెవిలో లీలగా పడ్డాయి. రామం కాంచన తన జీవిత భాగస్వామి అవ్వడం తనకు ఆ విధంగా కళకు సేవ చేసుకోవడానికి, కళలను ఆస్వాదించాడానికి అవకాశం కలగడం తను జీవితంలో ఓ గొప్ప భాగ్యంగా చెప్పి ఆరోజు ప్రదర్శన గురించి మాట్లాడ డానికి కాంచనను పిలిచాడు .

కాంచన అప్పటికే వేసుకున్న భరత నాట్యం దుస్తులు మేకప్పు వల్ల మెరిసిపోతున్నది. ఆవిడకి వయస్సు యాభైలో పడి ఉండి ఉంటుంది ఒకప్పుడు అందగత్తే అయ్యి ఉండాలి అనుకున్నాడు ప్రశాంత్. కాంచన భరత నాట్యం గురించి తన అకాడమీ గురించి పరిచయం చేసింది. ఆరోజు కార్యక్రమంలో ఉన్న నాట్యం వరుసక్రమం గురించి వివరించింది.

మొదట అలరిపు అనీ ఆ అలరిపు పాటగురించి ఆ నాట్యంలో పాల్గొంటున్న వారి గురించి పరిచయం చేసింది. అలరిపులో కాంచన కూడా ఉంది. నాట్యం చేసే వారందరికీ ఇండియాలో ప్రత్యేకంగా చెప్పి ఆర్డర్ చేసినట్లు ఉన్నారు, వారు ధరించిన దుస్తులు బాగా మెరిసిపోతూ ఆ వేసుకున్న వారికి, ఆ నాట్యానికే ఓ మంచి అందం తెచ్చాయి. ఆ అలరిపులో ఉన్నవారందరూ చిన్నపిల్లలే. హైస్కూల్ మిడ్డిల్ స్కూల్ పిల్లలై ఉండాలి .వారి మధ్యలో కాంచన కొంచెం ప్రత్యేకంగానే కనిపిస్తున్నది. అలరిపు తరువాత కౌతువమ్. మళ్ళీ ఇంకో డిజైన్ రంగులు ఉన్న దుస్తులు వేసుకొన్న మరికొందరు పిల్లలు వారి మధ్య కాంచన. తరువాత గణపతి వందనం అందులో కాంచననే. పిల్లలు మారుతున్నారు కాని కాంచన ప్రతీ దానిలో కనిపిస్తూనే ఉంది. సినిమాలో హీరోయిన్ పక్కన్న డాన్సు చేసే ఎక్స్ట్రా లు గుర్తు కోచ్చాయి ప్రశాంత్ కు. కాంచన అలా రావడం మీద కొన్ని నవ్వులు ప్రశాంత్ చెవిలో పడుతున్నాయి కూడా. వనజ మాత్రం సీరియస్ గా చూస్తున్నది.

జతిస్వరం మొదలయ్యేముందు బ్రేక్ లో ప్రశాంత్ తట్టుకోలేకపోయాడు .

"వనజా.. అన్నిట్లో కాంచన గారే వస్తున్నారేమిటీ? పిల్లలకి అవకాశం ఇవ్వవచ్చు కదా, ఈవయస్సులోనూ ఇలా అన్నిటిలోనూ పాల్గొనడం సరి కాదేమో " అన్నాడు ప్రశాంత్ .

" అదేంటి ప్రశాంత్, కాంచన చేస్తున్న అభినయం చూడు, లయ బద్దంగా వేస్తున్న అడుగులు చూడు, టెక్నికల్ గా ఒక్క లోపం కనపడటం లేదు"

వనజ కూడా ఈ కళగురించి కొద్దో గొప్పో తెలిసే ఉండాలి అనుకున్నాడు ప్రశాంత్.

"వనజా.. నీకు భరతనాట్యం లో ప్రవేశం ఉందేమో. కాని నాకు కాంచన అలా అన్ని డాన్సు లకు రావడం పిల్లల్ని డామినేట్ చేసి అలా ఆడడం ఏమి బాగాలేదు. పిల్లలు ఎంత లేతగా అందంగా ఉన్నారు, వారు చేస్తే ఇంకా కార్యక్రమం రాణిస్తుందేమో " అన్నాడు ప్రశాంత్

"నీవు అందంగా ముద్దుగా ఉన్న పిల్లల్ని చూస్తుంటే, నీవన్నది సరే. కాని ఇది భరతనాట్యం. అదిచేయడానికి చాల అనుభవం శిక్షణ కావాలి . కాంచన చేస్తున్న నాట్యం మన ఆహ్లాదానికే కాక పిల్లకి ఓ క్లాసు కూడా. ఇలాంటి పెద్ద సముదాయం ముందు ఎలా చేయాలి, రంగం ఎలా ఉపయోగించొకోవాలి, నాట్యం లో నేర్చుకున్నా మెళుకువల్లనీ ఎలా ప్రదర్శించాలి? – అని, "

వనజ మాటలు ప్రశాంత్ ఉలిక్కి పడేలా చేసాయి తను చేస్తున్న కార్పరేట్ ప్రపంచంలో ఎన్నిసార్లు వయసయ్యిన ఉద్యోగుల పట్ల ఓ నిర్లక్ష్యం వివక్షణ చూడలేదు. తను కాంచన చేస్తున్న నాట్యం వదిలి ఆవిడ ముఖం వయస్సు చూసి నచ్చలేదనడం ఎంత పొరపాటు.

ప్రశాంత్ మిగిలిన కార్యక్రమం ఓ కొత్త మంచి అవగాహనతో చూడడం మొదలెట్టాడు.

ప్రశాంత్ మనసు మారి, వనజ ఎప్పటిలా తరువాతి వర్ణం చూస్తున్నా పక్కన్నున్న వారు కాంచన గురించి చేస్తున్న వెటకారపు నవ్వులు, మాటలు వారి చెవిలో అప్పుడప్పుడు పడుతూనే ఉన్నాయి.

మారిన దృక్పథం తో చూసిన వర్ణం ప్రశాంత్ కు బాగా నచ్చింది .

వర్ణం తరువాత విరామం భోజనాలకని ఇచ్చారు. వనజ ప్రశాంత్ లు కూడా భోజనాలు కానీ ఏర్పాటు చేసిన హాలు కెళ్ళారు.

అప్పటికే బఫే లైను చాలా పొడవుగా ఉంది. సాలడ్లు మైక్రోవేవ్ తిండ్లు చేయడానికే టైము లేక అల్లాడుతున్న జనాలు ఆ బఫే వరుసలో ఉన్న 15 పైన వెరైటీ వంటకాలు ఒకటీ వదలకుండా వడ్డించుకొని బరువైన ప్లేట్లు మోసుకుంటూ కూర్చోడానికి టేబిల్స్ వెదుక్కుంటున్నారు. సూప్లు సాలడ్లు అంటూ డైటింగ్ చేస్తున్న వాళ్ళకు కూడా ఈ పూట ఆటవిడుపే.

వనజ "ఇప్పుడే ఆ క్యూ ఎందుకులే ప్రశాంత్? నీకు రామం మరికొందరిని పరిచయం చేస్తాను" అంది

ఇక్కడ ఈ హాలులోను రామం తన భార్య కాంచన ప్రోగ్రామ్ కనీ పేరు పేరునా ఫోన్ చేసి పిలవడం గురించి, కాంచన వయస్సు మళ్ళినా వదలకుండా అన్నిటిలోనూ పాల్గొని అలా నాట్యం చేయడం గురించి అపహాస్యం చేస్తున్న మాటలు వినపడుతూనే ఉన్నాయి. కాని ఒక విచిత్రం.. వనజ దగ్గర వచ్చి మాట్లాడిన ఓ గౌరవ భావం తో మాటాడుతున్నారు. ఎలాంటి గాసిప్పు లేదు. వనజకు ఈ కమ్యునిటీ లో మంచి మర్యాదే ఉంది అనుకున్నాడు ప్రశాంత్.

వనజ కూడా ఈ మాటలు విన్నట్లుంది.

" ప్రశాంత్! రామం కాంచనల గురించి నీవు మాటలు వినే వుంటావు, దానికి కారణం వారు గత సంవత్సరం చేసుకున్న పెళ్ళే. ఇద్దరికి పెళ్లిలు ఇదివరకే అయ్యి పోయాయి – ఇది రెండో పెళ్లి. ఇద్దరికీ బాగా సెటిల్ అయ్యిన పెద్ద పిల్లలు ఉన్నారు. రామంకు తన చేస్తున్న వైద్య వృత్తి కన్నా కళలు కళాపోషణ అంటే ఇష్టం. కాంచనకు తన నాట్యం అంటే ప్రాణం. సాగర సంగమంలో కమలహాసన్ జయప్రద పాత్రలు తారుమారు అయ్యాయనుకో " అని నవ్వింది వనజ

" కానీ దానికోసం పెళ్లి చెడగొట్టుకోవడమ్..!?" ప్రశాంత్ దీర్ఘం తీసాడు.

" అందరికి ఆలోచనలు వచ్చినా, బాగా సంపాదించి సెక్యూర్ గా ఉన్నవారు జీవితంలో ఏదో సాధించి ఓ పిరమిడ్ కట్టిపోవాలన్న కాంక్ష తో ఇలాంటి పనులు చేయడం లాజికల్ గానే అనిపిస్తుంది. అయినా ఆ సినిమాలా కాకుండా వీరు పెళ్లి చేసుకొని సుఖాంతం చేసుకున్నారు " నవ్వింది వనజ.

అ హాలులో నడుస్తుంటే వనజను వచ్చి మనుష్యలు పలకరిస్తున్నారు. వనజ వారిని ప్రశాంత్ పరిచయం చేస్తూ వారి చారిటీ గ్రూప్లో చేరానని ఊరికి కొత్తనని చెప్పింది.

ఇంతలో రామం తనను కలిసి ముఖస్తుతి మాటలు మాట్లాడాలని ప్రయత్నిస్తున్న వారిని తప్పించుకొంటూ నేరుగా వనజ దగ్గర వచ్చి

"ఎలా ఉన్నావు వనజా? థాంక్స్ ఫార్ కమింగ్ " అన్నాడు

వనజ " ఓకే రామం , నైస్ ప్రోగ్రామ్ బాగా అరేంజ్ చేసావు. కాంచన నాట్యం కూడా ఆవ్సమ్ " అంది.

ఇంతలో ఓ 25ఏళ్ల అమ్మాయి వనజ వేనుకవచ్చి గట్టిగా కౌగలించు కున్నది. వనజ తెలిసినట్లు నవ్వి ,

"ఏంటి అమ్ములూ.. ఎప్పుడు వచ్చావు? " అంటూ ఆ అమ్మాయిని ముందుకు అప్యాయంగా లాగింది.

"ప్రశాంత్! ఇది మా అమ్మాయి అమల, అమ్ములు అని పిలుస్తాం. మెడికల్ కాలేజి పూర్తి అయ్యింది, వచ్చే సంవత్సరం రెసిడెన్సికీ పోతుంది. ఇదిగో తనతో వచ్చిన ఈ అబ్బాయి అమల బాయ్ ఫ్రెండ్ స్టీవ్" అని అమలను అమలతో మంచి పొడుగు ఉన్న తెల్ల అబ్బాయిని పరిచయం చేసింది.

అమల ప్రశాంత్ తో "హలో" అని వెంటనే అటు వైపు తిరిగి వనజతో మాట్లాడ సాగింది.

ఈ కాలం పిల్లలకి తొందర ఏ పనీ సావకాశంగా చేయరు అనుకున్నాడు ప్రశాంత్.అంతలో తనూ ఆ వయస్సులో అదే తొందరపాటు తో ఉండడం గుర్తొచ్చి నవ్వుకున్నాడు.

"మామ్ , నెక్స్ట్ వీకెండ్ కాలేజిలో కాన్వొకేషన్ ఉంది తప్పక వస్తావు కదా! " వనజతో అమల అంది.

" నీ కాన్వొకేషన్ కు రాకపోవడమేమిటి అమ్ములు!. తప్పక వస్తాను" వనజ అమలను ఆప్యాయంగా గర్వంగా దగ్గరకు తీసుకొని అమల నుదిటి మీద ముద్దు పెట్టింది.

అమల సంతోషంగా అటువైపు తిరిగి రామం చేయి పట్టుకొని " మరి మీ సంగతేంటి డాడ్, మీరూ వస్తున్నారు కదా. కాంచన ఆంటీ నీ కూడా తీసుకు రండి! " అంది.

## పుత్తడివెలుగులు కోసూరి ఉమాభారతి

శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

మూడేళ్ళ పరమేశ్వరి స్వరతంత్రుల పైన ప్రత్యేక పరీక్షలు నిర్వహించింది, డా. మాలిని డేవిడ్. ఆ విషయమై ఆత్రుత పడుతున్న అమ్మాయి తల్లితండ్రులకు, కంగారు పడవలసినది ఏమీ లేదని ధైర్యం చెప్పిందామె. సన్నిహితులైన వసంత, రామ్‌కుమార్‌ల కూతురవడంతో, ఆ అమ్మాయి పట్ల ఆమెది ప్రత్యేక శ్రద్ధ. అందుకే, ప్రఖ్యాత 'ఢిల్లీ వాయిస్ క్లినిక్' వారి సౌజన్యంతో, ఆ పాప సమస్యకి పరిష్కార దిశగా, సునిశితమైన వైద్యపరీక్షలు జరిపించింది డా. మాలిని.

తన క్లినిక్ నుండి ఒక్కోప్పుడు, వసంత చేతి 'అల్లం టీ' తాగడానికి వాళ్ళింటికి వెళ్తుంటుంది మాలిని. పాప మెడికల్ రిపోర్ట్ రాగానే వారికి కబురు పెడతానని, లేదా లంచ్ టైంలో తానే ఇంటికి వచ్చి ఆ రిపోర్ట్ వివరాలు విశదీకరిస్తానని కూడా వారికి చెప్పిందామె.

మరోసారి ప్రసవించబోతున్న వసంతతో, గర్భిణీ స్త్రీల పోషకాహార అవసరాల గురించి కూడా ముచ్చటిస్తుంది మాలిని.

వసంత, రామ్‌కుమార్‌ల పెళ్ళయి నాలుగేళ్ళు గడిచాయి. పెళ్ళయిన యేడాదికి, వసంత పండంటి బిడ్డకి జన్మనిచ్చింది. వాళ్ళ వివాహం జరిగిన ఆలయ అధిష్టాన దేవత "పరమేశ్వరి దేవి" పేరునే బిడ్డకి పెట్టుకున్నారు. ముద్దుగా "పారు" అని పిలుచుకుంటారు.

ఐతే, మూడు సంవత్సరాలు నిండినా పారుకి మాట రాకపోవడం వారికి ఆందోళనగా ఉంది. తన వయసు పిల్లల్లా మాట్లాడం కాదు కదా, నోరు తెరిచి 'అమ్మ... అత్త' లాంటి చిన్న చిన్న పదాలను కూడా పలకలేకపోవడం వారిని ఎంతగానో కలవరపెడుతోంది.

అభ్యుదయ భావాలున్న రామ్‌కుమార్. విశిష్టమైన వ్యక్తిత్వం కలవాడు. సమాజంలోని విభిన్న సంస్కృతులు, వారసత్వాల పట్ల గౌరవం ఉన్న వ్యక్తి. కుల-మత బేధాలకి అతీతుడు. పలు సేవాసంస్థలలో సభ్యుడిగా ఉన్న రామ్ ని అందరూ గౌరవిస్తారు.

మచిలీపట్నంలోని భారత్ ఎలెక్ట్రానిక్ కంపెనీలో సూపర్వైజర్ గా పనిచేస్తున్న అతనికి అనుకూలవతి ఐన భార్య వసంత. నిరాడంబరత సౌశీల్యత ఉన్న స్త్రీ. భర్త ఏ నిర్ణయం తీసుకున్నా, దానికి కట్టుబడి ఉండే తత్త్వం ఆమెది..

కర్నాటక సంగీతంలో శిక్షణ పొందిన వసంత, పాప పుట్టిన దగ్గరినుండీ తన సంగీతానికి ఉద్వాసన పలికింది. పారు పెంపకంలోనే సమయం గడుపుతుంది. సాంప్రదాయసిద్దంగా పూజలు వ్రతాలు ఆచరిస్తుంది. అలాగే భర్త అభ్యుదయ భావాలని గౌరవిస్తుంది, అనుసరిస్తుంది కూడా.

ఆదివారం, ఆ కుటుంబానికి ప్రత్యేకమైన రోజు. ఇతర పనులేమీ పెట్టుకోకుండా భార్యాబిడ్డలతో సమయం గడుపుతాడు రామ్. తమ గారాలపట్టి పారు ఆరోగ్యం కోసం వారు వివిధ మతాల ప్రార్థనాస్థలాలను దర్శించుకునేది కూడా ఆదివారం నాడే. పరిపాటిగా, తమ దగ్గరిలోని బాప్టిస్ట్ చర్చ్ కి వెళ్ళడంతో రోజు మొదలవుతుంది వారికి. మధ్యాహ్నా వేళకి అమ్మవారి ఆలయానికి వెళ్ళి, తరువాత మసీదులో కూడా ప్రార్ధనలు చేసి ఇల్లు చేరుకోడం అలవర్చుకున్నారు.

శ్రావణ శుక్రవారం ఉదయమే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసింది వసంత. మందిరం ఎదురుగా చేతులు జోడించి నిలబడి, కళ్ళు మూసుకుని ప్రార్థించసాగింది. ఆ తల్లి కంట కన్నీరు జలజలా రాలింది. "అమ్మా.. నా చిట్టితల్లిని బాగు చేయగలదానివి నువ్వే తల్లీ. పిల్ల స్వరతంత్రులకి ఏ లోపమూ లేకుండా చూడు. బిడ్డకి మాట్లాడే సమర్ధతనివ్వు. నీ ఆశీర్వాదంగా భావించి, బిడ్డకి నీ పేరే పెట్టుకున్నాం.. మా నమ్మకాన్ని వమ్ము చేయకు... నీ కృప మా మీద ఉండనీ..." అంటూ దేవుని మందిరం ఎదురుగా చారిగిలపడి, ఆర్ధ్రతతో లలితా సహస్రనామం చదవసాగింది.

పూజ ముగిసాక కూడా, వసంత చాలా సేపు పూజగదిలోనే ఉండిపోయింది. అమ్మవారి విగ్రహానికి ఎదురుగా, గోడనానుకుని చాలాసేపు ధ్యానంలో కూర్చుండిపోయింది.

తన చెక్కిళ్ళ మీద సుతిమెత్తని చేతి స్పర్శ తగలడంతో, కళ్ళు తెరిచి చూసింది వసంత. ఎదురుగా చిన్నారి పారు. కళ్ళ నిండా నీళ్ళతో తల్లి వంకే చూస్తోంది. పాపని దగ్గరకు తీసుకుని, ముద్దు పెట్టుకుంది.

"చూసావా, పారూ – నీ గురించి అమ్మవారితో మాట్లాడుతూ– నీ ఆకలి సంగతే మర్చిపోయాను. రెండు నిముషాలలో నీకు ఆమ్లెట్ వేసి పెడతాను..." అంటూ పాపనెత్తుకుని, వంటింట్లోకి నడిచింది.

అలవాటుగా, ఆదివారంనాడు అందరికన్నా ముందుగానే నిద్ర లేచే రామ్ ఆ రోజు ఉదయం ఏడయినా నిద్ర లేవలేదు. ఎన్నోమార్లు, గదిలోకి వచ్చి నాన్న లేచారో లేదోనని చూసివెళుతూనే ఉంది పారు...నాన్నని మరికాసేపు పడుకోనివ్వని అమ్మ అనడంతో, చేసేది లేక, వంటింట్లో తల్లి వెనుకే పచార్లు చేస్తూ గడిపింది.

మరెప్పటికో, దూరంగా తచ్చట్లాడుతున్న పాప మెత్తని అడుగుల సవ్వడికి, మెలకువ వచ్చింది

రామ్ కి. పారు కోసం చుట్టూ చూసాడు.

పారు గది బయటే ఉందని గ్రహించి, "ఎక్కడ? నా బంగారు తల్లి ఎక్కడ? చిట్టితల్లిని చూడకుండా నేను కళ్ళు తెరవనని తెలుసు కదా! రావాలి మరి... పారూ.. పారూ" అంటూ చేతులతో కళ్ళు మూసుకుని పాపని పిలిచాడు.

మధ్యగది లోంచి పరుగున వచ్చి, మంచం మీదకి ఎక్కి, నాన్న పొట్ట మీద కూర్చుంది, పారు. అతను కళ్ళ మీద ఉంచిన చేతులను తీయాలని ప్రయత్నించింది. కాసేపు చేతులు తీయకుండా ఏడిపించిన తర్వాత గాని కళ్ళు తెరవలేదు రామ్.

తండ్రీకూతుళ్ళిద్దరూ హాయిగా నవ్వుకున్నారు. ఆడుతూ, కబుర్లాడుతూ ఎప్పటిలా ఆదివారం స్పెషల్ టిఫిన్, కాఫీ మంచం మీదే కానిచ్చారు..

స్థానిక బాప్టిస్ట్ చర్చ్ కి గౌరవ సభ్యులు, దాతలు అయిన డా. మాలిని, డేవిడ్ దంపతులు, చిరకాలంగా రామ్, వసంతలకి ఆప్తులు. అదే చర్చ్ కి వెళ్ళే కుమార్ కుటుంబంతో, ఆదివారాలు తప్పనిసరిగా సమయం గడుపుతారు. ఈస్టర్, క్రిస్మస్ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాలుపంచుకుని, చర్చ్ కి తన వంతు సేవలందిస్తుంటాడు రామ్.

చర్చ్ లో ప్రార్ధనలు ముగిసాక, ఆ రోజు కూడా రెండు కుటుంబాలు అక్కడికి దగ్గర్లోని క్యాంటిన్ కి వెళ్ళారు. అల్పాహారంతో పాటు తమకిష్టమైన బాదం-కీర్ సేవించాక, మగవాళ్ళిద్దరూ పాపతో సహా పక్కనే ఉన్న పార్కులోకి నడిచారు. ఎప్పటిలా అక్కడి పిల్లలతో, పారు ఆటల్లోకి దిగింది.

వసంత, మాలిని కాస్త దూరంగా చెట్ల నీడలో కూర్చుని కబుర్లు చెప్పుకోసాగారు.... వాళ్ళ మాటలు చివరికి, పారు సమస్య దిశకే చేరాయి.

పారుకి మాట రాకపోవడం విషయం రాగానే, వసంత దిగులుగా అయిపోడంతో, ఆమె వద్దకి వచ్చి కూర్చుంది మాలిని. "చూడు వసంతా, పారు తప్పక మాట్లాడగలుగుతుందని నా గట్టి నమ్మకం. ఆ విషయంగా దిగులు పడకు. ఇకపోతే ఇటువంటి సమయంలో నీవు

సంతోషంగా, ఆరోగ్యంగా గడపాలి. ఇంకో నాలుగు నెలల్లో నీకు ప్రసవం అవబోతుందని గుర్తుపెట్టుకో.. కడుపులో ఉన్న బిడ్డ సంగతి కూడా చూసుకో," అంటూ ఓదార్పుగా వసంత భుజం మీద చెయ్యేసి ధైర్యం చెప్పింది.

ఆఫీసు నుండి ఓ గంట ముందే ఇంటికొచ్చిన రామ్, నెలవారీ జమాఖర్చులు సరిచూసుకుంటూ, వసంతని పిలిచాడు. పాప వైద్య పరీక్షల కోసం తీసుకున్న అడ్వాన్స్‌లో ప్రతి నెలా కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని, జీతం తగ్గబోతుందని తెలియజెప్పాడు. "ఏదో విధంగా సర్దుకుందాం," అంటూ వసంత కేసి సందేహంగా చూసాడు.

అప్పటివరకు ఎడంగా నిలబడి అతని మాటలు వింటున్న వసంత, దగ్గరిగా వచ్చి, పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చుంది. దిగులుగా ఉన్న భర్త ముఖంలోకి చూస్తూ, "కంగారు పడకండి. త్వరలోనే నేను మనింటికి దగ్గరగా ఉన్న బడిలో మళ్ళీ సంగీతం పాఠాలు చెప్పబోతున్నాను. కాబట్టి ప్రియమైన శ్రీవారూ... బెంగపడకండి. అంతా మంచే జరుగుతుంది..." అని రామ్ చేతులని తన చేతుల్లోకి తీసుకుంది.

క్షణంపాటు ఆశ్చర్యపోయడు రామ్. "ఏంటీ, నమ్మలేకపోతున్నాను. మూడేళ్ళ తరువాత నువ్వు సంగీతం మీద దృష్టి పెట్టడం మంచిదే.. కాని ఎలా? పారు పరిస్థితి ఏంటి? పైగా నీకేమో నెలలు నిండుతున్నాయి. పారు పెంపకం, ఇంటి పనితోనే అలసిపోతావు. ఇప్పుడు సంగీతం పాఠాలు కూడా అంటే," ఆగాడు రామ్.

బదులుగా వసంత ఏదో చెప్పబోయేంతలో బయట గేటు చప్పుడైంది. క్షణాలలో మాలిని గుమ్మం ముందుకు వచ్చి తలుపు తట్టింది. ఆమె చేతిలో పెద్ద కవర్ ఉంది. "వసంత, రామ్, ఢిల్లీ నుంచి వైద్య పరీక్షల రిపోర్ట్ వచ్చేసింది. ఇంటికి వెడుతూ దీన్ని మీకు చూపిద్దామని ఇలా వచ్చాను.. రిపోర్‌ట్‌లో ఏముందో చూద్దాం..." అంటూ అక్కడున్న కుర్చీలో కూర్చుంది మాలిని.

ముందుగా, తనే రిపోర్ట్ ని చదివింది. తలెత్తి, ముఖం పై చిరునవ్వుతో రిపోర్ట్లని రామ్ చేతికందించి,

వారివురి వంక నిశితంగా చూసింది. "నా వృత్తిపరమైన అభిప్రాయంతో పాటు, ఈ రిపోర్ట్ లో కూడా, పారుకి పాథలాజికల్ డిఫెక్ట్స్ ఏవీ లేవని, స్వరతంత్రుల అన్ని అంశాలు ఉండాల్సిన స్థాయిల్లోనే ఉన్నాయని ఉంది," అందామె, ఆతృతగా వింటున్న పారు తల్లిదండ్రులతో.

"మరి పాప ఎందుకు మాట్లాడలేకపోతుంది?"అని అడుగుతూ వసంత ఒక్కసారిగా భోరుమంది.

"చూడు శాంతా, కొన్ని ఘటనలు ఎందుకు జరుగుతాయో.. మనకి తెలియదు. వాటి గురించి మనమేమీ చేయలేం. వేచి ఉండాల్సిందే. మాట విషయం పక్కన పెడితే, మిగతా అన్నిటా పాప సాధారణంగానే ఉన్నందుకు మనం సంతోషించాలి. కాదంటావా?" అడిగింది మాలిని.

కాసేపు అందరూ మౌనంగా ఉండిపోయారు.

అంతా విన్న రామ్ మాలిని అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవించాడు. కళ్ళు తుడుచుకుంటున్న వసంత వంక చూసాడు. ఆమె, తన మౌనం వెనుక దాచుకున్న కలవరాన్ని గ్రహించి, ఓదార్పుగా ఆమె భుజంపై చేయి వేశాడు. "ఓపిక పట్టమనే కదా మన డాక్టరమ్మ చెబుతున్నారు. కాబట్టి ఏడుపు ఆపి, లేచి వెళ్ళి నీ స్పెషల్ టీ పెడతావా? పాప రిపోర్ట్ తెచ్చిన మన ఆప్తురాలు మాలినికి అతిథి సత్కారాలు చేయవా?" అన్నాడు ఆమె తలపై మృదువుగా తడుతూ.

వసంత కాన్పు సమయం దగ్గరకొస్తోంది. పైగా ఆమె కవల పిల్లలకి జన్మనివ్వబోతుందని తేల్చారు డాక్టర్లు. తనకి తోడుగా ఉండడానికి, తన పిన్నమ్మ సీతమ్మని రమ్మని పిలిచింది వసంత.

బాసరలో నివసిస్తున్న సీతమ్మ, అక్కడ పిల్లలకి సంగీతం నేర్పిస్తూ, కాలం వెళ్ళబుచ్చుతుంటారు. తన స్వర జ్ఞానంతో సమాజానికి సేవ చేయమని చదువుల తల్లి 'బాసర సరస్వతిదేవి' ఆదేశించినట్లు భావిస్తారామె. అందుకే సంగీత పాఠాలే ముఖ్యం ఆవిడకి.

చిన్నప్పుడే రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను పోగొట్టుకున్న వసంతని పెంచి పెద్ద చేసింది సీతమ్మగారే. తన సోదరి జ్ఞాపకంగా మిగిలిన వసంత ప్రాపకం కోసం కూడా, అవివాహితగానే ఉండిపోయారు సీతమ్మ. తల్లీ కూతుళ్ళ సంబంధమే అవడంతో, వారి నడుమ ప్రేమ వాత్సల్యాలు మెండుగా ఉన్నాయి.

అందుకే, వసంత పిలుపందగానే పురుడు పోయడానికి మచిలీపట్నం బయలుదేరారు సీతమ్మ గారు.

ఆవిడకి తన మనమరాలు పారు పట్ల ఎనలేని మమకారంతో పాటు, మూడేళ్ళు దాటినా పిల్లకి మాట రాలేదన్న దిగులు కూడా బాగా ఉంది. తమ వంశపారంపర్యంగా వస్తున్న సంగీత జ్ఞానం, చక్కగా పాడగల సామర్ధ్యం పారుకి దక్కకుండా పోతుందేమోనని బెంగ పడతారామె. అమ్మవారిని మొగలిపూలతో పూజిస్తే వాక్శుద్ధి చేకూరుతుందన్న నమ్మకంతో, ఊరికి బయలుదేరే లోగా బోలెడన్ని మొగలి పువ్వులు కూడబెట్టారు కూడా. మనమరాలితో అమ్మవారికి మొగలిపూలతో పూజలు చేయించాలని ఆమె కోరిక. నిత్యం పారు పేరిట జరిపే అర్చనలకి కూడా మొగలి పువ్వులని సమర్పిస్తుంది సీతమ్మ గారు.

అమ్మమ్మ రాక చిన్నారి పారుకి ఎంతో సంతోషాన్నిచ్చింది...... అమ్మమ్మనే అనుసరిస్తూ ఆమె కనుసన్నలలో మెలగసాగింది. శుక్ర, శనివారాల్లో అమ్మమ్మ చేసే ప్రత్యేక పూజలప్పుడు ఆవిడ పక్కనే కూర్చుని శ్లోకాలకు తగ్గట్టుగా పెదాలు కదుపుతుంది కూడా.

అమ్మమ్మ ఒళ్ళో కూర్చుని ఆవిడ పాడే భజన గీతాలు, చెప్పే చందమామ కథలు వినడం పారుకి మహా ఇష్టంగా మారింది. ఆ చిన్నారికి గుర్తుండేలా సీతమ్మగారు ఒక్కో భజన గీతాన్ని ఒక్కోలా అభినయించేవారు.

తాను పాడే – 'ఎనగాను రామభజన కన్న మిక్కిలి ఉన్నదా', 'రామ రామ యనుచు..' వంటి రాముడి కీర్తనలు పారుకి ఇష్టమని గ్రహించి, రాముడిని దర్శింపజేయడం కోసం ధనుర్బాణాలను గాలిలో గీసి చూపారు సీతమ్మ. ఆ చిహ్నం పారు మనసులో బాగా ముద్రించుకుపోయింది.

అమ్మమ్మని రాముడి పాటలు పాడమని అడగాలంటే, తను కూడా చేత్తో ధనుర్బాణాల ఆకారాన్ని ఏర్పరిచి చూపించి, ఆమె మెప్పులందుకుంటోంది పారు.

అమ్మమ్మ నుంచి ఒక్కోటి ఇంటి పనులు కూడా నేర్చుకోసాగింది. మాట లేదనే ఒక్క లోపం తప్పితే పారు గ్రాహ్యశక్తికి, పురోగతికి ఆటంకాలేవీ లేవని గ్రహించిన పాప తల్లితండ్రులు ఏదో ఒక రోజు తమ బంగారుతల్లి చక్కగా మాట్లాడక పోతుందా అని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

క్లినిక్ పని ముగించుకుని, తమని చూడ్డానికి ఇంటికి వచ్చిన మాలినిని సాదరంగా లోనికి ఆహ్వానించింది హాల్లో సేదతీరుతున్న సీతమ్మ గారు.

"రామ్మా, కూర్చో. నీకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. నీవు పంపే పువ్వులు కూడా కలుపుకుని, ప్రతిరోజు దేవుని విగ్రాహాలకి మాలలు కడుతున్నాముగా!" లోనికొస్తున్న మాలినితో ఆమె.

"మా డాక్టరమ్మ ఇవాళ తప్పక మా ఇంటికి వస్తుందని తెలుసు," అంటూ ట్రేలో టిఫిన్ – 'టీ' కప్పులతో ప్రత్యక్షమైంది వసంత. అందరికీ 'టీ' అందించి మాలిని పక్కనే కూర్చుంది.

"మరో వారంలో, మన పారు పుట్టినరోజమ్మా. నాలుగేళ్ళు నిండుతాయి దానికి. నలుగిరిని పిలిచి పండుగ చేయాలి," అంది సీతమ్మ,...

"తప్పకుండా చేసుకోవాలి. అదీ మా ఇంట్లో ఏర్పాటు చేద్దాము...," సంతోషంగా మాలిని.

"ఏమంటావ్ వసంతా? ఆదివారం మధ్యాహ్నం లంచన్ పెట్టుకుందామా? నీవు అతిధుల పేర్లు రాసివ్వు. నేను స్వయంగా వారిని ఆహ్వానిస్తాను" అందామె తన స్నేహితురాలితో.

"నేను వద్దంటే మాత్రం నువ్వు ఊరుకుంటావా?" నవ్వింది వసంత.

టీ, టిఫిన్ కానిస్తూ వారు పార్టీ ఏర్పాట్ల గురించి చర్చింకుంటుండంగా, పరుగున వచ్చి అమ్మమ్మ వడిలో చేరింది

పారు. చేతిలోని పలక అమ్మమ్మకి అందించి, చేతులు కట్టుకుని ఆమె వంక సూటిగా చూసింది..

కొద్దిసేపు ఆ పలకని చదివిన సీతమ్మ గారు, "బంగారు తల్లీ...ఇంత బాగా రాయగలిగావంటే గొప్ప విషయమే మరి" అందామె చేతిలోని పలకని మాలినికి అందిస్తూ.

"పారూకి మంచి ఏకాగ్రత ఉంది. దాని కళ్ళల్లో పట్టుదల కనబడుతుంది. ఏదో ఒకటి తప్పక సాధిస్తుంది అని నా నమ్మకం. చనిపోయిన వాళ్ళమ్మమ్మ సద్గుణాలని పుణికి పుచ్చుకుందేమో! మన పరమేశ్వరి. ఇలా పారుకి లా మాట రావడం ఆలశ్యం అయినవాళ్ళలో కొందరు మేధావులు, విద్వాంసులు ఉన్నారు తెలుసా?" అంది పారు తలపై ప్రేమగా నిమురుతూ సీతమ్మ.

పారు పుట్టినరోజు పార్టీకి, పిల్లలు, పెద్దలు ఇరవైమంది దాక వచ్చారు. అమ్మమ్మతో కలిసి అందరికీ అన్నీ అందిస్తూ, అతిధుల మెప్పులందుకున్న పారు, తనకి మాట రాకపోవడం పట్ల వారి సానుభూతిని కూడా పొందింది.

ఇంట్లో సందడి ముగిసి, అతిధులంతా వెళ్ళాక, పారూకి మరోసారి కేక్ తినిపిస్తూ, కబుర్లు చెప్పసాగారు సీతమ్మ.

"పారు విషయంగా నిరుత్సాహ పడవలసిన అవసరం లేదు. మన ఈ పుత్తడిబొమ్మ ఇప్పుడు మాట్లాడలేకపోయినా, ముమ్ముందు ఎలాగైనా తన వెలుగులని తప్పక చాటుతుంది. ఇన్నాళ్ళగా దాన్ని చూస్తున్నాను కదా! నా దృష్టిలో అది ఏకసంథాగ్రాహి, తెలివైనది. ఆ అమ్మవారి చలవతో, సంగీత విద్వంసురాలైన మా అక్కకి, ఈ మనమరాలు ఎప్పటికైనా ఓ నిజమైన వారసురాలు అవుతుంది," మురిసిపోతూ సీతమ్మగారు.

"సంతోషం అత్తమ్మా, పుట్టబోయే కవలలతో మీరు సమయం లేకుండా అయ్యేలోగానే, పారూకి నేర్పగలిగినన్ని విషయాలు నేర్పేయండి," అన్నాడు రామ్..

అమ్మమ్మ, పారు ఆటపాటలతో మూడు నెలల సమయం యిట్టే గడిచింది. నెలలు నిండి వసంత కవలలకి జన్మనిచ్చింది. బాబు, పాప పుట్టారు. అబ్బాయికి పునీత్ అని, పాపకి జనని అని పేరు పెట్టారు.

పసిపిల్లల ఆలనా పాలనా చూడ్డంలోనే ఆ కుటుంబానికి, బారసాల వేడుక వరకు కూడా సమయం తెలీకుండా గడిచిపోయింది.

కవలల బారసాలకి వచ్చిన మాలిని, పిల్లలిద్దరూ ఆరోగ్యంగా అందంగా ఉన్నారని వ్యాఖ్యానించింది. పసిపిల్లలకి అమ్మమ్మ ప్రాపకం, ఆలంబన ఇంకా అవసరం కనుక, మరి కొద్దికాలం వసంతకి సాయంగా మచిలీపట్నంలోనే ఉండిపొమ్మని, స్నేహితురాలి తరపున మాలిని కోరినప్పుడు సీతమ్మగారు నవ్వేసారు.

"నేను కోల్పోతున్నది సంగీతం పాఠాల్నే. అంతకుమించి నాకు పోయేదేమీ లేదు. ఇక్కడైనా నేను నిత్యం పారుకి మాటలు, పాటలు నేర్పిస్తున్నాను. అది త్వరలో మాట్లాడగలదని ఆశగా ఉంది. నాకు బాగా దగ్గరయింది కూడా. పారుని వదిలి వెళ్ళాలంటే కష్టమే. కొద్దికాలం ఉండే వెళతానులే " అన్నారావిడ జవాబుగా.

"అమ్మయ్య, ఇవాళ నువ్వు కూడా అడిగేప్పటికి ఒప్పేసుకుంది పిన్ని," అంటూ సంతోష పడిపోయింది వసంత.

"సరే సరే, వీళ్ళ మొదటి పుట్టినరోజు పండుగ చూసి వెళతానులే వసంతమ్మా," మాటిచ్చేసారు సీతమ్మ.

సీతమ్మ గారి చేతి చలవ ఒక్క పసిపిల్లల విషయంలోనే కాదు. ఇంటి వెనుకనున్న స్థలంలో పూలమొక్కలు, కూరగాయ మొక్కలు నాటి, అందమైన తోటలు వేసారామె. ఇంట్లోనే పూలు-పళ్ళు పండించడంలో ఎంతో తృప్తి ఉందని చిన్నారి పారుకి సైతం నేర్పించి, 'హార్టికల్చర్' పై వసంత కి మునుపు లేని ఆసక్తి కల్పించిందామె.

మొత్తానికి, అన్నట్టే కవలల మొదటి పుట్టినరోజు వేడుకలు కూడా జరిపించి, బాసరకి బయలుదేరి పోయారావిడ.. వెళుతూ, రెండు వారాల్లో వరలక్ష్మీ వ్రతం ఉందని వసంతకి గుర్తు చేసి, కవలలు పుట్టిన మొదటి యేడు కనుక, తప్పక ఓపిక చేసుకుని వ్రతం చేయమని చెప్పి వెళ్ళారామె.

ఆవిడ ఊరు వెళ్ళిపోడంతో, ఇంటిల్లిపాది ఒకింత దిగులుగా అయిపోయారు.

వరలక్ష్మీ వ్రతం చేసుకొని సాయంత్రం పేరంటాళ్ళను పిలుచుకుని పసుపుకుంకుమలు పంచింది వసంత. పేరంటం హడావిడి సందర్భంగా అమ్మ చెప్పిన పనులన్నీ ముచ్చటగా నెరవేర్చింది ఐదేళ్ళ పారు.

పేరంటం అయ్యాక, ఇల్లంతా సర్ది పిల్లల్ని సముదాయించుకుని, బాగా అలిసిపోయిన వసంత, ఆలశ్యంగా పడక చేరి గాఢ నిద్రలోకి జారుకుంది.

తెల్లవారుజామునే ఆఫీస్‌కి వెళుతున్న రామ్ కి టిఫిన్ బాక్స్ అందించి, ఇంటి తలుపులు వేసుకునొచ్చి, తిరిగి పక్క మీదకి వొరిగింది, వసంత. కవలలు కూడా గాఢ నిద్రలో ఉండడంతో, సన్నగా పడుతున్న వాన సవ్వడిని వింటూ మగతగా కళ్ళు మూసుకుంది.

కొంచెం దూరం నుంచి 'ఎనగాను రామభజన కన్న మిక్కిలున్నదా' అనే రామకీర్తన శ్రావ్యంగా వినబడుతోంది. "చిన్నప్పుడు నేను మొదట నేర్చుకున్నది ఈ పాటే.." అనుకుంది వసంత. ఆమె మోముపై చిరునవ్వు వెలసింది.

'రామ రామ యనుచు.. శ్రీరామ రామ రామ యనుచు' అంటూ సాగింది ఆ కీర్తన. పిన్నికి చాలా ఇష్టమైన కీర్తన కదా అనుకుంటూ గొంతు కలిపి పాడబోయింది. అంతలో ఆమె ఊరు వెళ్ళి రెండు వారాలవుతుందని ఛటక్కున జ్ఞాపకం వచ్చి, పాడుతున్న చిన్నపిల్ల గొంతు ఎవరిదో అర్థం కాక, ఒక్క ఉదుటున మంచం మీద నుంచి లేచి హాల్లోకి పరిగెత్తింది.

అక్కడ కనబడిన దృశ్యం చూసి, విస్మయానికి లోనై సంభ్రమంతో నిలుచుండి పోయింది. పాడుతున్నది పారు. పూజ గదిలో సీతమ్మగారు కూర్చునే చోట కూర్చుని అచ్చం ఆవిడలానే మధురంగా పాడుతోంది చిన్నారి పారు. కాస్త తడబడుతూనే అయినా, పదాలని కూడబలుక్కుంటూ అంత చక్కగా పాడుతున్న ఆ పసిదాని గొంతు లోని స్వచ్ఛతకి వసంత అవాక్కయింది.

నిశ్శబ్దంగా వెళ్లి, పారుకి కొంచెం దూరంలో కూర్చుంది. తన చిన్నారి కూతురి గొంతు మొదటిసారిగా వింటూ, కీర్తనకి తగ్గట్టుగా చేత్తో తాళం వేయసాగింది.

ఈ క్షణం కోసమే ఎంతగానో ఎదురుచూస్తున్న తమపై, దేవతలు కరుణించినందుకు, పాప గళం విప్పి పలుక గలుగుతున్నందుకు కృతజ్ఞతతో ఆమె కళ్ళు ధారాపాతంగా వర్షించాయి.

తన్మయత్వంగా పాట విన్నాక, వసంత కళ్ళు తుడుచుకుని, పాప వద్దకి వెళ్లి, అమాంతం పాపని వడిలోకి తీసుకుని తనివితీరా ముద్దాడింది. పారుతో ఎన్నెన్నో మాటలు పలికిస్తూ మురిసిపోయింది. మీ నాన్న ఎంత ఆనందపడతారో అంటూ, గబక్కున గుర్తొచ్చి, వెళ్ళి రామ్ కి, మాలినికి కూడా వెంటనే ఇంటికి రమ్మని ఫోన్ చేసింది.

ఎటువంటి వివరాలు చెప్పకుండా, అర్జంటుగా వచ్చేయండన్న వసంత పిలుపందుకుని, అటునుండి రామ్, ఇటునుండి మాలిని ఉరుకులు పరుగులగా ఒకేసారి వసంత వాకిట్లో వాలారు. పిల్లలంతా క్షేమంగా ఉన్నారో లేదో అని ఒకింత ఆదుర్దాగా హాల్లోకి వచ్చారిద్దరూ. అంతా నిశ్శబ్దంగానే ఉంది. అక్కడేమీ కనపడలేదు.

"పారూ, వసంతా... ఎక్కడున్నారు?" అని పిలుస్తూ బెడ్ రూమ్‌లోకి వెళ్ళాడు రామ్. అక్కడ చంటి పిల్లలిద్దరూ హాయిగా నిద్రపోతున్నారు. అక్కడినుండి, మాలిని వెంట రాగా వంటగది దాటి తోటవైపు నడిచాడు..

అక్కడ పూలమొక్కల మధ్య దృశ్యం వారిని నివ్వెరపరిచింది. మల్లెమొగ్గలు, మందారాలు కోసి వసంత చేతిలో ఉన్న పూల సజ్జలో వేస్తూ, తల్లితో సావకాశంగా కబుర్లు చెబుతున్న పారుని చూసి ఆశ్చర్యపోయారు. అంతేకాదు, తనకిష్టమైన రంగులు, పూల సువాసనల గురించి చిలుక పలుకులు పలుకుతున్న పారుని చూసి మురిసిపోయారు.

మాలిని, రామ్ ఆనందబాష్పాలతో శిలల్లా నిలుచుండిపోయారు.

"ఇటువంటి అద్భుతాలు జరుగుతాయన్నమాట," చమర్చిన కళ్ళతో రామ్. "... నాకీ క్షణంలో నా బిడ్డ గొంతు వింటుంటే, మునుపు ఎన్నడూ వినని కమ్మని రాగాలు ఆలకిస్తున్నట్టుంది. దూరాన ఉన్న ఆ హరివిల్లు కూడా ముందెన్నడూ లేనంత అందంగా కనబడుతోంది." పారవశ్యంతో తనలో తాను అనుకున్నట్టుగా రామ్ మురిసిపోయాడు..

"అంతేకాదు, పారు మాట్లాడ గలగడం ఒకెత్తైతే, ఆ మాటలోని మాధుర్యం, స్పష్టత మరో ఎత్తు.," సంభ్రమాశ్చర్యాలతో మాలిని.

పారుకి మాట వచ్చిందన్న సంతోషం, సంబరం బాసర వరకు పాకింది. సీతమ్మమ్మ తరుచుగా ఫోన్ చేసి పారు చేత మాటలు చెప్పించుకుని మురిసిపోతుంది. పారు చేత శ్లోకాలు చెప్పించుకుని రామ్ కూడా ఎంతో ఆనందం పొందసాగాడు.

ఆ రోజు పొద్దున్నే, పారు నేర్చుకున్న కొత్త శ్లోకం విని, పారుతో పాటు వసంతని కూడా మెచ్చుకున్నాడు రామ్.

"ఇదంతా మీ పుట్టింటివాళ్ళ తరపు నుంచి వచ్చినదే సుమా!" అన్నాడు కాఫీ తాగుతూ.

"సంతోషం. రేపే ఊరి నుండి వస్తుందిగా మా సీతమ్మ పిన్ని. ఇదే మాట ఆవిడితో చెప్పండి. మా పుత్తడిబొమ్మ కొత్త వెలుగులు పంచుతుందని చాలా ఆనందిస్తుంది" అంది వసంత నవ్వుతూ.

# సెకెండ్ ఛాన్సు

కొమరగిరి అనంత ప్రమీలా రాణి

## శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది సందర్భంగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

**ఇంట్లో అందరూ ఘొల్లున** ఏడవటం చూసి "ఏమైంది?" అడిగాను అమ్మని,

నేను అట్లా అడగటంతో నన్ను గట్టిగా పట్టుకుని "నీ బతుకు బండలు చేసానే తల్లీ" అంటూ నన్ను దగ్గరకు తీసుకుని ఇంకా భయంకరంగా ఏడవటం మొదలు పెట్టింది.

నాన్నగారు కండువ వెనకాల మొహం దాచుకుని ఏడుస్తున్నారు, అన్నయ్యలిద్దరూ కూడా ఏడుస్తున్నారు.

ఇంట్లో పని చేసే జీతగాళ్ళు, పని అమ్మాయిలు అందరూ కూడా కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్నారు,

ఎవరూ నాకు సమాధానం ఇచ్చేటట్టు లేరు, నాకు పరిస్తితిని అర్ధం చేసుకునే జ్ఞానం కాని వయసు కాని లేవు, నా వయస్సు తొమ్మిది!

ఇంటి ముందు నుంచి పోయేవారు, ఆగి "ఏమయింది?" అని అడుగుతున్నారు,

జీతగాళ్ళు వాళ్ళకి ఏదో చెబుతున్నారు, "అయ్యో ఏంత ఘోరం జరిగిపోయింది, చిన్న పిల్ల కూడా" జాలిగా నా వంక చూస్తూ, వాళ్ళ పనుల మీద వాళ్ళు వెళ్ళి పోతున్నారు మాట్లాడుకుంటూ,

కొంత సమయము గడిచిన తరువాత గాని నాకు తట్ట లేదు, వాళ్ళు ఏందుకో నా మీద జాలి పడుతున్నారు అని.

అందరూ ఏడుస్తూ వుంటే నాకు ఏడవాలని కూడా అనిపించలేదు, అందరి వంక చూస్తూ వాళ్ళ మధ్యలో కూర్చుండి పోయాను, జడ కుప్పెలతో, కాళ్ళ పట్టా గొలుసులతో ఆడుకుంటూ,

అందరూ పెట్టెలు సద్దుకుంటున్నారు కళ్ళు తుడుచుకుంటూ, నేను కూడా వాళ్ళతో పాటు నా పెట్టెలో బట్టలు సద్దుకున్నాను, ప్రయాణం చేయబోతున్నాము అన్న వుత్సాహంతో .

అమ్మ నన్ను చూసి మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది, అందరూ అమ్మని ఓదారుస్తూ, "వూరుకో అమ్మా దాని నుదుట అట్లా రాసి పెట్టి వుంటె మనం మాత్రం ఏమి చేస్తాము, దాని ఖర్మ" అంటున్నారు,

నాతో ఎవరూ ఏమి చెప్పటం లేదు, నేను మాత్రం ప్రయాణానికి సిద్దం అయి పెట్టె మీద కూర్చుని ఎదురు చూస్తున్నాను అందరికోసం.

అందరం వరంగల్ నుంచి హైద్రబాద్ కి వచ్చాము,

మమల్ని చూడగానే అక్కడ అందరూ మళ్ళీ ఏడవటం మొదలు పెట్టారు, నన్ను చూస్తూ ఏదో అంటున్నారు,

ముందు హాల్లోకి వచ్చాము, అక్కడ ఎవరో పడుకున్నట్టుగా వుంది, ఒంటి మీద తెల్ల దుప్పటి గొంతువరకూ కప్పివుంది, దుప్పటి మీద పూల దండ వుంది, తల వైపు నూనె దీపం వెలుగుతున్నది, చుట్టూ చాలా మంది కూర్చుని ఏడుస్తున్నారు, చుట్టాలు ఎవరో చనిపోయారు, "ఓహో ఇందుకా అందరూ ఏడుస్తున్నారు' అనుకున్నాను.

అమ్మ నా చెయ్యి పట్టుకుని లోపలికి వెళ్ళబోతూ వున్నప్పుడు, కొంచం బొద్దుగా తెల్లగా వున్నఒకావిడ సడన్ గా గదిలోనుంచి బయటికి వచ్చి,"వచ్చావా, రావే ఇద్దరం కలిసి ముండమోద్దాము" అని నా చేతిని మా అమ్మ చేతిలోనుంచి పీకి లోపలికి లాక్కెళ్ళిందొ కోపంగా,

ఆవిడ అట్లా చెయ్యి లాగటంతో నాకు నొప్పి కలగడంతో ఏడవటం మొదలు పెట్టాను, ఆవిడ కళ్ళు ఎర్రబడి వున్నాయి, చాలా సేపటి నుంచి ఏడుస్తున్నట్టుగా వుంది "ఏడువు, ఇంకా ఏడవే ముండ" పళ్ళు పట పటా కొరుకుతున్నది ఆవిడ.

ఆవిడ ఏవరో నాకు అస్సలు తెలవదు, మరి ఆవిడకి నా మీద అంత కోపం ఏందుకో?

దీనికి మా అమ్మ, "దాన్ని ఎందుకమ్మా తిడతావు, ఏమి తెలియని చిన్న పిల్ల" అన్నది

దీంతో ఆవిడ రెచ్చి పోయి," ఇప్పుడు తెలిసిందా అది చిన్న పిల్ల అని, మా వారితో రెండో పెళ్ళి చేసినప్పుడు నీకు ఇది చిన్న పిల్ల అని అనిపించలేదా? డబ్బు కోసం కక్కుర్తి పడి రెండో పెళ్ళి చేసావు మా వారితో, ఇప్పుడు అనుభవించు.. దీని భారం నీవు చచ్చేవరకు" అన్నది శాపం పెట్టినట్టుగా!

నన్ను బర బర ఈడ్చుకుంటూ లోపల ఎక్కడో కొంచం చీకటిగా వున్న గదిలోకి తోసి " ఇక్కడే కూర్చుని చావండి" అరిచింది.

"అమ్మా! చీకటిగా వుంది" అన్నాను భయంతో,

"ఇక నీ జీవితం అంతా చీకటే, అలవాటు చేసుకోవే ముండా!" అన్నది తన చీర కొంగుతో కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ, ముక్కు చీదుకుంటూ బొద్దుగావున్న ఆవిడ.

"అమ్మా, ఈవిడ ఎందుకిట్లా మాటి మాటికి నన్ను ముండా ముండా అని తిడుతున్నది?" అడిగాను.

అమ్మ నా వైపు జాలిగా చూసి నన్ను దగ్గరికి తీసుకుందే కాని జవాబు ఇవ్వలేదు.

నాకు ఏమి అర్ధం కావటం లేదు. బిక్క మొహం వేసుకుని కాళ్ళు రెండు దగ్గరకు తీసుకుని, పరికిణీ కొనలను పాదాల కిందికి లాక్కుని, రెండు చేతులు కాళ్ళ చుట్టూ వేసి పట్టుకుని, తల మోకాళ్ళ మీద పెట్టుకుని అమ్మని ఆనుకుని కూర్చున్నాను.

తెల్లవారు జామున బయలు దేరాము కనుక నిద్ర ముంచుకు వస్తున్నది. ఎప్పుడు కిందికి జారిపోయి నేల మీద పడి నిద్ర పోయానో తెలవదు, ఏవరో నా భుజం మీద చెయ్యి వేసి లేపుతున్నారు, మెల్లిగా కళ్ళు తెరిచి ఎవరా అని ఆ చీకట్లోకి చూస్తుంటే మసకగా అమ్మ మొహం కనిపించింది.

"అమ్మా, ఒళ్ళంతా నొప్పులుగా వున్నాయి " అన్నాను.

" శేషు పిన్ని, నేను జయని, మళ్ళీ మీకు పీడ కల వచ్చినట్టుగా వుంది, ఏదో కలవరిస్తున్నారు నిద్రలో",

నన్ను సున్నితంగా భుజం మీద తట్టి నిద్ర లేపటానికి ప్రయత్నం చేస్తున్న జయ, మీద గదిలోవున్న బెడ్ లాంప్ లోనుంచి వస్తున్న లైట్ పడటంతో పూర్తిగా మెలకువ వచ్చింది.

తన చెయ్యి పట్టుకుని మేల్లిగా లేచి కూర్చున్నాను పక్క మీద."అవునే తల్లి మళ్ళీ అదే కల, ఈ కలలన్ని నేను పోతేగాని పోయేటట్టుగా లేవు" అని అంటూ గదిలోనే వున్న బాత్ రూం వైపు నడిచాను మెల్లిగా నా వాకర్ సహాయంతో.

"కాఫీ తీసుకు వస్తాను" అని చెప్పి జయ కిచెన్ వైపు వెళ్ళింది

నాకు ఇద్దరు అన్నలు, పెద్ద అన్నయ పేరు సదాశివుడు, వదిన ఛాయా దేవి, వీరికి ఇద్దరూ మొగపిల్లలే, రాముడు, మారుతి,

చిన్న అన్నయ పేరు భువనేశ్వరుడు, వదిన కమల, వీరికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి,

అందరి వివాహాలు అయి పోయాయి, పిల్లా పాపలతో హాయిగా వున్నారు.

నేను పెద్ద అన్నయ చిన్న కొడుకు మారుతి, వాడి భార్య జయ దగ్గర వుంటున్నాను.

ఇద్దరు అమ్మాయిలు వీళ్ళకి, పెళ్ళిళ్ళు అయిపోయాయి, సుఖంగా వున్నారు.

అమ్మ, నాన్నగారు, అన్నయ్యలూ, వదినలూ అందరూ పోయారు, ఆ భగవంతుడి పిలుపు కోసం ఎదురు చూస్తూ నేను ఒక్క దాన్నే మిగిలాను.

మారుతి, వాడి భార్య జయ చాలా మంచి మనసు కల వాళ్ళు, అమ్మా నాన్నగారు పోయిన తరువాత ఎవరు చేప్పకుండానే నన్ను వాళ్ళ ఇంటికి తీసుకొచ్చుకున్నారు , ఇంట్లో నాకు అన్ని సదుపాయాలు చేసారు నా సుఖం కోసం.

మా వారు బాగా ఆస్తి పరులు. అందువల్ల నాకు వారి ఆస్తిలో నాలుగవ భాగం వచ్చింది. ఇది బాంకులో వేసాడు మారుతి. మొదట్లోనే నా ఖర్చులకు, నాకు కొంచం భూమి కూడా ఇచ్చారు. ఇది నేను మారుతి కి రాసి ఇచ్చాను,

వీడికి ఫార్మసీ డిగ్రీ వుంది కనుక నేను ఇచ్చిన స్తలంలో ఒక చిన్న ఇల్లు కట్టి దాంట్లో మందుల షాప్ పెట్టుకున్నాడు, బాగా నడుస్తున్నది దేవుడి దయ వల్ల!

ఇద్దరు కూడా నన్ను ఎంతో ప్రేమగా చూస్తారు, నాకు కూడా వాళ్ళు అంటే ఏంతో ప్రేమ.

నేను బాత్ రూంలో నుంచి బయటకు వచ్చి నా గదికి ఆనుకుని వున్న బాల్కనిలోకి వెళ్ళి కూర్చున్నాను, ఎండ పడుతున్నది అక్కడ, ఎంతో శక్తి వచ్చినట్టు అయింది ఆ వెచ్చదనం ఒంటికి తాకేసరికి.

జయ గ్లాసులో కాఫీ తెచ్చి ఇచ్చింది. ఇన్ని దశాబ్దాలు అయినా నాకు గ్లాసులో కాఫీ తాగే అలవాటు పోలేదు. కొంగుతో గ్లాసు పట్టుకుని మెల్లిగా కాఫీ తాగుతూ అక్కడే కూర్చుని నా జీవితం ఎట్లా మలుపు తిరిగిందో కదా అన్న ఆలోచనలో పడిపోయాను!

మా వారు చని పోయిన తరువాత నాన్న అమ్మ చాలా ఘర్షణ పడటం గుర్తు వుంది,

"ఎవరి మీదా ఆధార పడకుండా దాని కాళ్ళ మీద అదినిలబడాలంటే చదువు ముఖ్యం కనుక దాన్ని స్కూల్లో చేరిపిస్తాను" అనేవారు నాన్న గారు

"ఆడపిల్లకి చదువు ఎందుకు? ఇంట్లో నా దగ్గరే పడి వుంటుంది" అనేది అమ్మ

" మనమిద్దరము పోయిన తరువాత దీని బతుకు ఎట్లా, స్కూల్లో చేరిపిస్తాను"

"అన్నలు వున్నారు గా వాళ్ళు చూసుకుంటారులేండి" అమ్మ.

అన్నలూ, వదినలూ చూస్తారా, చూసినా ఎంత కాలం చూస్తారు? చూడలేదని మనము అనుకోకూడదు, వాళ్ళ సంసారాలు, బాధ్యతలు వాళ్ళకి వుంటాయి కనుక మనమే దీనికి ఏదో దారి చూపించాలి " అనేవారు నాన్న గారు

"జన్మనిచ్చిన వాడు చూసుకోక పోతాడా?" అనేది అమ్మ.

ఇలాటి మూర్ఖపు మాటలు వినే ఓపిక నాన్నగారికి వుండేది కాదు అప్పట్లో, అమ్మతో మట్లాడి ఆమెను ఒప్పించటం కష్టం అని అనుకునేవారో ఏమో కాని నాన్న గారు అక్కడ్నుంచి లేచి వెళ్ళి పోయేవారు.

ఈ విధంగా చాలా రోజులు గొడవ పడ్డారు ఇద్దరూ, సడన్ గా ఒక రోజు నాన్న గారు నన్ను తీసుకుని వెళ్ళి స్కూల్ లో చేర్పించారు,

అమ్మ చాలా రోజులు ఏడ్చి మొత్తుకుని " మన ఇంటా వంటా లేదు, ఇదేం పోయ్యే కాలం వచ్చింది మీకు?" అని గోల పెట్టింది, “పచ్చి గంగ కూడా ముట్టను, బావిలొ దూకి చచ్చి పోతాను" అని శపథం చేసింది కూడా,

నాన్నగారు అమ్మ డ్రామాని ఒక కంట చూస్తూనేవుండేవారు కాని ఇగ్నోర్ చేసే వారు!

అమ్మ మూర్ఖత్వం వల్ల, ఆస్తి వస్తుంది అన్న ఆశ వల్ల నాన్న గారు ఎంత చేప్పినా ఆయన మాట వినకుండా, అందరి మాటలు పెడచెవిన పేట్టి ఈ పెళ్ళి చేసింది, పర్యవసానం అందరూ చూస్తూనే వున్నారు.

నాన్నగారు మాత్రం భయ పడుతూనేవున్నారని అన్నయ్యలు చెబుతూ వుండేవారు. ఎందుకంటే నాన్న కన్నా పెద్దవారు మా వారు వయసులో! ఆయనకి ఐదుగురు పిల్లలు, అందరికన్నా చిన్న అమ్మాయి నా వయసు!

నాన్నగారు అమ్మకి ఎదురుచెప్పడం నా తొమ్మిది ఏండ్లలో ఎప్పుదు చూడలేదు, అందువల్లే ఈ పెళ్ళీ అమ్మ ఇష్ట ప్రకారమే జరిగింది, కాని నాన్నగారు మొదటి సారిగా అమ్మ మాట వినకుండ అమ్మ నాశనం చేసిన నా బ్రతుకుని సరిదిద్దారు, దీనికి నేను ఆయనికి ఎంతో ఋణ పడి వున్నాను, ఆయనని తలుచుకోని క్షణం లేదు నా జీవితంలో!

అప్పుడు ఆయన ఆ విధంగా అమ్మకి ఎదురు తిరిగటం వల్లనే నాకు ఈ రెండవ ఛాన్సు లభించింది, ఈ ఛాన్సును వుపయోగించుకోవటం వల్ల, నా జీవితం ఒక దారిలోకి వచ్చింది.

జన్మ జన్మలకి నేను నాన్నగారి ఋణం తీర్చుకోలేను, ఆయన ధర్మమా అని నేను టీచర్ ట్రైనింగ్ అయి టీచర్ వుద్యోగంలో చేరి నా కాళ్ళ మీద నేను నిలబడగలిగాను, ఆయన కోరిక ప్రకారం ఎవరిమీద ఆధారపడకుండా నా జీవితాన్ని తీర్చి దిద్దుకోగలిగాను!

ఆ కాలంలోనే నాన్నగారు తన ముందు చూపుతో ఆలోచించి నన్ను స్కూల్లో చేర్పించటం వల్ల నేను ఎవరి మీద అధార పడకుండా జీవించాను, లేకపోతే అమ్మ ఇష్ట ప్రకారం ఇంట్లో పడివుంటే అందరి ఇళ్ళల్లో వెట్టి చాకిరి చేసుకుంటూ, అందరి ఈసడింపుల మాటలతో, చూపులతో, అవమానంతో చస్తూ బతుకుతూ వుండేదాన్ని, ఇది తలుచుకుంటేనే భయంతో ఒణికి పోతాను.

నాన్నగారి దయ వల్ల నా జీవితానికి ఒక అర్ధం ఏర్పడింది, ఎందరు తండ్రులు ఈ విధంగా తమ ఆడపిల్లల గురించి ఆలోచించారు ఆ రోజుల్లో! నాకు టీచర్ వుద్యోగం వచ్చిన తరువాత మళ్ళీ పెళ్ళి చెయ్యటానికి కూడా నాన్నగారు సిద్దం అయ్యారు కాని నేను మాత్రం దానికి ఒప్పుకోలేదు.

నేను ఒంటరితనాన్ని ఎప్పుదు ఫీల్ అవలేదు, మారుతి, జయా పిల్లలతో సందడిగా గడిచిపోయేవి రోజులు!

పిల్లలు లేరు అన్న ఆలోచన కూడా ఎప్పుదు రాలేదు, స్కూల్లో పిల్లలతో, ఇంట్లో మారుతి జయా పిల్లలతో, ఎప్పుదు పిల్లలతో వుండే దాన్ని కనుక నాకు ఆ లోటు కనిపించలేదు, నాకు పిల్లలు లేరు అన్న ఆలోచనే వుండేది కాదు!

ఈ నిర్ణయమే నాకు సరి అయినది అని నాకు తోచినందువల్ల నేను తీసుకున్నాను, ఈ నిర్ణయం వల్ల నా జీవితం ఒడిదుడుకులు లేకుండా గడిచి పోయింది ఇప్పటివరకు!


కాని అందరూ అమ్మాయిలూ ఇలాగే చెయ్యవలసిన అవసరం లేదు. తమ తమ జీవితాలు సుఖంగా సంతోషంగా ఎవరి మీదా ఆధారపడకుండా వుండటానికి సరిపడేటట్టు సరి అయిన నిర్ణయాలు తీసుకోవాలి,

నేను ఎవరి మీదా ఆధార పడకూడదు నా జీవితాంతం వరకు అని, నాన్నగారు తీసుకున్న నిర్ణయం మీద, ఎనభై ఏండ్ల అనుభవము మీద చెబుతున్న మాటలు ఇవి.

ఇతరుల సుఖము, అనందం కోరకు తమ కోరికలని  త్యాగం చేసి జీవితాలని  నరక ప్రాయం చేసుకోవలసిన అవసరం లేదు, చేసుకోకూడదు కూడా! ఆ రోజులు పోయాయి! మనము ఇప్పుడు 2016 లో వున్నాము!

ఏ దేశంలో పుట్టి పెరిగిన అమ్మాయి అయినా, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సంఘం పెట్టే ఒత్తిళ్ళకి లొంగిపోకుండా, తల వంచకుండా తమ సుఖాలకి, సంతోషాలకి,  బంగారు భవిష్యత్తుకు ప్రాధాన్యత ఇస్తూ, జీవితంలో నిర్ణయాలు తీసుకోవాలని, వాళ్ళ జీవితాలని ఆనందంగా సుఖమయము చేసుకోవాలని, ముందు తరాల ఆడపిల్లలకి దారి చూపించాలని అని అనుకుంటూ, మామిడి చెట్లోనుంచి వినిపించే కోకిల గానం, వేప చెట్టు మీద నుంచి వస్తున్న చల్లని గాలి, ఆ గాలి వెంట పెట్టుకుని తెస్తున్న మల్లెపూల పరిమళం,  వొంటికి తగులుతున్న నులి వెచ్చని వేడిని అనుభవిస్తూ ,  నాకు ఈ సెకెండ్ ఛాన్స్ ఇచ్చిన నాన్నని, నాన్న చేత ఈ పని చేయించిన  ఆ  భగవంతుడిని  స్మరించుకుంటూ వుండిపోయాను, ప్రకృతి అందాలని చూస్తూ!

శ్రీ  దుర్ముఖి  నామ సంవత్సర ఉగాది  సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగం విజేత



**అదే మొదటిసారి** నేను తాతయ్యగారి ఊరిలో అడుగుపెట్టటం. అప్పుడప్పుడే అభివృద్ధి పథంలోఅడుగుపెడుతున్న పల్లె అది. పదివేల లోపే జనాభా. పచ్చదనపు తివాచీ పరిచినట్లు పండ్ల తోపులూ, పంటచేలూ. సస్యశ్యామలమైన నేల. ఆహ్లాదకరంగా వీచే పిల్లగాలులు. ఊరికి కొద్ది దూరంలో ఆగిన బస్సు దిగి నడుస్తూ గంగలూరు ప్రవేశించాను.

మా తాతయ్యకు ముగ్గురు సంతానం. అత్తయ్య పెద్దది. నాన్నకూ అత్తయ్యకూ పదేళ్ళ ఎడం.

పెద్దనానమ్మ చనిపోతే బిడ్డల సంరక్షణ కోసం తాతయ్య మళ్ళీ వివాహం చేసుకున్నాడు. చిన్న నానమ్మకు కొడుకు పుట్టాడు. బాబాయి మేదకుడు, అమాయకుడు. తాతయ్య సరస్వతీ ఉపాసకుడు. ముత్తాతల కాలం నుంచీ కుటుంబం శారదాంబను కొలుస్తూ వచ్చింది. ఊరి పొలిమేరల్లో ఆమెకు గుడి కట్టించారు కూడా. తాతయ్యకు పొలాలున్నాయి, దేనికీలోటు లేని ఇల్లు. పెద్దనానమ్మ సంపన్నుల ఇంటి ఆడపడుచు. పుట్టింటి పసుపుకుంకంగా బోలెడంత బంగారం తెచ్చుకుందిట. ఏడు వారాల నగలు, వడ్డాణం, వంకీ వంటి వస్తువులు ఎన్నో ఉండేవిట! 'ఎప్పటికైనా ఇవన్నీ నా కోడలికీ, కూతురికీ సమానంగా చెందాలి. వాళ్ళ తరవాత వాళ్ళ బిడ్డలకీ' అని అస్తమానం అంటూండేదిట.

చిన్న నానమ్మ అత్తయ్యనీ, నాన్ననీ సవతి భావంతోనే చూసేదని నాన్న అనేవాడు. అత్తయ్య అందచందాలు చూచి ఈర్ష్య పడేదిట. తాతయ్య ఇంట్లో లేనప్పుడు ఆమెను రాచిరంపాన పెట్టి, సూటిపోటి మాటలనేదని నాన్న అమ్మతో బాధపడుతూ చెప్పటం విన్నాను. ఇవన్నీ గ్రహించిన తాతయ్యపట్నంలో ఒక సంగీత విద్వాంసుల గురుకులంలో అత్తయ్యను చేర్పించి, అక్కడే ఉంచి సంగీతంచెప్పించారట. అత్తయ్య చక్కగా సంగీతం నేర్చుకున్నదనీ, అపర సరస్వతి అనీ, "నేను కొలిచే శారదమ్మ తల్లి నా ఇంట వెలిసింది" అని తాతయ్య మురిసిపోయేవాడట.

సంగీత గురుకులంలో ఉన్నప్పుడు ఏర్పడిన పరిచయంతో ఒక ఇతర కులస్థుడుని పెళ్ళి చేసుకుంది అత్తయ్య. తాతయ్యకు అది విద్యుద్ఘాతంలా తగిలింది. పెళ్ళికోసం ఇల్లు వదిలి వెళ్ళేటప్పుడు తల్లి ఏడువారాల నగలన్నీ మూటకట్టుకు పోయిందని చిన్ననానమ్మ సవతికూతురి మీద పుట్టెడు అక్కసు పెట్టుకుంది. గుడిలో కనిపించినా, ఒకటీ రెండుసార్లు ఇంటికి రాబోయినా నానా రాద్ధాంతాలు చేసి ఇంకొకసారి ఆ పరిసరాలకు రాకుండా చేసిందిట. 'నగలు దొంగిలించింది' అని చిన్ననానమ్మ అన్నప్పుడల్లా 'దొంగతనమేముంది? దాని సొమ్మేలే అది పట్టుకెళ్ళింది' అని తాతయ్య అత్తయ్యను వెనకేసుకొచ్చేవాడని నాన్న చెబుతూండేవాడు. ఆ నగలలో తనకీ భాగముందని అమ్మ అడపా దడపా నిష్ఠూరంగా నాన్నతో అనడం విన్నాను.

'బంగారం మీద మోజు కాదు కానీ మనకీ ఆడపిల్ల ఉంది. వాళ్ళ నానమ్మ పేరు మీద అది పెట్టుకునేది....' అనేది అమ్మ. అత్తయ్య ముమ్మూర్తులా నానమ్మ పోలికట. నేను అచ్చు అత్తయ్యలా ఉంటానట. ఇవన్నీ నా స్మృతి ఫలకంపై చిన్నప్పటి నుంచీ చెరిగిపోకుండా నిలిచి పోయిన కుటుంబ విషయాలు. పై చదువులకు అమెరికా వెళ్ళిన నాన్న తనతో చదువుకున్న అమ్మాయిని చేసుకున్నాడు. అలా మేము ఊరికీ, దేశానికీ దూరంగా ఉండిపోయాము. వృత్తిలో తలమునకలుగా ఉన్న నాన్నకు ఇల్లు పట్టేది కాదు. ఇలాంటి పరిస్థితిలో మేము భారతదేశం వెళ్ళి రావటం బాగా తక్కువే.

ఇలా ఉండగా పిడుగుపాటులా ఒక విమాన దుర్ఘటనలో నాన్నను పోగొట్టుకున్నాము. ఇది జరిగి ఒక దశాబ్ది దాటింది. తలచుకుంటే ఎప్పటి విషయాలో అనిపిస్తాయి. ఒకసారి భారతదేశం వచ్చాము. అప్పుడు తాతయ్య గంగలూరు నుంచి హైదరాబాద్వచ్చాడు మమ్మల్ని కలవటానికి. దురదృష్టవశాత్తు ఆయన రావటం ఆలస్యమై మేము ఎయిర్పోర్టుకి బయలుదేరి పోయాము. కలుసుకోవడం పడనేలేదు. నాన్న చెప్పిన విషయాల ప్రకారం చిన్ననానమ్మకు సవతిసంతానం పొడగిట్టదు. మేము తాతయ్య ఇంటికి దూరంగా ఉండటానికి అది ముఖ్యకారణం.

అత్తయ్య ఆనుపానులు తెలుసుకునే గట్టి ప్రయత్నం కూడా నాన్న చేసినట్టు లేదు. ఒక రకంగా నాన్న తటస్థంగా అమెరికాలో తన మానాన తానుండిపోవటం, అటు తరువాత అకాల దుర్మరణం...

ఇవన్నీ మాకు, తాతయ్యకు మధ్య మరింత దూరాన్ని పెంచాయి.

నా జీవితం కొత్త మలుపు తిరిగింది. నాకు నచ్చిన వ్యక్తితో వివాహం స్థిరపడింది. అతడు భారతీయుడే కాకుండా మా కుల సాంప్రదాయాల యువకుడు. అతడి తాతముత్తాతల ఊరు మా గంగలూరుకి కొద్దిపాటి ప్రయాణదూరంలో ఉండటం యాదృచ్ఛికం. అతడి తల్లిదండ్రులు, బంధువులు హైదరాబాద్‌లో ఉంటారు. పెళ్ళి అక్కడే చెయ్యమన్నారు కాబట్టి అతడు, నేను, మా అమ్మ ఇండియా వచ్చాము. పెళ్ళి పనుల కోసం అమ్మ హైదరాబాద్‌లో బంధువుల ఇంట ఆగిపోయింది. తాతయ్యను చూడటం కోసం నేను, తన తాతగారిని చూడటం కోసం వరుణ్, అంటే నాకు కాబోయే భర్త , సరదాగా బస్‌ప్రయాణం చేస్తూ బయలుదేరాము. అతడు తన ఊరి దగ్గర దిగిపోయాడు. నేను ముందుకు ప్రయాణం చేసి మా ఊరి పొలిమేరల్లో దిగి కాలినడకన ఊళ్ళోకి అడుగుపెట్టాను. ఊరి పొలిమేరల్లోనే మా పూర్వీకులు కట్టించిన శారదాంబ ఆలయం. బయటనుంచే నమస్కరించుకుని ముందుకు సాగాను. నా చిన్నప్పుడు తన ఊరి గురించి నాన్న చెప్పిన విషయాలన్నీ నెమరువేసుకుంటూ, ఆయన కళ్ళతో చుట్టూ పరికిస్తూ

నడుస్తున్నాను. నలభై నిముషాల పైన నడిస్తే కానీ ఊరు చేరలేదు. కట్టూ, బట్టూ తెలుగమ్మాయిలా ఉన్నా, జుట్టు పొట్టిగా ఉండటం చూసి అంతా నా వంక కొత్తగా చూస్తున్నారు. ఊళ్ళో అడుగుపెట్టాక అడిగాను.

'గోపాలక్రిష్ణయ్య గారిల్లెక్కడ?'

'ఎవరమ్మాయ్?' ఎదురు ప్రశ్న వేశాడు.

'ఆయన మనవరాలిని'.

ఆశ్చర్యంగా నా వంక తేరిపార చూచి 'ఎవరూ? పాణి కూతురివా? పాపం విమానం కూలి చచ్చిపోయాడటగా? వినగానే ముసలాయన కుప్పకూలి మంచాన పడ్డాడు. మామూలు మనిషి కావటానికి నాలుగైదేళ్ళు పట్టింది. పదమ్మా మీ ఇల్లు చూపిస్తాను'. ఒక పెద్ద వసారాతో విశాలంగా ఉన్న ఇంటి ముందరికి వచ్చాము. 'యావండోయ్‌గోపాల క్రిష్ణయ్య గారూ! అమిరికా నుంచి మనవరాలచ్చింది, పాణి కూతురు!' గట్టిగా అరిచి చెప్పాడతను.

'ఎవరూ?' అంటూ ఒక ముసలి ముత్తైదువ బయటికి వచ్చింది.

'మీ మనవరాలమ్మా, పాణి కూతురు!' చెప్పి వెళ్ళిపోయాడతను. నన్ను నిశితంగా చూచిందావిడ. కఠినంగా ఉన్న ఆమె ముఖకవళికలలో కొంత మృదుత్వం చోటు చేసుకుంది. 'రా అమ్మాయ్. నువ్వు పుట్టిన తరవాత ఇదే చూడడం, రా'. వెనుదిరిగిన ఆమె వెంట లోపలికి నడిచాను. గుమ్మందగ్గర ఆగి, చెప్పులు పక్కగా విడిచి రాతి తొట్లో ఉన్న నీటితో కాళ్ళూ, చేతులు, ముఖం దుక్కున్నాను. ఆ పరిసరాలు, చెట్లు, గాలి... ఏ జన్మ అనుబంధమో నన్ను ఇక్కడికి లాక్కొచ్చింది అనుకుంటూ తాతయ్య ఇంట అడుగుపెట్టాను.

''సరస్వతీ మహాభద్రా మహామాయా వరప్రదా
శ్రీప్రదా పద్మనిలయా పద్మాక్షీ పద్మ వక్త్రకా''

తాతయ్య కంఠం లోపలి గది నుంచి వినిపిస్తోంది. వింటూ ఆగిపోయాను. 'లోపలికి రావే అమ్మాయ్! పేరేమిటన్నావ్? అడిగిందావిడ ఆదరంగా. 'వాళ్ళ మేనత్త పేరే' గది నుంచి వస్తూ అంటున్నాడు మా తాతయ్య. నవారు మంచం వాల్చుకుని కూర్చున్నాడు . పక్కనే ఉన్న ఉయ్యాల బల్ల మీద కూర్చున్నాను. 'ఎప్పుడొచ్చావమ్మా?' గద్గద కంఠంతో అడిగాడాయన.

అప్పుడు గమనించాను ఆయన కళ్ళు ధారాపాతంగా వర్షించటం. 'చెట్టంత కొడుకు పోయిన తరవాత చాలా ఏళ్ళకు మనవరాలిని చూచి బాధపడే నాలాంటి దురదృష్టవంతుడు ఎక్కడా ఉండడు'. కళ్ళు తుడుచుకునే ప్రయత్నం కూడా చెయ్యటం లేదాయన.

ఓదార్పు దాటిపోయిన వేదన అది. ఏది మాట్లాడినా బోలు మాటగానే ఉంటుందేమో. మౌనంగా కన్నీరు కారుస్తూ నెమ్మదిగా ఉయ్యాలను కాళ్ళతో ముందుకూ వెనకకూ కదుపుతూ ఉండిపోయాను. చాలా తక్కువగా ఏడ్చే నేను, ఆ ఇంటి పరిసరాలలో, ఆ ముసలివాళ్ళను చూచీచూడగానే కళ్ళ నీళ్ళు పెట్టుకోవటం నాకే ఆశ్చర్యమనిపించింది.

'మీ అమ్మ ఎట్లా వుంది? ' కాసేపటికి కోలుకుని అడిగాడు తాతయ్య.

'ఆ, బాగానే వుంది. పదిరోజులలో నా పెళ్ళి తాతయ్యా, మీరు రావాలి. మిమ్మల్ని చూడాలనీ, పిలవాలనీ వచ్చాను''.

ఆయన ముఖంలో ప్రసన్నత, సన్నటి వెలుగు. 'అలాగా, శుభం'.

'హైద్రాబాద్‌లో పెళ్ళి తాతయ్యా, ఆ అబ్బాయిది ఇక్కడికి దగ్గరలో ఉన్న రావులూరు'.

'రావులూరా? ఎవరి పిల్లాడో?'

'రామ్మూర్తి గారని, ఇదివరలో పంచాయతీ ప్రెసిడెంటుట'.

'నాకు తెలిసిన పెద్ద మనిషి ప్రఖ్యా రామ్మూర్తి. అబ్బో ఆయన అక్కడ పెద్ద కామందు.'

'ఔనౌను. ప్రఖ్య ఇంటిపేరు వాళ్ళే. ఆయన మనవడు వరుణ్.'

'అలాగా' ఒక్క ఉదుటన లేచి కూర్చున్నాడు తాతయ్య. 'వాళ్ళు మనవాళ్ళే. చిననానమ్మకు దూరపు బంధువులు కూడాను' వాళ్ళిద్దరి ముఖాలలో ఉత్సాహం, సంతోషం.

'పోనీలే, నువ్వైనా కులకట్టు చెడకుండా మనవాళ్ళల్లో కుదుర్చుకున్నావు. మీ మేనత్తలాగా కాకుండా'. వత్తి పలుకుతూ అన్నది చిన్ననానమ్మ. బాధగా చూశాడు తాతయ్య.

'నాలుగు రోజులుండమ్మా. నా పాణిని నీలో చూసుకుంటాను'. అర్థిస్తున్నట్లు నా చేతులు పట్టుకున్నాడు తాతయ్య.

'ఉంటాను తాతయ్య. మీ అందరినీ చూడాలనే కదా వచ్చింది''.

కండువాతో ఆయన కన్నీళ్ళు అద్దుతూ అన్నాను. రేపు వెళ్ళాలి అని చెప్పడానికి నోరు రాలేదు.

'నాకు తెలుసు, నేను నమ్ముకొన్న శారదమ్మ నన్ను కనిపెట్టుకుని ఉందని'.

ఒక నడివయసు మనిషి కూరలసంచీ తీసుకువచ్చాడు. నా వంక ఆశ్చర్యంగా చూస్తోంటే 'అన్నయ్య కూతురురా' అంటూ అతడికి చెప్పి, 'బాబాయమ్మా' అని నాతో అన్నాడు. అతడు యాంత్రికంగా లోపలికి వెళ్ళిపోయాడు.

నెమ్మదిగా లేచి ఇల్లంతా కలయదిరిగాను. నాన్న పుట్టిపెరిగిన ఇల్లు, మూడు విశాలమైన గదులు,ఒక సామాన్ల కొట్టిది. వెనక పెరట్లో గొడ్ల చావిడి, తడికలతో కట్టిన స్నానాల గది, లావెట్రీ. ఉన్నంతలో ఇల్లూ వాకిలీ పరిశుభ్రంగా ఉన్నాయి. వంటింట్లో గ్యాసు పొయ్యి, గ్రైండర్‌ఉన్నాయి.లోపలి గదిలో బ్లాక్‌అండ్‌వైట్ టీవీ ఉన్నది. సామాన్ల కొట్టిడిలో ఒక పెద్ద చెక్క భోషాణం పెట్టె, దాని పక్కన పురాతనపు ఇనప్పెట్టె. ఇంటి మొత్తానికి మూడు చెక్క కుర్చీలు, ఒక పెద్ద మేజా బల్ల ఉన్నాయి. గోడలకు దేవుళ్ళ పటాలు, తెలుగు కేలండర్ తగిలించి ఉన్నాయి. దానికి సూదీ దారం, గుచ్చి ఉన్నాయి. నేను అంత మాటకారిని కాదు కాబట్టి ఇల్లు, వాకిలీ చూస్తూ అటూ ఇటూ తిరిగాను. కాసేపు లోపల, కాసేపు పెరట్లో. సాయంత్రం నాలుగైంది. గ్లాసునిండా వేడిగా గేదెపాలు చక్కెర కలిపి తెచ్చిచ్చింది నానమ్మ. ఎంతో రుచిగా ఉన్నాయవి. వెళ్ళి వంటింట్లో పీట వాల్చుకుని కూర్చున్నాను.

బాణలిలో నూనె కాగుతోంది. తాతయ్య కుర్చీ వేసుకుని కూర్చుని గ్రైండర్‌లో గారెలపిండి రుబ్బుతోంటే, నానమ్మ చకచకా ఏ వాయకు ఆ వాయి గారెలు వేసి తీస్తోంది. మామిడల్లం పచ్చడి వేసి పళ్ళెంలో నాలుగు గారెలు తీసుకొచ్చి నా చేతికిచ్చింది. ఎనభై ఏళ్ళ ముసలివాళ్ళు చేసిపెడుతోంటే కూచుని తినటం ఈ సందర్భంలో నాకు ఎబ్బెట్టు అనిపించలేదు. ఇష్టంగా మరి నాలుగు వేయించుకుని తిన్నాను.

మన దేశంలో పిల్లలకు అన్నింటినీ మించిన భాగ్యం తాతగారింటి గారాబం అన్న వాస్తవం ఆ క్షణం నాకు అర్థమైంది.

నిజానికి ఏనాడు మేము వచ్చి ఉండి ముసలివాళ్ళ కష్టసుఖాలు, మంచిచెడ్డలు విచారించక పోయినా ఈనాడు నాకు ఏ లోటూ లేకుండా వాళ్ళకు చేతనైన పరిచర్యలు చేస్తూండటం చూస్తుంటే మన సంస్కృతి బోధించే క్షమ, త్యాగం, వాత్సల్యం అనే పెద్ద పెద్ద పదాలకు సరళమైన నిర్వచనంగా అర్థమైనాయి. నా కళ్ళు పదేపదే చెమ్మగిల్లటం అత్యంత సహజంగా జరిగి పోయింది.

'ఔనే అమ్మాయ్, పెళ్ళంటున్నావ్! ఈ పొట్టి జుట్టుతోనే పెళ్ళి చేసుకుంటావా?' దగ్గరగా కూచుంటూ అడిగింది నానమ్మ!

గట్టిగా నవ్వాను. 'నానమ్మా! నేనింకా నయం. పెళ్ళికొడుకుకు అసలు జుట్టే లేదు'. కెమెరా తీసుకువచ్చి అందులో ఉన్న వరుణ్‌ఫోటో చూపించాను. 'తిరుపతి మొక్కు కాబోలు' అన్నదావిడ. 'కాదు నానమ్మా, అతడికి జుట్టు లేదు'. తాతయ్య క్షణంపాటు ఆలోచించాడు.

'అతిగా చదివితే జుట్టూడిపోతుంది, బాగా చదువుకున్నాడేమో!'

'ఔను తాతయ్యా, సైంటిస్టు. అంటే శాస్త్రజ్ఞుడు'. లేచి ముఖం కడుక్కున్నాను. 'కాసేపు బయట తిరిగి వస్తాను తాతయ్యా, ఎప్పుడూ చూడలేదు కదా'. అంటూ కెమెరా భుజాన తగిలించుకుని చెప్పులు వేసుకున్నాను.

'జాగ్రత్తమ్మా, తొందరగా తిరిగి వచ్చెయ్యి. ఇల్లు జ్ఞాపకం పెట్టుకో. శారదాంబ కోవెలకు వెళ్ళిరా'

జాగ్రత్త చెబుతూ గుమ్మం దగ్గరకి వచ్చాడు తాతయ్య. నానమ్మ లోపలి నుంచి పిల్చింది. 'ఆగవే అమ్మాయి, అమ్మవారికి కొబ్బరికాయ, బెల్లపు అచ్చులు తీసుకువెళుదువుగాని, పెళ్ళి కావలసిన పిల్లవి. మనింటి సాంప్రదాయం, నువ్వైనా పాటిస్తున్నావు' అంటూ నా చేతికి సంచీ తెచ్చిచ్చింది.

బాబాయి నాతో బయలుదేరి, బయటికి వచ్చినవాడూ, దగ్గరలో పిల్లలు ఆడుకుంటూంటే చూస్తూ అక్కడే ఆగిపోయాడు.మా నాన్న పుట్టిపెరిగిన ఊరు, ఆయన చిన్నతనమంతా తిరిగిన వీధులు.

ఆత్మలనేవి నిజంగా ఉంటే, తన కూతురు ఎన్నో ఏళ్ళకు తన ముసలి తల్లిదండ్రుల్ని చూడటానికి మారుమూల పల్లెటూరికి వెళ్ళిందంటే ఆయన ఆత్మ ఎంతో శాంతిని పొందుతుంది. ఇవన్నీ ఏనాటి బంధాలు! సప్త సముద్రాల దూరంలో ఉన్న మనుషుల్ని లాక్కువచ్చి కలిపేది ఏది?

స్వబంధు దర్శనంతో ఎందుకు ఈ రకమైన తృప్తి, ఆనందం కలుగుతాయి? అందరూ కావాలనుకోవటం, వారిని చూడాలని తహతహలాడడం వెనక ఉన్న మమకారాలు ఎలా అంకురిస్తాయి? ఉవ్వెత్తున ఎగిసిపడే అలల్లాంటి ఆలోచనలలో కొట్టుకుపోతూ నడుస్తున్నాను. సాయంత్రపు నీడలు పూర్తిగా పరుచుకున్నాయి. అప్పుడే ఆరు దాటింది. శారదాంబ కోవెలకు చేరుకున్నాను. ఆవరణ ఫోటోలు, వీడియో తీసుకుంటూ లోపలికి ప్రవేశించాను. మా పూర్వీకులు తరాల క్రితం కట్టించినది. ఒక పక్కగా చిన్న పూలతోట, తులసి మొక్కలు ఉన్నాయి. ఆ వనంలో బాలకృష్ణుడు గోవర్ధనగిరి ఎత్తే విగ్రహం ఉన్నది. రంగులు మాసిపోయినా కళ తరగలేదు. ఒక పక్కగా బావి. కాళ్ళు కడుక్కొని లోపలికి వెళ్ళాను.

పూజారిగారు తాతయ్య వయసు వయోవృద్ధుడు. నేనెవరో అడిగి తెలుసుకుని ఎంతో సంతోషించాడు. 'పాణి కూతురివా? మా అమ్మే, మా తల్లే! ఎక్కడి అమిరికా, ఎక్కడి గంగలూరు! ముసలి ప్రాణాలను చూడటానికి శ్రద్ధ పెట్టుకుని వచ్చావు సంతోషం తల్లీ.'

శారదాంబకు నా నామగోత్రాలతో అర్చన చేశారు.

'రేపు పానకం కలుపుతానమ్మా, వచ్చి తీసుకుపో. వెళ్ళి ప్రదక్షిణలు చేసుకో. మీ ముత్తాతల కాలం నుంచీ ఏ శుభకార్యం జరిగినా ఇక్కడికి వచ్చి ప్రదక్షిణలు చేసి పానకం చేయించేవారుట. మీ అత్తయ్యకు, నాన్నకు ఆ అదృష్టం దక్కలేదు. నువ్వైనా పెళ్ళికి ముందు వచ్చావు. శుభమస్తు''

అన్నారాయన బయటకి వచ్చి గుడి మెట్ల కూర్చుంటూ. ఆయన మాట్లాడుతూంటే వీడియో తీశాను. 'బాబుగారూ! మా అత్తయ్య ఎక్కడుంది? ఎప్పుడూ గుడికి రాలేదా?'

'పెళ్ళికి ముందు రావటమేనమ్మా, పెళ్ళి జరిగిన తరవాత ఒకసారి భార్యా, భర్తా వచ్చారు. అదే వేళకు మీ చిన్ననానమ్మ వచ్చి నగలు దొంగిలించావని తిడుతూ నానారభసా చేసి వెళ్ళింది. ఆ తరువాత ఎప్పుడూ మీ అత్తయ్యను చూడలేదు'.

'ఇప్పుడు ఎక్కడుందో, ఎలా ఉందో' నాలో నేను అనుకుంటున్నట్లు అన్నాను.'ఏమోనమ్మా, అత్తవారు కర్కోటకులు, ఈమె దగ్గర సొమ్మంతా లాక్కుని నానా రొష్టుపెట్టారనీ,పురిట్లోనే తల్లీ, బిడ్డా పోయారని చెప్పుకుంటారు. ఆ పాపిష్టి నగలు ప్రాణాల మీదికి వచ్చినై కాబోలు. నిజానిజాలు పరమాత్ముడి కెరుక. ఆమె మాత్రం మళ్ళీ కంటికి కనబడలేదు' నిట్టూరుస్తూ అన్నాడు.

మనసు వికలమైంది. నాలో ఉన్న ఉత్సాహం, సంతోషం గాలికెగిరి పోయాయి. 'ఇంతకీ గోపాలక్రిష్ణయ్య దురదృష్టవంతుడు. సంతానం వల్ల సుఖం ఆయన నుదుట రాసిపెట్టినట్లు లేదు. మీ నాన్న అట్లా పోయినాడు. మీ అత్తయ్య ఇట్లా పోయింది. ఇంకొక బిడ్డ ఉన్నాడంటే వాడు మేదకుదు! పోనీలే ఈ చివరి మలుపులో ఆ ముసలి ప్రాణాలకు నువ్వు రావటం కొంత ఊరట . ఇప్పటి సంగతులా? నిన్ను చూస్తూంటే ఆ అమ్మాయిని చూసినట్లే ఉందమ్మా. నువ్వు ముమ్మూర్తులా మీ మేనత్త పోలికే. ఆవిడ తన తల్లి పోలిక.'

ఇదేమాట మా నాన్న అనేవాడు.

'ప్రదక్షిణలు కానిచ్చి బయలుదేరమ్మా. మళ్ళీ చీకటి పడితే ఇబ్బంది. రేపు పానకం తీసుకు వెళుదువుగాని రా'.ఆయన చెప్పినట్లు చేసి బయటికి వస్తుంటే ధ్వజ స్తంభం దగ్గర ఒక పల్లెపడుచు కనిపించింది. కెమెరా అటు తిప్పాను. పెద్ద జడ ముందుకు వేసుకుంది. చీర కొద్దిగా పొట్టిగా కట్టుకుంది. పాదాలకు పట్టా గొలుసులు, చెవులకు జూకాలు, పెద్ద బట్టు. వీడియో తీస్తూంటే, కొత్త మనిషిని కాబట్టి ఆగి పలకరించింది.

'ఏ ఊరు నీది?'

'ఇక్కడి వాళ్ళమే. గోపాలక్రిష్ణయ్య గారి మనవరాల్ని'.

'ఓహో. అమిరికా పాణి కూతురివా? పాపం మీ నాన్న విమానం కూలి చచ్చిపోయాడటగా?' సానుభూతిగా అన్నది.

'ఔను'.

'మేం ఇక్కడే ఉంటాము. పరంధామయ్యగారి కోడల్ని. మీ వాళ్ళందరికీ మా మామయ్య తెలుసు'.

'అలాగా'. తాతయ్య ఊళ్ళో ఇదే మొదటి పరిచయం.

'మా ఇల్లు దగ్గరలోనే రా కాసేపు కూచుని పోదువుగాని'.

'రేపు వస్తాను. తాతయ్య వాళ్ళు ఎదురుచూస్తూంటారు'.

'రావాలి. మర్చిపోకు'.

'తప్పకుండా'.

నేను ఇంటికి చేరేటప్పటికి బాగా చీకటి పడింది. తులసి కోట దగ్గర దీపం వెలుగుతోంది. బయటవసారాలో నానమ్మ, తాతయ్య నా కోసం ఎదురు చూస్తున్నారు. కాళ్ళు కడుక్కొని లోపలికి వెళ్ళాను. 'స్నానం చెయ్యమ్మా' అన్నాడు తాతయ్య. గాడిపొయ్యిలోంచి వేడినీళ్ళు బక్కెట్లో తోడిపెట్టాడు బాబాయి. స్నానం చేశాక చాలా హాయిగా అనిపించింది. సాయంత్రం గారెలు తిన్నా బాగా ఆకలిగా ఉండటంతో భోజనానికి కూర్చున్నాను. వంటింట్లో మూడు పీటలు వాల్చి మా ముగ్గురికీ వడ్డించింది నానమ్మ. బాబాయి భోంచేశాడట.

'సగ్గుబియ్యం పరమాన్నం ఇష్టమేనా?' అనడిగింది నానమ్మ. 'ముందుగా అది తిను'.

దంపుడు బియ్యం అన్నం, దోసకాయ పచ్చడి, తోటకూర పప్పు, వంకాయ కాల్చి చేసే బజ్జీ, చారు ఆవురావురుమని తిన్నాను. నా ఆకలి నాకే ఆశ్చర్యమనిపించింది.

'పల్లెటూళ్ళో గాలి, నీళ్ళు వేరు' అన్నాడు తాతయ్య నవ్వుతూ.

నానమ్మ వద్దంటున్నా కంచాలు, గిన్నెలు తోమి, వంటిల్లు కడిగాను. ఆ వయోవృద్ధురాలి ముఖంలో తృప్తి కనబడి సంతోషం కలిగింది. 'కోడలు పద్ధతిగానే పెంచింది. బస్తీ పోకడలు, విదేశాల భేషజాలు లేవు' అని ఇద్దరూ లోగొంతుకతో చెప్పుకుంటూంటే విన్నాను. నాన్న వినుంటే ఎంతో సంతోషించే వాడనిపించింది. అమెరికాలో ఎవరి పనులు వాళ్ళు చేసుకుపోవటం పరిపాటి కాబట్టి ఇక్కడి పనులేవీ కష్టమనిపించలేదు. వెళ్ళి ఉయ్యాల బల్ల మీద కూర్చున్నాను.

'సంగీతం నేర్పించారుటే?' నడుం వాలుస్తూ అడిగింది నానమ్మ.

'ఆ... నేర్చుకున్నాను నానమ్మా'.

'అయితే అమెరికాలో కూడా సంగీతం టీచర్లుంటారన్నమాట!'

'చాలామంది భారతీయులు ఉంటారు నానమ్మా'.

'ఏదమ్మా, అమ్మవారి మీద ఒక కృతి పాడు' అన్నాడు తాతయ్య.

'పంచాశత్పీఠ రూపిణీ' అనే కృతి పాడాను. ఇద్దరూ తన్మయులై విన్నారు. ఇంకొకటి పాడమని మరీమరీ అడిగారు. ఆనందభైరవి రాగంలో 'అంబా నను బ్రోవవే' అనే కృతి పాడాను.

అందులో భావానికి పదేపదే నమస్కరిస్తూ విన్నాడు తాతయ్య.

పాడమని బలవంతం చేసి పాడుతూంటే వాళ్ళ పాటికి వాళ్ళు కబుర్లు చెప్పుకుంటూ పాటను నిర్లక్ష్యం చేసే సందర్భాలు నాకు ఇదివరలో చాలా తారసపడ్డాయి. ఈ మారుమూల పల్లెటూరిలో, పాతకాలపు ఇంట్లో, ఇద్దరు వయోవృద్ధుల సమక్షంలో నేను నేర్చుకున్న విద్యకు సార్ధకత చేకూరిందనిపించింది.ఒక పక్కగా, వాళ్ళ మంచాలకు దగ్గరగా నాకు చాపవేసి మెత్తటి బొంతలు పరిచి పక్క వేశాడు బాబాయి. ఒళ్ళు తెలియకుండా నిద్రపోయాను.

తెల్లవారుఝామున మెళకువ వచ్చింది. అప్పటికే ఇంట్లో కదలిక మొదలైంది. బాబాయి పాలేరుతో పాటు గొడ్ల కొట్టంలో ఉన్నాడు. నానమ్మ లోపల కసువు చిమ్మి స్నానానికి వెళ్ళింది. తాతయ్య వాకిట్లో ఉన్నాడు. బ్రష్ చేసుకుని స్నానం ముగించుకున్నాను. బట్టలు ఉతికి ఆరేశాను. వంటింట్లో సహాయం చేద్దామని వెళ్ళాను. నానమ్మ ఇచ్చిన వేడిపాలు తాగి కూరలు తరిగిపెట్టాను. ఆవిడ మడిగా వంట చేస్తోంది. ఇత్తడి గిన్నెలో కూర తిరగమోత వేసింది. రాచిప్ప గిన్నెలో పులుసు కాగుతోంది. తాతయ్య స్నానం చేసి వచ్చేసరికి పూజగది శుభ్రం చేసింది నానమ్మ. ఆయన దేవతార్చన చేసే వేళకు బాబాయి స్నానం ముగించుకుని వెళ్ళి దగ్గరలో కూర్చున్నాడు.

తాతయ్య ఉచ్ఛైస్స్వరంతో సరస్వతీ స్తోత్రం చెబుతున్నాడు.

''శివానుజా పుస్తక భృత్‌జ్ఞానముద్రా రమా పరా

కామరూపా మహావిద్యా మహాపాతక నాశినీ''

నాన్న నోట అది నేను చిన్నప్పటి నుంచీ వింటున్నదే! బాబాయి లోగొంతుతో స్తోత్రాన్ని నెమ్మదిగా చెప్పుకుంటున్నాడు. వండిన పదార్థాలన్నీ వెండికంచంలో వడ్డించి పెడితే తాతయ్య నివేదన చేశాడు. పదకొండు గంటల ప్రాంతంలో భోజనాలకు కూర్చున్నాం. గోంగూర పులుసు కూర, ముద్దపప్పు, చిలగడదుంపలు వేసిన పులుసు, చిక్కుడు కాయ కూర, వడియాలు, చల్ల మిరపకాయలు వేసి వడ్డించింది నానమ్మ. అమృతతుల్యంగా అనిపించింది ఆ భోజనం.ఎందుకో ఆ పూట ముసురుపట్టింది. అడపాదడపా జల్లులు పడుతున్నాయి. నాన్న అమ్మల ఫోటోలు, నా చిన్నతనపు ఫోటోలు చూపించాను. పిట్స్ బర్గ్  వేంకటేశ్వరాలయం ఫోటో చూపిస్తే అవాక్కయి పోయారు. 'ఇక్కడి గుడి మల్లేనే కట్టాడే అమిరికా వాడు, వాడి దుంపతెగ!' అన్నది  నానమ్మ దవడలు నొక్కుకుంటూ. 'మనవాళ్ళే కట్టారు నానమ్మా, అమెరికా వాళ్ళు కాదు' అన్నానునవ్వుతూ. అలా కబుర్లతో కాలక్షేపం చేస్తూండగా సాయంత్రమైంది. ఉన్నట్లుండి గుర్తొచ్చింది.

'తాతయ్యా, పూజారిగారు పానకం తీసుకోవటానికి రమ్మన్నారు' అన్నాను లేస్తూ. కెమెరా భుజాన వేసుకున్నాను.

'ఆకాశం ముసురు పట్టి ఉన్నదే. గొడుగు తీసుకువెళ్ళు కెమెరా తడుస్తుంది'  అన్నది నానమ్మ. కాదనకుండా గొడుగు చేతిలో పట్టుకుని బయలుదేరాను. దోవపొడుగునా బురదగుంటలు. అదృష్టవశాత్తు ఇక వర్షం పడలేదు. అప్పటికే దీపాలు పెట్టారు. జాగ్రత్తగా

నడుస్తూ గుడికి చేరాను.

అర్చన, ప్రదక్షిణ పూర్తి చేసుకుని నాన్న పేరు మీద ఆలయ కైంకర్యానికి కొంత  సొమ్ము, పూజారిగారికి దక్షిణ సమర్పించాను. ఆయన ఆనందంతో కళ్ళనీళ్ళ పర్యంతమైనాడు. అమ్మవారికి నివేదన చేసిన పానకం, ఒక సీసాలో పోసి ఇచ్చాడు.

'ఏడాదికొక్కసారైనా వస్తూ ఉండమ్మా, పసుపు కుంకాల్తో, పిల్లాపాపలతో వెయ్యేళ్ళు వర్ధిల్లు'' అంటూ మనసారా దీవించారు. సెలవు తీసుకుని గుడిమెట్లు దిగాను.

లోపలికి వస్తూ ధ్వజస్తంభం దగ్గర నిన్న కనిపించిన యువతి ఎదురొచ్చింది.'నేను దర్శనం చేసుకున్నాను. వెళ్ళిరా' అన్నాను చెప్పులు వేసుకుంటూ. ఆమె లోపలికి వెళ్ళింది. తిరిగి వచ్చినప్పుడు ఆమెచేతిలో కూడా పానకం సీసా ఉన్నది. పూజారిగారు ఇచ్చినట్లున్నారు.

'ఇంకొకసారి వస్తానులే. చీకటి పడింది' అన్నాను నసుగుతూ.

'భలేదానివే. ఇంతదాకా వచ్చావు కదా! క్షణం సేపు కూచుని పోదువుగాని' అంటూ చనువుగా చెయ్యిపట్టుకుని ముందుకు నడిపించింది. ఆమె ఇంటికి చేరేవరకూ నా తల్లిదండ్రుల వివరాలు,నా వివరాలూ, నాకు కాబోయే భర్త గురించి, అమ్మానాన్నల గురించి, బాబాయి గురించి ఉత్సాహంగా అడిగింది. ఆమె చాలా మాటకారి అనుకున్నాను. పల్లీయులలో సహజంగా ఉండే నిష్కల్మషత్వం ఆమె స్వభావంలో గోచరించింది.చిన్న పెంకుటింట్లోకి దారితీశాము. ఆమె భర్త ఇంట్లో లేడు. పనిమీద పట్నానికి వెళ్ళాడు. ఉయ్యాలలో ఏణ్ణార్థం పసివాడు నిద్రపోతున్నాడు. నల్లటి చాదుబట్టు, దిష్టి చుక్క, మెడకి, కాళ్ళకి చేతులకు నల్లపూసలు ముద్దుగా ఉన్నాడు. అత్తగారు వంటింట్లో పని చేసుకుంటున్న చప్పుడు. గలగలా కబుర్లు చెబుతూ చాపవేసి కూర్చోబెట్టింది.

'మా అబ్బాయి ఫోటో సినిమా తియ్యవూ'' ఆమెను ఉయ్యాల దగ్గర నిల్చోబెట్టి తల్లీబిడ్డలవి కూడా వీడియో తీశాను. తీసినవి వెంటనే చూపిస్తే ఎంతగానో మురిసిపోయింది.

'సంగీతం నేర్చుకున్నానన్నావు. ఏదీ ఒక కీర్తన పాడు' అనడిగింది. సరస్వతీ దేవిని స్తుతించే కీర్తన పాడాను. ఎంతో ఏకాగ్రతతో తలపంకిస్తూ విన్నది.

'నీకు సంగీతం వచ్చా? ' అనడిగాను.

'మా అమ్మ చాలా బాగా పాడేది' ఆమె కళ్ళల్లో బాధ తొణికిసలాడింది.

'అంటే...'

''మా అమ్మ చచ్చిపోయింది. నీకొకటి చూపిస్తాను, ఉండు.'' అంటూ లేచి వెళ్ళి ఒక శృతిపెట్టె తెచ్చింది. అది ఎంతో పాతదని తెలుస్తోంది. కానీ శుభ్రంగా ఉంది. దాని స్వరం కూడా ఇప్పటికీ శ్రవణపేయంగా ఉండటం ఆశ్చర్యం కలిగించింది.

'ఇలాంటిది ఇప్పుడు దొరకదు, ఎంత డబ్బు పెట్టినా' అన్నాను.

'ఇదుగో, నేనొకటి చెప్తాను. కాదనకు. ఈ శృతి పెట్టె నువ్వు అమిరికా తీసుకుపో. ఈ ఊరు, మనుషులు, నేను... నువ్వు పాడినప్పుడల్లా మా జ్ఞాపకాలు నీతో ఉంటాయి'.

''అబ్బెబ్బే.. నీపెట్టె నాకెందుకు. వద్దు''.

'అట్లా అనకమ్మాయ్. నా దగ్గర ఉన్నదన్న మాటే కానీ వాడకం లేదు. నీలాంటి మంచి గాయకురాలికిస్తే మా అమ్మ ఆత్మ సంతోష పడుతుంది. రేపు పాడైపోయినా ఈ పల్లెటూళ్ళో బాగు చేసే నాథుడు లేడు. కాదనకు. తీసుకుపో అమ్మాయ్' ప్రాధేయపడుతున్నట్లు అడిగింది.

వంటింట్లో నుంచి ఏదో సణుగుడు వినిపిస్తోంది. ఇబ్బందిగా అటు చూచింది ఆమె. లేచి వీడ్కోలు చెప్పాను.

'రేపు మా ఇంటికి రా. పిల్లవాణ్ణి ఎత్తుకుని వస్తే మా తాతయ్య, నానమ్మ సంతోషిస్తారు' పదేపదే చెబుతూ శృతిపెట్టె తీసుకుని బయలుదేరాను.

ఇంటికి చేరేవరకూ ఆయాచితంగా లభించిన ఆ విచిత్రమైన కానుక గురించి ఆలోచిస్తూ నడిచాను. ఏమిటిది? ఆ అమ్మాయి ఎవరు? నేనెవరు? ఇరవై నాలుగు గంటల పరిచయంలో అపురూపమైన తన తల్లి జ్ఞాపక చిహ్నం నాకు ఇవ్వటమేమిటి?

తాతయ్య వీధి మొదట్లో ఎదురుచూస్తున్నాడు. ఆశ్చర్యంగా నా చేతిలో వస్తువు వంక చూచి 'అదేమిటి?' అనడిగాడు.

'చెప్తాను, ఇంట్లోకి రానీ' అన్నాను నవ్వుతూ.

లోపలికి అడుగు పెట్టగానేనానమ్మ నా దగ్గరికీ చేరింది', 'ఏమిటేమిటి? అంటూ.

తాతయ్య చేతులు శృతిపెట్టెను స్పృశిస్తున్నాయి. ఆయన ముఖంలో అద్భుతాశ్చర్యాలు. ''ఇది... ఇది మీ అత్తయ్య శృతిపెట్టె. నేనే స్వయంగా తెప్పించి పెట్టాను మద్రాసు నుంచి'. అవక్కాయిపోయాను. అంటే ఆ అమ్మాయి తల్లి ఎవరు? అత్తయ్య స్నేహితురాలా?

పరిచయస్థురాలా? అంటే అత్తయ్య గురించి ఆ అమ్మాయికి తెలిసే అవకాశం ఉంది. అత్తయ్య ఎక్కడుందో, ఎలా ఉందో, ఉందో.... లేదో! నేను, తాతయ్య అయోమయంలో ఉండగానే నానమ్మ కంఠం తీవ్రంగా వినిపించింది.

'ఇన్నేళ్ళకి మళ్ళీ ఆ పాపిష్టిదాని వస్తువు ఈ ఇంట్లోకి వచ్చిందే! అది చచ్చినా దాని జ్ఞాపకాలు ఈ ఇంటిని కార్చిర్చులాగా దహిస్తూనే ఉన్నాయి! దాని ఊసెత్తద్దన్నానా? ఆ దిక్కుమాలిన శృతిపెట్టెనుచూచి అంత మురుస్తున్నారేమిటి? నిప్పులాంటి వంశాన్ని ఛీకొట్టి కాలదన్ని పోయిన ఆ కులం తప్పిన దాని వస్తువు నా ఇంట్లో ఉండటానికి వీల్లేదు. నేనూ, నా కొడుకూ కావాలంటే ఆ ముదనష్టపు దాని ఆలోచన కూడా ఈ ఇంట్లోకి జరబడకూడదు'. దిగ్భ్రాంతిలో మునిగిన మా ఇద్దరి కళ్ళెదుట ఆ శృతిపెట్టెను పశుబలంతో గిరాటు వేసింది నానమ్మ.

'అయ్యో, అయ్యో... ఎందుకే ఆ నష్టజాతకురాలి మీద నీకంత కచ్చ? ఏళ్ళు గతించాయి. ఉందో, పోయిందో తెలీదు. ఏనాడూ వచ్చి గుప్పెడు అన్నం తినెరగదు. చిటికెడు పసుపూకుంకం ఎరగదు...'

"ఏమీ ఫరవాలేదు... తల్లి బంగారమంతా దోచుకుపోయింది. ఇదుగో ఈ పిల్లకు చెందవలసిన సొమ్ములు కూడా అదే మూట కట్టుకుపోయింది. ఏం బాపుకుంది? చచ్చిందంటే చావదూ మరి!" విచక్షణ నశించి ఆవేశంతో ఊగిపోతోంది నానమ్మ.

'నారాయణ, నారాయణ' చెవులు మూసుకున్నాడు తాతయ్య. ఒక్కక్షణం ఎందుకు వచ్చానా అనిపించింది. వాళ్ళ పాటికి వాళ్ళు ప్రశాంతంగా బతుకుతున్నారు. ఎన్నడూ చూడని నన్ను కూడా ఆత్మీయంగా ఆదరించారు. ఇంకొక్క రోజులో నా పాటికి నేను వెళ్ళిపోయేదాన్ని. ప్రశాంతంగా ఉన్న సరస్సులోకి రాళ్ళు విసిరి అల్లకల్లోలం చేసినట్లయింది... గుడికి వెళ్ళినదాన్ని ఇంటికి రాకుండా ఎవరో పిలిస్తే వెళ్ళటమెందుకు, వాళ్ళు ఇచ్చినది తీసుకురావటమెందుకు? ముక్కలుగాపడి ఉన్న ఆ పాత శృతి పెట్టె వంక అపరాధ భావంతో చూశాను. ఎవరి తల్లిదో అపురూప జ్ఞాపకం... ఇలా ఈ ఇంట్లో ఛిద్రమైంది. నా కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. తాతయ్య కంఠం నుండి సన్నగా వెక్కులు. ఇందుకా నేను తలపెట్టిన పల్లె ప్రయాణం? శాంతిగా పడున్న ప్రాణుల్ని కష్టపెట్టటానికా? అంత బాధలోను అమ్మవారి నామజపం తాతయ్య విడిచి పెట్టలేదు. బాబాయి గోడవారగా కూర్చుని తాతయ్య చేస్తున్న స్తోత్రమే నెమ్మదిగా చెప్పుకుంటున్నాడు. తాతయ్య నుదురు బాదుకుంటూ లేచి గుమ్మం వైపు వెళ్ళాడు. విరిగిన శృతిపెట్టె ముక్కల్ని నేలమీది నుంచి తీశాడు.

'అయ్యో అయ్యో.... ఇదేమిటి?" అంటున్నాడు తాతయ్య. ఒక్క ఉదుటున ఆయన దగ్గరికి చేరుకున్నాను. ఆయన చేతిలో ఒక పొడవాటి తాళం చెవి. శృతి పెట్టె విరిగినప్పుడు సందుల్లో నుంచి పడ్డట్లుంది. ఎవరో దాచుకున్నారు, దేని తాళమో మరి! వణికే చేతులతో నా చేతులు ఆసరాగా పట్టుకుని లోపలికి నడిచాడు. మా వెనకే తిట్టిపోస్తూ నానమ్మ.

అంత ఆదుర్దాలోనూ, అయోమయంలోనూ అమ్మవారి పేరు జపిస్తున్నాడు తాతయ్య. పాత

ఇనప్పెట్టె దగ్గరికి వెళ్ళి దాన్ని చూపించాడు. మారు మాట్లాడకుండా దానిపైన పేర్చిన సామాన్లన్నీ తీశాను. ఆ తాళంతో తెరవాలని ప్రయత్నిస్తే సాధ్యం కాలేదు. కొద్దిగా కొబ్బరి నూనె వేసి మళ్ళీ ప్రయత్నం చేస్తే దశాబ్దాల తరువాత నెమ్మదిగా తెరుచుకుంది. గుండె చప్పుడు రైలింజన్‌లా వినిపిస్తుంటే ఆ చీకటి మూలలో టార్చీ తెచ్చి వేశాను. బాగా లోతున్న పెద్ద ఇనప్పెట్టె. ఏవో పాత కాగితాల కట్టల వెనక... ఒక చాలా పెద్ద మూట ఉన్నది. వణుకుతున్న చేతులతో నామ జపం ఆపకుండా తాతయ్య ఆ మూట విప్పాడు. కాలదోషం కొంత పట్టినా అంతగా వన్నె తగ్గని బంగారు నగలు... ఎన్నెన్నో!

ఆపాదమస్తకం వణికిపోతూ నానమ్మ వంక చూశాడు. ఆమె నమ్మలేని నిజాన్ని చూస్తున్నట్లు దిగ్భ్రాంతి చెంది ఉన్నది. నన్ను కుదుపుతూ అన్నాడు తాతయ్య...

"మీ నానమ్మ సొమ్ములు.. అన్నీ ఉన్నాయి. ఇక్కడే, భద్రంగా...." వలవలా ఏడుస్తున్నాడు.

'కుచ్చు ముక్కుపుడక, బేసరి, రవ్వ పొళ్ళ దుద్దులు, కట్టెవంకీ, వడ్డాణం, పది జతల గాజులు, అడ్డిగ, కాసులపేరు, రాళ్ళ గాజులు, కంకణాలు, చామంతి బిళ్ళ, నాగరం, పదిపేటల పలకసర్లు.... ఇవుగో... అన్నీ ఇక్కడే.. ఈ ఇంట్లోనే భద్రంగా.....'

సొమ్ము దొరికిన సంతోషం ఏ కోశానా ఆయన ముఖంలో లేదు. 'సొమ్మొక చోట.. అపవాదొక చోట' వెక్కుతూ అన్నాడు. పశ్చాత్తాపంతో నుదురు బాదుకుంది నానమ్మ.

'నాకేం తెలుసు? కంసాలి మెరుగుపెట్టిన సొమ్ములు భోషాణంలో ఉంచారు, కనబడలేదు. ఇనప్పెట్టె తాళం కనబడలేదు. అదేమో ఎవడితోనో లేచిపోయింది. లోకరీతిగా అందరూ అనుకునేదే నేనూ అనుకున్నాను, అదే అన్నాను. మీరూ అంటూనే ఉంటారుగా, దాని సొమ్ము అది తీసుకు వెళ్ళిందనీ!'

'కట్టుబట్టలతో వెళ్ళిందది. కనబడ్డ ఒకటీ, రెండుసార్లు ఈ సొమ్ముల పిచ్చితో దాన్ని దుమ్మెత్తి పోశావు. చెయ్యని దొంగతనం అంటగట్టావు. ఈ క్షణం వరకు బిడ్డ నిందమోస్తూనే ఉన్నది పాపం!'

'సొమ్ము దొంగిలించలేదు సరే ఇనప్పెట్టె తాళం చెవులు ఎందుకు పట్టుకెళ్ళింది? సొమ్ము నాకు చెందటం ఇష్టం లేకనే కదా!' లాయరు ప్రశ్న వేసింది నానమ్మ.

'నిజమే, వాళ్ళమ్మ కోరుకున్నది కూడా అదే. తన సొమ్ములు కోడలికీ, కూతురికీ వాళ్ళ బిడ్డలకీ చెందాలని. నా ఖర్మకాలి అక్కాతమ్ముళ్ళు అర్ధాయుష్షుతో ఒకళ్ళు, కళ్ళకు కనబడకుండా ఇంకొకళ్ళు పోయారు. ఇదుగో ఈ పసిదాని రూపేణా నలభై ఏళ్ళ నుంచీ అది మోస్తున్న నింద ఇప్పటికి తొలగిపోయింది. నేటికి దైవేచ్ఛ ఇలా ప్రకటమైంది' నన్ను పొదివి పట్టుకుని అన్నాడు

తాతయ్య. 'అమ్మా! శారదమ్మ తల్లీ! నన్నూ, నా పిల్లల్నీ కనిపెట్టుకుని ఉన్నావా తల్లీ!' చేతులు తలపైకెత్తి నమస్కరించాడు.

నా మెదడు నిండా అలజడి. నేను ఈ ఊరు రావటం దైవప్రేరితమా? అత్తయ్య ఎక్కడుంది? ఆమె పిల్లాపాపలు ఎక్కడున్నారు! ఇది తెలిస్తే తాతయ్యకు ఈ వయసులో ఎంత ఊరట! అపరిచితురాలు గుళ్ళో కనబడి మాట కలపటం, తనతో వెంటబెట్టుకుని తన ఇంటికి తీసుకుపోవటం,శృతిపెట్టె అప్పజెప్పటం... ఇంటికి తీసుకుని వచ్చాక తాతయ్య దాన్ని గుర్తుపట్టటం....అవన్నీ అలాఉంచి పిచ్చికోపంతో నానమ్మ విసిరి విరగ్గొడితే కదా ఆ తాళం చెవి దొరికింది! ఏమిటీ సంఘటనలు? ఇవన్నీ దైవప్రేరితాలేనా?

ఏదో స్ఫురించి హాల్లోకి పరిగెత్తాను. ఉయ్యాల బల్ల మీద నా కెమెరా ఉంది. గబగబా తెరిచాను. ఔను. ఇవి తాతయ్యకూ, నానమ్మకూ లేదా పూజారిగారికీ చూపిస్తే విషయం కొంత అర్థమౌతుంది. ఆ అమ్మాయి పరంధామయ్య కోడలినని చెప్పింది. తాతయ్యకు తెలిసే ఉంటుంది. కండువాతో ముఖం తుడుచుకుంటూ ముందు గదిలోకి తాతయ్య వచ్చాడు.

''తాతయ్యా! ఆ అమ్మాయి నీకు తెలుసుట. గుడి దగ్గర ఉంటారు. నాకు శృతిపెట్టె ఇచ్చిన అమ్మాయి. నీకు ఆ అమ్మాయిని చూపిస్తాను ఇలా రా. ఎవరో పరంధామయ్య కోడలుట. చూశావా నా తెలివి! ఆ అమ్మాయి పేరు అడగనే లేదు!''

'అలాగా. నాకు తెలిసిన పరంధామయ్య మీ నాన్న మేనమామ ఒక్కడే. ఏదీ చూపించు'

కళ్ళజోడు సవరించుకుని దగ్గరగా వచ్చాడు.

డిజిటల్‌కెమెరాలో గుడి, పరిసరాలు, మెట్లు, పూజారిగారు అన్నీ వరసగా కనబడుతున్నాయి.

ధ్వజస్తంభం దగ్గర ఆ అమ్మాయిని కూడా కవర్ చేశాను. మొట్టమొదట ఆ అమ్మాయి కనబడింది అక్కడే. ఉంది, ఉంది, ఇక్కడే చూశాను. నా భ్రమ కాదు. అదుగో దూరంగా కనబడుతోంది. పొట్టిచీర, భుజం మీదుగా ముందుకు వేసుకున్న పొడవైన జడ, పెద్ద కళ్ళు, పెద్ద బొట్టు, కాళ్ళకు పట్టాగొలుసులు, చెవులకు జూకాలు... ఆమె బాగా దగ్గరైంది. అదేమిటి, తల వెనక్కి విసిరి అలా విరగబడి నవ్వుతోంది? నేను చూసినప్పుడు ఎప్పుడూ అలా నవ్వలేదే?

''అమ్మా విద్యున్మాలా'' గుండెలవిసేలా అరిచి కుప్పకూలి పోయాడు తాతయ్య.

విధి ప్రేరితమైన నాటకానికి తాతయ్య నమ్ముకున్న అమ్మవారి గుడి రంగస్థలమా? వీడని చిక్కు ముడిని విప్పటానికి ఎన్నెన్నో ఏళ్ల తరువాత నేను నిమిత్తమాత్రురాలినైనానా? కెమెరా చేతి నుంచి జారి నాకు స్పృహ తప్పుతోండగా బాబాయి కంఠం లీలగా వినిపించింది.

'మహాకాళీ మహాపాశా మహాకారా మహాంకుశా' పీతాచ విమలా విశ్వా విద్యున్మాలా చ వైష్ణవీ'

# తానొకటి తలిస్తే

శ్రీదేవి జొన్నలగడ్డ

శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
'నా మొట్టమొదటి కథ' విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

**ఉదయం 6. 00 గంటలు** అయ్యినట్టుగావుంది సెల్ ఫోన్ లో పెట్టిన అలారం మోతకి చప్పున మెళుకువ వచ్చింది. చలికాలం కావడంతో ఇంకా బయట వెలుతురు రాలేదు, 'ఇవాళ శనివారమే గా' అనుకుంటూ, అలారం కట్టేసి మళ్ళీపడుకున్నాను బద్ధకంతో. కానీ నిద్ర పట్టలేదు, సరి కదా ఇవ్వాళ పెట్టుకున్న కార్యక్రమం గుర్తు వస్తోంది. తలుచు కుంటుంటే ఇండియా వెళ్ళడానికి టికెట్ కొనుక్కున్నంత ఆనందంగా అనిపించింది, ఇవ్వాల్టికి ఇంట్లో వంట పని తప్పింది ముందర ! కానీ పొద్దున్నే కొంచె ఆకలి అనిపిస్తోందేమిటి? అనుకున్న పని అలాంటిది మరి! చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీదా అన్నట్లుగా చిత్తం వెంకన్న మీద, భక్తి ప్రసాదం మీద అనుకోవాలిక్కడ. ఏది ఏమైనా ఇంక లేచి బద్ధకం వదిలించుకొని తయారయితే మంచిది అనుకొంటూ ఉండగానే 6. 15 అవుతోంది. నేను నెమ్మది గా తయారయ్యి మిగతా ముగ్గురినీ లేపచ్చులే అనుకున్నాను. మొహం కడుక్కుని క్రింద వంటింట్లో కి వెళ్లి ఓ కప్పు కాఫీ సేవనం కానిచ్చాక అప్పుడనిపించింది త్వరగా బయలుదేరితే మంచిదేమో గుడికి అని. రెండు గంటల ప్రయాణం మిల్వాకీ నుండి అరోరా/చికాగోకు , తొందరగా వెళితే శ్రీఘ్ర దర్శనం తో పాటు అతి ముఖ్యమైన అల్పాహార విందు కార్యక్రమానికి కూడా రద్దీ తప్పించుకోవచ్చని నా తపన, కానీ మిగతా ముగ్గురు శాల్తీలు అంటే మా ఆయన, పిల్లలూ సహకరించాలి కదా!

నిన్న రాత్రి ఇండియా ఫోన్ చేసినప్పుడు అమ్మ చెప్పింది ఈ రోజు మా పెళ్లి రోజని (తిథుల ప్రకారం). సరే, చికాగో/ అరోరా లో ఉన్న వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్తే బాగుంటుందని అనుకున్నాము. సాధారణంగా వారాంతంలో పనీ లేదు తీరుబడీ లేదు అన్నట్లు గా ఉంటుంది మా పరిస్థితి. కానీ ఈ వారంతం లో ఎక్కడా బుక్ అవ్వలేదు అంటే birthday పార్టీ లకూ , సభలూ సమావేశాలకు ఎవరూ పిలవలేదు. కాబట్టి, చికాగో వెళ్ళడానికి సన్నద్ధమయ్యాము.

ఈ మధ్య కాలం లో అసలైన ఆంధ్ర లేదా దక్షిణాది తిండి తిని చాల రోజులయ్యింది బయట. రోజూ ఇంట్లో చేసుకునేవి చాల మటుక్కు తెలుగు వంటలే అయినా బయటకు వెళ్లి తింటే అ సరదా వేరు కదా ! మిల్వాకీ లో మన ఇండియన్ రెస్టారెంట్ లు లేవని కాదు కానీ, ఉన్నవాటిని వేళ్ళమీద లెక్కించ వచ్చు, అదీకాక వాటిలో ఎప్పుడైనా తింటే తిండి మీద విరక్తి కలిగే అవకాశం ఎక్కువ. ఈ మాట నేను అనుభవపూర్వకం గా చెబుతున్నదే, ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

ఇంతకు ముందు అంటే గత 15 సంవత్సరాల్లో ఎన్నో సార్లు వెళ్ళాం అరోరా గుడికి, కానీ అక్కడ ఫలహార శాల లో తిన్నది చాల కొద్ది సార్లు మాత్రమే అదికూడా ఏవో అనివార్య కారణాల వల్ల. ఇందాక చెప్పినట్టుగా చాలా మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వచ్చినా, అక్కడ ఫలహార శాలలో లభించే ఫలహారాల మీద ప్రత్యేకమయిన మక్కువ చూపిస్తున్నారని అనిపించింది ఆ మధ్య అక్కడికి వెళ్ళినప్పుడు. మరి ఈ రోజు అక్కడ తినే యోగం ఉందో లేదో మాకు. ఒకొక్క సారి చాల చిన్న చిన్న కోరికలు తీరడానికి ఎంతో సమయం పట్టచ్చు, ఎన్నో అవాంతరాలు రావచ్చు, అయినా మా దంత సిరి ఎలావుందో ఈరోజు! అంతా మనమంచికే అనుకుంటే గొడవ లేదు, కానీ అలా అనుకోలేం కదా, ఏదో చేయ్యలనుకుంటాం మరేదో జరుగుతుంది..మనం అనుకున్నది అనుకున్నట్టు జరిగితే ఇంక చెప్పడానికి ఏముంటుంది! ..... ఈ ఆలోచనలన్నీ పక్కకు పెట్టి పనిలో పడ్డాను.

నేను తయారై వాళ్ళ ముగ్గురినీ లేపే సరికి వెలుతురు వచ్చేసింది, మిగతా ముగ్గురు తయారవడం అంత సులభం కాదు ( ముఖ్యం గా వారంతం లో ). నిన్న రాత్రి సెకండ్ షో చూసి పడుకున్నారు కదా (అంటే ఇంట్లోనే, హోం థియేటర్ లో లెండి). ముందుగా పెద్ద శాల్తీ అంటే మా అయన లేచి తయారయ్యారు గమ్మునే ఎందుకంటే తనకి కూడా నాలాగే ప్రసాదం మీద భక్తి ఎక్కువే కాబట్టి ! పెళ్ళై 15 ఏళ్ళు అయినా మేము ఒకరితో ఒకరు ఏకీభావించేది బహు తక్కువ విషయాల్లో, అందులో ఒకటి భోజనం/తిండి.

ఇంతవరకు అంతా బాగానేవుంది కానీ ఈ రోజు ఏమైనా మంచు పడుతుందా అనుకుంటూ టివీ ఆన్ చేశారు శ్రీవారు. టీవీ లో వెదర్ ఛానల్ చూస్తే చలి తప్ప మంచు లేదని (ఈరోజు అర్థ రాత్రి వరకూ ) తెలిసింది. ఇంకేముంది, మిడ్వెస్ట్ లో ఈ ఎముకలు కోరికే చలికాలం లో ఈరోజు మంచు పడ్డంలేదంటే సంతోషించాల్సిన విషయమే మరి, గుడ్డి కంటే మెల్ల నయం అంటే ఇదేనేమో! ఇక ప్రయాణానికి సిద్ధం అవ్వచ్చు.

ఈలోపల పిల్లలిద్దరూ కూడా కూడా లేచి కిందకి వచ్చారు. 5 , 3 తరగతులు చదువుతున్న మా పిల్ల కాయలు తెలుగు మాట్లాడడానికి చాలా కష్టపడ్డా తెలుగు సినిమాలన్నా, తెలుగు వంటకాలన్నా బహు ఇష్టపడతారు! మరింక అభ్యంతరం ఏముంటుంది గుడికి వెళ్ళడానికి? పైగా వారాంతాల్లో మొక్కుబడి గా చేసే సంగీత సాధన లాంటివన్నీ ఈ రోజు చెయ్యక్కరలేదు కాబట్టి ఇంకా ఆనందం వాళ్ళకి. పిల్లలిద్దరూ స్నానపానాదులు కానిచ్చి తయారయ్యే లోపు మేమిద్దరం ప్రయాణానికి కావలసిన సరంజామా అంటే సెల్ ఫోన్లు, ఐపాడ్, వాటి charger లు కొన్ని డీవీడీ లు, CD లు, పిల్లల పుస్తకాలు కార్లో పెట్టుకున్నాం. ఇదివరలో ఇవేమీ, కనీసం GPS కూడా లేకుండా మ్యాప్ లు చూసుకుంటూ, చుట్టుపక్కల పరిసరాలు గమనిస్తూ, కేవలం CD లు లేదా క్యాసెట్లు ద్వారా సంగీతం వింటూ ప్రయాణాలు చేసేవాళ్ళం. మరి ఇప్పుడు ఐపాడ్ లేకుండా ఎక్కడికి వెళ్ళాలన్నా కష్టం, అందులో రెండు గంటల ప్రయాణం లో ఇవేమీ లేక పోతే బుర్ర తినేస్తారు పిల్లలు.

మొత్తానికి అందరం సూటూ బూటూ వేసుకుని (చలికాలం కదా తప్పదు మరి) ఇంటి దగ్గరనుంచి బయలుదేరే సరికి ఉదయం 7. 30 అయ్యింది. బ్రేక్ ఫాస్ట్ ఏమీ తినకుండా సుప్రభాత దర్శనానికి వెళదా మనుకున్నాము కదా అని అందరం తల ఒక ఆపిల్ మాత్రం తిన్నాము దార్లో నీరసం రాకుండా! అక్కడ క్యాంటీన్ లో ఉన్న అల్పహారలన్నింటిలో కొన్నింటికి అయినా న్యాయం చెయ్యాలన్నది కూడా మా ఉద్దేశ్యం (లోపాయకారిగా).

అరోరా వెంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ శనివారం ఉదయం 9. 00 గంటల తరువాతే ఉంటుంది (మన బోటి భక్తులకు సదుపాయంగా), అయితే 9. 30 గంటలకల్లా అక్కడికి చేరుకోవచ్చని అనుకుని బయలుదేరాం మిల్వాకీ లో. విస్కాన్సిన్ పొలిమేరలు దాటగానే పిల్లలిద్దరికీ ఆకలి మొదలయింది ఎందుకంటే దార్లో Mc.Donald , Pizzahut, Subway లాంటి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లు

ఏదో ఒకటి కనువిందు చేస్తూనే వున్నాయ్! ఇక తప్పదు గా Subway దగ్గర ఆగి వాళ్ళని సంతృప్తి పరిచాం. ఏదో ఒకటి రెండు చోట్ల ఆగడం మినహా ప్రయాణం లో పెద్దగా అవాంతరాలేమీ లేకుండా గుడికి చేరుకునేదప్పటికి పావుతక్కువ పది అయింది.

పార్కింగ్ లాట్ చూస్తే జనం ఎక్కువగా ఉన్నట్టు అనిపించలేదు, అసలే చలి కాలం ఇంకా ఉదయం 10 గంటలు కూడా కూడా కాలేదు నెమ్మదిగా వస్తారు కాబోలు భక్తులు అనుకుంటూ గుళ్ళోకి ప్రవేశించాం. నిజంగా చెప్పాలంటే ఒక ఇండియన్ రెస్టారంట్ కి వెళ్లినట్టు గానే అనిపించింది కొన్ని క్షణాల పాటు, ఆ ఘుమ ఘుమ లూ, హడావిడి చూస్తుంటే. ఇక్కడ గుళ్ళోకి వెళ్ళే ప్రధాన ద్వారం ఎప్పుడూ తెరవరు, బహుశా చలి మూలంగా కావచ్చు, అందుకని భక్తులందరూ కాఫెటేరియా దాటుకుని మెట్లు ఎక్కి పైకి వెళ్ళాలి దర్శనానికి. ఊహించినంతగా కూడా జనం లేరు గానీ ఫలహార శాల సగం నిడింది. మెనూ లో ఏవో కొత్త రకాలు కనబడుతున్నాయి! కానీ మరికొద్ది సేపట్లో వచ్చి వివరంగా చూడొచ్చులే అనుకొని కాళ్ళు చేతులు కడుక్కొని, అర్చనకి టికెట్ కొని, అరటి పళ్ళు తీసుకొని పైకి వెళ్ళాం దర్శనానికి. అప్పుడే సుప్రభాతం అయినట్టుగావుంది చాలా మంది క్రిందకు వెళుతున్నారు. మా అమ్మమ్మ అంటుండే మాట 'తిండికి తీర్థం వెళ్ళడం' అంటే ఇదేనేమో అనిపించింది వాళ్ళందరినీ చూస్తూంటే, ఏది ఏమైనా మేము వాళ్ళతో కలవాలి కదా ఇంకాసేపట్లో!

వెంకన్న బాబుతో పాటు అన్ని దేవుళ్ళనీ దర్శించుకుని, స్వామి వారికి అర్చన చేయించుకుని, కోర్కెల చిట్టా కూడా సమర్పించుకొని, అతి ముఖ్య మైన పని కోసం, అదే ఫలహార శాల కు క్రిందకు వెళుతూ ఉంటే,నా కుడి కన్ను అదరసాగింది, అదే మా ఆయనతో అన్నాను

"కొంచెం వేడి చేసిందేమో లే , పెరుగన్నం తిను" అని ఒక ఉచిత సలహా ఇచ్చారు.

"చూద్దాం లెండి, ఇంత దూరం వచ్చింది పెరుగన్నం తినడానికా " అన్నాను.

ఇలా మేము మాట్లాడుకుంటూ ఖాళీగా ఉన్న ఒక బల్ల దగ్గర కూర్చుని ముందుగా ఏమి తినాలా..... అని ఆలోచిస్తుండగా అప్పుడే ఎవరో భుజం తట్టినట్టై వెనక్కి తిరిగాను.

ఎదురుగా పార్వతీశం బాబాయ్ వరలక్ష్మి పిన్ని , చాలా రోజులయ్యింది వాళ్ళని కలిసి.

పరస్పర పలకరింపులు, కుశల ప్రశ్నలూ అయ్యాక వాళ్ళింటికి మ్మమ్మల్ని భోజనానికి ఆహ్వానించారు (అప్పుడే, ఆ పూటే) వారిద్దరూ మాకు దూరపు బంధువులే కాక, వారి కుటుంబం తో మా కుటుంబానికి 25 ఏళ్లకు పైగా అనుబంధం ఉంది. మేము ఇండియాలో ఉన్నప్పటి నుండీ. ఇదివరకు వాళ్ళు డిట్రాయిట్ లో ఉండేవారు. 2-3 ఏళ్ళ క్రితమే చికాగో వచ్చి స్థిరపడ్డారు. వాళ్ళు చికాగో వచ్చిన కొత్తలో వాళ్ళ అబ్బాయి ఉపనయనానికి పిలిస్తే వెళ్ళాము. అ తరువాత మల్ల ఇదే కలవడం. బాబాయ్ కి మాట్లాడడం ఇష్టం, పిన్ని కి ఆయన మాటలు వినడం ఇష్టమని వాళ్ళతో 10 నిముషాలు గడిపిన వారికెవరికైనా సులభంగా అర్థం అవుతుంది.

"పదండి ఇంటికెళ్ళి భోజనం చేస్తూ మాట్లాడుకుందాం"అన్నారు బాబాయ్.

"లేదు బాబాయ్ మరోసారి వస్తాం ఇంటికి, ఇక్కడ కలవడం అయ్యిందిగా " అన్నాను నేను.

(చెప్పాలంటే మా ఇద్దరికీ కూడా ఇక్కడ మంచి ఫలహారాలు మానేసి వాళ్ళింటికి వెళ్ళి తినడం ఇష్టం లేదు)

"లేదు లేదు మీరు ఈపుటే రావాలి, భోజనం అయ్యాక కాసేపు కబుర్లు చెప్పుకొని వెళ్ళచ్చు" అన్నారు పార్వతీశం బాబాయ్.

"పిన్నికి ఎందుకు శ్రమ, పోనీ కాసేపాగి మధ్యాహన్నం టీ టైం కి వస్తాం" అన్నాన్నేను కొంచెం అలోచించి.

పిన్ని ఎక్కువగా మాట్లాడరు, చెప్పినదానికి తలాడిస్తారు అంతే!

"ఎవరికీ శ్రమ లేదు, మీరు మా ఇంటికి వచ్చి రెండేళ్ళు అయింది, నేను ఈ మధ్య Europe వెళ్లి వచ్చాను" అన్నారు బాబాయ్

(Europe ట్రిప్ అనగానే మనసేదో కీడు శంకించింది) కానీ వదిలిపెట్టేలా లేరు అనుకున్నాను మనస్సులో మా ఆయనకి నా కంటే మొహమాటం ఎక్కువ,

"సరే అలాగే వస్తాం" అని చెప్పి వాళ్ళ అడ్రస్ తీసుకున్నారు

మేము ఈ తర్జన భర్జనలలో ఉండగానే గుళ్ళో రద్దీ పెరిగింది, ప్రసాదాలకు టోకెన్ ఇచ్చే లైన్ కూడా పెరిగింది. ప్రసాదంగా నాలుగు లడ్డూ లు తీసుకొని/కొనుక్కుని బయటికొచ్చాం. సరే "చేసుకున్నవాళ్ళకి చేసుకున్నంత మహదేవా అని " ఈ పూట ఇక్కడ తినే యోగం లేదు లే" అనుకున్నాం.

అరగంట ప్రయాణం తరువాత వాళ్ళింట్లో ఉన్నాం మేము ముగ్గురమూ ఒక గులాబీ పూల గుత్తి తో సహా.

వాళ్ళ ఇల్లు చిన్న పురావస్తు ప్రదర్శన శాల (Museum) ని తలపిస్తుంది చూడగానే ఎవరికైనా, ఏ మూల చూసినా వివిధ దేశాల నుంచి తెచ్చిన కళాఖండాలు దర్శనమిస్తూ ఉంటాయి. వాటి గురించి మనం ప్రత్యేకం గా అడగక్కర లేదు, మన చెవులు బాబాయ్ కి అప్పగిస్తే చాలు! జంధ్యాల గారి సినిమాల్లో శ్రీ లక్ష్మి గారికి ఉండే వింత అలవాటు లేదా బలహీనత లాగే ఒకటి మన పార్వతీశం బాబాయ్ కి కూడా ఉంది. అతిథులకీ ఇల్లంతా చూపిస్తూ ఇంట్లో ఉన్న/ తాను తెచ్చిన కళా ఖండాల గురించి విశేషంగా వివరం గా చెప్పడం!

నీరసంగా ఉన్న మా మొహాలు చూసాక పెద్దగా చెప్పాలనిపించ లేదేమో బాబాయికి. వాటి గురించి ఇంకా మాట్లాడడం మొదలు పెట్టలేదు. మేము వెళ్ళగానే టీవీ ఆన్ చేసారు, మగవాళ్ళు నలుగురూ (అంటే మా ఆయనా, మా పిల్లలూ , బాబాయ్ ) ఫుట్ బాల్ మ్యాచ్ లో లీనమయ్యారు క్షణాల్లో. పిన్ని అప్పడికే వంట ప్రయత్నంలో ఉన్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయ మేమిటంటే ఈ దంపతులిద్దరూ చాలా జాగ్రత్తలు తీసుకుంటారు ఆరోగ్యం విషయంలో , వాళ్ళింట్లో వేపుడు పదార్థాలు, నెయ్యి లాంటివి నిషేధం. నూనే, ఉప్పు కారం లాంటివి చాలాచాలా మితంగా వాడతారు! ఇవన్నే తలుచుకుంటుంటే మళ్ళా ఒక్క నిముషం నా మనసు బాధ తో మూలిగింది, గుళ్ళో తినలేక పోయిన రకరకాల ఫల హారాల కోసం! సరే వంటింట్లోకి వెళ్ళాను

"పిన్నీ ఎమైనా సహాయం చెయ్యమంటారా?" అడిగాను నేను.

"పని పెద్దగా ఏమీ లేదు, చాలా సింపుల్ గానే వండుతున్నాను లే, అలా కుర్చుని కబుర్లు చెప్పు" అన్నారు.

ఏదో లోకాభి రామాయణం మాట్లాడుకుంటున్నాము ఇద్దరం. పిన్ని వంట చేస్తుంటే కొంచెం సహాయం చేస్తూ (టమాటోలు కోస్తూ) గమనిస్తున్నాను నేను. ఇప్పటివరకూ నా జీవితం లో ఇలాంటి వంట చూడలేదు వినలేదు!

అప్పటికే వంకాయలు గుత్తులు గా కోసి ఓవెన్ లో పెట్టారు, అవి కాలి మగ్గినట్టుగా అనిపించింది చూడ్డానికి బయటకు తీసాక, వాటి మీద కొంచెం కూర పొడి లాంటిదేదో చల్లి కొంచెం ఆలివ్ ఆయిల్ స్ప్రే చేసారు. చివరిగా కొంచెం నిమ్మరసం, కొత్తిమిరి కూడా వేసారు వాటిమీద . అది వంకాయ కొతిమీర కారం పెట్టిన కూర అని అనుకోవాలన్న మాట! చూడ్డానికే కొంచెం తేడాగా ఉన్నట్టనిపించింది, రుచి ఎలా ఉంటుందో కొంచెం తిని చూడాల్సిందే ఇష్టం లేకపోయినా అనుకున్నాను.

ఇంతలో కుక్కర్ లో ఉడికించిన పప్పులో ముందుగా నేను కోసిచ్చిన టమాటో ముక్కలు కూడా వేసి మళ్ళా కాసేపు ఉడికించారు, ఇందులో కొంచెం కరివేపాకు, ఇంగువ పోపు వేస్తే బావుంటుందేమో అనుకున్నాను కాని అ సూచన లేమీ కనపడ లేదు. కాసేపు ఉడికాక చిటికెడు పసుపూ కొంచెం ఉప్పు వేసారు, చిటికెడు కారం, నాలుగు కరివేపాకు రెబ్బలు కూడా వేసారు కానీ ఇంకా పోపు మాత్రం ఏమీ వెయ్యలేదు!

ఈ లోపల నేను తరిగిచ్చిన ఆనపకాయ ముక్కలు కూడా కొంచెం సేపు పొయ్యి మీద ఉడికించారు. ఇంచుమించు పైన చెప్పిన పద్ధతి లోనే అంటే వంకాయ కూర, టమాటో పప్పు చేసిన పద్ధతిలోనే ఆనపాకాయ పెరుగు పచ్చడి కూడా కూడా చేసారు Danon (fat free ) పెరుగుతో, చూడ్డానికి మైదా పిండి ముద్దలో ఆనపకాయ ముక్కలు వేసినట్టుగా ఉంది ఆ పెరుగు పచ్చడి!

Brown రైస్ కూడా అప్పుడే అయ్యింది రైస్ కుక్కర్ లో. ఈ లోపల బాబాయ్ వంటింట్లో కి వచ్చి అడిగారు 'వంట పూర్తయ్యిందా' అని

"కొంచెం పాయసం చేద్దామనుకుంటున్నాను 5 నిముషాల్లో అన్నీ అవుతాయి" అన్నారు పిన్ని

పాయసం అంటే సేమ్యా పాయసం అనుకున్నాను కానీ ఇదొక వింత పాయసం ! ముందుగా ఉడికించి పెట్టుకున్న హోల్ వీట్ పాస్తా/నూడుల్స్ లో కొంచెం fat ఫ్రీ పాలూ (మైక్రోవేవ్ ఓవెన్ లో వేడి చేసినవి) కొంచెం బ్రౌన్ షుగరూ కలిపారు అంతే!

టమాటో పప్పు లోనూ, ఆనపకాయ పెరుగు పచ్చడి లోనూ పోపు పెట్టలేదు కదా, అదే అడిగాను నేను.

"పిన్నీ వీటిల్లో పోపు వేస్తారా?"

"ఇదిగో వేస్తున్నాను" అంటూ ఒక చిన్న స్టీలు డబ్బా తీసారు, స్టవ్ మీద నూనె మాత్రం పెట్టలేదు, డబ్బాలోంచి ఏదో తీసి 2 చెంచాలు పప్పు లోనూ మరో రెండు పెరుగు పచ్చడిలోనూ వేసారు

అది ఏమిటంటే ముందుగానే పొడిగా వేయించి ( నూనె లేకుండా) పెట్టుకున్న పోపు గింజలు కొంచెం (ఆవాలు, కొంచెం మినప్పప్పు, జీలకర్ర ) అంతే!

"ఓట్స్ తో పులిహోర, గ్రీన్ ఆపిల్ తో మెంతి బద్దలూ కూడా చేస్తే బాగుండేది కానీ, మీకు భోజనానికి ఆలస్యం అవుతోంది" అన్నారు పిన్ని

ఆ వింత వంటకాలు తినాలన్నా కోరికా, వాటిని చేసే విధానం తిలకించే ఆసక్తి ఎంతమాత్రమూ లేవు నాకు ఆ సమయంలో! అలా చెబితే బావుండదని పైకి మాత్రం

"ఎందుకు పిన్నీ ఇప్పటికే చాలా చేసారు, ఈపూటకివి చాలు" అన్నాను

ఏది ఏమైనా వంట చాలా త్వరగా,సులువుగా అయినట్టే అనిపించింది కానీ తినడానికి అంత ఉత్సాహంగా అనిపించ లేదు, సరే ఏమైనా తప్పదు కదా ! మా బామ్మ అంటూ ఉండేది ' మనం తినే ప్రతీ అన్నం మెతుకు మీద మనపేరు వ్రాసి ఉంటుందని' ఈ బ్రౌన్ రైస్ మీద మా పేర్లున్నాయి కాబోలు! సరే ఈ వంటకాలన్నీ తినాలంటే కొంచెం ఉప్పూ, కారం వేసిన పచ్చడి ఎంతైనా అవసరం అనిపించింది, ఇంక ఉండబట్ట లేక అడిగాను నేనే

"పిన్నీ పచ్చడి గానీ, ఊరగాయ గానీ ఏమైనా ఉందా?" అని

చిన్న సీసాలో ఉన్న గోంగూర పచ్చడి తీసుకువచ్చారు లోపలనుంచి, వాళ్ళు పచ్చళ్ళు, ఉరగాయలు తింటారని అనుకోవడం నా బుద్ధి తక్కువ! కాకపోతే ఆశ మనవ సహజం కదా! లోపలనుంచి తెచ్చిన గోంగూర పచ్చడి చూడ్డానికి అంత బాగా లేదు , రెండు-మూడేళ్ళ క్రితం వాళ్ళు ఇండియా వెళ్ళినప్పుడు తెచ్చారుట! రుచి ఎలావుంటుందో మరి! కొంచెం ఉప్పూ కారం తగిలితే చాలు నోటికి !

అందరూ డైనింగ్ టేబుల్ దగ్గరికి కి వచ్చారు భోజనం చెయ్యడానికి, చాలా ఆకలేస్తోంది అందరికీ, మా పిల్లలిద్దరికీ తప్ప ! ప్రయాణం లో మిల్వాకీ నుండి వచ్చేడప్పుడు Sub Way లో తినడం అయ్యింది,అదీ కాక తిరుగు ప్రయాణం లో పిజ్జా తినే ఉద్దేశ్యం ఉంది

కాబట్టి, ఏదో నాలుగు మెతుకులు కతికారు వాళ్ళిద్దరూ. మొత్తనికి అందరి భోజనాలు అయ్యాయి. అయ్యాయి అనే కంటే అయ్యాయనిపించాము అంటే బాగుంటుందేమో!

కాస్సేపు కబుర్లు చెప్పుకోవడం అనే అంశం లోకి వచ్చాం ఇప్పుడు, కానీ మనం చెప్పేది ఏమీ ఉండదు, ఉండకూడదు, బాబాయ్ చెపుతుంటే వినడమే!

భోజనానంతరం సుమారు రెండు మూడు గంటలపాటు వాళ్ళింట్లో వస్తు సేకరణా వాటి విశేషాలతో మాకు సుదీర్ఘమైన ఉపన్యాసాన్ని అనర్గళంగా వినిపించారు బాబాయ్, ఈ మధ్య Europe నుంచి తెచ్చిన తైల వర్ణ చిత్రాల విశేషాలతో సహా ! అర్థాకలితో ఉన్నాం కాబట్టి నిద్ర రావట్లేదు గానీ శిరోభారం/తలనొప్పి గా ఉంది మా ఇద్దరికీ. మా అవస్థ గమనించిన పిన్ని కొంచెం టీ చేసి ఇచ్చారు , ఆక్షణంలో ఆ టీ ఎంతో బాగుందనిపించింది. వాళ్ళిద్దరూ టీ, కాఫీ లు త్రాగరు, కానీ టీ అంత బాగా చేసారంటే మా అదృష్టమే మరి! స్వతహాగా పిన్ని బాగానే వంటచేసేవారేమో, ఇక్కడి కి వచ్చిన తరువాత (అమెరికా వచ్చిన తరువాత) ఈ చప్పిడి వంటకి అలవాటుపడి ఉండవచ్చు అనిపించింది.

తన ఉపన్యాసానంతరం మేము టీ సేవిస్తున్నప్పుడు మాటల మధ్యలో చెప్పారు బాబాయ్, ఈరోజు సాయంత్రం వాళ్ళిద్దరూ బాలమురళి కృష్ణ గారి సంగీత కచేరీ కి వెళ్ళాలని అనుకుంటున్నట్లు. సంగీతం అంటే మాకూ ఇష్టమే కాబట్టి వివరాలడిగితే, కచేరీ సాయంత్రం 6:30 గంటలకి లెమాంట్ గుడి లో (అది రాముల వారి గుడి, చికాగో లోనే) ఆడిటోరియంలో అనీ అన్నారు. సరే, దంత సిరి లేక పోయినా, శ్రవణానందం కలిగే భాగ్యం ఉంది కాబోలు అనుకొని వాళ్ళతో రామాలయానికి వెళ్ళాము. సాయంత్రం 6.00 గంటల ప్రాంతంలో. గుళ్ళో దర్శనం చేసుకొని ఆడిటోరియంలోకి వచ్చేసరికి అప్పుడే కచేరి మొదలైంది. సుమారు మూడు గంటల పాటు అత్యద్భుతంగా, అనితర సాధ్యం గా జరిగింది బాలమురళీ కృష్ణ గారి కచేరీ , నిజంగా ఆకలి దప్పులు లేవు ఎవరికీ కచేరీ అయ్యేంతవరకూ. కచేరీ తరువాత అక్కడే కాఫెటేరియా లో పెరుగన్నం మాత్రం తిని (రాత్రి 9 తరువాత అద్దొక్కటే ఉంది అక్కడ ) తిరుగు ప్రయాణానికి సిద్ధం అయ్యాం. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచినా, అంటే అదే, ఈ రోజు ఉదయం మేము అనుకున్నట్టు గా మంచి ఫలహారాలు చవి చూడ లేక పోయినా అనుకోకుండా ఎంతో మంచి మంచి కచేరీ విన్నందుకు చాలా ఆనందం గా అనిపించింది. ఇంత మంచి కచేరీ వినడానికి దోహద పడిన పిన్ని, బాబాయ్ లకు మరొక్కసారి కృతజ్ఞతలు తెలుపుకుని మిల్వాకీ బయలుదేరాం.

# "సాయి" లీలలు

డా. మృదులాంజలి

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**బద్దకంగా కళ్ళు తెరిచాను**. కిటికీలోంచి ఎండ ముఖం మీద పడుతుంది. దృష్టి సారించి వాల్‌క్లాక్ చూసాను.

11.30 ఉలిక్కిపడ్డాను.

ఇంతసేపు నిద్రపోయాను. చటుక్కున లేవబోయాను. తల తిరిగింది రెండు చేతులతో తల గట్టిగా పట్టుకుని, వెనక్కి వాలాను. రాత్రి పబ్‌లో పార్టీ ముగిసే సరికి రెండయింది. రాత్రి తాగిన మత్తుకి బుర్ర పట్టేసింది.

తల తిప్పకుండా కళ్ళు త్రిప్పి ప్రక్కకి చూసాను. గదిలో ఎవరూ లేరు.

ఎవరుంటారు? ఆ ఫ్లాట్‌లో ఉండేది నేనొక్కడినే కదా! కానీ రాత్రి సునీల్‌గాడు నాతో వచ్చిన గుర్తు. నన్ను దింపి ఇంటికి వెళ్ళిపోయి వుంటాడా?

కళ్ళు మూసుకున్నాను ఎవరన్నా వచ్చి కొంచెం సోడాలో డిస్ప్రిన్ వేసి ఇస్తే బాగుండును. ఈ హేంగోవర్ తగ్గాలంటే అదే ముందు.

అలా కళ్ళు మూసుకుని ఎంతసేపు వున్నానో తెలీదు. సడెన్‌గా సెల్ మ్రోగేసరికి ఉలిక్కిపడి చూసాను.

మంచం మీదే పడి వుంది సెల్‌ఫోన్. నెమ్మదిగా తల కదలకుండా ఫోన్ అందుకున్నాను. స్క్రీన్ మీద నెంబర్ చూడడానికి కూడా అవ్వలేదు.

ఫోన్ ఆన్ చేసి "హలో" అన్నాను

"అరే మురళీ! నేనురా అత్తని" అటు నుండి ఖంగున మోగింది సరళ అత్త గొంతు. ఒక్కసారిగా నిద్రమత్తు, మందుమత్తు అన్నీ వదిలేసాయి. చటుక్కున లేచి కూర్చున్నాను.

"ఆ హలో అత్తా బాగున్నావా?" గొంతులో ఉత్సాహం నింపుకుని అడిగాను.

"ఆ బాగున్నాను, నువ్వేంటి ఇంకా లేవలేదా?"

వామ్మో! ఫోన్లోనే పేగులు లెక్కేస్తోంది.

"లేదత్తా, ఎప్పుడో లేచాను. ఇంకొంచెం వుంటే బయటకు వెళ్ళిపోయేవాడిని" ఆశువుగా అబద్ధం చెప్పాను.

సరళత్తది చాలా స్ట్రిక్ట్ వ్యవహారం. ఉదయం ఆరు తరువాత మంచం మీద వుండకూడదు. లేచిన వెంటనే ముఖం కడగటమే కాదు, స్నానం చేసెయ్యాలి. ఆ తర్వాత పూజ చెయ్యాలి. పూజ తర్వాత పేపర్ రీడింగ్, ఆ తరువాత టిఫిన్, పనులు.

ఆవిడ ఇంట్లోవాళ్ళకే కాదు, ఆ యింటికి వెళ్ళిన వాళ్ళకి కూడా అదే రొటీన్.

అలాంటి ఆమెతో ఉదయం 11.30కి నిద్రలేచాను, ఇంకా పళ్ళు కూడా తోమలేదు అని చెప్పే ధైర్యం నాకు లేదు.

"సరే కానీ, రేపు రాజధానికి ఢిల్లీ వెళుతున్నాను. హైదరాబాద్ స్టేషన్‌లో వచ్చి కలువు" అని చెప్పిందామె.

హమ్మయ్యా అనుకుంటూ "సరే అత్తా" అన్నాను.

"అన్నట్టు నాతో కూడా సాయి వుంటాడు" చెప్పింది మరలా.

"సరే అత్తా, తప్పక వస్తాను" ఆమెకి మాటిచ్చి ఫోన్ పెట్టేసాను.

హమ్మయ్యా, ఈవిడ ఇక్కడికి వస్తుందేమో అని భయపడ్డాను.

ఇంజినీరింగ్ అయ్యాక పెద్దల కోరిక మీద ఇంగ్లాండ్‌లో ఎం.ఎస్ చేసి, అదే పెద్దల కోరిక మీద బుద్ధిగా వెనక్కి తిరిగి వచ్చాను.

అసలైతే నాతో ఎం.ఎస్ చేసిన వాళ్ళంతా అట్నుంచి అటే అమెరికాకో, ఆస్ట్రేలియాకో ఎగిరిపోయారు. కానీ చిన్నప్పటి నుండి నాన్న డబ్బు పంపితే ఖర్చు చేయడం అలవాటయి కష్టపడడం ఇష్టపడలేదు.

నాన్న వాళ్ళంతా అనకాపల్లిలో వుంటారు. ఇక్కడ ఉద్యోగ ప్రయత్నాలు అని కొంతకాలంగా వుంటూ హాయిగా గడిపేయడం అలవాటు చేసుకున్నాను.

అనకాపల్లిలో నాన్న బిజినెస్ బాగుంటుంది. అందుకే నెలకి పదివేలు చెక్కు అలా ఆయన పంపుతుంటే, ఇంక ఇక్కడ నేను కష్టపడే అవసరం ఏముంది?

మా అబ్బాయి హైదరాబాద్‌లో పనిచేస్తున్నాడని చెప్పుకోవడం వాళ్ళకిష్టం. నా లైఫ్ నాకిష్టమైనట్లు గడపడం నాకిష్టం. కాకపోతే, ఇలా బంధువులు మధ్య మధ్యలో రాకపోకలు చేస్తేనే ఇబ్బంది.

మరుసటి రోజు ట్రైన్ టైంకి ముందే అక్కడ ఉన్నాను. సరళ అత్తని పట్టుకోవడం పెద్ద కష్టం కాలేదు. ఆవిడ వెనకే సాయికృష్ణ కూడా ఉన్నాడు.

సాయికృష్ణ నాకన్నా రెండు సంవత్సరాలు చిన్న. కానీ అమ్మ చెంగుచాటున ఉండటం వల్ల, బొత్తిగా లోకం తెలీదు. అమాయకంగా చూస్తాడు. బట్టలు కూడా సరిగా వేసుకోవడం రాదు. ప్రతీదానికి "అమ్మ" అంటూ ఆమెనే అడుగుతాడు. వాడంత అమాయకంగా ఎలా వుంటాడో, నాకెంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థంకాదు.

మర్యాద పూర్వకంగా అత్తకి నమస్కారం పెట్టాను "ఏం అత్తా, ఏమిటి అంత సడెన్‌గా ప్రయాణం?" అడిగాను.

సరళ అత్త వాళ్ళ కూతురు గీత ఢిల్లీలో వుంటుంది క్రితం ఏడాదే దాని పెళ్ళయింది, బహుశా తన దగ్గరకు కాబోలు.

"గీతకు ఆరోగ్యం బాగుండటలేదటరా, ఒక్క వారం రమ్మని అడిగింది" అత్త చెప్పింది.

" ఒరే సాయి, నీ బాగ్ పుస్తకాల సంచీ ఏవీ?" కొడుకుని అడిగింది.

సాయి బుద్ధిగా తన బట్టల బాగ్, మరొక గుడ్డసంచి తీసి పట్టుకున్నాడు.

"నాన్నా మురళీ, చిన్న సాయం చేయరా. నేను హడావిడిగా ఢిల్లీ వెళ్ళాలి. మీ మావయ్య పొలం పనుల మీద ఆ ఊరు, ఈ ఊరు తిరుగుతున్నారు, విత్తానలని, మందులని, కూలీలని. సాయి ఒక్కడే అయిపోతాడు. అలా అని వాడిని నాతో తీసుకెళ్ళే వీలులేదు. ఈ వారం రోజులు సాయిని నీ దగ్గర వుంచుకో, నేను తిరిగి వచ్చినప్పుడు తీసుకెళతాను" చాలా మాములుగా చెప్పింది అత్త.

నా కాళ్ళ క్రింద భూమి కదిలినట్టు అయ్యింది. నెత్తిమీద పిడుగు పడ్డట్టయింది.

అయోమయంగా అత్తకేసి చూసాను.

ఆవిడ మాట్లాడిందా? నేను కలగన్నానా?

నేనేమిటి సాయిగాడిని నా దగ్గర వుంచుకోవడం ఏమిటి? వాడూ, నాలాంటి వాడే అయితే పరవాలేదు. కానీ వాడి పద్ధతే వేరు.

నోట మాట రాక అలాగే వుండిపోయాను. అంతలోనే అత్త ట్రైన్ ఎక్కి సర్దుకుంది. సాయి చాలా బుద్దిగా ఆవిడ సామాన్లు సర్దిపెట్టాడు. ఆవిడ సాయికి బోలెడు జాగ్రత్తలు చెప్పింది.

"మురళీ, జాగ్రత్త వాడసలే వెర్రిబాగులవాడు. వాడికి పుస్తకాలుంటే చాలు మరో లోకం తెలీదు. ఇట్టే మరలా వారానికి వచ్చేస్తా" కదులుతున్న ట్రైన్‌లోంచి అత్త చెపుతుంటే వింటూ నేను ఫ్లాట్ ఫాం మీదకి దుకాను.

సాయి ముందే దిగి బుద్దిగా తన బాగ్స్ రెండూ తీసుకుని నుంచున్నాడు.

గుండె మోకాళ్ళలోకి జారిన ఫీలింగ్‌తో, వాడిని తీసుకుని బయటకు నడిచాను.

బైక్ మీద బుద్దిగా కుర్చున్నాడు. ఇల్లు చేరేదాకా నా బుర్రలో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

ఇక్కడ నాది బేవార్సు లైఫ్, ఇష్టమొచ్చినపుడు లేస్తాను, ఇష్టమొచ్చినపుడు తింటాను, ఇష్టమొచ్చినపుడు ఇంటికి వస్తాను.

అయితే ఇవేవీ ఇంతకాలం బంధువులెవరికీ తెలీదు.

ఇప్పుడు ఈ సాయిగాడు గొప్ప డిటెక్టివ్‌లాగా కూపీలు లాగుతాడా? వీడితో నేనెలా గడపాలి? నాకేది దారి? గజిబిజి ఆలోచనలతో బైక్ స్టాండ్ వేసాను. సాయి తన బ్యాగ్‌లతో ఫ్లాట్ డోర్ ముందు నిల్చున్నాడు.

తలుపు తీసి వాడివైపు చూసి బలవంతంగా నవ్వాను. వాడేమీ జవాబివ్వకుండా లోపలికి నడిచాడు.

"నా రూం ఏది?" సూటిగా అడిగాడు.

మౌనంగా రెండో బెడ్‌రూం కేసి చూపాను.

గబగబా అందులోకి వెళ్ళిపోయి తలుపేసుకున్నాడు.

సోఫాలో కూలబడి కళ్ళు మూసుకున్నాను. ఇప్పుడేం దారి దేవుడా!

టైం చూసాను. సాయంత్రం 6.30. మరొక రెండు గంటల్లో నేను బయటపడాలి. కానీ సాయి సంగతి? వాడినేం చేయాలి?

సునీల్ నడిగితే ఏమన్నా సలహా ఇస్తాడేమో?

ఫోన్ చేతిలోకి తీసుకున్నాను. పది నెంబర్లలో నాలుగు నొక్కాను. అంతలోనే తలుపు తీసుకుని సాయి వచ్చాడు.

వచ్చింది సాయి అని నా మైండ్‌కి ఎక్కడానికి ఒక నాలుగైదు నిమిషాలు పట్టింది.

నెంబర్లు నొక్కుతున్న వేళ్ళు అలాగే ఆగిపోయాయి. నా ప్రమేయం లేకుండా నా క్రింది దవడ క్రిందికి వాలిపోయి నోరు తెరుచుకుంది.

సాయి పూర్తిగా మారిపోయాడు. గంటక్రితం వచ్చినప్పుడు ఉన్న లాల్చీ, పైజమా బదులు ఒంటిమీద బాగా చిరుగులు పట్టిన జీన్స్, పైన పెద్ద పెద్ద పూలున్న చాలా పల్చని చొక్కా అనాలో, లాల్చీ అనాలో తెలీని ఒక వస్త్రం.

ఆ చొక్కా ఎంత పల్చగా వుందంటే, దాంట్లోంచి వాడి ఒంటి రంగు, ఛాతీ మీది వెంట్రుకలు కూడా తెలుస్తున్నాయి.

ఇక జుత్తు స్పైక్స్ పెట్టాడు. ఒక చెవికి పెద్ద క్రాస్ హేంగింగ్ వెళ్ళాడుతోంది.

వాడు నడుస్తుంటే, వాడేనా తనతో స్టేషన్ నుండి వచ్చింది అన్న డౌటొచ్చింది.

"హే డూడ్, సిగరెట్ వుందా?" నా దగ్గర ఆగి చాలా స్టైల్‌గా అడిగాడు.

నా బుర్ర మరోసారి గిర్రుమంది. నా ప్రయత్నం లేకుండానే, నా చేయి సిగరెట్, అగ్గిపెట్టె అందించింది.

సిగరెట్ నోట్లో పెట్టి వెలిగించాడు. స్టైల్‌గా పొగ వూదబోయాడు, కానీ ఒక్కసారిగా ముక్కులో, కళ్ళలో దూరి దగ్గడం మొదలుపెట్టాడు.

నేను తేరుకుని లేచాను.

"సాయి ఏమిటిది?" అయోమయంగా అడిగాను.

"బావా, మరీ అమాయకంగా మాట్లాడకు, ఆ ఊర్లో అమ్మ చాటున వుండి నేనెంత వెర్రెత్తిపోతున్నానో నీకేం తెలుసు? ఎంతసేపూ పొలాలు, పశువులు, మందులు అంటూ నన్ను చంపేస్తున్నారు. బావా, ఈ అవకాశం కోసం నేనెంత ఎదురుచూసానో నీకు తెలీదు. ఎపుడెపుడు ఆ జైలు నుండి బయటపడాలా అని ఇన్నాళ్ళూ ఎదురుచూసాను. బావా, ఈ వారం రోజులు నేనేం చేసినా నన్నేం అడగొద్దు. ప్లీజ్, నిన్ను బ్రతిమలాడుతున్నాను. నాకోసం చూడకుండా, నువ్వు భోజనం చేసి పడుకో."

నాకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సుడిగాలిలా బయటికెళ్ళిపోయాడు సాయి.

ఏం జరిగిందో తెలియడానికి పావుగంట పైనే పట్టింది.

అంత అమాయకంగా, అమ్మ కూచిలా వుండే సాయిగాడి బుర్రలో ఇన్ని ఆలోచనలున్నాయని కలలో కూడా వూహించలేదు.

సాయిగాడి షాక్ నుండి తేరుకుని, ఫ్రెష్ అయి బయటపడ్డాను. పబ్‌లో సునీల్ కలిస్తే సంగతి చెప్పాను. వాడో జోక్‌లా ఫీలయ్యాడు. అరగంట నవ్వాడు.

సరిగా అర్థం చేసుకోని ఫ్రెండును ఎంచుకున్నందుకు నన్ను నేనే తిట్టుకున్నాను.

రాత్రి నా మామూలు టైం ఒంటిగంటకు నేను ఇల్లు చేరానుగానీ, సాయి ఇంకా రాలేదు. తాళం వేస్తే వాడికి ఇబ్బందని తలుపు దగ్గరగా వేసి సోఫాలో ఉన్నాను. సాయి వచ్చేసరికి తెలతెలగా తెలవారుతోంది.

ఇక సాయిగాడి అవతారం చూసి తీరాల్సిందే బుగ్గల నిండా లిప్‌స్టిక్ ముద్రలు. ఫుల్‌గా తాగేసినట్టున్నాడు. తూలిపోతున్నాడు. పూల చొక్కామీద అక్కడక్కడా చిల్లులు, బహుశా సిగిరెట్ పడి అనుకుంటా.

సోఫాలో ఉన్న నన్ను గమనించకుండానే లోపలికెళ్ళి మంచానికి అడ్డం పడ్డాడు.

ఈ వ్యవహారం వాడికి క్రొత్త, ఏమన్నా గడబిడ అవుతుందేమోనని నేను ఎటూ వెళ్ళకుండా ఇంట్లోనే ఆగిపోయాను.

తీరిగ్గా సోఫాలో వాలి టీవి చూస్తూ జరిగిన విషయాలు ఆలోచిస్తుంటే ఫక్కున నవ్వొచ్చింది. సరళ అత్త, సాయిగాడు, భలే కారెక్టర్స్. ఒక పదినిమిషాలు పడిపడి నవ్వాను. తరువాత చిన్నగా నన్ను నేను కంట్రోల్ చేసుకున్నాను.

ఇపుడు సాయి లేస్తే ముందు హేంగోవర్‌కి మందు ఇచ్చి, తినడానికి ఏమన్నా ఇవ్వాలి. లేకపోతే ప్రమాదం. హడావిడిగా లేచి ఫ్రిజ్‌లో సోడా ఉందో లేదో చెక్ చేసాను.

బ్రెడ్, గుడ్లు కూడా వున్నాయి. కాబట్టి వాడికి బ్రెడ్ ఆమ్లెట్ వేసేయచ్చు.

ఒకసారి వాడి రూంలోకి తొంగి చూసాను.

అపుడే కదులుతున్నాడు.

"సాయి" చిన్నగా పిలిచాను ఈ టైంలో ఏ మాత్రం గట్టిగా మాట్లాడిన వాడికది బాంబులు పేలినట్లు వుంటుందని, నాకు స్వీయానుభవం వల్ల తెలుసు.

"ఊ" అంటూ మూలిగాడు.

గబగబా సోడాలో డిస్ప్రిన్ వేసి వాడి దగ్గరకు తీసుకెళ్ళాను.

"సాయి" మరల పిలిచాను.

"బావా, నేను చచ్చిపోతున్నాను" గొణిగినట్లు అన్నాడు వాడు.

నా చేతిలో గ్లాసు జారిపడిపోయింది. గభాల్న తేరుకుని, గ్లాసు ప్రక్కన పెట్టాను. నాలో ఏవో భయాలు. వీడేమన్నా విషం తాగేసి సూసైడ్‌లాంటి ప్రయత్నం చేసాడా? కాళ్ళూ చేతులు చల్లబడ్డాయి నాకు.

"సాయి, సాయి, ఇటు చూడు" కంగారుగా పిలుస్తూ బుగ్గమీద తట్టాను.

"బావా" పీలగొంతుతో అరిచినట్లు చేసాడు.

"అలా అరవకు బావా, తల బద్దలవుతోంది. నాకు తలలో ఏదో అయింది. ఇపుడో, మరో నిమిషంలోనో చస్తాను" అదే పీలగొంతుతో రహస్యం చెబుతున్నట్లు అన్నాడు.

హమ్మయ్య హేంగోవర్ అన్నమాట.

"ఏం కాదులే, ఈ మందు తాగు" అంటూ బలవంతంగా లేపి సోడా తాగించాను కళ్ళు తెరవకుండా, తల కదపకుండా త్రాగాడువాడు.

నిన్న మధ్యాహ్నం చూసిన సాయికి, ఈ సాయికి అసలు పోలికే లేదు, తోటకూర కాడలా వాలిపోతున్నాడు.

ఒక ఇరవై నిమిషాలు ఓపిగ్గా, పక్కనే కూర్చున్నాను. అనుకున్నట్లే సాయిలో మార్పు వచ్చింది. ఇందాకంత భయంలేదు కానీ, కొంచెం బెదురు చూపుల్తో నాకేసి చూసాడు.

"కంగారు లేదు, రాత్రి తాగిన విస్కీల ప్రభావం" నేను చిన్నగా చెప్పాను.

అవునా, కాదన్నట్లు ఏదో రీతిగా బుర్రూపాడు వాడు.

వాడిని అలాగే వుండమని చెప్పి, వంట గదిలోకి నడిచాను. గబగబా ఉల్లిపాయలు, పచ్చిమిర్చి తరిగి దట్టంగా కారం వేసి, దట్టంగా ఆమ్లెట్ బ్రెడ్ కాల్చాను. అవన్నీ ప్లేటులో పెట్టుకుని వచ్చేసరికి సాయి సిట్టింగ్ పొజిషన్‌లో వున్నాడు.

"సారీ బావా! ఒక్కసారి స్వేచ్ఛగా అనిపిస్తే కంట్రోల్ చేసుకోలేకపోయాను" సన్నని గొంతుతో అన్నాడు.

"ఫరవాలేదు, ఇదిగో ఇది తిను. అంతా సర్దుకుంటుంది. బహుశా రాత్రి ఏమీ తిని వుండవు" అడిగాను అనడం కంటే, నేనే స్టేట్‌మెంట్ ఇచ్చాను అనడం బాగుంటుంది.

అటూ యిటూ కాకుండా మరలా తలుపాడు. మళ్ళీ ధైర్యం చెప్పి బయటికి వచ్చాను. దెబ్బతో వీడికి రోగం కుదిరి, బుద్ధిగా కూర్చుంటాడులే యింట్లోనే అని తేలిగ్గా ఫీల్ అయ్యాను.

కానీ, నా అంచనా తప్పయింది. సాయంత్రానికి బాగా తేరుకొన్న సాయి, ముందు రోజులాగానే హుషారుగా తయారైపోయాడు.

నేను నోరు తెరిచి చూస్తుండగా బయట బైక్ ఆగిన చప్పుడు, ఆ వెంటనే సునీల్ ఎంట్రీ ఇచ్చాడు.

"ఏరా, ఏం సంగతి? ఏమంటున్నాడు మీ సాయి?" కళ్ళెగరేస్తూ అన్నాడు.

ఆ తరువాత గంటదాకా, నేను చెప్పేదానికి నవ్వలేక, సోఫాలోంచి క్రిందపడి, గిలగిలా కొట్టుకుంటూ అవస్థపడ్డాడు సునీల్.

నాకు నవ్వాలో, ఏడ్వాలో తెలీని పరిస్థితి.

"బలే వుందిరా! మంచి టైం పాస్ అయితే నీకు" నెమ్మదిగా సోఫా మీద సర్దుకుని కూర్చుంటూ, కళ్ళవెంట కారిన నీళ్ళు తుడుచుకుంటూ సునీల్ అంటుంటే, వాడి మీద పడి పీక పిసికెయ్యాలనిపించింది.

కళ్ళముందు వలయాల్లాగా తిరుగుతూ, సరళత్త వస్తే నా భవిష్యత్తు ఎలా వుంటుందో సినీస్కోప్‌లో కనిపిస్తుంటే, నాకు అరికాలి మంట నెత్తికెక్కింది.

నా కోపం గమనించినట్లు, బలవంతంగా నవ్వు తుడిచేసుకుని, సీరియస్ ముఖం పెట్టాడు సునీల్. "ఇప్పుడు ఎక్కడికెళ్ళి వుంటాడు?" అడిగాడు.

ఉదయం నుండి సాయి మాటల ద్వారా వాడు క్లౌడ్ నైన్ పబ్‌లో వున్నట్లు అర్ధమయ్యింది. కాబట్టి, ఇప్పుడు కూడా అక్కడే వుంటాడనిపించి అదే చెప్పాను.

"అయితే వెళ్దాం రా" అంటూ లేచాడు సునీల్.

"ఎక్కడికి?" అయోమయంగా అడిగాను. సాయిగాడి షాక్‌తో నా బుర్రలో చురుకుదనం పోయింది.

"క్లౌడ్ నైన్ పబ్‌కి అక్కడే మనం కూడా వుంటే వాడిని కంట్రోల్ చేయొచ్చు" అంటూ సునీల్ బయటకు నడిచాడు.

వాడు చెప్పింది రైట్ అయినా, సునీల్‌గాడు సాయిగాడి ద్వారా ఎంటర్‌టైన్‌మెంట్ పొందటానికి ప్లాన్ వేస్తున్నాడనిపించింది. అయినా చేసేది లేక వాడితో బయల్దేరాను.

అనుకున్నట్లే క్లౌడ్ నైన్ పబ్‌లో ఒక చోట కాదు, అంతా తానే అయి తిరుగుతున్నాడు సాయి. ఒక అరడజను మంది ఆల్ట్రామోడర్న్ అమ్మాయిలు. వాడిలో వాళ్ళకేం నచ్చిందో నాకేమాత్రం అర్థం కాలేదు.

నేను, సునీల్ మూలగా వున్న టేబుల్ దగ్గర సెటిల్ అయి వాడిని గమనించసాగాం.

అన్నమాట ప్రకారం సాయి ఎక్కువగా త్రాగటం లేదు అయినా వాడి ప్రవర్తనలో తేడా అనిపిస్తుంది. కారణం ఏమిటి?

పరిశీలనగా చూస్తున్న నాకు వాడి చేతిలో టెస్ట్ ట్యూబ్ కనిపించింది. గుండెఝల్లుమంది. మామూలు విస్కీ, బ్రాందీలకన్నా ప్రమాదకరమైన డ్రింక్ అది. మత్తు మందులు మిక్స్ చేస్తారు ఆ విషయం వాడికి తెలియదా? తెలిసే తాగుతున్నాడా? అయ్యో దేవుడా? నాకేంటి ఈ పరీక్ష.

కొంతసేపటికి సాయి అండ్ కో అక్కడినుండి మాయమయ్యారు. నేను, సునీల్ ఏదో మాట్లాడుతూ దృష్టి మరల్చి మరల చూసే టైంకి వాడక్కడ లేడు. హడావిడిగా అంతా వెతికాను, జాడలేదు.

సునీల్‌ని లేపి ఇద్దరం బయటకు పరుగెత్తాం, బయట కూడా లేడు. చేసేది లేక ఇల్లు చేరి, ఎదురుచూడసాగాం. మరలా తెల్లవారుతుండగా వచ్చాడు.

ముందు రాత్రి పరిస్థితే. నేనెవరో, వాడెవరో తెలియకుండా వున్నాడు.

ఇదే విధంగా నాలుగు రోజులు గడిచాయి. నాకా రాత్రులు నిద్రలేక, పగలు వాడి సేవలతో గడ్డం పెరిగి జబ్బుపడ్డవాడిలా అయిపోయాను. ఇంతలో సరళత్త వచ్చేస్తుందని మరో దిగులు.

ఆవిడ వచ్చేసరికి వీడు కుదురుకుంటాడా? లేక, వాడిలా తయారవ్వడానికి నేనే కారణం అని ఆవిడచేత తిట్లు తింటాడా? దేవుడా! ఏది దారి? తలపట్టుకున్నాను.

ఈ నాలుగురోజులు సునీల్ గాడు నా దగ్గరే గడుపుతున్నాడు. వాడి లైఫ్‌లో ఇంత ఎంజాయిమెంట్ ఎప్పుడూ చూడలేదన్నట్లు, వాడి కళ్ళు సాయికి అంటించేసాడు.

సునీల్‌గాడి వ్యవహారంతో మరోప్రక్క నాకు కాలుతోంది. వెధవ, ఫ్రెండయి వుండి నాకేమీ సలహా ఇవ్వకపోగా ఎంజాయ్ చేస్తున్నాడని.

మరో రెండు రోజుల్లో సరళత్త దిగుతుంది. ఏం చేయాలి? సాయిగాడి వాలకం చూస్తుంటే అసలు అమ్మ, నాన్న, ఇల్లు ఏమి గుర్తున్నట్లు లేవు.

ఆ వేళ కూడా క్లౌడ్ నైన్ పబ్‌లో వున్నాం. నేను మాత్రం పాతాళంలో వున్నట్లు ఫీల్ అవుతున్నాను.

ఎప్పుడూ త్రాగే కింగ్ ఫిషర్ బీర్ కూడా రుచించలేదు. డైట్ కోక్ సిప్ చేస్తూ నిరాసక్తంగా చూస్తున్న నాకు, బార్ అటెండర్‌తో మాట్లాడుతున్న సునీల్ కనిపించాడు. తల తిప్పుకున్నాను. వీడసలు నా ఫ్రెండ్ కాదు, లేకపోతే ఇంత జరుగుతున్నా తనకి పట్టనట్లు వుంటాడా?

కెవ్వున అమ్మాయి అరుపు, ఆ వెంటనే పబ్‌లో నిశ్శబ్దం, ఉలిక్కిపడి ఆలోచనల నుండి తేరుకున్నాను.

డాన్స్ ఫ్లోర్ మీదున్న జంటలన్నీ ఆగిపోయాయి. సాయివైపు చూస్తున్నాయి.

"యూ, ఈడియట్" అంటూ సాయితో వున్న అమ్మాయి చెంప ఛెళ్ళుమనిపించింది.

వెంటనే నలుగురైదుగురు వాళ్ళని చుట్టుముట్టారు. నేను హడావిడిగా లేవబోతుంటే, సునీల్ చేయి పట్టి ఆపాడు. ఇంతలోనే పబ్ తాలూకు వస్తాదుల్లాంటి యిద్దరు వ్యక్తులు వచ్చి ఆ అమ్మాయితో మాట్లాడారు. ఆ అమ్మాయి సాయికేసి చేయి చూపిస్తూ ఏదో అంటోంది.

మరోమాట లేకుండా, వాళ్ళిద్దరూ సాయిని చేతులమీద లేపి, బయటకు తీసుకుపోయారు. వెనకే పరుగెత్తబోయిన నన్ను సునీల్ బలవంతంగా ఆపాడు. నాకేం అర్థం కావట్లేదు.

పది నిమిషాల తర్వాత సునీల్‌ని విదిలించుకుని బయటకు పరిగెత్తాను. వస్తాదులిద్దరూ కోట్లు దులుపుకుంటూ లోపలికి వస్తున్నారు.

మెట్ల క్రింద మూటలా పడివున్నాడు సాయి.

పరుగున వెళ్ళి వాడిని లేపాను. ముఖం అంతా కమిలిపోయింది. పెదవి చిట్లి రక్తం కారుతోంది. "అమ్మా" అంటూ మూలుగుతున్నాడు.

మరేం మాట్లాడకుండా పైకి లేపాను అంతలోనే సునీల్ వచ్చి చేయి అందించాడు. నన్ను ఆపి తప్పు చేసాడని సునీల్ మీద కోపంగా వుంది గానీ, ఇపుడు ఒక్కడ్నే సాయిని ఇంటికి చేర్చలేను కదా!

ఇల్లు చేరాక సునీల్ గబగబా తడిగుడ్డ తెచ్చి సాయి ముఖం తుడిచి, రక్తం అద్దాడు. నేను వేడివేడిగా కాఫీ కలిపి ఇచ్చాను. అంతవరకు ఎక్కడా పెద్ద గాయాలు అవ్వలేదు, అన్నీ కవుకు దెబ్బలే.

నెమ్మదిగా తేరుకున్నాడు సాయి.

"నేనేం చెయ్యలేదు బావా" మూలిగినట్లు అన్నాడు.

"మరేం జరిగిది?" కటువుగా అడిగాను సాయిని.

ఆ అమ్మాయి వేలు చూపించి వీడిని ఏదో అనడం ఇంకా గుర్తుంది నాకు.

"నిజంగానే నేనేం చెయ్యలేదు బావా! ఆ అమ్మాయి నేను తనని షిర మీద గిల్లానని చెప్పింది" కళ్ళు దించుకుని అవమానంగా అన్నాడు సాయి.

అదిరిపడి చూసాను "నిజం బావా, నేను గిలల్లేదు. నన్ను నమ్ము" ప్రాధేయపడ్తూ అన్నాడు.

నాకు నమ్మకం కలగలేదు. వీడు తాగిన మత్తులో ఏదో చేసే వుంటాడు. లేకపోతే ఆ అమ్మాయి ఎందుకలా అంటుంది.

"నిజం బావా! నేను నిజంగానే గిల్లలేదు" నా ముఖంలో అపనమ్మకం చూసి ప్రాధేయపడ్డాడు.

"పడుకో" మరో మాటకు అవకాశం ఇవ్వకుండా బయటకు వచ్చాను. నా వెనుకే సునీల్.

ఇంతసేపు సునీల్ ఏమీ మాట్లాడలేదు.

ఇద్దరం సోఫాలో కూలబడ్డాం. తల వెనక్కి వాల్చి గట్టిగా నిట్టూర్చాను. ఈ అయిదురోజుల్లో నా బ్రతుకు ఇలా మలుపు తిరుగుతుందని నేనేనాడు కలగన లేదు.

"అంత ఫీలవ్వకురా, ఆ అమ్మాయిని వాడు గిల్లలేదు" సునీల్ చిన్నగా అన్నాడు.

ఉలిక్కిపడి వాడికేసి చూసాను.

నాకేసి ప్రాధేయపడుతున్నట్లు చూసాడు సునీల్ 'అవును రా, సాయి ఆ పిల్లని ఏమీ చెయ్యలేదు' మరలా చెప్పాడు.

'అదీ, అదీ' నసుగుతున్నాడు సునీల్

'చెప్పు' గట్టిగా అరిచాను.

'ష్, అరవకు' కంగారుగా సాయి గదికేసి చూసి అన్నాడు సునీల్.

'నేనే బార్ అటెండర్‌కి రూ.500లు ఇచ్చి, సాయితో వున్న పిల్లని అలా చెప్పమని చెప్పాను' సునీల్ అంటుంటే, ఆశ్చర్యంతో మతిపోయింది నాకు.

'అలా చూడకురా! ఆ ఐదురోజులుగా నువ్వెంత నలిగిపోతున్నావో చూస్తున్నాను కదా! ఇంక నీ వల్ల కాదని గ్రహించి, సాయిగాడి లీలలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని, నేనే అలా చేయించాను' క్షమాపణ కోరుతున్నట్లు చూస్తూ సునీల్ అంటుంటే, వాడిపట్ల కృతజ్ఞతతో నా గుండె పొంగిపోయింది.

రెండు రోజుల తరువాత సరళత్త వచ్చినపుడు సాయిని జాగ్రత్తగా అప్ప చెప్పి, ఊపిరి తీసుకున్నాను.

# విమానం

పి.వి.శేషారత్నం

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2015)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**'ఇవాళ శంకరమఠంలో** కాశీనుంచి వచ్చిన స్వామిజీ అద్భుతమైన ప్రవచనం వుంది. రండి సుబ్రమణ్యంగారూ!' అంటూ పార్కులో ఇటీవలే పరిచయమైన నా వయసువాడే అయిన శంకర్రావుగారు బలవంతాన లాక్కుపోతే కాదనలేకపోయాను. శంకర్రావుగారు చెప్పింది నిజమే. స్వామిజీ ప్రవచనాన్ని శ్రోతలు నాగస్వరానికి బద్ధులైన నాగుపాముల్లా తలలుపుతూ వింటున్నారు.

'మనిషి మనసు అనే పక్షికి రాగ ద్వేషాలు రెండు రెక్కలు. వాటి సాయంతో అది యదేచ్ఛగా విహరిస్తుంటుంది. మమకారం, అహంకారం, అభిమానం, దురభిమానం, అతిశయంలాంటివన్నీ 'రాగం' అనే రెక్కలోని ఈకలు. ఈర్ష్య, అసూయ, ప్రతీకారం, పగ, కోపం, మూర్ఖత్వం లాంటివి 'ద్వేషం' అనే రెక్కలోని ఈకలు. రాగద్వేషాలకు తల్లిదండ్రులు వ్యసనాలు. కోరికల్లోంచి పుట్టిన కామజాలకు

రాగం పుట్టిల్లయితే, క్రోధజాలకు ద్వేషం పుట్టిల్లు. రాగద్వేషాలు బలపడితే మనసు గతి తప్పుతుంది.' అంటూ దుర్యోధనుడు, ధర్మరాజు, ధృతరాష్ట్రుడు వంటివారు వేటి కారణంగా ఏ విధంగా పతనమయ్యారో సోదాహరణంగా వివరిస్తున్నారు స్వామీజీ. నా చెవులు వింటున్నాయేగానీ మనసంతా ఇంటిదగ్గరే వుంది. కారణం నా కూతురు సుమ ఇంటికి రావడానికి ఆలస్యమవుతుందని పొద్దున్న వెళ్ళేటపుడే చెప్పింది. ఇంటిదగ్గర నా భార్య నాగమణి ఒక్కతే వుంది.

మా నాగమణి గురించి నేను ఆందోళన పడేందుకు తన అనారోగ్యంతోబాటు మరోకారణముంది. అది వుట్టి వెర్రి బాగుల్ది. అమెరికా అవకాశం రాగానే ఆరేళ్ళ క్రితమే రెక్కలు కట్టుకుని వెళ్ళిపోయిన కొడుకు తిరిగివచ్చి తనను ఏ క్షణాన అయినా విమానమెక్కిస్తాడని ఇప్పటికీ ఆశపడుతూనే వుంటుంది.

అందుకే విమానం శబ్దం వినిపిస్తే చాలు బయటకు వచ్చి ఆకాశంలోకి చూస్తూవుంటుంది. చుట్టుపక్కల చూసుకోదు. ఓసారి ఇలాగే రోడ్డుమీదకి వచ్చి మరీ మెడ సాగదీసుకుని విమానం కనుమరుగయ్యేదాకా చూస్తూండేసరికి రోడ్డుమీదపోతున్న కారువాడు సడన్ బ్రేకు వేసాడు కనుక సరిపోయిందికానీ లేకపోతే దాని ప్రాణాలు అప్పుడే గాలిలో కలిసిపోయి వుండేవి.

అసలు మాది శుద్ధ పల్లెటూరు. నాకు ఒక కొడుకు, కూతురు. వాళ్ళు రాఘవ, సుమ.

ఏదో పాతకాలం పెంకుటింటిలోనే తలదాచుకుని గుట్టుగా బ్రతుకుతుండేవాళ్ళం. ఎలిమెంటరీ స్కూల్లో బడిపంతులు ఉద్యోగం చేసుకుంటూనే తాతలనాటి ఎకరం పొలాన్ని సాగుచేసుకుంటూ మా నాగమణి పొదుపు సంసారంతో పిల్లల్ని చదివించాను. మునుముందు కొడుకు ఉద్ధరిస్తాడనే ఆశతో అందరి తండ్రుల్లాగే నేనూ పొలాన్ని అమ్ముకోవలసి వచ్చినా అంత బాధపడలేదు.

కానీ ఉన్నత చదువుల మీది ఆశతో రాఘవ అమెరికా వెళ్ళాడు. వెళ్ళిన కొత్తలో ఒకటి రెండేళ్ళు ఒకటీ అరా ఉత్తరాలు రాసేవాడు అప్పుడప్పుడూ ఫోన్ చేసేవాడు. తర్వాత క్రమంగా అవి తగ్గిపోయాయి.

'వెర్రినాగన్న అక్కడ డబ్బు చాలక వాడెన్ని అవస్థలు పడుతున్నాడోనండీ!'

నాకు వళ్ళు మండి రాఘవను ఏమన్నా అంటే నాగమణి ఊరుకునేదికాదు. 'పోనీ ఆ విషయమైనా రాసి అఘోరించవచ్చుగా.'

'ఆ.. ఇక్కడలాగా అర్ధరూపాయి కార్డుముక్కలనుకున్నారేంటి? అమెరికా ఉత్తరమంటే ఎంత ఖర్చో మీకేం తెలుసు. మునసబుగారి కోడలు చెప్పిందండీ. వాళ్ళన్నయ్య అక్కడే వుంటున్నాడుగా.'

'చాలు చాల్లే బాగానే వెనకేస్తుకొస్తున్నావు. వాడక్కడ ఎలా వున్నాడోనని నాకు మాత్రం వుండదా? కానీ బొత్తిగా కబురూ కాకరకాయా లేకపోతే ఎలాగా అని..'

'చూస్తూ వుండండి. చెప్పా పెట్టకుండా ఓ రోజు వచ్చేసి అమ్మా! నువ్వు చిన్నప్పుడు గోరుముద్దలు తినిపిస్తూ ఆకాశంలో చూపించిన విమానం ఎక్కించడానికి వచ్చానమ్మా అంటాడు నా కొడుకు.'

'అంటే నన్నొదిలేసి నువ్వొక్కదానివే విమానం ఎక్కేస్తానంటావు? ఎంత స్వార్థమే నాగమణీ' అలా మా సంభాషణ సరదాగా మారిపోయేది.

'అంతేకదా మరి. వాడికి చిన్నప్పుడు ఎంత పేచీ పెట్టినా ఒక్క విమానం బొమ్మయినా కొనిచ్చారు కాదాయె. మిమ్మల్నెలా గుర్తుపెట్టుకుంటాడు. పిచ్చి సన్నాసికి విమానమంటే ఎంత ప్రాణమో. 'అమ్మా ఇప్పుడు నాకు విమానం కొంటే పెద్దయ్యాక నేనూ నిన్ను విమానం ఎక్కిస్తాను చూడు' అనేవాడు కాదూ!'

మూడేళ్ళ క్రితం అనుకుంటాను హడావుడి పడిపోతూ రాఘవ సడన్‌గా వచ్చేసరికి మమ్మల్ని అమెరికా తీసుకెళ్ళడానికే వచ్చాడనుకుని నాగమణి సంబరపడిపోయింది. ఊరూ వాడా టాంటాం వేసింది కూడా. కానీ వచ్చిన మర్నాడే మాటల్లో అసలు విషయం తెలిసింది.

'నాన్నా! చెల్లాయికి యం.బి.బి.యస్ చదివేందుకు పట్నంలో సీటొచ్చిందంటున్నారు. మీరుకూడా రిటైరయిపోయారు కదా! ఇంక ఈ వూళ్ళో వుండాల్సిన అవసరమేముంది? అందుకే ఇల్లు అమ్మేసి సుమ దగ్గరే తనతో వుంటే దానికి తోడున్నట్టూ వుంటుంది. నాక్కూడా రావడానికి పోవడానికీ ఈజీగా వుంటుంది.

'ఉన్న ఊరు వదులుకుని ఆ పట్నంలో మాకేం తోస్తుంది రాఘువా?' తెల్లబోయి అన్న నా మాటను ఖండిస్తూ నాగమణి కస్సుమంది.

'అదేం మాటా? ఎల్లకాలం ఇక్కడే వుండిపోదామనా? ఇవాళ కాకపోతే రేపయినా ఈ వూరు వదలాల్సిందేగా!' తనను ఇప్పటికిప్పుడు అమెరికా తీసికెళ్ళడం లేదని నాగమణికి అర్థమయినా కొడుకును పన్నెత్తు మాట అననివ్వని గాంభీర్యం నాకుగాక ఎవరికి తెలుస్తుందని?'

'కాని...?'

'మీరింకేం చెప్పకండి నాన్నా! ఈ వూళ్ళో పంచదార ఫాక్టరీ రాబోతోందని  మన ఇంటికి బాగా రేటు వస్తుందని మునసబుగారి కొడుకు చెప్పాడు. అక్కడ నాకేదయినా ఉద్యోగం దొరికేదాకా ఆ డబ్బు నా అవసరమూ తీరుస్తుంది. మీకూ కొంతకాలం పట్నంలో నిలదొక్కుకునేందుకూ సరిపోతుంది.' తన వాటా సొమ్ము కావాల్సిందే అని నోటితో అనకుండా ఎంత గడుసుగా చెప్పాడు రాఘువ?

'అంటే రాఘువా? ఇంకా నీకు ఉద్యోగం దొరకలేద్రటా?' నాగమణి కంఠంలో చిన్న నిరాశ.

'ఏదమ్మా ఇప్పుడేగా చదువయింది. దొరుకుతుందమ్మా! అక్కడా మన ఇండియన్స్ ఎక్కువయిపోయారు కదా అందుకే కొంచెం కష్టంగా వుంది. నాకు ఉద్యోగం రాగానే టిక్కెట్టు కొని పోస్టులో పంపించి మా బంగారు అమ్మని అమెరికా విమానం ఎక్కించనా?' మా సుమ హౌస్ సర్జన్సీకి వచ్చేసింది గాని రాఘువ నుంచి నాగమణిని విమానం ఎక్కించే ప్రపోజల్‌తో ఏకబురూ లేదు. మగవాడిని కనుక నేనయితే గుండె రాయి చేసుకున్నానుగాని నాగమణి మాత్రం విమానం శబ్దం వినబడినపుడల్లా అది అమెరికా విమానమేమో, కొడుకు అందులోంచి దిగుతాడేమోనని ఎదురు చూస్తూనే వుంది. అదీకాక ఈమధ్య నాగమణికి మతిమరుపుకూడా ఎక్కువయింది. పొయ్యిమీది పాలు పెట్టి మర్చిపోయి అది కాటుబోయేదాకా చూసుకోవడం లేదు.

'నాన్నా! అన్ని ఎలా మర్చిపోతోందో చూడు. అమ్మకి అల్జిమీర్సేమోననిపిస్తోంది. కొంతమందికి ఈ కాలంలో ఒత్తిడివల్ల అరవైదాటకుండానే అల్జిమీర్స్ వస్తోందని మా ప్రొఫెసర్ చెబుతుంటారు.'

'అంటే పెద్ద ప్రమాదమేమీ కాదుకదా!'

సుమ నవ్వేసింది. 'నువ్వు అమ్మని పదేపదే విసుక్కోకూడదని చెబుతున్నానుగాని పరవాలేదులే నాన్నా'

సుమని చూస్తే ఒక్కోసారి నాకెంతో ఆశ్చర్యం కలుగుతుంటుంది. చిన్నప్పుడు బాత్‌రూంకి వెళ్ళాలన్నా తల్లిని భయంతో సాయం తీసికెళ్ళే పిరికి పిరికిగా వుండే పిల్లేనా పట్నం వచ్చి ఇంత ధైర్యస్తురాలయింది. ఒక్కతీ అన్ని పనులు చురుగ్గా ఎలా నిర్వహించేస్తోందో ఆడపిల్లలు ఎంత త్వరగా బాధ్యతగా ఎదిగిపోతారో? సుమకి పెళ్ళి వయసు కూడా వచ్చేసింది కదా! చదువుకూడా అయిపోయినట్టే. ఈ రెండు నెలలు పోతే ఎక్కడో పోస్టింగు కూడా వచ్చేస్తుంది.

అదేమాట అంటే నవ్వుతూ 'తొందరేముంది నాన్నా! మిమ్మల్ని నా దగ్గర వుంచుకోవడానికి ఇష్టపడే మనిషి దొరకాలికదా!' అంది.

'అయినా మా ఇద్దరికీ భయమేముందీ? పెళ్ళయినా నువ్వు వచ్చి చూసి వెళ్తూండవచ్చు.'

అప్పటికింక సంభాషణ పొడిగించకపోయినా ఓ నెల తర్వాత తన మనసులో మాట బయట పెట్టింది సుమ.

'నాన్నా నేను ఇష్టపడుతున్న వ్యక్తి ఒకరున్నారు. ఈ మధ్యనే పరిచయయింది.'

'అంటే మన' కులం గురించి అడుగుతున్నానని సుమ అర్థం చేసుకుంది.

'కులం తెలియదు గానీ చాలా మంచివారు. అతనికి ముందూ వెనుకా ఎవరూ లేరు'

'సుమా!' నా కంఠంలో అంత కోపం దాగుందని నాకే తెలియలేదు నాగమణి వంటింట్లోంచి పరిగెత్తుకు వచ్చేదాకా.

'అబ్బా గుండెలదిరిపోయాయి. ఏమయిందండీ అంత కేక పెట్టారు?'

'ఏం లేదమ్మా నువ్వేం గాభరా పడకు. నేను అన్నం తినకుండా వెళ్తానన్నానని నాన్న కోపం ప్రకటిస్తున్నారు. అంతే కదా నాన్నా!'

సుమ హెచ్చరిక అర్థమైంది నాకు. ఈ మధ్య నాగమణికి బిపి కూడా ఎక్కువైంది.

'అయ్యో పిచ్చిదానా? అన్నం తినకుండా వెళ్తే ఎలాగే? బయటకు వెళ్ళావంటే ఆ పేషంట్లతో నీకు టైమే తెలియదాయె. కూరకూడా అయిపోయింది. తినేసి వెళ్ళు. వచ్చేసరికి ఎంత ఆలస్యమయినా మాకు బాధ వుండదు.' తలూపి సుమ లోపలికి వెళ్ళిపోయింది.

ఇదివరకు మగపిల్లలకి కూడా పెళ్ళిచూపులకు వెళ్ళొచ్చి పెద్దవాళ్ళముందు మనసులో మాట బయట పెట్టేందుకే ధైర్యముండేదికాదు. అలాంటిది నిర్ణయాలు చేసుకునేంతగా ఎదిగిపోయారు ఈ కాలం ఆడపిల్లలు. ప్రేమ మోజులో కులం, గోత్రం, వంశం ఏమీ పట్టించుకోరు. మళ్ళీ సంసారంలో కాస్తంత తేడా వచ్చినా ఎవరినీ సంప్రదించకుండానే విడాకుల దాకా వెళ్ళిపోతున్నారు. ఎంత ఫాస్ట్ అయిపోయారు? మరికొందరయితే పెళ్ళికూడా చేసేసుకున్నాకే ఇంట్లో చెబుతున్నారు. అదేం చిత్రమోగాని పక్షిరెక్కల్లాంటి వీళ్ళ రాగద్వేషాలు క్షణకాలంలో అటూ ఇటూగా మారిపోతాయి.

కానీ సుమ విషయంలో నాకా భయంలేదు. తల్లిదండ్రుల ఇష్టాయిష్టాలకు ప్రాధాన్యం ఇస్తుంది. నాకిష్టం లేని పని ఒక్కనాటికి చెయ్యదు.

ప్రవచనం పూర్తయి ఇంటికెళ్ళేసరికి నాగమణి మొహం దేదీప్యమానంగా వెలిగిపోతోంది. చేతిలో పెద్ద విమానం బొమ్మ వుంది. నా మనసు కూడా ఒక్క క్షణం ఆనందంతో నిండిపోయింది. రాఘవ గానీ వచ్చాడా?

ఎంతకాలమయిందో వాడిని చూసి. ఇండియా రావడంలేదని కనీసం తల్లితోనయినా ఓ ఫోన్ చేసి మాట్లాడడని వాడంటే ఎంతకోపం ప్రకటిస్తున్నా వాడు నా రక్తం పంచుకుని పుట్టిన కొడుకే కదా! పిల్లలు తప్పులు చేస్తే తల్లిదండ్రులు క్షమించకపోతే ఎవరు క్షమిస్తారు?

కానీ నాగమణి సమాధానం విని నా ఆశ ఆవిరయిపోయిది.

'మన రాఘవ పంపించాడని తెచ్చి అబ్బాయి స్నేహితుడు ఇచ్చాడండీ. పేరు అదేదో శివనో లేక కృష్ణనో చెప్పాడు. మీరు వచ్చేదాకా వుంటానని పాపం చాలాసేపే ఎదురు చూసాడు గానీ ఎక్కడకు వెళ్ళారు ఇంతసేపయిందేం?' నాగమణి ప్రశ్నల పరంపర మొదలయింది. నా మనసు మాత్రం రాఘవ రాకపోయినా కనీసం గుర్తుపెట్టుకుని తల్లికి విమానం బొమ్మ పంపించినందుకు మురిసిపోయింది. స్వామీజీ మాటలు మనసులో మెదిలాయి. ఆయన చెప్పినట్టే మనసు అనే పక్షికి రెక్కలు అటూ ఇటూ మారుతుంటాయి కాబోలు. ఇప్పటిదాకా రాఘవమీద కోపం, వాడు పంపిన బొమ్మ చూసాక రాగం.. చిత్రమైందికదా మనసు?

ఎన్నాళ్ళనుండో అడుగుతున్నాడు నా పార్కు మిత్రుడు శంకరంగారు వాళ్ళింటికి తీసుకెళ్తానని.

ఈమధ్య సుమకి మరీ ఆలస్యం అవుతుండడంతో నేను నాగమణిని ఎక్కువసేపు ఒంటరిగా వదిలేందుకు వీలు కుదరడం లేదు. దానికి గుండె జబ్బు వచ్చినట్టు సుమ చెప్పినప్పటినుంచి నా మనసు నీరసించిపోయింది. తన జబ్బు గురించి తెలియని పిచ్చి నాగమణి అమాయకంగా భక్తి పుస్తకాలు చదువుకుంటూనో, టీవీ చూస్తూనో కాలక్షేపం చేస్తూంటుది తప్ప నాతో పార్కుదాకా నాలుగడుగులు వెయ్యమంటే వెయ్యదు. ఎప్పుడూ నాలుగ్గోడల మధ్యే ఏదో పని చేసుకుంటూ కాలక్షేపం చేసే పల్లెటూరి అలవాటు పోయిందికాదు.

'ఎంతసేపు ఇంట్లో కూర్చుంటారు? అలా పార్కుదాకా కాలు సాగదీయండి. లేకపోతే మి పార్కు నేస్తం బెంగపెట్టుకునేరు?' అంటూ ఇవాళకూడా నన్ను బయటికి తరిమేసింది నాగమణి. అందుకే ధైర్యంగా శంకరంగారితో ఆ దగ్గర్లోనే వున్న వాళ్ళింటికెళ్ళాను.

అది నాలుగు బెడ్‌రూముల పాత ఇల్లు. మధ్య హాల్లో టీవీ వుంది.

ఒకాయన దాదాపు డెబ్బయి ఏళ్ళదాకా వుంటాయి. పాత సినిమా పాటలు వింటూ తాళం వేస్తున్నాడు. మనలోకంలో లేడు. శంకరంగారి అన్నగారేమో అనుకున్నాను. 'బాబూ వేణూ!' అని శంకరంగారు లోపలికెళ్ళి పిలుస్తుంటే మొదట ఆయన కొడుకును పరిచయం చేస్తాడు కాబోలనుకున్నాను. ఎంతకీ జవాబు రాకపోయేసరికి మేమే తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాం. అక్కడ దృశ్యం చూసి నా మతిపోయింది.

తెల్లని బట్టల్లో ముత్యంలా వున్న ఓ యువకుడు ఓ ఎనభయ్యేళ్ళ వ్యక్తిని బుజ్జగిస్తూ గడ్డం గీసి పెడుతున్నాడు.

'ఉండండి తాతగారూ! అయిపోయింది. అబ్బే నెప్పి వుండదు. ఆ గడ్డం తీసేసాక ఇపుడు చూడండి యస్.వి.రంగారావుగారిలా ఎంత హుందాగా వున్నారో?'

'హమ్మయ్య మొత్తానికి నువ్వు అసాధ్యుడివేనయ్యా వేణూ! తాతగారి గడ్డం తీసేసావు. రాత్రిళ్ళు బాత్‌రూంలోకి వెళ్తూంటే నన్ను ఏడిపించడానికి ఈయనగారు బూచాడిలా భయపెట్టడం కూడాను.' శంకరంగారు అతని భుజం తట్టారు. అతను మమ్మల్ని చూసి నవ్వాడు.

'ఇదిగో వేణూ! ఈయన పేరు బాల సుబ్రమణ్యం. పార్కులో ఇద్దరం ఒకే బెంచీమీద కూర్చుని రాజకీయాలు మాట్లాడుకుంటుంటామని చెప్పానే. ఆయనే ఈయన. సుబ్రమణ్యంగారూ ఇతను వేణు.'

'నమస్కారమండీ' అని ఓ క్షణం నన్ను పరికించి చూసి శంకరంగారితో అన్నాడు.

'అన్నట్టు బాబాయిగారూ! ఇవాళ దుర్గమ్మ అత్తయ్య అలిగి అన్నం తినలేదట.'

'వాళ్ళమ్మాయి గుర్తొచ్చి పొద్దుటినుంచీ ఏడుస్తూనే వుంది. ఆయా మాట కూడా వినలేదు. ఇంజక్షన్ కూడా చేయించుకోలేదు.'

'ఏమిటి నా మీద చాడీలు చెబుతున్నారు. అబ్బాయి ఐస్క్రీం తినిపించాడుగా. ఏడుపెప్పుడో పోయింది. ఇదిగో వేణూ! ఆ నర్సు పిల్లకి కాస్త ఇంజక్షన్ మెల్లిగా చెయ్యమని చెప్పవయ్యా! దబ్బనంలాంటి సూదితో పొడిచేస్తుంటే చెయ్యంతా నొప్పి.'

ఆ దుర్గమ్మ అన్నావిడ సుడిగాలిలా మేమున్న గదిలోకి దూసుకొచ్చి కంప్లయింట్ చేస్తోంది.

నాకు అంతా అయోమయిపోయింది. వీళ్ళంతా ఒకళ్ళకొకళ్ళు ఏమవుతారో? నా మొహంలో భావాలు చదివినట్టే అన్నాడు వేణు. 'అంతా ఆత్మ బంధువులమే అంకుల్. ప్రస్తుతానికి ఎనమండుగురం. ఇదిగో ఈ తాతగారు మాత్రం నాకు చిన్న కొడుకన్నమాట. గడ్డం గీయించుకోవడానికి అన్నం తినడానికి రోజూ పేచీలు పెడుతుటారు. దుర్గమ్మత్తయ్య దగ్గరుండి వంటమనిషితో రుచిరుచిగా వంటలు చేయిస్తూవుంటుంది. హాల్లో కూర్చున్న మావయ్యగారికి పాత సినిమాలంటే ప్రాణం. ఆ పాటలు వచ్చే గంటా ఎవరికీ టీవీ దక్కనివ్వరు.

సూర్య పిన్నిగారు మా అందరికీ రాత్రిళ్ళు పిట్టకథలు చెప్పి నవ్విస్తుంటారు. శంకరం బాబాయికి ఓపికెక్కువ. అందుకే అలా అప్పుడప్పుడు బజారుకి వెళ్ళి బేరమాడి కూరలు కొనితేవడం అదీ చేస్తుంటారు.'

'టైమవుతోంది. మరి నేను కంపెనీకి వెళ్ళిరానా?' అంటూ వేణు వెళ్ళాక దుర్గమ్మగారు నాకు మజ్జిగ అందిస్తూ చెప్పింది.

'పెద్దవాళ్ళు పసిపిల్లలతో సమానంకదా అన్నయ్యగారూ! ఇక్కడివాళ్ళు స్వేచ్ఛగా వేణూతో తనకి జిలేబీ తినాలనుందనో జున్ను తినాలనుందనో చెప్పడం తడువు. కంపెనీ నుండి ఎంతగానో అలసిపోయి వచ్చినా సరే వెంటనే అది తీర్చేదాకా మంచమెక్కడు మా వేణు. 'ఎందుకంత అర్జంటు? రేపు తేవచ్చుకదా బాబూ అంటే రేపెలా వుంటుందో ఎవరికి తెలుసత్తయ్యా' అంటాడు.

అక్కడనుంచి బయటకు వచ్చేలోగా నాకు అర్థమయిందేమిటంటే.. ఆ ఇల్లు ఒక పేరులేని వృద్ధాశ్రమం.

కని పెంచి విద్యాబుద్ధుల్ని చెప్పిచి ప్రయోజకులను చేసిన స్వంత తల్లిదండ్రుల్నే స్వార్థంతో కళ్ళు మూసుకుపోయి వృద్ధాశ్రమాల పాలు చేస్తున్న ఈ రోజుల్లో పనిగట్టుకుని వాళ్ళ చివరి కోరికలు తీర్చడానికి అహర్నిశలు తాపత్రయపడే వేణులాంటివాళ్ళున్న ఇది కలికాలం కాదేమో కృతయుగమేమో అనిపించింది నాకు.

మర్నాడు పార్కులో శంకరంగారు చెప్పిన మరికొన్ని విషయాలు వినేసరికి నా తల తిరిగిపోయింది.

"సుబ్రమణ్యంగారూ నా గురించి మీకెప్పుడూ చెప్పలేదు కదూ! నా కొడుకు కోడలు ఇల్లు పొలం అమ్మేయమని జలగల్లా పీల్చేస్తుంటే అమ్మి డబ్బు వాళ్ళమొహాన తగలేసి వైరాగ్యంతో రైలు కింద తలపెట్టి చచ్చిపోవాలని వెళ్తోంటే ఈ వేణూయే నన్నిక్కడకి తెచ్చాడు. మా చుట్టాలందరూ చివాట్లు పెట్టగా నా కొడుకు శివరావు 'నేను మారాను నాన్నా ఇంటికొచ్చెయ్యి' అని ఇక్కడికొచ్చి ప్రాధేయపడి ఏడ్చినా ఈ కుర్రాడిని వదిలి వెళ్ళబుద్ధికాక రానని తెగించి చెప్పేసాను. అమెరికాలో లక్షలు వచ్చే ఉద్యోగం మానేసి వచ్చాడండీ. మీరు చెబితే నమ్మరేమోగాని వారం క్రితం రోడ్డుమీద స్పృహ తప్పి పడున్న చింతామణి అనే ఓ పెద్దాయనని తీసుకొచ్చి వారం రోజులపాటు కడుపున పుట్టినవాడిలా సేవ చేసాడంటే నమ్మండి. 'చుట్ట తాగి చచ్చిపోవాలని వుంది బాబు' ఆ పెద్దాయన సిగ్గుపడిపోయాడు. వేణు వెలిగించి ఇచ్చిన చుట్ట వెలిగించి రెండంటే రెండు దమ్ములు పీల్చి తృప్తిగా వేణు ఒళ్ళోనే ప్రాణాలు వదిలాడాయన. మతికూడా సరిగా లేని డెబ్బయ్యేళ్ళ మాణిక్యమ్మ అర్ధరాత్రి వేళ జున్ను అడిగిదనే అక్కసుతో ఆవిడ కోడలు తీర్థయాత్రవంకతో తీసికెళ్ళి శ్రీశైలంలో వదిలేసి వెళ్ళిపోతే ఎవరో వేణు గురించి విని ఆవిడను అప్పచెప్పారు. ఆవిడ జిహ్వాచాపల్యంతో చంటిపిల్లలా గారాం చేస్తోంటే అడిగినవన్నీ కొనిపెట్టేవాడు. క్రితం నెల్లోనే ఆవిడ తృప్తిగా కన్నుమూసిందండీ. నిజం చెప్పొద్దూ ఇతగాడి చేతిలో ప్రాణం వదిల్తేనే నాకు కూడా మోక్షమొస్తుంది.'

నా మనసుని ఏదో తెలియని అశాంతి ఆవరించింది. నా కొడుకు రాఘవ గుర్తుకొచ్చాడు. నన్ను పట్టించుకోకపోయినా నేను బాధపడలేదుకానీ లక్షలు సంపాదిస్తూ కూడా కన్నతల్లిని ఓసారి విమానంలో తీసుకెళ్ళలేడూ?

నేను ఆలోచిస్తూ ఇంట్లోకి అడుగుపెట్టగానే మా నాగమణి నవ్వుతూ ఎదురొచ్చింది.

'ఏవండీ మా కాశీరత్నం, ఆముక్త ఫోను చేసారండీ చిత్రంగా లేదూ!'

నేను విస్తుపోయాను. నాగమణికి మతి భ్రమించలేదుకదా! కాశీరత్నం, ఆముక్త అంటే మా నాగమణి చిన్ననాటి స్కూలుమేట్స్. వాళ్ళు తన ప్రాణస్నేహితులనీ పద్దెనిమిదేళ్ళకే పెళ్ళిళ్ళు చేసుకుని రాష్ట్రం కూడా విడిచి వెళ్ళిపోయారనీ మా పెళ్ళయినప్పటినుంచీ జోరీగలా చెబుతూనే వుండేది నాగమణి. మళ్ళీ ఈ వృద్ధాప్యంలో ఎందుకు గుర్తొచ్చారోగానీ మూడునెలలనుచి 'వాళ్ళు కనిపిస్తే ఎంత బావుంటుందోనండీ' అంటూ ఒకటే గొడవ.

'వాళ్ళు కనబడితే వామనకుంటలూ తొక్కుడు బిళ్ళలూ ఆడుకుంటారా ముగ్గురూ కలిసి. అమ్మాయ్ సుమా! మీ అమ్మకి పాత స్నేహితుల్ని వెతికి పెట్టమ్మా పాపం ఆడుకుంటుంది.'

'అబ్బా కూతుళ్ళకి నేనంటే ఎప్పుడూ వెటకారమే. అయినా కానీ నలభై ఏళ్ళక్రితం దూరంగా వెళ్ళిపోయిన వాళ్ళు అసలున్నారో లేదోకూడా తెలియదుకదా!' గాఢంగా నిట్టూర్చి నాగమణి ఆరోజంతా తెగ గొణుక్కుంది.

అది మొదలు రోజుకోసారయినా మా కాశీరత్నం ఏం చేస్తోందో? అనడం మరీ ఎక్కువయిపోయింది. అలాంటిది ఇవాళ వున్నట్టుండి వాళ్ళిద్దరూ ఫోన్ చేసారంటోందేమిటి చెప్మా? 'అవునూ వాళ్ళకి మన నెంబరు ఎలా తెలిసిందిట? కొంపదీసి వాళ్ళు స్వర్గం నుంచిగానీ..?'

నా నోరు మూసేసింది.

'ఊరుకోండి. ఆ మధ్య మన రాఘువ పంపిన విమానం బొమ్మ ఇచ్చి వెళ్ళాడే ఆ కుర్రాడు. పేరేంటి మర్చిపోయాను.' నాకు వళ్ళుమండింది. 'ఎపుడో నలభై ఏళ్ళ క్రితం కాశీరత్నం ఆముక్తలు గుర్తున్నారుగానీ నిన్న మొన్న వచ్చిన నీ కొడుకు స్నేహితుడి పేరు గుర్తులేదూ వింతకాకపోతే..'

'నోట్లో ఆడుతోందిగాని బయటకి రావడంలేదు. సరేలెండి. ఆ అబ్బాయి ఆ మధ్య వచ్చినపుడు మా కాశీరత్నం ఆముక్తల గురించి చెప్పానండీ. అదేమిటదీ.. ఆ .... ఫేస్‌బుక్కులో వెతికి పట్టుకున్నాట్టండీ. వాళ్ళే మన సుమకి ఫోన్ చేసారండీ. ఎంతసేపు మాట్లాడుకున్నామనుకున్నారు? నాకే సరిగా గుర్తులేవుకానీ మా క్లాసుమేట్ల పేర్లు వాళ్ళకెంత గుర్తో? మేం ఆడుకున్న ఆటలు అబ్బో' నాగమణి మాటలకి విస్తుబోయాను.

ప్రపంచం కుగ్రామమయిపోవడమంటే ఇదేనేమో! 'ఇంతకీ ఎక్కడున్నారట వాళ్ళు ఈ వూళ్ళోనేనా?'

'మీ చాదస్తంగానీ ఇక్కడెలా వుంటారు? కాశీరత్నం చిన్నకొడుకు దగ్గర వరంగల్‌లో వుంటోందిట. ఆముక్తకి భర్త పోయాడటండీ పాపం. దానికి ముగ్గురూ కూతుళ్ళే. పెద్ద అల్లుడు చాలా మంచివాడట. అక్కడే అదేదో పేరు ఆ కాన్పూరులో ఉంటోందటండీ..' ఏమయితేనేమ్మా నాగమణి సంతోషంగా వుంటోంది అదే చాలు నాకు. ఏవండీ? ఇదేంటో చెప్పుకోండి వచ్చే నెలలో నన్నూ మిమ్మల్ని తనతో కలిసి తీసుకు రమ్మని మన రాఘువ స్నేహితుడి ద్వారా అమెరికా విమానం టిక్కెట్టు కూడా కొని పంపించాడు. చూడండి. వాడికెంత ప్రేమో మనమంటే? మీరెపుడూ వాడినాడిపోసుకోవడమే.' నాగమణి కళ్ళల్లో నీళ్ళు.

అదేంటో ఆ అబ్బాయి రెండుమూడుసార్లు వచ్చినా నేను కలుసుకోలేకపోయాను. ఏమనుకుంటాడు. అయినా మా అబ్బాయి విషయాలు కూడా కనుక్కోవాలికదా! ఈ విషయం నాకెందుకు తట్టలేదబ్బా. మా రాఘువ స్నేహితుడిని. అప్పటికప్పుడు చూడాలనిపించింది. '

'మళ్ళీ ఆ కుర్రాడు ఎప్పుడొస్తాడుట?'

'ఏమో వురుము లేని పిడుగులా వచ్చేస్తుంటాడండీ. ఎంచక్కా ఎన్ని కబుర్లు చెప్తాడనుకున్నారు? అచ్చం మన రాఘువతో మాట్లాడినట్టే వుంటోంది నాకు. అవునూ ఇంతసేపయిందేం మళ్ళీ ఎక్కడికెళ్ళారు? మీకు పెత్తనాలెక్కువయిపోయాయి. అయ్యో ఇంట్లో పెళ్ళాం ఒక్కతే వుంటుందని లేదమ్మా ఈ పెద్ద మనిషికి?' నేనక్కడినుంచి పారిపోయాను. లేకపోతే నాగమణి వాక్ప్రవాహం ఆగదు.

'నాన్నా ఇందాక నేను ఇంటికి వెళ్ళేసరికి అమ్మ సోఫాలో వాలిపోయివుంది. నువ్వు పార్కు నుంచి యశోదా ఆస్పత్రికి వచ్చెయ్యి నాన్నా!' దొరికిన ఆటో పట్టుకుని ఆసుపత్రికి పరిగెట్టాను. ముదిరిపోయిన గుండెజబ్బు తల్లి విషయంలో ఇలాంటిది ఎప్పుడో వినాల్సి వస్తుందని చాలా రోజులుగా సుమ మానసికంగా నన్ను సంసిద్ధం చేసింది.

చాలా రోజులుగా సుమ మానసికంగా నన్ను సంసిద్ధం చేసింది.

నేను వెళ్ళేసరికి 'ఊరుకో సుమా! ఇవాళ కాకపోతే రేపయినా అంతా వెళ్ళిపోవలసిన వాళ్ళమే'. రెండు చేతుల్లో తలపెట్టుకుని నాగమణి కాళ్ళ దగ్గర ఏడుస్తున్న సుమ తల నిమురుతూ అంటున్నాడు తెల్లని దుస్తుల్లోని ఓ యువకుడు.

'గోపాల్ అమ్మ తృప్తిగా వెళ్ళిపోయిందని తెలుసు. కానీ నాన్ననెలా ఓదార్చడం?'

'కాలమే అన్నింటినీ పరిష్కరిస్తుంది సుమా'

ఆ కంఠం ఎక్కడో విన్నట్టే వుంది. ఎక్కడ? నన్ను చూసిన సుమ చప్పున లేచి వచ్చి నా చెయ్యి పట్టుకుంది.

'నాన్నా ఈయన అన్నయ్య స్నేహితుడు వేణుగోపాల్.'

నా కంఠం వణుకుతోంది. 'అయితే అన్నయ్యకి ఫోన్ చేయమ్మా.'

అతను ఇటు తిరిగాడు. వృద్ధులను కడుపులో పెట్టుకునే వేణు.. వేణుగోపాల్? ఇతను మా యింటికొచ్చి మరీ మా నాగమణి కోరికలన్నీ తీర్చాడా? ఎందుకు?

'అంకుల్ రాఘవ నా ప్రాణస్నేహితుడు. చాలాకాలం సరైన ఉద్యోగం దొరకలేదు. అతనికి మంచి ఉద్యోగం దొరికి జీవితం స్థిరపడింది అనుకునేసరికి ప్రాణాంతకవ్యాధి బారినపడ్డాడు. కష్టాల కడలిని ఈదుతూనే వున్న మీ అందరికీ ఆ విషయాన్ని చెప్పలేక, దాచుకోలేక ఎంతో కుమిలిపోయాడు. అతని ఆఖరి కోరిక తీర్చడానికే నేను ఇండియా వచ్చేసాను.'

'ఆఖరి కోరికా? ఏమయింది మావాడికి?' వణికిపోయాను.

నాకు తెలియకుండానే ఎన్ని శాపాలు పెట్టాను నా బిడ్డని.

'ఆంటీని విమానం ఎక్కించమని. తన చెల్లిని పెళ్ళి చేసుకోమని. కానీ సుమకు, నాకు, ఆంటీకి అభ్యంతరం లేకపోయినా..' నా కర్థమయింది. సుమ చెప్పింది ఈ యువకుడి గురించేనా? అవును కులగోత్రం లేనివాడని నేనే అభ్యంతర పెట్టాను.

'అమ్మకు తెలుసా ఈ విషయం?' నేను కుమిలి కుమిలి ఏడ్చాను.

'అన్నయ్య పోయాడని మాత్రం చెప్పలేదు. వేణు అన్నయ్య ఫ్రెండని, నన్ను చేసుకోవాలనుకుంటున్నాడని గ్రహించింది. నేను ఎన్నోసార్లు మీకు వివరంగా చెప్పాలనుకున్నానుగానీ మీ కఠినత్వం చూసి..' సుమ తలవంచుకుంది.

'అంకుల్! ఏ జన్మలో చేసిన పాపమో నేను అనాధాశ్రమంలో నా అన్నవారికోసం తపించిపోతూనే పెరిగాను. ఒక ఉదారుడి కరుణతో అమెరికా వెళ్ళి పై చదువులు చదివి ఎంతో సంపాదించాను. ఇండియా వచ్చాక ఆదరణ కోసం అలమటించిపోతున్న పసిపిల్లల్లాంటి తల్లిదండ్రులు ఇక్కడ ఎంతోమంది కనిపించారు నాకు. వాళ్ళే నాలో సేవాసక్తిని పెంచారు. వారి తీరని కోరికలు తీర్చడంలో నాకెంతో తృప్తి దొరికింది. అందుకే ఆంటీకి చిన్ననాటి స్నేహితులంటే ఇష్టమని సుమ ద్వారా తెలుసుకుని... ఆంటీకి అమెరికా ప్రయాణం చేసేంత ఆరోగ్యం లేదని రోజులు బాగా దగ్గర పడ్డాయనీ తెలుసు. అందుకే తొందరపడాల్సి వచ్చింది. నెల తర్వాత టిక్కెట్టు బుక్ చేసాను.'

'అమ్మ మాత్రం అన్నయ్య విమానం టిక్కెట్టు పంపాడని ఎంతో పొంగిపోయింది నాన్నా. అందుకే అమ్మ పోయినందుకు ఇపుడు నాకు విచారంగా లేదు' సుమ కంఠం ప్రశాంతంగా పలికింది.

నాగమణి పడుకోబోయేముందు పదేపదే అమెరికా విమానం టిక్కెట్టు చూసుకోవడం ఇంకా నా కళ్ళముందు కదలాడుతోంది.

పిచ్చితల్లి. అంటే రాత్రింబగళ్ళు కొడుకు దగ్గరకెళ్ళాలని తపించిపోతూ అది తన గుండెల్లో దాచుకుందన్నమాట.

నాగమణి అదృష్టవంతురాలు. అది కోరుకున్నట్టే విమానమెక్కేసి కొడుకు దగ్గరకెళ్ళిపోయింది.

స్వామీజీ మాటలు నా చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి.

'బంధమైనా మోక్షమైనా మనసు కారణంగానే ఏర్పడుతుందని అమృతబిందు ఉపనిషత్తు బోధించింది. రాగద్వేషాలకు మనిషి బద్ధుడైతే అది బంధం. వాటినుంచి విముక్తుడైతే అది మోక్షం. బందీ అయినవాడు బద్ధుడు. బయట పడినవాడు బుద్ధుడు.'

నేను బుద్ధుడినా? బుద్ధుడినా?

వేణుగోపాల్ కేసి కర్తవ్యతా విమూఢుడిలా చూసాను.

బలి చక్రవర్తి దగ్గర మూడడుగుల దానం పట్టి ఆకాశమంతా ఆవరిస్తున్న వామనుడిలా కనిపించాడు నాకు.

అతని విషయంలో నా మనసు అనే పక్షి రాగ ద్వేషాల రెక్కలు మళ్ళీ మార్చుకోవాలనుకున్నట్టు తోస్తోంది.

# కుచు క్రిస్సు — పేరి సర్వేశ్వర శాస్త్రి

**శనివారం** అన్ని పనులూ పూర్తిచేసుకొని, ఇక వీకెండులో మిగిలిన ఏక్టివిటీలు ఏమున్నాయో అని చూద్దునా, రేపు ఆదివారం "సాహిత్యగీత కార్యక్రమం" ఉన్నదని గుర్తొచింది. వెంటనే ఏదో తెలియని ఉత్సాహం, ఎదురుచూపు మొదలయ్యింది. అందులోనూ పద్మాకరుగారు వస్తున్నారని గుర్తు వచ్చి ఆత్రుత మొదలైంది. ఆ పన్లు, ఈ పన్లు చూసుకొని నిద్రలోకి ఉపక్రమించాను.

ఎక్కడో దూరంగా లీలగా పిల్లకాయల కేకలు, ఆటల్లో దెబ్బలాటలు వినిపిస్తున్నాయి. భార్యామణి గాబోలు పక్కింటి పిన్ని గారితో పిచ్చాపాటీ చేస్తోన్నట్టు వినబడుతోంది. ఏమాటకామాటే చెప్పాలి, నిన్నటికి నిన్న, చంటివాడు డీలాగా కుర్చొని "నాన్నా ఆడుకొందికి ఏమైనా మంచి గేములు కావాలీ" అని అన్నాడు. పెద్దమ్మాయి స్నేహితులందరూ గగన తలానికి మించి జరిగిన ఇనఫర్మేషన్ యుగంలోకి దూసుకు పోతూంటే, తను మాత్రం డయల్టోను ఫోను మీదే కాలక్షేపం చేసేస్తోంది. మధ్యవాడు మాత్రం పట్టు వదలని విక్రమార్కుడి లాగ మా పాత పీసీ ఏటీ మీదనే ఏదొ గేములని లాగించేస్తున్నాడు. ఎక్కడ చూసినా ఏదో అసంతృప్తి, పరిజ్యానాంధకారం లాగే అనిపిస్తోంది. భార్యామణి మాత్రం తొణకదు, బెణకదు, విమర్శించదు. నా మీద గాఢ నమ్మకం, విశ్వాసం, గౌరవం.

ఇలా కొన్నాళ్ళు తరవాత ఓ రోజు భార్యామణి వచ్చి "ఏమండీ, ఎన్నళ్ళనుండీ చూస్తున్నాం కదా! పిల్లలకి విలువయిన వీడియో గేములు లేవు, హాయిస్పీడు డేటా లేదు, 4జీ స్పెక్ట్రం లేదు. చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది. ఎన్నాళ్ళు ఇలా ఇంక డాస్ ఆపరేటింగ్ సిస్టం మీదా, పీసీ ఏటీ మీద జీవితాన్ని లాగిస్తాం? పోనీ మనం అయితే ఎలాగో సద్దుకు పోవచ్చు, కానీ పిల్లలు రేపు బయటకి వెళ్ళాలి, అందరితో కలవాలి. ఏదైనా ఉపాయం చూడరూ,

ఈ ఇనఫర్మేషన్ దారిద్ర్యాన్ని వెళ్ళగొట్టరూ?" అని అంది. "మీ చిన్ననాటి స్నేహితుడు క్రిస్ ఇప్పుడు చాలాగొప్పవాడై ఉన్నాట్ట కదా, ఆయన ఏమైనా సాయం చెయ్యగలడేమో చూడండి" అని విన్నవించుకొంది.

చాలా ఆలోచించాను. 'ఏమో ఎప్పటి స్నేహం ఎక్కడో జావా/సీ++ నేర్చుకొంటున్న టైములో, కొద్ది రోజులు మాత్రమే పరిచయం అతనితో. గుర్తుంటానో లేదో అతనికి! వెళితే లోనికి రానిస్తాడో లేడో' అని అనేక విధాలుగా ఆలోచించా. సరే ప్రయత్నించడంలో తప్పు లేదనీ వెళ్ళడానికే నిశ్చయించా. అయితే వెళ్ళే ముందు ఏదేన గిఫ్టు తీసుకుపోపోతే బాగుండదేమో? కానీ ఎటు చూసినా క్రిస్ కి ఇవ్వడానికి సరిపడేదేదీ కనిపించలేదు. అటూ ఇటూ చూసి అటక మీదనించి ఒక మూడు వెర్బాటిం ఫ్లాపీ డిస్కులని తీసి, మా చంటి వాడు రాసిన చిన్న డాసు గేము లోడు చేసి జాగ్రత్తగా కవరు లోపల పెట్టుకొని బయలుదేరా సన్నీవేలీకి.

ఏమి అద్భుతం! ఏమి డెవలెప్మెంటు! ఎటు చూసినా టెక్నాలజీ ఉట్టిపడుతోంది. రాచబాటలకి ఇరువైపులా ఆకాశాన్నంటే ప్లాస్మా స్క్రీనులు, మనుషులు చెవుల్లో వింటూ, చేతుల్లో చూస్తూ, కళ్ళతో నడుపుతూ వస్తున్నారు, వెళుతున్నారు. కొంతమందికి రెండు చేతుల్లోనూ ఫోనులే! ఒకరు ఫోనులో మట్లాడుతూ చేతిలొ టాబ్ లెట్ లో చూస్తున్నారు. సంగీతం విన్నవాళ్ళు, ఆటల్లొ మునిగిన వాళ్ళూ, చాటుల్లో తేలిన వాళ్ళూ, స్నాపు చాటుల్లో ఈదిన వాళ్ళూ, తెలిసిన దాన్నే తెగ తెలిసీసుకోడానికి గూగిలించిన వాళ్ళూ, తెలీని దాన్ని తెలుసునని భ్రమించె బింగులూ, వారు చేసిన ప్రతీ దాన్నీ పావురాయి పిట్టలా ట్విట్టరించిన వాళ్ళూ, డబ్బుని చూసుకొంటున్నారు, అరచేతిలొంచే అద్దెని మారుస్తున్నారు, అప్పుని పూడుస్తున్నారు, డప్పులు మోగిస్తున్నారు. ఎటు చూసిన బిట్టూలు, బైటులు, కానరాని సైటులు! ఏదో మయసభ లాగ అనిపించింది. అశరీరవాణికి మీట నొక్కి చెబితే అందాల బోణి భోజనం తెచ్చి పెడుతోంది.

మీట నొక్కితే ద్వారం తెరుచుకుంటోంది, వేలు కదిపితే వాతావరణం మారుతోంది. ఎక్కడకొచ్చాను నేను? ఏమిటీ మాయ? క్రిస్సు ఎలాంటి జీవితం గడుపుతున్నాడు ? ఇంతటి గందరగోళంలో నా గురించి ఏం గుర్తుంటుంది ? గుర్తున్నా నన్ను ఇప్పుడు గుర్తు పట్టగలడా ? ఇలా తర్జన భర్జన పడుతూంటే ఎదురుగా క్రిస్సు వచ్చి "హల్లో మేన్, హౌ ఆర్యూ బడ్డీ" ? అని పిడికిలితో ఫిస్టు బంపు ఇచ్చేడు.

మనిషి ఆగలేదు. మాట్లడుతూనే ఉన్నాడు. చుట్టూ వాళ్ళు దిగ్భ్రాంతి చెంది చూస్తున్నారు. 'ఇంతటి క్రిస్సు ఈ మనిషితో ఇంత చనువుగా మాటలాడడమేమిటీ?' అని. ఎవ్వరినీ పట్టించుకోలేదు క్రిస్సు, నాతోనే సరదాగా మాటలాడుతున్నాడు. రెండు చెవులకూ రెండు బ్లూ టూతులు మిలమిల మెరసిపోతున్నయి. మెడలో స్నేకు కాయిల్ లాటిది వేలాడుతూ కళ్ళ ముందరే టాబ్ లెట్టూ ఉంది. ఎటు చూసిన వైఫై. మనిషి మూడుని బట్టీ టీవీ మారుతోంది. అలాంటి క్రిస్సు అన్నీ గాడ్జెట్టూలనీ మూసేసి కుచు తొ కబుర్లాడడం అందరికీ ఆశ్చర్యం. ఈతడు ఏమి తపస్సు చేసేడో? మహామహులు పది నిమిషాలకోసం ఏళ్ళతరబడీ వేచి ఉంటారు. నాసా కి అంతు చిక్కని రహస్యాలు కావాలంటే క్రిస్సు వద్దకు వస్తారు. గుట్టుగా విశ్వానికి అంతర్జాలం వేసాడని చెప్పుకుంటుంటారు. అలాంటి క్రిస్సు ప్రేమగ, ఆప్యాయంగా వచ్చి " కుచు, ఎన్నళ్ళయిందిరా మనం కలసి? కుశలమా ? టెక్నాలజీతో కీపప్పు చేస్తున్నావా?" అని ఆప్యాయంగా అడిగాడు, తన భార్యామణి రెఖేల్ని పరిచయం చేసాడు.

ఈ క్రిస్సు ఎంత సమర్ధవంతుడూ అంటే ఏడో క్లాసులో కాళీ అనే పెద్ద వైరసుని హతమార్చాడు. సిషు మరియ దంత అనే వర్ములని డీలా చేసాడు. ఆరేళ్ళ ప్రాయంలో దయలప్పు కనక్షనులని తోటి స్నేహితులకి పంచిపెట్టేవాడు. సామాన్యుడు కాడు.

"గుర్తుందా? ఒక రోజు మన జావా టీచెరు సాండీ వద్ద చదువుతున్నప్పుడు వాళ్ళ 256కే డయలప్పు మోడెం పనిచేయకపోతే రాత్రంతా ఇంటర్నెట్టు కోసం వీధి వీధులూ తిరిగాం. కప్పు కాఫీ కూడా దొరకలేదు. తెల్లవారిందాక సాండీ ఇంటికి రాలేకపొయాం" అని క్రిస్సు చెప్పుకుపోతూ ఉన్నాడు.

"ఏదో నేర్చుకోవడం అన్నది మిష గానీ నీకు రానిది ఏమీ లేదు క్రిస్సు" అన్నాన్నేను.

"సరేగానీ, రాకరాక వచ్చావు, ఎదైనా గిఫ్టుగానీ తెచ్చావా"? అని అడిగేసరికి జంకుతూ జంకుతూ మెల్లగా తెచ్చిన మూడు ఫ్లాపీలనీ ఇచ్చాను

ఆత్రుతగా ఇచ్చినది తీసుకొని అతని కంప్యూటరు బూటు చేసి మొదటి ఫ్లాపీ లోడు చేసాడు.

రెఖేల్ ఉత్సాహంగా చూస్తోంది. రెండో ఫ్లాపీని లోడు చేయడానికి సిద్ధమవుతూంటే రెఖేల్ చేయి ఆపి " హనీ ఇక చాలేమో, మొదటి ఫ్లాపీవల్ల ఇతని స్టాకు అపుడే చాలా పెరిగింది, ఇంకా లోడు చేస్తే మనమే ఇతనికి దాసులమవ్వాలి" అన్నది.

చాలాసేపు కబుర్లు చెప్పుకొన్నాం. మంచి విందారగించాం. చక్కని పరుపులపై శయనించాం. తెల్లవారి తయారై ఇక బయల్దేరుతానని చెప్పి శలవు తీసుకొన్నాను.

"అలాగే వెళ్ళిరా, లెట్ అజ్ కీప్ ఇన్ టచ్" అని చెప్పి తన మీటింగులోకి వెళ్ళిపోయాడు క్రిస్సు. ఏదైనా అడుగదామని నోటి దాక వచ్చింది కాని, అడగలేకపోయాను. నెమ్మదిగా వెనక్కి బయల్దేరాను.

ఇంటిదగ్గరకు వచ్చిచూస్తే అంతా వింతే! పరికించి చూద్దునా ఎక్కడ పడితే అక్కడ టెక్నాలజీ, గాడ్జెట్టులు, మ్యుజిక్కు! "ఇది మా ఇల్లేనా" అని మరోసారి చూడబోతే ఐఫోన్ చెవిన పెట్టుకొని భార్యామణి దగ్గరగా వచ్చింది. పెద్దమ్మాయి ఐపాడ్ వదల్లేదు. ఎక్కుబాక్కులు దుంధుబుల్లాగ మోగుతున్నయి. ఇదంతా క్రిస్సు చేసిన మాయ తప్ప వేరొకటి కాదు. కానీ తెరచి చూస్తే ఇదేనా నేను నిజంగా కోరుకొన్నది ? దీని గురించా ఇంత కాలం బాధపడింది ? క్రిస్సు, క్రిస్సు, ఒకసారి చెప్పు, ఇంతకంటే డీపుగా ఉన్న జ్ఞానం కోసం రాలేదా నేను క్రిస్సు, క్రిస్సు ... క్రిస్సు .....

'కనిడాయంజనినంత కృష్ణుడు గళత్కంజాక్షుడప్పెదవిప్రుని ... '

అని పద్మాకరు గారు కుచేలోపాఖ్యానము శ్రావ్యంగా వినిపిస్తూ ఉన్నారు. మెల్ల మెల్లగా మళ్ళీ ఈలోకంలోకి వచ్చాను.

వింత కల! కాపోతే, మన అందర్లోనూ కుచేలుళ్ళున్నారేమో! జ్ఞాన దారిద్ర్యం, ధ్యాన దారిద్ర్యం, అభిమాన దారిద్ర్యం .. .. ఇలా ఎన్నో! వీటన్నిటినీ ఎంచి ఎంచి కృష్ణుడే అంతమొందించాలి..!!

# తొక్క

## డెన్నిస్ రాజా కరణం

**వీధి** అంతా బిజీబిజీగా ఉంది. జనాలు గజిబిజిగా తిరుగుతున్నారు. ఒకతను ఓ మూలనున్న బడ్డీ కొట్టులో అరటిపండు కొనుక్కుని ఆబగా తిని తొక్కని వీధిలోకి గిరాటేశాడు. అంతలో దురదృష్టానికి కేరాఫ్ అడ్రెస్ లాంటి ఒకతను అటుగా వచ్చి ఆ తొక్కతో తొక్కుడుబిళ్ళ ఆడాడు – కాదు కాదు – దాని మీద కాలేసేసరికి ఆ తొక్కే తనతో తొక్కుడుబిళ్ళ ఆడింది. సర్రుమంటూ జారి ఐస్ స్కేటింగ్ ఛాంపియన్ లా – కాదు కాదు – కాళీయుని పడగల మీద ఒంటికాలి మీద నాట్యంచేస్తున్న శ్రీకృష్ణపరమాత్మునిలా పోజుపెడుతూ వెళ్ళి కాళిందిమడుగులో అంటే మురుగుకాలువలో పడ్డాడు. టీవీలో న్యూస్ రీడర్ లా తయారయ్యి వెళ్తున్నవాడల్లా సర్ఫ్ ఎక్సెల్ యాడ్లో బురదగుంటలో పడి ఆడే పిల్లాడిలా అయ్యాడు. అంతా తొట్రుపాటులో జరిగిందేమో అసలేం జరిగిందో అర్ధం కాక బురదతో నల్లగా తయారయిన మొహంతో తెల్లమొహం వేశాడు. దగ్గరలోనే ఉన్న ఐస్ క్రీమ్ పార్లర్ లో ఐస్ క్రీమ్ తింటున్న ఓ చిన్నపిల్ల ఇదంతా చూసి పుసుక్కున నవ్వింది. వారించబోయిన వాళ్ళమ్మ కూడా ఆపుకోలేక నవ్వేసింది. ఈ కామెడీసీన్ ని అధునాతనమైన రిక్రియేషన్ రూమ్లో ఉన్న 70MM హోమ్ థియేటర్ సిస్టమ్ లో చూస్తున్న పిల్లలు మళ్ళీ మళ్ళీ రివైండ్ చేసుకుంటూ చూస్తూ నవ్వుకుంటున్నారు.

"తొక్క భలే జారిందక్కా" వచ్చీరాని మాటలతో అంది నమ్య, లాస్యతో. దానికి ఇప్పుడే మూడు నిండాయి. పుడుతూనే ఓ చేతిలో టీవీ రిమోట్ మరో చేతిలో స్మార్ట్ ఫోన్ పట్టుకొని పుడుతున్న రకాలాయ. నమ్య అడిగిందే తడవు ఐదేళ్ల లాస్య "మళ్ళీ పెట్టక్కా" అంటూ లెనీనాని కుదుపుతూ వంతపాడింది. "భలే భలే... మళ్ళీ" చప్పట్లు కొడుతూ గెంతుతూ అడుగుతున్నాడు నాలుగేళ్ళ అక్షర్. మళ్ళీ చూడాలనే ఎగ్సైట్మెంట్ తట్టుకోలేక రిమోట్ మీద రివైండ్ బటన్ గట్టిగా ప్రెస్ చేసింది ఆ గ్రూప్ అంతటికీ లీడర్ గా చెలామణి అవుతున్న ఏడేళ్ల లెనీనా. మళ్ళీ అదే సీన్. ఓ దురదృష్టవంతుడు తొక్క మీద కాలేయడం, జారడం, బురదలో పడడం, నల్లమొహంతో తెల్లమోహం వేయడం. అది చూసి పిల్ల, తల్లి నవ్వడం. ఇదే వరస. సీన్ చూస్తున్న ప్రతిసారి ఆ పసివాళ్ళ లేత పెదవులపై నవ్వులు పువ్వులు పూస్తూనే ఉన్నాయి.

ఇదంతా అక్కడే కూర్చుని చూస్తున్న తొమ్మిదేళ్ల అంకిత్ కి మాత్రం నవ్వు తెప్పించడం లేదు సరికదా తొక్క మీద కాలేసి కిందపడిన వ్యక్తి మీద జాలేసింది. తొక్కని జాగ్రత్తగా ట్రాష్ లో వేయకుండా కేర్లెస్ గా రోడ్డుమీద వేసిన వాడిమీద కోపంకూడా వచ్చింది. కానీ అది చెప్పి మిగతా వాళ్ళ ఫన్ ని స్పాయిల్ చెయ్యడం ఇష్టంలేక, అలాగని మళ్ళీ మళ్ళీ అదే చూడడం కష్టంగా అనిపించి మెల్లిగా లేచి కిచెన్ లోకి వెళ్లాడు.

అక్కడంతా సాయంత్రం జరగబోతున్న పార్టీకోసం వంటలు చేస్తూ బిజీగా ఉన్నారు. ఆ గుంపులో హడావుడిగా ఉన్న వాళ్ళమ్మ కనిపించింది. ప్రాణం లేచొచ్చినట్లయింది. చిన్నగా వెళ్ళి "మామ్" అన్నాడు. తలతిప్పకుండానే "ఏంటి నాన్నా... ఆకలేస్తుందా?" అడిగింది సుధ.

"ఉహు... బోర్ కొడుతుంది".

"కాసేపట్లో పార్టీ స్టార్ట్ అవుతుంది. చాలామంది పిల్లలొస్తారు. అప్పటి దాకా వెళ్ళి ఐపాడ్ లోనో, ఎక్స్ బాక్స్ తోనో ఆడుకో"

ఏదో చెప్పబోయాడు. కానీ అప్పటికే పిన్ని వాళ్ళంతా మూగి అమ్మని లాక్కెళ్ళిపోయారు. ఉసూరుమంటూ పక్కనే ఉన్న పెద్ద హాల్లోకి వెళ్లాడు. అక్కడ వాళ్ళ నాన్న సెల్ఫోన్ లో మాట్లాడుతూ కనిపించాడు. చుట్టూ ఎవరెవరో ఉన్నారు. నాన్న కనీసం పట్టించుకొనేలా లేదు. చుట్టూ జనాలున్నా ఒంటరితనం. ఇంకేం చెయ్యాలో తోచక ఐపాడ్ పట్టుకొని బెడ్రూమ్ వైపు వెళ్లాడు.

అది జస్ట్ ఇల్లు అనడానికి వీల్లేదు. ఓ మహల్ అనవచ్చు. ఇంకా చెప్పాలంటే ఓ మ్యూజియంలా ఉంటుంది. ఎక్కడ చూసినా ఫ్లోర్–టూ–సీలింగ్ వాల్ పెయింటింగ్స్. ఖాళీ ఉన్న చోటల్లా గోడలో పొదిగిన పెద్ద పెద్ద అల్ట్రా హెచ్డి స్మార్ట్ టీవీలు. బాగా డబ్బు పోసి కట్టిన ఇల్లు అంటే అతిశయోక్తి కాదు.

వాళ్ళకున్న డబ్బు గురించి చెప్పుకునే ముందు అది సంపాదించిన ప్రకాష్రాజ్ గురించి చెప్పుకోవాలి. అంకిత్, అక్షర్ లకు నాన్న, లెనీనాకు పెదనాన్న అయిన ప్రకాష్రాజ్ చిన్నప్పుడు వాళ్ళ నాన్న రంగారావు, అమ్మ అంజలిదేవి, తమ్ముడు బ్రహ్మాజీలతో పాటు మరికొన్ని పశువులతో

కలిసి ఓ చిన్న పూరింట్లో ఉండేవాడు. ప్రకాష్‌రాజ్ ని అంతా 'రాజు' అని పిలిచేవారు. వాళ్ళింటి పేరు కొత్త. కానీ చిన్నప్పటినుంచీ కనిపించిన చెత్త అంతా చేర్చి దానిమీద ఏదేదో ప్రయోగాలు చేయడం చూసి కొత్త రాజుని కాస్తా ఎగతాళిగా చెత్త రాజుగా పిలుచుకునే వారు.

ఉంటానికి తింటానికి కొదవలేకపోయినా డబ్బుగా ఏమీ మిగిలేది కాదు. తల్లిదండ్రుల పరిస్థితి అర్ధం చేసుకుంటూ చదువులో చురుగ్గా ఉంటూ స్కాలర్‌షిప్ సంపాదించి యూనివర్సిటీ టాపర్ గా నిలిచాడు. అప్పుడే సుధతో, వాళ్ళ కుటుంబంతో పరిచయం. సుధ వాళ్లింట్లో అంతా అమెరికాలో సెటిల్ అయినవాళ్ళే. అదే సమయంలో వాళ్ళకీ గ్రీన్ కార్డ్ రావడం, అమెరికా వెళ్లిపోవడం జరిగిపోయింది. యూనివర్సిటీ రోజుల్లో రాజుతో పరిచయం మామూలుగానే ఉన్నా అమెరికా వెళ్ళిన తర్వాత సుధకి రాజు మీద ప్రేమ మొదలయింది. అలా రాజు సుధ చదివే యూనివర్సిటీ లోనే మాస్టర్స్ కి అప్లై చెయ్యడం, వెళ్ళడం, ఇద్దరు చదువు తో పాటు ప్రేమలోనూ పట్టా పుచ్చుకుని పెళ్లి కూడా చేసుకోవడం జరిగిపోయాయి. అంతా కంప్యూటర్స్, ఎంబీయేలు చేస్తుంటే రాజు మాత్రం తనకిష్టమైన వేస్ట్ మ్యానేజ్‌మెంట్ అంటే వ్యర్థ పదార్ధాల నిర్వహణలో డిగ్రీ పుచ్చుకున్నాడు.

చదువు అయిన తర్వాత తెలిసింది దానికి తగ్గ ఉద్యోగాలు లేవని. కానీ రాజు నిరాశపడలేదు. భూమిని చీల్చుకుపుట్టే పసిరికతత్వం రాజుది. ఎన్ని అడ్డంకులైన ఓర్చుకుంటూ నేర్పుగా నెగ్గుకొస్తాడు. పైగా అది కేవలం తన చదువు కాదు. ప్యాషన్! మనసా వాచా కర్మణా నమ్మి దిగిన రంగం. అందుకే కొంచెం సుధ నాన్నగారి ప్రోత్సాహం, ఇంకొంచెం బ్యాంక్ లోన్ తీసుకొని చిన్నవ్యాపారం మొదలుపెట్టాడు. అంచలంచలుగా ఎదిగి అమెరికాలోనే నంబర్ వన్ వేస్ట్ మ్యానేజ్‌మెంట్ కంపెనీగా తన వ్యాపారాన్ని విస్తరింపచేసి సార్ధక నామధేయుడనిపించుకున్నాడు.

రాజు పుణ్యమా అని చదువు ఒంట బట్టని బ్రహ్మాజీ కూడా అన్న ఆస్తిని ఇండియాలో ఇన్వెస్ట్ చేస్తూ ఓ మోస్తరు బిజినెస్ మ్యాన్ గా పేరు తెచ్చుకున్నాడు. ఈ ఇంద్రభవనం కూడా బ్రహ్మాజీదే. శివుని ఆజ్ఞ లేకపోతే చీమైనా కుట్టదన్నట్టు, అన్న ఆనతి లేకుండా అన్నం కూడా ముట్టడు బ్రహ్మాజీ. రాముడు అడవుల్లో ఉంటే భరతుడు రామపాదుకలతో రాజ్యం చేసినట్టుగా అన్న అమెరికాలో ఉండి స్కైప్ లో స్ట్రాటజీ చెబుతుంటే తమ్ముడు ఇండియాలో చక్కబెట్టుకొస్తున్నాడు.

ఈసారి అన్న ఇండియా ట్రిప్ కి ఓ ప్రత్యేకత ఉంది. ఇండియాలో ఏదైనా వ్యాపారం చెయ్యమని ఇంతకాలం చెప్పినా వినని అన్నయ్య ఇప్పుడు స్వయంగా తనే ఓ ప్రపోజల్ తో ఇండియాకి రావడం.

ఆ మధ్య నరేంద్ర మోదీ అమెరికాలో సుడిగాలి పర్యటనలో భాగంగా కలిసిన కొద్దిమంది అల్ట్రా రిచ్ బిజినెస్ పీపుల్ లో రాజు కూడా ఒకడు. మోదీ పిలుపు మేరకు తాను పుట్టి పెరిగిన ప్రాంతానికి తన వంతు సాయం చెయ్యాలనే ఉద్దేశంతో పాటు సహజ సిద్ధమయిన వ్యాపార లక్షణంతో ఇండియా వచ్చాడు ప్రకాష్‌రాజ్. సమ్మర్ హాలిడేస్ కావడంతో సుధ, పిల్లలు వెంట వచ్చారు. అంకిత్ కి ఏ స్విజ్జర్లాండో, న్యూజీలాండో వెళ్ళాలనున్నా నాన్న కోసం ప్రతిసంవత్సరం బాబాయి ఇంటికి వస్తాడు.

బ్రహ్మాజీ వాళ్ళ ఇల్లు ఎప్పుడూ ఇలా బిజీగా ఉంటుందో లేక వీళ్ళంతా వచ్చినప్పుడే ఇలా ఉంటుందో తెలీదు కానీ ఈసారి ఇంకా హడావుడిగా ఉంది. దానికి కారణం బ్రహ్మాజీతో పాటు హైస్కూల్ వరకు చదువుకున్న రావు రమేష్ మినిస్టర్ కావడం... ఈ రోజు జరగబోయే పార్టీకి ముఖ్యఅతిధిగా వస్తూ ఉండడం. రావు రమేష్, ప్రకాష్‌రాజ్ ని గౌరవంగా 'అన్నగారు' అని పిలుస్తాడు. ప్రకాష్‌రాజ్ మాత్రం 'అరే, ఒరే' అనే పిలుస్తాడు. పొద్దుట్నుంచి లెనీనా, అక్షర్ లతో కలిసి ఒకే కామెడీ సీన్ని తిప్పితిప్పి చూస్తున్న లాస్య, నమ్యలు ఈ రావు రమేష్ పిల్లలే.

అంతలో హాల్లో ఏదో సందడి మొదలయ్యింది. అంకుల్ వచ్చాడేమో అనుకున్నాడు అంకిత్. కానీ సడన్ గా నిశ్శబ్దం. అంకుల్ టీవీ లో ప్రత్యక్షం అయ్యాడు.

"ప్రధాని మోదీ గారు తన 'స్వచ్ఛభారత్' లో ఒక బ్రాండ్ అంబాసడర్ గా మీ పేరు అనౌన్స్ చేశారు. దానికి మీ రియాక్షన్?" ఆర్కే అడుగుతున్నాడు. రావు రమేష్ ఏదో సమాధానం చెబుతున్నాడు కానీ అందులో చిత్తశుద్ధి కనిపించలేదు. ఇల్లు బాగుంటే ఊరు బాగుంటుంది, ఊరు బాగుంటే దేశం బాగుంటుందనే సూత్రాన్ని తు.చ తప్పకుండా పాటించే టైప్ తను. అందుకే ఏ పథకమైనా ఆ ఫండ్స్ ముందు తనకీ, తన వాళ్ళకీ ఉపయోగించి, పబ్లిసిటీకి సరిపడా లెక్కకట్టి ఊరికి పంచుతాడు. 'దేశం బాగుచేయడానికి తానెంతవాడు. పుడితే గిడితే మరో గాంధీనో, బోసో పుట్టాలిగాని... ఆఫ్టరాల్ నాలాంటి రావు రమేష్ లు ఎంతమంది పుడితే బాగుపడుతుంది ఈ దేశం' అనుకుంటూ... 'ఆ... మన వల్ల కాదు ఈ కంపు

కడగటం' అని తనకంపు ఇతరులకు కొట్టకుండా ఉండేందుకు అవసరానికి మించి సెంట్ కొట్టుకుని తిరుగుతూ దేశసేవ చేస్తున్నాడు సదరు మినిస్టర్ రావు రమేష్.

ఆర్కే అడిగే తికమక ప్రశ్నలకు దొరకకుండా "కాసుకో ఆగ్నేయాస్త్రం" అంటే "ఇదిగో వరుణాస్త్రం" అంటూ తిప్పి సమాధానం చెబుతూ, తనని ఎంత తెలివిగా బోల్తా కొట్టించాలని చూసినా దొరక్కుండా చెప్పిన అబద్ధం మళ్లీ చెప్పకుండా పాదరసంలా జారుకుంటున్నాడు. ఆర్కే కి అసహనం పెరిగిపోతుంది. ఈ మాత్రం దానికా ఇంత పెద్ద మినిస్టర్ని ఇంటర్వ్యూ చేస్తుంది. ఇలాగైతే తన టీఆర్పీ రేటింగ్స్ ఏంకాను. 'కమాన్ మాన్, గివిన్ ఎ బిట్' అని పొగుడుతున్నట్టుగా విరుపులు... విరుస్తున్నట్టుగా పొగడ్తల పొగపెడుతూ విషయం బైటికి రప్పించాలని ఎలాగైనా ఏదో పథకంలో తన పేరు ఇరికించాలని చూస్తున్నాడు. చేప దొరికినట్టే దొరికి ఒడిసిపట్టుకునే లోపే నాజూగ్గా జారుకున్నట్టు చాకచక్యంగా ఒక గేమ్ ప్లాన్ ప్రకారం ఎత్తుకు పైఎత్తు వేస్తూ వెళుతున్నాడు రావు రమేష్. తీరా టైమ్ అయిపోయేసరికి 'డామిట్! ఈసారికి తప్పించుకున్నావు పో... ఇంకోసారి చూసుకుందాం' అనుకుంటూ ఇంటర్వ్యూని ముగించి కమర్షియల్ బ్రేక్ కోసం వెళ్ళిపోయాడు ఆర్కే. "నా దగ్గరా నీ దగ్గులు" అనుకుంటూ రావు రమేష్ లోపల పొంగుకొస్తున్న నవ్వుని పెదవి అంచులోంచి వదిలి నమస్కారం పెట్టి సెలవుతీసుకున్నాడు.

స్టూడియోనుంచి బయటికి వచ్చిందే తడవు జనాలు చుట్టుముట్టేశారు. అందరికి ఏదో కావాలి. అవసరమా కాదా అనేది తరవాత సంగతి. ఇన్ని సంవత్సరాల అనుభవం. మనుషుల్ని అవలీలగా చదివేయగలడు. అందుకే చుట్టూ మూగిన గుంపుని కొన్నిసెకనుల్లో అంచనా వేశాడు. పాతికమంది దాకా ఉంటారు. తన అవసరానికి ఉపయోగపడేవాళ్లే. అందుకే వాళ్లకోసం ఓ పది నిముషాలు స్పెండ్ చేశాడు. సాయంత్రం ఆరవుతున్నా తగ్గని వేడి, దానికి తోడు కాలుష్యం. హత్యలు చేసిన వాడికి జీవితఖైదు వేసి ఏదో జైల్లో పెట్టడం కంటే రోజూ ఓ గంట ఇండియాలో ఆరుబయట నిలబెడితే చాలు... క్యాన్సర్ వచ్చి ఠక్కునపోతాడు.

అందర్నీ సముదాయించి ప్రత్యేకంగా స్పెషల్ ఆర్డర్ లో జర్మనీ నుంచి ఇంపోర్ట్ చేయించుకున్న బుల్లెట్ ప్రూఫ్ ఆడీ కారులోకొచ్చి కూర్చున్నాడు. ఏ.సి లేకుండా పదినిముషాలు బయట నిలబడినందుకే వంటికి చెమటలు పట్టేసి తెల్లబట్టలు మాసిపోయాయి. కారులోనే చొక్కా మార్చుకొని డ్రైవర్ సిద్ధంగా ఉంచిన టీ తాగుతూ సెక్యూర్ శాటిలైట్ ఫోన్ లో ఢిల్లీ రాజకీయాలు, రాష్ట్ర రాజకీయాలు తెలుసుకునే లోపే బ్రహ్మాజీ ఇల్లు వచ్చేసింది. తన కాన్వాయి వెళ్ళడానికి అసెంబ్లీనే చాలదు కానీ వీడు మాత్రం ఎంత పెద్ద కాంపౌండ్ కట్టాడో చూడు అనుకుంటుండగా బ్రహ్మాజీనే కారు డోరు తీసి తోడుగా లోపలికి తీసుకెళ్ళాడు.

"ఏంటిరా కొత్తగా ఈ గౌరవం. ఏదో పెద్ద స్కెచ్చే గీసినట్టున్నారు అన్నదమ్ములు" అన్నాడు చనువుగా.

"ఆ బ్రహ్మరహస్యం ఏమిటో అర్థంకాక బుర్రబద్దలు కొట్టుకుంటున్నాను. ఇదిగో నువ్వొచ్చావుగా ఇక తెలిసిపోతుంది"

"మీ అన్నదమ్ముల మధ్య దాపరికాలున్నాయంటే... ద్వాపరయుగంలో రాముడు, కలియుగంలో కృష్ణుడు పుట్టారని చెప్పినా నమ్మాల్సిందే" వ్యంగం ముందు పుట్టి రావు రమేష్ తర్వాత పుట్టాడని తెలిసిందే.

"నిజమే. కానీ వచ్చిన దగ్గరనుంచీ ఒక్కక్షణం తీరిగ్గా లేదు. వచ్చేపోయే జనం... ఫోన్లు... ఒకటే హడావుడి. అయినా మా అన్న సంగతి తెలుసుకదా... నీలా చల్లకొచ్చి ముంత దాచే టైపు కాదు. ఏదైనా ముక్కుసూటిగా వెళ్లే రకం."

"నాకు తెలుసు అటొచ్చి ఇటొచ్చి సెటైర్లు నామీద వేస్తారని మీ అన్నదమ్ములు" ఇద్దరు నవ్వుకునే లోపే సరాసరి ఇంట్లోనే ఉన్న ఓ పెద్ద కాన్ఫరెన్స్ రూమ్ లోకి వెళ్లారు.

అప్పటివరకు అసలు టైమ్ గురించే ఆలోచించని రావు రమేష్ కి టైమ్ గుర్తొచ్చింది. 'అమ్మో ట్వెంటి మినిట్స్ లేట్. దానిమీద క్లాస్ పీకటం ఖాయం' అనుకుంటూ ఉండగానే ఎదురుగా సింహంలా వచ్చిన ప్రకాష్‌రాజ్ కి షేక్ హాండ్ ఇవ్వబోయాడు. ప్రకాష్‌రాజ్ రావు రమేష్ భుజంమీద చెయ్యేసి తన సీట్ వైపు తీసుకెళ్తూ "ఇప్పుడు టైమ్ ఎంతయిందో చూశావా... లేట్ గా వచ్చేవాడు వి.ఐ.పి ముందు వచ్చి ఎదురు చూసేవాడు వి.పి కింద లెక్క. అంతేగా"

"సారి! ట్రాఫిక్ అదీ క్లియర్ అయ్యేసరికి..." అంటూ నసుగుతూ సంజాయషీ చెప్పబోయాడు.

"ట్రాఫిక్! అది మాలాంటి వాళ్ళకి. నీకేమొచ్చింది. అవున్రా... అసెంబ్లీ లో చెప్పే అబద్దాలు జీవితంలో కూడా మొదలెట్టావా... ఏం... ఓ నాలుగైదు పోర్టుఫోలియోలు నిర్వహిస్తున్నావటా. దేశసేవా, స్వయంసేవా?"

'బలుపు. డాలర్లు సంపాదిస్తున్నాడని' అని లోపలే తిట్టుకొని "అంతా మీ దయ అన్నగారు" అంటూ వంగి కాళ్ళకి దండం పెట్టాడు. అది పాశుపతాస్త్రంలా పనిచేస్తుందని తెలుసు. అనుకున్నట్టే పనిచేసింది.

"సరేలే. రా కూర్చో" అంటూ సమయం వృధా చేయకుండా ప్రెజెంటేషన్ మొదలుపెట్టాడు.

"బతికిపోయానురా దేవుడా" అనుకుంటూ వళ్ళు దగ్గరపెట్టుకొని మరీ విన్నాడు. ప్రెజెంటేషన్ అంతా అయ్యేసరికి విషయం సగం అర్థమైంది. మిగతా సగం తలకెక్కకపోయినా ఇది తనకి గిట్టుబాటు అయ్యే వ్యవహారం కాదని తేలిపోయింది. "అన్నగారు, మీరేం అనుకోనంటే ఓ విషయం చెబుతాను" సంశయిస్తున్నాడు. కానీ మొహమాటానికి పోయి ఏదో తెచ్చుకోవడం ఇష్టంలేక "మీరు వందేళ్ల ముందో, తర్వాతో పుట్టాల్సింది. ఇలాంటివి అమెరికాలో అయితే సరేగానీ ఇక్కడ చెల్లవు. ఎకరాలెకరాలు మట్టంచేసి ఆపార్ట్‌మెంట్లు కడితేనే జనాలకి ఉంటానికి స్థలం చాలట్లేదు. ఇక నగరాల్లో చెత్తశుద్ధి అదే రిసైకిలింగ్ కర్మాగారానికి స్థలాలు సేకరించడం జరిగే పనికాదు. అయినా ఏ కార్పొరేట్ హాస్పిటలో, స్కూలో పెట్టుకొని వ్యాపారం చేసుకోవడంమాని దేశాన్ని ఊడవడానికి మీరేమన్నా గుంటూరు గాంధినా? అసలు మన దేశానికి చెత్తే అందం, అలంకారం. అమెరికాని 'ఫ్రీ కంట్రీ' అంటారు కాని... అసలు ఎక్కడుంది ఫ్రీడమ్? ఎక్కడచూసినా రూల్స్, రెగ్యులేషన్స్... ఇదిగో... ఇక్కడ చూడండి. అంతా ఫ్రీ. మీ చెత్త మీ ఇష్టం. ఎక్కడైనా వేసుకోవచ్చు... ఎక్కడైనా పోసుకోవచ్చు..." అంటూ నాన్‌స్టాప్ గా చెప్పుకుంటూ వెళ్తున్నాడు. ఆపితే ప్రకాష్‌రాజ్ క్లాస్ మొదలవుతుందని తెలుసు.

"ఆ... ఇంకేంటి సంగతులు... రా భోంచేస్తూ మాట్లాడుకుందాం" అంటూ కోపాన్ని దిగమింగుకుంటూ డైనింగ్ హాల్ వైపు తీసుకెళ్ళాడు. "ఎంటబ్బా ఇలా కటింగ్ ఇచ్చాడు. ఇంకా క్లాస్ పీకడంలేదేమిటీ?" లోపల్లోపలే మదనపడుతున్నాడు రావు రమేష్. డైనింగ్ టేబుల్ మీద కూర్చోగానే అర్థమయింది స్కెచ్. "అవున్రా... మీ ఇంట్లో చెత్త ఎత్తడానికి ఓ పనిమనిషిని మీరు ఎన్నుకున్నట్టే, దేశంలో చెత్త ఎత్తడానికి జనాలు మిమ్మల్ని ఎన్నుకున్నారని ఎందుకనుకోరు. మీ ఇంట్లో చెత్త కూడా చేరేది ఆ రోడ్డు మీదకే అని తెలుసుకో. సర్లే... ఇకనుంచి నీ కారు ముందు పోయే కాన్వాయిలో ఓ స్వీపర్ ట్రక్కుని పెట్టుకో. అలాగన్నా రోడ్లు శుభ్రపడతాయి" కొంచెం కరుకుగానే అన్నాడు ప్రకాష్‌రాజ్. ఎదురుగా పంచభక్షపరమాన్నాలున్నా తినలేని పరిస్థితి.

బ్రేక్ తరువాత మొదలయిన ధారావాహికలా మళ్లీ అందుకున్నాడు "ఒరేయ్ నువ్వెప్పుడైనా ట్రెడ్‌మిల్ మీద పరిగెత్తావా... దాని మోనిటర్ లో ఉన్న గ్రాఫిక్స్‌లో ఎన్ని మైళ్ళు పరిగెత్తావో ఎక్కడెక్కడికెళ్ళావో చూపిస్తుంది. కానీ దిగిచూస్తే ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టు జిమ్ లోనే ఉంటావు... అలా ట్రెడ్‌మిల్ మీద పరుగులాగుంది ఈ దేశంలో అభివృద్ధి. ఇందాక ఏమన్నావు... ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడం సాధ్యంకాదు కాబట్టి అమెరికా ఫ్రీ కంట్రీ కాదా... ఫ్రీ కంట్రీ అంటే ఏంటి...? నీలో ఉన్న టాలెంట్ని నీ కిష్టమొచ్చినట్టు వాడుకోవడం. ఏ అవకాశమైనా పొలిటికల్ ఇన్ఫ్లుయెన్స్ లేకుండా స్వేచ్ఛగా అందిపుచ్చుకోవడం. అదీ ఫ్రీడమ్ అంటే... చెత్త... ఈ చెత్త కాదు." పళ్ళు బిగబట్టి మాట్లాడుతుంటే తెలుస్తుంది లోపల కోపం రగిలిపోతుందని.

"ఏ దేశమైనా అభివృద్ధి చెందిందో లేదో తెలియాలంటే పబ్బులు, నైట్ క్లబ్బులు చూసి కాదు... ఇన్‌ఫ్రాస్ట్రక్చర్... ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ని చూసి అంచనా వేస్తారు తెలుసుకో..." రావు రమేష్ భార్య హేమ వంక చూసి... "నువ్వన్నా చెప్పు ఆడికి... నేనిక్కడేదో వ్యాపారం చేసి బాగుపడిపోవాలని వచ్చాననుకుంటున్నాడు... నా దేశానికి ఏదైనాచెయ్యాలని వచ్చాను. అలాక్కూడా వ్యాపారం చెయ్యొచ్చని చెప్పు". సుధ అనీజీగా చూసింది హేమ వైపు. "నేనూ ఇండియన్ నే... కానీ అమెరికా నన్ను ఆదరించింది. కానీ ఇక్కడ... మన వాళ్ళకే ఆదరణ లేదు. అందుకే ఈ దేశంలో యువతకి పాస్‌పోర్ట్ తప్ప మరో స్పోర్ట్ తెలీదు. ఇండియా అడ్రెస్ వరల్డ్ ఉందో లేదో తెలీదుకానీ నీ అడ్రెస్ ని మాప్‌లో చూయించగలుగుతావా? నాలుగు ఆబ్లిక్‌లు, మూడు డాష్ లతో కలిపి, ఏ సీతమ్మవారి గుడి వీధిలోనో... సాయిబాబా వైన్స్ సందులోనే అని చెబితే తప్ప పేరు, అడ్రెస్ చెప్పే పరిస్థితుందా ఇక్కడ. ఒక్కటి గుర్తుంచుకో డబ్బునోడు తినే కాకరకాయ తీయగా... పేదోడు తినే మామిడికాయ చేదుగా ఉండవు. నీకెంత డబ్బున్నా, ఎంతపెద్ద కారులున్నా, ఇదిగో... ఈ సందుల్లోనే తిరగాలి, ఈ కాలుష్యాన్నే పీల్చాలి. నీకోసం కాదు, నీ పిల్లల కోసం వాళ్ళ తరువాత తరం కోసం ఆలోచించు..." అలా అక్షింతలు పడుతూనే ఉన్నాయి.

ప్రకాష్‌రాజ్ తన గెస్ట్‌లని కూడా చూడకుండా ఇలా క్లాస్ పీకడం సుధకి నచ్చలేదు. కానీ అడ్డుచెప్పే ధైర్యం చేయలేక సారీ చెబుతున్నట్టు చూసింది హేమ వంక. హేమ కూడా ఇది వూహించకపోవడంతో మిన్నకుండిపోయింది. ఏదో గతికామనిపించి పిల్లలు రామని మొరాయించినా బలవంతంగా కారులో వేసుకొని బ్రతుకుజీవుడా అనుకుంటూ బయటపడ్డారు.

కారు వీధి మలుపు తిరిగేలోపే ఏదో పెద్ద శబ్ధం. డ్రైవర్ తప్పించేలోపే ఓ లారీ వచ్చి కారుని గుద్దింది. అంబులెన్స్ రావడం, హాస్పిటల్ లో చేరడం చకచక జరిగిపోయాయి. తనకి చేతికి కట్టుతో సరిపెట్టారు, హేమ తలకి పెద్దగాయం. ఇంకా కోమాలోనే ఉంది. పిల్లలు... అని చుట్టూ చూసేసరికి వెంటిలేటర్ లో కనిపించారు. డాక్టర్ వెన్నిరాడై నిర్మల వచ్చి కంగారుపడాల్సింది లేదు చిన్న షాకేనని సర్దిచెప్పింది. చుట్టూ పోలీసులు, సెక్యూరిటీ. దగ్గరలో ఉన్న ఐ.పీ.ఎస్ ఆఫీసర్ బ్రహ్మానందంని పిలిచి ఇరవైనాలుగు గంటల్లో ఈ యాక్సిడెంట్ కి కారణమైనవాడు నా కళ్లముందుండాలి స్టాండర్డ్ ఆదేశం డబుల్ స్టాండర్డ్ గా జారీచేశాడు.

"సార్!" అని స్టిఫ్ గా నిలబడి చెప్పి "కానీ ఎవర్ని అరెస్ట్ చెయ్యాలో అర్ధంకావడం లేదు సార్" అని మెత్తగా సెలవిచ్చాడు. "ఎవర్ని అరెస్ట్ చెయ్యాలో తెలియక పోవడమేమిటీ... యాక్సిడెంట్ చేసినవాడ్ని అరెస్ట్ చేయండి... మంత్రిగారికే రక్షణ లేదు ఇక సామాన్యుల సంగతేంటని ఊరికే ఊదేస్తారు ఈ మీడియా వాళ్ళు."

"అవునుసార్, కానీ..."

"ఏంటయ్యా... వాడేమన్నా సెంట్రల్ మినిస్టర్ అల్లుడా? సినిమా స్టార్ కొడుకా? ఎవడయ్యా యాక్సిడెంట్‌కి కారణం?"

"అదీ... అదీ... అతని పేరు నారాయణ సార్... ఎమ్మెస్ నారాయణ"

"అయితే ఇంకేం అతన్ని వెంటనే అరెస్ట్ చేయండి..."

"కానీ సార్... అతను లారీడ్రైవర్ కాదు సార్"

"మరి ఇంకెవరూ?" గాండ్రించాడు. వాడ్ని కళ్ళముందు కుళ్ళబొడిస్తేగాని మనశ్శాంతి లేదన్నట్టున్నాడు.

"అదీ... అది కొండవలస సార్"

"అబ్బా ... ఏంటయ్యా ఈ కంఫ్యూజన్. కొండవలస లారీడ్రైవర్ అయినప్పుడు, యాక్సిడెంట్‌కి కారణం కూడా తనేకదా. మరి మధ్యలో ఈ ఎమ్మెస్ నారాయణ ఎలా వచ్చాడు?" అసహనం పెరిగిపోతుంది.

"అదో పెద్ద కథ సార్" ఎలా చెప్పాలో తెలియక నీళ్ళు నములుతున్నాడు.

"చెప్పి తగలడు. కథలు వినడంతప్ప ఇక్కడ కూర్చొని చేసేదేముంది"

నింపాదిగా చెప్పడం మెదలెట్టాడు "ముందు లారీడ్రైవర్ కొండవలసని పట్టుకొని విచారించాం సార్... ఆరా తీస్తే ఆ కొండవలస తప్పేమీ లేదని తెలిసింది. తనని ఓ ఆటోవాడు గుద్దబోయాడట, అది తప్పించబోయి మన బండిని గుద్దాడట"

"అయితే ఎమ్మెస్ నారాయణతో పాటు ఆ లారీడ్రైవర్ కొండవలసని, అలాగే ఆ ఆటోవాడ్ని... ఇంతకూ వాడిపేరు?"

"ఆలీ, సార్!"

"ఆ... వాడ్నికూడా అరెస్ట్ చేయండి"

"పాపం సార్, ఆ ఆలీది తప్పేమీలేదు సార్. వాడిని ఓ బైకుకుర్రాడు గుద్దబోయాడట..." బ్రహ్మానందం సంజాయిషీ చెబుతుండగా అందుకున్నాడు రావు రమేష్ "ఆ బైకు కుర్రాడిని..."

"సునీల్ సార్!" అదోలా చూశాడు రావు రమేష్. "మీరు అడుగుతారేమోనని..." నసిగాడు బ్రహ్మానందం.

"సరే, సునీల్ ని తప్పించబోయి ఆలీ కొండవలసని గుద్దబోయాడు. అది తప్పించబోయి కొండవలస నా కారుని గుద్దాడు. అంతేగా?" ఏం చెప్పాలో తెలీక తలవంచుకున్నాడు బ్రహ్మానందం.

"'నన్ను గుద్దు' అని నా కారు మీద రాసుందా ఏంటయ్యా?"

వచ్చే నవ్వుని లోపలే అనగదొక్కి అపాలజిటిక్ గా "అసలు ఈ సునీల్ ఎందుకు ఆలీ మీద పడబోయాడో మీరు తెలుసుకోవాలి సార్" అన్నాడు బ్రహ్మానందం.

"చెప్పి చావు. ఏదో ఒకటి చెబుతావుగా"

"ఎమ్మెస్ నారాయణ, సార్"

"అది ముందే చెప్పావుగా... పొండి. పోయి ఆ సునీల్ ని, ఆలీని, కొండవలసని, ఎమ్మెస్ నారాయణ్ని అందర్నీ పట్రండి"

బ్రహ్మానందం కదల్లేదు. ఇంకా అక్కడే ఉండటం చూసి "ఏంటయ్యా, మీరు నా కింద పనిచేస్తున్నారా వాళ్ళకింద పనిచేస్తున్నారా... పొండీ!"

"అదికాదు సార్... ఆ ఎమ్మెస్ నారాయణ సునీల్ మీద పడ్డానికి కారణం ధర్మవరపు సార్"

"ఇంకేం ఆయన్ని కూడా పట్రండి" అయినా కదల్లేదు బ్రహ్మానందం. "ఇంకా ఏంటయ్యా?"

"ఇంకాఉంది సార్. ధర్మవరపు కాలు స్లిప్ అయి జారడానికి ఓ తొక్క కారణమట సార్. ఎవరో తిని దాన్ని రోడ్డుమీద వేశారట"

"ఇంకా..."

"అంతే సార్. ఆ 'తొొక్క' వేసిన వాడ్ని, దాన్ని అమ్మిన వాడ్ని కూడా పట్రమ్మన్నారా? సార్" 'తొక్క' అన్న పదాన్నీ, 'సార్' అన్నదాన్నీ నొక్కిపట్టి చెప్పినట్టనిపించి బ్రహ్మానందం మొహంలోకి చూశాడు. ఇంకా పూర్తిగా తలపైకెత్తలేదు. అది వ్యంగ్యమో, సీరియెస్సో అర్థంకావడంలేదు. ఇందాక ప్రకాష్‌రాజ్ ఉపోద్ఘాతం విన్నట్టున్నాడు.

"ఓ.కే. పట్రా... వాడ్నీ, వాడి బాబుని కూడా పట్రా"

"ఏ సెక్షన్ కింద సార్?"

ఇపుడు పూర్తిగా అర్థమయింది అది వ్యంగ్యమేనని. అయినా బయటపడకుండా "పెద్ద ఐ.పీ.ఎస్ ఆఫీసర్వి... మినిస్టర్ గారికే రక్షణలేకుండా చేసినవాడ్ని, ఏ సెక్షన్ కింద అరెస్ట్ చెయ్యాలో తెలీదా?"

"ఊరికే... క్లారిటి కోసం అడుగుతున్నా సార్. 'ఇది ఫ్రీ కంట్రీ, ఎవడి చెత్త వాడు ఎక్కడైనా వేసుకోవచ్చని' వాడంటే...?"

చుర్రున తగిలింది. ఇప్పుడర్థమైంది... అది వ్యంగ్యమూ, సీరియస్సూ కాదు రివెంజ్ అని. ఇంకా ఏదో చెప్పబోతున్న బ్రహ్మానందాన్ని చెయ్యెత్తి ఆపాడు. ఒక్క క్షణం ఆలోచించి, ఆ చేత్తోనే 'ఇక మీరెళ్ళొచ్చు' అన్నట్టు చెయ్యూపాడు.

ఎదురుగా ఐ.సీ.యూలో అన్నెంపున్నెం ఎరుగని తన ముద్దులకూతుళ్ళు. ఆ తొొక్కేసినోడ్ని తన ఆడి కారు కింద తొక్కేసి చంపాలనుకున్నాడు. 'తొొక్కలోది... ఓ తొొక్కా నా జీవితంతో ఆడుకుంది...' నమ్మలేక కళ్ళు మూసుకున్నాడు. ఇంకా నయం. బుల్లెట్‌ప్రూఫ్ కారు కాబట్టి బతికి బయటపడ్డారు. ఇప్పటికే ఇదంతా మీడియాకి వెళ్ళిపోయుంటుంది. స్వయాన ప్రధాని మోదీనే తనని స్వచ్ఛభారత్ కి బ్రాండ్ అంబాసడర్ గా ప్రకటించాడు. అలాంటిది ఓ తొొక్క చేతిలో దెబ్బడిపోయిందని తెలిస్తే... ఊహూ ఏమైనా చెయ్యాలి... ఇప్పుడు ఆ తొొక్క మరింత పెద్దదిగా ఓ భూతంలా... ఓ మహమ్మారిలా కనిపించింది. తనలాంటి వాళ్ళు చిత్తశుద్ధితో తలచుకుంటే ఈ చెత్తని ఏరేయడం చిటికెలో పని. వెంటనే ప్రకాష్‌రాజ్ కి ఫోన్ కలిపాడు.

# వీలునామా

వేదాంతం శ్రీపతిశర్మ

కవిత నిజంగా కవితలాగానే ఉంటుంది. కనులు పల్లవి లాగా క్రిందకి చూసినా అడుగడుగునా పల్లవిస్తే బాగుండనిపిస్తుంది. చిరునవ్వులు చిరుజల్లుల్లా ప్రతి చరణాన్నీ తాకాలనిపిస్తుంది. కవిత ఒక కథ చెబుతూ ఏదో అర్థమవుతోందన్న సమయంలో మత్తుగా చూస్తున్న చూపులు ఒక్క సారిగా చూపు తిప్పేసుకోవటంతో ఇది కాదు అర్థం అన్నట్లు సన్నని నడుములా చరణాల చాటు భావం ఎటో జారిపోయి దాక్కుంటుంది. రెండడుగులు ముందుకు వేసినప్పుడు కవితను మరో సారి చదవాలనిపించినట్లు మరోసారి చూడాలనిపిస్తుంది. జడ విసిరినప్పుడు పదజాలం ఆలోచనల అల్లర్లకు ఎగురుతున్న పిట్టల మీద వాలి బంధించినట్లుంటుంది.

ఒక రోజు నా దగ్గర ఆగి 'కథలు వ్రాస్తారా?' అని అడిగింది. మామూలుగా అప్పుడప్పుడు అని చెబుతాను. ఈమెకు అలా చెప్పాలనిపించలేదు.

'కవితలు వ్రాస్తారా?' అని అడిగాను.

కుర్చీ లాక్కుని ఎదురుగా కూర్చుంది.

'నేను కవిత ఇస్తాను. ఆ కవితకు కథ వ్రాయగలరా?'

చిత్రంగా అనిపించింది.

'చెప్పండి 'అన్నాను.

'మనసున దాగున్న ఆశలకు భాష్యం చెబుతాయనుకున్న చుక్కలు చటుక్కున మబ్బు చెంగు ముసుకేసుకున్నాయి!'

'ఓ '

'అదేమిటో, అంతవరకూ నేనున్నానంటూ ధైర్యం చెప్పిన నిశి రేడు కూడా నాకెందుకు లెమ్మని గుట్ట వెనుక దాగాడు '

'వాడూ దాక్కున్నాడు.'

'ఊ...పోనీలే, ఓ జల్లు నా పని సాధిస్తుందేమో అనుకుంటే, అది కూడా అన్నింటినీ మూట కట్టుకుని, కురయక, మురియక మూల కూర్చుంది.'

'పాపం.'

'ఇక మరో మారు ఈ నిర్లిప్త విభావరిని, రేగే ఆలోచనలని నీ పేరున వీలునామా వ్రాసేసి నే కళ్లు మూసుకుంటా!'

'బాగుంది '.

ఆమె లేచింది.

'గుర్తుంటుందా? మరల చెప్పాలా?'

'వద్దు. గుర్తుంటుంది.'

'మరి వ్రాస్తారా?'

'వ్రాస్తాను.'

ఆమె కార్డు అందించింది.

'ఈ మెయిల్ ఇవ్వండి. చదువుతాను.'

'నచ్చితే?'

'చూస్తాను. మరో కవిత ఇస్తాను.', అంటూ బాగ్ సద్దుకుని వెళ్లిపోయింది.

వింతగా అనిపించి ఆలోచించాను.ఎక్కడో ఎప్పుడో రోజూ చూస్తూ కవిత దక్కాలని అనిపించి ఉండవచ్చు. అది ఎలా ఉన్నా కవిత మటుకు ఒకటి దొరికింది. ఆలోచించాను,. కథ వ్రాయాలి...కవితకు, కాదు, కవిత కోసం కథ వ్రాయాలి...

~~~★★★~~~

తెల్ల కాగితాలు, కలం తీసుకుని ఎందుకో చిరునవ్వు నవ్వాను. నా కాగితం మీద మరొకరి భావన దింపి అందుకు సరిపడు నా భావజాలాన్ని అందించటం...ఇటు సముద్రం, అటు వినీలాకాశం అయితే ఈ కలం తో నే చెక్కబోయే శిల్పాలన్నీ క్షితిజాలలాగా ఉన్నవా లేవా అనిపించాలా లేక ఒక బ్లాటింగ్ పేపరు మీదకు దింపిన ఒక సిరా చుక్క లాగా చక్కగా వ్యాపించి పేపరుకు కథ బొమ్మలా కనిపించాలా? ఏమో! ముంది ఆ కవితను సిరాలా దింపుదామనిపించింది...

వీలునామా!

మనసున దాగున్న ఆశలకు భాష్యం చెబుతాయనుకున్న చుక్కలు చటుక్కున మబ్బు చెంగు ముసుగేసుకున్నాయి!
అదేమిటో, అంతవరకూ నేనున్నానంటూ ధైర్యం చెప్పిన నిశిరేడు కూడా నాకెందుకులెమ్మని గుట్ట వెనుక దాగాడు!
పోనీలే! ఓ జల్లు నా పని సాధిస్తుందేమో అనుకుంటే, అది కూడా అన్నిటినీ మూట కట్టుకుని కురియక, మురియక మూల కూర్చుంది.
ఇక మరో మారు ఈ నిర్లిప్త విభావరిని, రేగే ఆలోచనలని...
నీ పేరున వీలునామా వ్రాసేసి నే కళ్లు మూసుకుంటా!
వెనక్కి వాలి కవితలోని పంక్తులను చూసాను.
వాటిల్లోంచి కవిత తొంగి చూస్తోంది. చూద్దాం వ్రాయగలవా? అంటున్నట్లు నవ్వుతోంది.
'వీలునామా ' అని కథకి నామకరణం చేసాను. మరో పేరెందుకు?

~~~★★★~~~

నాలోని సన్యాసి రకరకాలుగా దర్శనం ఇస్తూ ఉంటాడు. ఇంటికొచ్చిన పెద్దమనిషిని జాగ్రత్తగా గేటు దాటించి అనేకమార్లు నమస్కారాలు చెప్పి తిరిగి లోపలికి వచ్చాను. ఎవరెస్ట్ ఎక్కిన ధీమాతో సోఫాలో వాలిపోయాను. టి.వి ప్రక్కనున్న కిటికీలోంచి దూకి మరీ ఎదురుగా వచ్చి కాలు మీద కాలు వేసుకున్నాడు సన్యాసి.అదేంటో, ఏదో సాధించేస్తాననుకున్నప్పుడు, అలాగే మనసు చీకటి గుహలోకి వెళ్లిపోయినప్పుడు, ఏదో కొత్త ఆలోచన నన్ను గిల్లినప్పుడు ఇలా ప్రత్యక్షమవుతూ ఉంటాడు. ఈ సారి గోల్డ్ స్పాట్ రంగు టీ షర్ట్ తొడిగి నల్ల కళ్లద్దాలు పెట్టాడు మరి.

'ఏంటి సంగతి?',అడిగాడు.

'ఏమోరా. మనిషి నమ్మకస్తుడిలానే ఉన్నాడు.'

'ఎంత లేదన్నా నేను సినీ నిర్మాతను. రా అంటే ఎలా?'

'చాలురా నాయనా. నాతో ఎందుకు వేళాకోళం? బాగానే మాట్లాడాడు.'

'సినీ ప్రపంచంలో అందరూ బాగానే మాట్లాడతారు.రంగులు బాగానే ఉంటాయి.ఐస్ క్రీంలోకి సీసా తీసి పోస్తాడు చూడు,అలా! కాకపోతే ఆ రంగు సీసా తిన్నగా నోటి దగ్గర పెట్టకూడదు. గొంతు కాస్తా దాని వొంతు అది లెక్క కట్టమంటుంది.'

' నీ బాధేంటి?'

'ఎన్ని పుస్తకాలు వ్రాసావని చెప్పావు?'

'అదుగో, ఆ అల్మీరా మొత్తం చూపించాను.'

'ఏవన్నాడు?'

'లేచి అక్కడ నిలబడి నాలుగైదు తిరగేసి నన్ను చూసి కళ్లెగరేసాడు.'

సన్యాసి కూడా లేచాడు. పుస్తకాలను ప్రేమగా నిమిరాడు. నల్ల కళ్లద్దాలను తీసి నన్ను ఓ చూపు చూసాడు.

'అబ్బాయి...',అన్నాడు,'...సినీరంగానికీ, ఆ...ఓ మాటనుకుందాం. తెలుగు సినీరంగానికి గొప్ప రచయితలతో పని ఉండదు. ఆమాటకొస్తే సహజంగా స్వయంసిద్ధమైన ప్రతిభతో వ్రాసేవారు అసలు వద్దు. యుసీ...'

కళ్లజోడు రజనీకాంత్ లా త్రిప్పాడు. 'యుసీ...దర్శకుడికి హత్తుకోవాలి. అంతే కాదు. రకరకాల టెక్కినిక్కులు తెలియాలి. ప్రస్తుతం దర్శకుడు కూడా కాదు, హీరోకి అదిరిపోవాలి.'

ఈ సారి నేను లేచి అటూ ఇటూ తిరిగాను. వీడి మాట వినాలనిపించటం లేదు.అయినా నిజం చెబుతున్నాడనిపించింది.

'ఏంటి? సినిమాలో సీనులా నాలుగు సార్లు అటూ ఇటూ తిరిగేస్తే నువ్వు ఆలోచిస్తున్నావని నేను అర్థం చేసుకోవాలా?'

'కాదు స్వామీ. నిజంగానే ఆలోచిస్తున్నాను. గతంలో మంచి రచయితలు వ్రాయలేదా? మంచి సినిమాలు రాలేదా?'

'వచ్చాయి. ఇప్పుడూ వస్తాయి. కానీ మంచి రచయిత పేరుతో రావు.'

'అంటే?'

'నువ్వు ఓ పని చెయ్యి.'

'చెప్పు.'

'ఓ మంచి కథ తీసుకుని వెళ్లు. నీది కాదని చెప్పు.'

'అదేంటి?'

'అవును మరి. ఇంతాక వచ్చాడే, బట్ట తలాయన, ఆయన దగ్గరకే వెళ్లు. టూకీగా వ్రాసానని చెప్పి డైరీ తియ్యి.'

'ఆలోచన బాగుంది.'

'హు...సన్యాసి అని నన్ను తీసేస్తావు. ప్రపంచంలో వచ్చిన గొప్ప గొప్ప ఆలోచనలన్నీ సన్యాసుల నుంచే వచ్చాయి.'

'స్వామీ, ఇంతకీ ఏం చెయ్యమంటావు?'

'అద్దీ. కోల్ కటాలో దెబాశీష్ సర్కార్ వ్రాసిన నవల ఆధారంగా సుధేందు చటర్జీ తీసిన సినిమా ఏడాది ఆడిందని చెప్పు.'

'చెప్పి?'

'నీ డెయిరీ తియ్యి. దానిని కొద్దిగా మన పరిస్థితులకీ, ప్రేక్షకుల ఆలోచనలకీ అనుగుణంగా మలచి లైన్ వేసానని చెప్పు.'

'అప్పుడు?'

'నిన్ను పనికొచ్చే దినుసులా చూస్తాడు. ఆ పైన ఆలోచించు!'

సన్యాసి ఆ మాట చెప్పి అంతర్ధానమైనాడు. మాటలో దమ్ముంది. తెలుగు వాడు తెలుగు వాడి ప్రతిభను ఏనాడూ గుర్తించడు. కాపీ కొట్టి నమ్మించినా ఫరవాలేదు, వాడిని గౌరవించి సన్మానం చేసేస్తాడు. ఏ పాటైనా కలసి పాడగలం కానీ తెలుగు పాట కలసి పాడలేము. అంచాత ఓ సినిమాలో చక్కగా పాడారు–'కలసి పాడుదాం తెలుగు పాట ' అన్నాడు పాట పాడేద్దాం అనలేదు. మరి అన్ని కొమ్ములున్నాయి ఇక్కడ...

సన్యాసి చెప్పినట్లే చేసాను. వరుసగా ఆరు సిట్టింగ్స్ చేసారు. ఆరుగురు అసిస్టెంట్ డైరెక్టర్స్ రాచమర్యాదలు చేసేసారు. ఒక్కసారిగా ఎక్కడికి పోయారో తెలియదు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా అదుగో సింగపూర్ లో షూటింగ్ అన్నారు. నెలలు గడిచాయి. ఓ రోజు ఏదో సినిమా చూస్తుంటే ఇదేంటి అంతా నా కథలా ఉంది అనుకున్నాను. తీరా నా కథే! బాధ పడి వదిలేసాను. ఇటీవల అక్కడ పని చేసిన ఓ కుర్రాడు కనిపించాడు.

'సార్, ఆ అసిస్టెంట్ డైరెక్టర్లు హీరోకి కావలసినట్లుగా స్క్రిప్ట్ వ్రాసేసారు.అది అలా ఎగిరిపోయింది. మంచి సినిమా సార్.' అని బండీ స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు.

బాధగా డాబా మీదకి వెళ్లాను. ఇలాంటి సమయాలలో సన్యాసి కూడా కనిపించడు. చిరాకు పడుతున్నప్పుడు సన్యాసికి ఎందుకో స్వరూపం చిక్కదు. చాలా సార్లు సన్యాసి తనను తాను ఆనందస్వరూపం అంటాడు. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయి. నక్షత్రం అనుకున్నది ఒకటి ఏదో మరో అస్తిత్వం కలది అలా పయనిస్తూ వెళ్లిపోయింది. ఆ చుక్కలను అందుకోలేనా అనుకున్నాను. కుదరదన్నట్లు ఓ మబ్బు వాటిని కమ్మేసింది.

అమితమైన ఆనందం వేసింది. నాది కాదనుకున్నది నిజమైన ఆనందమా? ఎందుకో ఆ డాబా గోడ మీద సన్యాసి ఓ నక్షత్రంలా కనిపించాడు. మబ్బును ముసుగేఉకున్న ఆ తారలలా తన కండువా నెత్తి మీద వేసుకున్నాడు.

ఆలోచనలు ఆశలలా మెరుస్తాయి. ఆత్మానందం వాటి వెనుక దాక్కుంటుంది...

~~~★★★~~~

'మీకు చాలా మంచి పేరుంది సార్...', మళ్లీ అన్నాడు స్వరూప్, కాంటీన్ లో టీ గ్లాసు పట్టుకుని. ఇలా ఇతను చాలా సార్లు అంటూ ఉంటాడు.ఎటో నడుస్తూ కనిపించినప్పుడు ఎవరో ఆత్మబంధువులా దగ్గరకి వచ్చి చెయ్యి పట్టుకుంటాడు.అర్థమయ్యేది కాదు.చివరకి ఏంటి ఈయన గోల అనుకుని మొత్తానికి ఇలా కూర్చోపెట్టాను.

'ఇంతకీ ఏం పేరుంది సార్?'

'ఎలా చెప్పను? ఈ ఆఫీసులో ఏదైనా పని అవ్వాలంటే మీ పేరే చెబుతున్నారు సార్. మీరు ఒక్క ఫోన్ కొడితే చాలు, పని అయిపోతుంది.'

'అదేమీ లేదండీ. ఏదో కొందరికి అభిమానం. అంతే.'

'మా నాయకుడు మిమ్మల్ని కలవాలంటున్నారు సార్.'

'ఎందుకు?'

'మీ గురించి ఆయనకీ తెలిసిపోయింది.'

'స్వరూప్ గారూ, నన్ను వదిలేయండి, నా వల్ల కాదు.'

ఆయన తన తెల్ల చొక్కా నలగకుండా చేతులు కట్టుకున్నాడు.

'సార్, జాగ్రత్తగా ఆలోచించండి. మీ మంచితనం నలుగురికీ ఉపయోగ పడటం మీకు ఇష్టం లేదా?'

'ఎవరికిష్టం ఉండదు? కానీ వ్యవస్థలోకి వెళ్లటం అంటే అవస్థను కొని తెచ్చుకున్నట్లే! అది నాకు తెలియనిది కాదు.'

'మంచి వాళ్లు రాని చోట వ్యవస్థ ఇలా కుళ్లిపోయే ఉంటుంది. మీరు ఒక్క సారి లోపలికిలోపలికి వస్తే మెల్లగా మీ లాంటి వాళ్లు వంద మంది వస్తారు.'

స్వరూప్ లేచి నిలబడి చేతులు కలిపేసాడు. నాలుగు రోజుల తరువాత ఒక కార్యక్రమంలో ఎక్కడో కూర్చుని ఉన్న నన్ను బలవంతంగా నాయకుని ప్రక్కకు తీసుకుని వెళ్లాడు...

రోజులు మారాయి. మామూలుగా తొడుక్కునే తెల్ల షర్టుకు మరో పేరు వచ్చేసింది. ఎక్కడ లేని మర్యాదలు వచ్చేస్తున్నాయి. ఫోన్లు మ్రోగుతూనే ఉన్నాయి.ఏది మాట్లాడినా అందరికీ చమత్కారంగానే ఉంది.
~~~

'సార్ చెప్పాక మనం ఆలోచించాల్సిన అవసరం లేదు ' అనటం పరిపాటి అయిపోయింది.

అలసిపోయి ఓ రోజు ఇంటికి చాలా ఆలస్యంగా వచ్చాను.సోఫాలో తెల్ల కుర్తాలో సన్యాసి కూర్చుని కనిపించాడు.

'నన్ను ఈ రోజు బాదకు ' అన్నాను.

'రమ్మంటే వచ్చేవాడిని కాను శిశువా!నీ లోంచి ఇవతలకి వచ్చే జీవిత సత్యాన్ని నేను.'

వాడి ప్రక్కనే కూర్చున్నాను.

'చూడు శిశువా! వ్యవస్థకు మంచి పేరు కూడా ఉండాలని అర్థం చేసుకుని నీ లాంటి వాళ్లని లాగి వాడుకుంటారు.ఇంతకీ ఎందుకు అలసిపోయావు?'

'ఏం చెయ్యను? అడ్డమైన పనులు చేయాల్సి వస్తోంది. నా పనులన్నీ ఆగిపోయాయి.'

'నువ్వు చేరి ఆరు నెలలయింది. నువ్వు చెయ్యవలసిన పనిగా ఇది అని దేనినైనా సూచించావా?'

'ఓ యస్! నేను చెప్పింది చాలా కరెక్ట్ అన్నారు. కానీ చెయ్యరని తెలిసిపోయింది.'

మంచి ప్రశ్న అడుగుతున్నాడు సన్యాసి.

'నాయకులు బాగానే ఉంటారు. వాళ్లు ఆప్షన్స్ పెట్టుకుంతారు. ఎవడో మరో విధంగ ఎదుగుతున్నాడంటే వాడి జాగాలో నీలాంటి వాడిని పెడతారు.'

ఆలోచించాను. నిజమే అనిపించింది. నేను నా పద్ధతిలో ఎదుగుతుంటే?సన్యాసి లేచి కండువా సద్దుకున్నాడు.

'శిశువా! వ్యవస్థలో ఎవరి పద్ధతిలో వారు సుఖ పడతారు.నువ్వు కరెక్ట్ కాదు అనుకున్నప్పుడు కళంకం అవుతావు!'

సన్యాసి వెళ్లిపోయాడు. రాత్రంతా గింజుకున్నాను.

సార్వజనికమైనది ఏదైనా సామాన్యమైపోతుంది. నేను మంచివాడినైనా నా 'పోస్ట్ ' స్వార్థానికి టాగ్ అయిపోతుంది.

మర్నాడు అటుగా వెలుతూ నాయకుడి దగ్గర ఎవరా అని చూసాను.ఓ పది మంది ఏవో కాగితాలు పట్టుకుని కూర్చున్నారని తెలిసింది.

'మీటింగు చాలా టైం పడుతుంది.' చెప్పేసాడు అక్కడి కుర్రాడు. మరో సారి వద్దామని నిర్ణయించుకుని ఇవతలకి వచ్చాను.టీ పోసే కుర్రాడు అక్కడ ఆపి టీ అందించాడు.

'సార్, మీ గురించి నాకు తెలుసు...' అన్నాడు. నవ్వొచ్చింది. నా గురించి నాకు తప్ప అందరికీ బాగా తెలిసినట్లుంది.

'ఏంటి?' అడిగాను.

'మీరు ఎవరినీ దగ్గరికి రానీయరని, మీ వర్గం వారినే దగ్గరికి రానిస్తారని లోపల చర్చించుకుంటున్నారు సార్. అలా ఎందుకుంటుంది సార్?'

వాడి ఇజాయితీ గమ్మత్తుగా తోచింది. అతని వీపు తట్టాను.

'మరొకడు పుడుతున్నాడు వ్యవస్థకి! నేను అదృష్టవంతుడిని.నేను ఎక్కువ అవస్థ పడలేదు!' వాడు నవ్వుతున్నాడు. నేను అక్కడి నుండి శాశ్వతంగా ఇవతలికి వచ్చేసాను.

మరల డాబా మీదకి వచ్చాను. చక్కని ఆలోచన ఇది...చల్ల గాలి ఎక్కడో వాన కురిపిస్తుంది అనే ఆశ. ఓ జల్లు కురవాలి...కురవదు. ఆ మేఘం అరవాలి...అరవదు. అది అలానే ఉంటుంది. కాలం రీలు వీలును బట్టి తిరుగుతుంది.

~~~★★★~~~

'ఎవరు వేసారు ఈ గుడిసె?', కోపంగా అడిగాను. మేం పట్టించుకోని మా స్థలంలో ఎవరో మట్టి తవ్వుకుని ఇలా సెటిల్ అయిపోతున్నారని తెలుసుకుని పల్లెటూరుకి వచ్చాను. ముప్పయి సంవత్సరాలుగా ఈ ప్రదేశాన్ని ఎవరూ పట్టించుకోలేదు. సక్రియంగా ఉన్నవాడు కొన్ని ప్రక్రియలకు పనికొస్తాడు!

'ఇక్కడ మెరకెయ్యాలి అయ్యగారూ!', అన్నాడు అక్కడున్న వాడు.
~~~

'అది నీకెందుకు?'

'అలా కాదండీ. వాన పడితే ఇక్కడి వరకూ నిండి పోతుంది.'

'నువ్వు ఇది ముందర పీకించు.'

'తీసేత్తానండీ. మీరు రాండి. తీసేద్దాం!'

ఎన్ని సార్లు అక్కడికి వెళ్లినా ఇదే సంవాదం. రకరకాల మనుషులతో వెళ్లాను. ఈ సారి ఒక్కడినే వెళ్లాను.

'తియ్యవా?" అడిగాను.

'మెరకెయ్యాలి సారూ, చెప్పినా గదా?'

'ఎన్ని లారీలు పడతాయి?' ఇది మొదటి సారి అడిగాను.

అటూ ఇటూ చూసాడు.

'ఎంత? ఓ పాతిక లారీలు చాల్లెండి. ఇక్కడ లారీలెందుకులెండి, నా ట్రాక్టర్ వాడేద్దాం.'

'ఊళ్లో ఎంతమందుంటారు?'

వాడికి ఈసారి ఇది కొత్తగా ఉంది.

'నాలుగొందలు కుటుంబాలుంటాయి మరి.'

'నిన్ను అందరితో కలిపేసి నరికి ఇక్కడే పాతేసి పైన మెరకేస్తే తక్కువ ఖర్చవుతుందేమో?"

కర్ర గట్టిగా పట్టుకుని కోపంగా చూసాడు. ఆ ప్రక్కగా నిలబడ్డ ముసలాయన తల మీద కట్టుకున్న గుడ్డ తీసేసాడు.నాలుగడుగులు ముందుకు వేసాను.

'ఏవంటావు?'చాలా మెల్లగా అడిగాను.

'ఏంటట్టా మాట్లాడతారు?'

సమాధానం చెప్పకుండా వచ్చేసి కారెక్కి స్టార్ట్ చేసాను.రివర్స్ చేసి వాడి దగ్గర ఆగాను.

'శనివారం వస్తాను.' అని చెప్పి రోడ్డెక్కేసాను. ఇదేంటి? ఇలా మాట్లాడాను? ఎవరిచ్చారు ఈ ధైర్యం? గడచిన సంవత్సరాలలో ఇంత మందితో వేగి తిరిగినందుకు నాలో ఎక్కడినుండో చేరిన అనుభవమా? నో...అది నాకు వద్దు. నాలో నేను మిగుల్చుకున్న నా నిజాయితీ అలా రగిలి గళమై మరొకడికి గరళంగా మారింది. రాబోయే శనివారం ఏదో ఉంటుంది, ఏదో నాకు చెబుతోంది! అలాగే జరిగింది.జాగా ఖాళీ అయింది. నా కారు చూసి దగ్గరగా వచ్చాడు.

'సార్, ఆ గడ్డి వాము ఒక్కటీ ఉంది. నాలుగు రోజులలో తీసేస్తానూ' అన్నాడు.

~~~★★★~~~

ఎందుకో నిద్ర పట్టటంలేదు. కిటికీ తలుపులు తీసేసాను. అక్కడ సన్యాసి విచిత్రంగా నేల మీద దొరలురున్నాడు. గోచీ ఒక్కటీ పెటుకుని రోజుకూలీ చేసుకునే వాడిలా నోట్లో బీడీ పెట్టుకున్నాడు.

'ఏవైంది?' అడిగాను.

'నీకేమైంది? పడుకోలేదు?' నవ్వుతూ అడిగాడు.

నిట్టూర్చాను. 'ఏమో, అర్థం కావటం లేదు.'

'నే చెబుతాను. ఆ జాగా పెద్దల ద్వారా వీలునామాలో ఆరు ముక్కలయిందనా? కాదు. నాకు తెలుసు. అది అందరికీ చెల్లుతుందని నీకూ తెలుసు!'

'నువ్వు మాట్లాడకుండా ఉండలేవు కదూ? మాటవరసకెపుడైనా, మాట్లాడకుండా ఉన్నావా?'
~~~

వాడు నవ్వాడు.'మంచి పాట...అన్నానా? ఓ మాటనుకుందాం.నీ బాధ అది కాదు. నీ ప్రయాసలన్నీ నిన్నొక మేస్త్రీగానే మిగిల్చాయి.అవునా?'

'కావచ్చు.'

'అలా అనుకోవద్దు. మాటవరసకి నీకు మాటైనా చెప్పలేదన్నది నీ కలవరం.! అది నిన్ను అలా మిగిల్చింది. నీలోని నిజాయితీ నీకే! దానికి సాంసారిక వస్త్రం తొడగద్దు!. బాధ పడుతుంది.నా లాగా ఇలా హాయిగా పడుకో!నిద్ర అదే వస్తుంది!'

ఎంత మాట! కిటికీ తలుపు మూసేసాను. హాయిగా పడుకున్నాను. ఏది నా ఆస్తి? ఇది ఎవరికి? ఎవరికి చెందుతుంది? నిశ్శబ్దం చేస్తున్న కచేరీకి శ్వాసనిశ్వాసలు శృతి తెలుపుతున్నాయి. నాకు ఎన్నో చేతవునని ఎందరో అన్నారు. కావచ్చు. కాకపోవచ్చు. అవి నాకు చెందవు. అన్నిటినీ చిరునవ్వుతో నా ఆత్మంకు వీలుగా వీలునామా వ్రాసేసాను.

(కవిత అందించిన వారు–వేదాంతం వేంకట సత్యవతి)